
అపొస్తలుడైన

# పౌలు పత్రికల పరిచయము



రచయిత

టి.పి. వరప్రసాద రెడ్డి

# అపొస్తలుడైన పౌలు పత్రికల పరిచయము

రచయిత

**టి.పి. వరప్రసాదరెడ్డి**

ప్రచురణ

**గాస్పెల్ అసెంబ్లీ పబ్లిషింగ్స్**

7-270 కోర్టురోడ్,

**అనంతపురము - 515 001**

ఫోన్ : 275070, సెల్ : 9440285883

ప్రథమ ముద్రణ : సెప్టెంబరు 2005

వెల రూ. **40-00**

ప్రతులకు

**టి.పి. వరప్రసాదరెడ్డి**

13-1-765 రెవిన్యూ కాలని.

**అనంతపురము - 515 001**

ఫోన్ : (08554) 277493, సెల్ : 94402 85883

*No part of our Publications may be Reprinted without our written Permission*

Designed & Type Setting :

*LOGOS GRAPHICS,*

Rajendra Nagar 3rd Line,

GUNTUR - 522 006 Ph : 2230827

Printed at

*SUDARSAN PRINTERS*

GUNTUR - 522002. Ph. 0863 - 2246245

# విషయ సూచిక


| | విషయము | అధ్యా. | వచనాలు | పుట |
|---|---|---|---|---|
| 1. | పౌలు చరిత్ర | | | 4 |
| 2. | పౌలు వ్రాసిన పత్రికల వివరములు | | | 10 |
| 3. | అపొస్తలుల కార్యములు | 28 | 1007 | 14 |
| 4. | రోమీయులకు వ్రాసిన పత్రిక | 16 | 433 | 51 |
| 5. | కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక | 16 | 437 | 82 |
| 6. | కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక | 13 | 257 | 115 |
| 7. | గలతీయులకు వ్రాసిన పత్రిక | 6 | 149 | 131 |
| 8. | ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక | 6 | 155 | 143 |
| 9. | ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక | 4 | 104 | 157 |
| 10. | కొలొస్సయులకు వ్రాసిన పత్రిక | 4 | 95 | 167 |
| 11. | థెస్సలొనీకయులకు వ్రాసిన మొదటి పత్రిక | 5 | 89 | 175 |
| 12. | థెస్సలొనీకయులకు వాసిన రెండవ పత్రిక | 3 | 46 | 183 |
| 13. | తిమోతికి వ్రాసిన మొదటి పత్రిక | 6 | 113 | 188 |
| 14. | తిమోతికి వ్రాసిన రెండవ పత్రిక | 4 | 83 | 195 |
| 15. | తీతుకు వ్రాసిన పత్రిక | 3 | 46 | 200 |
| 16. | ఫిలేమోనుకు వ్రాసిన పత్రిక | 1 | 25 | 205 |
| 17. | హెబ్రీయులకు వ్రాసిన పత్రిక | 13 | 303 | 209 |
| 18. | పాపము - పరిహారము | | | 231 |
| 19. | కొన్ని ముఖ్య విషయముల వివరణ | | | 239 |
| 20. | పౌలు ప్రయాణముల పటములు. | | | టైటిల్ లోపల, వెలుపట |

# ముందుమాట

క్రొత్త నిబంధన యందలి 27 పుస్తకములను ఐదు భాగములుగా విభజించవచ్చును. 1) క్రీస్తుచరిత్ర - సువార్తలు - 4, 2) సంఘచరిత్ర - అపోస్తలుల కార్యములు - 1. 3) పౌలు పత్రికలు - 14, 4) సామాన్య పత్రికలు - 7, 5) ప్రవచనము - ప్రకటన - 1. మొత్తం 27 పుస్తకములు.

ఈ గ్రంథమందు అపోస్తలుడైన పౌలు వ్రాసిన 14 పత్రికలను (హెబ్రీ పత్రికతో) క్లుప్తముగా పరిచయము చేయుచున్నాము. వాటికంటే ముందుగా 14 పత్రికలను వ్రాసిన పౌలు చరిత్రను, పౌలు సేవా యాత్రలను, పత్రికలను వ్రాసిన అవసరతను, పత్రికలను వ్రాసిన పట్టణ వివరములను ఎరుగుట అవసరము. కనుక ఆ వివరములు గల అపోస్తలుల కార్య గ్రంథమును ముందుగా పరిచయము చేయుచున్నాను. మొత్తము క్రొత్త నిబంధనలోని 15 పుస్తకములు ఈ గ్రంథమందు క్లుప్తముగా పరిచయము చేయబడినవి.

ఈ గ్రంథములోని ఏ పుస్తకమునైనా ధ్యానించుటకు క్రింద కనుపరచిన సలహాలను పాటించండి. మొదటిదిగా ఇందులో చెప్పబడిన గ్రంథ అంశము, గ్రంథ విభజన బాగుగా అర్థమగు వరకు అనేక పర్యాయములు చదవండి. రెండవదిగా ఎవరికి వ్రాయబడినదో ఆ పట్టణ వివరములు, మూడవదిగా అక్కడ సంఘము ఏర్పడిన వివరములు బాగుగా అర్థమగు వరకు చదవండి. నాలుగవదిగా ఒక్కొక్క విభజనలోనున్న ఒక్కొక్క అధ్యాయ అంశమును ధ్యానించండి. ఐదవదిగా ఒక్కొక్క అధ్యాయ విభజన చూడండి. ఆరవదిగా అందులోని ఒక్కొక్క భాగమునకు వ్రాయబడిన క్లుప్తమైన సంగతులను ధ్యానించండి. ఒక్కొక్క భాగమును గూర్చిన వివరమైన తలంపులను ప్రభువే తన సమృద్ధి నుండి మీకు అనుగ్రహించును.

మరొకమాట! పౌలు పత్రికలను ఈ గ్రంథమందు విభజించినట్లే, విభజించవలెనని తలంచవద్దు. ఇది ఒక రకమైన విభజన మాత్రమే! దేవుడు మీకు మరొక రీతిగా విభజన నేర్పించిన యెడల ఆ రీతిగానే ధ్యానించండి. ఒక్కొక్క గ్రంథమును అనేక రీతులుగా విభజించి ధ్యానించగలమని గుర్తుంచుకొనండి. ప్రభువు మీకు ఈ గ్రంథమును సంపూర్తిగా గ్రహించు శక్తిని ప్రసాదించును గాక!

**అనంతపురము,** **ఇట్లు**

**09-09-2005** **వరప్రసాద రెడ్డి**

# గ్రంథకర్తను గూర్చిన పరిచయము

## పౌలు చరిత్ర

పౌలు అనగా చిన్నవాడు అని అర్థము. కిలికియలోని తార్సులో పుట్టాడు. (అ.కా. 9:11). యూదామతాభిమాని. రోమా పౌరసత్వము కలవాడు. (22:28) బాల్య యవ్వనకాల చదువులకై యెరూషలేములో ఉండి గమలీయేలు పాదముల దగ్గర అతివిద్య నభ్యసించాడు. (26:24). స్తెఫనును చంపినపుడు రాళ్ళతో కొట్టినవారి వస్త్రములకు కావలి ఉన్నాడు. ఇందును బట్టి క్రైస్తవ్యము వాస్తవము కాదు అని తలంచినట్లు తెలుసుకోగలము. క్రీస్తు మార్గమందుండిన వారి నందరిని హింసించేవాడు. (8:3). పౌలు మొదటి పేరు సౌలు అ.కా.13:9 వరకు ప్రారంభము నుండి సౌలు అను పేరు 20 పర్యాయములు కలదు. తరువాత పౌలు అను పేరు 128 పర్యాయములు కలదు.

క్రీ.శ. 32లో దమస్కుకు క్రీస్తు శిష్యులను హింసించుటకై వెళ్ళుచూ ప్రభువును మార్గమందు చూచి మారుమనస్సు పొందాడు. (9:3-23). ఆనాటి నుండి యేసే క్రీస్తని దమస్కులో బోధింప మొదలు పెట్టాడు. అరేబియాకు వెళ్ళి తిరిగి దమస్కుకు వచ్చి బోధించాడు. తన జీవితకాలములో ఐదు పర్యాయములు యెరూషలేముకు వెళ్ళాడు.

3 సంవత్సరములు అయిన తరువాత, రక్షించబడ్డాక మొదటిగా క్రీ.శ. 35లో యెరూషలేముకు వెళ్ళాడు (గలతీ. 1:16-17). అపొస్తలులను బర్నబా సహాయముతో కలసి యేసు నామమును ధైర్యముగా బోధించాడు. (అ.కా. 9:26-29) ప్రతి స్థలమందును యూదులు తనను చంపజూచినందున తార్సుకు వెళ్ళాడు. (అ.కా. 9:30).

క్రీ.శ. 35-44 వరకు 10 సంవత్సరములు సిరియా, కిలికియలో బోధించాడు.

క్రీ.శ. 45లో బర్నబా ద్వారా అంతియొకయకు వచ్చి ఒక సంవత్సరము అంతియొకయలో ఉన్నాడు. (అ.కా. 11:25) కరువుకు ప్రోగు చేయబడిన సహాయమునందించుటకు రెండవసారిగా యెరూషలేముకు వెళ్ళాడు.

క్రీ.శ. 46లో అంతియొకయ సంఘములో పరిశుద్ధాత్ముడు పిలిచిన పనికై బర్నబాతో కూడా ప్రత్యేకించబడ్డాడు. (అ.కా. 13:1-3).

**క్రీ.శ. 46-49 వరకు బర్నబాతో కలసి మొదటి సేవా యాత్ర** : 1200 మైళ్ళు (500 మైళ్ళు భూమి మీద, 700 మైళ్ళు సముద్రము మీద) జరిగించాడు. అ.కా 13-15 అధ్యాయాలు) సలామి, కుప్ర, పాపు, పంఫూలియ, పెర్గె, గలతీయ, అంతియొకయ,

ఈకొనియ, లుస్త్ర, దెర్బే, లుస్త్ర, ఈకొనియ, పెర్గె, అత్తాలియలో సేవ జరిగించిరి. యెరూషలేముకు మూడవదిగా 49లో సున్నతి సభకు వెళ్ళాడు. దీనినే గలతీ 2:1వ.లో 14 సంవత్సరములైన తరువాత యెరూషలేముకు అనగా క్రీ.శ. 35 నుండి 49 వరకు 14 సంవత్సరములు అని అర్థము.

**క్రీ.శ. 50-53 వరకు రెండవ సేవాయాత్ర** : 2700 మైళ్ళు (1300 మైళ్ళు సముద్రము పై, 1400 మైళ్ళు భూమిపై) జరిగించాడు. (అ.కా. 16-18 అధ్యాయాలు) రెండవయాత్రలో ఐరోపా ఖండమందలి ఫిలిప్పీ, థెస్సలొనీక, బెరయ, ఎథెన్సు, కొరింథు, కెంక్రేయ పట్టణాలలో సేవ జరిగించాడు. ఎఫెసు, కైసరయలగుండా నాల్గవసారి యెరూషలేముకు వెళ్ళాడు.

క్రీ.శ. 52లో థెస్సలొనీకయులకు మొదటి పత్రిక వ్రాశాడు. (1 థెస్స. 3:1).

క్రీ.శ. 53లో థెస్సలొనీకయులకు రెండవ పత్రిక వ్రాశాడు.

**క్రీ.శ. 54-57 వరకు మూడవ సేవా యాత్ర** : 2,700 మైళ్ళు (1350 మైళ్ళు సముద్రము పై, 1350 మైళ్ళు భూమి పై) ఆసియా, ఐరోపాలలో జరిగించాడు. (అ.కా. 19-20 అధ్యాయాలు)

క్రీ.శ. 54-56 వరకు ఎఫెసులో 3 ఏండ్లు సేవ జరిగించాడు.

క్రీ.శ. 56లో కొరింథీయులకు మొదటి పత్రిక వ్రాశాడు.

క్రీ.శ. 57లో కొరింథీయులకు రెండవ పత్రిక, క్రీ.శ. 57 చివర రోమా పత్రిక వ్రాశాడు.

క్రీ.శ. 49-57 మధ్యన గలతీయులకు పత్రిక వ్రాశాడు.

క్రీ.శ. 57లో యెరూషలేముకు ఐదవసారిగా వెళ్ళి బంధింపబడి క్రీ.శ. 58-59 వరకు కైసరయలో విడిగా కావలిలో రెండేండ్లు ఉన్నాడు.

క్రీ.శ. 60లో రోముకు ప్రయాణమై 2100 మైళ్ళు (1900 మైళ్ళు సముద్రము పై, 200 మైళ్ళు భూమిపై) ఖైదీగా వెళ్ళాడు.

క్రీ.శ. 61-62లో మొదటిసారి రోము చెరలో ఉన్నాడు.

క్రీ.శ. 61లో ఎఫెసు, కొలొస్స, ఫిలేమోను పత్రికలు వ్రాశాడు.

క్రీ.శ. 62లో ఫిలిప్పీ పత్రిక వ్రాశాడు.

క్రీ.శ. 63-64 విడుదలలోనున్న కాలము.

క్రీ.శ. 63లో విడుదల పొంది 1 తిమోతి పత్రిక వ్రాశాడు.

క్రీ.శ. 64లో తీతు పత్రిక వ్రాశాడు. విడుదల కాలము (క్రీ.శ. 63-64)లో స్పెయిన్, (రోమా 15:24-27) కొరింథు, మిలేతు, త్రోయ (2 తిమోతి 4:12) క్రేతు (తీతు 1:5) నికోపొలికి (తీతు 3:12) కొలొస్సయికి (ఫిలే 25వ) వెళ్ళాడు.

క్రీ.శ. 65-66లో రెండవసారి రోము చెరలో ఉన్నాడు.

క్రీ.శ. 66లో 2వ తిమోతి పత్రిక వ్రాశాడు.

క్రీ.శ. 67లో నీరో చక్రవర్తిచే శిరచ్ఛేదనము చేయబడి ప్రభువు దగ్గరకు వెళ్ళాడు. పౌలు 3 సేవా యాత్రలు ఒక్కొక్కటి 4సం॥ల కాలము గలవి. 13వ అధ్యాయము నుండి వరుసగా మూడు అధ్యాయములలో వివరించబడినవి. తదుపరి 3 చెరలు ఒకటి కైసరయలోను రెండు రోములోను ఒక్కొక్కటి 2సం॥ల కాలమని గమనించవలెను.

క్రీస్తు తర్వాత క్రీస్తు అంతటి సేవ జరిగించిన పౌలు వంటి భక్తులు సంఘ చరిత్రలో లేనే లేరు. ప్రతి పట్టణములో దూషణలు, బంధకాలు, శ్రమలు అనుభవించాడు. అనేక పట్టణములలో రాళ్ళచే కొట్టబడ్డాడు. అన్నింటికంటే మించి శరీరమునందున్న ముల్లుకై ముమ్మారు ప్రార్థించాడు. (2 కొరింథీ. 12:8) దేవుడు తీసివేయలేదు. 2 కొరింథీ. 11:23-28 లోని పౌలు శ్రమలు నమ్మశక్యము కానివైనందున ఆయన రక్తమాంసములు గల దేహము కలిగినవాడు కాడేమో అనిపించును. లోకమునకు మురికిగాను అందరికి పెంటగాను, (1 కొరింథీ. 4:10-13) ఎంచబడి, శరీర ప్రకారము నడుచుకొనువాడని (2 కొరింథీ. 10:2). ప్రసంగములు కొరగానివని, శరీరమునకు బలహీనుడని అందరిచేత తృణీకరింపబడెను. (2 కొరింథీ. 10:10) అవివేకి అని తలంచబడెను. (2 కొరి. 11:16)తనకు కలిగిన యావత్తు సేవకై ఖర్చుచేసి తన్ను తాను వ్యయపరచుకొనెను. (2 కొరింథీ. 12:15). భ్రష్టుడని తలంచబడెను. (2 కొరి. 13:6)

ఎవరిని మోసపుచ్చి ఆర్జించుకొన్నవాడు కాడు. (2 కొరింథీ. 12:15-17) తన జీవితకాలపు ఆర్థిక సంబంధమైన ఆర్జన, వ్యయముల వివరములను సమర్పించెను. ప్రతి విశ్వాసి, సేవకుడు తాను సంపాదించినది, సేవకు తనది ఖర్చు చేసినది బహిరంగ పరచాలి. రక్షింపబడక మునుపు పులివంటి వాడుగా అందరిని హింసించాడు.1) (అ.కా. 9:1) రక్షించబడి సేవకు ప్రత్యేకించబడిన పిదప 1 థెస్స 2:7లో పిల్లగా (సాధువుగా) నున్నాడు. (క్రీ.శ. 51). 2) 1 కొరింథీ 15:9లో అపొస్తలులందరి కంటే ఎక్కువగా ప్రయాస పడినను అపొస్తలులకంటే తక్కువ వాడనని. అలా అనిపించుటకు అయోగ్యుడనన్నాడు. (క్రీ.శ. 56).3) ఎఫెసి 3:11లో పరిశుద్ధులందరిలో అత్యల్పుడనన్నాడు. (క్రీ.శ. 61). 4)1 తిమోతి 1:15లో పాపులలో ప్రధాన పాపిని అన్నాడు. (క్రీ.శ. 63:65) పౌలు క్రీ.శ.

51,56,61,65లో క్రమముగా నాలుగంతలు తగ్గించుకొని పాపులలో ప్రధానిగా ఎంచుకొన్నాడు. కాని 2 తిమోతి 4:8లో ప్రభువు నీతిమంతులలో ప్రధానిగా ఎంచి నీతి కిరీటమును యిచ్చితిని అన్నాడు. ఇది ఎంత ఆశ్చర్యము!

ఈయన చరిత్రలో క్రీ.శ. 46 నుండి 66 వరకు 20 ఏండ్లలో చేసిన సేవ ప్రతి 5 సం॥ అనుభవములో క్రీ.శ. 51,56,61,66లో తగ్గించుకొనిన విధము ప్రతి క్రైస్తవ విశ్వాసికి, సేవకులకు పురికొలుపుగా ఉన్నది. పౌలు తన జీవితములో ప్రభువు చేత నీతిమంతుడని 2 తిమోతి 4:8వ. తీర్పు తీర్చబడక మునుపు అపొస్తలుల కార్యములో సుమారు 7 న్యాయస్థానముల దగ్గర ఏ నేరము లేనివాడని తీర్పుపొందెను.

**1.అరేయోపగు సభ** : (అ.కా. 17:19-34వ.) గ్రీసు దేశమునకు ఉత్తర ప్రాంతమునకు ఏథెన్స్ రాజధాని. అందులో మార్స్ దేవత కొండపై ఒక సభా మందిరము నిర్మించబడినది. అది ఒక పార్లమెంటు వంటిది. అందులో పార్లమెంటు సభ్యుల వంటి సభికులుందురు. ఏథెన్సు వారు పౌలుతో తర్కించి వాదించి (17-18వ.) అరేయోపగు సభలోనికి తీసుకొని పోయిరి. ఆ సభవారు పౌలు చెప్పు సంగతులను తేటైన సువార్తను వినిరి. అంతట అందరు మారుమనస్సు పొందవలెను అని పౌలు పలికిన మాటలను వినిరి. పౌలు మీద ఏ నేరము ఋజువు పరచలేదు కదా! ఆ సభలో సభ్యుడగు అనగా దేశరాజధానిలో జరుగు పార్లమెంటు వంటి సభ సభ్యుడగు దియొనూసి క్రీస్తునందు విశ్వాసముంచెను.

**2. గల్లియోను న్యాయపీఠము** : (అ.కా. 18:12-17వ.) గ్రీసు దేశమునకు దక్షణ రాజధాని కొరింథు గ్రీసు దేశ అధిపతియగు గల్లియోను న్యాయపీఠము ముందు పౌలును యూదులు నిలిపి నేరము మోపిరి. గల్లియోను పౌలులో నేరము లేదని యెరిగి ఇది ధర్మశాస్త్రమును గూర్చిన వాదము మీరే చూచుకొనుడని పౌలును సమాధానము కూడా చెప్పనివ్వక యూదులు తోలివేసెను.

**3. ఎఫెసు పట్టణకరణము యొక్క సభ** : (అ.కా. 19:35-41వ.) చిన్న ఆసియా దేశరాజధానియగు ఎఫెసు పట్టణస్తులు చాలా గలిబిలి అల్లరి చేసిరి. గ్రామీకరణము సంగతులన్ని విని పౌలును అతనితో ఉన్న వారిని గూర్చి వారు గుడిని దోచిన వారు కారని, ఎఫెసు వారి దేవతను దూషించలేదని చెప్పి పౌలును గూర్చి మంచి సాక్ష్యమిచ్చి సభను ముగించెను.

4. సన్‌హెద్రిన్ మహాసభ : (అ.కా. 23:1-10వ.) గ్రీకు భాషలో సన్ అనగా కలిసికొనుట, హెద్రా అనగా స్థలము అని అర్థము. సన్‌హెద్రిన్ అనగా కూడుకొను స్థలము. ప్రధాన యాజకుడు అధ్యక్షుడుగాను 1) 24 యాజకుల విభాగ అధిపతులు,

2) 24 శాస్త్రులు, 3) 24 ప్రజల పెద్దలు కలసి 23:4వ ప్రకారము ధర్మశాస్త్రము చొప్పున తీర్పు తీర్చు సభ. సంఖ్యా. 13:16లో మోషేతో దేవుడు 70 మంది పెద్దలను నీతో కూడా భారము మోయుదురని సెలవిచ్చెను. క్రీ.పూ. 1440 నుండి ఈ క్రమము ఏర్పడినది. 1 దిన. 24:1-18వ. అహరోను కుమారులైన ఏలియాజరు కుటుంబమునకు చెందిన 16 మందిని ఈ తామారు కుటుంబమునకు చెందిన 8 మందిని యాజక ధర్మ వివిధ భాగములకు నియమించెను. ఈ రీతిగా 24 యాజక విభాగ అధిపతులు ఈ సభలోనుండు రాజైన హేరోదు ఆజ్ఞ ప్రకారము వీరిలో నుండి ప్రధాన యాజకులు నియమించబడుచు మార్చబడుచుసుండిరి. ఈ 72 మంది సభ్యులు కలసి నేరములను విచారించి నేరములేదని నిశ్చయించిన సభ్యుల ఉద్దేశమును మొదట తీసుకొందురు. ఎక్కువ మంది సభ్యుల తీర్మానమునే ప్రధాన యాజకుడు స్థిరపరచును. అ.కా. 6,7 అధ్యా. స్తెఫను విషయేము ఆలాగే మత్తయి 26:57,59,65వ యేసు విషయము సభ కూడిరి. వీరిని మరణశిక్ష విధించు అధికారము లేదు. ఇది ఒక మత సంబంధమైన ఉన్నత న్యాయస్థానము. మరణశిక్ష విధించుటను గవర్నరు మాత్రమే తీర్మానించును. ఈ సభవారు అ.కా. 23:9వ పౌలులో ఏ దోషము కనబడలేదని తీర్మానించిరి.

5. **గవర్నరగు ఫేలిక్సు తీర్పు** : (అ.కా. 24:1-27వ) ప్రధాన యాజకుడు కొందరు పెద్దలు న్యాయవాదితో కలసి గవర్నరగు ఫేలిక్సుకు పౌలుపై ఫిర్యాదు చేసిరి. 22వ వచనములో ఫేలిక్సు క్రీస్తు మార్గమును ఎరిగినవాడు పౌలుపై ఏ నేరమును అంగీకరించ లేదు. పైగా 24వ వచనములో పౌలు నీతిని గురించి మాటలాడి సువార్త చెప్పగా వినెను కాని పౌలును నీతిమంతుడు కాదనలేదు.

6. **గవర్నరగు ఫేస్తు, రాజగు అగ్రిప్పల న్యాయపీఠము** : (అ.కా. 25,26అధ్యా.) పౌలును విచారించిన పిదప మరణముకైనను బంధకములకైనను తగినదేదియు చేయలేదని 26:31వ. పలికిరి. అగ్రిప్పరాజు కూడా విశ్వసించవలెనని పౌలు రాజుతో 26:28-29వ పలికెను.

7. **రోమా** : (అ.కా. 28:16-23వ.) పౌలు రోమాకు ఖైదీగా వెళ్ళి తనకు కావలి ఉన్న సైనికులతో ప్రత్యేకముగా ఉండుటకు సెలవు పొందెను. యూదయ నుండి ఫిర్యాదుల పత్రిక పంపబడలేదు. పౌలును గూర్చి ఏ చెడు సంగతి తెలియపరచలేదని 28:12వ.లో చెప్పబడినది. పైగా రోమాలోని ప్రేతోర్యమను సేనలోని 16,000 మంది కైసరు ఇంటివారు క్రీస్తును ఎరుగు ఆశ్చర్యము ఈ ఏడు తీర్పులలో నేరము చేయలేదని చెప్పబడుట సేవకులమైన మనకెంత మాదిరి!

# పౌలు వ్రాసిన పత్రికల వివరములు

1 కొరింథీ. 4:16,17లో మీరు నన్ను పోలి నడుచుకొనవలెనని తిమోతిని మీ యొద్దకు పంపుచున్నాను. అతడు నేను "నడుచు"కొను విధము నేను "బోధించు" విధము మీకు తెలియజేయును అన్నాడు. యెహోషువ 1:8లో ధర్మశాస్త్రమును **బోధించుటలో** తప్పిపోకూడదు...... దాని ప్రకారము **చేయుటకు** జాగ్రత్తపడాలి. అలాగే పౌలు 1. బోధ, 2. నడుచుకొనవలసిన విధమును పత్రికల ద్వారా వ్రాసి ఇతరులతో సంఘములకు పంపాడు. పౌలు వ్రాసిన 14 పత్రికల వివరములు క్రింద కనపరచబడినవి. (హెబ్రీ పత్రికను పౌలు వ్రాశాడని నమ్ముచున్నాము) క్రొత్త నిబంధనయందు మొత్తము 260 అధ్యాయములు 7,959 వచనములు కలవు. పౌలు వ్రాసిన పత్రికలందు 100 అధ్యాయములు 2,335 వచనములు కలవు. రోమా పత్రిక నుండి ఫిలేమోను పత్రిక వరకు ప్రతి పత్రిక మొదటి అధ్యాయము మొదటి నాలుగు వచనములతో కృపా సమాధానములు కలుగును గాకని శుభములు ప్రారంభములోనే తెలుపుట గమనించ గలము. హెబ్రీ పత్రికతో కలసి ప్రతి పత్రికలో చివరి అధ్యాయము చివరి నాలుగు వచనములలో కృప మీకు కలుగును గాక అని ముగించుట గమనించగలము. కావున ఈ పత్రికలు కృపతో ప్రారంభించబడి కృపతో ముగించబడుచున్నవి.కృప అను పదము క్రొత్తనిబంధనలో 122 పర్యాయములు కలదు.

సమాధానము - షాలేము అనునది యూదులు ఒకరికొకరు తెలుపుకొను వందన వచనము. మహమ్మదీయులు దీనినే సలాముగా పలుకుదురు. గ్రీసు దేశస్థులు అనగా అన్యులు కృపను వందన వచనముగా వాడుదురు. కావున పౌలు ప్రతి పత్రికలో యూదుల యొక్కయు, గ్రీసు దేశస్తుల యొక్కయు వందన వచనముతో ప్రారంభించుచున్నాడు.

# పౌలు వ్రాసిన పత్రికల వివరములు

| వ.స. | పత్రిక | ఎక్కడనుండి ఎప్పుడు వ్రాశాడు | ఎవరితో పంపాడు | క్రీస్తును గూర్చిన వివరణ | బోధ | నడక | స్తుతి | ప్రార్థన | ఆత్మ ప్రస్తావన |
|---|---|---|---|---|---|---|---|---|---|
| I. | సువార్త పత్రిక<br>1. రోమా పత్రిక | కొరింథు నుండి క్రీ.శ. 57 | ఫీబే 16:1 | మన నీతియైన క్రీస్తు 3:21-24వ | 1-8 అ. | 9-16 అ. | 1:8 | 1)1:9-10, 2) 8:15,26,34<br>3)10:1, 4)12:12<br>5) 15:5,30-32 | 36 |
| II. | లోపములు దిద్దు పత్రికలు | | | | | | | | |
| | 2. 1 కొరింథీ. | ఎఫెసు నుండి క్రీ.శ.56 | స్తెఫను 16:17 | 2. మన పునరుత్థానమైన క్రీస్తు 15:22 | 1-8 అ. | 9-16 అ. | 1. 1:4<br>2. 14:16. | 1)7:5,2)11:4-13<br>3)12:3, 4)14:14. | 40 |
| | 3. 2 కొరింథీ. | మాసిదోనియా క్రీ.శ. 57 | తీతు 8:6 | 3. మన ఆదరణయైన క్రీస్తు. | 1-7 అ. | 8-13 అ. | 1:3-5. | 1) 1:10, 2)12:8, .<br>3) 13:7-9, | 12 |
| | 4. గలతీయ.... | క్రీ.శ. 49-57? అంతియోకయ? | --- | 4. దాస్యము నుండి విడిపించిన క్రీస్తు 3:14. | 3-4అ. | 5,6 అ. | --- | 1)1:17, 2) 4:6. | 18 |
| III. | సంఘము-క్రీస్తును గూర్చిన పత్రికలు | | | | | | | | |
| | 5. ఎఫెసీ.<br>(విశ్వాసిస్థితి) | రోమా చెర 1<br>క్రీ.శ. 61 | తుకికు 6:21,22 | 5. సంఘమును శరీరముగా గల క్రీస్తు (1:22), | 1-3 అ. | 4-6 అ. | 1. 1:3,16.<br>2. 5:20 | 1)1:17-19,2)3:1<br>3)3:19, 4)6:18-20 | 13 |
| | 6. ఫిలిప్పీ.<br>(విశ్వాసి విధేయత) | రోమా చెర 1<br>క్రీ.శ. 62 | ఎపఫ్రొదితు 2:25-28 | 6. తగ్గించుకొనిన క్రీస్తు 2:5, | 1-2 అ. | 3-4 అ. | 1:3. | 1)1:4-6. 2) 1:9, 3) 4:6. | 4 |
| | 7. కొలస్స.<br>(క్రీస్తు దైవత్వము | రోమా చెర 1<br>క్రీ.శ. 61 | ఎపఫ్రా 1:7,8<br>తుకికు కొల. 4:7-9. | 7. పరిపూర్ణ దేవుడైన క్రీస్తు సంఘమునకు శిరస్సయిన క్రీస్తు 2:9 | 1-2 అ. | 3-4 అ. | 1) 1:3.<br>2) 3:17 | 1) 1:3-6, 2) 1:9-12<br>3) 2:1-2, 4. 4:4,12. | 4 |

## పౌలు వ్రాసిన పత్రికల వివరములు

| | పత్రిక | ఎక్కడనుండి ఎప్పుడు వ్రాశాడు | ఎవరితో పంపాడు | క్రీస్తును గూర్చిన వివరణ | బోధ | నడక | స్తుతి | ప్రార్థన | ఆత్మ ప్రస్తావన |
|---|---|---|---|---|---|---|---|---|---|
| IV. | ప్రభువు రాకడ | పత్రికలు | | | | | | | |
| వ.స. | 8. 1 థెస్స. (ఆకాశ మండలమునకు) | కొరింథీ. క్రీ.శ. 52 | ---- | సంఘము కొరకురానున్న క్రీస్తు 4:10. | 1-3 అ. | 4-5 అ. | 1) 1:3, 2) 5:16, | 1) 3:10, 2) 5:15, 3) 5:25. | 5 |
| | 9. 2 థెస్స. (భూమి మీదకు) | కొరింథీ. క్రీ.శ. 53 | ---- | సంఘముతో రానున్న క్రీస్తు. 1:6. | 1-2 అ. | 3 అ. | 1) 1:3, 2) 2:13. | 1) 1:11-12, 2) 3:1-2. | 2 |
| V. | కాపరి పత్రికలు | | | | | | | | |
| | 10. 1 తిమోతి (సంఘంలో జనుల ప్రవర్తన) | ఎఫెసు. క్రీ.శ. 63 | ---- | మధ్యవర్తియైన క్రీస్తు. 2:15. | 1-3 అ. | 4-6 అ. | 1) 1:17, | 1) 2:1-28, 1:3-5. | 3 |
| | 11. 2 తిమోతి (పనివాని విధులు) | రోమాచెర 2 క్రీ.శ. 66 | ---- | కిరీటములిచ్చు క్రీస్తు 4:8. | 1-2 అ. | 3-4 అ. | 1:4, | | 2 |
| | 12. తీతు (సంఘపాలన) | నికొపొలి మార్గమున క్రీ.శ. 64. | ---- | మహా దేవుడు, రక్షకుడైన క్రీస్తు 2:13. | 1 అ. | 2-3 అ. | 4:18. | | 2 |
| | 13. ఫిలేమోను | రోమా చెర 1 క్రీ.శ. 61. | ఓనేసీము 1:12. తుకికు కొల. 4:7-9 | ఋణము తీర్చు క్రీస్తు. | | | 1:4 | 1) 1:4. | 2<br>1 |
| VI. | క్రీస్తు శ్రేష్ఠత్వపు | పత్రిక | | | | | | | |
| | 14. హెబ్రీ. | ఇటలీ క్రీ.శ. 66 | ---- | విశ్వాసమునకు కర్త కొనసాగించువాడైన క్రీస్తు 12:1 | ---- | ---- | | 1) 5:7, 2) 13:18 | 8 |

## పత్రికలలో పెద్ద పత్రికలు వాటి వివరములు
## పౌలు వ్రాసినది 14 పత్రికలలో పెద్దవి 4. వాటి విభజనలు వివరములు గమనించగలరు

| పత్రిక | రోమా పత్రిక | 1 కొరింథీ పత్రిక | 2 కొరింథీ. పత్రిక | హెబ్రీ పత్రిక |
|---|---|---|---|---|
| విభజన | 5+3+3+5=16 అధ్యా. | 6+2+2+6=16 అధ్యా. | 2+4+1+2+4=13 అధ్యా. | 2+2+3+3+3=13 అధ్యా. |
| అంశము | సువార్త ప్రకటన | లోపములు దిద్దుట | పరిచర్య జరిగించుట | క్రీస్తు శ్రేష్ఠత్వము |
| వివరము | 1-5 అధ్యా. పాపము - పరిహారము | 1-6 అధ్యా. తెలియ వచ్చిన లోపములు దిద్దుట | 1-2 అధ్యా. ప్రభువు నందు జీవించు పరిచర్య | 1-2 అధ్యా. శ్రేష్ఠమైన అధిపతి |
| | 6-8 అధ్యా. పరిశుద్ధత | 7-8 అధ్యా. వ్రాసిన విషయములలోని లోపములు దిద్దుట | 3-6 అధ్యా. ప్రభువు నందు చేయవలసిన పరిచర్య | 3-4 అధ్యా. శ్రేష్ఠమైన నాయకుడు<br>5-7 అధ్యా. శ్రేష్ఠమైన యాజకుడు |
| | 9-11 అధ్యా. ప్రభువు తన ప్రజలు | 9-10 అధ్యా. విమర్శించిన విషయములలోని లోపములు దిద్దుట | 7 అధ్యా. ప్రభువు నందలి ప్రత్యేకత గల పరిచర్య. | 8-10 అధ్యా. శ్రేష్ఠమైన సేవకుడు |
| | 12-16 అధ్యా. పరిచర్య | 11-16 అధ్యా. కూడి వచ్చి వరములను వాడుకొనుటలోని లోపములు దిద్దుట | 8-9 అధ్యా. ప్రభువుకు ఇచ్చు పరిచర్య.<br>10-13 అధ్యా. ప్రభువు నందు తనను భద్రపరచుకొను పరిచర్య | 11-13 అధ్యా. శ్రేష్ఠమైన కర్త. |

# అపొస్తలుల కార్యములు

గ్రంథకర్త : లూకా అని లూకా సువార్త మొదట అధ్యాయము 1:4వ వచనములు అ.కా. 1:2వ. చదివిన యెడల స్పష్టమగును.

అపొస్తుల కార్యములు 1:2 వచనంలో యేసు పరమునకు చేర్చుకొనబడిన దినము వరకు జరిగిన సంగతులను థెయొఫిలా పేరట నా మొదట గ్రంథమందు వ్రాసితిని అన్నాడు. ముందుగా థెయొఫిలా అను పేరుతో వ్రాయబడిన గ్రంథము లూకా ద్వారా వ్రాయబడిన సువార్తయే. లూకా 24:50-53 వచనములు యేసు పరలోకమునకు ఆరోహణమై చేర్చుకొనబడుటతో ముగించబడినది. పై వివరములను బట్టి లూకా ఈ గ్రంథమును వ్రాసెనని స్పష్టమగును. కొలస్సయి పత్రిక 4:14 ప్రకారము లూకా వైద్యుడని అపొస్తుల కార్యములు 16:8లో పౌలు తిమోతి సీలలు ముసియను దాటి త్రోయకు వచ్చిరి అని ఉన్నది. వచ్చిరి అనగా లూకా ఉన్న ఊరికి వచ్చిరి కనుక లూకా పౌలు రెండవ సేవా యాత్ర ప్రారంభము వరకు చిన్న ఆసియాలోని త్రోయలో నివసించెనని నేర్చుకొనుచున్నాము.

**కాలము** : అ.కా. 28:28-30 వచనములలో పౌలు రెండు సంవత్సరములు రోములో మొదటిసారి చెరలో ఉన్న సందర్భము చెప్పబడుటతో అ.కా. గ్రంథము ముగించబడినది. కనుక రోమ్‌లోని మొదట చెర తదుపరి అనగా క్రీ.శ. 62-63లో ఈ గ్రంథము వ్రాయబడెను అని తలంచగలము.

**స్థలము** : ఈ గ్రంథమందలి చివరి వచనములలో రోములోనున్నందున బహుశ రోము నుండి వ్రాసియుండవచ్చును.

**అంశము** : మీరే నాకు సాక్షులు (1:8).

గ్రంథ విభజన : 2+5+5+8+8=28 అధ్యాయములు

I. అ.కా. 1:8 పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చినపుడు మీరు శక్తి నొందుదురు. 1,2 అధ్యాయములు.

II. కనుక మీరు యెరూషలేములో నాకు సాక్షులు (3-7 అధ్యాయములు)

III. యూదయ సమరయ దేశముల యందంతట నాకు సాక్షులు (8-12 అధ్యా.)

IV. V. భూదిగంతముల వరకు నాకు సాక్షులు (13-20, 21-28 అధ్యా.)

I. 1,2 అధ్యాయములు పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చుట - శక్తినొందుట సంఘ సాక్ష్యము ఏర్పడుట.

**1. 1వ అధ్యాయము** : ఆరోహణుడైన ప్రభువు - ఆత్మ రాకడను అపేక్షించిన అపొస్తలులు.

**2. 2వ అధ్యాయము** : ఆత్మ భూమి పైకి దిగివచ్చుట, శిష్యులను నింపుట - అనేకులు క్రీస్తును నమ్మి సంఘముగా చేర్చబడుట.

II. 3-7 అధ్యాయములు యెరూషలేములో సాక్ష్యము.

ఎ) 3-5 అధ్యాయాలు శిష్యులైన పేతురు, యోహానుల సాక్ష్యము.

**3. 3వ అధ్యాయము** : శక్తిగల యేసు నామమును గూర్చి పేతురు యోహానుల సాక్ష్యము.

**4. 4వ అధ్యాయము** : ఆటంకములు చెరసాలల మధ్య సంఘ అభివృద్ధి.

**5. 5వ అధ్యాయము** : మోసములు చెరసాల మధ్య మరి ఎక్కువైన సంఘ అభివృద్ధి. (Added).

బి) 6-7 అధ్యాయములు స్తెఫను సాక్ష్యము.

**6. 6వ అధ్యాయము** : భిన్నత్వంలో ఏకత్వము - బహుగ సంఘ విస్తరణ. (Greatly multiplied) శ్రమలలో స్తెఫను.

**7. 7వ అధ్యాయము** : సభ ఎదుట స్తెఫను సాక్ష్యమిచ్చుట - హతసాక్షియగుట.

**III. 8-12 అధ్యాయాలు** : యూదయ సమరయులో సాక్ష్యము (కేంద్రము యెరూషలేము)

**8. 8వ అధ్యాయం** : ఫిలిప్పు సమరయ పట్టణంలో సమరయులకు సాక్ష్యమిచ్చుట.

**9. 9వ అధ్యాయము** : పేతురు యూదయలో సాక్ష్యమిచ్చుట - భూదిగంతంలో సేవకై నియమించబడిన యూదుడైన పౌలు రక్షించబడుట (9:15).

**10. 10వ అధ్యాయము** : పేతురు సమరయ పట్టణంలో అన్యులకు అనగా శతాధిపతియైన కొర్నేలికి ఇతర అన్యులకు సాక్ష్యమిచ్చుట.

**11. 11వ అధ్యాయము** : బర్నబా, పౌలులు సిరియాలోని అంతియొకయలో అన్యులకు సాక్ష్యమిచ్చుట.

**12. 12వ అధ్యాయము** : యెరూషలేములో శిష్యుడైన యాకోబు చంపబడుట. దేవుని వాక్యము ప్రబలమవుట.

**IV. 13-20 అధ్యాయాలు** : భూదిగంతములకు అనగా ఆసియా ఐరోపాలో సాక్ష్యము (కేంద్రము సిరియాలోని అంతియొకయ) మూడు సేవా యాత్రలు ఒక్కొక్కరు మూడు (15అ.) మూడు (16-18అ.)

**19-21 అధ్యాయాలు** : మూడు వివరించబడినవి. ఒక్కొక్కటి 4 సం॥కాల పరిమితి కలది. 1) 46-49 సం॥, 2) క్రీ.శ. 50-53 సం॥, 3) క్రీ.శ. 54-57 సం॥)

**ఎ) 13-15 అధ్యాయాలు** : పౌలు బర్నబాతో కలసి చేసిన మొదట సేవా యాత్ర (ఆసియా ఖండములో)

**13. 13వ అధ్యాయము** : కుప్రద్వీపంలో పంఫూలియా, పిసిదియాలోనున్న అంతియొకయలోనున్నయూదులకు సాక్ష్యము.

**14. 14వ అధ్యాయము** : గలతీయ దేశమందలి ఈకొనియ, లుస్త్ర, దెర్బె పట్టణములలో యూదులకు అన్యజనులకు సాక్ష్యము.

**15. 15వ అధ్యాయము** : యెరూషలేములో జరిగిన సభలో అన్యులకు సున్నతి అవసరము లేదని తీర్మానము చేయుట.

**బి) 16-18 అధ్యాయాలు** : పౌలు రెండవ సేవా యాత్ర ముఖ్యంగా ఐరోపా ఖండములో

**16. 16వ అధ్యాయము** : మాసిదోనియ దేశమునకు ముఖ్య పట్టణమైన ఫిలిప్పీలో సాక్ష్యము.

**17. 17వ అధ్యాయము** : మాసిదోనియ దేశమునకు మరొక ముఖ్య పట్టణమైన థెస్సలోని కయలోను, బెరయలోను, గ్రీసు దేశములోని ఉత్తర ప్రాంతమునకు ముఖ్య పట్టణమైన ఏథెన్సులో సాక్ష్యమిచ్చుట - ఏథెన్సులో అన్యజనులకు ఇచ్చిన సాక్ష్యము.

**18. 18వ అధ్యాయము** : దక్షిణ గ్రీసు దేశమునకు ముఖ్య పట్టణమైన కొరింథులో సాక్ష్యమిచ్చుట.

**సి) 19-20-21:1-14వ అధ్యాయాలు** : పౌలు మూడవ సేవా యాత్ర (ఆసియా ఐరోపా ఖండాలలో)

**19. 19వ అధ్యాయము** : చిన్న ఆసియా దేశమునకు ముఖ్య పట్టణమైన ఎఫెసు పట్టణంలో సాక్ష్యమిచ్చుట.

**20.20వ అధ్యాయము** : మాసిదోనియా గ్రీసు దేశములలో సాక్ష్యము ఎఫెసు పెద్దలకు సంఘమును గూర్చిన వర్తమానము.

**గమనిక** : అ.కా. 9:15లో (దేవుడు) ప్రభువు పౌలు అన్యజనుల యెదుటను రాజుల యెదుటను సాక్ష్యము ఇవ్వాలని యేసు నామము కొరకు శ్రమలు అనుభవింపవలెనని తెలిపినందున పౌలు చెరలలో నుండి పై అధికారులకు గవర్నరులకు అగ్రిప్పరాజుకు, రోములోనుండు రాణువ వారికి, చక్రవర్తియగు కైసరు ఇంటివారికి సాక్ష్యమిచ్చుట Vవ భాగములో కలదు.

**V. 21-28 అధ్యాయములు** : పై అధికారులు దేశ అధికారులు చక్రవర్తి ఇంటివారికి చెరసాలలో ఉండి సాక్ష్యము ఇచ్చుట. పౌలు మూడు పర్యాయములో చెరలలో ఒక్కొక్క సారి 2 సం॥లు ఉండెను. 1) కైసరయలోని కావలి క్రీ.శ. 58-59సం॥, 2) రోములోని మొదటి చెర క్రీ. 61-62సం॥, 3) రోములోని రెండవ చెర క్రీ.శ. 65-66 సం॥.

**ఎ) 21-22 అధ్యాయములు** : పటాలము పై అధికారికి, కూడి వచ్చిన యూదులకు సాక్ష్యము ఇచ్చుట.

**21. 21వ అధ్యాయము** : పౌలు మిలేతు నుండి ఓడ ఎక్కి కైసరయకు వచ్చి యెరూషలేములో బంధింపబడి పటాలపు పై అధికారితో సాక్ష్యము ఇచ్చుటకై సెలవు పొందుట.

**22.22వ అధ్యాయము** : పౌలు తాను పొందిన మారు మనస్సును గురించి వివరమైన సాక్ష్యమిచ్చుట.

**బి) 23-24 అధ్యాయములు** : రోమా ప్రభుత్వ దేశాధికారియగు ఫెలిక్సుకు యూదురాలు అయిన ద్రుసిల్ల అను అతని భార్యకు కైసరయలోని కావలిలో రెండు సంవత్సరములు ఉండి సాక్ష్యమిచ్చుట.

**23.23వ అధ్యాయము** : యెరూషలేములో పౌలును చంపుటకై సిద్ధపడిన 40 మంది నుండి సహస్రాధిపతి కాపాడుట 470 మంది సైనికుల కాపలాతో పౌలును కైసరయకు పంపుట.

**24.24వ అధ్యాయము** : పౌలు అధిపతికి మరియు దేశాధిపతియగు ఫేలిక్సుకు అతని భార్యకు, వచ్చిన యూదులకు సాక్ష్యమిచ్చుట.

**సి) 25-26 అధ్యాయములు** : దేశాధికారులగు ప్రేస్తుకు అగ్రిపరాజుకు సాక్ష్యమిచ్చుట.

**25.25వ అధ్యాయము** : కైసరయలో దేశాధిపతియగు ఫేస్తు పౌలును విచారించుట.

**26.26వ అధ్యాయము** : దేశాధికారులగు పేస్తు, అగ్రిప్ప రాజు అతని భార్యయగు బెర్నీకేలకు పౌలు సాక్ష్యమిచ్చుట.

**డి) 27-28 అధ్యాయములు** : కైసరయ నుండి ఇటలీకి వెళ్ళి రెండేండ్లు చెరలో నుండి యూదులకు, అన్యులగు సైనికులకు, కైసరు ఇంటి వారికి సాక్ష్యము ఇచ్చుట.

**27.27వ అధ్యాయము** : కైసరయ నుండి ఓడలో రోముకు బయలుదేరి మార్గమందు ప్రాణాపాయముల మధ్య ప్రయాణం కొనసాగుట.

**28.28వ అధ్యాయము** : రోముకు చేరి రెండు సంవత్సరములు కావలి ఉన్న సైనికులతో అద్దె ఇంట ప్రత్యేకముగా నివసించి తన యొద్దకు వచ్చువారికందరికి. ప్రేతోర్యమను సేనలోని వారికి, కైసరు ఇంటి వారికి సాక్ష్యమిచ్చుట.

**మరొక గమనిక** : మూడవ భాగములో యూదయ సమరయలో సాక్ష్యము తరువాత నాలుగు అయిదు భాగములలో భూదిగంతముల వరకు పౌలు ద్వారా అన్యజనులకు సాక్ష్యము అపొస్తలు కార్యము 9:15-16 వచనములలో ప్రభువు సెలవిచ్చినట్లు చెప్పబడినది. దీనికి సిద్ధపాటుగా మూడవ భాగములోని 9వ అధ్యాయముతో పౌలును రక్షించి అన్యులకు రాజులకు సాక్ష్యమిచ్చుటకై సిద్ధపరచెను. 8వ అధ్యాయములో సమరయులకు రక్షణ కలదని అపొస్తలలు నేర్చుకొనిరి. రాజులు రెండవ గ్రంథములో 17:24లో అష్షూరు రాజు పది గోత్రముల ఇశ్రాయేలీయులను చెరగొని పోయి షోమ్రోను దేశమునందు అష్షూరు ప్రజలను నివసింప జేసెను. ఈ అష్షూరీయులకు ఇశ్రాయేలీయు లకు కలిగిన సంతానమే సమరయులు. యోహాను సువార్త 4:9 వచనంలో యూదులు సమరయులతో సాంగత్యము చేయరు అని చెప్పబడింది. అందుచేత సమరయులకు

రక్షణ కలదని యూదులు గుర్తించులాగున ఫిలిప్పు సమరయలో సాక్ష్యమివ్వగా సమర యులు రక్షింపబడిరి. 10వ అధ్యాయములో కైసరయలోని శతాధిపతియగు కొర్నేలి రక్షణ ద్వారా ఇశ్రాయేలు దేశములో నివసించు అన్యులకు రక్షణ కలదని గుర్తించిరి. 11వ అధ్యాయములో సిరియ దేశములోని అంతియొకయలోని అన్యులు రక్షించబడుట ద్వారా అంతియొకయ కేంద్రముగా పౌలు నాయకత్వమున 13-28 అధ్యాయములలో భూదిగంతములలో సువార్త ప్రకటన జరిగెను.

## 1వ అధ్యాయము : 5+6+3+6+6 = 26 వచనములు

## అంశము : ఆరోహణుడైన ప్రభువు ఆత్మ రాకడను అపేక్షించిన అపోస్తలులు.

**ఉపోద్ఘాతము** : ఈ గ్రంథము థెయొఫిలా పేరుతో వ్రాయబడింది. లూకా సువార్తలో ఘనత వహించిన థెయొఫిలా అని ఉన్నది. సువార్త వ్రాయబడిన సమయానికి ఘనత వహించినవాడు అనగా రోమా ప్రభుత్వ అధికారిగా ఉండెను. సువార్త తన పేరుతో వ్రాయబడినందున రోమా ప్రభుత్వము ఆయనను అధికారి బాధ్యతల నుండి తప్పించిరి. అందుకే ఇప్పుడు ఓథెయొఫిలా అని మాత్రమే పిలువబడుచున్నాడు. క్రీస్తు కొరకై శ్రమ పడుట నష్టము పొందుట. ఇందులో చూడగలము. 5వ వచనము ప్రకారము పరిశుద్ధా త్మలో బాప్తీస్మము పొందుట అనగా భూమి మీదికి పరిశుద్ధాత్మ యోహాను సువార్త 14:16-18 వచనముల ప్రకారము దిగి వచ్చి శిష్యులను శక్తి చేత నింపుటను సూచించును.

**భూమి మీద ప్రభువు చివరిరోజు - చివరి ఆజ్ఞ (6-11వ)** : ప్రభువు ఆరోహణమగు దినమున శిష్యులతో ఇశ్రాయేలునకు రాజ్యము అనుగ్రహించబడుటను గూర్చి వివరించి గ్రంథ ప్రారంభములో చెప్పబడిన మీరు నాకు సాక్షులు అని ఆజ్ఞ. (1:8) ఇచ్చి ఆరోహణమై పోయెను.

**ఏక మనసుతో ప్రార్థించిన అపోస్తలులు (12-14వ)** : అది విశ్రాంతి దినము కనుక ఓలీవల కొండ నుండి విశ్రాంతి దినమునకు నడవదగిన 1.4 కి.మీ. దూరముననున్న యెరూషలేమునకు వెళ్ళి మేడగదిలో శిష్యులు కొందరు స్త్రీలతో కలసి ప్రార్థన చేయుచుండిరి.

**యూదా మరణము (12-14వ)** : ఇస్కరియోతు యూదా మరణించుట అతని ఉద్యోగము వేరొకడు తీసుకొనును అని కీర్తన గ్రంథములో వ్రాయబడినట్లు జ్ఞాపకము చేసుకొనిరి.

**యూదా స్థానములో శిష్యుని ఏర్పాటు (21-26వ)** : అపోస్తులకు చిహ్నములగు 1. క్రీస్తును చూచినవారు, 2. క్రీస్తు పరమునకు చేర్చుకొనబడిన దినము వరకు ఆయనతో కలసినవాడు 1:22 యగు మత్తీయను పదకొండు మంది అపొస్తలుతో కూడా లెక్కించిరి. తరువాత మత్తీయ ప్రభువుచే వాడబడినట్లు గ్రంథములో వ్రాయబడ లేదు. 2 కొరింథీ 12:12లో అపోస్తలుల చిహ్నములను కనుపరచితిచిని అని గలతీ. 2:9లో అన్యజనులకు అపోస్తలుడనగుటకు సామర్థ్యము కలుగచేసెనని వ్రాసినందున పౌలును అపోస్తలుడుగా లెక్కింతురు

## 2వ అధ్యాయము : 13+12+11+11 =47 వచనములు

## అంశము : ఆత్మ దిగివచ్చి శిష్యులను నింపుట - అనేకులు క్రీస్తును నమ్మి సంఘముగా చేర్చబడుట.

పెంతెకోస్తు దినమున సంభవములు (1-13వ) : పెంతెకొస్తు పండుగ క్రీస్తు పునరుత్థానము నుండి 50వ దినమున వచ్చినది. ఈ దినమున పరిశుద్ధాత్మ ఆకాశము నుండి భూమి పైకి వచ్చాడు. ఈ సందర్భంలో బలమైన గాలివంటి ధ్వని ఆకాశము నుండి వచ్చుట అగ్నిజ్వాలలు వంటి నాలుకలు విభాగించబడుట కనబడినది. దీనికి గుర్తుగా ఆత్మ వారికి వాక్శక్తి అనుగ్రహించగా చేరి వచ్చిన జనులలో ప్రతి మనుష్యుడు తన తన స్వభాషలో వారు మాట్లాడుట. కనీసము 17 భాషలలో వారు మాట్లాడుట వినిరి. భాషలు అక్కడ చేరిన అవిశ్వాసులకు సూచనలని 1 కొరింథీ. 14:22 చూచు చున్నాము. అలాగే సూచనగా క్రింద కనపరచిన సందర్భములో లేఖనములలో ఈ గ్రంథమందు చూచెదము.

1. అ.కా. 8:9-10వ.లో బహుశా సమరయులు భాషలతో మాటలాడిరి. ఆ వచనముల ధ్యానము చదవండి.

2. అ.కా. 10:44-46లో పేతురు బోధ విని అన్యజనుల మీద పరిశుద్ధాత్మ దిగాడు. అన్యజనులు భాషతో మాట్లాడిరి. దీనిని బట్టి 11:18లో అన్యజనులకును దేవుడు జీవార్థమైన మారుమనస్సును దయచేసి యున్నాడని అపొస్తులు గుర్తించిరి. అలాగైతే భాషలు ఇక్కడ కూడా అన్యజనుల రక్షణ ఉన్నదని గుర్తించుటకు ఇవ్వబడ్డాయి.

3. అ.కా. 19:6లో పౌలు యోహాను బాప్తిస్మము పొందిన కొందరి శిష్యులను చూచి మీరు విశ్వసించినపుడు పరిశుద్ధాత్మను పొందితిరా అన్నాడు. ఈ ప్రశ్నలలో

జవాబుఉన్నది. ఒక వ్యక్తి విశ్వసించినపుడే పరిశుద్ధాత్మను పొందును. దీనికి మరే గుర్తు అక్కరలేదు. కాని ఈ శిష్యులు పరిశుద్ధాత్మ పరము నుండి దిగి రాక మునుపు బాప్తిస్మము యిచ్చు యోహాను ద్వారా బాప్తిస్మము పొందితిరి. అందుచేత పరిశుద్ధాత్మను వారు పొందలేదు. పౌలు ఆ విషయములను విశదపరచి వారికి బాప్తీస్మము ఇవ్వగా పరిశుద్ధాత్మ వారి మీదికి వచ్చుట ముందు యోహాను బాప్తిస్మము పొందినవారు భాషలతో మాట్లాడుట చూచుచున్నాము కనుక ఈ సందర్భములో కూడా పరిశుద్ధాత్మ పరము నుండి అ.కా 2:1లో రాకముందు నమ్మినవారి స్థితి కాని అ.కా. 2:1లో తరువాత నమ్మినవారు నమ్మినపుడే పరిశుద్ధాత్మను పొందుతారు. దీనికి వేరే సూచనలు అవసరం లేదు. ఎఫెసి. 1:13-14లో చదవండి.

**పేతురు సువార్త వర్తమానము - క్రీస్తు మరణ పునరుత్థానముల సాక్ష్యము (14-25 మరియు 26-36వ) :**

**14-21 వచనం :** పరిశుద్ధాత్మ దిగి వచ్చుట ప్రభువు నామమున ప్రార్థన చేయువారు రక్షింపబడుట యోవేలు 2:28-32 వచనాలలో ప్రకటించారు.

**22, 23 వచనం :** దేవుని అనాది కాల సంకల్పమును బట్టి యేసు క్రీస్తు దుష్టుల చేత సిలువ వేయబడి చనిపోయెను. లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము చనిపోయెను. 1 కొరింథీ. 15:3.

**24-28 వచనం :** మరణము ఆయనను బంధించుట అసాధ్యము గనుక దేవుడు ఆయనను లేపెను. ఎవ్వడును నా ప్రాణము తీసుకొనలేడు. దానిని పెట్టుటకు నాకు అధికారము కలదు. తిరిగి తీసుకొనుటకు నాకు అధికారము కలదు. యోహాను 10:18 క్రీస్తు పునరుత్థానములను గూర్చి దావీదు కీర్తనల గ్రంథము 16:10లో ప్రవచించాడు.

**29-36 వచనం :** సిలువ వేయబడి తిరిగి లేచిన యేసును దేవుడు ప్రభువుగాను క్రీస్తుగాను నియమించాడు. అనగా రాబోవు రాజైన మెస్సియా ఈయనే అని అపొస్తులలు సాక్ష్యము ఇచ్చిరి.

**మూడువేల మంది విశ్వసించి సంఘముగా చేర్చబడుట - అనుదినము కూడా కొనుట (37-47వ) :**

**37-40 వచనం :** ఈ మాటలు వినిన వారిలో ఇంచుమించు మూడు వేల మంది హృదయమందు పొడవబడి వాక్యమందు విశ్వాసముంచి రక్షింపబడిరి.

**41-42 వచనం :** 1. బాప్తిస్మము ద్వారా సంఘములో చేర్చబడుట, 2. బోధలోను, 3. సహవాసములోను. 4. రొట్టె విరుచుటయందును, 5. ప్రార్థనలోను యెడతెగక యుండిరి. కనుక పైన చెప్పిన అయిదు అనుభవములను నమ్మి రక్షింపబడిన వారు నెరవేర్చవలసిన దేవుని ఆజ్ఞలని నేర్చుకొనుచున్నాము.

**43-47 వచనం :** రక్షణ పొందుచున్న వారిని దేవుడు అనుదినము చేర్చుట సంఘాభి వృద్ధికి గుర్తు.

**గమనిక :** పాత నిబంధన కాలమందు పరిశుద్ధాత్మ భూమి పైకి వచ్చుచూ పోవుచూ ఉండెను. కాని అ.కా. 2:1-4వ. పరిశుద్ధాత్మ భూమి పైకి దిగివచ్చాడు. యోహాను 14:16-17వ. ప్రకారము ఎల్లప్పుడు మనలోను, మనతోను ఉండును. ఎఫెసీ. 4:30వ. ప్రకారము విమోచన దినము వరకు, అనగా రెండవరాకలో ప్రభువు 1 థెస్స. 4:13-18వ. ప్రకారము అకాశ మండలమునకు వచ్చి సంఘమును తన యొద్దకు చేర్చుకొను వరకు పరిశుద్ధాత్మ భూలోకములో ఉండును. అపొస్తలుల కార్యములు మొదటి అధ్యాయములో పరిశుద్ధాత్మ భూలోకమునకు ఇంకను రానందున మేడగదిలో వారు కనిపెట్టుకొని యుండిరి. 2:1-4వ. భూమి పైకి వచ్చిన పరిశుద్ధాత్మ వారిలో ప్రవేశించాడు. ప్రస్తుత కాలములో పరిశుద్ధాత్మ భూమి మీదనే ఉన్నందున ఈ దినములలో క్రీస్తు నంగీకరించు వారు అపొస్తలుల కార్యములు మొదటి అధ్యాయము వారివలె కనిపెట్టుకొనవలసిన పని లేదు. ఎఫెసీ. 1:13వ. ప్రకారము సత్య వాక్యమును విని క్రీస్తునందు విశ్వాసముంచి వాగ్దానము చేయబడిన ఆత్మచేత ముద్రించబడుదురు. క్రీస్తును నమ్ముట, ఆత్మ చేత ముద్రించబడుట ఒకేసారి జరుగునని గమనించాలి. ఉదాహరణగా సాయంత్రము 6గంటలకు రైలు మనస్టేషన్‌కు వచ్చి 30 ని॥లు ప్లాటు ఫారము పైనుండును అనుకుందాము. 5:30 గం॥లకు స్టేషన్‌కు వెళ్ళినవారు 30 నిమిషములు కనిపెట్టి రైలు వచ్చిన వెంటనే ఎక్కుదురు. 6:15 నిమి॥ స్టేషన్‌కు వెళ్ళినవారు రైలు కొరకు కనిపెట్టక స్టేషన్‌లో ఉన్న రైలెక్కి కూర్చుందురు. అలాగే పరిశుద్ధాత్మ ప్రస్తుతము భూలోకములోనే ఉన్నందున ఆయన రాకకై కనిపెట్టుకొన వలసిన పని లేదు. విశ్వసించి నపుడే ఆయన మనలో ప్రవేశించును. మనతోను, మనలోను ఎల్లప్పుడు ఉండును. కాని మరొకమాట. ఆత్మపూర్ణులైయుండుడని ఎఫెసీ. 5:18లో ఉన్నది. మనలో పరిశుద్ధాత్మ ఎల్లప్పుడు ఉండును కాని ఆయన పూర్ణమైన స్వతంత్రత ఇవ్వాలి. ఆయనను మన ఇంటిలో ఒక అతిథిగా ఒక గదిలో ఉంచామనుకుందాము. అతిథికి స్వతంత్రత ఉండదు.

నీరు కావాలన్న, స్నానము చేయాలన్నా మన సెలవుకై కనిపెట్టును. కాని మన ఇంటి స్వంతదారుడుగా పరిశుద్ధాత్మ ఉన్న యెడల ఆయన స్వతంత్రత గలవాడై అన్ని సిద్ధము చేసి మనకెప్పుడు ఏమి కావాలో అన్నింటిని అనుగ్రహించును. కావున, ఆత్మపూర్ణత అనగా పరిశుద్ధాత్మ దేవుని సంపూర్ణ స్వతంత్ర నిచ్చి ఆయన అధీనమునకు మనలను మనము అప్పగించుకొనుట అని అర్థము. మనము స్వతంత్రత ఇవ్వని యెడల ఆయన దుఃఖపడుచునుండును. కాని వెళ్ళిపోక విమోచన దినము వరకు ఉండును. ఆత్మను దుఃఖపరచకుడి విమోచన దినము వరకు ముద్రించబడియున్నారు అని ఎఫెసీ 4:30లో ఉన్నది.

## 3వ అధ్యాయము 5+5+6+5+5+ =26 వచనములు

## అంశము : శక్తిగల యేసు నామము

**దేవాలయపు గుమ్మము వద్దనున్న పుట్టు కుంటివాడు - యేసు నామమున స్వస్థత - దేవుని స్తుతించుట (1-5వ, 6-10వ)** : దేవాలయపు ద్వారము. శృంగారమని పిలువబడినది. (BEAUTY) కాని అక్కడ ఉన్నది పుట్టుకతో కుంటివాడు. 4:22. ప్రకారము నలుబది యేండ్ల కంటే ఎక్కువ కాలము కుంటివాడు. దీని భావము భూమి మీద ఉన్న దేవాలయములు, వాటి ద్వారములు అందులో నుండు దేవుడు చూడ ముచ్చటైన వారేగాని, అందులోనికి వచ్చు మానవులందరు పాపులు. (కీర్తనలు 51:5) జీవించుట చనిపోవుట పాపములోనే (యోహాను 8:21) యేసు నామము వానికి పూర్ణ స్వస్థత ఇచ్చినట్టు పాపముల నుండి స్వస్థతను క్రీస్తు నామమున పొందగలము. వివరములు 2వ అధ్యాయములో చూడగలము. వాడు గంతులువేయుచు దేవాలయములోనికి వెళ్ళుట క్రీస్తును విశ్వసించిన వారు జీవితకాలమెల్ల స్తుతించాలి అని దీని భావము.

**పేతురు ప్రసంగము యేసునామమందలి శక్తిని గూర్చిన సాక్ష్యము (11-16వ)** : చేరి వచ్చిన జన సమూహాములకు క్రీస్తు 1. పరిశుద్ధుడని, 2. నీతిమంతుడని, 3. జీవాధి పతియని, 4. నిరాకరించబడినవాడని, 5. చంపబడిన వాడని, 6. మృతులలో నుండి లేపబడెనని, 7. ఆయన నామమందు విశ్వాస ముంచవలెనని పేతురు బోధించాడు.

**యేసు నామమందలి శక్తిని గూర్చి ఆది నుండి ప్రవక్తల సాక్ష్యము (17-21వ)** : దేవుడు సమస్త ప్రవక్తల నోట ఆది నుండి క్రీస్తు యేసును పంపెదనని యేసు మరణం

ద్వారా మానవుల పాపములు తుడిచి వేయబడును అని యేసు ఆరోహణుడై పరలోకవాసి అయియుండగా మానవులు మారుమనస్సు పొంది యేసు వైపు తిరుగవలెనని హెచ్చరించెను.

**యేసు నామమందలి శక్తిని గూర్చి మోషే, సమూయేలుల సాక్ష్యము (22-26వ) :** యేసు నామమందలి శక్తిని గూర్చి ప్రవక్తలైన మోషే, సమూయేలు, అబ్రాహాము, యెషయాల సాక్ష్యము. మోషే దేవుడు నా వంటి ప్రవక్తను మీ సహోదరులలో నుండి మీ కొరకు పుట్టించునని సాక్ష్యమిచ్చెను. (ద్వితీ. 18:16-17వ) అలాగే సమూయేలు మొదలు అందరు ప్రవక్తలు సాక్ష్యమిచ్చిరి.

అబ్రాహాముతో నీ సంతాన మూలమున భూలోక వంశములన్ని ఆశీర్వదించబడునని క్రీస్తును గూర్చి సెలవిచ్చెను. (ఆది 12:3). క్రీస్తు సేవకుడుగా ఈ లోకానికి వచ్చి ప్రతి మానవుని పాపము నుండి మళ్ళించెనని చెప్పెను.

## 4వ అధ్యాయము 4+8+10+9+6+ =37 వచనములు

## అంశము : ఆటంకములు, చెరసాల మధ్య అభివృద్ధి

**చెరసాల కలవరముల మధ్య నమ్మినవారు (1-4వ) :** సిలువను గూర్చిన వార్తతో సువార్త ప్రారంభం కాగా, సిలువ శ్రమలు సువార్త ప్రకటనను వెంబడిస్తాయి. మూడవ అధ్యాయములో సువార్త ప్రకటనకు కలవరపడిన దేవాలయ అధిపతులు పేతురు యోహానులను పట్టుకొని ఆ రాత్రి కావలిలో నుంచిరి. సద్దూకయ్యులు 2 దిన. 31:9లో ఉన్న ప్రధాన యాజకుడైన సాదోకు సంతతి వారు పునరుత్థానము లేదని ఈ జీవితకాలము తరువాత ఏమిలేదని దేవదూతలు లేరని నమ్ముతారు. వారి బోధకు క్రీస్తు పునరుత్థానము వ్యతిరేకమైనందున వీరును దేవాలయ అధిపతులతో కలుసుకొనిరి.

**పేతురు ప్రసంగము - రక్షణ పొందు విధము (5-12 వ) :** మరునాడు అధికారులు పేతురు యోహానులను ప్రశ్నించగా పేతురు సిలువ వేయబడిన యేసు నామముననే రక్షణయని మరి ఏ నామమున రక్షణ లేదని యేసు నామముననే పుట్టు కుంటివాడైన మనుష్యుని స్వస్థపరిచెనని ఖండితముగా చెప్పెను.

**బెదిరింపులు (13-22 వ.) :** పేతురు యోహానుల ధైర్యము చూచినపుడు స్వస్థత పొందిన మనుష్యుడు అక్కడనే ఉండగా అధికారులు ఏమి మాట్లాడక పేతురు

యోహానులను బెదిరించిరి కాని వారుకన్న వాటిని విన్నవాటిని చెప్పక యుండలేమని చెప్పిరి.

**ప్రార్థన (23-31 వ.)** : విడుదల పొందిన సహోదరులకు జరిగిన విషయములు తెలుపగా వారందరు ఏక మనస్సుతో ప్రార్థించిరి. అందరు ఆత్మచే నింపబడి వాక్యమును ధైర్యముగా బోధించిరి.

**విశ్వసించినవారు కలిసియుండుట (32-37వ)** : విశ్వసించిన వారు ఏకమనస్సుతో కలిగినదంతా సమిష్టిగా నుంచుకొనిరి. ఆస్థిపాస్తులు కలవారు అమ్మి వాటివెల అపొస్తులుల పాదముల యొద్ద ఉంచిరి. ప్రతి వానికి అక్కరల కొలది పంచి పెట్టబడెను. బర్నబా తన భూమిని అమ్మి దాని వెల అపొస్తులుల పాదముల యొద్ద పెట్టిరి.

## 5వ అధ్యాయము 6+5+5+5+5+6+5+5 = 42 వచనములు

## అంశము : మోసములు చెరసాలల మధ్య మరి ఎక్కువైన సంఘాభివృద్ధి

**పరిశుద్ధాత్మను మోసపుచ్చి మరణించిన అననీయ (1-6వ)** : అననీయ తన భార్యతో కలసి పొలము అమ్మి దాని వెలలో కొంత దాచుకొని మిగిలినది అపొస్తులులకు ఇచ్చెను. ఇది పరిశుద్ధాత్మను మోసపుచ్చుట అని పేతురు చెప్పగనే అననీయ మరణించి పాతిపెట్ట బడెను.

**పరిశుద్ధాత్మను శోధించుటలో ఏకీభవించి మరణించిన సప్పీర (7-11వ)** : జరిగినది ఎరుగక భార్య అయిన సప్పీరా కూడా అబద్ధము ఆడగా ప్రభువు ఆత్మను శోధించుటకు ఏకీభవించినది అని పేతురు చెప్పిన వెంటనే అక్కడనే చనిపోయెను. పాతిపెట్టబడెను. సంఘమంతటికి మిగుల భయము కలిగెను.

**అపొస్తలుల ద్వారా అనేక సూచక క్రియలు (12-16వ)** : అపొస్తలులు అందరు ఏకముగా నుండి అనేకమైన సూచక క్రియలు మహత్కార్యములు జరిగించిరి. పురుషులు స్త్రీలు. మరి ఎక్కువగా విశ్వాసులై ప్రభువు పక్షముగా చేరిరి (Added).

**చెరసాల నుండి ప్రభువు దూత ద్వారా తప్పించబడి బోధించిన అపొస్తలులు (17-21వ)**: ప్రధాన యాజకులు అపొస్తులను చెరసాలలో ఉంచిరి కాని ప్రభువు దూత వారిని విడిపించగా దేవాలయములోనికి వెళ్ళి బోధించుచుండిరి.

**ప్రధాన యాజకుల ఎదుట అపోస్తలులు (22-26వ)** : బంట్రోతులు చెరసాలలో వారు లేనందునను దేవాలయములో బోధించుచున్నారని తెలుసుకొని వారిని తీసుకొని వచ్చిరి.

**యెరూషలేము క్రీస్తును గూర్చిన సాక్ష్యముతో నింపబడినది (27-32వ)** : వారిని ప్రధాన యాజకుల యెదుట నిలువబెట్టగా ప్రధాన యాజకుడు యెరూషలేమును మీ బోధతో నింపితిరని సాక్ష్యమిచ్చెను. పేతురును అపొస్తులను సిలువ వేయబడి చనిపోయి తిరిగి లేచిన యేసు ద్వారా పాప క్షమాపణ కలుగునని సాక్ష్యమిచ్చెను.

**అవమాన పరచబడి, దెబ్బలుతిని సేవను కొనసాగించిన అపొస్తలులు (33-37వ)** : వినినవారు ఆగ్రహించి అపొస్తులను చంపనుద్దేశించగా గమలియేలు అను మనుష్యుడు వారిని అలాగు చేయకుండా నివారించెను. 38-42 మహాసభవారు అపొస్తులులను కొట్టి బోధింపకూడదని ఆజ్ఞాపించి విడుదల చేసిరి కాని సంతోషించి ప్రతి దినము ఇంటింటా దేవాలయములో మానక యేసుని ప్రకటించిరి.

## 6వ అధ్యాయము 7+8+15 = 30 వచనములు

## అంశము : భిన్నత్వంలో ఏకత్వము, బహుగ సంఘ విస్తరణ (1-7వ)

**సంఘము లోపటి వారి ద్వారా తొందరలు - వాక్యము ప్రబలమగుట ద్వారా శిష్యుల సంఖ్య బహుగా విస్తరించుట (1-7వ)** : అనుదిన పరిచర్యలో గ్రీకుభాష మాట్లాడు విధవ రాండ్రను చిన్నచూపు చూచిరని హెబ్రీయుల మీద సణుగులు ప్రారంభము కాగా హెబ్రీయులైన అపొస్తులులు గ్రీకు భాష మాట్లాడు మంచి సాక్ష్యము కలిగిన ఏడుగురిని పరిచర్యకై నియమించి సమస్యను పరిష్కరించిరి. మొదట వచనాలలో శిష్యుల సంఖ్య విస్తరించినది అని (Multiplied) ఏడవ వచనంలో బహుగా విస్తరించినది అని (Greatly Multiplied) ప్రజలే కాక యాజకులలో అనేకమంది విశ్వసించినందున ప్రధాన యాజకులు మాత్రమే ఇక మిగిలిపోయిరి. (5:14లో Added అని 6:1, Multiplied అని 6:7, Greatly Multiplied) అని ఉన్నది.

**సంఘమునకు వెలుపటి వారి ద్వారా శ్రమలు - మహా సభ ఎదుట స్తెఫను (8-15వ)**: పరిచారకుడైన స్తెఫను పరిశుద్ధాత్మతోను, బలముతోను నిండిన వాడైనందున ఎవరును అతని మాటలను ఎదిరించలేకపోయిరి. ప్రజలు, పెద్దలు, శాస్త్రులు, అబద్ధపు సాక్షులను ఏర్పర్చుకొని మహాసభలో స్తెఫను నిలువబెట్టి అబద్ధ సాక్ష్యములు చెప్పించిరి. కాని స్తెఫను వారికి దేవదూతవలె కనిపించెను.

# 7వ అధ్యాయము 16+19+15+10 = 60 వచనములు
## అంశము : సభ ఎదుట స్తెఫను క్రీస్తును గూర్చి సాక్ష్యమిచ్చి హతసాక్షి అగుట

**యాకోబు కుమారులైన గోత్ర కర్తలు, యోసేపు పై అసూయపడుట (1-16వ) :** అబ్రాహాము మహిమగల దేవుని పిలుపునకు విధేయత చూపి కనానులో నివసించి ఇస్సాకును కనగా ఇస్సాకు యాకోబును, యాకోబు పన్నెండు మంది గోత్రకర్తలను కనెను. వారు అసూయతో యోసేపును ఐగుప్తులోనికి పోవుటకు అమ్మివేసిరి. కరువును బట్టి యాకోబు అతని సంతానమంతయు ఐగుప్తుకు వెళ్ళిరి. యాకోబు యోసేపు పితరులు చనిపోయిరి.

**పితరులు మోషే పై తిరుగుబాటు చేసి మోషేను త్రోసివేయుట (28వ, 17-35వ) :** నిర్గమకాండములో యోసేపుని ఎరుగని వేరొక ఫరో ఐగుప్తును పరిపాలించుచు ఇశ్రాయేలీయులను శ్రమపెట్టెను. మోషే లేవీ వంశములో పుట్టెను. కాని ఫరో ఇంటిలో రాజ కుమార్తె కుమారుడిగా నలభైయేండ్లు పెంచబడెను. తన జనులకు కలుగు బాధను చూచి బాధపెట్టిన ఒక్క ఐగుప్తీయుని చంపెను. ఫరోకు భయపడి మిధ్యాను అరణ్యమునకు పారిపోయెను. మిద్యాను యాజకుడగు యిత్రో కుమార్తెయగు సిప్పోరాను వివాహమాడి నలుభైయేండ్లు తన మామమందను మేపెను. పర్వతారణ్య మందు మండుచున్న పొదనుండి దేవుడు మాట్లాడగా మోషే విని విధేయత చూపి ఇశ్రాయేలీయులను ఐగుప్తు చెరనుండి విడిపించుటకు విమోచకుడుగా నియమించబడెను.

**అరణ్య ప్రయాణములో మోషేను ఎదిరించి ఐగుప్తుకు వెళ్ళగోరుట - యెహోషువ ద్వారా కనాను ప్రవేశించుట. న్యాయాధిపతులు, రాజుల ద్వారా కాపాడబడుట (36-50వ) :** ఐగుప్తు నుండి పితరులను విడిపించి నలుబది యేండ్లు అరణ్యములో సూచక క్రియలు చేసి కనానుకు వారిని తోడుకొని వచ్చెను. కాని పితరులు మార్గములో మోషేను త్రోసివేసి హృదయములలో ఐగుప్తుకు పోదలచిరి. దూడను తీసుకొని బలి అర్పించిరి. తరువాత పితరులు యెహోషువ నాయకత్వమున కానాను స్వతంత్రించుకొనిరి. తరువాత న్యాయాధిపతుల ద్వారా దావీదు రాజు సొలొమోను రాజుచే పాలించబడిరి. దేవాలయము కూడా నిర్మించబడెను.

**యూదులు పరిశుద్ధాత్మను ఎదిరించుట - స్తెఫనును చంపుట (51-60వ) మరియు ఇరవైమంది రాజులచే పాలించబడిరి :** పితరులు అవిధేయులైనట్లు స్తెఫను కాలములోను

ఇశ్రాయేలీయులు పరిశుద్ధాత్మను ఎదిరించిరని ధర్మశాస్త్రము గైకొనలేదని స్తెఫను తెలిపెను. మహాసభవారు ఈ మాటలు విని స్తెఫను రాళ్ళతో కొట్టి చంపిరి. యౌవనస్థుడైన సౌలు అనబడిన పౌలు స్తెఫను చావును సమ్మతించెను.

## 8వ అధ్యాయము 8+8+8+1+5+5+5 = 40 వచనములు

## అంశము : ఫిలిప్పు సమరయులో సాక్ష్యము సంఘాభివృద్ధి, ఐతియోపీయుడైన మంత్రియగు నపుంసకుడు రక్షింపబడుట

**శ్రమలను బట్టి చెదరిన వారిలో ఫిలిప్పు సమరయ పట్టణంలో సువార్త ప్రకటించగా కలిగిన సంతోషము (1-8వ)** : యెరూషలేములో కలిగిన హింసను బట్టి యూదయ, సమరయ దేశములకు చెదిరిపోయిన వారు సువార్త ప్రకటించుచు సంచారము చేసిరి. ఫిలిప్పు యెరూషలేమునకు 50 మైళ్ళు దూరమున సమరయ వరకు వెళ్ళి సువార్త ప్రకటించెను. ఫిలిప్పు చేసిన సూచక క్రియలను బట్టి జనులు సువార్తయందు లక్ష్య ముంచగా ఆ పట్టణంలో మిగుల సంతోషము కలిగెను.

**నమ్మినవారు బాప్తిస్మము పొందుట (9-16వ)** : ఫిలిప్పు ప్రకటించిన యేసును గూర్చిన సువార్త నమ్మి పురుషులు స్త్రీలు బాప్తిస్మము పొంది, యెరూషలేము నుండి పేతురు యోహానులు వచ్చి నమ్మినవారు పరిశుద్ధాత్మను పొందవలెనని ప్రార్థించి, సమరయులు పరిశుద్ధాత్మను పొందుటను చూచిన అపొస్తలులు సమరయులకు రక్షణ కలదని గుర్తించిరి.

*గమనిక* : క్రీ.పూ. 721లో పదిగోత్రముల ఇశ్రాయేలు వారు అష్షూరు దేశమునకు చెరకు వెళ్ళగా ఇశ్రాయేలు దేశములోని పది గోత్రముల స్థానంలో అన్యజనులగు అష్షూరియులు నివసించిరి. తరువాత కాలములో ఈ అన్యులు ఇశ్రాయేలీయులను వివాహము చేసుకొనగా జన్మించినవారే సమరయులు. యూదులు సమరయులతో సాంగత్యము చేయరని యోహాను 4:9లో చూతుము. యూదులు సమరయులను యెరూషలేము దేవాలయమునకు రానివ్వని కారణమున గెరిజీము కొండపై సమరయులు ఆరాధించేవారు (యోహాను 4:20-22). అందువలన సమరయులకు రక్షణ కలుగునని యూదులు అంగీకరింపరు. కనుకనే పరిశుద్ధాత్మ సమరయులకు అనుగ్రహించబడుట యూదులు చూచిరి. బహుశ అ.కా. 11:45-46లో ఉన్నట్టు నమ్మిన సమరయులు భాషలతో మాట్లాడియుండ వచ్చును. ఏలయనగా భాషలు అవిశ్వాసులకు

సూచన 1 కొరింథీ. 14:22. (భాషలను గూర్చి చివరి పేజీలోనున్న ముఖ్య విషయముల వివరణ చూడండి)

**గారడీ సీమోను ద్రవ్యము ఇచ్చి వరమును సంపాదించుకొన తలంచుట వలన గద్దించబడుట (17-24వ)** : సమరయులు నమ్మి బాప్తిస్మము పొందినపుడు గారడీ సీమోను కూడ నమ్మి బాప్తిస్మము పొందెను. నమ్మిన సమరయులు పరిశుద్ధాత్మ అను వరమును పొందుట సీమోను చూచి అపొస్తులుల ఎదుట ద్రవ్యము పెట్టి అటువంటి వరము పొందగోరెను. గారడీ సీమోను నమ్మకము వాస్తవమైనది కాదు. అందుచేత అపొస్తులుల ద్వారా గద్దించబడి....

**సమరయుల అనేక గ్రామములలో సాక్ష్యము (25వ)** : సమరయ సమరయులకు రక్షణ కలదని తెలుసుకొనినందున పట్టణంలో అపొస్తులులు వాక్యము బోధించి యెరూష లేమునకు వెళ్ళుచు మార్గమందు అనేక సమరయుల గ్రామములో వాక్యము బోధించిరి.

**గ్రంథము చదువుచున్న ఐతియోపీయుడైన నపుంసకుడగు ధనాగారపు మంత్రిని ఫిలిప్పు కలుసుకొనుట (26-30 వ)** : ఇతియోపియా యెరూషలేమునకు కొన్ని వందలమైళ్ళ దూరము ఆ దేశపు ధనాగారపు మంత్రి యూదేతరుడే గాని యూదా మతమును అవ లంభించినవాడు. ఆ దినములలో మహా తెలివి గల నపుంసకులను ప్రాముఖ్యమైన విభాగములకు అనగా ధనాగారము వంటి విభాగమునకు మంత్రులుగా నియమించెదరు. ఇతను యెరూషలేమునకు రథముపై ఆరాధించుటకు వచ్చి తిరిగి వెళ్ళుచుండెను. రథములో కూర్చుండి యెషయా గ్రంథము యాభై మూడవ అధ్యాయము చదువు చుండెను గాని గ్రహింపకుండెను. ఫిలిప్పు ప్రభువు దూత ద్వారా బోధించబడి సమరయ నుండి ప్రయాణమై యెరూషలేము ఇతియోపియా మార్గకూడలిని రథము అక్కడ చేరు సమయములో కలుసుకొని నీవు చదువుచున్నది గ్రహించుచున్నావా అని అడిగెను.

**గ్రంథమందలి లేఖనములను వివరించి ఫిలిప్పు సువార్త ప్రకటించుట (31-35వ)** : ఎంతో తెలివైన మంత్రియైనను లేఖనములను గ్రహింపలేడు. ప్రతి సువార్తికుడు ప్రతి సహోదరుడు విద్యాహీనులకైనను తెలివి కలిగి పెద్ద స్థానములో ఉన్నవారికైనను లేఖన ములు వివరించుట అవసరము. క్రీస్తు మరణ పునరుత్థానములు మానవ పాప క్షమాపణ కొరకే అని ఫిలిప్పు సువార్తను వివరించి తెలిపెను. నమ్మినవారు బాప్తిస్మము పొందవలెనని ఇలా బోధించియుండెను.

**నపుంసకుడు నమ్ముట - బాప్తిస్మము (36-40వ)** : నపుంసకుడు పూర్ణ హృదయముతో యేసును హృదయములో నమ్మి రోమా 10:9 ప్రకారము నోటితో ఒప్పుకొని రక్షించబడి నీతిమంతుడుగా తీర్చబడెను. మార్గమందు నీళ్ళను చూచి నపుంసకుడు తాను నమ్మినట్లుగా తెలిపి బాప్తిస్మము ఇమ్మని అడిగెను. ఇద్దరు నీళ్ళలోకి దిగగా ఫిలిప్పు బాప్తిస్మము ఇచ్చెను. నపుంసకుడు సంతోషించి వెళ్ళిపోయెను. 60 మైళ్ళ దూరమున నున్న ఫిలిప్పు, కైసరయకు వచ్చుచు మార్గమందు ఉన్న పట్టణములలో సువార్త ప్రకటించుచూ వచ్చెను.

గమనిక : మంత్రి ద్వారా ఇతియోపియా దేశములో అనేకులు విశ్వసించిరి. నాటి నుండి నేటికి అనగా 2000సం॥ వరకు ఆ దేశములో క్రైస్తవులు ఉన్నారు. జవహర్‌లాల్ నెహ్రూగారు భారత ప్రధానిగా ఉన్నప్పుడు ఇతియోపియా ప్రధానియగు హైలి సలాసిగారు భారత దేశమునకు వచ్చిరి. విమానాశ్రయములో విమానము నుండి బైబిల్ చేతపట్టుకొని దిగిరి. ఫిలిప్పు చేసిన పరిచర్య ద్వారా నపుంసకుడు మారుట 2 వేల యేండ్లుగా ఆ ఫలము నిలచియుండుట ఆశ్చర్యము!

## 9వ అధ్యాయము 9+9+7+5+5+4+4 = 43 వచనములు

### అంశము : పౌలు రక్షణ, పౌలు ప్రకటన ప్రారంభము

### పేతురు యూదయలో సాక్ష్యము, సంఘ అభివృద్ధి.

**దమస్కు మార్గమున రక్షించబడిన పౌలు (1-9వ)** : శిష్యులను బెదిరించి హత్య చేయు లక్ష్యముతో యెరూషలేములో నుండి అధికార పత్రిక తీసుకొని దమస్కునకు వెళ్ళుచుండెను. మార్గమందు యేసు ప్రభువును చూచి రక్షకుడుగా అంగీకరించి చూపును కోల్పోయి దమస్కు పట్టణములోనికి పోయెను.

**ప్రార్థించి ప్రభువు చిత్తమెరిగి బాప్తిస్మము పొందిన పౌలు (10-18వ)** : దమస్కులో అననీయ ద్వారా అన్యజనులు యెదుటను రాజుల యెదుటను క్రీస్తు నామమును భరించి శ్రమలు పొందుటకు దేవుడు తనను ఏర్పర్చుకొనెను అని తెలుసుకొనెను - బాప్తిస్మము పొందెను. కంటిచూపును పొందెను.

**దమస్కులో ప్రకటించిన పౌలు (19-25వ)** : దమస్కులో యేసు రక్షకుడని క్రీస్తు అనగా ఈ లోకమునకు రాబోవు అభిషిక్తుడుగ మెస్సియా అని రుజువు పరచెను.

యూదులు అతనిని చంపగోరగా శిష్యుల ద్వారా తప్పించబడి 120 మైళ్ళ దూరమున యెరూషలేమునకు వచ్చెను.

**రక్షించబడిన పిదప మొదటసారి యెరూషలేమునకు వెళ్ళి ప్రకటించి తార్సుకు వెళ్ళిన పౌలు (26-30వ) :** యెరూషలేముకు పౌలు రాగా శిష్యులు భయపడి చేర్చుకొనలేదు. బర్నబా హెచ్చరిక పుత్రుడు కనుక పౌలును వారికి పరిచయం చేసెను. యెరూషలేములో ధైర్యముగా క్రీస్తును బోధించుచుండగా యూదులు చంప ప్రయత్నించిరి. సహోదరునితో కూడా కైసరయకు వచ్చి తార్సుకు వెళ్ళిపోయెను.

**యూదయ గలిలయ సమరయలో విస్తరించిన సంఘము - యూదా పట్టణంలో పేతురు పరిచర్య (31-35 వ) :** యూదయ గలిలయ సమరయ దేశములయందు సంఘములు. 1. క్షేమముగాను, 2. అభివృద్ధినొందుచు అనగా సంఘముల లెక్క పెరుగుచు, 3. సమాధానం కలిగి, 4. ప్రభువునందు భయము కలిగి, 5. పరిశుద్ధాత్మ ఆదరణ కలిగి, 6. విస్తరించుచుండెను. ఇది మాదిరికరమైన సంఘ అభివృద్ధి అని గమనించవలెను. పేతురు యూదయలోని సకల ప్రదేశములో సంచారము చేయుచు లుద్దలోనున్న పరిశుద్ధుల యొద్దకు వచ్చెను. పక్షవాయువు గల ఐనెయ్యను స్వస్థ పరచెను. ఆ పట్టణంలోని వారందరు ప్రభువు తట్టు తిరిగిరి. ఇది సంఘముల విస్తరణకు గుర్తు.

**యూదయలోని యొప్పేలో శిష్యురాలగు దొర్కా కాయిలాపడి మరణించగా పేతురు ప్రార్థించి బ్రతికించెను (36-39 వ, 40-43వ) :** ఎ) మరణించిన వారు శిష్యుల ద్వారా అపొస్తలుల కార్యములలో బ్రతికిన మూడు సందర్భములు కలవు.

**1.** అ.కా. 9:40 : పేతురు ద్వారా యొప్పేలో దొర్కా అను స్త్రీ బ్రతికించబడెను.

**2.** అ.కా. 14:20 : లుస్త్రలో రాళ్ళచేత కొట్టబడి చనిపోయిన పురుషుడైన పౌలు బ్రతికెను.

**3.** అ.కా. 20:10 : పౌలు ద్వారా త్రోయలో చనిపోయిన ఐతుకు అను యౌవనస్తుడు బ్రతికింపబడెను.

**బి) యేసు క్రీస్తు దినములలో చనిపోయి యేసుచే బ్రతికించబడిన వారు (క్రీస్తుకాక) :**

**1.** లూకా 7:15 : నాయీను అను గ్రామములో విధవరాలు **కుమారుడగు** చిన్నవాడు బ్రతికించబడెను.

2. లూకా 8:55 : సమాజ మందిరపు అధికారి కుమార్తెయగు చిన్నది బ్రతికించబడుట.

3. యోహాను 11:44 : బేతనియ గ్రామమందు నాలుగు దినములు సమాధిలో ఉండిన పెద్దవాడగు లాజరు బ్రతికించబడుట.

**సి) పాత నిబంధనలో చనిపోయి బ్రతికినవారు :**

1. **1 రాజులు 17:24** : ఏలియా ద్వారా సారెపతు విధవరాలు **కుమారుడైన చిన్నవాడు** బ్రతుకుట.

2. **2 రాజులు 4:35** : ఎలీషాద్వారా షూనేమీయురాలు కుమారుడు బ్రతికించబడుట.

3. **2 రాజులు 13:20-21వ** : ఎలీషా చనిపోయిన తరువాత అతనిని సమాధిలో పెట్టిరి. ఒక సంవత్సరము తరువాత మరొక శవమును ఎలీషా సమాధిలో పెట్టబడు చుండగా ఆ శవము ఎలీషా శవమునకు తగిలి బ్రతికి కాళ్ళు మోపి నిలిచెను.

## 10వ అధ్యాయము 8+8+8+8+8+8 = 48 వచనములు
## అంశము : పేతురు సమరయలో సాక్ష్యము - కొర్నేలి ఇతరుల రక్షణ

**విభజన - అన్యుడైన కొర్నేలి రక్షణ కొరకైన సిద్ధపాటు (1-8వ)** : సమరయ దేశములోని కైసరయలో అన్యుడైన శతాధిపతియగు కొర్నేలి అను భక్తి పరుడు ఉండెను. అన్యుడైనను దేవునికి ప్రార్థన చేయువాడు. ప్రార్థన దేవుని సన్నిధికి చేరినది కాని పాప క్షమాపణ, రక్షణ అనుభవము లేదు. దేవుని దూత పేతురు ద్వారా సువార్త విని, రక్షణ పొందవలెనని కొర్నేలికి సెలవియ్యగా పేతురును పిలువ నంపించెను.

**కొర్నేలి రక్షణకై పేతురు సిద్ధపాటు (9-16 వ)** : పేతురు యొప్పే పట్టణంలో మిద్దెపై ప్రార్థన చేయుచుండగా పెద్ద దుప్పటియందు చతుష్పాద జంతువులు, పురుగులు పక్షులు ఉండుట చూచెను. వాటిని చంపుకొని తినుమని ఒక్క శబ్దము వినబడగా అవి నిషిద్ధమైనవని పేతురు జవాబిచ్చెను. మరలా ఆ శబ్దము దేవుడు పవిత్ర పరచినవి నిషిద్ధమైనవిగా ఎంచవద్దని చెప్పెను. ఆ పాత్ర పైకి ఎత్తబడెను.

**పేతురు రాక కొరకై కొర్నేలి కనిపెట్టుకొని యుండుట (17-24వ)** : కొర్నేలి పంపిన సైనికులు పేతురుకు సంగతులు వివరించగా పేతురు యొప్పే నుండి బయలుదేరి, 60 మైళ్ళ దూరముగానున్న కైసరయకు వెళ్ళెను.

**కొర్నేలి పేతురుకు సంగతులు వివరించుట (25-32 వ)** : కొర్నేలి దూత తనకు ప్రత్యక్షమయి 1 నుండి 8వ చెప్పిన సంగతులను పేతురునకు వివరించెను.

**పేతురు సందేశము (33-40 వ)** : పేతురు తాను దుప్పట్లో చూచిన అపవిత్రమైన వాటిని దేవుడు పవిత్ర పరచినందున అతడు తినవలెనని చెప్పబడిన సంగతులు జ్ఞాపకము చేసుకొనెను. తద్వారా అన్యజనులనైనను యేసు తన రక్తము ద్వారా పవిత్ర పరచి రక్షించును అని గ్రహించెను. మానవుల పాప క్షమాపణకై మరణించి తిరిగి లేచిన యేసుని గూర్చి సాక్ష్యమిచ్చెను.

**కొర్నేలి ఇతరులు రక్షణ పొందుట - బాప్తిస్మము (41-48 వ)** : పై భాగములో పేతురు చెప్పిన మాటలు కొర్నేలి ఇతరులు విని విశ్వసించగా పరిశుద్ధాత్మ వారిపై కుమ్మరించబడి వారు భాషలతో మాట్లాడుట చూచిరి. (భాషలు మాట్లాడుటను గూర్చి చివరి పేజీలోనున్న ముఖ్య విషయముల వివరణ చూడండి) పేతురు యూదులు అన్యులవలె విశ్వసించుట వలన ఆత్మను పొందినట్లు వారు మాట్లాడిన భాషలను బట్టి వారికి బాప్తిస్మము ఇచ్చెను.

*గమనిక* : అన్యులకు రక్షణ లేదని నమ్మిన యూదులకు అన్యులకు సైతం రక్షణ కలదని యెరుగునట్లు 1 కొరింథీ. 14:22 ప్రకారము అవిశ్వాసులైన వారికి సూచనగా బాషలు ఇవ్వబడెను. 10:48లో నమ్మినవారు బాప్తిస్మము పొందవలెననునది దేవుని ఆజ్ఞ అయి ఉన్నది. 10:42లో నమ్మినవారు ధృఢ సాక్ష్యము ఇవ్వవలెనని మరొక దేవుని ఆజ్ఞ చెప్పబడింది. ఆ రెండింటికంటే ముందుగా అంతట అందరు మారు మనస్సు పొందవలెనని దేవుని ఆజ్ఞ. 17:30లో చెప్పబడింది. కనుక మారు మనస్సు పొందుట మొదటి ఆజ్ఞ. బాప్తిస్మము పొందుట రెండవ ఆజ్ఞ. ధృఢ సాక్ష్యమిచ్చుట మూడవ ఆజ్ఞ అపొస్తుల కార్యములో మూడు ముఖ్యమైన ఆజ్ఞలు కలవు.

## 11వ అధ్యాయము 6+6+6+6+6=30 వచనములు

## అంశము : అంతియొకయిలో అన్యుల రక్షణ బర్నబా పౌలుల ద్వారా సంఘ అభివృద్ధి

విభజన - యెరూషలేము వారికి పేతురు తనకు కలిగిన దర్శనము వివరించుట (1-6వ 7-12వ ) : పేతురు సున్నతి లేని వారితో భోజనము చేశాడని యెరూషలేము వారు వాదించగా 10వ అధ్యాయము తనకు కలిగిన దర్శనమును వివరించెను.

**అన్యులకు దేవుడు మారుమనస్సు దయచేయునని సహోదరులు గ్రహించుట (13-18వ):** పేతురు కొర్నేలి పంపిన మనుష్యులతో కైసరయకు వెళ్ళి కొర్నేలికి దేవుడు తెలిపిన మాటలు వినిన పిదప వారికి సువార్త ప్రకటించి పరిశుద్ధాత్మ వారి మీద వ్రాలుటను గూర్చి వివరించెను. అన్యజనులకు జీవార్థమైన మారు మనస్సు దేవుడు దయచేయునని సహోదరులు గ్రహించి దేవుని మహిమ పరిచిరి.

**సిరియలోని అంతియొకయలో అన్యులు రక్షించబడి ప్రభువు పక్షమున చేర్చబడుట (19-24వ) :** చెదరిపోయిన వారు యెరూషలేము నుండి నూరు మైళ్ళ దూరములోనున్న ఫేనికేకు, 200 మైళ్ళ దూరములోనున్న కుప్రకు, 300 మైళ్ళ దూరములోనున్న అంతియొకయకు వెళ్ళి సువార్త ప్రకటించగా అంతియొకయలో నమ్మిన అన్యులు అనేకులు ప్రభువు తట్టు తిరిగిరి. యెరూషలేము నుండి అంతియొకయకు పంపబడిన బర్నబా వారిని హెచ్చరించగా బహు జనులు ప్రభువు పక్షముగా చేరిరి.

**బర్నబా పౌలు కలసి ఒక్క సంవత్సరము ఉండి సంఘమును స్థిరపరచుట (25-30వ):** యెరూషలేములో కలిగిన కరువుకు సహాయము కొనిపోవుట. బర్నబా తార్సుకు వెళ్ళి పౌలును తీసుకొని వచ్చెను. వారిద్దరు అంతియొకయలో ఒక్క సంవత్సరము ఉండి సంఘమందు వాక్యమును బోధించి శిష్యులను క్రీస్తును స్వంతము చేసుకొనిరి అను అర్థము గల క్రైస్తవులు అని పిలువబడునంతగా పెంచిరి. (క్రిస్టియనో) యెరూషలేము నుండి వచ్చిన ప్రవక్తలు భూలోకమంతట గొప్ప కరువు కలుగునని సూచించగా శిష్యులతో ప్రతివాడును తన తన శక్తి కొలది యూదయలో కాపురమున్న సహోదరులకు సహాయము సమకూర్చిరి. ఆ ధనమును బర్నభా పౌలుల చేత యెరూషలేమునకు పంపెను. ప్రభువునకు తమ తమ శక్తికొలది ఇవ్వవలెనని ప్రతి శిష్యుడు నేర్చుకొనుట గమనించ తగినది. పౌలు రక్షించబడిన పిదప యెరూషలేమునకు వెళ్ళుట ఇది రెండవసారి. క్రైస్తవులు అను పదము క్రొత్త నిబంధనలో మూడు పర్యాయములు కలదు. 1) అ.కా. 11:26వ, 2) అ.కా. 26:28వ, 3) 1 పేతురు 4:16వ.

## 12వ అధ్యాయము 5+5+5+5+5 = 25 వచనములు
## అంశము : యెరూషలేములో పేతురు చెరసాలలో ఉంచబడుట
## ప్రార్థన ద్వారా పేతురుకు కలిగిన విడుదల

**విభజన - చెరసాలలో ఉంచబడిన పేతురుకై సంఘము ప్రార్థించుట (1-5వ) :** రాజైన హేరోదు - శిష్యుడైన యాకోబును చంపించి పేతురును కూడా చంపవలెనని

తలంచి చెరసాలలో 16 మంది సైనికుల కావుదలతో ఉంచెను. సంఘము పేతురు విడుదలకై అత్యాశక్తితో ప్రార్థించెను.

**దేవుడు దూత ద్వారా పేతురును చెరసాల నుండి విడిపించుట (6-10వ) :** రాత్రివేళ దూత నిద్రించుచున్న పేతురును లేపగా సంకెళ్ళు అతని చేతినుండి ఊడిపడెను. చెరసాల నుండి బయటికి తీసుకొని వచ్చి దూత వెళ్ళిపోయెను.

**పేతురు మరియ ఇంటిలో ప్రార్థించుచున్న మరియ ఇంటికి వచ్చుట (11-15 వ) :** పేతురు వచ్చి తలుపుతట్టగా రోదె అను చిన్నది గుర్తు పట్టి సహోదరులకు తెలిపెను.

**పేతురు విడిపించబడిన వివరము సహోదరులకు వివరించి వెళ్ళిపోవుట (16-20వ):** సహోదరులు తలుపు తీయగా ప్రభువు తనను చెరసాల నుండి ఎలాగు తీసుకొని వచ్చెను అను సంగతులు వివరించి వేరొక చోటికి వెళ్ళిపోయెను. తెల్లవారగనే పేతురు కనబడ నందున హేరోదు రాజు కావలి వారిని చంపించి యూదయ నుండి కైసరయకు వెళ్ళి అక్కడ నివసించెను.

**హేరోదు మరణము - పౌలు బర్నబాలు మార్కుతో కలసి అంతియొకయకు వచ్చుట (21-25 వ) :** పేతురును చంపదలచిన హేరోదు తానే పురుగులు పట్టి చనిపోయెను. క్రీస్తుకు మరణ శిక్ష విధించిన అధిపతియగు పిలాతు తన పదవిని పోగొట్టుకొని శిక్షింపబడి చనిపోయెను. దేవుని పిల్లలను హింసించు వారికి ఇటువంటి శ్రమలు కలుగగలవు. పౌలు బర్నబాలు ఉపకార ద్రవ్యమును యెరూషలేములో సహోదరులకు అప్పగించి తిరిగి అంతియొకయకు వచ్చెను.

## ప్రభువు పిలుపు

1) మనలను పిలిచినవాడు పరిశుద్ధుడు - 1 పేతురు 1:5వ.

2. మనము **పరిశుద్ధులముగా ఉండుటకు పిలిచాడు** - రోమా 1:7వ.

3. తల్లి గర్భమందుండనే...... పిలిచాడు - గలతీ. 1:15వ.

4. చీకటి నుండి ఆశ్చర్యకరమైన తన **వెలుగులోనికి పిలిచాడు** - 1 పేతురు 2:9వ.

5. తన **కుమారుని సహవాసమునకు పిలిచాడు** - 1 కొరిం. 1:9వ.

6. **ఆశీర్వాదమునకు** వారసులమగుటకు **పిలిచాడు** - 1 పేతురు 3:9వ.

7. తన మహిమను బట్టి పిలిచాడు (2 పేతురు 1:3వ) - నిత్య మహిమకు పిలిచాడు. 1 పేతురు 5:10వ.

8. నిత్య స్వాస్థ్యము కొరకు పిలిచాడు - హెబ్రీ. 9:15వ.

9. సమాధానముగా ఉండుటకు పిలిచాడు - 1 కొరి. 7:15వ.

10. పరలోకపు పిలుపుతో పిలిచాడు - హెబ్రీ. 3:1వ.

11. పరిశుద్ధమైన పిలుపుతో పిలిచాడు - 2 తిమోతి 1:9వ.

12. ఉన్నత పిలుపుతో పిలిచాడు - ఫిలిప్పీ 3:14వ.

13. నిరీక్షణ గల పిలుపుతో పిలిచాడు - ఆ నిరీక్షణ ఎట్టిదో ఎరగాలి - ఎఫెసీ. 1:18వ.

14. పిలుపును నిశ్చయము చేసుకోవాలి. 2 పేతురు 1:10వ.

15. పిలుపుకు తగినట్లు నడుచుకొనాలి. ఎఫెసీ. 4:1వ.

16. తల్లి గర్భమందుండగా పిలిచినను ప్రభువు పౌలును పిలిచినట్లు సంఘమునకు తర్వాత చెప్పాడు. పిలుపునకు లోబడి అబ్రాహామువలె....... ఎక్కడికి వెళ్ళవలెనో ముందుగా ఎరుగక పోయినను బయలుదేరాలి. హెబ్రీ. 11:8వ. ఆలాగు బయలుదేరి వెళ్ళిన పౌలును ముందు అధ్యాయములలో చూతుము. అ.కా. 13:1-2వ.

## 13వ అధ్యాయము 4+8+10+10+10+10 = 52 వచనములు
## అంశము : బర్నబా పౌలులు ప్రభువు పిలిచిన పనికై ప్రత్యేక పర్చుట - కుప్ర గలతియలో సాక్ష్యమిచ్చుట

**విభజన - ప్రభువు పిలిచినపనికి పౌలు బర్నబాలు ప్రత్యేకింపబడి ప్రార్థనతో పంపబడుట (1-4వ)** : అంతియొకయలోనున్న సంఘములో అయిదు మంది బోధకులు ప్రవక్తలు సేవించుచుండగా పౌలు బర్నబా ఇద్దరిని ప్రభువు తాను పిలిచిన పనికి ప్రత్యేకించమని సెలవిచ్చెను. వారు ప్రత్యేకించబడి ప్రార్థనతో పంపబడగ సెలూకయకు కుప్రకు వచ్చిరి.

**పౌలు పరిశుద్ధాత్మతో నిండినవాడై కుప్రలో పరిచర్య చేయుట (5-12 వ)** : కుప్రలోని సలామిలో పని చేసిన పిమ్మట పాపు అను ఊరికి రాగా ఆ ద్వీపమునకు అధిపతి విశ్వసించెను. గారడీవాడైన బర్ యేసు ఎదిరించి గ్రుడ్డివాడాయెను.

**పిసిదియాలోని అంతియొకయలో సువార్త ప్రకటన - నమ్మినవారు, దూషించి వెళ్ళగొట్టిన వారు (13-52 వ)** : పిసిదియలోనున్న అంతియొకయకు వచ్చి సమాజమందిరమునకు

వచ్చి కూర్చుండెను. సమాజ మందిరపు అధికారులు బోధించవలెనని కోరగా పౌలు నిలువబడి చరిత్ర గ్రంథములో నుండి సాక్ష్యమిచ్చెను. అలాగే 23-32వ. వరకు ప్రవక్తల గ్రంథమునందలి వచనముల ద్వారా క్రీస్తు మరణ పునరుత్థానములను వివరించిరి. అటు తరువాత 33-42 వచనములలో కీర్తన గ్రంథమునందలి క్రీస్తు మరణము పునరుత్థానము ఆరోహణము క్రీస్తు ద్వారానే పాప క్షమాపణ కలుగునని క్రీస్తు ద్వారానే నీతిమంతులముగా తీర్చబడుదమని వివరించిరి. లూకా 24:44వ ప్రకారము దర్శశాస్త్రము, ప్రవక్తల గ్రంథములో, కీర్తన గ్రంథములో క్రీస్తు విషయమైన సంగతులు వివరించినట్లు గమనించగలము, సమాజ మందిరములో అనేకులు యూదులు యూదా మత ప్రవిష్ఠులు వాక్యమును అంగీకరించి పౌలు బర్నబాను వెంబడించిరి. కాని మరుసటి విశ్రాంతి దినమున వీరిని దూషించి హింసించి వెళ్ళగొట్టిరి.

## 14వ అధ్యాయము 6+6+6+6+4 = 28 వచనములు
## అంశము : గలతియ దేశములోని ఈకొనియ, దెర్బే లుస్త్ర పట్టణంలో సాక్ష్యము

**విభజన - ఈ కొనియలో సాక్ష్యము (1-6వ)** : యూదుల సమాజ మందిరములలో తేటగా బోధింపగా అనేకులు యూదులు గ్రీసు దేశస్థులు విశ్వసించిరి. మరికొందరు యూదులు అధికారులతో కలసి రాళ్ళు రువ్వి చంపవలెనని తలంచిరి.

**లుస్త్రలో సాక్ష్యము (7-12 వ 13-18 వ)** : లుస్త్రలో పుట్టినది మొదలుకొని కుంటి వాడైన ఒక్క మనుష్యుని పౌలు స్వస్థ పరచగా ఆ పట్టణస్థులు పౌలు బర్నబాలను మనుష్య రూపము దాల్చిన దేవతలుగా భావించి వారికి హేర్మే ద్యుపతి అను పేరులు పెట్టి ఎద్దును బలి అర్పింపవలెనని తలంచిరి. పౌలు బర్నబాలు బహు ప్రయాసపడి జన సమూహములు తమకు బలి అర్పించుట ఆపు చేసిరి.

**లుస్త్రలో రాళ్ళచే కొట్టబడి చనిపోయి తిరిగి బ్రతికిన పౌలు - లుస్త్ర దెర్బే ఈకొనియ అంతియొకయలో ఏర్పడిన సంఘము (19-24 వ)** : అంతియొకయ ఈకొనియ నుండి యూదులు వచ్చి జన సమూహముతో కలసి పౌలుపై రాళ్ళు రువ్వి చనిపోయెనని తలంచి

2 తిమోతి 3:10 ప్రకారము తిమోతి ఈ సమయంలో రక్షించబడినట్లు చూడగలము. పౌలు లేచి లుస్త్రలోను దెర్బేలోను ఈకొనియ అంతియొకలో సువార్త ప్రకటించి

అనేకులను శిష్యులుగా చేసి వారిని స్థిరపరచి, ప్రతి సంఘములో పెద్దలను ఏర్పరచి ముందుకు వెళ్ళిపోయెను.

**మొదట సేవా యాత్ర ముగింపు (15-28 వ)** : పెర్గేలో వాక్యము బోధించి అత్తాలియకు వెళ్ళి ఓడ ఎక్కి మొదట బయలుదరిన అంతియొకయకు వచ్చి సంఘమును సమకూర్చి అన్యజనులు విశ్వసించులాగున దేవుడు చేసిన కార్యములు వివరించిరి.

## 15వ అధ్యాయము 5+6+10+10+10 = 41 వచనములు
## అంశము : యెరూషలేములో జరిగిన సున్నతి సభ

**విభజన - రక్షణకు సున్నతిని గూర్చిన వివాదము (1-5వ)** : యూదయ నుండి వచ్చిన కొందరు సున్నతి పొందితేనే గాని రక్షణ పొందరని భోదించిరి. పౌలును బర్నబాకు వారితో తర్కము కలిగినపుడు ఈ విషయమై వివరణ కొరకు సంఘము ద్వారా యెరూష లేమునకు పంపబడిరి. పౌలు యెరూషలేమునకు రక్షణ పొందిన పిదప వెళ్ళుట ఇది మూడవసారి.

**పేతురు యాకోబు ఇతర పెద్దలు రక్షణకు సున్నతి అవసరం లేదని స్థిరపరచుట (6-31 వ)** : 6-11వ పేతురు కైసరయలో దేవుడు అన్యులను సున్నతి లేకయే రక్షించుటను గూర్చి చెప్పెను 12-21 వచనములలో పౌలు బర్నబాలు దేవుడు అన్యజనులను రక్షించ బడిన సంగతిని వివరింపగా పెద్దయైన యాకోబు అన్యజనులకు సున్నతి అక్కరలేదని పేతురు తీర్మానమును యాకోబు స్థిరపరచెను. 22-31వ సహోదరులు ఈ విషయములను ఉత్తరముగా వ్రాసి యూదా సీల ద్వారా అంతియొకయకు పంపిరి. అంతియొకయ వారు ఈ పత్రికను చదువుకొని ఆదరణ పొందిరి. ఇదే సమయములో గలతియలోని సంఘములలో రక్షణకు సున్నతి అన్యులకు అవసరమని తప్పు బోధ ప్రవేశించెను. దీని సరిదిద్దుటకై క్రీ.శ. 49 తరువాత పౌలు గలతీయులకు పత్రిక వ్రాసెను.

**పౌలు బర్నబాలు మార్కును గూర్చి వాదము కలిగి వేరైపోవుట (32-41)** : యూదా సీలలు యెరూషలేమునకు వెళ్ళి పోగా పౌలు బర్నబాలు మొదట యాత్రలో ఏర్పడిన సంఘములను దర్శించుటకై ఇష్టపడిరి. మొదటి యాత్రలో మధ్యలోనే ఆగిపోయిన మార్కు బర్నబాకుమేనల్లుడు (కొలస్స 4:10) ఈ మార్కును వెంటబెట్టుకొని పోవుటకు బర్నబా ఇష్టపడెను కాని పౌలు అంగీకరించలేదు. తీవ్రమైన వాదము కలిగి బర్నబా మార్కును వెంటబెట్టుకొని కుప్రకు వెళ్ళెను. పౌలు సీలను ఏర్పరచుకొని సిరియ కిలికియ దేశముల ద్వారా ప్రయాణము చేసిరి. మొదట యాత్రలో తాము పని చేసిన గలతీయ ప్రాంతములోని దెర్బే లుస్త్ర పట్టణములకు వచ్చారు.

గమనిక : బర్నబా కుప్ర పనిని ఎంతో ప్రేమించాడు. కాని బర్నబాను చివరలో కుప్ర వారు హత్య చేసిరి. మార్కు శరీరమును తెచ్చిసలామిలో పాతి పెట్టాడు.

## 16వ అధ్యాయము 5+5+5+4+5+5+5+6 =40 వచనములు

## అంశము : శ్రమలు చెరసాలల మధ్య ఫిలిప్పీయులో సువార్త ప్రకటన - ఏర్పడిన సంఘ సాక్ష్యము

విభజన - **తిమోతితో** కలసి సంఘములను స్థిరపరచుట విస్తరింప చేయుట (1-5వ): పౌలు లుస్త్రకు దెర్బేకు రాగా మొదట యాత్రలో అ.కా. 14:20లో రక్షించబడిన తిమోతి ఈ ప్రాంతములోని సహోదరుల వలన మంచి పేరు పొందిన శిష్యుడుగా ఉండెను. పౌలు తిమోతిని తనతో కూడ రమ్మని కోరి సీలతో కలసి ఆయా పట్టణములలో నున్న సంఘములను స్థిరపరచిరి.

**మాసిదోనియలో సువార్త ప్రకటనకై దేవుని పిలుపు (6-10 వ)** : ఆసియాలో కాని బితూనియాలో కాని దేవుడు ఆత్మ సువార్త ప్రకటింపనియ్య లేదు. పౌలు లూకా ఉండు త్రోయకు వచ్చినపుడు రాత్రివేళ మాసిదోనియ దేశస్థుడు సహాయము చేయమని పౌలును కోరినట్లు పౌలునకు దర్శనము కలిగెను. ఆ దర్శనము ప్రకారము పైనున్న ముగ్గురితో లూకా కలసి మాసిదోనియాకు కలసి బయలుదేరిరి.

**ఫిలిప్పులో లూదియా ఆమె ఇంటివారు రక్షించబడుట (11-15 వ)** : త్రోయ నుండి 150 మైళ్ళ దూరములోనున్న ఫిలిప్పికి అయిదు దినముల సముద్ర ప్రయాణము ద్వారా వచ్చిరి. మాసిదోనియా దేశములోని నాలుగు ముఖ్య పట్టణములలో ఆ ప్రాంతమునకు ఫిలిప్పి ముఖ్య పట్టణం విశ్రాంతి దినమున గవిని దాటి నదీ తీరమున ప్రార్థనా కూడిక జరిగించగా స్త్రీలు కూడి వచ్చిరి. నిరుత్సాహ పడక మాట్లాడుచుండగా లూదియ అను స్త్రీ విని విశ్వసించి తన ఇంటి వారితో కలసి బాప్తీస్మము పొందెను. సహోదరులను తన ఇంటిలో చేర్చుకొనెను.

**పుత్రోను దయ్యము పట్టి సోదె చెప్పు చిన్నదానిని స్వస్థ పరచుట - గ్రామాధికారుల యొద్ద నిలిచిన పౌలు సీలలు (16-19 వ)** : దయ్యము పట్టిన బిడ్డ సోదె చెప్పుట ద్వారా లాభము వచ్చుచుండెను. పౌలు ఆ దయ్యము వెళ్ళిపోవునట్లు చేసెను. లాభ సాధనము పోయెనని యజమానులు పౌలు సీలలను గ్రామాధికారుల యొద్దకు ఈడ్చుకొని పోయిరి.

**కొట్టబడి చెరలో నుంచబడుట (20-24వ - 25-29వ)** : చెరసాలలో సువార్త ప్రకటన. న్యాయాధిపతులు పౌలు సీలలను కొట్టించి కాళ్ళకు బొండ వేసి చెరసాలలో వేయించిరి.

పౌలు సీలలు దుఃఖించక రాత్రివేళ ప్రార్థించి రక్షణ సువార్త ప్రకటించిరి. గొప్ప భూకంపము కలిగి చెరసాల తలుపులు తీయబడినను ఖైదీలు పారిపోలేదు. ఖైదీలు రక్షణ పొందిరని తలంచగలము. నిద్రించిన చెరసాల అధిపతి లేచి జరిగినది చూచి వణుకుచు పౌలు సీలల యొద్దకు వచ్చెను.

**చెరసాల నాయకుడు ఇంటి వారు రక్షించబడి బాప్తీస్మము పొందుట (30-34వ) :** చెరసాల నాయకునికి సహోదరులు రక్షణ సువార్త ప్రకటించగా తాను రక్షించబడెను. తన ఇంటివారు కూడా రక్షించబడి అందరును బాప్తీస్మము పొందిరి.

**ఫిలిప్పీయుని విడిచి వెళ్ళమని న్యాయాధిపతులు పౌలును వేడుకొనుట (35-40వ) :** ఉదయమున పౌలు రోమా పౌరసత్వము కలవాడని న్యాయాధిపతులు తెలుసుకొని భయపడి పట్టణము విడిచి వెళ్ళమని వేడుకొనిరి. వారు చెరసాల నుండి బయటకు వచ్చి లూదియ ఇంటికి వచ్చి సహోదరులను ఆదరించి థెస్సలొనికయకు వెళ్ళి పోయిరి. ఈ అధ్యాయములోని పదజాలమును బట్టి అనగా 40వ వచనములోనున్న "పోయిరి" అను పదమును బట్టి లూకా వెళ్ళి పోలేదని అక్కడే నిలిచి ఉండెనని గుర్తించగలము. 20:6వ. వరకు అనగా మూడవ యాత్ర ఇంచుమించు చివరి వరకు 7 సం॥కాలము అక్కడనే ఉండి సంఘమును స్థిరపరచెను కాని లూకా తన చివరి దినములలో మాసిదోనియా ప్రాంతములో సేవ చేసి తన 84 ఏట మరణించి అక్కడనే సమాధి చేయబడెను.

## 17వ అధ్యాయము 9+6+6+6+7 =34 వచనములు
## అంశము : మాసిదోనియా గ్రీసు దేశములలో ఏర్పడిన సంఘ సాక్ష్యము

విభజన - శ్రమల మధ్య థెస్సలొనీకయలో ఏర్పడిన సంఘ సాక్ష్యము (1-9వ) : ఫిలిప్పీ పట్టణం నుండి 100 మైళ్ళ దూరములోనున్న థెస్సలొనికయకు పౌలు, సీలలు వచ్చిరి. యాసోను ఇంటిలో నుండి మూడు విశ్రాంతి దినములలో సమాజ మందిరములో బోధించెను. కొందరు యూదులు చాలామంది అన్యులు ఘనత గల స్త్రీలలో అనేకులు యేసును రక్షకుడిగా ఒప్పుకొని వారితో కలుసుకొనిరి. మత్సరము కల యూదులు యాసోనును అధికారుల యొద్దకు ఈడ్చుకొని పోయి చాడీలు చెప్పినందున అధికారులు కలవరపడిరి. యాసోను నొద్ద జామీనా వేసుకొని విడిచిపెట్టిరి. థెస్సలొనికయ సేవలో గమనించదగిన మూడు ప్రాముఖ్యమైన విషయములు.

1. సమాజ మందిరములో యేసుక్రీస్తును రక్షకుడుగా వివరించుట పౌలు వాడగా.

2. ఈ సంగతులు నమ్మిన వారిని రోమా 9:10 ప్రకారము నోటితో ఒప్పింప చేయుట.

3. భూలోకమును తలక్రిందులు చేసిన వారని పేరు పొందుట.

**కలవరముల మధ్య బెరయలో ఏర్పడిన సంఘ సాక్ష్యము (10-15వ)** : థెస్సలొనీకయలో తొందరను బట్టి పౌలు సీల తిమోతీలను సహోదరులు యాభైమైళ్ళ దూరంలోనున్న బెరయకు పంపిరి. పౌలు సమాజ మందిరములో బోధింపగా యూదులలో అనేకులు ఘనత గల అన్యులలో స్త్రీ పురుషులు చాలామంది విశ్వసించిరి. బెరయలో కూడా కలవరము కలిగినందున పౌలును సహోదరులు ఏథెన్సుకు పంపిరి. పౌలు సీల బెరయ లోనే నిలిచిపోయిరి. బెరయ విశ్వాసుల ప్రత్యేకత ఏమనగా పౌలు సీల చెప్పిన సంగతులు ఆలాగున ఉన్నవో లేవో అని ప్రతి దినమున లేఖనములును పరిశోధించే వారు.

**గ్రీసు దేశములోని ఏథెన్సులో ఎర్పడిన సంఘ సాక్ష్యము (16-34వ)** : 16-21వ.లలో పౌలు బెరయ నుండి 250 మైళ్ళ దూరము గల ఉత్తర గ్రీసు దేశమునకు ముఖ్య పట్టణమైన ఏథెన్సుకు వచ్చెను. గ్రీసు దేశస్తులు జ్ఞానమును వెతుకుట ద్వారా దేవుని తెలుసుకొందుమని అనుకొందురు. ఆ ఏథెన్సు పట్టణము విగ్రహములతో నిండినందున పౌలు ఆత్మలో పరితాపము చెంది సమాజ మందిరములోను, సంత వీధులలోను జనులతో తర్కించుచుండెను. ఏథెన్సు వారు క్రొత్త సంగతులను చెప్పకొనుట వినుట యందు మాత్రమే ఆసక్తి కలవారు ఏథెన్సు పట్టణములో మార్స్ (Mars) అను దేవత పర్వతము పై జరుగు సభను అరేయొపగు సభ పార్లమెంటు అందురు. ఈ సభకు ఏథెన్సు రాజధాని లోని సభ్యులు వత్తురు. పౌలును ఈ సభలోనికి తీసుకొని పోయిరి. 22-27వ.లలో అరేయొపగు సభలో నిలిచి నిజ దేవునిని గూర్చిన వివరములు పౌలు తెలిపెను. 28-34వ. లలో అందరు మారుమనస్సు పొందవలెనని దేవుడు ఆజ్ఞాపించు చున్నాడని మృతులలో నుండి లేచిన యేసును నమ్ముటకు ఆధారములను తెలియ జేసెను. కొందరు మనుష్యులు విశ్వసించి పౌలును హత్తుకొనిరి. అరేయొపగు సభ సభ్యుడైన (పార్లమెంటు సభ్యుడు) దియొనూసియు కాడిమోయు పెయ్య అను అర్థము గల దమరియను అను ఒక స్త్రీ వారిలో ఉండెను. ఏథెను అను పేరునకు అనిశ్చయత్వము అని అర్థము. ఏథెన్సులో గొప్పవారిని పౌలు సంపాదించుట మనకు మాదిరి.

## 18వ అధ్యాయము 4+7+7+5+5 = 28 వచనములు
## అంశము : కొరింథులో ఏర్పడిన సంఘ సాక్ష్యము

**విభజన - పౌలు అకుల ప్రిస్కిల్లతో కలసి పని చేయుట (1-4వ)** : పౌలు ఏథెన్సు నుండి యాభై మైళ్ళ దూరమున ఉన్న దక్షిణ గ్రీసు దేశమునకు ముఖ్య పట్టణమైన కొరింథునకు వచ్చి అకుల, ప్రిస్కిల్ల అను భార్య భర్తలను కలుసుకొనెను. వారు పౌలువలె డేరాలు కుట్టు వృత్తిగలవారు. యూదుల యొక్క ప్రత్యేకత ఏమనగా పాఠశాలలో ఏదో ఒక్క వృత్తి విద్యను చదువులతో పాటు పిల్లలకు నేర్పించే వారు పౌలు తన వాడుక చొప్పున సమాజ మందిరములోను బయట అన్యులకును యూదులకు సువార్త ప్రకటించి ఒప్పించెను.

**కొరింథులో విశ్వసించిన వారికి వివరములు (5-18వ)** : 17:15-16వ.లలో సీల తిమోతియులు థెస్సలోనికయకు వెళ్ళినట్లు 1 థెస్స. 3:1వ.లను బట్టి గ్రహించగలము. **సీల తిమోతి** ఇప్పుడు కొరింథునకు వచ్చి థెస్సలోనికయలను గూర్చి పౌలునకు తెలిపి నందున కొరింథు పట్టణం నుండి థెస్సలోనికయలకు మొదట పత్రిక క్రీ.శ. 52లో **ప్రభువు రాకడను** గురించి వ్రాసెను. దీని విషయమై కలిగిన గలిబిలిని సవరించుటకు వెంటనే అనగా క్రీ.శ. 53లో మాసిదోనియా నుండి థెస్సలోనికయకు రెండవ పత్రికను వ్రాసెను. 5-11వ కొరింథులో యూదులకు **ధృఢముగా** పౌలు సాక్ష్యము ఇచ్చినందున యూదులు ఎదురాడి దూషించిరి. ప్రభువు ఈ పట్టణంలో బహుజనమున్నారని దర్శన మందు పౌలునకు తెలుపగా పౌలు 18 నెలలు ఆ పట్టణమందుండి వాక్యమును బోధించెను కొరింథీలలో అనేకులు సమాజ మందిరపు అధికారియైన క్రిస్పు అతని ఇంటి వారు విశ్వాసముంచి బాప్తిస్మము పొందిరి. 12-18వ.లలో పౌలును న్యాయపీఠము ముందు నిలువబెట్టగా అకయ అధిపతియగు గల్లియోను వివరములు తెలుసుకొని పౌలు ఏ అన్యాయము చేయలేదని తెలుసుకొని అందరిని న్యాయపీఠము నుండి పంపివేసెను. పౌలు అక్కడ నుండి బయలుదేరి 8 మైళ్ళ దూరమునున్న కెంక్రేయకు వచ్చి యూదుల ఆచార ప్రకారము తన తల వెంట్రుకలు కత్తిరించుకొని అకుల ప్రిస్కిల్లతో కలసి సిరియాకు బయలుదేరును. కొరింథులో 18 నెలల సేవా వివరములు అపొస్తలుల కార్యములు 18వ అధ్యాయములోని 1-18వ.లలో ఉండుట గమనించదగినది.

**ఎఫెసీ. యెరూషలేము గుండావెళ్ళి అంతియొకయచేరి రెండవసేవాయాత్ర ముగించుట (19-23వ)** : కెంక్రేయ నుండి 250 మైళ్ళ దూరముననున్న ఎఫెస్సునకు వచ్చి సమాజ

మందిరములోని యూదులతో తర్కించి అకుల ప్రిస్కిల్లను అక్కడ విడిచిపెట్టి పౌలు యెరూషలేమునకు అంతియొకయకు 650 మైళ్ళ ప్రయాణము ద్వారా వెళ్ళెను. రక్షించ బడిన తరువాత పౌలు యెరూషలేమునకు వెళ్ళుట ఇది నాలుగవసారి. కొంతకాలమైన తరువాత గలతీయ ఫ్రుగియ ప్రాంతములలో శిష్యులను స్థిరపరచెను.

**అకుల ప్రిస్కిల్లల ప్రోత్సాహము ద్వారా అపొల్లో కొరింథునకు వచ్చి సహాయము చేయుట (24-28వ) :** అకుల ప్రిస్కిల్లలు యెరూషలేములో ఉండగా అపొల్లో అను విద్వాంసుడు యెహోవాను బాప్తిస్మము తెలుసుకొను వాడైనను ఎఫెసునకు వచ్చి యేసును గూర్చి ధైర్యముగా మాట్లాడుచుండెను. ప్రిస్కిల్ల అకులలు అతనిని చేర్చుకొని దేవుని మార్గము విశదపరిచిరి. సహోదరుల ప్రోత్సాహంతో అపొల్లో కొరింథికు వెళ్ళి విశ్వసించిన వారికి చాలా సహాయము చేసెను. అపొల్లో వంటి వ్యక్తులను చేర్చుకొని సంగతులను విశద పరచి ప్రోత్సహించు అకుల ప్రిస్కిల్లలు వంటివారు ఈ దినములలో ఎంతో అవసరత ఉన్నది.

## 19వ అధ్యాయము 7+7+6+7+7+7 =41 వచనములు
## అంశము : ఎఫెసులో ఏర్పడిన సంఘ సాక్ష్యము

**విభజన - ఎఫెసులో సేవా - ఏర్పడిన సంఘ సాక్ష్యము (1-20వ) :** పౌలు ఎఫెస్సులో మూడు సంవత్సరములు అనగా క్రీ.శ. 54-56 వరకు సేవ చేసిరని అ.కా. 20:23 నుండి తెలుసుకొనగలము. ఎఫెసులో బాప్తిస్మము ఇచ్చు యోహాను కాలములో యోహాను బాప్తిస్మము పొందిన పన్నెండుగురు పురుషులు కలరు బాప్తీస్మము ఇచ్చు యోహాను కాలము నాటికి పరిశుద్ధాత్మ భూమి పైకి రానందున వారు పరిశుద్ధాత్ముడు ఉన్నాడన్న సంగతి తెలియని వారు. తన వెనుక వచ్చు యేసునందు విశ్వాసము ఉంచవలెనని బాప్తీస్మము ఇచ్చు యోహాను బోధను ఎరిగి బాప్తీస్మము పొందిరి. వీరు పౌలు ద్వారా యేసునందు విశ్వాసముంచుటను విని విశ్వాసముంచి బాప్తీస్మము పొందిరి. వీరికి పరిశుద్ధాత్మ అనుగ్రహించబడెననుటకు సూచనగా 1 కొరింథీ. 14:22 ప్రకారము భాషలు అనుగ్రహించబడెను. పెంతెకొస్తు దినమున భాషలు అ.కా. 2:1-4లో అనుగ్రహించబడిన తరువాత 1) 9:6-12వ. సగము అన్యులు, సగము యూదులకు సమరయులకు రక్షణ కలదని యూదులు నమ్మినట్లు, 2) 10:43-48వ. అన్యుడైన కొర్నేలికి రక్షన కలదని యూదులు నమ్మినట్లు, 3) బాప్తీస్మము ఇచ్చు యోహాను ద్వారా బాప్తీస్మము పొందిన

వారు ఎఫెసులో రక్షించబడినట్లు గురుతుగా 20:1-10వ.లో భాషలు ఈ మూడు సందర్భములలోనే **1** కొరి. 14:22 ప్రకారము సూచనగా ఇవ్వబడినవని గుర్తించవలెను. కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక ఎఫెసు నుండి క్రీ.శ. 56లో వ్రాయబడెను అని 1 కొరింథీ. 16:9 వలన తెలుసుకొనుచున్నాము. 1 కొరింథీ. 13:8లో భాషలైనను నిలిచిపోవునని వ్రాయబడియున్నవి. క్రీ.శ. 56 తరువాత వ్రాయబడిన మరి ఏ గ్రంథమందైనను భాషల ప్రస్తావన లేనందున నాటి నుండి భాషల వరము నిలలిచి పోయెనని గ్రహించగలము. ఎఫెసు పట్టణంలో పౌలు శరీరమునకు తగిలిన చేతి గుడ్డలను రోగుల యొద్దకు తెచ్చినపుడు రోగములు వారిని విడిచెను. కాని 2 కొరింథీ. 10:10 ప్రకారము పౌలు శరీర రోగమునకు బలహీనుడై ప్రభువుకు ప్రార్థించినను తన బలహీనత యందు నా శక్తి పరిపూర్ణమగుచున్నది. ప్రభువు సెలవిచ్చాడే కాని బలహీనతలు తీసివేయలేదు కావున 2 కొరింథీ. 12:9. స్వస్థతల వరము శాశ్వతమైనది కాదని గుర్తించ వలెను. 2 తిమోతి 4:20లో త్రోఫిము రోగి అయినందున మిలేతులో విడిచి వచ్చితిని అనుటలో త్రోఫిమునకు స్వస్థత కలుగలేదని గ్రహించగలము. గనుక స్వస్థత వరము శాశ్వతమైనది కాదని గుర్తించగలము.

ఎఫెసులో ముందుగా మూడు నెలల, తరువాత తురను ఒకని అను పాఠశాలలో రెండు సంవత్సరములు అ.కా. 20:31 ప్రకారము ఎఫెసులో మూడేండ్లు సేవ చేసెను. ఈ దినములలో చిన్నాసియా 200 గ్రామముల వారు దేవుని వాక్యమును వినునట్లు చూడగలము. అనేకులు విశ్వసించిరి. మాంత్రిక విద్యను అభ్యసించినవారు 50 వేల వెండి రూకల వెల గల పుస్తకములు కాల్చి వేసిరి. ఇది నేటి దినములలో కోటి రూపాయిల వెల కావచ్చు. ప్రభువు వాక్యము ఎంత ప్రబలముగ వ్యాపించెనో దీనిని బట్టి గమనించ గలము.

**ఎఫెసులో క్రీస్తు మార్గమును గూర్చిన అల్లరి (21-41 వ)** : ఎఫెసు తరువాత మాసి దోనియాకు, అకయకు, యెరూషలేముకు తరువాత రోముకు వెళ్లినట్లు పౌలు జీవిత చరిత్రలో చూడగలము కాని ఎఫెసులో ఉండగనే ఆత్మద్వారా ఈ ప్రయాణము అంతటిని మనస్సులో ఉద్దేశించినట్లు (21వ) గమనించగలము. 23వ వచనము తరువాత ఎఫెసు పట్టణములో ఉన్న అర్తెమిదేవి గుడి భూలోక మందంతటను ప్రసిద్ధి చెందినది అని వ్రాయ బడినది. ప్రాచీన ప్రపంచపు ఏడు వింతలలో TEMPLE OF DIANA కూడా ఒకటి. ఎఫెసు పట్టణంలోని ప్రజలు అర్తెమిదేవి వెండి గుళ్ళను అమ్మేట ద్వారా జీవనం చేయువారు. పౌలు ప్రకటన వలన ఎఫెసు పట్టణంలోని ఆసియా దేశమందంత టను

బహుజనులు క్రీస్తును ఒప్పుకొనినందున అర్తిమిదేవి గొప్పతనము తొలగిపోయి వెండిగుళ్ళ వ్యాపారము దెబ్బతిందని గ్రహించిరి. ఎఫెసీయులు తమ జీవనము దెబ్బతిందని తలంచి పట్టణంలో గొప్ప గలిబిలి చేసిరి. ఆసియా దేశాధికారులు పౌలునకు స్నేహితులైనందున ఆ గలిబిలి నుండి తప్పించిరి. పట్టణ కరణము పౌలు ఇతర సహోదరులు ఏ దోషము లేని వారని ప్రకటించి సభను ముగించెను. 34వ.లో ఎఫెసీయుల అర్తిమిదేవి మహాదేవి అని జనులు రెండు గంటల సేపు ఏక కంఠముతో కేకలు వేయుట సువార్త ప్రకటించు మనకు హెచ్చరికగా ఉన్నది. నిజదేవుని ఆరాధికులమైన మనము కొన్ని గంటలైన సువార్త ప్రకటించాలని నేర్చుకొనుచున్నాము.

## 20వ అధ్యాయము 6+6+4+2+3+3+3+4+4+3=38 వచనములు

## అంశము : మాసిదోనియ గ్రీసులలో సాక్ష్యము - ఎఫెస్సు సంఘ పెద్దలకు సేవను గూర్చిన వివరము తెలుపుట

**మాసిదోనియ గ్రీసు త్రోయలో సేవ (1-12వ)** : ఎఫెసు నుండి మాసిదోనియాకు గ్రీసుకు వెళ్ళి యూదులు తన విషయమై కుట్ర చేయుచున్నందున మాసిదోనియా మీదుగా త్రోయకు వచ్చెను. 6వ.లో మేము ఫిలిప్పును విడిచి అని ఉన్నందున ఇంతవరకు గత ఏడేండ్లగ ఫిలిప్పిలోనున్న లూకా వీరితో కలసి త్రోయకు వచ్చినట్లు చూడగలము. 7-12వ.లలో ఆదివారము రొట్టె విరిచితిమి అన్నందున ఆదివారము సంఘము రొట్టె విరువవలెనని నేర్చుకొనుచున్నాము. నెలకు ఒక్క ఆదివారమని కాని సంవత్సరమునకు ఒక్క ఆదివారము అని కానిలేనందున అ.కా. 2:42లో రొట్టె విరుచుట యందు యెడతెగక యుండిరని ఉన్నందున యెడతెగక ప్రతి సంవత్సరములోను ప్రతి నెలలోను వచ్చు ఆదివారములలో రొట్టె విరువవలెనని నేర్చుకొనుచున్నాము. ఐతుకు అనే యౌవనుడు క్రిందపడి చనిపోగా పౌలు బ్రతికించెను. ఈ రీతిగా చనిపోయిన వారు బ్రదుకుట అ.కా.లలో మూడు పర్యాయములు జరిగెనని 9వ అధ్యాయము చివరిలో తలంచితిమి. త్రోయ నుండి మిలేతుకు వచ్చెను.

**ఎఫెసు పెద్దలకు సేవను గూర్చిన ఆరు వివరములను తెలిపెను (17-38వ)** : 17-18వ.లలో మొట్ట మొదటిదిగా నడక ప్రాముఖ్యమైనదని తెలిపెను. రెండవదిగా 19-21వ.లలో సేవా విధానము తెలిపెను. దీనికి అనుబంధముగా 17:17; 5:42; 17:4, 3-4వ. గమనించవలెను. మూడవదిగా 22-24వ.లలో సేవా ఉద్దేశము. నాలుగవదిగా

25-27వ.లలో సేవలోని వర్తమానమును గూర్చి ఐదవదిగా 28-30వ.లలో సేవలోని మెలకువలను తెలిపెను. చివరిదిగా అనగా ఆరవదిగా 31-32వ సేవలోని తన మాదిరిని తెలుపుతూ 36-38వ.లలో ప్రార్థించి సాగివెళ్ళెను.

సువార్త సేవా విధానము :

1. **అ.కా. 5:42వ వచనము** : ప్రతి దినము దేవాళయము ఇంటింట మానక బోధించిరి.
2. **అ.కా. 17:17వ వచనము** : ప్రతి దినము సమాజ మందిరము, సంత వీధిలో బోధించిరి.
3. **అ.కా. 20:20వ వచనము** : బహిరంగముగాను, ఇంటింట బోధించిరి.
4. **అ.కా. 20:31వ వచనము** : రాత్రింబగళ్ళు కన్నీటిలో ప్రతి మనిషి మానక బుద్ధి చెప్పిరి.
5. **మార్కు 1:38వ వచనము** : ఇతర సమీప గ్రామములోను ప్రకటించుటకు వెళ్ళి ఇందు నిమిత్తమే ప్రభువు ఈ లోకానికి వచ్చాడు.
7. **లూకా 4:43వ వచనము** : ఇతర పట్టణములలోను ప్రకటించుటకు వెళ్ళాలి. ఇందు నిమిత్తమే ప్రభువు పంపబడ్డాడు.

**అ.కా. 17:34వ వచనము** : వాడుక చొప్పున సమాజ మందిరములో జనులను ఒప్పించుచుండిరి. పై భాగములన్ని కలిపిన 1) ప్రతి దినము, మానక, ప్రతి మనిషికి. ఇంటింట బహిరంగముగా, సంతవీధిలో, సమాజ మందిరములో, దేవాళయములో ప్రతి గ్రామము, పట్టణములలో బోధించిరి. ఇది మనకెంత మాదిరి.

## 21వ అధ్యాయము 6+10+10+10+4=40 వచనములు
## అంశము : యెరూషలేమునకు యాత్ర - బంధింపబడుట

**విభజన - తూరు - కైసరయకు వెళ్ళుట (1-16వ)** : తూరుగుండా కైసరయలోని సువార్తికుడైన ఫిలిప్పు ఇంటికి వచ్చెను. ఫిలిప్పు ఇంటిలో ప్రవచించు నలుగురు కన్యకలైన కుమార్తెలు ఉండిరి. వీరికి స్వంత కుటుంబములు లేవు. 1 కొరింథీ. 14:30. ప్రకారము స్త్రీలు సంఘములలో మౌనంగా ఉండవలెను కనుక సంఘకూడిక కానటువంటి సామాజిక కూడికలయందు. ప్రత్యేకము స్త్రీల కూడికలలో. ప్రవచించెను, ప్రత్యేకముగా యౌవనస్తుల, కూడికలలో, ప్రవచించెను. ప్రత్యేకముగా చిన్న పిల్లల కూడికలలో ప్రవచించవచ్చును.

**యెరూషలేము చేరి దేవాలయములో మ్రొక్కుబడి చెల్లించుట (17-36వ)** : రక్షించబడిన పిదప యెరూషలేమునకు ఐదవసారి చేరి అక్కడ ఉన్న యూదులు పౌలును శ్రమ పెట్టవలెనని తలంచినందున పౌలు యెరూషలేము దేవాలయమునకు వెళ్ళి, మ్రొక్కుబడి యున్న మనుష్యులతో కూడి శుద్ధి చేసుకొనెను. పౌలు యూదుడు కనుక వారి ఆచారములను జరిగించెను.

**యూదులు పౌలును చంపజూచుట - పై అధికారి బంధించుట - జనులతో మాట్లాడుటకు పౌలు సెలవు పొందుట (27-40వ)** : పౌలును చంపవలెనని పై అధికారికి తెలియగా పై అధికారి శతాధిపతితో వచ్చి పౌలును బంధించెను - జనులతో మాట్లాడ వలెనని పౌలు కోరగా పై అధికారి పౌలుకు సెలవిచ్చెను.

## 22వ అధ్యాయము 21+9=30 వచనములు
## అంశము : పౌలు యెరూషలేములో శతాధిపతులకు సహస్రాధిపతికి, జనులకు సాక్ష్యమిచ్చుట

**విభజన - పౌలు తన రక్షణ అనుభవము నుండి సాక్ష్యమిచ్చుట (1-21వ)** : పౌలు హెబ్రీ భాషలో తాను యూదుడనని గమలియేలు పాదముల యొద్ద ధర్మశాస్త్రమునందు శిక్షితుడనని తెలిపెను. దమస్కు మార్గమందు యేసుని చూచి, విశ్వాసముంచి రక్షించబడి బాప్తీస్మము పొందుట వివరించెను. ముందుగా స్తెఫను చావునకు సమ్మతించినవాడు ఇప్పుడు క్రీస్తుకు సాక్షిగా ఉన్నాని తెలిపెను.

**సౌలును చంపవలెనని కోరిన ప్రజలు - పౌలు రోమీయుడని శిక్షించక విడిచిపెట్టిన సహస్రాదిపతి (22-30వ)** : జన సమూహము పౌలును చంపివేయుమని కేకలు వేయగా సహస్రాధిపతి పౌలును కొరడాలతో కొట్టి విమర్శింప ఆజ్ఞాపించెను. పౌలు పుట్టుకతోనే రోమీయుడని సహస్రాధిపతి శిక్షింపక విడిచిపెట్టెను.

## 23వ అధ్యాయము 10+10+10+5=35 వచనములు
## అంశము : మహాసభ ఎదుట నిలిచిన పౌలు, కైసరయలోని కావలికి వెళ్ళిన పౌలు

**విభజన - మహాసభ ఎదుట పౌలు - కలహముల మధ్య కోటలోనికి కొనిపోబడుట (1-10వ)** : ఇరువది నలుగురు వివిధ విభాగముల యాజకులు, ఇరువది నలుగురు

ప్రజల పెద్దలు, ఇరువది నలుగురు శాస్త్రులు మొత్తము 70-72 మంది కలసి కూడిన మహాసభను సన్‌హెడ్రిన్ సభ అందురు. ప్రధాన యాజకుడు అధ్యక్షుడుగా నుండి మత పరమైన సమస్యలను తీర్చు ఉన్నత న్యాయస్థానము. సహస్రాధిపతి పౌలును ఈ సభ యెదుట నుంచెను. పౌలు పరిసయ్యుడు కనుక పరిసయ్యుల పక్షమునున్న శాస్త్రులు పౌలుయందు ఏ దోషము మాకు కనబడలేదు అనిరి. మొదటి వచనంలో పౌలు తాను మంచి మనస్సాక్షి కలవాడనని చెప్పుకొనుటలో మనకు ఎంతో మాదిరికలదు. సభలో కలహము ఎక్కువైనందున సహస్రాధిపతి పౌలును కోటలోనికి తీసుకొని పోయెను.

**యూదులు పౌలును చంపుటకై సిద్ధపడినందున సహస్రాధిపతి పౌలును కైసరయకు పంపుట (11-30వ)** : యూదులలో నలభైమంది కంటే ఎక్కువమంది పౌలును చంప వలెనని యోచించి మహాసభకు రేపు తీసుకొని రావలెనని అడుగుచుండిరి. అది తెలిసిన పౌలు మేనల్లుడు సహస్రాధిపతికి ఈ విషయము తెలుపగా నాలుగువందల డెబ్బైమంది సైనికులను పౌలును కాపాడుటకు నియమించి కైసరయలోని అధిపతియైన ఫేలిక్సు యొద్దకు పంపెను.

**పౌలు కైసరయలోని కావలిలో ఉంచబడుట (21-35వ)** : నేరము మోపువారు వచ్చు వరకు కైసరయలోని కావలిలో ఉంచవలెనని ఫేలిక్సు ఆజ్ఞాపించెను.

## 24వ అధ్యాయము 9+12+6=27 వచనములు
## అంశము : పౌలు అధిపతియైన ఫేలిక్సుకు అతని భార్యయైన ద్రుసిల్లకు సాక్ష్యమిచ్చుట

**యూదులు పౌలు మీద ఫేలిక్సు ఎదుట నేరము మోపుట (1-9వ)** : యెరూషలేము నుండి ప్రధాన యాజకుడు, పెద్దలు ఒక్క న్యాయవాది కైసరయకు వచ్చి పౌలుపై మత భేదమునకు నాయకుడని నేరము మోపిరి.

**ఫేలిక్సు సెలవుతో పౌలు జవాబు ఇచ్చుట (10-21వ)** : పౌలు తన విశ్వాసమును వివరించి తెలిపి తనయందు ఏ నేరము లేదని వివరించి తెలిపెను.

**పౌలు ఫేలిక్సుకు సువార్తను అందించుట (22-27వ)** : కైసరయలోని కావలిలో రెండు సంవత్సరములు ఉండుట. పౌలు విడిగా కావలిలో ఉండి ఫేలిక్సు కోరికపై తేటగా సువార్త అందించెను. పౌలు వలన ద్రవ్యము దొరుకునని ఫేలిక్సు ఆశించెను. కాని ద్రవ్యము దొరకనందున రెండు సంవత్సరముల తరువాత పౌలును బంధకముల లోనే విడిచి వెళ్ళెను.

## 25వ అధ్యాయము 5+7+10+5=27 వచనములు
## అంశము : అధిపతియైన ఫేస్తు ఎదుట నిలిచిన పౌలు

**యెరూషలేములోని యూదుల ఫిర్యాదుకు పౌలు అధిపతియైన ఫేస్తుకు ఇచ్చిన జవాబు (1-12వ)** : 1-5వ ఫేస్తు యెరూషలేమునకు రాగా యూదులు తమ ఫిర్యాదులను ఫేస్తునకు తెలిపి యెరూషలేమునకు పౌలును పిలిపించి విచారించవలెనని కోరిరి. ఆలాగు యెరూషలేమునకు వచ్చు సమయములో పౌలును చంపవలెనని కోరిరి. 6-12వ. ఫేస్తు కైసరయలో న్యాయపీఠము మీద కూర్చుండి యూదులు మోపిన నేరములను విచారించెను కాని అవి ఋజువు కాలేదు. ఫేస్తు పౌలుతో యెరూషలేములో విచారించబడుట నీకిష్టమా అని అడుగగా పౌలు రోములోని కైసరయ ఎదుట చెప్పుకొందును అనెను.

**అధిపతియైన ఫేస్తు అగ్రిప్ప రాజులు కలసి పౌలు విషయమై ఆలోచించిరి (13-27వ):** అధికారియైన ఫేస్తు అగ్రిప్పరాజుతో పౌలు విషయమై వివరించి మరునాడు అధికార మందిరములో పౌలును పిలిపించి విచారించుటకు ఏర్పాటు చేసాడు.

## 26వ అధ్యాయము 23+6+3=32 వచనములు
## అంశము : రాజైన అగ్రిప్ప ఎదుట అధిపతియైన ఫేస్తు ఎదుట సాక్ష్యమిచ్చిన పౌలు

**విభజన - అగ్రిప్ప ఎదుట, ఫేస్తు ఎదుట పౌలు సాక్ష్యము (1-28వ)** : 22వ అధ్యాయములో తన జీవిత ప్రారంభము నుండి కలిగిన మతాసక్తిని, రక్షించబడిన విధము, సేవ చేసే విధము వివరించినట్లు, రాజైన అగ్రిప్ప ఎదుట అధిపతియైన ఫేస్తు ఎదుట పౌలు సాక్ష్యమిచ్చెను. 24-29వ.లలో ఫేస్తు అగ్రిప్పలు పౌలుతో మాట్లాడగా వారిద్దరు కూడా పౌలువలె క్రీస్తునందు ఉండవలెనన్న తన ఉద్దేశము పౌలు తెలిపెను.

**నిర్దోషి అయిన పౌలు (30-32వ)** : పౌలు మరణశిక్ష కొరకైనను, బంధకములకైనను తగిన నేరమేమియు చేయలేదని వారు గ్రహించి విడుదల చేయవలెనని తలంచిరి కాని రోమాలోని చక్రవర్తి ఎదుట నిలుచుదునని చెప్పినందున రోమాకు పంపుటకు తీర్మానము చేసిరి.

## 27వ అధ్యాయము 8+12+12+12=44 వచనములు
## అంశము : రోముకు ప్రయాణము - ప్రయాణములోని ఆపదలు

**ప్రయాణ వివములు (1-8)** : పౌలు ఇతర ఖైదీలతో కలసి శతాధిపతి కాపలా క్రింద ఓడలో ఇటలీకి పంపబడెను. మార్గమందు గాలి ఎదురై బహు కష్టముగా మంచి రేవులు అను స్థలమునకు చేరిరి.

**ప్రయాణములోని ఆపదలు - ధైర్యపరచిన ప్రభువు (9-26వ)** : ప్రయాణములో గాలి ఎదురైనందున ఓడ నడిపించుట చేతకాక కొట్టుకొని పోనిచ్చిరి. పెద్ద గాలి కొట్టుచున్నందున సరుకులు సముద్రములో పడవేసి ప్రాణములతో తప్పించుకొందుమను ఆశలేకపోయెను. కాని రాత్రివేళ ప్రభువు ధైర్యపరచగా పౌలు ప్రయాణికులను ధైర్యపరచెను.

**మెలితే ద్వీపమున ఓడ చిక్కుకొని పోవుట - ప్రయాణికులందరు క్షేమముగా దిగుట (27-44వ)** : 27-35వ. వరకు ఓడలోని ప్రయాణికులను ధైర్యపరచి ఆహారము పుచ్చుకొనుమని వేడుకొనెను. 36-44. వారు ఆహారము పుచ్చుకొనిన తరువాత ఉదయమైనపుడు ఒక ద్వీపము దగ్గర ఓడ చిక్కుకొని పోగా ఓడలోని 276 మంది సురక్షితముగ ఒడ్డుకు చేరిరి.

## 28వ అధ్యాయము 10+6+7+8 = 31 వచనములు
## అంశము : రోములోని చెరలో రెండేండ్లు గడిపిన పౌలు

**విభజన - మెలితే నుండి రోమా చేరుట (1-16వ)** : మెలితే ద్వీపములో మూడు నెలలు గడిపిరి. పౌలు ప్రార్థన ద్వారా జరిగిన స్వస్థతలను బట్టి ద్వీపములోని ముఖ్యుడు వారిని క్షేమంగా సాగనంపిరి. 11-16వ.లలో ఆయా ఓడరేవుల గుండా సాగివెళ్ళి రోమాకు వచ్చి తనకు కావలి ఉన్న సైనికులతో ప్రత్యేకముగా ఉండుటకై సెలవు పొందెను.

**రోమాలోని చెరలో రెండేండ్ల సాక్ష్యము (17-38వ)** : పౌలు రోములోనుండగా తనపై ఫిర్యాదులు రాలేదు. రెండు సంవత్సరములు సైనికులతో కూడా ప్రత్యేకముగా ఉన్న ఇంటికి అద్దె చెల్లించి తన యొద్దకు వచ్చువారందరికి సువార్త ప్రకటించెను. ఫిలిప్పీ 1:13ను బట్టి ప్రేతోర్యమను సేనలో 16 వేల మంది సైనికులకు సువార్త ప్రకటించెనని నేర్చుకొనుచున్నాము. ఫిలిప్పీ 4:27 ప్రకారము కైసరయ ఇంటిలోని వారు కూడా సువార్త విని రక్షించబడెనని తెలుసుకొనుచున్నాము.

# రోమీయులకు వ్రాసిన పత్రిక

గ్రంథకర్త : పౌలు (1:1),కాలము : క్రీ.శ. 57 (1:13), స్థలము : కొరింథు (16:23), కొనిపోయినవారు : ఫీబే (16:1) లేఖికుడు తెర్తి 16:22

**ముఖ్య ఉద్దేశ్యము** : సువార్త దేవుని నీతి - విశ్వాసము ద్వారా నీతిమంతులుగా తీర్చబడుట. నీతిమంతులుగా జీవించుట (1:17)

**రోమా పట్టణ చరిత్ర** : రోమా పట్టణము టైబర్ నది ముఖ ద్వారమునకు 15 మైళ్ళ దూరమున గల పట్టణము. క్రీ.పూ. 753 రోములస్ అను నాయకునిచే ఒక కొండపై చిన్న కోటగా కట్టబడి క్రమేపి ఏడు కొండలపై వ్యాపించిన పట్టణము. మొదటి నుండి రోమా రాజ్యమునకు అది ముఖ్య పట్టణమై క్రీ.పూ. 31 నుండి క్రీ.శ. 476 వరకు ప్రపంచమును పాలించిన 6వ రాజ్యముగానుండినది. పడమటి రోమా రాజ్యం క్రీ.శ. 476లో పతనం కాగా అందులో నుండి మతపరమైన పోపుల రోమా రాజ్యము పుట్టి నేటికి కొనసాగుచున్నది. పట్టణములోని ఏడు కొండల పేర్లు 1. కాపిటోలిన్, 2. క్విరినల్, 3. విమినల్, 4. ఎస్కివలిన్, 5. కయోలిన్, 6. అవింటన్, 7. పాలటన్.

పౌలు రోములోని చక్రవర్తి యొక్క మమర్తినను చెరసాలలో రెండేండ్లు క్రీ.శ. 61-62 వరకు ఉండి కొంతకాలము (క్రీ.శ. 63-64) విడిచిపెట్టబడి రెండవమారు రోములోని చెరలో (క్రీ.శ. 65-66 వరకు) నుండి క్రీ.శ. 67లో నీరో చక్రవర్తిచే శిరచ్ఛేదన చేయబడెను. పేతురు కూడా అదే చెరసాలలో 9 నెలలుండి తలక్రిందులుగా సిలువ వేయబడి చనిపోయెను. రోమాలో పేతురు సమాధిపై ప్రసిద్ధమైన భవనముగా ఒక దేవాలయము కట్టబడెను.

**రోమా సంఘస్థాపన** : పౌలు రోమా పట్టణమునకు వెళ్ళవలెనని ఆశించెను. కానీ క్రీ.శ. 57లో ఈ పత్రిక వ్రాయు వరకు అక్కడికి వెళ్ళలేదు. పెంతెకోస్తు దినమున క్రీ.శ. 30లో సువార్త విని నమ్మిన వారిలో అ.కా. 2:10 ప్రకారము రోమా నుండి పరవాసులుగా వచ్చిన వారు కలరు. వీరు తదుపరి రోమాకు వెళ్ళినపుడు సువార్తను అక్కడ ప్రకటింపగా అనేకులు నమ్మి సంఘముగా ఏర్పడినట్లు తలంచగలము.

2 కొరింథీ. 9:2-5 వచనాలలో అకయవారు యెరూషలేములోని పేదలకు కొంత సొమ్ము ఇవ్వవలెనని చెప్పాడు. రోమా 15:26లో అకయ వారిచ్చిరని ఆ సొమ్ము తీసుకొని

యెరూషలేముకు వెళ్ళుచున్నట్లు చెప్పినందున రెండవ కొరింథు పత్రిక తరువాత రోమీయులకు క్రీ.శ. 57లో పత్రిక వ్రాసాడు. రోమా 16:23లో గాయియు ఇంటిలోనున్నాను అన్నాడు. గాయియు 1 కొరింథీ. 1:15వ. ప్రకారము కొరింథు వాడైనందున ఈ పత్రికను పౌలు కొరింథులో నుండి వ్రాసాడని నిర్ణయించగలము.

రోమా పత్రిక 1:17లోనున్న "నీతిమంతుడు విశ్వాస మూలమున జీవించునన్న వాక్యము సంఘ సంస్కరణ కర్తలైన మార్టిన్ లూథర్‌ను, జాన్‌వెస్లీని, జాన్ కెల్విన్‌ను, రక్షణ అనుభవమునకు ఉజ్జీవమునకు నడిపించినది. ఈ పత్రిక చదువు మనము కూడా ఒక ఉజ్జీవమును దేవుడు మనలో జరిగించుటకు సిద్ధముగా నుండవలెను". నీతిమంతుడు విశ్వాస మూలమున జీవించునన్న వాక్య ఆధారముగా గ్రంథ విభజన 1. విశ్వాస మూలమున నీతిమంతుడుగా తీర్చబడుట 1-8 అధ్యా. 2. నీతిమంతుడుగా జీవించుట సేవించుట 9-16 అధ్యా.

## అధ్యాయాల విభజన 5+3+3+5 = 16 అధ్యా.

I. ఎ) పాపము 1:1 - 3:8 (69వ.)

బి) పరిహారము 3:9-5:21 (69వ.) 1-5 అధ్యా.

II. 1. పరిశుద్ధత (87వ.) 6-8 అధ్యా.

III. ప్రభువు - తన ప్రజలు (90వ.) 9-11 అధ్యా.

IV. పరిచర్య (91+27వ.) (118వ) 12-16 అధ్యా.

**I. పాపము - పరిహారము (1-5,6) : (దీనిని వివరణ 18వ భాగములో కలదు)**

1. **1 అధ్యాయము** : అన్యుల పాపము - ఫలితము.

2. **2 అధ్యాయము** : యూదుల పాపము - ఫలితము.

3. **3 అధ్యాయము** : యూదులు అన్యులు అందరు పాపులై దేవుడను గ్రహించు విమోచనము ద్వారా నీతిమంతులగుట.

4. **4 అధ్యాయము** : విశ్వాసము ద్వారా నీతిమంతులగుటను గూర్చి ప్రవక్తలు ధర్మ శాస్త్రము ఇచ్చిన సాక్ష్యము.

5. **5 అధ్యాయము** : క్రీస్తునందలి విశ్వాసము ద్వారా కలిగిన ఫలము.

**II. పరిశుద్ధత (6-8) :**

**6. 6వ అధ్యాయము :** పాపము విషయమై మృతులుగా ఎంచుకొనుట. దేవునికి దాసులైనందున పరిశుద్ధతను ఫలముగా కలిగియుండుట.

**7. 7వ అధ్యాయము :** ధర్మశాస్త్రము - పరిశుద్ధ జీవితముకైన పోరాటము.

**8. 8వ అధ్యాయము :** పరిశుద్ధాత్మ శక్తి ద్వారా పరిశుద్ధ జీవితము.

**III. ప్రభువు - తన ప్రజలు (9-11 అధ్యా.) :**

**9. 9వ అధ్యాయము :** ఇశ్రాయేలీయుల మధ్యగతకాల పరిచర్య.

**10. 10వ అధ్యాయము :** ఇశ్రాయేలీయుల మధ్య ప్రస్తుత కాల పరిచర్య.

**11. 11వ అధ్యాయము :** ఇశ్రాయేలీయుల మధ్య అంత్య కాల పరిచర్య.

**IV. పరిచర్య (12-16 అధ్యా.) :**

**12. 12వ అధ్యాయము : పరిచర్య వివరములు.**

**13. 13వ అధ్యాయము :** పరిచర్య వివరములు.

**14. 14వ అధ్యాయము :** బలహీనుల పట్ల పరిచర్య.

**15. 15వ అధ్యాయము :** బలహీనులను చేర్చుకొను పరిచర్య - ప్రకటించు పరిచర్య పేదలపట్ల పరిచర్య.

**16. 16వ అధ్యాయము :** వివిధ పరిచర్యలు - పరిచారకులైన జత పనివారు - వందనములు.

## 1వ అధ్యాయము 8+8+6+8 = 32 వచనములు
## అంశము : అన్యుల పాపము (1:22,23) - ఫలితము (1:32)

1. **శుభములు - పత్రిక సారాంశము - స్తుతి (1-8వ) :** ఎ) పరిశుద్ధులుగా ఉండుటకు పిలువబడినవారు  అనగా పాపపరిహారము పొందుట (1-5 అధ్యా.)

2. **పరిశుద్ధులుగా జీవించుట 6-8 అధ్యాయములు :**

3,4. బి) యేసుక్రీస్తు దాసుడుగా ఉండుటకు **పిలువబడినవారు** అనగా యేసు క్రీస్తు పరిచర్య చేయుచూ జీవించుట (9-16 అధ్యా.)

యేసుక్రీస్తు వారుగా ఉండుటకు **పిలువబడినవారు** 9-16 అధ్యా.)

పౌలు పరిచయములోనే తాను సువార్త నిమిత్తము ప్రత్యేకించబడిన క్రీస్తు దాసుడనని ఈ పత్రిక చివరలోనున్న "పరిచర్య" చేయువాడనని పరిచయము చేసుకొనుచున్నాడు. సువార్త 1. దేవునిచే వాగ్దానము చేయబడినది, 2. ముందుగా పరిశుద్ధ లేఖనములలో ప్రవక్తల ద్వారా చెప్పబడినది, 3. మృతి పొంది తిరిగి లేచిన క్రీస్తునందు సమస్త జనులు విశ్వాసముంచుటకు నడిపించుటయే సువార్త పరిచర్య ఉద్దేశము. రోమాలో ఉన్న పరిశుద్ధులును, పరిశుద్ధులుగా ఉండుటకు (6-8 అధ్యా.) పిలువబడినవారని జ్ఞాపకము చేయుచున్నాడు.

8వ వచనములో రోమీయుల విశ్వాసము సర్వలోకములో ప్రచురింపబడు చున్నందున స్తుతించుచున్నాడు.

**పౌలు ప్రార్థన 11-13వ అపేక్ష - 14-15వ సంసిద్ధత - 16-17వ బాధ్యత (9-17వ)** :

**పౌలు స్తుతి - ప్రార్థన (9-10వ)** : రోమాలోని పరిశుద్ధుల విశ్వాసము సర్వలోకములో ప్రచురము చేయబడుటను బట్టి దేవుని స్తుతించుచూ వారిని చూచుటకు సమయము దయ చేయువలెనని ఎల్లప్పుడు ఎడతెగక ప్రార్థించుచున్నాడు. నేటి విశ్వాసులకు ఇది ఎంతో మాదిరిగానున్నది.

**పౌలు అపేక్ష (11-13)** : పౌలు ఇంతవరకు రోమాకు వెళ్ళలేదని చూచితిమి. పౌలు అక్కడకు వెళ్ళి రోమీయులను 1. స్థిరపరచవలెనని, వారి ద్వారా తాను, తన ద్వారా వారు 2 ఆదరించబడవలెనని, లేని వారికి 3. ఆత్మ సంబంధమైన వరమేదైనా ఇవ్వవలెనని 4. రోమీయులలో కూడా సువార్త ప్రకటించి ఆత్మల ఫలము పొందవలెనని అపేక్షించు చున్నాడు. ప్రతి విశ్వాసి సువార్తికుడు ఇటువంటి అపేక్ష కలవాడుగానుండాలి.

**సంసిద్ధత (14-15వ)** : అన్ని జాతుల వారికీ, అన్ని రకములైన స్థితి గతులలోనున్న వారికి సువార్త ప్రకటించుటకు పౌలువలె మనమును సిద్ధముగానుండాలి. సువార్త ప్రకటించుట మనకున్న ఋణమును తీర్చుట.

**బాధ్యత (16-17వ)** : సువార్తను గూర్చి 1. సిగ్గుపడకూడదు, 2. సువార్తలో దేవుని శక్తి యున్నది. 3. సువార్తను విశ్వసించుట ద్వారా దేవుని నీతి బయలు పరచబడును.

అనగా సువార్తయందలి విశ్వాసము మానవులను నీతిమంతులుగా తీర్చి ఆలాగు జీవించుటకు సహాయము చేయును. ఇది పత్రిక మూలాంశము.

**దేవుని లక్షణములు - అన్యుల లక్షణములు (18-23వ) :**

**దేవుని లక్షణములు (18-20)** : 1. దేవుడు నిత్య శక్తిగలవాడు, 2. దేవుని దైవత్వము సృజించబడిన వస్తువులను ఆలోచించుట వలన తేట పరచబడును, 3. సత్యమును అడ్డగించు మనుష్యుల మీద ఆయన కోపము బయలు పరచబడును.

**అన్యుల పాపములు (21-23వ)** : 21-23వ అన్యుల పాపములు చెప్పబడినది. 1. దేవునిని ఎరిగి మహిమ పరచకుండుట, 2. కృతజ్ఞతా స్తుతులు చెల్లింపకుండుట, 3.అవివేక హృదయము కలిగియుండుట, జ్ఞానులమని చెప్పుకొనుచు బుద్ధిహీనులుగా నుండుట, 4. అక్షయుడగు దేవుని మహిమను క్షయమగు మనుష్యుల యొక్కయు, పక్షుల యొక్కయు, జంతువుల యొక్కయు పురుగుల యొక్కయు ప్రతిమా స్వరూపము లుగా మార్చుట.

**అన్యుల పాపముల వివరము - ఫలితముగా రెండవ మరణము (24-32వ) :**

**1. 24-25 వచనము** : దేవుని సత్యమును అసత్యమునకు మార్చి సృష్టికర్తకు బదులు సృష్టిని పూజించి సేవించినందున వారి హృదయ దురాశలు అనుసరించుటకు దేవుడు వారిని అపవిత్రతకు అప్పగించాడు.

2. **26-27 వచనము** : స్త్రీలు, పురుషులు స్వాభావిక ధర్మమును విడిచి పురుషులతో పురుషులు, స్త్రీలతో స్త్రీలు అవాచ్యమైనది చేయుచు కామ తప్తులైనందున దేవుడు తుచ్ఛమైన అభిలాషలకు వారిని అప్పగించాడు.

**3. 28 వచనము : దేవునికి మనసులో చోటివ్వని కారణమున దేవుడు** చేయరాని కార్యములు చేయుటకు భ్రష్టమైన మనస్సుకు వారిని అప్పగించాడు.

4. **29-31 వచనము** : పైన వచనములలో అన్యుల యొక్క విగ్రహారాధన చెప్పబడినది. ఈ మూడు వచనములలో 21 పాపములు చెప్పబడినవి.

**32 వచనము** : దేవుని న్యాయవిధిని బట్టి ఇట్టి అన్యులు రెండవ మరణమైన అగ్నిగుండము/నరకమునకు పాత్రులు.

## 2వ అధ్యాయము 4+6+6+7+6 =29 వచనములు
## అంశము : యూదుల పాపము (2:1) - పాపము ఫలితము (2:5)

**యూదుల పాపములు (అన్యులతోపాటు యూదులును పాపులే) (1-4వ)** : 1. తీర్పు తీర్చకుడి అని మత్తయి 7:1లో ఉన్నను యూదులు అందరికి తీర్పు తీర్చకుడి అను ఆజ్ఞను అతిక్రమించుటయే పాపము. 2. ఎదుటి వారికి తీర్పు తీర్చుచు వాటిని జరిగించుట పాపము. 3. సత్యమును అనుసరించి దేవుడు తీర్పు తీర్చును. 4. దేవుడు మారు మనస్సు పొందునట్లు ప్రేరేపించినను విధేయత చూపకపోవుట పాపము చేయుటయే.

**పాప ఫలితములు (5-10వ)** : 6వ. హృదయ కాఠిన్యము కలిగి మారు మనస్సు పొందని వారి పై దేవుడు తన ఉగ్రతను కనుపరచు తీర్పు దినమందు దేవుని ఉగ్రతను కుమ్మరించును. 7వ. సత్ క్రియలు చేయు యూదునికి, అన్యులకు తమ క్రియలను బట్టి నిత్యజీవమను ఫలమిచ్చును. 8-9వ సత్యమునకు లోబడక దుర్నీతికి లోబడు యూదులకైనను, గ్రీసు దేశస్థులకైనను శ్రమలు వేదనలు కలుగును.

**ధర్మశాస్త్రము కలవారు లేనివారు అందరును పాపులై తీర్పు పొందుదురు (11-16వ.)**: ధర్మశాస్త్రము లేని అన్యులు తమ మనస్సాక్షి వారి తలంపుల విషయము చేయు తీర్పును బట్టి తమ హృదయములలో ధర్మ శాస్త్రము వ్రాయబడినట్టున్నారు. కావున, ధర్మశాస్త్రము లేక పాపము చేసినవారును ధర్మశాస్త్రము లేకయే నశించుదురు. ధర్మశాస్త్రము కలిగి పాపము చేసినవారు ధర్మ శాస్త్రమును బట్టి తీర్పు తీర్చబడి శిక్ష పొందుదురు. ఇవన్నియు దేవుడు మానవులను విమర్శ చేయు దినమున జరుగును.

**ధర్మ శాస్త్రమును అనుసరించియు నెరవేర్చలేకపోవుట అను పాపము (17-23)** : యూదులు ధర్మశాస్త్రము కలవారు, ఎరిగినవారు, ఉపదేశము పొందినవారు, ఉపదేశించు వారైనను ధర్మశాస్త్రమును మీరి నెరవేర్చ లేకపోవుట ద్వారా పాపులని తీర్చబడుచున్నారు.

**నిజమైన సున్నతి - శరీర సంబంధమైన సున్నతి ద్వారా నీతిమంతులు కాకపోవుట (24-29)** : శరీరమందు బాహ్యమైన సున్నతి సున్నతి కాదు. బాహ్యమునకు యూదుడు యూదుడు కాడు. అంతరంగమందు ఆత్మయందు జరుగు హృదయ సంబంధమైన సున్నతియే నిజమైనసున్నతి. కొలొస్స. 2:11 ప్రకారము, శరీరేచ్ఛలతో కూడిన స్వభావమును విసర్జించుటయే చేతులతో చేయబడని క్రీస్తు సున్నతి. ఈ సున్నతిని క్రీస్తును అంగీకరించిన వారందరు పొందిరి అని వ్రాయబడినది.

# 3వ అధ్యాయము 8+12+11 = 31 వచనములు

## అంశము : అన్యులు యూదులు అందరు పాపులై దేవుడనుగ్రహించు మహిమను పొందలేక పోవుట (3:9-3:23) - క్రీస్తునందలి విమోచనము ద్వారా నీతిమంతులగుట (3:24-31)

ఈ భాగమందు యూదులను గూర్చిన నాలుగు జవాబులతో కూడి ప్రశ్నలు కలవు (1-8వ) :

**1. యూదులకు కలిగిన గొప్పతనమేమి? సున్నతి వలన ప్రయోజనమేమి?**

జ॥ దేవోక్తులు యూదుల పరము చేయబడినవి. ఇది యూదుల ఆధిక్యతయే.

**2. కొందరు అవిశ్వాసులైన నేమి. వారు అవిశ్వాసులైనందున దేవుడు నమ్మతగినవాడు కాకపోవునా?**

జ॥ దేవుడు సత్యవంతుడు నమ్మదగినవాడు కాని ఎన్నడును అబద్ధికుడు కాడు.

**3. మన దుర్నీతి దేవుని నీతికి ప్రసిద్ధి కలుగ చేసిన యెడల ఏమందుము? ఉగ్రతను చూపించు దేవుడు అన్యాయస్తుడగునా?**

జ॥ దేవుడు అన్యాయస్తుడైన యెడల లోకమునకు తీర్పు తీర్చు నీతి గల న్యాయాధిపతి ఎట్లు కాగలడు.

**4. మన అసత్యము వలన దేవుని సత్యము ప్రబలమైన మనము పాపులమైనట్లు తీర్పు పొందనేల?**

జ॥ కీడు ముందుగా జరిగిన పిదప మేలు కలుగును అని కొందరు చెప్పినట్లు యూదులు చెప్పిన యెడల దేవుడు వారికి శిక్షా విధి కలుగ చేయుట న్యాయమే.

**అందరు పాపులు (9వ.) (9-20వ.)** : స్వభావమును బట్టి (10-12వ.) సంభాషణను బట్టి (13-14వ) ప్రవర్తనను బట్టి (15-18వ.) - యూదులు అన్యులు అందరు పాపులు శిక్షకు పాత్రులు (19-20వ.)

9వ. యూదులు అన్యులు ఏ మాత్రము ఒకరికి ఒకరు తీసిపోక అందరు పాపులై యున్నారని ముందుగా తేల్చబడినది.

**ఎ) 10-12వ స్వభావమును బట్టి అందరు పాపులు** : 1) దేవుని వెదకరు, 2) దేవుని గ్రహించరు, 3) త్రోవ తప్పుదురు, 4) పనికి మాలిన వారు, 5) మేలు చేయరు. కీర్తనలు 14:2 ప్రకారము బుద్ధిహీనులైరి,

**బి) సంభాషణను బట్టి అందరు పాపులు (13-14వ.)** : నోరు, పెదవులు, నాలుక, గొంతుక, పాపముచే నిండియున్నది. కీర్తన 5:9, 10:7, 140:3 ప్రకారము **అపరాధులును దుష్టులును** అయిరి.

**సి) ప్రవర్తనను బట్టి అందరు పాపులు (15-18వ.)** : రక్తము చిందించుటకు పరుగెత్తు పాదములు కలవారై యెషయా 59:7 ప్రకారము **పాపులైరి.**

18వ. వారి కన్నుల యెదుట దేవుని భయము లేక కీర్తనలు 36:1 ప్రకారము **భక్తిహీనులైరి.**

అంధరు 1. బుద్ధిహీనులు, 2. అపరాధులు, 3. దుష్టులు, 4. పాపులు, 5. భక్తిహీనులు.

**యూదులు అన్యులు అందరు పాపులై శిక్షకు పాత్రులు (19-20 వ.)** : ధర్మశాస్త్రము పాపమును చూపించినది కాని పాపిని నీతిమంతుడుగా తీర్చలేదు. అందుచే అందరు **పాపులై** నిరుత్తరులుగా శిక్షకు పాత్రులైయున్నారు.

**ధర్మశాస్త్రమునకు వేరుగా** బయలు పరచబడిన **దేవుని నీతి** - ధర్మశాస్త్రము, ప్రవక్తలు **సాక్ష్యమిచ్చుట (21-22 వ.)** : ధర్మశాస్త్రమునకు వేరుగా క్రీస్తు యేసునందలి విశ్వాస మూలమున నమ్ము హారందరికిని నీతి కలుగుచున్నది. దీనిని గూర్చి ధర్మశాస్త్రము ప్రవక్తలు పాతనిబంధన గ్రంథమందు సాక్ష్యమిచ్చిరి. (సాక్ష్య వివరము 4వ అధ్యాయములో గలదు)

**అందరు పాపులు - నమ్మువారు నీతిమంతులు (23-24 వ.)** : 1:23లో విగ్రహారాధన ద్వారా అన్యులు పాపులు, 2:23లో ధర్మశాస్త్రము మీరుట వలన యూదులలో 3:9-20 వచనాలలో వివరించినట్లు అందరు పాపులై దేవుడనుగ్రహించు మహిమను పొందలేకపోవు చున్నారు.

**నమ్మువారు నీతిమంతులగుట (24వ.)** : క్రీస్తు యేసు సిలువలో చేసిన విమోచనను నమ్మువారు క్రీస్తును చేర్చుకొను వారు కృపచేత అనగా ఉచితముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు.

**సిలువ రక్తమందలి విశ్వాసము ద్వారా నీతిమంతులగుట (25-26వ.)** : నీతిమంతుడైన దేవుడు మానవుల పూర్వపు పాపములను క్షమించి, క్రీస్తు కల్వరిలో

కార్చిన రక్తమందు విశ్వాసముంచు వారిని నీతిమంతులుగా తీర్చుచున్నాడు. రోమా 10:9-10లోనున్నట్లు హృదయములో విశ్వాస ముంచినవారు నోటితో ఒప్పుకొనాలి. విశ్వసించుట ద్వారా నీతి, ఒప్పుకొనుట ద్వారా రక్షణ కలుగును.

**యూదులు, అన్యులు, విశ్వాసము ద్వారానే నీతిమంతులగుట (27-29 వ.)** : యూదులైనను, అన్యులైనను అని ఎంచ వీలు లేదు. ఎందుకనగా క్రియలను బట్టి కాక విశ్వాసమును బట్టియే అందరు నీతిమంతులుగా తీర్చబడుచున్నారు.

**విశ్వాసము ధర్మ శాస్త్రమును నిరర్థకము చేయక స్థిరపరచును (30-31వ.)** : సున్నతి గల యూదులు ధర్మ శాస్త్రము సాక్ష్యమిచ్చిన విశ్వాస మూలమునను, సున్నతి లేని అన్యులు తాము వినిన విశ్వాసము ద్వారాను నీతిమంతులుగా తీర్చబడుచున్నందున ధర్మశాస్త్రము నిరర్థకము కాక స్థిరపరచబడినది.

## 4వ అధ్యాయము 4+4+4+6+7 =25 వచనములు
## అంశము : విశ్వాసము ద్వారా నీతిమంతులగుటను గూర్చి 3:21 ప్రకారము ప్రవక్తలు, ధర్మశాస్త్రము ఇచ్చిన సాక్ష్యము

**ప్రవక్తల సాక్ష్యము (1-'వ)** : అబ్రాహాము ధర్మశాస్త్రము అనుగ్రహింపబడక ముందటి వాడు. దావీదు ధర్మశాస్త్రమను గ్రహించబడిన తరువాతనున్నవాడు.

**అబ్రాహాము సాక్ష్యము (1-4వ.)** : 1-3వ. అబ్రాహాము ప్రవక్త అని ఆది. 20:7లో పిలువబడ్డాడు. అబ్రాహామును యూదులు తండ్రియని పిలిచి (యోహాను 8:53) గొప్ప వాడుగా మూల పురుషుడుగా ఎంచిరి. అబ్రహాము ధర్మశాస్త్రము అనుగ్రహింప బడని కాలమునాటి వాడైనను క్రియలను బట్టి కాక విశ్వాసము ద్వారానే నీతిమంతుడుగా తీర్చబడెను. "అబ్రహాము దేవుని నమ్మెను. అది అతనికి నీతిగా ఎంచబడెను". ఆది. 15:6.

4వ. "పని చేయువానికి జీతము ఋణమే" క్రియల మూలమున నీతిమంతులుగా తీర్చబడితే అది జీతమగును దానము కాదు.

**దావీదు యిచ్చిన సాక్ష్యము (5-8వ)** : రక్షణ దానమైనందున క్రియల మూలముగా కాక భక్తిహీనుడు విశ్వాసము ద్వారానే నీతిమంతుడని తీర్చబడును. కీర్త. 30:1లో దావీదు "తన అతిక్రమమునకు పరిహారము నొందినవాడు తన పాపమునకు ప్రాయశ్చిత్తము నొందినవాడు ధన్యుడని చెప్పాడు.

**బి) ధర్మశాస్త్రము యిచ్చిన సాక్ష్యము (9-25వ.) :**

**సున్నతి లేనపుడు విశ్వాసము ద్వారా అబ్రహాము నీతిమంతుడని తీర్చబడెను (9-12వ.):** ధర్మశాస్త్ర ప్రకారము యూదులు సున్నతి ఆచరించాలి. దేవుడు ఆది. 17:10-14లో సున్నతిని గూర్చిన ఆజ్ఞ ఇచ్చాడు. అబ్రహాము ఆది. 17:23లో సున్నతి పొందాడు. కాని ఆది. 15:6లోనే అబ్రహామును దేవుడు నీతిమంతుడని తీర్చాడు. కాబట్టి అబ్రహాము సున్నతి పొందక మునుపే సున్నతిని గూర్చిన ఆజ్ఞ ఇవ్వకముందే దేవుడు అబ్రహామును విశ్వాసము ద్వారా నీతిమంతుడుగా తీర్చి విశ్వాసులందరికి తండ్రిగా నియమించినందున మనుష్యులు సున్నతి ద్వారా కాని దుర్నీతి క్రియల ద్వారా కాక విశ్వాసము.ద్వారానే నీతిమంతులగుదురని ధర్మశాస్త్రము సాక్ష్యమిచ్చుచున్నది.

**ధర్మశాస్త్రమును బట్టి కాక విశ్వాసము ద్వారానే అబ్రహాముకు వాగ్దానము కలుగుట (13-18వ.)** : "నీవు అనేక జనములకు తండ్రివగుదువు" అను వాగ్దానమును ఆది. 17:4లో దేవుడు అబ్రహామునకు ధర్మశాస్త్ర మూలమున కాక విశ్వాసము ద్వారానే అబ్రహాము నూరేండ్లవాడై శరీరము మృతతుల్యమైనపుడు అనుగ్రహించాడు.

**విశ్వాసమును బట్టియే అబ్రహామునకు జీవితకాలములో దేవుడిచ్చిన వాగ్ధానములు నెరవేర్చబడుట (19-25వ.)** : 19-21వ. అబ్రహాము నూరేండ్లవాడు శారా 90 ఏండ్లగలదై వారి శరీరములు మృత తుల్యముగానుండెను. శారాకు స్త్రీ ధర్మము నిలిచి గర్భము మూయబడినను విశ్వాసమును బట్టి అబ్రహాము సందేహించలేదు. వాగ్దానము చేసిన దానిని దేవుడు నెరవేర్చుటకు సమర్థుడని విశ్వసించి బలము పొందెను. దేవుడు తన వాగ్ధానమును నెరవేర్చి మృతమైన శరీరముల నుండి వారికి విశ్వాసమును బట్టియే కుమారుని అనుగ్ర హించాడు. 22-25వ. సారాంశముగా అబ్రాహాముకు మాత్రమే కాక క్రీస్తునందు ఆయనను మృతులలో నుండి లేపిన దేవునియందు విశ్వాసముంచు మనకును దేవుని వాగ్ధానములు నెరవేరును. క్రీస్తు మన అపరాధములను క్షమించుటకై మృతిపొంది విశ్వాసము ద్వారా మనలను నీతిమంతులుగా తీర్చుటకే వాగ్ధానములను నెరవేర్చుటకే లేపబడెనని గ్రహించుచున్నాము.

## 5వ అధ్యాయము 11+10=21 వచనములు

## అంశము : క్రీస్తునందలి విశ్వాసము ద్వారా కలిగిన ఫలము

1. విశ్వాసము వలన లభించిన పది ఫలములు (1-11వ.) : 1) సమాధానము 1వ., 2) కృపయందు ప్రవేశము 2వ., 3) కృపలో నిలిచియుండుట 2వ., 4. అతిశయము

2వ., 5) సిగ్గుపరచని నిరీక్షణ 5వ., 6) పరిశుద్ధాత్మ అనుగ్రహము 5వ., 7) దేవుని ప్రేమ కుమ్మరింపు 5వ., 8) మనము బలహీనులము, భక్తిహీనులము, చెడ్డవారము పాపులమై యుండగా క్రీస్తు మరణము ద్వారా నీతిమంతులుగా తీర్చబడుట 6వ., 9) ఉగ్రత నుండి క్రీస్తు మరణము ద్వారా రక్షణ 9-10వ., 10) సమాధాన స్థితియు క్రీస్తు ద్వారానే 11వ.

**శిక్షావిధి తొలగి నీతి విధి కలిగిన విధము (12-21వ.) :** 12-14వ. ఆదాము ద్వారా కలిగిన పాపస్వభావము (జన్మపాపం) మనుష్యులందరు చేసిన పాపము (కర్మపాపము)ను బట్టి శరీర మరణము (ఆది. 3:19) ఆత్మ మరణము (ప్రక. 21:8) కలిగెను.

15-17వ. కృపాదానము క్రీస్తు ద్వారా కలిగి (15వ), మనలను నీతిమంతులుగా తీర్చి (16వ.), జీవమిచ్చి ఏలికలుగా (17వ.) చేసెను.

18-21వ. ఆదాముయొక్క ఒక అపరాధము మనుష్యులందరికి శిక్షావిధి కలిగించగా, క్రీస్తు యొక్క ఒక పుణ్యకార్యము మనుష్యులకందరికి నీతి విధి కలుగుటకు కారణ మాయెను.

## 6వ అధ్యాయము 4+4+3+3+4+5 = 23 వచనములు
## అంశము : పాపము విషయము మృతులుగా ఎంచుకొనుట - దేవుని దాసులైనందున పరిశుద్ధతను ఫలముగా కలిగియుండుట (11, 22వ)

**1-4వ. పాపము విషయము చనిపోతిమి (2వ.) బాప్తిస్మము వలన పాతిపెట్ట బడితిమి** : మనము పాపముల విషయమై చనిపోయిన వారము బాప్తిస్మము పొందితిమి అనగా చనిపోయిన మనము పాతిపెట్టబడితిమి. పాపము విషయము చనిపోయి పాతిపెట్ట బడినందున క్రీస్తు మృతులలో నుండి లేచినట్లు మనమును నూతన జీవము పొంది లేచినవారమైనందున, మనలో నూతనమైన పరిశుద్ధతతో కూడిన నడక యుండవలెను.

**పాపము విషయమై చనిపోయినందున పాప విముక్తులము (బాప్తిస్మ సాదృశ్యము 7వ) (5-8వ.)** : అయన మరణము యొక్క సాదృశ్యమందు పునరుత్థాన సాదృశ్య మందును మనము అయనతో ఐక్యముగలవారమైనందున మన పాప శరీరము సిలువ వేయబడినదని ఎరిగి పాపము నుండి విముక్తి పొందితిమని మరువక పాపమునకు దాసులము కాకూడదు. పాపమును చేయరాదు.

**పాపము విషయమై చనిపోయినందున క్రీస్తునందు సజీవులుగా ఎంచుకొనుట (11వ.):** పాపముల విషయము క్రీస్తుతో కూడా చనిపోతిమి. క్రీస్తుతో తిరిగి లేచితిమి. అందుచే

ఆయన మీద మరణమునకు ప్రభుత్వము లేనట్లు మన మీదను పాపమునకు మరణము నకు ప్రభుత్వము లేదని ఎరుగవలెను. అందువలన పాపము విషయము మృతులుగాను, నీతి విషయమై సజీవులుగాను మనలను మనము ఎంచుకొని పాపము చేయకుండా నీతిగల జీవితము అనగా పరిశుద్ధ జీవితము జీవించాలి.

**మన పై పాపము ప్రభుత్వము చేయకూడదు (14వ) 12-14వ.** : మనము పాపము నుండి విమోచించబడితిమి. మన శరీర అవయవములను దుర్నీతికి అనగా పాపానికి సాధనములుగా కాక నీతికే సాధనములుగా అప్పగించుకొనాలి.

**నీతికి దాసులము (18వ.) 15-18వ.** : ఒకప్పుడు పాపమునకు దాసులము. కాని పాపము నుండి విడిపించబడితిమి. కావున ఇప్పుడు పాపమునకు దాసులము కాదు. కాని మనము పాపమునకు దాసులముగా లోబడుటకు అప్పగించుకొనగలము. ఆలాగు పాపమునకు దాసులముగా మనకు అప్పగించబడిన ఉపదేశమునకు అనగా విధేయత చూపుటకు దాసులుగా అప్పగించు కొంటిమి.

**పాపము నుండి విమోచించబడినందున ఫలముగా పరిశుద్ధతను (22వ) నిత్య జీవమును (23వ) పొందితిమి (19-23)** : మనము పరిశుద్ధత అను ఫలమును పొంది నందున ఒకప్పుడు పాపమునకు మన అవయవములను అప్పగించుకొనినట్లు నీతికి దాసులముగా మన అవయవములను అప్పగించుకొనాలి. ఎందుకనగా మనము పాపము నుండి విమోచించబడితిమి. దేవునికి దాసులమై పరిశుద్ధతను నిత్యజీవమును పొందితిమి.

## 7వ అధ్యాయము 6+6+5+4+4 = 25 వచనములు

## అంశము : పరిశుద్ధ జీవితముకైన పోరాటము - ధర్మశాస్త్రము, పరిశుద్ధత - మనలోనున్న నియమములు

ధర్మశాస్త్రమును గూర్చిన వివాహ సంబంధమైన దృష్టాంతము (1-6వ.) : 1. ధర్మశాస్త్రము మనుష్యుని మీద ప్రభుత్వము చేయుచున్నది (1వ.) 2. ధర్మ శాస్త్రము పరిశుద్ధమైనది (12వ.) 3. ధర్మశాస్త్రము నీతిగలది (12వ), 4. ధర్మశాస్త్రము ఉత్తమమైనది (12వ) 5. ధర్మశాస్త్రము ఆత్మ సంబంధమైనది (14వ). 6. ధర్మశాస్త్రము శ్రేష్ఠమైనది (17వ). 7. ధర్మశాస్త్రము నందు ఆనందించుచున్నాము (22వ.) శ్రేష్ఠమైనదియు, ఆత్మ సంబంధమైనదియునైన ధర్మశాస్త్రము పరిశుద్ధమైనదై ఆనంద మిచ్చునదిగానున్నది. ఈ

ధర్మశాస్త్రము మనుష్యులపై ప్రభుత్వము చేయుచున్నది. వివాహ చట్ట ప్రకారము భర్త బ్రతికినంత కాలము భార్య నైతిక సామాజిక బాధ్యతగా భర్తకు బద్ధురాలు. భర్త చనిపోయిన పిదప మరొక పురుషుని వివాహమాడవచ్చును. మనుష్యునిపై ప్రభుత్వము చేయు ధర్మశాస్త్రము మనకు భర్తవలెనున్నది.

**క్రీస్తు శరీరమందు మృతిపొందెను. (రోమా 7:4)** : మనలను దేవుని యొద్దకు తెచ్చుటకు అనీతిమంతుల కొరకు నీతిమంతుడైన క్రీస్తు శరీర విషయములో చంపబడి ఆత్మ విషయము బ్రతికింపబడెను. 1 పేతురు 3:18. సువార్త వలన అన్యులు యూదులతో పాటు క్రీస్తు యేసునందు ఒక శరీరమందలి సాటి అవయవములుగా నున్నారు. (ఎఫెసు 3:6) క్రీస్తు శరీరములో అవయవములుగానున్నవారు క్రీస్తు శరీరము మరణించుట ద్వారా వారును మరణించినందున వారిపైనున్న ధర్మశాస్త్రము యొక్క ప్రభుత్వము నుండి విడిపింపబడిరి. విడిపించబడినందున వేరొక పురుషుడైన క్రీస్తును వివాహమాడి దేవుని కొరకు ఫలములను ఫలించాలి. ఒకప్పుడు శరీర సంబంధులమై, పాపేచ్ఛలు కలిగి మరణార్థమైన ఫలములను ఫలించితిమి. ఇప్పుడు ధర్మశాస్త్రము నుండి విడుదల పొందినందున ప్రాచీన స్థితిగలవారము కాక ఆత్మానుసారమైన నవీన స్థితిగలవారమై సేవ చేయుచు దేవుని కొరకు ఫలములను ఫలించాలి.

**పరిశుద్ధత - ధర్మశాస్త్రము (7-12)** : ధర్మశాస్త్రమందు ప్రాముఖ్యమైన పది ఆజ్ఞలు, ఇతర ఆజ్ఞలు కలవు. ఆజ్ఞల ద్వారా పరిశుద్ధత అనగా ఏమియు మనమెరుగలము. కాని ఎక్కడ ఆజ్ఞ ఉండునో దానిని అతిక్రమించవలెనన్న దురాశలు మనయందు పుట్టును. దురాశ పాపమునకు నడిపించును. పాపమును బట్టి మానవుడు మరణించుచున్నాడు. కావున జీవార్థమైన ఆజ్ఞలు మరణార్థమైనట్టుగానున్నవి.

**పరిశుద్ధతను గూర్చిన పోరాటము (13-17వ.)** : ధర్మశాస్త్రము పరిశుద్ధమైనది, ఆత్మ సంబంధమైనది శ్రేష్ఠమైనది మనము పాపమునకు అమ్మబడి శరీర సంబంధులముగా నున్నాము. పాపము మనయందు నివసించుచున్నది. కావున చేయ నిశ్చయించునది చేయక ద్వేషించునదే చేయుచున్నాము. అలాగు చేయుట మనయందు నివసించు పాపమే కాని మనము కాదని 17వ వచనము చెప్పుచున్నది.

**పరిశుద్ధతను గూర్చిన మరింత పోరాటము (18-21వ.)** : మన శరీరమందు మంచి ఏమియు లేదని అందువలన మేలు చేయవలెనను కోరిక ఉన్నను అలాగు చేయుట

కలుగుట లేదు. అనగా మేలు చేయక కీడును చేయుచున్నాము. ఆలాగు చేయు మన యందు నివసించు పాపమేయని మనము కాదని 20వ. వచనము చెప్పుచున్నది. పాపము పాము వంటిది. పాము మన శరీరములోని అవయవములలోనున్న ఎడల ఏ క్షణమైనా మనలను కాటు వేయగలదు. కావున విశ్వాసి అజాగ్రత్తగా ఉన్న ఎడల పాపమునకు లోనగును. దావీదు, సమ్సోను, మోషేలు పాత నిబంధనలోను, మార్కు దేమాలు క్రొత్త నిబంధనలోను ఉదాహరణలు.

**మనలోనున్న నియమము (22-25వ.)** : మన అవయవములలో పాప నియమ మున్నది. అంతరంగ పురుషునిలో అనగా మనసులో ధర్మశాస్త్రమును బట్టి దైవ నియమము ఉన్నది. కాని శరీర అవయవములలోనున్న పాప నియమము మనలను చెరపట్టి లోపరచుకొనుచున్నది. మరణమునకు లోనగు శరీరము నుండి మనలను ఎవరు విడిపింతురను ప్రశ్న మనలోనున్నను, మనసు విషయములో దైవ నియమము నకు, శరీర విషయములో పాప నియమమునకు మనము దాసులమైయున్నాము. అందుకై పౌలు దేవుని స్తుతించుచున్నాడు.

## 8వ అధ్యాయము 4+3+4+6+5+3+5+4+5=39 వచనములు
## అంశము : పరిశుద్ధాత్మ శక్తి ద్వారా పరిశుద్ధ జీవితము

**ఆత్మ నియమము ద్వారా పాప మరణముల నియమము నుండి కలిగిన విడుదల (1-4)** : దేవుడు తన కుమారుడైన క్రీస్తును మానవ పాప పరిహారము నిమిత్తము, పాప శరీరాకారముతో పంపి ఆయన శరీరమందు మన పాపమునకు శిక్ష విధించెను. ధర్మ శాస్త్రము తనయందున్న నీతివిధిని మన పక్షముగా నెరవేర్చలేకపోయినది. అనగా పాపము యొక్క శిక్ష మన మీదనున్నందున మనలను నీతిమంతులుగా తీర్చలేకపోయినది. కాని దేవుడు తన కుమారుని మీద మన పాప శిక్షను విధించి సమాప్తి చేసినందున మనలను నీతిమంతులుగా తీర్చాడు. క్రీస్తు యేసు చేసిన పాప క్షమాపణ కార్యమును బట్టి ఆయనయందున్న జీవమునిచ్చు ఆత్మ యొక్క నియమము పాప మరణముల నియమము నుండి మనలను విడిపించాడు.

**ఆత్మానుసారులు - శరీరానుసారులు 5-7వ.)** : 1. ఆత్మానుసారులు ఆత్మ విషయము మీద మనస్సుంతురు - శరీరానుసారులు శరీర విషయముల మీద మనస్సుంతురు.

2. ఆత్మానుసారమైన మనసు జీవము, సమాధానము - శరీరానుసారమైన మనసు దేవునికి విరోధము మరియు లోబడదు.

**ఆత్మ స్వభావము - శరీర స్వభావము (8-11వ.)** : దేవుని ఆత్మ ఎవరి యందు నివసించునో వారు ఆత్మ స్వభావము గలవారు, శరీర స్వభావము కలవారు కారు. క్రీస్తు ఎవరియందుండునో వారి శరీరము పాపము విషయము మృతమైనదిగాను ఆత్మ నీతి విషయము జీవించునదిగానున్నది. మృతులలో నుండి యేసును లేపిన ఆత్మ ఎవరియందుండునో వారి శరీరములు చావునకు లోనైనవైనను దేవుడు తన ఆత్మ ద్వారా వారిని జీవింప చేయును.

**శరీరము చేత నడిపించబడక ఆత్మ చేత నడిపించబడుట (12-17)** : క్రీస్తును నమ్మిన వారియందు ఆత్మ నివసించుచున్నందున మనము ఆత్మ చేతనే నడిపించబడాలి కాని శరీరము చేత నడిపించబడకూడదు. శరీరము చేత నడిపించబడిన యెడల మనము చావవలసిన వారము. ఆత్మచేత శరీర క్రియలను చంపిన యెడల జీవించుదుము. ఆత్మచేత నడిపించబడు వారు దేవుని కుమారులు వారు దత్త పుత్రాత్మను పొందినవారు. నాయనా తండ్రి అని మొరపెట్టువారు వారియందున్న ఆత్మవారు పిల్లలని సాక్ష్యమిచ్చు చున్నాడు. దేవుని పిల్లలు దేవుని వారసులు. దేవునికి కలిగిన సమస్తమునకు క్రీస్తు తోడి వారసులు.

**విమోచన కొరకై నిరీక్షించుచున్న సృష్టి** : పరలోకము నుండి ప్రభువు ప్రత్యక్షమైన పిదప దేవుని పిల్లలు మహిమగల స్వాతంత్ర్యమును పొందుదురు. దీని తదుపరి నాశన మునకు లోనైన ఈ సృష్టి దాస్యము నుండి విడిపింపబడును. ఈ నిరీక్షణ కలదిగా సృష్టి ప్రస్తుతము ప్రసవ వేదనపడుచు మూలుగుచున్నది.

**విమోచన కొరకై నిరీక్షించుచున్న మన దేహము (3-25)** : పరిశుద్ధాత్మను ఫలముగా పొందిన మనము కూడా మన దేహ విమోచన కొరకు కనిపెట్టియున్నాము. మనము రక్షించబడినప్పుడే ఆత్మ విమోచన, ప్రాణ (మనస్సు, స్వభావము) విమోచన, దేహ విమోచన పొందుదుమన్న నిరీక్షణ కలవారముగానున్నాము. రక్షింపబడిన వెంటనే ఆత్మ విమోచన జరిగినది. ప్రాణ (మనసు) విమోచన దినదినము జరుగుచున్నది. దేహ విమోచన క్రీస్తు రెండవ రాకడలో జరుగును.

**భూలోకములో ఆత్మ విజ్ఞాపన (26-30వ.)** : పెంతెకొస్తు దినమున భూమి మీదకు వచ్చిన పరిశుద్ధాత్మ మన కొరకు, మన బలహీనతలలో సహాయము కొరకు, దేవుని చిత్త ప్రకారము విజ్ఞాపన చేయుచున్నాడు. అందువలన పరిశుద్ధులును, దేవుని ప్రేమించు వారికి అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడిన వారికి మేలు కలుగుటకై సమస్తము సమకూడి దేవుడు జరిగించుచున్నాడు. ఎందుకనగా, దేవుడు మనలను ముందుగా ఎరిగి, తన కుమారునితో సమరూపము కలవారమగుటకు జగత్తు పునాది వేయక మునుపే నిర్ణయించి, యుక్తకాలములో మనలను పిలిచి, యేసుక్రీస్తు సిలువలో కార్చిన రక్తమునందలి విమోచనము ద్వారా నీతిమంతులుగా తీర్చి మహిమ పరచెను.

**పరలోకములో క్రీస్తు విజ్ఞాపన (31-34వ.)** : మన పాపముల క్షమాపణ కొరకు తన సొంత కుమారుని అనుగ్రహించి, నీతిమంతులనుగా తీర్చిన దేవుడు మన పక్షమున నున్నాడు. మన పాప క్షమాపణ కొరకు చనిపోయి తిరిగి లేచిన యేసు మనకు శిక్ష విధించగలవాడైనను దేవుని కుడి పార్శ్వమున నుండి మన కొరకు విజ్ఞాపన చేయు చున్నాడు. సారాంశముగా తండ్రియైన దేవుడు మన పక్షమున నుండగా, కుమారుడైన దేవుడు మన కొరకు పరలోకమందు విజ్ఞాపన చేయుచుండగా, పరిశుద్ధాత్మ దేవుడు భూలోకములో మన బలహీనతలను చూచి సహాయము చేయుచుండగాను మన కొరకు విజ్ఞాపన చేయుచుండగను విరోధులెవరును లేరని సెలవిచ్చుచున్నాడు.

**విజ్ఞాపన ఫలితముగా ఎడబాయని తండ్రియైన దేవుని ప్రేమ నుండి క్రీస్తు ప్రేమ నుండి అన్ని పరిస్థితులలోను అత్యధిక విజయములు (35-39వ.)** : విశ్వాస జీవితములో 1) 1 పేతురు 4:12 ప్రకారము అగ్నివంటి శ్రమలు కలిగి, 2) యోబు 6:19 ప్రకారము ఏడు బాధలు కలిగి, 3) 1 కొరింథీ. 4:12 ప్రకారము హింస కలిగి, 4. అ.కా 11:28 ప్రకారం కరవు కలిగి, 5) 2 కొరింథీ. 11:28 ప్రకారము వస్త్రహీనత కలిగి, 6. 2 కొరింథీ. 11:26 ప్రకారము ఉపద్రవములు కలిగి, 7. అ.కా. 12:2 ప్రకారం ఖడ్గము ఎదురై దినమెల్ల వధింపబడిన వారముగాను వధకు సిద్ధమైన గొర్రెలముగా ఎంచబడుదుము. 1 కొరింథీ 15:31వ. పౌలు నేను దిన దినము చనిపోవుచున్నాను అన్నాడు. పైన చెప్పబడిన వాటి ద్వారా మరణము కలుగవచ్చును లేదా జీవమైనను కలుగవచ్చును. ఉన్నవైనను, రాబోవునవైనను, ఎత్తైనను, లోతైనను, సృష్టింపబడినదేదైనను, దేవదూతలు గాని, ప్రధానులుగాని, అధికారులుగాని ప్రభువు ప్రేమ నుండి మనలను ఎడబాపవు. వీటన్నిటిలో అత్యధిక విజయము పొందుచున్నాము.

# 6-7-8 అధ్యాయముల సారాంశము

6వ. అధ్యాయములో పాపము నుండి క్రీస్తు రక్తము ద్వారా విమోచించబడి పాప విముక్తులమని తీర్పు పొందితిమి. దేవునికి (నీతికి) దాసులమైనందున ఫలముగా పరిశుద్ధతను అంతములో నిత్యజీవమును పొందుదుము.

7వ. అధ్యాయములో పాపము మన శరీరములోని అవయవములలో నివసించు చున్నది. పాపము మనలను చెరపట్టి లోపరచు కొనినందున శరీర విషయమై పాప నియమమునకు మనసు విషయము దైవ నియమమునకు దాసులమైయున్నాము.

8వ. పాప మరణముల నియమము నుండి, క్రీస్తునందలి జీవమునిచ్చు నియమము ద్వారా విడిపించబడితిమి కనుక మనయందు నివసించు ఆత్మ ద్వారా సర్వ సత్యములోనికి నడిపించబడుచు శరీరేచ్ఛలను నెరవేర్చకుండ అత్యధిక విజయము పొందగలము.

## 9వ అధ్యాయము 5+4+4+5+4+4+3+4 =33 వచనములు
## అంశము : ఇశ్రాయేలీయుల మధ్య గతకాలములో జరిగిన పరిచర్య

**1-13వ వచనము** : ఇశ్రాయేలు సంబంధులందరు ఇశ్రాయేలీయులు కారు. అబ్రాహాము సంతానమైనంత మాత్రము చేత పిల్లలు కారు.

**ఇశ్రాయేలీయుల ఆధిక్యత (1-5వ)** : భూమి మీద తన జనాంగముగా ఎన్నుకొనిన ఇశ్రాయేలీయులకు గల ఆధిక్యతలు క్రింద కనుపరచబడినది.

**1. దత్త పుత్రత్వము** : ఇశ్రాయేలీయులను కుమారులుగా అంగీకరించాడు. "ఇశ్రాయేలు నా జ్యేష్ఠ కుమారుడు". నిర్గమ. 4:22. అలాగే యోహాను 1:12. ప్రకారము సంఘము కూడా అంగీకరించబడిన కుమారులు.

**2. మహిమ** : యిర్మీయా 13:11లో "నాకు మహిమ కలుగుటకై.... ఇశ్రాయేలీయులను నన్ను అంటియుండ చేసితిని". 2 కొరింథీ. 8:23 ప్రకారం సంఘము క్రీస్తు మహిమ, 2 కొరింథీ 3:18 ప్రకారము ప్రభువు మహిమను ప్రతిఫలింప చేయువారు.

3. నిబంధనలు : పాత నిబంధన ఇశ్రాయేలీయుల కివ్వబడినది. క్రీస్తు తర్వాత నూతన నిబంధనయు ఇవ్వబడినది. (హెబ్రీ. 8:9,8). సంఘమునకు కూడా రెండు నిబంధన లివ్వబడినది.

**4. ధర్మశాస్త్ర ప్రకారము** : అ.కా. 7:53 ప్రకారము "ధర్మశాస్త్రమును యూదులు పొందిరి". హెబ్రీ. 8:10 వారి హృదయము మీదవాటిని వ్రాయుదును.

**5. అర్చనాచారాదులు** : పూర్వకాలమున అర్చనా అచారములు యూదులకివ్వ బడినది. ఆలాగే సంఘమునకును బాప్తీస్మముపొందుట, రొట్టెవిరుచుట, ప్రార్థన చేయుట, అపోస్తలుల బోధ అను ఆచారములు అ.కా. 2:42 ప్రకారము కలవు.

**6. వాగ్ధానములు** : దేవుడు అబ్రాహామునకు అతని సంతానమునకు వాగ్దానములు చేశాడు. 2 కొరింథీ. 1:20 ప్రకారము అన్ని వాగ్దానములు మనవి". 1 పేతురు 1:4 ప్రకారం అమూల్యమును అత్యధికమైన వాగ్ధానములు సంఘమునకిచ్చాడు.

**7. పితరులు వీరి వారు** : యూదులు అబ్రహామును తండ్రి అనిరి. యోహాను 8:53. గలతీ. 3:7-9. ప్రకారము విశ్వాస సంబంధులైన అన్యులు అబ్రాహాము పిల్లలు.

**8. శరీరమును బట్టి క్రీస్తు వీరిలో పుట్టెను** : క్రీస్తు దావీదు సంతానము (9:5) క్రీస్తు అబ్రాహాము కుమారుడగు దావీదు కుమారుడగు నిమిత్తము అని మత్తయి 1:1వలోనున్నది. కాని యోహాను 8:44 వచనములో క్రీస్తు యూదులను మీరు మీ తండ్రియగు అపవాది సంబంధులని చెప్పెను. కనుక ఇశ్రాయేలు సంబంధులందరు ఇశ్రాయేలీయులు కారు. అబ్రహాము సంతానమంతయు పిల్లలు కారు.

శరీర సంబంధియైన **ఇష్మాయేలు - ఆత్మ సంబంధియైన ఇస్సాకు (6-9)** : ఇస్సాకు వలననైనదియే నీ సంతానమని దేవుడు అబ్రహాముతో సెలవిచ్చినందున ఇష్మాయేలు అబ్రహామునకు పుట్టినను ఆత్మీయ వాగ్ధానముల విషయములో ఇష్మాయేలు సంతానమునకు తావు లేదు. (ఆది. 17:17-22వ)

**ప్రేమించబడిన యాకోబు ద్వేషించబడిన ఏశావు (10:13వ)** : ఏశావు యాకోబు ఇస్సాకుకు రిబ్కా ద్వారా కలిగిరి. కాని వారి అంతర్యమును ఎరిగిన దేవుడు తన ముందు తెలివిని బట్టి పెద్ద వాడు చిన్న వానికి దాసుడగునని సెలవిచ్చెను. తదుపరి యాకోబు సంతానము దేవుని దీవెనలకు పాత్రులైరి. ఏశావు సంతానము ఇశ్రాయేలుకు పుట్టిన వారైనను ఆశీర్వాదమును పొందలేదు.

కావున అబ్రహాము సంతానమైనంత మాత్రాన పిల్లలు కాలేదు. ఇశ్రాయేలు సంబంధులందరు ఇశ్రాయేలీయులుగా దేవుని దీవెనలు పొందలేదు.

**దేవుడు అన్యాయస్థుడు కాదు (14-26)**

**కరుణించబడిన మోషే - కఠినపరచబడిన ఫరో (14-18వ)** : దేవుని కరుణను పొందుటకు మనమెవరము పాత్రులము కాము. మన క్రియల వలన ఆయన కృపను సంపాదించలేము. అది ఉచితముగా దేవుడనుగ్రహించని యెడల ఎవరము పొందలేము. మోషేను దేవుడు కరుణించాడు. ఫరోను కఠిన పరచుట అనగా ఫరో హృదయ ఆంతర్యమును దేవుడు ఎరుగును. ఫరో హృదయమును కఠిన పరచుకొనునని ఎరిగి సెలవిచ్చుచున్నాడు. ఫరోను దేవుడు దీవించి, హెచ్చించినను "ఆయన ఎవరు" అనుచు ఆయనను ఫరో - తృణీకరించాడు.

**దేవుని అధికారము (19-22వ.)** : దేవుడు తన ముందెలి విని బట్టి అధికార పూర్వముగా చెప్పుచున్నాడు. మనమును ఆయన మనసును ఎరిగిన వారముగా ఉండాలి. ఈ విషయములో దేవునికిఎదురు చెప్పకూడదు. ఒకే ముద్ద నుండి కుమ్మరివాడు రెండు కుండలను ఒకటి ఘనతకు మరొకటి ఘనహీనతకు వాడునట్లు చేయు అధికారము కలిగియున్నాడు. అలాగే తాను సృజించిన మానవుల ఆంతర్యమెరిగి ఒకరు మహిమ పొంద అర్హులని, మరొకరు మహిమను పోగొట్టుకొని దేవుని ఉగ్రత పొందుదురని సెల విచ్చు అధికారము కలిగియున్నాడు.

**యూదులను అన్యులను దేవుడు తన మహిమకు పిలుచుట (23-26వ.)** : యూదులనేమి అన్యులనేమి తన మహిమకు అనాదికాలము నుండియే పిలుచు చున్నాడు. "నా ప్రజలు కాని వారికి నా ప్రజలని పేరు పెట్టుదునని, ప్రియురాలు కాని దానికి ప్రియురాలని పేరు పెట్టుదునని చెప్పుచున్నాడు. నా ప్రజలు కారని అన్యుల విషయము పలికిన దేవుడు అ చోటనే జీవముగల దేవుని కుమారులని పేరు పెట్టుదు నంటున్నాడు. హోషేయ (1:9-10)

**ఇశ్రాయేలీయుల విమోచన (27-29వ.)** : ఇసుకవలె ఇశ్రాయేలువారున్నను గత కాలములో శేషమే రక్షించబడిరి.

**అన్యుల విమోచన (30-33వ.)** : నీతిని వెంటాడని అన్యులు విశ్వాస మూలమైన నీతిని పొందిరి. ఇశ్రాయేలీయులు అనేకులు ఆ విశ్వాస మార్గమును అందుకొనలేదు. వారి హృదయ కాఠిన్యమును బట్టి క్రియలద్వారా వెదకిరి గాని విశ్వాసము ద్వారా వెదక లేదు. ఈ వచనములు పదియవ అధ్యాయమునకు పీఠికగానున్నవి. పదియవ అధ్యాయ సారాంశమిదియేనని క్రింద చూడగలము.

# 10వ అధ్యాయము 4+8+9 =21 వచనములు
## అంశము : ఇశ్రాయేలీయుల మధ్య ప్రస్తుత కాలమందు జరుగుచున్న పరిచర్య

**దేవుని నీతికి లోబడని ఇశ్రాయేలీయులు (1-4వ.)** : ఇశ్రాయేలీయులకు ఆసక్తి యున్నను విశ్వాస మార్గమున నీతి మంతులముగా తీర్చబడుదుమని ఎరుగక, తమ స్వనీతిని ఆధారము చేసుకొనిరి. కనుక దేవుని మార్గమైన విశ్వాస మార్గమునకు లోబడ లేదు. విశ్వసించు ప్రతి వానికి నీతి కలుగునట్లు క్రీస్తు ధర్మ శాస్త్రమునకు సమాప్తమాయెను. ఈ సంగతి ఇశ్రాయేలీయులు గ్రహించలేదు.

**ప్రస్తుత కాలములో ఇశ్రాయేలీయులు అన్యజనులు రక్షింపబడవలసిన విధము (5-12):** ద్వితీ. 30:11-14వ. రోమా 10:6-10వ సరిపోల్చి చూడవలెను. ధర్మశాస్త్రములో ద్వితీ. 30:12,13లోనున్న దానిని అనుపదము రోమా 10:6-10లో క్రీస్తును అని యున్నది. కాబట్టి ఇశ్రాయేలీయులైనను, అన్యులైనను పరలోకము నుండి ఈ లోకమునకు వచ్చి, మన పాపముల విషయమై చనిపోయి, పాతిపెట్టబడి, తిరిగి లేచిన యేసునందు నమ్మిక యుంచాలి. ద్వితీ. 30:14. ప్రకారము ఈ వాక్యములను హృదయములోను నోటను యుంచుటను గూర్చి పౌలు రోమా 10:9,10 వచనములో నోటితో ఒప్పుకొనవలెనని హృదయమందు విశ్వసించవలెనని చెప్పుచున్నాడు. హృదయమందు విశ్వసించుట వలన నీతిమంతులుగా తీర్చబడునని, నోటితో ఒప్పుకొనుట వలన రక్షణ పొందునని వివరించు చున్నాడు.

**ఇశ్రాయేలీయులు ప్రస్తుతకాలమందు దూరముగానుండుట (13-21వ)** : ప్రభువు నామమున ప్రార్థన చేయుట వలన రక్షణ కలుగును. ఇశ్రాయేలీయులు విశ్వసించ నందున ప్రార్థించుట లేదు. వినుట లేదు. ప్రకటించువారు ఇశ్రాయేలీయుల మధ్యకు పంపబడుట లేదు. వెళ్ళినవారు ప్రకటించినను యెషయా 53:1. ప్రకారము "మేము తెలియజేసిన సమాచారము ఎవడు నమ్మెను". వారు నమ్ముట లేదు. ప్రభువును వెదకని అన్యులకు ప్రత్యక్షమై ఆయన దొరుకుచున్నాడు. అవిధేయులై ఎదురాడు ప్రజల వైపు దినమంతయు చేతులు చాపుచున్నాడు. ప్రభువు పక్షపాతము లేక అన్యులను ఇశ్రాయేలీ యులను ఒకే రీతిగా దర్శించుచున్నాడు. కాని ఈ దినములలో అన్యులు రక్షించబడినట్లు ఇశ్రాయేలీయులు రక్షించబడుట లేదు.

## 11వ అధ్యాయము 6+6+6+6+6+6 =36 వచనములు
## అంశము : ఇశ్రాయేలీయుల మధ్య అంత్యకాల పరిచర్య

**రక్షించబడు శేషము (1-6వ.)** : బెన్యామీను గోత్రము చిన్నదైనను అదే గోత్రికుడగు పత్రిక వ్రాసిన పౌలును దేవుడు ఆకాలమందు రక్షించాడు. ప్రవక్తయైన ఏలియా కాలములో అనగా గత కాలములో ఏలియాను మాత్రమే కాక బయలుకు మోకాళ్ళూని 7,000 మంది పురుషులను దేవుడు శేషముగా నిలుపుకొన్నాడు. ఆలాగుననే రాబోవు కాలమునను దేవుడు తన కృప చొప్పున ఒక శేషమును రక్షించుకొనును.

**మిగిలిన వారి కాఠిన్యము వలన అన్యులకు తెరువబడిన ద్వారము (7-12వ.)** : దేవుడు వారికి నిద్ర మనను కలిగించెనని యెషయా 29:10లోను వారి కన్నులకు చీకటి కమ్మెనని కీర్తనలు 69:22లోను చెప్పబడినది. వారి తొట్రుపాటు వలననే అన్యులకు సువార్త ద్వారము తెరువబడినది.

**కాఠిన్యమునకు కారణములు (13-18వ.) (19-24వ)** : 1. లోకమును దేవునితో సమాధాన పరచుటకై దేవుడు వారిని తాత్కాలికముగా విసర్జించాడు.

2. వేరు పరిశుద్ధమైతే కొమ్మలు పరిశుద్ధమే కాని అడవి ఒలీవల వంటి అన్యులను అంటుకట్టు నిమిత్తము ఒలీవ చెట్టు కొమ్మలైన ఇశ్రాయేలు వారిలో కొందరు విరువ బడిరి.

3. వారు తమ అవిశ్వాసమందు నిలువకుండా ఉండిన యెడల మరల స్వంత చెట్టునకు అంటు కట్టబడుదురు.

**ఇశ్రాయేలు పునరుద్ధరణ (25-30వ.)** : అన్యజనుల ప్రవేశము సంపూర్ణమైన పిదప సీయోను నుండి భక్తిహీనత తీసివేయబడగా వారు క్రీస్తును గురించి పాప క్షమాపణ పొంది రక్షింపబడుదురు. ఇది మర్మము. నూతన నిబంధనలో మర్మము అను పదము 34 పర్యాయములు కలదు.

**దేవుని బుద్ధి జ్ఞానముల బాహుళ్యము (31-36వ.)** : యూదుల అవిధేయత వలన అన్యులు కరుణించబడినట్లు అందరి యెడల కరుణ చూపు దేవుడు ఒక్కొక్కరిని వేరు వేరు సమయములలో అవిధేయత స్థితిలో బంధించెను. అందుచేత దేవుని బుద్ధి జ్ఞానముల బాహుళ్యము గంభీరము అని సెలవిచ్చుచున్నాడు.

# 12వ అధ్యాయము 3+6+7+5 = 21 వచనములు
## అంశము : పరిచర్య వివరములు

**పరిచర్య నిర్వచనము - వ్యక్తిగత పరిచర్య :** ప్రభువు పట్ల చేయవలసిన యుక్తమైన పరిచర్య ఎట్లనగా 1. పరిశుద్ధమైనదిగా నుండాలి, 2. దేవునికి అనుకూలమైన సజీవ యాగముగా శరీరములను ఆయనకు సమర్పించాలి, 3. లోక మర్యాదలను అనుసరింప కూడదు, 4. ఉత్తమమైన, అనుకూలమైన, సంపూర్ణమైన దేవుని చిత్తమును పరిక్షించి తెలిసికోవాలి, 5. మనసులు మారి రూపాంతరము పొందినవారముగా నుండాలి. 6. తన్నుతాను ఎంచుకొన తగిన దానికంటే ఎక్కువగా ఎంచుకొనరాదు. తాను కలిగిన విశ్వాస పరిమాణం ప్రకారం తగిన రీతిగానే ఎంచుకొనాలి, 7. ఘనత విషయములో ఒకనినొకడు గొప్పగా ఎంచుకొనాలి (1:10)

**పరిచర్యలో వరములను వాడుకొనుట సంఘ పరిచర్య (4-9వ.)** : ఒక శరీరములో అనేక అవయవములుండగా ఒక్కొక్క దానికి వేరు వేరు పనులున్నట్లు దేవుడు తన కృపను బట్టి ఒక్కొక్కరికి వేరు వేరు కృపావరముల నిచ్చియున్నాడు. 1. ప్రవచనము, 2. సహాయకరమైన సేవ, 3. బోధించుట, 4. హెచ్చరించుట, 5. పంచిపెట్టుట, 6. పై విచారణ చేయుట, 7. కరుణించుట. 8. నిష్కపటమైన ప్రేమ కలిగి చెడ్డదానిని అస హ్యించుకొని, మంచి దానిని హత్తుకొనుచు పని జరిగించాలి. వరముల వివరములు 1 కొరింథీ. 12:8-11వ,28వ.లో కలవు.

**సహోదరులపట్ల పరిచర్య (10-16వ.)** : 1. సహోదరులను ప్రేమించుటలో ఒకరియందొకరు అనురాగము కలవారుగా ఉండాలి. 2. ఘనత విషయములో ఒకరి నొకరు గొప్పగా ఎంచుకొనాలి. 3. ఆసక్తి విషయములో మందులుగా నుండకూడదు. 4. ఆత్మయందు తీవ్రత కలిగియుండాలి. 5. నిరీక్షణ కలవారై సంతోషముగానుండాలి. 6. శ్రమలయందు ఓర్పుగలవారైయుండాలి. 7. ప్రార్థనయందు పట్టుదల కలవారై యుండాలి. 8. పరిశుద్ధుల అవసరములలో పాలు పొందాలి. 9. శ్రద్ధగా ఆతిథ్యమివ్వాలి. 10. హింసించు వారిని దీవించాలి కాని శపించకూడదు. 11. సంతోషించు వారితో సంతోషించాలి. 12. ఏడ్చు వారితో ఏడవాలి. 13. ఒకనితో ఒకనిగా మనసు కలిగియుండాలి. 14. హెచ్చు వాటియందు మనస్సుంచక తగ్గువాటియందు ఆసక్తి కలిగియుండాలి. 15. ఎవరికి వారే బుద్ధిమంతులమని అనుకొనకూడదు.

**మనుష్యులందరి పట్ల పరిచర్య (17-21)** : 1. కీడుకు ప్రతికీడు మనుష్యులలో ఎవరికి చేయకూడదు. 2. అందరి దృష్టికి యోగ్యమైన దానిని గూర్చి ఆలోచన కలిగి యుండాలి. 3. సమస్తమైన మనుష్యులతో సమాధానము శక్యమే. 4. మనకు మనమే పగ తీర్చుకొనక దేవుని ఉగ్రతకు చోటివ్వాలి. ఎందుకనగా పగ తీర్చుట కాని ఫలమిచ్చుట కాని దేవుని పనియే. 5. శత్రువు ఆకలిగొంటే అతనికి భోజనము పెట్టాలి. 6. దప్పిగొంటే దాహమివ్వాలి. 7. కీడు వలన జయింపబడక మేలు చేత కీడును జయించాలి.

## 13వ అధ్యాయము 4+3+3+4=14 వచనములు
## అంశము : పరిచర్యలోని వివరములు

**బాహ్య ప్రపంచములో అధికారుల పట్ల పరిచర్య (1-4వ.)** : 1. ప్రతి అధికారము దేవుని వలన కలిగినది. 2. అధికారులు దేవుని వలన నియమింపబడిరి. 3. కావున అధికారులకు లోబడి ఉండాలి. 4. అధికారుల నెదిరించువాడు దేవుని నియమమును ఎదిరించి తనకు తానే శిక్ష తెచ్చుకొనువాడు. 5. మేలు కలుగుటకు అధికారులు దేవుని పరిచారకులు. 6. కీడు చేయువారి మీద చెడు చేయువారి మీదను ఆగ్రహము చూపుటకు వారు దేవుని పరిచారకులు. 7. చెడ్డ కార్యములకే కాని మంచి కార్యములకు భయంకరులు కారు. కనుక అధికారులకు మేలు చేసి వారితో మెప్పు పొందాలి.

**అధికారులు సుంకమునకు సన్మానమునకు పాత్రులు (5-7 వ.)** : 1. అధికారులు దేవుని సేవకులు, 2. ఎల్లప్పుడు పని కలిగియుందురు. కనుక వారికి పన్ను చెల్లించాలి. 3. సుంకము చెల్లించ వలసిన వారికి సుంకము చెల్లించాలి. 4. ఎవరికి భయపడవలెనో వారికి భయపడాలి. 5. ఎవరిని సన్మానించాలో వారిని సన్మానించాలి. 6. అందరికి వారి వారి రుణములు తీర్చాలి.

**ఇరుగు పొరుగు వారిని ప్రేమించు పరిచర్య (8-10)** : 1. ఒకరినొకరు ప్రేమించుటలో తప్ప ఎవనికిని అచ్చియుండకూడదు. 2. పొరుగు వారిని ప్రేమించుట ధర్మ శాస్త్రమును నెరవేర్చుటయే ఎందుకనగా ధర్మశాస్త్రములోని నైతిక అజ్ఞలన్ని అందులో ఇమిడియున్నవి. 3. ప్రేమ పొరుగువారికి కీడు చేయదు. ప్రేమను గూర్చిన వివరములు పుస్తకము చివరిలో కలవు.

**పరిచర్యలోని నిరీక్షణ మెలకువలు (11-4)** : కాలముల నెరగాలి, ఇప్పుడు విశ్వాసు లందరు నిద్ర మేలుకొను వేళయైనదని తెలిసికొనాలి. రాత్రి చాలాగడచి పగలు

సమీపముగానున్నందున అంధకార క్రియలు విసర్జించాలి - తేజస్సంబంధమైన యుద్ధోప కరణములు ధరించుకొనాలి. 1. అల్లరితో కూడిన ఆట, 2. అల్లరితో కూడిన పాట, 3. మత్తు, 4. కామ విలాసములు, 5. పోకిరి చేష్టలు, 6. కలహములు, 7. మత్సరములు ఉండరాదు, 8. పగటియందు నడుచుకొన్నట్లు మర్యాదగా నడవాలి, 9. ప్రభువైన క్రీస్తును ధరించుకొనాలి, 10. శరీరేచ్ఛలు నెరవేర్చుకొనుటకు ఆలోచన చేసుకొనకూడదు.

## 14వ అధ్యాయము 4+4+4+4+4+3=23 వచనములు
## అంశము : బలహీనుల పట్ల పరిచర్య

**తిండి విషయములో బలహీనుల పట్ల పరిచర్య (1-4వ.)** : విశ్వాసులైన వారు తిండిని గూర్చిన విశ్వాస విషయములో కొన్నిసార్లు బలహీనులగుదురు. అటువంటి వారిలో కూరగాయలనే తినువారున్నారు. ఇతరులు సమస్తమును తినవచ్చని నమ్ముచున్నారు. ఈ విషయములలో ఒకరొకొకరు తీర్పు తీర్చకూడదు. ఇతరులు దేవుని సేవకులు వారిని నిలువబెట్టుకొనుట దేవుని చిత్తమే కనుక పరుని సేవకులకు మనము తీర్పు తీర్చక వారిని చేర్చుకొనవలెను.

**దినములను లక్ష్యపెట్టు వారి పట్ల పరిచర్య (5-8వ.)** : ఒకరు ఒక దినముకంటే మరొక దినమును మంచిదని ఎంచుచున్నారు. హెబ్రీ. 10:1-2వ ప్రకారము ధర్మశాస్త్రము రాబోవుచున్న మేలుల చాయ, నిజ స్వరూపము కలది కాదు. ధర్మశాస్త్రమందు రాబోవు ఆత్మీయ మేలులను చూపు కొన్ని పండుగ దినములు కలవు. విశ్రాంతి దినాచరణ, పస్కా పండుగ మొదలగునవి. కొద్ది మంది బలహీనులై వాటిని క్రొత్త నిబంధన కాలమందు ఆచరించువారున్నారు. తినుట తినకుండుట దినములను లక్ష్యపెట్టుట అన్నియు ప్రభువు కొరకే చేయాలి. మనలో ఎవరమైన బ్రతికినను ప్రభువు కొరకే బ్రతకాలి. క్రీస్తు చనిపోయి బ్రతికినందున ఆయన అందరికి ప్రభువు. మనమును ప్రభువు వారము.

**ప్రతివారును ఎవరికి వారే లెక్క అప్పగించుట (9-12 వ.)** : ఎదుటి సహోదరునికి తీర్పు తీర్చక, నిరాకరించకనుండాలి. మనలో ఒక్కొక్కరము దేవుని న్యాయపీఠము ఎదుట 2 కొరింథీ. 5:10 ప్రకారము నిలువాలి, లెక్క అప్పగించాలి. దేవుడు తీర్పు తీర్చి ఒక్కొక్కరికి మన క్రియలకు ఫలమిచ్చువాడు.

**ఒకనినొకరు ఆటంకపరచకుండుట - తీర్పు తీర్చకుండుట (13-16 వ.)** : భోజన విషయములో ఏదియు నిషిద్ధము కానందున, భోజన విషయములో ఆటంకము కలిగించకూడదు. ఆలాగు చేయుట ద్వారా సహోదరుడు అభ్యంతరపడి ఆత్మీయతలో వెనుకపడిన యెడల ఎవరి నిమిత్తము క్రీస్తు చనిపోయెనో అది నిరర్థకమగును.

**దేవుని రాజ్యము భోజన పానాదులు కావు - నీతి సమాధానము ఆనందము (17-20వ.):** దేవుని రాజ్యము, నీతితోను, సమాధానముతోను ఆనందముతోను కూడినది. భోజన పానాదులతో కూడినది కాదు. దేవుని పనిలో సమాధానము, పరస్పర క్షేమాభివృద్ధి కలుగ చేయువాటిని ఆసక్తితో వెంటాడుచు ముందుకు సాగాలి కాని, భోజనము నిమిత్తము దేవుని పని పాడు చేయకూడదు. సమస్త పదార్థములు పవిత్రములు. మంచివే అయినందున అనుమానించక భుజించాలి. అనుమానించి తినిన యెడల అది దోషమగును.

**విశ్వాస మూలము కానిదే పాపము (21-23వ.)** : దేవుని పనిలో సహోదరులకు ఆటంకమైన వాటిని తినుట, త్రాగుట, మానివేయుట మంచిది. ఎవరి విశ్వాసము కొలది వారు ముందుకు సాగాలి. కాని అనుమానించువాడు విశ్వాసము లేకుండా భుజించుచున్నాడు కనుక "విశ్వాస మూలము కానిది ఏదో అది పాపము". పాపము యొక్క నిర్వచనములు చివరి పేజీలో కలవు.

**క్రీస్తు మనలను చేర్చుకొన్నట్టు బలహీనులను చేర్చుకొను పరిచర్య (154 అధ్యా. 1-7వ):** క్రీస్తు తన్ను తాను సంతోష పరచుకొనలేదు. పొరుగువారమైన మనలను సంతోషపరచుటకై నిందలను భరించాడు. కావున బలవంతులైన సహోదరులు తమ్మును తాము సంతోష పరచుకొనక బలహీనుల దౌర్బల్యములను భరించుచూ పొరుగువారికి క్షేమాభివృద్ధిని కలిగించాలి. బలవంతులు, బలహీనులు మన మందరము కలసి దేవునికి మహిమ కలుగునట్లు ఒకరినొకరు చేర్చుకొని ఒకరితో నొకరు మనసు కలిగియుండాలి. ఓర్పునకు ఆదరణకు, నిరీక్షణకు కర్తయైన దేవుడు అటువంటి మనసును అనుగ్రహించాలి అని దేవుని వేడుకొనుచున్నాడు.

## 15వ అధ్యాయము 7+6+8+3+5+4=33 వచనములు
## అంశము : బలహీనులను చేర్చుకొను పరిచర్య
## ప్రకటించు పరిచర్య - పేదల కొరకైన పరిచర్య

**14వ అధ్యాయములో చూచితిమి (1-7వ) :**

**యూదులకు, అన్యులకు అంగీకారమైన సువార్త ప్రకటన పరిచర్య (8-13వ.) :** ఇశ్రాయేలీయులలోని పితరులకు దేవుడు చేసిన వాగ్దాన ప్రకారము క్రీస్తు సున్నతి గలవారికి అనగా యూదులకు పరిచారకుడయ్యాడు. 9-11వ. అన్యజనులలో నిన్ను స్తుతించుదును. (కీర్తనలు 18:49) అన్యజనులారా ఆయన ప్రజలతో సంతోషించుడి.

(ద్వితీ. 32:43) అన్యజనులారా ప్రభువును స్తుతించుడి. (కీర్త. 117:1). యెష్షయి వేరు చిగురునందు అన్యజనులు నిరీక్షణనుంచుదురు. (యెషయా 11:10). పై వచనముల ఆధారముగా యూదులు, అన్యులు విశ్వాసము ద్వారా సమస్తానందముతోను, సమాధానముతోను నింపబడుదురు కనుక సువార్త ప్రకటన యూదులను అన్యులను సమానముగా క్రీస్తు అంగీకరించు పరిచర్యయని గుర్తించవలెను.

**పౌలుకు అనుగ్రహించబడిన ప్రకటించు పరిచర్య (14-21వ.)** : అన్యజనులు పరిశుద్ధ పరచబడి దేవునికి ప్రీతికరమైన అర్పణయగునట్లు యాజక ధర్మము జరిగించుటకై దేవుడు పౌలుకు కృపననుగ్రహించి పరిచారకుడుగా నియమించాడు. క్రీస్తు వాక్యము ద్వారాను, క్రియల చేతను, గురుతుల బలము చేతను, మహాత్కార్యముల బలము చేతను, పరిశుద్ధాత్మ బలముచేతను పౌలుద్వారా అన్యజనులు క్రీస్తుకు విధేయులయ్యారు. పౌలు ఇందు నిమిత్తము యెరూషలేము నుండి ఇల్లూరి వరకు (బైబిల్ గ్రంథములోని పౌలు ప్రయాణముల పటములో చూచిన యెడల కుడివైపు క్రింద నుండి ఎడమ వైపు పై వరకు) సువార్త పూర్ణముగా ప్రకటించాడు. మిక్కిలి ఆశగలవాడై యెషయా 52:15 ప్రకారము క్రీస్తు నామమెరుగని చోట్ల ప్రకటించవలెనని చెప్పుచున్నాడు.

**పౌలు ప్రకటనకైన ప్రయాణము (22-2వ.)** : పౌలు రోమా పత్రికను వ్రాయు వరకు రోమాను దర్శించలేదని మొదటి అధ్యాయము 13వ వచనములో చూచితిమి. సువార్తలో తనకున్న మిక్కిలి అపేక్షను బట్టి రోమాకు తదుపరి స్పెయిన్ వెళ్ళవలెనన్న తన తలంపును తెలుపుచున్నాడు. (విడుదల కాలములో వెళ్ళిన ప్రదేశముల పటము చూడండి)

**సువార్త ప్రకటనతో కలిసిన పేదల కొరకైన పరిచర్య (25-29వ.)** : పరిశుద్ధులలో పేదలకొరకు మాసిదోనియా వారు, అకయవారు చందా వేసిన సొమ్మును తీసుకొని యెరూషలేములోని వారి కప్పగించుటకై వెళ్ళుచున్నాడు. పరిశుద్ధులలో పేదలకు చేయు పరిచర్యయు ఫలమని చెప్పుచున్నాడు. ఈ పరిచర్య ముగించి రోముమీదుగా స్పెయిన్‌కు వెళ్ళుదునని తెలుపుచున్నాడు. ఆత్మ సంబంధమైన విషయము మాత్రమే కాక, శరీర విషయములలో కూడా పాలివారుగా ఉండవలెనని సెలవిచ్చుచున్నాడు.

**పరిచర్య కొరకు ప్రార్థన కోరిన పౌలు (30-33వ.)** : పరిశుద్ధులలో పేదల కొరకు చేయబడు పరిచర్య ప్రభువుకు ప్రీతికరమగునట్లు ప్రార్థించమని కోరుచున్నాడు. తదుపరి రోమాకు వచ్చి చేయవలసిన పరిచర్య కొరకును ప్రార్థనలో పోరాడమని వారిని బ్రతిమాలు కొనుచున్నాడు. ఆమేన్ అని పత్రికను ముగించుచున్నాడు.

# 16వ అధ్యాయము 4+4+4+4+4+4+3=27 వచనములు
## అంశము : వందనములు - ముగింపు

వందనములు చెప్పుటయు పరిచర్యలో ఒక భాగమే. వందనములు చెప్పవలసిన విధమును నేర్చుకొనవలెను.

పరిచారకురాలగు ఫీబే - జత పనివారగు ప్రిస్కిల్ల, అకుల (1-4వ.) :

**పరిచారకురాలగు ఫీబెను చేర్చుకొనుటకు సిఫారసు (1-2వ.)** : కెంక్రేయ సంఘ పరిచారకురాలగు ఫీబే పౌలునకు సహాయము చేసెనని తెలుపుచూ పరిశుద్ధులగు తగినట్లు చేర్చుకొని సహాయము చేయమని చెప్పుచున్నాడు. ఇటువంటి పరిచర్యలకు సిఫారసు అవసరము.

**3-16వ వచనములలోని వందనములు** : 14 వచనములలో సుమారు 20 పర్యాయములు వందనములు, 27 మందికి చెప్పుచున్నాడు. ఒక్కొక్కరు దేవుని పనిని జరిగించు విధము కూడా చెప్పబడినది.

**3-4 వచనము** : ప్రిస్కిల్ల అకుల - జతపనివారు.

**5-8, 9-12, 13-16వ వచనములు - పనివారు - వారి వివరములు :**

**5వ వచనము** : ఎపైనెటు - ఆసియాలో క్రీస్తుకు ప్రథమ ఫలము.

**6వ వచనము** : మరియ - రోమా వారి కొరకు బహుగా ప్రయాస పడినది.

**7వ వచనము** : అంద్రోనీకు, యూనీయా - పౌలు తోడి ఖైదీలు - అపొస్తలులలో ప్రసిద్ధి కెక్కినవారు - పౌలుకంటే ముందు క్రీస్తులోనున్నవారు.

**8వ వచనము** : అంప్లీయతు - ప్రభువునందు పౌలుకు ప్రియుడు.

**9వ వచనము** : ఊర్బాను, స్టాకు - క్రీస్తునందు జతపనివారు.

**10వ వచనము** : అపెల్లెకు - క్రీస్తునందు యోగ్యుడు.

**12వ వచనము** : త్రుపైనా, త్రుఫోసా - ప్రభువునందు ప్రయాసపడువారు. పెర్సిసు ప్రభువునందు బహుగా ప్రయాసపడినది.

**13వ వచనము** : రూఫుతల్లి - పౌలుకును తల్లివంటిది.

**14-15వ వచనములు** : పదిమంది పరిశుద్ధులకు వందనములు చెప్పబడినవి.

**16వ వందనములు చెప్పు విధము** : పవిత్రత కలిగి, ముద్దు పెట్టుకొని వందనములు చెప్పాలి.

**నేర్చుకొనిన పరిచర్యకు వ్యతిరేకమైన బోధకుల నుండి తొలగిపోవలెనని హెచ్చరిక (17-20వ.)** : నేర్చుకొనిన బోధకు వ్యతిరేఖముగా బేధములు, ఆటంకములు కలిగించు వారిని కనిపెట్టుట, వారి నుండి తొలగిపోవుట. వారు కడుపుకు దాసులు. ఇంపైన మాటల వలన నిష్కపటుల మనసులను మోసపుచ్చుదురు. అటువంటి వారి విషయము జాగ్రత్తగా ఉండాలి. మేలుకరములైనవి, కీడుకరములైన వాటిని గూర్చిన హెచ్చరిక కలదు. సాతానుకు ఓటమిని దేవుడిచ్చునని సెలవిచ్చుచున్నాడు.

**పౌలుతోనున్న పనివారల వివరములు (21-24వ.) వారు చెప్పుచున్న వందనములు:**

**21వ వచనము** : తిమోతి - జతపనివాడు.

**22వ వచనము** : తెర్తియు - పౌలు చెప్పుచుండగా ఈ పత్రిక వ్రాసినవాడు.

**23వ వచనము** : గాయి - పౌలుకు ఆతిథ్య మిచ్చినవాడు. సంఘము తన ఇంటిలోనున్నది. ఎరస్తు పట్టణ ఖజానాదారుడు.

**24వ వచనము** : క్రీస్తు కృపతో పత్రిక ముగింపు.

**25-27వ వచనము ముగింపు** : అనాది కాలము నుండి రహస్యముగా నుంచబడిన మర్మము అనగా అన్యజనులు విశ్వాసమునకు విధేయులగునట్లు పౌలు సువార్త ప్రకటన ప్రకారము రోమాలోని పరిశుద్ధులను దేవుడు స్థిరపరచుటకు శక్తిమంతుడని ఆయనకు కలుగు నిరంతర మహిమను గూర్చి తెలుపుచూ పత్రిక ముగించుచున్నాడు. (మర్మములను గురించిన వివరములు కొలొస్సయి 1వ అధ్యాయము చివర కలవు)

# కొరింథీయులకు వ్రాసిన పత్రికలు

కొరింథు పట్టణ చరిత్ర : కొరింథు పాత పట్టణము క్రీస్తు పూర్వం 1500 ఏండ్లలో కట్టబడింది. క్రీ.పూ. 146లో రోమా వారిచే నాశనము చేయబడింది. కానీ క్రీ.శ. 46లో కైసరు చక్రవర్తి మరలా కట్టించెను. గ్రీసు దేశంలో దక్షిణ - ఉత్తర ప్రాంతములను వేరు చేయు 4 మైళ్ళు వెడల్పు గల భూభాగమున కొరింథు పట్టణము కలదు. గ్రీసు దేశానికి తూర్పు పడమరలలోనున్న దేశముల మధ్య వ్యాపారస్తులు గ్రీసు దేశము చుట్టూ తిరుగక కొరింథుగుండా వెళ్ళుట వలన దూరము తగ్గును. సముద్ర దొంగల బారి నుండి తప్పింప బడుదురు. అందుచే అందరూ కొరింథు గుండా వెళ్ళుట వలన ఆ పట్టణము బహు ధనము సంపాదించు వ్యాపార సంబంధమైన పట్టణముగా నుండెను. అపొల్లో దేవత గుడి గల పట్టణము. అందులో 1000 మంది దేవ దాసీలు ఉండుట వలన బహుగా వ్యభి చారముతోను, విగ్రహాలతోను నిండిన పట్టణము. ఏథెన్స్ దీనికి సుమారు 4 మైళ్ళ దూరమందుండి నావికా బలమును కలిగిన పట్టణము. గ్రీసు దేశమంతటిలో ప్రాముఖ్యమైన పట్టణము. స్పార్థా అను పట్టణములో మిగిలిన రాణువవారు ఉండిరి. తూర్పున 8 1/2 మైళ్ళలో కెంక్రేయ గలదు. కొరింథు పట్టణము గుండా ఓడలు పోగలిగినంత కాలువను 4 మైళ్ళ భూభాగమందు త్రవ్విరి. గ్రీసు దేశము ఇప్పుడు పెద్ద భూభాగమై ఉత్తరమున థెస్సలోనిక పై వరకు వ్యాపించినది. దక్షిణమున క్రేతు ద్వీపము కూడా ప్రస్తుతము గ్రీసు దేశములోను పౌలు అ.కా. 27 అధ్యాయములో ప్రయాణము చేసిన రోదు. క్నీదు వంటి వందలాది దీవులును గ్రీసులోనే ప్రస్తుతమున్నవి. గ్రీసులో నేడు ఇది ఒక కోటి జనాభా ఉన్నారు. 1.31. లక్షల చదరపు కిలోమీటర్ల వైశాల్యము గల దేశము. గ్రీసు దేశానికి ప్రస్తుతము ఏథెన్స్ ముఖ్య పట్టణముగా ఉన్నది. కాని నాటి గ్రీసు దేశానికి ఎథెన్స్ ఉత్తరమున, కొరింథు పట్టణము దక్షిణమున ముఖ్య పట్టణములు. పౌలు అ.కా. 17లో ఏథెన్సులోను 18 అధ్యా. కొరింథులోను సేవ చేశాడు. గ్రీసులోనే ఒలింపిక్ ఆటలు (ఒలింపియార్)లో క్రీ.పూ. 776లో ప్రారంభము అయినవి. ఒలింపిక్స్ మొదట 5 దినములు జరిగెడివి. అప్పటిలో స్త్రీలు పాల్గొనేవారు కారు. గ్రీసు దేశమంతటి నుండి పురుషులు మాత్రమే పాల్గొనేవారు. క్రీ.శ. 394 వరకు కొనసాగినవి. పిమ్మట రోమా చక్రవర్తి వాటిని ఆపివేసెను. తిరిగి క్రీ.శ. 1896లో ప్రారంభమై ప్రతి 4సం॥లకు ఒక్కసారి ఆయా దేశములలో జరుగును. క్రీ.శ. 1922 నుండి స్త్రీలునూ పాల్గొనుచున్నారు. 1 కొరింథీ. 9:24-26లో పందెపు రంగము, పరుగెత్తుట, పోట్లాడుటను గురించి మాటలాడుచున్నాడు.

ప్రాచీన ప్రపంచపు ఏడు వింతలలో ఒక వింతైన జూపిటర్ విగ్రహము గ్రీసు దేశములోని ఒలింపియర్‌లో కలదు. దీనినే అపొస్తలుల కార్యము 19:34వ వచనంలో

ద్యుపతిగా చూడగలము. ఇది పిమ్మట అగ్నిమంటలలో క్రీ.పూ. 5వ శతాబ్దంలో కాలి పోయినది.

కొరింథు పట్టణము పై కారణములను బట్టి క్రొత్త నిబంధన కాలమున ప్రాముఖ్య పట్టణముగాను, విగ్రహారాధనచేతను, ధనము చేతను, వ్యభిచారము చేతను అనగా శరీరాశలు, శరీర అతిశయముతో నిండిన పట్టణముగా చూడగలము.

**కొరింథు సంఘస్థాపన** : కొరింథు అనగా వెక్కసముగా సంతృప్తి చెందినది అని అర్థము. కొరింథు పట్టణమును పౌలు క్రీ.శ. 52లో తన రెండవ (సేవాయాత్ర) దండయాత్రలో సందర్శించి అక్కడికి రోమా నుండి క్రొత్తగా వచ్చిన అకుల, ప్రిస్కిల్లాతో కలసి సువార్తను ఆతురముగా బోధించగా కొరింథీయులలో విగ్రహారాధికులైన అనేకులు, ఆయా పాపములలోనున్న అనేకులు, జారులు, సమాజ మందిరపు అధికారి ఇంటి వారందరూ విశ్వసించి బాప్తీస్మము పొందిరి. రాత్రివేళ ప్రభువు దర్శనము నందు భయపడక మాట్లాడుము. మౌనముగా నుండకుము. నేను నీకు తోడై ఉన్నాను. అనగా 1/2 సం॥లు అక్కడ ఉండెను. అపొస్తలుల కార్యములో 18వ అధ్యాయములోని 18వ వచనములలో కొరింథులో చేసిన 18 నెలల సేవా వివరాలు కలవు. పిమ్మట పౌలు అకుల, ప్రిస్కిల్లాలు ఎఫెసుకు వెళ్ళిరి. పౌలు వారినక్కడ విడిచి అంతియొకయకు వెళ్ళెను. అలెక్సంద్రియా వాడైన అపొల్లో ఎఫెసుకు వచ్చి అకుల, ప్రిస్కిల్లాల వలన బలపడి కొరింథుకు పంపబడెను. కొరింథుకు వచ్చి విశ్వసించిన కొరింథీయులకు చాలా సహాయము చేసెను. పౌలు 3వ సేవాయాత్రలో ఎఫెసులో 3 సం॥లు ఉండెను. క్రీ.శ. 56సం॥లో పెంతెకొస్తు ముందు క్రీ.శ. 56 జూన్‌ముందు (1 కొరింథు 16:9). కొరింథు నుండి స్తెఫను, అకాయికు అనువారు జాబు తీసుకొనిరాగా కొరింథీయులలో తనకు తెలిసిన లోపాలు, వారు వ్రాసిన లోపములు విమర్శించిన లోపములు, కూడి వచ్చుటలోని లోపములకును జవాబుగా కొరింథీయుల మొదటి పత్రిక వ్రాసి తిమోతిని వారితో కూడా పంపెను.

**పత్రిక అంశము** : లోపములు దిద్దుట.

**పత్రిక విభజన** : 6+2+2+6=16 అధ్యాయాలు.

**1-6 అధ్యాయాలు** : తెలియవచ్చిన లోపాలు దిద్దుట.

**7-8 అధ్యాయాలు** : వ్రాసిన విషయములలోని లోపాలను దిద్దుట.

**9-10 అధ్యాయాలు** : విమర్శించిన విషయములలోని లోపాలను దిద్దుట.

**11-16 అధ్యా.** : కూడి వచ్చి వరములను వాడుకొనుటలోని లోపములు దిద్దుట.

2 కొరింథీ 1:1లో కొరింథులోను, అకయయందంతటను ఉన్న పరిశుద్ధులకని వ్రాయబడినందున కొరింథిలో నున్న 18 మాసాలలో అకయ దేశములోని మరికొన్ని స్థలాలలో ఆయన పని చేసి సంఘము లేర్పరచెనని తలంతుము.

1 కొరింథు 5:9లో జారులతో సాంగత్యము చేయవద్దని నా పత్రికలో మీకు వ్రాసి ఉంటిని అన్నందున మొదటి కొరింథు పత్రిక కంటె ముందుగా మరియొక పత్రిక వ్రాసినాడు. దాని వివరములు మనకు లభ్యము కాలేదు. బైబిల్‌నందలి మొదటి కొరింథు పత్రిక నిజానికి రెండవ పత్రికగా తలంచగలము. అటులయిన బైబిల్‌లోని రెండవ పత్రిక నిజానికి మూడవ పత్రిక కాగలదు. 2వ కొరింథు 7:8,9 వచనములలో నా పత్రిక దుఃఖపెట్టినందున మీరు మారుమనస్సు పొందినవారు అని సంతోషించుచున్నాను కాని 2వ కొరింథీ. 2:5-8లో అట్టి మారుమనస్సు పొందిన వానిని ఇకను శిక్షింపక క్షమించి ఆదరించుట మంచిది లేని ఎడల వాడు దుఃఖములో మునుగునని బ్రతిమాలుచూ ఈ రెండో పత్రిక (3వ పత్రిక) వ్రాసెను.

2వ కొరింథీ 2:5-7 వచనములలో మొదటి కొరింథీ 5వ అధ్యాయములో జారత్వము జరిగించిన వాడు దిద్దుకొన్నట్లున్నది. 2వ కొరింథీ 12:2లో జారత్వము జరిగించి మారుమనస్సు పొందని వారిని గూర్చి దుఃఖపడవలసి వచ్చునేమో అని భయపడు చున్నాను, అని అన్నందున 10 నుండి 13 అధ్యాయాలు, రెండవ అధ్యాయము కంటె ముందటి సంగతులు అని గమనించగలము. అందువలన 10-13 అధ్యాయాలు 3వ పత్రికగాను, 1-9 అధ్యాయాలు నాలుగవ పత్రికగానూ కూడా తలంచవచ్చును.

2వ కొరింథు 2:12, 4:7ను బట్టి మాసిదోనియా నుండి వ్రాసెనని క్రీ.శ. 57 వ్రాసెనని తలంచగలము.

# రెండవ కొరింథీ పత్రిక

**పత్రిక అంశము** : పరిచర్య.

**పత్రిక విభజన** : 2+4+1+2+4=13 అధ్యా.

**1-2 అధ్యా.** : ప్రభువు నందలి జీవించు పరిచర్య.

**3-6 అధ్యా.** : ప్రభువు నందు చేయవలసిన పరిచర్య.

**7వ అధ్య.** : ప్రభువునందు ప్రత్యేకత గల పరిచర్య.

**8-9 అధ్యా.** : ప్రభువు కిచ్చు పరిచర్య.

**10-13 అధ్యా.** : ప్రభువు నందు (తన్ను) భద్రపరచుకొను పరిచర్య. (పౌలు పై విమర్శకు జవాబులు - ఋజువులు)

# కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక

గ్రంథకర్త : పౌలు . కాలము : క్రీ.శ. 56 (16:9). స్థలము : ఎఫెసీ. (16:9). కొనిపోయిన **వారు** : స్తెఫను (16:17).

**ముఖ్య ఉద్దేశము** : లోపములు దిద్దుట.

1) పౌలు మొదటి కొరింథీ. 3:6లో నేను నాటితిని, అపొల్లో నీళ్ళు పోసెను అనుట వలన కొరింథి సంఘములో వీరిరువురు పని చేసిరని లేఖనముల వలన తెలియు చున్నది. నేను కేఫావాడను, అని కొందరు అనుటను బట్టి పేతురు పరిచర్యలో మేలుపొందినవారు కూడా కొరింథు సంఘములో గలరని తలంచగలము. అతి విద్య చదివిన పౌలు (అ.కా. 26:24) విద్యలేని పామరుడైన పేతురు (అ.కా. 4:13). విద్వాంసుడైన అపొల్లో (అ.కా. 18:24), వీరికి పరిచయమైనందున కొరింథీయులకు పరిచారకులైన వీరు కలిగినట్టి లోకజ్ఞానమును బట్టి అభిప్రాయ బేధములు కలిగినవి. అందుచేత లోకజ్ఞానమును ఆధారము చేసికొనుటలో లోపములను 1,2 అధ్యాయాలలో తెలిపెను. 2) పనిని గూర్చి పరిచారకులను గూర్చిన అవగాహనలోని లోపములను 3,4 అధ్యాయాలలో తెలిపెను. 3) పట్టణములో వ్యభిచారముండుట చేత విశ్వసించిన కొరింథీయులలోను జారత్వముండుట ఒకరిపై ఒకరు అన్యుల ఎదుట వ్యాజ్యమాడుట లోపములని 5,6 అధ్యాయాలలో తెలిపెను. 4) వివాహ జీవితమును గూర్చి 7వ అధ్యాయములో తెలిపెను. 5) విగ్రహార్పితమైనది భుజించుటను గూర్చియు అందులోని లోపములను 8 అధ్యాయాలలో తెలిపెను. 6) పనివారలను గూర్చిన విమర్శలకు జవాబును 9వ అధ్యాయములో తెలిపెను. 7) పితరుల జీవితములోని లోపములను 10వ అధ్యా. తెలిపెను. 8) కూడి వచ్చుటలోను, 9) ప్రభువు రాత్రి భోజనము చేయుటలోని లోపమును 11వ అధ్యాయములోను, 10) ఆత్మీయ వరములను తెలుసుకొనుటలోని లోపములను గూర్చి 12వ అధ్యాయములోను, 11) ప్రేమలేని తనమును లోపమును గూర్చి 13వ అధ్యాయములోను, 12),13) ఆత్మ సంబంధమైన వరములను వాడుకొనుటలోని లోపములను 14వ అధ్యాయాలలోనూ, 14) పునరుత్థానమును గూర్చిన అవగాహనలోని లోపములను 15వ అధ్యాయములోను, 15) చందా పోగుచేయుటలోని లోపములను 16వ అధ్యాయములో వ్రాయుచూ ముగింపు మాటలు పలికెను.

## అధ్యాయముల విభజన 6+2+2+6=16 అధ్యా.

**I. 1-6 అధ్యా. తెలియవచ్చిన లోపములను దిద్దుట :**

**1) 1-2 అధ్యాయము** : లోకజ్ఞానమును ఆధారము చేసుకొని విభజింపబడుట అను లోపము.

**2) 3-4 అధ్యాయము** : పని పరిచారకులను గూర్చిన అవగాహనలోని లోపము.

**3) 5-6 అధ్యాయము** : జారత్వము, వ్యాజ్యము అను లోపములు.

**II. 7-8 అధ్యాయాలు వ్రాసిన విషయంలోని లోపములను దిద్దుట :**

**4) 7వ అధ్యాయము** : వివాహ జీవితమును గూర్చి అవగాహనలోని లోపములు.

**5) 8వ అధ్యాయము** : విగ్రహార్పితములు భుజించుటలోని లోపములు.

**III. 9-10 అధ్యాయములు విమర్శించిన విషయములోని లోపములను దిద్దుట :**

**6) 9వ అధ్యాయము** : సువార్త ప్రకటించువాడు జీవించుటలోను ప్రకటించుటలోని లోపములు.

**7) 10వ అధ్యాయము** : పితరుల దృష్టాంతముల నుండి బుద్ధి మాటలు.

**IV. 11-16 అధ్యాయములు కూడివచ్చుటలోని లోపములు దిద్దుట (వరములను వాడుకొనుట, పునరుత్థానము, చందా అను లోపములు) :**

**8) 11వ అధ్యాయము** : 1-16వ, స్త్రీ పురుష క్రమములోని లోపములు.

**9) 11వ అధ్యాయము** : 17-34వ ప్రభురాత్రి భోజనమునకు కూడి వచ్చుటలోని లోపము.

**10) 12వ అధ్యాయము** : ఆత్మీయ వరములను తెలుసుకొనుటలోని లోపములు.

**11) 13వ అధ్యాయము** : ప్రేమలేని తనము అను లోపము.

**12) 14వ అధ్యాయము** : 1-25వ. ఆత్మీయ వరములను వాడుకొనుటలోని లోపములు.

**13) 14వ అధ్యాయము** : 26-40వ. ఆరాధనకు కూడివచ్చు వరములను వాడుకొనుటలోని లోపములు.

**14) 15వ అధ్యాయము** : పునరుత్థానమును గూర్చిన అవగాహనలోని లోపములు.

**15) 16వ అధ్యాయము** : చందా పోగు చేయుటలోని లోపములు - ముగింపు.

# 1వ అధ్యాయము 3+8+8+6=31 వచనములు
# అంశము : లోకజ్ఞానమును ఆధారము చేసుకొని సహోదరులతో బేధములు కలిగి ఉండుట అను లోపము (20వ.)

**పీఠిక (1-9వ.)** : 1-3వ. సంఘ క్రమములను గూర్చి లోపములు దిద్దుటకై ఈ పత్రిక వ్రాయుచున్నందున తాను క్రీస్తు యేసు యొక్క అపొస్తలుడనని దేవుని చేత పిలువబడిన వాడనని చెప్పుచున్నాడు. సంఘములోనున్న వారిని దిద్దుట పత్రిక ఉద్దేశము కాని సంఘము అనగా 1) క్రీస్తు యేసునందు పరిశుద్ధ పరచబడినవారు. 2) పరిశుద్ధులుగా నుండుటకు పిలువబడినవారని జ్ఞాపకము చేయుచున్నాడు. సంఘమందు సమాధానము లేదు కనుక సమాధానము మీకు కలుగును గాక అని వ్రాయుచున్నాడు.

**కొరింథీయులలోనున్న తప్పులు దిద్దాలి (4-9వ.)** : కాని ముందుగా తప్పులు చెప్పకుండా 4-6 వచనములలో మీకు కృప అనుగ్రహించబడినది. క్రీస్తును గూర్చిన సాక్ష్యము మీలో స్థిరపరచబడినది. ఉపదేశములో, జ్ఞానములో మీరు ఐశ్వర్యవంతులు అంటున్నాడు. తప్పులు దిద్దాలి కాని 7-9వ వచనములలో మీరు కృపావరముల యందు లోపము లేనివారు. ప్రభువు ప్రత్యక్షత కొరకు ఎదురు చూచుచున్నారు అని మెచ్చుకొను చున్నాడు. మిమ్మును పిలిచిన నమ్మదగిన దేవుడు నిరపరాధులుగా స్థిరపరుస్తాడు అంటున్నాడు. ఎవరిలోనైన తప్పులను దిద్దవలసిన మాదిరి యిందులో చూడగలము.

**పత్రిక యొక్క ఉద్దేశము (10-17)** : మీలో ఏకభావము, ఏకమనసు, ఏక తాత్పర్యము లేవని తెలిసినది. కక్షలు, కలహములు ఉన్నవి. వ్యక్తులను ఆధారము చేసికొని విభజించ బడియున్నారు. 9వ వచనములో యేసుక్రీస్తు సహవాసమునకు మనము పిలువబడ్డామని చెప్పుచున్నాడు. అనగా వ్యక్తుల పేరున విభజించబడుట తప్పు. వరము కలిగిన సేవకులైన పౌలు, పేతురు, అపొల్లోలను గౌరవించాలి కాని వారిని మన సహవాసమునకు కేంద్రము లుగా ఎంచకూడదు. మనము పిలువబడినది యేసుక్రీస్తు సహవాసమునకు. మనకు నచ్చినవారిని బాప్తీస్మమిచ్చిన వారిని కేంద్రముగా కలిగి వారిని బట్టి విభజించబడ కూడదు. విశ్వాసులమైన మన ముఖ్య ఉద్దేశ్యము 1. సిలువ వ్యర్థము కాకూడదు అనగా, 2. సిలువను గూర్చిన వార్త ప్రకటింపబడాలి, 3. వాక్చాతుర్యము లేకుండా ప్రకటించాలి అందులో శక్తియున్నది.

**లోక జ్ఞానము చేత దేవుని ఎరుగలేము (18-25)** : లోకపు జ్ఞానులు, శాస్త్రులు. తర్కవాదులు తమ జ్ఞానము చేత దేవుని ఎరగలేరు. సువార్త ప్రకటన లోకానికి వెర్రితన

మైనను దాని మానవులునమ్మి రక్షణపొందాలి. అందుకై సిలువ వేయబడిన క్రీస్తు ప్రకటించ బడుచున్నాడు. గ్రీకులు జ్ఞానము దైవమని తలంచి జ్ఞానమును వెదకుచున్నారు. యూదులకు గ్రీసు దేశస్తులకు క్రీస్తే దేవుని శక్తి దేవుని జ్ఞానము. కనుక క్రీస్తు సిలువను గూర్చిన వార్తయే ప్రాముఖ్యమైనది కాని లోక జ్ఞానము ప్రాముఖ్యము కాదు.

**రక్షణ కొరకైన పిలుపులో లోక సంబంధమైన జ్ఞానులు సిగ్గుపరచబడిరి (26-31)** : దేవుడు పిలిచినవారిలో లోకరీతిని జ్ఞానులు, ఘనులు, అనేకులు పిలువబడక, వెర్రివారు, బలహీనులు, నీచులు, తృణీకరింపబడినవారు, ఎన్నికలేని వారు పిలువబడిరి. దేవునిచేత ఏర్పరచబడిరి. కనుక మన స్థితినిబట్టి కాక ప్రభువును బట్టియే అతిశయించాలి. పౌలు అతివిద్య చదివినవాడు (అ.కా. 26:24). అపొల్లో విద్వాంసుడు (అ.కా. 18:24) పేతురు విద్యలేని పామరుడు (అ.కా. 4:13) లోక జ్ఞానము కల పౌలు అపొల్లో వంటివారు, జ్ఞానములేని పేతురు వంటివారు కొరింథీయులకు పరిచయమైనందున, వారి జ్ఞానమును బట్టి కొరింథీయులు అతిశయించకుండ విభజింపబడకూడదని ఈ అధ్యాయములో చెప్పుచున్నాడు. సిలువ వేయబడిన క్రీస్తు సిలువను గూర్చిన ప్రకటన, దేవుని పిలుపును లక్ష్యముంచాలని లోక స్థితిగతులు, జ్ఞానమును బట్టి అతిశయించకుండ మనము క్రీస్తునందే అతిశయించాలి.

## 2వ అధ్యాయము 5+6+5=16 వచనములు
## అంశము : దేవుని జ్ఞానమునందు మర్మముగా నున్న పరిశుద్ధాత్మని శక్తి కనుక లోక జ్ఞానమును ఆధారము చేసుకొనరాదు.

**లోక జ్ఞానాతిశయము, వాక్చాతుర్యమును సువార్త ప్రకటనకు తగనివి (1-5వ.)** : లోక జ్ఞానము తనకున్నను మొదటి అధ్యాయములో చెప్పబడినట్లు జ్ఞానాతిశయముతో గాని వాక్చాతుర్యముతో గాని దేవుని శక్తి ప్రకటించలేదని చెప్పుచున్నాడు. 1) సిలువ వేయబడిన యేసునే ప్రకటించాడు. 2) జ్ఞాన యుక్తమైన తియ్యని మాటలు వినియోగించలేదు, 3) పరిశుద్ధాత్మయు దేవుని శక్తియు కనుపరచు దృష్టాంతములనే వినియోగించాడు. శరీరమునకు, లోక జ్ఞానమునకు మనము తావియ్యని యెడల పరిశుద్ధాత్మ తన కార్యము జరిగించును.

**లోక జ్ఞానము (కాక) మరుగైన దేవుని జ్ఞానము (6-11వ.)** :

**దేవుని ఆత్మ బయలు పరచిన సంగతులు బోధించాలి (12-16వ.)** : క్రీస్తునందు పరిపూర్ణుల (పసి బిడ్డలు కాక ఎదిగినవారు) మధ్య దేవుని జ్ఞానము బోధించాలి. దేవుని

జ్ఞానమనగా, 1) ఈ లోక జ్ఞానము కాదు, 2) లోకాధికారులు తమ జ్ఞానముతో లోకమును పరిపాలించ గలరు. దేవుని జ్ఞానము దానికి భిన్నమైనది, 3) దేవుని జ్ఞానము మర్మముగా నున్నది. 4) ఈ జ్ఞానము జగదుత్పత్తి నుండి మరుగుగానున్నది. 5) లోకాధికారుల కది అర్థము కాలేదు, కావున క్రీస్తును సిలువ వేసిరి, 6. దేవుడు మనకు సిద్ధపరచినవి, 7) దేవుని ఆత్మ మనుష్యుల కంటికి, చెవికి, హృదయానికి గోచరము కాలేదు. వాటిని మనకు బయలు పరచును. దేవుని మర్మము దేవుని ఆత్మ వలననే తెలిసికొనగలము. ప్రకృతి సంబంధులు దేవుని ఆత్మ విషయములు గ్రహింపజాలరు, అంగీకరించరు కనుక మనము మనుష్య జ్ఞానముతో కాక ఆత్మ సంబంధమైన సంగతులను ఆత్మానుభవములో ఆత్మ నేర్పు మాటలతో వివేచించాలి, నేర్చుకోవాలి, సరిచూచుకొనాలి, బోధించాలి.

రెండవ అధ్యాయ సారాంశము దేవుని ఆత్మయే ప్రాముఖ్యమైనది. 1) పాపులు రక్షింపబడుట పరిశుద్ధాత్మ ద్వారానే దేవుడు మన కొరకు సిద్ధపరచినవి బయలు పరచుట. ఆ పరిశుద్ధాత్మ ద్వారానే, 3) బోధించుట కవసరమైన మాటలనిచ్చువాడు పరిశుద్ధాత్మయే. 4) మనకు క్రీస్తు మనసు ననుగ్రహించువాడు పరిశుద్ధాత్మయే!

## మనము క్రీస్తు మనసును కలిగియుండాలి

## 3వ అధ్యాయము 4+5+6+5+3=23 వచనములు

## అంశము : ప్రని గూర్చిన అవగాహనలోని లోపము

శరీర సంబంధులు, పసిబిడ్డలు బలహీనులు, ప్రకృతి సంబంధులుగానున్న **కొరింథీయులు (1-4)** : ప్రభువునందలి పరిచర్యను గురించిన సరియైన అవగాహన లేకపోవుటకు వారియొక్క బలహీనమైన ఆత్మీయస్థితియే కారణము. వారింకను ప్రభువులో 1. పాలు త్రాగువారుగాను, 2. పసిపిల్లలు గాను, 3. బలము లేనివారుగాను, 4. అన్నము తినలేనివారుగాను, 5. శరీర సంబంధులుగాను, 6. ప్రకృతి సంబంధులుగాను ఉన్నారు. పౌలు ఇంతవరకు ఆత్మ సంబంధమైన మనుష్యులుగా లేరని చెప్పుచున్నాడు. వారిని పాలతోనే పసిపిల్లలను పెంచినట్లు పెంచాడు. కొరింథీయులు బలము లేనివారు, అన్నము తినలేని వారు. హెబ్రీ. 4:12, 5:12-14 వ. 1 పేతురు 2:2-3 వచనములు ధ్యానించవచ్చును.

ఇంకను మనుష్యరీతిగానే నడచుకొనుచున్నారు. పౌలు, అపొల్లోలు వరముగల వారైనను కొరింథీయులు వారిని వేరు వేరు పక్షముగా చేసి కొరింథీయులు కూడా

భాగములుగా విడిపోవుట సరికాదు. ఇది మనుష్యరీతిగా నడుచుకొనుట ప్రకృతిలో ఈలాంటివి జరుగును. లోకములోని మానవులు ఒకరొక పక్షమున, మరొకరు మరొకరి పక్షమున ఎంచుకొందురు. మొదటి అధ్యాయము చివర నేర్చుకొన్నట్లు అందరు ప్రభువునందే అతిశయించాలి. రెండవ అధ్యాయము చివరలో నేర్చుకొన్నట్లు క్రీస్తు మనసు కలిగిన వారుగానుండాలి. కాని లోకములోనున్నట్లు వరములు కలిగిన దైవజనులను వేరు వేరు పక్షములుగా తలంచి వారిని ప్రకృతి సంబంధులైన మనుష్యులవలె ప్రవర్తించు చున్నారని తెలుపుచున్నాడు.

**పరిచారకులు పనులు - ఫలము** : అపొల్లో పౌలులు పనిచేయు పరిచారకులే. ప్రభువు పనిని గురించిన కొన్ని విషయాలు గమనించాలి. 1) పని అనుగ్రహించువాడు ప్రభువే! 2) పని ఫలితమే కొరింథీయులు విశ్వసించుట, 3) పౌలుకు ప్రభువు నాటే పని నిచ్చాడు, 4) అపొల్లోకు నీరుపోసే పని నిచ్చాడు అనగా ఒక్కరికి పని పూర్తిగా అప్పగింప బడలేదు, 5) నాటువానిలోను, నీరుపోయువాని లోను ఏమియు లేదు. వృద్ధి నిచ్చినవాడు ప్రభువు, 6. నాటువాడు నీళ్ళు పోయువాడు ఒకటే అనగా తేడాలు లేవు. జత పనివారు (9వ) అనగా సమానమైన వారు. హెచ్చు తగ్గులు లేవు, 7) వారు చేసిన పనికి కష్టము కొలది ప్రభువు జీతమిచ్చాడు. కాని వారికి అతిశయము లేదు. ఇందులో దేవుని పనిని వ్యవసాయముతో పోల్చుచున్నాడు. నాటినవాడు నీరుపోసినవాడు ప్రతివానికి ఇక్కడ జీతమివ్వబడును. ఇది సువార్త ప్రకటించి ఆత్మలను సంపాదించు పని. మరొక పనియైన దేవుని గృహము కట్టబడుటను గూర్చి క్రింది భాగములో వివరించబడినది.

**పని పరీక్షించబడుట - ఫలము (జీతము) పొందుట (10-15)** : దేవుని గృహము దేవుని ఆలయమేనని 16వ వచనములో చెప్పుచున్నాడు. సువార్త పనిలో సంపాదించబడిన వారందరు 1 పేతురు 2:5 ప్రకారము సజీవమైన రాళ్ళవలె నుండి ఆత్మ సంబంధమైన మందిరముగా కట్టబడుచున్నారు. దేవుని గృహము, ఆలయము, మందిరము ఒకటియే. ఈ మందిరమునకు క్రీస్తు పునాది. పౌలు పునాది వేసాడు. అనేకులు దానిపై కట్టుచున్నారు. ఎలాగు కట్టుచున్నారో జాగ్రత్తగా చూడాలి. 2 థెస్స. 1:7,8 ప్రకారము ప్రభువు పరము నుండి అగ్నిజ్వాలలతో ప్రత్యక్షమైనప్పుడు అగ్నిచేత పరీక్షింపబడును. ఇక్కడ మూడు రకములైన పనులు కనబడుచున్నవి.

1. అగ్నికి నిలిచినపని - జీతము కలదు - తనమట్టుకు రక్షింపబడును.

2. 5వ. అగ్నిలో కాలిపోయిన పని - జీతము లేదు - తన మట్టుకు రక్షించబడును.

3. 17వ. దేవుని ఆలయమును పాడు చేసిన పని - దేవుడు వానిని పాడు చేయును (శరీర సంబంధమైన నష్టము కలుగును) - రక్షణ శాశ్వతము.

**పరిశుద్ధముగానుండుట - జ్ఞాని అగునట్లు వెర్రివాడుగా నుండుట (16-20) :** 16-17వ దేవుని ఆలయము పరిశుద్ధమైనది. మీరు ఆ ఆలయమైయున్నారు. అనగా, పరిశుద్ధత మనయందు నివసించాలి. ఆలయము పాడగుట సంఘమందు పాపమునకు తావిచ్చుటయే. 16వ వచనములో దేవుని (పరిశుద్ధ) ఆత్మ మీలో నివసించుచున్నాడు. పరిశుద్ధత మనయందు వ్యక్తిగతముగాను, సంఘముగాను సంపూర్ణ స్వాతంత్ర్య ముండవలెను. అప్పుడు దేవుని ఆత్మ నివసింపగలడు. 18-20వ. పైన చెప్పబడిన విషయములలో ఎవడును తన్ను తాను మోసపరచు కొనరాదు. 1) ఆలాగైతే లోక జ్ఞానమును అనగా శరీర సంబంధమైన జ్ఞానమును ఆధారము చేసికొనకూడదు. కాని తాను జ్ఞానిని అనుకొనువాడు లోక దృష్టికి వెఱ్ఱివాడు కావటానికి సిద్ధముగా నుండాలి. ఎందుకనగా ఈ లోక జ్ఞానము దేవుని దృష్టికి వెఱ్ఱితనము జ్ఞానుల యోచనలు వ్యర్థములని ప్రభువు సెలవిచ్చుచున్నాడు.

**పరిచారకులైన మనుష్యుల యందు అతిశయింపకూడదు (21-23వ.) :** ఈ భాగము నాలుగవ అధ్యాయమునకు ఉపోద్ఘాతము గాను, మొదటి మూడు అధ్యాయముల సారాంశముగానున్నది. మనుష్యులైన పరిచారకులందరు అతిశయించకూడదు.. మనము క్రీస్తుకు చెందినవారము కాని, మనుష్యులకు కాదు. మనుష్యులైన పౌలు, అపొల్లో కేఫాలను దేవుడు మనకొరకు ఇచ్చినందున వారు మనవారు. మానవ జీవన విధానములు, మరణ భయములు, లోకమందున్న ప్రస్తుత శక్తి విధానములు, రాబోవు విధానముల క్రీస్తు వలన మన కొరకు ఏర్పరచబడినవే. ఎందుకనగా, మనమందరము క్రీస్తు వారము అనగా మనుష్యులైన పౌలువారము, కేఫావారము అపొల్లోవారముకాదు.

మొదటి అధ్యాయము చివరలో 31వ వచనములో 1) ప్రభువునందే అతిశయింప వలెను. (పరిచారకులైన మనుష్యులందు కాదు) రెండవ అధ్యాయము చివర 16వ వచనములో 2) మనమైతే క్రీస్తు మనసు కలవారము. దేవుని జ్ఞానమైన ఆత్మను కలవారము కనుక లోక జ్ఞానముతో కాక ఆత్మానుభవముతో అనగా క్రీస్తు ఆత్మతో సంగతులు వివేచించాలి). మూడవ అధ్యాయము చివరలో 23వ వచనమందు 3) మీరు క్రీస్తు వారు. (మనుష్యుల వారుగా నుండరాదు)

# 4వ అధ్యాయము 5+8+8=21 వచనములు
## అంశము : పరిచారకులను గూర్చిన అవగాహనలోని లోపము

**పరిచారకులు నమ్మకమైన దేవుని గృహ నిర్వాహకులు - వారిని విమర్శింపరాదు (1-5)** : పరిచారకులు దేవుని సేవించినవారు. దేవుని మర్మముల విషయములో గృహ నిర్వాహకులు. దేవుని ఇంటిలో నమ్మకస్తులై వారికి బయలుపరచబడిన దేవుని మర్మముల సత్యమును సరిగా అందించువారు. ఇందులో మనుష్య విధానములకు జ్ఞానమునకు తావు లేదు కనుక ఏ మనుష్యుడు వారిని విమర్శించకూడదు. తమ మట్టుకు తాము జాగ్రత్తగా నుందురు. అయినను వారు నీతిమంతులని కాదు గాని విమర్శ దినమందు దేవుడు వారిని తీర్పు తీర్చును. అంధకార మందలి రహస్యములను వెలుగులోనికి తెచ్చి దేవుడు వారిని అందరిని తీర్పు తీర్చి ప్రతి వానికి తగిన మెప్పునిచ్చును.

**పరిచారకుల స్థితి (6-13)** : పరిచారకులలో ఒకరి పక్షమున మనము చేరి ఇతరుల మీద ఉప్పొంగ కూడదని చెప్పుచున్నాడు. పరిచారకులకు వరములను ఆధిక్యతలను ఇచ్చినవాడు దేవుడే. పరిచారకులు తాము కలిగిన వాటిని ప్రభువు వలనను ఇతరుల వలనను పొందిరి. ఇందులో వారి గొప్పతన మేదియు లేదు. వారికి వేరు వేరు పక్షములు లేవు. మనము వారిలో ఒకరి పక్షమున చేరుట లేఖనములను అతిక్రమించుటయే!

| క్ర.సం | వచనము | కొరింథీయులు | పరిచారకులైన సేవకులు |
|---|---|---|---|
| 1. | 8వ | కొదువలేక తృప్తులైరి | కొదువలు కలవారు |
| 2. | 8వ | ఐశ్వర్యవంతులైరి, రాజులైరి | పరిచారకులు విడువబడిరి |
| 3. | --- | ----------- | మరణదండన విధింపబడినవారు |
| 4. | 9వ | --------- | లోకమునకు, మనుష్యులకు వేడుకానున్నారు అందరికంటే కడపటనున్నవారు |
| 5. | 10వ | క్రీస్తు నిమిత్తము బుద్ధిమంతులు | క్రీస్తు నిమిత్తము వెర్రివారు |
| 6. | 10వ | బలవంతులు | బలహీనులు |
| 7. | 11వ | ఘనులు | ఘనహీనులు |
| 8. | | | |

| | | | |
|---|---|---|---|
| 9. | | | ఆకలి దప్పులు కలవారు |
| 10. | | | దిగంబరులు |
| 11. | | | పిడిగుద్దులు తినువారు |
| 12. | | | నిలువరమైన నివాసము లేనివారు. |
| 13. | 12వ | | స్వహస్తములతో కష్టపడి పనిచేయుచున్నారు. |
| 14. | | | నిందింపబడుచున్నవారు |
| 15. | 12వ | | హింసింపబడుచు దీవించువారు |
| 16. | 13వ | | దూషింపబడియు బ్రతిమాలుకొనువారు |
| 17. | 13వ | | లోకమునకు మురికిగా ఎంచబడినవారు |
| 18. | 13వ | | అందరిచేత పెంటగా ఎంచబడుచున్నవారు |

**క్రీస్తునందు సువార్త వలన కనిన పరిచారకులు తండ్రులు - వారి మాదిరి ననుసరించి నడుచుట (14-17వ.)** : పరిచారకులు సువార్త ప్రకటించి ఆత్మలను సంపాదించు వారుగా నుండాలి. అట్టి వారే తండ్రులు. ఉపదేశకులైన వారు వేల కొలది కలరు. వీరు పాఠశాలలో పాఠములను బోధించు ఉపాధ్యాయుల వంటివారు. పిల్లల భవిష్యత్తు విషయము శ్రద్ధలేదు. కాని పరిచారకులు ఆత్మలను సంపాదించుదురు. సంపాదించిన ఆత్మలకు నడవవలసిన రీతిని బోధించి బ్రతిమిలాడి ప్రయాసతో వారిని పెంచుదురు. అవసరమైనపుడు నమ్మకమైన మాదిరిగల తిమోతివంటి జతపనివారిని పంపి పౌలు తాను బోధించు విధమును నడుచుకొను విధమును కొరింథీయులకు జ్ఞాపకము చేయుచున్నట్లు ప్రతి పరిచారకుడు చేయాలి. ఈ పరిచర్య ఎంతో అవసరమైనది. "బోధ - నడక" ఈ పుస్తకములో ప్రారంభములో తెలిసినట్లు పౌలు వ్రాసిన ప్రతి పత్రికలోను మనము చూడగలము. పరిచారకులు కేవలము బోధించుట మాత్రమే కాక మాదిరియైన నడకను కలిగియుండాలి.

**తండ్రులైన పరిచారకులు వ్యక్తిగతముగా వెళ్ళి పరామర్శించాలి (18:21)** : తిమోతి వంటివారిని పంపుట మాత్రమే కాక వ్యక్తిగతముగా వెళ్ళాలి. పౌలు తిమోతిని పంపినందున

ఇక పౌలు రాడని కొద్దిమంది ఉప్పొంగుచు శక్తిలేని వట్టి మాటలతో కాలము గడుపు చున్నారు. పౌలు వెళ్ళి వారితో సరి దిద్దుదునని సెలవిచ్చుచున్నాడు. దేవుని రాజ్యము యొక్క శక్తిని గూర్చి వారికి తెలుపుదునంటున్నాడు. ప్రేమ సాత్వికమైన మనసుతోను వెళ్ళుట యుక్తమని తెలుపుచున్నాడు. బెత్తముతో మీ యొద్దకు రావలెనా? అనుట అలాగు వెళ్ళుదునని తెలుపుట కాదు. ఎవరి యొద్దకైనను పౌలు ఆ రీతిగా వెళ్ళినట్లు లేఖనముల యందు మనము చూడము. కాని 5:4లో జారత్వము చేసిన వ్యక్తి విషయములో తీర్పు తీర్చుటను వివరముగా ఐదవ అధ్యాయములో చూడగలము. నైతిక పాపము విషయమై సహనము చూపక తీర్పు తీర్చుట అవసరమే. దేవుని రాజ్యము శక్తితో యున్నది.

3,4 అధ్యాయాలో పరిచారకులను గూర్చిన 6 సాదృశ్యములు చెప్పబడినవి.

1. వ్యవసాయదారుడు నాటువాడు, నీరుపోయువాడు...... 3:6.
2. కట్టువాడు - కట్టుట. 3:10.
3. గృహ నిర్వాహకుడు - నమ్మదగిన నాయకుడు 4:1.
4. తండ్రి - ఆదరించువాడు. 4:15.
5. ఉపదేశకుడు - బోధించాలి. 4:17.
6. క్రమపరచువాడు - చక్క దిద్దాలి. 4:21.

## 5వ అధ్యాయము 5+3+5=13 వచనములు

## అంశము : జారత్వమను లోపము - జారులతో సాంగత్యములోని లోపము

సంఘమందున్న జారత్వమను లోపము - క్రమశిక్షణ (1-5వ.) : జారత్వమున్నదన్న (వదంతి)........దట. ఇది కొనసాగుచున్న పాపము. 4వ అధ్యాయములో విమర్శింప వద్దన్న పౌలు జారత్వము వంటి విషయములో తీర్పు తీర్చితిని అంటున్నాడు. వెలివేయుడి అని 13వ వచనములోను, సాతాను కప్పగించుడని 5వ వచనములోను చెప్పుచు శరీరేచ్ఛలు నశించుటకై, శరీరము నశించుటకై అలాగు చేయమన్నాడు. కాని ఆ వ్యక్తిని పూర్తిగా పోగొట్టుకొనుమని చెప్పుట లేదు. 2 కొరింథీ. 2:7లో విశేషభారము మోపకూడదని, శిక్ష తదుపరి ఆదరించుట మంచిదని లేని యెడల అతనికి అత్యధిక దుఃఖము కలుగునని

చెప్పుచున్నాడు. అందువలన క్రమశిక్షణ ఉద్దేశము ఆ వ్యక్తి దిద్దుకొని తిరుగ సంఘములో చేర్చబడవలె ననునదియే. అనేక పర్యాయములు సంఘముల మధ్య ఈ రీతిగా జరుగుట లేదు. దీర్ఘ పరిశీలన ఎంతో అవసరము.

**పాపము లేకుండ జీవించుట - పులియని రొట్టెల పండుగ (6-8వ.)** : ప్రభువు పిల్లలు పాపము లేకుండా జీవించాలి. మొదటి 5వ వచనములలోనున్న నైతిక పాపము సంఘమంతటిని పాడు చేయును. కొంచెము పులుపు ముద్దంతటిని పాడు చేయుట అను సామాన్యముగా వంట ఇంటిలో జరుగు కార్యములతో పోల్చి చెప్పుచున్నాడు. ధర్మ శాస్త్రమందలి పులియని రొట్టెల పండుగ. పులుపు లేకుండా పండుగ ఏడు దినములు ఆచరించాలి. దీని భావము రక్షింపబడినవారు పాపము లేకుండా ఏడు దినములు అనగా జీవితకాలమంతా జీవించాలి. దుర్మార్గత, దుష్టత్వము పాపములని, నిష్కాపట్యము సత్యము పులియని రొట్టెలని సెలవిచ్చుచున్నాడు.

**జారులతో సాంగత్యము (9-13వ.)** : లోకములో అనగా ప్రభువును అంగీకరించని వారిలో 1) జారత్వము చేసినవారు కలరు, 2) లోభులు అనగా డబ్బు విషయములలో అన్యాయముగా సంపాదించవలెనన్న ఆపేక్ష గలవారు లోకములో కలరు, 3) దోచుకొను వారు, 4) విగ్రహారాధికులు జారులతో సాంగత్యము చేయకూడదని 9వ వచనములో చెప్పి విశ్వాసులు పైన చెప్పబడిన వారితో సాంగత్యము చేయకూడదని పౌలు చెప్పుట లేదు. లోకములో అనుదిన జీవితములో మనము అటువంటి వారితో కలసి ఉద్యోగము చేయాలి, కలసి ప్రయాణించాలి. అమ్ముటలో కొనుటలో వారితో సంబంధముండును. అటువంటి వారితో సాంగత్యము చేయకుండుట అనగా ఈ లోకములో నుండి వెళ్ళి పోవునంత వరకు సాధ్యము కాదు. సాంగత్యము చేయని యెడల వారికి సువార్త ప్రకటించుట ప్రభువు కొరకు వారిని సంపాదించుట వీలు కాదు. కాని సహోదరులలో పైన చెప్పబడిన నాలుగు గుణములతో కలసి 5. తిట్టు బోతులు, 6. త్రాగుపోతులు ఉన్న యెడల అట్టి వారితో సాంగత్యము చేయరాదు. కలసి భోజనము చేయరాదని చెప్పుచున్నాడు. అటువంటి సహోదరులను వెలి వేయాలి. ఆ వివరములు 1-8 వచనములలో గమనించితిమి కనుక సారాంశముగా వెలుపటి వారికి మనము తీర్పు తీర్చక ప్రభువు తీర్పుకే అప్పగించాలి కాని సహోదరుల నైతిక విషయమును గూర్చి సంఘము తీర్పు తీర్చి వారిని క్రమపరచవలెను.

# 6వ అధ్యాయము 3+5+3+5+4=20 వచనములు
## అంశము : వ్యాజ్యము - జారత్వము అను లోపములు.

**వ్యాజ్యములు అను లోపము(1-11వ.):**

**అనీతిమంతుల యెదుట వ్యాజ్యమాడు కొరింథీయులు (1-7వ.) :**

**పరిశుద్ధుల ఆధిక్యత :** పరిశుద్ధులు ప్రకటన 20:11-15 వచనములలోనున్న ధవళమైన సింహాసనము ఎదుట లోకములోని పాపులకు జరుగు తీర్పు తీర్చుదురు. (2వ) యూదా 6,11వ. 2 పేతురు 2:4లోనున్న దేవదూతలకు చేయబడు తీర్పు పరిశుద్ధులచే తీర్పు తీర్చబడును. గనుక అనీతిమంతుల యెదుట వ్యాజ్యమాడుట లోపము.

**పరిశుద్ధుల అవివేకము (4-8వ.) :** కొరింథు సంఘమందలి విశ్వాసులలో ఒకరిపై ఒకరికి జీవన సంబంధమైన విషయములో వ్యాజ్యములు కలుగగా సహోదరులతో ఆలోచించి దిద్దుకొనుటకు బదులు అవిశ్వాసుల యెదుట వ్యాజ్యమాడుచున్నారు. ఇది తప్పని అసలు ఒకని మీద ఒకడు వ్యాజ్యమాడుట కేవలము లోపమని అంతకంటే అన్యాయము సహించుట మేలని, సొత్తులు అపహరింపబడనిచ్చుట మేలని చెప్పు చున్నాడు. పరిశుద్ధులు లోకము యెడల ఎంతో జాగ్రత్తగా నుండవలెనని లేని యెడల దేవుని నామము దూషణపాలగునని నేర్చుకొనుచున్నాము.

**నీతిమంతులుగా తీర్చబడిన అన్యాయస్థులైన కొరింథీయులు (9-11వ.) :** కొరింథీయులు ఒకప్పుడు అన్యాయస్థులు, జారులు, వ్యభిచారులు, దొంగలు, లోభులు త్రాగుబోతులై దేవుని రాజ్యమునకు అయోగ్యులైయుండిరి. కాని వారు ప్రభువైన యేసు నామమున కడుగబడి నీతిమంతులుగా తీర్చబడిరి. కనుక అనీతిమంతుల యొద్దకు వెళ్ళి వ్యాజ్యమాడుట కేవలము లోపమని చెప్పుచున్నాడు.

**జారత్వమను లోపము (12-16వ.) :** ఒకప్పుడు జారులైన వారిని యేసు ప్రభువు కరుణించి పరిశుద్ధపరచి నీతిమంతులుగా తీర్చినందున దేహమును జారత్వమునకు అప్పగింపకూడదని చెప్పుచున్నాడు. దేహమును, ఆత్మ ప్రాణములను ప్రభువు విమోచించాడు. మరణించిన పిదప మనుష్య దేహములను ప్రభువు తన శక్తి వలన లేపును. మన దేహములు క్రీస్తు శరీర అవయవములని చెప్పుచున్నాడు. ఇటువంటి గొప్ప ధన్యత గల దేహమును జారత్వమున కప్పగింపక ప్రభువు నిమిత్తము వాడవలెనని చెప్పుచున్నాడు.

**దేహముతో దేవుని మహిమపరచుట (17-20వ.)** : దేహము దేవుని వలన అనుగ్రహించబడినది. పరిశుద్ధాత్మకు ఆలయమైయున్నది. 1 కొరింథీ. 15:42-44వ ప్రకారము మానవ శరీరము క్షయమైనది, బలహీనమైనది. ఘనహీనమైనది, ప్రకృతి సంబంధమైనది కాని పునరుత్థానములో అక్షయమైనదిగాను, బలమైనదిగాను, ఘనమైనదిగాను ఆత్మ సంబంధమైనదిగా లేపబడును. ఇంతగొప్ప స్థితి మనకిచ్చుటకు క్రీస్తు విలువ పెట్టి మన ప్రాణ ఆత్మ శరీరములను కొన్నాడు. ఇంతగొప్ప స్థితి శరీరమునకున్నందున శరీరమును హానికరమైన జారత్వమున కప్పగింపకుండ దేవుని మహిమ పరచుట కప్పగించాలి. "మన శరీరము దేవుని మహిమ కొరకే".

## 7వ అధ్యాయము 8+8+8+6+5+5=40 వచనములు
## అంశము : వివాహాలు - విడుదలలు - వివాహ జీవితమును గూర్చిన అవగాహనలోని లోపము (27వ)

**వివాహ జీవితమును గూర్చిన హెచ్చరికలు (1-8వ.)** : శరీరము దేవుని మహిమ కొరకని చెప్పిన తరువాత పెండ్లి కాని వారు శరీరమును పూర్తిగా దేవుని మహిమకు వాడ వీలగును. పెండ్లియయిన వానికి శరీర శ్రమలు కలుగును. కనుక వివాహ జీవితమునకు దూరముగానుండుట మంచిదే కాని జారత్వము అను పాపమునకు శరీరము నడుపుచున్నందున ప్రతివానికి స్వంత భార్యయుండుట మంచిది. భార్య శరీరముపై భర్తకు, భర్త శరీరముపై భార్యకు సంపూర్ణమైన అధికారముండును. భార్య భర్తలు తమలో ఒకరి యెడల మరొకరు వారి వారి ధర్మములు నడుపాలి. కొంతకాలము వరకు ఉభయుల సమ్మతి చొప్పున తప్ప ఒకరినొకరు యెడబాయకూడదు. సాతాను శోధనకు అవకాశమివ్వకూడదు. కాని వివాహము లేకుండా ఉండగలుగుట. దేవుని కృపావరము కలిగియుంటే అలాగే ఉండుట మంచిదేనంటున్నాడు. ఇది పౌలు యొక్క హితోపదేశము.

**విడుదలను గూర్చిన హెచ్చరికలు (9-16వ.)** : పెండ్లి చేసుకొనుట మేలేకాని పెండ్లి చేసికొనిన వారు ఎడబాటును కోరకూడదు. మత్తయి 19:6. ప్రకారము, దేవుడు జతపరచిన వారిని మనుష్యుడు వేరుపరచకూడదు. ఇద్దరిలో ఒకరు అవిశ్వాసులై విడిచినను విడిచిపెట్టబడినవారు పెండ్లి చేసికొనకూడదు. అవిశ్వాసురాలైన భార్యలు గలవారు తనతో కాపురము చేయుటకు భార్య ఇష్టపడిన యెడల భార్యను యెడబాయ

కూడదు. అలాగే అవిశ్వాసులైన భర్తలు గల భార్యలు తన భర్త తనతో కాపురము చేయ ఇష్టపడిన యెడల యెడబాయకూడదు. అవిశ్వాసులైన సహోదరులు తమను బట్టి పరిశుద్ధ పరచబడుదురు. పిల్లలు పవిత్రముగానుండుటకు ఇది అవసరము. అవిశ్వాసియైన వాడు ఎడబాసిన యెడబాయ వచ్చును. కాని సహోదరునికి నిర్బంధము లేదు. విశ్వాసులైన వారు అవిశ్వాసులైన సహచరులను రక్షణలో నడిపించవీలగును.

**వివాహ జీవితములో పిలువబడిన స్థితి - ఆ స్థితియందే దేవుని మహిమ పరచుట (17-24వ.)** : కొరింథీయులలో యూదులు, అన్యులు ఉన్నందున కొందరు సున్నతి పొందినవారు మరికొందరు సున్నతి పొందనివారు. సున్నతి గలిగి పిలువబడినవారు. ఆ స్థితియందే ఉండుట. సున్నతి లేక పిలువబడినవారు ఆ స్థితియందే ఉండి దేవుని మహిమ పరచవలెను. ఆలాగే సామాజిక జీవితములో దాసులుగా నుండి పిలుపబడిన వారు అదే స్థితిలోనేయుండి స్వతంత్రులుగానున్న వారు స్వతంత్రులగుటకు శక్తియుండిన యెడల మరి మంచిది. అందరు క్రీస్తు దాసులుగానున్నారు. కనుక మనుష్యులకు దాసులు కాక తాము పిలువబడిన స్థితిలోనే దేవునితో సహవాసము కలిగియుండాలి.

**వివాహితులు - అవివాహితులను గూర్చినది (25-30వ. 32-35వ.)** : 25-30వ. పెండ్లియైన వారు తామున్న స్థితిలోనే ఉండుట, పెండ్లి కాని వారు తామున్న స్థితిలోనే ఉండుట మంచిదని చెప్పుచున్నాడు. పెండ్లి చేసుకొనుట పాపము కాదు కాని పెండ్లియైన వారికి శరీర సంబంధమైన శ్రమలు కలుగును. 31-35వ లోకము దాని నటన త్వరగా గతించును గనుక లోకములో ఉన్నవి తమవి కానట్టు గుర్తెరిగి, అపరిమితముగా లోకమును అనుభవించకుండ ప్రభువును మాత్రమే సంతోషపెట్టాలి. పెండ్లియైనవారు తమ సహచరులను ఏలాగు సంతోషపెట్టవలెనని లోక సంబంధమైన వాటిని గూర్చి చింతించుదురు. పెండ్లి కాని వారు ఎలాగు పవిత్రతను కాపాడుకోవలెనో ప్రభువును ఏలాగు సంతోషపెట్టగలమని ప్రభువు విషయమైన కార్యములను గూర్చి చింతించుదురు. యోగ్య ప్రవర్తన కలిగి ప్రభువు సన్నిధానవర్తనులై యుండుటయే ప్రాముఖ్యమైనది.

**కుమార్తె వివాహ విషయమై తండ్రి బాధ్యత - విధవరాండ్రను గూర్చిన హెచ్చరిక (36-40వ.)** : 36-38వ. కుమార్తెకు వివాహ వయసు వచ్చినను, మీరినను తన ఇష్ట ప్రకారము వివాహము చేయుటలో పాపమేమియు లేదు. కుమార్తె పెండ్లి చేసికొనవచ్చును. కాని తన కుమార్తెకు పెండ్లిచేయ అవసరము లేకయుండి తన ఇష్ట ప్రకారము జరుప గలవాడైన యెడల అదియును మంచిదే. పెండ్లి చేయుట మంచిదే. చేయకపోవుటయు మంచిదే. ఎట్లయినను ప్రభువును సంతోష పెట్టుటయే ప్రాముఖ్యము.

**ముగింపు (32-40వ.)** : భార్య తన భర్త బ్రతికినంత కాలమే బద్ధురాలు కాని భర్త చనిపోయిన తరువాత మరొకరిని ప్రభువునందు పెండ్లాడాలి. కాని విధవరాలుగా నుండినను మంచిదే. ఏ రీతిగానైనను ప్రభువును సంతోషపెట్టవలెనని ఆలోచన కలిగి ఉండాలి.

## 8వ అధ్యాయము 3+3+3+4=13 వచనములు
## అంశము : విగ్రహార్పితములు భుజించుటలోని లోపము (4వ)

**ప్రేమ క్షేమాభివృద్ధిని కలుగచేయును (1-3వ.)** : మొదటి అధ్యాయమున్నట్లు 22వ. కొరింథీయులు జ్ఞానమును వెదుకువారు. ఆ జ్ఞానము వారిని ఉప్పొంగ చేయును. జ్ఞానమునకు మితము లేదు కనుక ఒకడు తాను నేర్చుకొనవలసినది ఇంకను ఉన్నట్లు గుర్తించాలి. ప్రేమ ఉప్పొంగక క్షేమాభివృద్ధిని కలుగచేయును. మనుష్యుడు దేవుని ప్రేమించిన దేవుని యెరుకలో తానున్నానని గుర్తించి తృప్తిగానుండును. కావున ప్రేమ కలిగి క్షేమాభివృద్ధి చేసుకొను వారముగానుండాలి.

**విగ్రహాలు వట్టివి - వేరొక దేవుడు లేడు (4-6వ.)** : విగ్రహములు మానవులు చేసినవైనందున అవివట్టివి అందులో దైవత్వము లేదు. ప్రభువు అనబడినవారు లోకమందున్నారు. దేవతలూ అనబడినవారు ఆకాశమందు భూలోకమందు ఉన్నట్లు లోకము నమ్ముచున్నారు. నిజమైన దేవుడొక్కడే ఆయన నుండియే సమస్తము కలిగెను. ప్రభువు ఒక్కడే. ఆయన యేసు. ఆయన ద్వారా సమస్తము కలిగెను. మనము క్రీస్తు ద్వారా కలిగి తండ్రి నిమిత్తము ఉన్నాము కనుక దేవుని నిమిత్తమే జీవించాలి.

**విగ్రహార్పితములు భుజించుట ఇదివరకు విగ్రహముల నారాధించిన ఇప్పటి బలహీనులైన విశ్వాసుల కభ్యంతరము (7-9వ.)** : ఇది వరకు విగ్రహముల నారాధించిన బలహీనులైన విశ్వాసులు తాము భుజించునవి విగ్రహములకు అర్పించబడినవని నమ్మి భుజింతురు కనుక వారి మనస్సాక్షి బలహీనమై అపవిత్రమగును కనుక విగ్రహార్పితములను భుజించుట బలహీనుల కభ్యంతరము కలిగించుటయే.

**బలహీనుల కభ్యంతరము కలిగించుట క్రీస్తుకు విరోధముగా పాపము చేయుట (10-13వ.)** : మనము విగ్రహ ఆలయమందు పంక్తిలో కూర్చుండుట బలహీనుడైన సహోదరుడు చూచిన యెడల విగ్రహములకు బలి ఇవ్వబడిన పదార్థములను తినుటకు

ధైర్యము తెచ్చుకొనును. క్రీస్తు తన కొరకు మరణించెనను సంగతిని బలహీనుడైన సహోదరుడు అపార్థము చేసుకొని నశించును. కనుక బలహీనుడైన సహోదరుని మనస్సాక్షిని నొప్పించి క్రీస్తుకు విరోధముగా పాపము చేసిన వారమగుదుము. భోజనమును బట్టి సహోదరులకు అభ్యంతరము కలిగించరాదు.

## 9వ అధ్యాయము 13+1+13=27 వచనములు
## అంశము : సువార్త ప్రకటించువాడు ప్రకటించుటలోను జీవించుటలోని లోపము

నాలుగవ అధ్యాయములో పనివాని పరిస్థితి, చివరలో పనిని గూర్చిన సాదృశ్యములు పనిని గూర్చి పనివారిని గూర్చిన మరికొన్ని వివరములు ఈ అధ్యాయ మందు గమనించండి.

**పీఠిక - పని - ఫలము (1-3వ.)** : 3వ వచనములో నన్ను విమర్శించు వారికి నేను చెప్పు సమాధానమిదే అని ఉన్నందున విమర్శించిన లోపములను దిద్దుటకైన జవాబు ఈ అధ్యాయమందు కలదని గుర్తించవలెను. 1-2వ సువార్త ప్రకటనకై అ.కా. 13:1-3లోనున్నట్లు ప్రత్యేకించబడినవారు స్వతంత్ర్యులే. ప్రభువు చేత పిలువబడిన వారు, ఆమోదించబడినవారు. వారి సువార్త ప్రకటన ద్వారా ఫలమును అనగా నమ్మిన వారిని రుజువు కలిగినవారు.

**సువార్త పనిలో ఫలము - పనిలో అధికారము (4-6వ.)** : 4వ వచనములో సువార్త కొరకై ప్రత్యేకించబడినవారు తిని త్రాగుటకు గల అధికారమేమి? 5వ వచనములో భార్యను వెంటబెట్టుకొని తిరుగుటకు గల అధికారమేమి? 6వ వచనములో పని చేయుటలో గల అధికారమేమి అని మూడు ప్రశ్నలు కన్పించుచున్నవి.

**సువార్త పని - ఫలమును గూర్చి లోకాచారము నుండి ధర్మశాస్త్రము నుండి వివరణ (7-9వ.)** : 7వ వచనములో సువార్త ప్రకటించు పరిచర్య 1) దండులోని కొలువుతోను, 2) ద్రాక్షాతోట వేసి ఫలములు కోసికొను పనితోను, 3) మందను కాచి మంద పాలు త్రాగుటతోను పోల్చబడినది. పనివాడు స్వంతము వేసిన తోట కన్పించుచున్నది. ఒక మందను కాయుటను కూడా చూపించుచున్నాను. ఇందులోని విషయములు 1) సువార్త ప్రకటించుట ద్వారా సంఘ సాక్ష్యములు ఏర్పడాలి, 2) ఏర్పడిన సంఘమును మందలను కాయాలి, 3. త్యాగ సహితముగా, సమర్పణ కలిగి ఎంతో క్రమశిక్షణతో దండులోని

కొలువువలె పని చేయాలి. ద్రాక్షా తోటలోని ఫలము తినాలి, మందపాలు త్రాగాలి. సువార్త ప్రకటన ద్వారా తాను సంపాదించిన సంఘము యొక్క ఫలము అనగా రాబడి సువార్తికుని పోషణకై వాడబడాలి. సువార్తికుడు కాయుచున్న మంద పాలు త్రాగుట కూడా ఈ తలంపును బలపరచుచున్నది. దండులోని కొలువుకు సైనికునికి జీతము లభించినట్లు సువార్తికుడు ఫలమును పొందాలి కాని తన స్వంత ఖర్చుపెట్టుకొని పని చేయకూడదు. 8వ. పై ఉదాహరణలు లోకాచారము నుండి చెప్పబడినవి. సైనికుని వంటి క్రమశిక్షణ, 2) వ్యవసాయ దారునివలె తోటలు వేయుట, 3) మందల కాపరివలె **కాయుట** అను మూడు పనులు ప్రత్యేకించబడిన పనివాడు చేయాలి.

9వ. ధర్మశాస్త్ర ఆచారము నుండి కళ్ళము త్రొక్కుచున్న ఎద్దు మూతికి చిక్కము పెట్టకూడదని చెప్పుచున్నాడు.

**వ్యవసాయ విధానము నుండి - ఆలయ పరిచర్య నుండి వివరణ (10-13వ.) :** వ్యవసాయమందు, దున్నుట, విత్తుట, కోయుట, కళ్ళము త్రొక్కించుట అను పనులు ఉండును. పనివాడు పంటలో పాలు పొందినట్లు ఆత్మ సంబంధమైనవి విత్తువాడు శరీర ఫలములు కోసికొనుట గొప్ప కార్యము కాదని, శరీర ఫలములు సువార్త ప్రకటించు వానికి ఇవ్వవలెనని చూచుచున్నాము. 12-13వ. ఆలయ కృత్యములు జరిగించువారు, బలిపీఠము నొద్ద కనిపెట్టుకొనియుండువారు బలిపీఠము పై అర్పించబడిన వాటిని పుచ్చుకొని ఆలయము వలన జీవనము చేయుదురు. కాని పౌలు సువార్తకు అభ్యంతరము కలుగకుండునట్లు ఈ అధికారమును వినియోగించుకొనలేదు.

**సువార్త ప్రచురించు వాని జీవనము కొరకైన ఫల సారాంశము (14వ.) :** పైనున్న 13 వచనములలో సువార్త ప్రచురించు వారి విధానము, జీవన విధానము లోకాచారమును బట్టి, ధర్మ శాస్త్రమును బట్టి, వ్యవసాయ విధానమును బట్టి, యెరూషలేము దేవాలయ పరిచర్యను బట్టి చెప్పిన పిమ్మట సారాంశము చెప్పుచున్నాడు. ప్రభువు నియమమేదనగా సువార్త ప్రచురించువారు సువార్త వలన జీవించాలి. సంఖ్యా 18:21వ. ద్వితీ. 14:22-28వ వచనములలో దశమభాగములన్ని లేవీయులకు ప్రత్యేకించబడిన సేవకులకు ఇవ్వబడినవి అని ఉన్నది. వారి అవసరములన్ని సువార్త వలన మేలు పొందిన సంఘములు తీర్చాలి. సువార్త ప్రకటన అనికాక సువార్త ప్రచురణ అని వ్రాయబడినది. ప్రచురణ అనగా కన్నులకు కన్పించునది. ప్రకటించువారు క్రీస్తును కన్నుల యెదుట గలతీ. 3:1వ. ప్రకారము ప్రదర్శించాలి. అప్పుడు సువార్త ప్రకటన ప్రచురణగానుండును.

**సువార్త ప్రకటన కొరకు పిలుపు - భారము - జీతము (15-18వ.)** : 15-16వ సువార్త ప్రకటన కొరకై పిలువబడి ఆ భారము తనపైనున్నదని గుర్తించుచున్నాడు. ఆ భారము దించు వరకు తనకు శ్రమ ఉండును. గనుక సువార్త ప్రకటింపక పోయిన యెడల నాకు శ్రమ అంటున్నాడు. తన కిష్టమున్నను లేకపోయినను బాధ్యత తనపై ఉన్నందున ప్రకటింతునంటున్నాడు. ఇష్టపడి చేసిన జీతము దొరుకును.

**తాను సువార్తను ఉచితముగా ప్రకటించుటయే జీతమని చెప్పుచున్నాడు (17వ.)** : 17వ. జీతము దొరుకును. 18వ. జీతమేమి. 19వ. జీతము ఉచితము. ఉచిత జీతముగల పనిని ఇష్టపడిచేయు వారెవరు లోకములోనుండరు. కాని సువార్త ప్రచురించువాడు ఉచిత జీతము కొరకు ఇష్టపడి పని చేయు పోలును మాదిరిగానుంచుకొనాలి.

**సువార్తలో సంపాదించవలసిన వివరము - ఫలము (19-22)** : 19వ. అందరిని సంపాదించుటకు అందరికి నన్ను నేను దాసునిగా చేసుకొనుట. 20వ. యూదులను సంపాదించుటకు యూదులకు యూదునివలె నుండుట ధర్మశాస్త్రమునకు లోబడిన వారిని సంపాదించుటను ధర్మశాస్త్రము లోబడినవానివలె నుండుట. 21వ. ధర్మశాస్త్రము లేనివారిని సంపాదించుటకు ధర్మశాస్త్రము లేనివాడనుగా ఉండుట. 22వ. బలహీనులను సంపాదించుటకు బలహీనుడుగానుండుట ఏ విధముచేతనైన కొందరిని రక్షించుట ముఖ్య ఉద్దేశము కనుక అందరికి అన్ని విధముల వాడుగానుండుట.

**పొందబోవు ఫలము (కిరీటము) (23-26వ)** : సువార్త ప్రకటన యును సేవా జీవితమును ఒక పందెపు రంగమందు పరుగెత్తి బహుమానము పొందుటతో పోల్చుటను చూడగలము. పరుగెత్తువాడు అన్ని విషయములలో మితముగానుండును. గురి గలిగి నియమ ప్రకారము పరుగెత్తును. పరుగెత్తుటలో అపరిమితముగా పరుగెత్తును క్షయమగు కిరీటము పొందును. కాని యేసు ప్రభువు తన పిల్లలకు, ఆకాశ మండలమందు 2 కొరింథీ. 5:10వ.లోనున్న తీర్పులో అక్షయ కిరీట మిచ్చును.

**ముగింపు (27వ)** : 2 తిమోతి 2:4లోనున్నట్లు నియమ ప్రకారము పోరాడకుంటే కిరీటము దొరుకదు కనుక ఇతరులకు ప్రకటించిన తరువాత మనమే భ్రష్టులము (DISQUALIFY) కాకుండునట్లు జాగ్రత్తపడాలి. మన శరీరమును నలుగగొట్టుకొని లోపరచుకొనాలి. క్షయమగు శరీరాశలను విసర్జించి అన్ని విషయములలో మితముగా నుండి నియమ ప్రకారము జీవించువాడు అక్షయ కిరీటము పొందును. మిగిలిన కిరీటములను గూర్చి ఆలోచింతము.

**1) అక్షయ కిరీటము** : (1 కొరి. 9:25వ) క్షయమైన శరీరము కొరకు శరీరరేశ్చలోను. క్రమ పరచుకొని నియమ ప్రకారము పరుగెత్తువారు ఈ కిరీటము పొందుదురు.

**2) జీవ కిరీటము** : శోధనలకు లొంగక, శోధనను జయించి నమ్మకముగా జీవించిన వారికి జీవ కిరీటమివ్వబడును. (యాకోబు 1:12వ. ప్రకటన 2:10)

**3) నీతి కిరీటము** : జీవితకాలమంతా పాపమునకు తావివ్వక నీతిగా జీవించు వారికివ్వబడును. (2 తిమోతి 4:8).

**4) మహిమ కిరీటము** : కాపరులు, ఉపదేశకులు బోధకులు తమకప్పగింపబడిన మందలకు మాదిరిగానుండుట ద్వారా పొందుదురు. (1 పేతురు 5:2-4వ).

**5) ఆనంద అతిశయ కిరీటము** : ఆత్మలను సంపాదించు వారి కివ్వబడును (1 థెస్స. 2:19).

**6) సువర్ణ కిరీటములు** : దైవత్వమును కలిగి జీవించిన వారికివ్వబడును. (ప్రక.4:4).

**7) ముండ్ల కిరీటము** : ముండ్లు శాపమునకు గురుతు (ఆది. 3:18వ) మన శాపమును గ్రహించిన క్రీస్తు గురుతుగా ముండ్ల కిరీటము ధరించి మనకు ఆరు రకములైన కిరీటములను ఇచ్చుట ఆశ్చర్యము.

## 10వ అధ్యాయము 5+5+3+4+5+5+6=33 వచనములు
## అంశము : పితరుల లోపముల దృష్టాంతము నుండి బుద్ధిమాటలు

**పితరుల అధిక్యతలు (1-5వ.)** : పితరులైన ఇశ్రాయేలీయులు ఐగుప్తు నుండి పస్కా (గొఱ్ఱెపిల్ల రక్తము) ద్వారా విడిపించబడుట (నిర్గమ 12 అధ్యా.) యేసు రక్తము ద్వారా రక్షింపబడుటకు సాదృశ్యము. ఎఱ్ఱ సముద్రములో మేఘము క్రింద దాటుట (నిర్గమ 14వ అధ్యా.) బాప్తిస్మమునకు సాదృశ్యము. నిర్గమ. 16వ అధ్యా. మన్నా భుజించుట 17లో బండను చీల్చగా వచ్చిన నీటిని త్రాగుట రొట్టె రసములో పాల్గొనుటకు ఆరాధనకు గురుతు. కాని వారు దేవునికి అయిష్టులుగా నుండి అరణ్యములో సంహరించబడుట 1 కొరింథీ. 11:28-30వ. ప్రకారము శిక్ష పిదప మరణించుటకు సాదృష్యము.

**పితరుల క్షీణత (6-10వ.)** : 1) 6వ. చెడ్డ వాటిని ఆశించిరి, 2) 7వ. జనులు తినుచూ త్రాగుచూ ఆడుటకు లేచిరి, 3) 7వ. కొందరు విగ్రహారాధికులైరి. 4) 8వ. కొందరు వ్యభిచరించిరి, 5) 9వ. ప్రభువుని శోధించిరి, 6) 9వ. కొందరు సర్పముల వలన నశించిరి, 7) 10వ కొందరు సణిగి సంహారకుని చేత నశించిరి.

**బుద్ధి మాటలు (11-13వ.)** : తాను నిలుచున్నానని తలంచువాడు పడకుండ జాగ్రత్తగా చూచుకొనవలెను. ఎందుకనగా మనుష్యులకు కలుగు శోధనలే సహింప గలిగినంత శోధనలే కలుగును. శోధనతోపాటు తప్పించుకొను మార్గమును కూడా దేవుడు కలుగజేయును. ఉపాధ్యాయుడు పిల్లలకు పరీక్ష పత్రమిచ్చి, వాటికి జవాబులు వ్రాయు మార్గమును కూడా చూపినట్లుగా పై సంగతులున్నది. అందులకై దేవుని స్తుతించాలి. క్రొత్త నిబంధనలో 52 సార్లు జాగ్రత్త అను పదములు కలవు. ఒక్కొక్క వారమునకు ఒక్కటి ప్రకారము సంవత్సరమంతటికి 52 జాగ్రత్తలు కలవు. కావున ప్రతి విశ్వాసి సంవత్సర మంతయు అన్ని వారములలో జీవితకాలముతో జాగ్రత్తగానుండాలి. జాగ్రత్తల వివరములు చివరి పేజీలో చూడండి.

**విగ్రహార్పితములను భుజించుటను గూర్చిన బుద్ధిమాటలు (14-33వ.)** :

**ప్రభువు బల్ల........(18-22వ.) దయ్యముల బల్ల** : ప్రభువును నమ్మినవారు ప్రభువు రాత్రి భోజనములో పాలు పొందుచు తమ కొరకు బలియైన ప్రభువును, తమ పాపములను కడిగిన యేసు రక్తమును జ్ఞాపకము చేసికొందురు. విగ్రహములకు బలి అర్పించిన వాటిని తిను వారు గమనించవలసిన దేమనగా : 1) విగ్రహములకు అర్పించు బలులు దయ్యములకు అర్పించుటయే, 2) అట్టివి తినుట దయ్యముల బల్లలో పాలుపొందుట కనుక విగ్రహార్పితములను భుజింపకుండా జాగ్రత్తపడాలి.

**తినుటయందు గల స్వాతంత్ర్యమును వినియోగించుట - విమర్శింపబడకుండుట (23-27వ. 28-33వ)** : మనస్సాక్షి విషయమై విచారణ చేయక కటిక వాని అంగడిలో అమ్ము వాటిని భుజింపవచ్చును. అవిశ్వాసులలో ఒకడు విందుకు పిలిచినపుడు ఏ విచారణ చేయక తినవచ్చును. కాని ఇది విగ్రహార్పితమని ఎవరైనా చెప్పిన యెడల ఎదుటి వాని మనస్సాక్షి నిమిత్తము భుజించకుండుట మంచిది. మనము తీర్పు తీర్చబడుటకు అవకాశమివ్వకూడదు. భోజన పానముల నిమిత్తము దేవుని పని పాడు కాకూడదు, దేవుని సంఘమునకు అభ్యంతరము కలుగకూడదు. మన స్వప్రయోజనము ముఖ్యము కాదు. అనేకులు రక్షింపబడుటయే ముఖ్యము కాని ఎవరికి మనము అభ్యంతరముగానుండరాదు.

## 11వ అధ్యాయము 16+18=34 వచనములు
## అంశము : స్త్రీ, పురుషులు కూడివచ్చుటలోని లోపము ప్రభురాత్రి భోజనమునకు కూడివచ్చుటలోని లోపము.

విభజన - స్త్రీ, పురుషుడు కూడి ప్రార్థించుటలోను, ప్రవచించుటలోనున్న లోపములు **(1-16వ.)** : 1-5 వచనములలో దేవుని సృష్టి క్రమమును జ్ఞాపకము చేయుచున్నాడు.

స్త్రీకి శిరస్సు పురుషుడు. పురుషునికి శిరస్సు క్రీస్తు, క్రీస్తుకు శిరస్సు దేవుడు గనుక స్త్రీ ముసుకు లేకుండా ప్రార్థించుట, ప్రవచించుట తనతోనున్న పురుషుని అవమాన పరచుటయే. పురుషుడు ముసుకు వేసుకొనకూడదు. ఏలయనగా తనకు శిరస్సయిన క్రీస్తు అక్కడలేడు. స్త్రీయే ఉన్నది కనుక ముసుకు వేసికొనుట క్రీస్తును అవమాన పరచుటయే. 6-10 వచనములలో స్త్రీ ముసుకు వేసికొనని ఎడల తల వెంట్రుకలు కత్తిరించుకొనవలెను. స్త్రీ, పురుషుని నుండి కలిగినందున, స్త్రీ పురుషుని కొరకే కలిగినందునను స్త్రీ, పురుషుని మహిమ కనుక స్త్రీ ముసుకు వేసుకొనాలి. దేవదూతలను బట్టి స్త్రీకి ముసుకు అధికార సూచన. 11-16 వచనములలో స్త్రీకి వేరుగా పురుషుడు లేడని, పురుషునికి వేరుగా స్త్రీ లేదని చెప్పుచున్నాడు. పై భాగములో స్త్రీకి శిరస్సు పురుషుడు అనగా ఇది కుటుంబ వ్యవస్థ. పర పురుషుడు స్త్రీకి శిరస్సు కాడని గుర్తించాలి. స్త్రీ, పురుషుని కొరకు అనుట, స్త్రీ, పురుషుని నుండి కలిగినదనుట భార్య భర్తలైన స్త్రీ, పురుషుల గూర్చియే ప్రస్తావించుచున్నాడు. 1 కొరింథీ. 14:34వ. స్త్రీలు సంఘములలో మౌనము ఉండవలెను గనుక స్త్రీ సంఘములో ప్రవచించుటకు వీలు లేదు. పై భాగములోని వివరములు భార్యభర్తలైన వారిని గురించియేనని గుర్తింపవలెను.

**ప్రభురాత్రి భోజనమునకు సంఘము కూడి వచ్చుటలోని లోపము (17-34వ.) :** కక్షలు కలిగి ప్రభురాత్రి భోజనమునకు కూడి రాకూడదు. ప్రభురాత్రి భోజన సంస్కారము ప్రభువు ఇచ్చిన క్రమము, 1) రొట్టె విరుచుట, 2) పాత్రలోనిది త్రాగుట, 3) ప్రభువు వచ్చు వరకు ఆయన మరణమును ప్రచురించుట అనగా సువార్త ప్రకటన జరగాలి. ప్రతివాడు తన్నుతాను పరీక్షించుకొని అయోగ్యులుగా కాక, వివేచించి తిని, త్రాగాలి. లేనియెడల శిక్షగా 1. బలహీనత, 2. రోగము, 3. మరణము సంభవించును. కనుక కూడివచ్చుట శిక్షావిధికి కారణము కాకుండ చూచుకొనాలి.

## 12వ అధ్యాయము 3+4+4+8+8+4=31 వచనములు

### అంశము : ఆత్మ అనుగ్రహించు వరములను (CHARISMA) తెలిసికొనుటలోని లోపము (1వ.)

వరములకు సామర్థ్యమునకు గల తేడాను గుర్తించుట అవసరము. వరము పర సంబంధమైనది, ఆత్మ సంబంధమైనదై ఒక వ్యక్తికి రక్షించబడిన పిదప సంఘ క్షేమాభివృద్ధి కొరకు అనుగ్రహించబడును. కాని సామర్థ్యము ఒక వ్యక్తికి పుట్టుకతోనే అనుగ్రహించబడును. రక్షించబడిన పిదప సామర్థ్యమును కూడా సంఘ క్షేమాభివృద్ధి కొరకు వాడాలి.

**కొరింథీయుల ఆత్మీయ స్థితి (1-3వ)** : విగ్రహారాధికులైన అన్యజనులలో నుండి వీరు యేసును రక్షకుడుగా అంగీకరించిన వారు తమ ఆత్మీయ స్థితిని గురించి - ఆత్మ సంబంధమైన వరములను గూర్చి అవగాహనలేని వారుగానున్నారు. పరిశుద్ధాత్మ ద్వారానే ఒకడు యేసును రక్షకుడుగాను, ప్రభువుగాను అంగీకరించును. అలాగే ఆత్మ ద్వారానే కొరింథీయులు క్రీస్తును, రక్షకుడుగాను ప్రభువుగానే అంగీకరించిరని అనగా ఆత్మ ముద్రను ఎఫెసీ 1:13 ప్రకారము కలిగియున్నారని తెలుపుచున్నాడు. ఆత్మ సంబంధమైన వరములు ఆత్మ మన కనుగ్రహించబడిననాడు, అనగా రక్షించబడిననాడే అనుగ్రహించ బడినవి. వాటిని ఆ వ్యక్తి తరువాత గుర్తించును. ఎఫెసీ. 4:7వ. రోమా 12:6 ప్రకారము, వరము యొక్క పరిమాణము క్రీస్తుచే కృపతో పాటు, రక్షణతో పాటు అనుగ్రహించ బడును.

**వరముల పరిచర్యలో త్రియేక దేవుని పాత్ర (4-7వ.)** : మొదటిదిగా వరములు నానా విధములుగానున్నవి. అసంఖ్యాకములు, కొందరు తలంచునట్లు 8-11 వచనములలోనున్న వరములు 9 మాత్రమే కాదు. 28వ వచనములో మరి అయిదు వరములు చెప్పబడినవి. రోమా 12:6-8వ కొన్ని ఎఫెసీ 4:6-8వ మరికొన్ని చెప్పబడినవి. వరములను వాడుచూ జరిగించు పరిచర్యలు నానా విధములుగానున్నవి (5వ). పరిచర్య ద్వారా జరుగు కార్యములును నానా విధములుగానున్నవి. 4-6 వచనములలో వివరించ బడిన ఆత్మ ప్రత్యక్షత అందరి ప్రయోజనము కొరకు పరిశుద్ధాత్మ దేవుడు యేసు ప్రభువు దేవుడు తండ్రియైన దేవుడు అనగా త్రియేక దేవుని ద్వారా అనుగ్రహించబడినదని గుర్తించవలెను.

**వరములను తన చిత్త ప్రకారము, పరిశుద్ధాత్మ, ప్రతి ఒక్కరికి ప్రత్యేకముగా పంచి ఇచ్చుట (8-11వ, 28వ)** : వరములలో కొన్ని నిలిచిపోయినవని, నిరర్థకమగునని 1 కొరింథీ. 13:8లోనున్నందున కొన్ని వరములు తాత్కాలికమైనవి అనగా కాలపరిమితి కలవి. కొన్ని శాశ్వతమైనవని గమనించగలము. వరముల వివరములు.

| క్ర.సం | వరములు | వివరము |
|---|---|---|
| 1. | అపొస్తలత్వము (12:28<br>క్రీస్తును చూచినవారు, క్రీస్తుతోను<br>శిష్యులతోను కలసి ఉన్నవారు. (అ.కా. 1:22)<br>మత్తీయ (అ.కా. 1:26). పౌలు (రోమా 1:1)<br>బర్నబా (అ.కా. 14:14). యాకోబు (గలతీ. 1:19)<br>యూదా అపొస్తలత్వమును పోగొట్టుకొనెను.<br>కనుక పరిమితియున్నది. | పరిమితి గలది. |

| క్ర.సం | వరములు | వివరము |
|---|---|---|
| 2. | ప్రవచనము (12:10)<br>ఎఫెసి. 2:20. ప్రకారము సంఘ పునాది కాలమునకు పరిమితమైనది. | కాలపరిమితి కలదు. |
| 3. | అద్భుతములు (12:28) | తాత్కాలికమైనది |
| 4. | స్వస్థపరచుట (12:28) | తాత్కాలికమైనది |
| 5. | బుద్ధివాక్యము (12:8)<br>దేవుని వాక్య ప్రత్యక్షత కాలము ముగిసినది. కాని వాక్య వివరణ నేటి దినములలోకూడా అనుగ్రహించుచున్నది. | పరిమితమైనది. |
| 6. | విశ్వాసము (1 కొరింథీ. 12:8) | |
| | ఎ) రక్షణ కొరకు (అ.కా. 16:31) | అందరికి |
| | బి) పవిత్రపరచుకొనుట. (ఎఫెసీ. 6:16) | అందరికి |
| | సి) గృహ నిర్వాహకత్వము (1 కొరి. 12:9) | కొందరికి |
| 7. | భాషలు (1కొరి. 12:10) | తాత్కాలికమైనవి<br>(నిలిచిపోవునవి 13:8) |
| 8. | భాషలకు అర్థము చెప్పుట (1కొరి. 12:10) | తాత్కాలికమైనవి (13:8) |
| 9. | జ్ఞాన వాక్యము (1 కొరి. 12:8) | శాశ్వతమైనది. |
| 10. | ఆత్మల వివేచన (1 కొరి. 12:10) | తాత్కాలికమైనవి |
| 11. | పంచిపెట్టుట (రోమా 12:8) | కొందరికి శాశ్వతమైనది. |
| 12. | హెచ్చరించుట (రోమా 12:8) | కొందరికి శాశ్వతమైనది. |
| 13. | పరిచర్య చేయుట (1కొరి. 12:28. రోమా 12:8) | కొందరికి శాశ్వతమైనది. |
| 14. | కరుణించుట (రోమా 12:8) | కొందరికి శాశ్వతమైనది. |
| 15. | ప్రభుత్వము చేయుట (1కొరి. 12:28) | కొందరికి శాశ్వతమైనది. |
| 16. | బోధించుట 1 కొరి. 12:28) | కొందరికి శాశ్వతమైనది. |
| 17. | సువార్తికులు (ఎఫెసీ. 4:11) | కొందరికి శాశ్వతమైనది. |
| 18. | కాపరులు (ఎఫెసీ. 4:11) | కొందరికి శాశ్వతమైనది. |

వాక్యమును బోధించి కాయుట (యోహాను 21:15617)

గమనిక : పైనున్న 18 మాత్రమే వరములను తలంచక వరములు నానా విధములని, అసంఖ్యాకములని గుర్తించవలెను. 11వ. ఆత్మ నానా విధములైన వరములను తన చిత్త ప్రకారము (మన ఇష్ట ప్రకారము కాక) ప్రతివానికి (ఒక్కొక్కరికి) ప్రత్యేకముగా పంచియిచ్చును. అందరి ప్రయోజనము కొరకు అవి వాడబడుచుండాలి.

**వరములను వాడు వారు శరీర అవయవములవలె ఐక్యత కలిగి ఉండాలి (12-19వ.):**

**శరీర అవయవములవలె పరస్పర అవసరతను తీర్చగలగాలి (20-27వ.) :** విశ్వాసులందరు క్రీస్తు శరీరమునకు అవయవములు. కాని అందరికి ఒకే పని లేదు. ఒక్కొక్క అవయవమునకు వేరు వేరు పనులున్నట్లు ఒక్కొక్కరికి వేర్వేరు వరములు కలవు. (రోమా 12:7). అవయవములన్నియు ఏ రీతిగా ప్రాముఖ్యమైనవో విశ్వాసులందరు దేవునికి ముఖ్యమే. ఏ అవయవమైనను నేను శరీరమునకు చెందనని చెప్పకూడదు. అవయవములన్ని శరీరమందుండి ఐక్యముగానున్నట్లు విశ్వాసులందరు సంఘమందు ఉండి ఐక్యముగానుండాలి.

**దేవుడు సంఘమునకిచ్చిన వాటిలో శ్రేష్ఠమైన వాటినపేక్షించుట :** అందరికి అన్ని వరములు అనుగ్రహించబడవని పై భాగములను ధ్యానించి నేర్చుకొంటిమి. నానా విధములైన వరములను పరిశుద్ధాత్మ తన ఇష్టానుసారముగా అనుగ్రహించును. మనము శ్రేష్ఠమైన వాటిని అపేక్షించాలి.

## 13వ అధ్యాయము 3+4+5+1=13 వచనములు
## అంశము : ప్రేమను కలిగియుండకపోవుట అను లోపము

ప్రేమ అనుపదము గ్రీకు భాషలో నాలుగు వేరు వేరు పదములుగానున్నది. 1) అగాపే, (AGAPE) 2) ఫిలో, (PHILOE) 3) స్టోర్గోస్, (STORGOS) 4) ఈరో.

1. అగాపే అనగా దేవుడు మానవుల పట్ల కుమ్మరించిన ప్రేమ (రోమా 5:5). ఇందులో ప్రేమించువానికి తనకంటే ప్రేమించబడు వాడే ప్రాముఖ్యము. మనము దేవుని ప్రేమించితిమి అని కాదు తానే మనలను ప్రేమించి (1 యోహాను 4:10వ).

2) ఫిలో అనగా ఇద్దరు మానవులకుమధ్య ఉండు సహోదర ప్రేమ. అతడు నన్ను భోజనమునకు రమ్మనినాడు. నేను అతనికి భోజనము పెట్టాలి. అతడు నన్ను ప్రేమించాడు. కనుక నేను అతనిని ప్రేమించాలి. ఒకరికి ఒకరు బదులు చూపునది.

3. స్టోర్గోస్ అనగా కుటుంబ సభ్యుల మధ్య ఉండు అనురాగము. కుమారుడు తండ్రికి కీడు చేసినను తండ్రి కుమారుని ప్రేమిస్తాడు. కాని తనకున్న పరిధిలోనే కనుక ఇది శాశ్వతము కాదు.

4. ఈరోస్ అనగా స్వ లాభమును అపేక్షించు ప్రేమ. ప్రేమించబడువానికంటే ప్రేమించు వాడు తన స్వలాభమును చూచుకొనుట ఎదుటివాని లాభమును లెక్కచేయకుండుట. ఇది మోసముతో కూడినది (ERRATIC).

**ప్రేమ యొక్క ప్రయోజనము (1-3వ.)** : 1. ఈ అధ్యాయములో ప్రేమ అను గ్రీకుపదము అగాపే 9 పర్యాయములు కలదు. ముందు అధ్యాయములో కృపా వరములను గూర్చి తెలిపి వాటి విషయము ఉన్నత స్థితిలోనుండాలని సహోదరులు ఆశించుదురు. కాని ప్రేమలేక వరములను కలిగియుండుట వ్యర్థమని, నిష్ప్రయోజమని చెప్పుచున్నాడు.

**1వ వచనము** : మనుష్యుల భాషలతో మాటలాడుట గొప్ప సంగతియే కాని, దేవదూతల భాషలతో మాటలాడుట మరీ గొప్ప సంగతి. కాని ప్రేమ గల హృదయము లేకుండ ఎన్ని భాషలు మాటలాడినను గట్టి శబ్దము చేయునట్టి గంటలవలె ఉంటారు అన్నాడు.

**2వ వచనము** : 1. ప్రవచన వరము, 2. లేఖనముల యందలి జ్ఞానము, 3. పరిపూర్ణ విశ్వాసము అను వరములున్నవాడు ప్రేమ లేని యెడల వ్యర్థుడే. 3వ. బీదల పోషణకై ఆస్థి అంతటిని ఇచ్చినంతటి త్యాగము కలిగినవారు కాని, ప్రాణ త్యాగము చేసిన వారు కాని యథార్థమైన ప్రేమ లేని యెడల ప్రయోజనముండదు.

**ప్రేమ యొక్క గుణములు (4-7వ.)** :

**ఎ) నిజమైన ప్రేమలో ఉండు గుణములు** :

1. ప్రేమ దీర్ఘకాలము సహించును.
2. ప్రేమ దయ చూపించును.
3. ప్రేమ సత్యమునందు సంతోషించును.
4. ప్రేమ అన్నిటిని తాళుకొనును.
5. ప్రేమ అన్నిటిని నమ్మును.
6. ప్రేమ అన్నిటిని నిరీక్షించును.
7. ప్రేమ అన్నిటిని ఓర్చుకొనును.

8. ప్రేమ శాశ్వత కాలముండును.

9. ప్రేమ మత్సరపడదు.

10. ప్రేమ డంబముగా ప్రవర్తించదు.

11. ప్రేమ ఉప్పొంగదు.

12. ప్రేమ, అమర్యాదగా నడవదు.

13. స్వప్రయోజనమును విచారించదు.

14. త్వరగా కోపపడదు.

15. అపకారమును మనసులో ఉంచుకొనదు.

16. దుర్నీతి విషయమై సంతోషించదు.

సామెతలు 10:21వ. వచనములో ప్రేమ దోషమును కప్పును, ద్వేషము రేపును అని ఉన్నది. కనుక ప్రేమతో సమస్తము కప్పువారముగానుండాలి కాని రూపకూడదు.

ప్రేమ యొక్కశ్రేష్ఠత **(8-12)** : ఆత్మీయ వరములగు భాషలు నిలిచిపోయినవి, జ్ఞానము నిరర్థకమగునది 14:1లో ప్రవచన వరమును విశేషముగా అపేక్షించమన్నాడు కాని అదియు నిరర్థకమగును వరములలో కొన్ని నిలిచిపోవునవి. ప్రేమయే శ్రేష్ఠమైనది అని చెప్పుచున్నాడు. పూర్ణమైనది వచ్చినపుడు పూర్ణము కానివి నిరర్థకమగును అనుటలో భాషలు, ప్రవచనములు, జ్ఞానము పూర్ణము కానివని ఆత్మీయులు పెద్ద వారైనపుడు పిల్లవాని చేష్టలు మానివేయాలని, నిరర్థకమగునవి కాక శాశ్వతమైన ప్రేమ మీద దృష్టి యుంచవలెనని చెప్పుచున్నాడు. విశ్వాసము, నిరీక్షణ, ప్రేమ అను మూడు క్రైస్తవ జీవిత ప్రాముఖ్యతలు కాని క్రీస్తు ప్రత్యక్షమైనపుడు విశ్వాసముతోను నిరీక్షణతోను పని ఉండదు.

నిరీక్షించునది కనబడునపుడు నిరీక్షణతో పని ఉండదు. విశ్వాసము నిరీక్షించు వాటి నిజ స్వరూపము. (హెబ్రీ. 11:1) కాన విశ్వాసమునకు కర్తయైన క్రీస్తును చూచునపుడు, విశ్వాసముతోను, నిరీక్షణతోను పని ఉండదు. ప్రేమ ఒక్కటే క్రీస్తుకు, మనకు మధ్య శాశ్వతముగా నిలుచునది. కావున, ప్రేమయే శ్రేష్ఠమైనది.

## 14వ అధ్యాయము 6+7+6+6+8+7=40 వచనములు
## అంశము : వరములను వాడుకొనుటలోని లోపములు

**భాషలు Vs ప్రవచనము - ప్రవచనవరము యొక్క అవసరత శ్రేష్ఠము - సంఘ క్షేమాభివృద్ధి (1-6వ, 7-13వ)** : ఈ అధ్యాయమందు క్షేమాభివృద్ధి అను పదము ఏడు పర్యాయములు కలదు.

**1-3వ వచనము :** సంఘ క్షేమాభివృద్ధి ప్రాముఖ్యమైన అంశము. అందువలన సంఘమంతటికి హెచ్చరిక, ఆదరణ, క్షేమము, అభివృద్ధి కలుగునట్లు భాషల వరమును కాక ప్రవచన వరము అపేక్షించాలి. భాషతో మాటలాడువాడు మనుష్యులతో కాక దేవునితో మాటలాడును. ప్రవచించువాడు మనుష్యులతో మాటలాడి క్షేమాభివృద్ధి కలిగించును.

**4-6వ వచనము :** అర్థము చెప్పువాడు లేని యెడల భాషతో మాటలాడుట తనమట్టుకే క్షేమము. అందువలన ప్రవచనమే శ్రేష్ఠము. అందరు ప్రవచించవలెనని పౌలు కోరుచున్నాడు. భాషతో మాటలాడువాడు, వాక్య సత్యమును, వాక్యమందలి జ్ఞాన ఉపదేశమును, ప్రవచనమును గూర్చి గాని బోధను గాని మాటలాడడు. కనుక భాషల ద్వారా ప్రయోజనము లేదు.

**7-9వ వచనము :** వాయిద్యములు వాయించినపుడు స్వరములోని భేదమును బట్టి స్పష్టమగును. ఆలాగే నాలుకతో స్పష్టమైన మాటలు పలుకని యెడల గాలితో మాటలాడినట్లు ఉండును.

**10-13వ వచనము :** లోకమందున్న భాషలు అన్నియు స్పష్టములే. అందువలన అర్థము తెలియక మాటలాడు వాడు విను వానికి పరదేశిగానుండును. భాషతో మాటలాడువాడు అర్థము చెప్పలేని యెడల ప్రయోజనముండదు. కనుక సంఘమునకు క్షేమాభివృద్ధి కలిగించు ఆత్మ సంబంధమైన వరముల విషయమై ఆసక్తిగా నుండాలి.

**భాషలతో మాటలాడుట, ప్రార్థించుట (14-19వ.) :** భాషతో ప్రార్థించుట, ఆత్మతో ప్రార్థించుట, పాడుట, స్తోత్రము చేయుట వలన ఎదుటి వ్యక్తి గ్రహింపలేడు, ఆమెన్ చెప్పలేడు. క్షేమాభివృద్ధిని పొందలేడు. కనుక సంఘములో భాషతో పదివేల మాటలు పలుకుట కంటే మనసుతో ఐదు మాటలు బోధ కలుగునట్లు పలుకుట మేలు కనుక ప్రవచనము భాషలకంటే మేలు.

**భాషలు అవిశ్వాసులకు సూచన (20-25వ.) - ప్రవచన ఉద్దేశము సంఘ క్షేమాభివృద్ధియే :** యెషయా 28:11-12. వచనములలోనున్నట్లు బుద్ధి విషయము పసి పిల్లలుగా ఉండవద్దని చెప్పుచూ 21-23 వచనములలో భాషల విషయమై మాటలాడు చున్నాడు. అనగా భాషలు శిశువులుగా నుండి ఆత్మీయ అనుభవము లేనిస్థితికి చెందినవని స్పష్ట పరచుచున్నాడు. అ.కా. 2వ అధ్యాయములో పేతురు మాటలు 17 జనాంగముల వారికి వారివారి భాషలలో అర్థమైనవి. అది సంఘము యొక్క శిశువు దశ అని

చెప్పుచున్నాడు. అయినను ఇశ్రాయేలు వారు ఎక్కువ మంది నమ్మలేదు. భాషలు అక్కడ చేరిన 17 దేశములకు చెందిన అన్యులకు సూచనగా ఇవ్వబడినవని, విశ్వాసులైన వారికి సూచనలు కాదని 22వ. వచనములో చెప్పుచున్నాడు. ఆత్మీయులైన కొరింథీయులు భాషలతో మాటలాడినపుడు లోపలికి వచ్చిన క్రొత్త వారికి వెర్రిగానుండును. కనుక ప్రవచనమైతే క్రొత్త వారు తమ పాప స్థితిని గుర్తించి రక్షింపబడుటకు ప్రయోజన కరముగా నుండును కనుక భాషలు సంఘ ప్రారంభ కాలమునకు చెందినవని స్థిరపరచుచున్నాడు. 13:8-12వ ప్రకారము నేను పిల్లవాడనై యున్నపుడు పిల్లవానివలె ప్రవర్తించితిని. ఇపుడు పెద్దవాడనై పిల్లవాని చేష్టలు మానివేసితిని. అనుటలో భాషలు నిలిచిపోవునని 13:8లో చెప్పిన మాటను స్థిరపరచును. ఈ గ్రంథము క్రీ.శ. 56లో వ్రాయబడినది. క్రీ.శ. 57లో రెండవ కొరింథీ, రోమా పత్రిక క్రీ.శ. 61లో ఎఫెసీ, కొలస్స, ఫిలేమోను, పత్రికలు, క్రీ.శ. 62లో ఫిలిప్పీ పత్రిక, క్రీ.శ. 63లో మొదటి తిమోతి, క్రీ.శ. 64లో తీతు పత్రిక, క్రీ. 65,66లో రెండవ తిమోతీ పత్రిక, హెబ్రీ పత్రికలు వ్రాయబడినవి. క్రీ.శ. 57 తదుపరి వ్రాయబడిన గ్రంథములందు భాషల ప్రస్తావన లేనందున 1 కొరింథీ. 13:8లో చెప్పబడినట్లు భాషలు నిలిచిపోయినవని గ్రహింపవలెను. సంఘ ప్రారంభ కాలమునకు చెందినవైనందున ఈ కాలమునకవి అవసరము లేదు.

| క్ర.సం | వాక్య ప్రవచన అవసరత | భాషల అవసరత |
|---|---|---|
| 1. | 1వ.ప్రవచనవరము అపేక్షించతగినది | 1వ. భాషలను అపేక్షించుమని చెప్పబడలేదు |
| 2. | 2-4వ. ప్రవచనము ద్వారా సంఘమునకు క్షేమాభివృద్ధి కలుగును | 2వ భాషలద్వారా మాటలాడు వానికే క్షేమాభివృద్ధి |
| 3. | 5వ. ప్రవచింపవలెనని మరి విశేషముగా కోరుచున్నాను. | 5వ. భాషలతో మాటలాడ వలెనని కోరుచున్నాను. |
| 4. | 5వ. ప్రవచించువాడే శ్రేష్ఠుడు | 5వ. భాషతో మాటలాడువాడు అర్థము చెప్పాలి. |
| 5. | 6వ. ప్రవచనము ప్రయోజనకరమైనది | 6వ. భాషలు ప్రయోజనకరము కాదు |
| 6. | 7-9వ. ప్రవచనములో స్పష్టమైన మాటలుండును | 7-9వ. భాషలలో స్పష్టమైన మాటలు లేకపోవుట వలన మేలు లేదు |
| 7. | 10-11వ. ప్రవచనము స్పష్టమైనందున అందరికి అర్థమగును. | 10-11వ. భాషలు స్పష్టము కాని యెడల మాటలాడువాడు పరదేశిగానుండును |
| 8. | 12-14వ. భాషలేకుండా ప్రార్థించుట | 12-14వ. భాషతో ప్రార్థించుట |

| | | |
|---|---|---|
| | వలన మనసుకు ఫలవంతముగానుండును | వలన మనసు ఫలవంతముగా నుండదు. |
| 9. | 16వ. భాషలేకుండా ప్రార్థించుట వలన అందరికి అర్థమగును. | 16వ. భాషతో ప్రార్థించినపుడు అందరికి అర్థము కాదు. |
| 10. | 16వ. భాష లేకకుండా చేసిన ప్రార్థనకు అందరు ఆమెన్ చెప్పుదురు. | 16వ. భాషతో చేసిన ప్రార్థనకు అందరు ఆమెన్ చెప్పలేరు. |
| 11. | 19వ. ప్రవచనము ద్వారా ఇతరులకు బోధ కలుగు ఐదు మాటలైనను శ్రేష్ఠమే. | 19వ. భాషతో పదివేల మాటలు పలికినను మనసుకు మేలు లేదు. |
| 12. | 20వ. ప్రవచనము వయసు వచ్చినవారి అనుభవము. | 20వ. భాషలు శిశుప్రాయములో నున్నవారి అనుభవము. |
| 13. | 22వ. ప్రవచనము విశ్వాసులకు సూచన. | 22వ. భాషలు అవిశ్వాసులకు సూచన |
| 14. | 23వ. ప్రవచనము క్రొత్తవారికి అర్థమగును. | 23వ. భాషలు క్రొత్తవారికి వెర్రిగానుండును |
| 15. | 27-31వ. అందరు ఒకరి తరువాత ఒకరు ప్రవచించవచ్చును. | 27-31వ. భాషలతో మాటలాడిన ఎడల అర్థము చెప్పబడాలి |
| 16. | 31వ. అందరికి నేర్పుదల హెచ్చరికలు ఉండును. | 31వ. అందరికి హెచ్చరిక ఉండదు. |
| 17. | 32-33వ ప్రవచనము ద్వారా సంఘములో సమాధానము కలుగును. | 32-33వ. భాషలతో అల్లరి కలుగగలదు. |

**కూడి వచ్చి వరములను వాడుకొనుట - సంఘ క్షేమాభివృద్ధి (26-33వ.)** : ఆరాధనకై ఆదివారము కూడవలెని అ.కా. 20:7లో చెప్పబడినది. 26వ. ఆలాగు కూడి వచ్చినపుడు ఒకడు కీర్తన పాడవలెను. ఆలాగే మరొక కీర్తన పాడవచ్చును. మరి యొకడు అనగా మొదటివాడు కాదు, ఇంకొకడు ప్రభువుయైయున్నాడా? (ఆరాధన) మనకేమి చేసాడా? (స్తుతి) క్లుప్తముగా బోధించాలి, బయలు పరచబడినవి. మరియొకడు తనకు బయలు పరచబడినది ప్రకటించాలి. 27-28 వచనములో నున్న భాషతో మాటలాడుట, అర్థము చెప్పుట నిలిచి పోయినవని గమనించాలి. 29-31వ. అందరికి బోధ కలుగునట్లు ఒకరి తరువాత మరొకరు ప్రవచించాలి లేదా ప్రకటించాలి. ఒకడు, మరొకడు, మరియొకడు అనుటలో పురుషులు మాత్రమే పై కార్యక్రములు జరిగించాలని అర్థమగును. తరువాత రొట్టె కొరకు, రసము కొరకు ప్రార్థన కూడా పురుషులే. 34వ వచనములోనున్న స్త్రీలు సంఘములలో మౌనముగా నుండవలెనను మాట పై తలంపులను స్థిరపరచుచున్నది.

**సంఘములలో స్త్రీలు మాటలాడకూడదు - సంఘ క్షేమాభివృద్ధి (34-38వ.)** : సంఘములలో అని బహువచనము చెప్పబడినందున కొరింథీ సంఘములో మాత్రమే

కాక అన్ని సంఘములలోను స్త్రీలు మౌనముగా నుండవలెనని గుర్తించాలి. మాటలాడుట అనగా సంఘముతో మాటలాడుటకు (బోధించుటకు) మరియు దేవునితో మాట లాడుటకు (ప్రార్థించుటకు) దేవుని సెలవులేదని గుర్తించాలి. పాత నిబంధన గ్రంథము హెబ్రీ. 10:1వ. ప్రకారము రాబోవుచున్న మేలుల ఛాయగలది. అందుచేత పాత నిబంధనలో కూడా ఇశ్రాయేలీయుల సర్వ సమాజము ముందు స్త్రీలు బోధించుట కాని, బహిరంగముగా ప్రార్థించుట కాని, స్తుతించుట కాని జరుగలేదు. నిర్గమ. 15:20లో మిర్యాము తంబుర చేత పట్టుకొనినపుడు స్త్రీలు ఆమెను వెంబడించిరి. స్త్రీలు మాత్రమే కాని ఇశ్రాయేలీయుల సమాజము కాదు. కేవలము స్త్రీల మధ్య మిర్యాము పల్లవి ఎత్తి పాడినది. ఇది స్త్రీల సభ మాత్రమే కనుక స్త్రీల సభలో స్త్రీలు పల్లవి ఎత్తుట, తద్వారా స్తుతి, ప్రార్థన బోధ కలిగించుట ఛాయరూపకమైన ధర్మశాస్త్ర గ్రంథమందు కలదు. 1 సమూ. 1:10-13వ. వచనాలలో మందసమున్న స్థలమందు హన్నా ఉన్నది. ఇది ప్రత్యక్ష గుడారమైనందున, సంఘమునకు గురుతు. అందుచే హన్నా మనసులో ప్రార్థించుచున్నది (12వ). స్వరము వినపడలేదు (13వ.) ఈ క్రమమును బట్టి సంఘములలో అనగా ప్రపంచమందున్న అన్ని సంఘములలో అ.కా. 2:42 ప్రకారము అపొస్తలుల బోధలో గాని, సహవాసము ప్రార్థన, రొట్టె విరుచుటయందు స్త్రీలు మౌనముగా నుండ వలెననునది దేవుని ఆజ్ఞ అని గుర్తించుకొనాలి. ఇవి కాని కూడికలు 1) స్త్రీల మధ్య కూడిక - పైన చెప్పబడినట్లు కేవలము స్త్రీలే ఉన్నారు కనుక స్త్రీలు స్తుతించుట, పల్లవి ఎత్తుట, ప్రార్థించుట, వాక్యము నుండి హెచ్చరికలు చేయుట క్రమమేనని గుర్తించాలి. అ.కా. 21:1-9వ. సువార్తికుడైన ఫిలిప్పు ఇంట ప్రవచించు కన్యకలైన నలుగురు కుమార్తెలుండిరి. వారు కన్యకలు స్వంత గృహములు వారికి లేవు. కనుక స్త్రీల మధ్య పరిచర్య కేవలము తమ గృహముల వరకేనని తలంచకూడదు. యోహాను 4:39వ. సమరయ స్త్రీ ఆ ఊరిలోని అనేకులకు సువార్తనందించగా వారు క్రీస్తును అంగీకరించిరి. స్త్రీలు సువార్త ప్రకటన బహిరంగముగా పట్టణములో చేయవచ్చును. సమయర స్త్రీ సువార్త ప్రకటన పట్టణములోనే, సంఘములో కాదని గుర్తించాలి. తీతు 3:2-5వ. వృద్ధ స్త్రీలు.... యౌవనస్త్రీలకు.... మంచి ఉపదేశము చేయువారైయుండాలి, కనుక స్త్రీలు సంఘకూడిక కాని ప్రత్యేకమైన స్త్రీల కూడికలలోను, యవ్వనుల కూడికలలోను, ఉపదేశము చేయవచ్చును. 37-38 వచనముల ప్రకారము ఏ ఆత్మ సంబంధికాని, ప్రవక్త గాని ఇవి దేవుని ఆజ్ఞలు అని గుర్తించాలి.

**ముగింపు (39-40వ)** : కావున కొరింథీ సంఘమునకు క్రీ.శ. 56లో వ్రాస్తు ప్రవచించుటనే ఆసక్తితో అపేక్షించమన్నాడు. భాషలను ఆటంకపరచ వద్దన్నాడు కాని అపేక్షించమనలేదు. భాషలు సంఘ శిశుకాలమునకు ఇవ్వబడినందున ఆకాలమందు ఆటంకపరచవద్దన్నాడు. తదుపరి 1 కొరి. 13:8వ ప్రకారము అవి నిలిచిపోయినవి.

## 15వ అధ్యాయము 4+7+8+9+6+7+8+9=58 వచనములు
## అంశము : పునరుత్థానమును అర్థము చేసికొనుటలోని లోపము

**క్రీస్తు పునరుత్థానమునకు లేఖనముల రుజువు (1-4వ.)** : పాత నిబంధన యందు క్రీ.పూ. 1000లో నివసించిన దావీదు 22వ కీర్తనలో క్రీస్తు మరణమును గూర్చి, 16 కీర్తనలలో పునరుత్థానమును గూర్చి చెప్పబడినది. ఆలాగే క్రీ.పూ. 700లో యెషయా 53వ అధ్యాయము లోను క్రీ.పూ. 520లో జెకర్యా గ్రంథము 9-13 అధ్యాయమందును మరి ఇతర గ్రంథములందును క్రీస్తు మరణ పునరుత్థానములు చెప్పబడినవి. యోహాను 10:18నందు యేసుతానే "నా ప్రాణము పెట్టుచున్నానని ప్రాణము పెట్టుటకు తిరిగి తీసుకొనుటకు నాకు అధికారము కలదని, పునరుత్థానమును గూర్చి పలికెను.

**క్రీస్తు పునరుత్థానమునకు చరిత్ర నుండి రుజువు (5-11వ.)** : పునరుత్థానమైన పిదప మొదట కేఫాకు, 12 మంది శిష్యులకు, ఐదువందల మందికి, యాకోబుకు. ఆలాగే పౌలుకు కనబడిన వివరములు సువార్తలలోను అపొస్తలుల కార్యములలోను చూడగలము. సుమారు పదకొండు పర్యాయములు యేసు పునరుత్థానము తదుపరి కనబడిన వివరములు వ్రాయబడినవి. అట్టి యేసుకు పౌలు ప్రకటించుటకు, ప్రయాస పడుట, అందరికంటే ఎక్కువగా ప్రయాసపడుటకు సహాయపడిన దేవుని కృపను గూర్చి చెప్పుచున్నాడు.

**క్రీస్తు లేపబడినందున తర్కము నుండి మృతులు లేపబడుదురను రుజువు (12-19వ.)** : మృతులలో నుండి ఒకరు లేపబడిన యెడల మృతులందరు లేపబడుదురని నమ్మ వచ్చును. బియ్యము ఉడికించినపుడు ఒక్క గింజ పిసికిన యెడల అన్నము ఉడికినదని నమ్మినట్లే మృతి పొందిన క్రీస్తు లేచినందున మృతులందరు లేతురని నమ్ముచున్నాము. మృతులు లేపబడని యెడల మన విశ్వాసము వ్యర్థమే. మన పాపములు క్షమించబడ లేదు. మనము మనుష్యులందరి కంటె దౌర్భాగ్యులము అగుదుము కనుక మృతులు లేపబడుట వాస్తవమని నమ్మాలి.

**దైవికముగా క్రీస్తు పునరుత్థానము జరిగినందున - మృతుల పునరుత్థానము జరుగును (20-28వ.)**: ఒక మనుష్యుడైన ఆదాము పాపము, మరణముల ద్వారా అందరు పాపులై మరణించుదురు. అలాగే క్రీస్తు అను ఒకని పునరుత్థానము ద్వారా అందరు తమ తమ వరుసలో బ్రతికింప బడుదురు. తరువాత సమస్త ఆధిపత్యము కొట్టివేయబడి క్రీస్తు తండ్రికి అధికారము అప్పగించి దేవునికి తానే లోబడును.

**అనుభవమును బట్టి బాప్తిస్మమందు పాతిపెట్టబడి తిరిగి లేచుట, పరిశుద్ధుల పునరుత్థాన సాదృశ్యమే (29-34వ.)** : మనము బాప్తిస్మము పొందినపుడు ప్రాచీన పురుషుడు చనిపోగా మనము పాతిపెట్టబడితిమి. నూతన పురుషుడు పునరుత్థానులమై జీవించుచున్నందున తిరిగి నీటి నుండి పైకి లేపబడితిమి. దినదినము క్రీస్తు కొరకు మనము చనిపోవుచున్నా మని పౌలు తన అనుభవము చెప్పుచున్నాడు. రోమా 8:36వ.లో దీని వివరములు కలవు. కనుక తిరిగి క్రీస్తునందు మనము బ్రతుకుదుమని నిరీక్షణ కలిగియున్నాము.

**సృష్టిలోని విషయముల పోలిక నుండి (35-41వ.)** : గోధుమగింజ భూమిలో విత్తబడి చనిపోయి తిరిగి బ్రతికింపబడినట్లు చనిపోయిన మన్నయిన శరీరము పాతిపెట్టబడుట భూమిలో విత్తుటయే. గోధుమగింజ బ్రతికినట్లు మృతులు పునరుత్థానులగుదురు. దేవుడే గోధుమగింజకు శరీరమిచ్చినట్లు మనకును పునరుత్థానమందు నూతన శరీరమునిచ్చును. సూర్య, చంద్ర, నక్షత్రములకు వేరు వేరు ప్రకాశములున్నట్లు పునరుత్థానములో వేరు వేరు మహిమలను మనమును కలిగియుందుము.

**మృతుల పునరుత్థాన వివరములు (42-49వ.)** : శరీరము క్షయమైనది, ఘనహీన మైనది, ప్రకృతి సంబంధమైనది, కాని పునరుత్థానములో అక్షయమైనదిగాను, ఘనమైనది గాను, బలమైనదిగాను, ఆత్మ సంబంధమైనదిగాను లేపబడును. మొదటి మనుష్యుడైన ఆదాము జీవించు ప్రాణి అని, కడపటి ఆదామగు క్రీస్తు జీవింపచేయు ఆత్మ అనగా పునరుత్థాన మిచ్చువాడని గమనించగలము. ఆదాము పోలికను శరీరరీతిగా మనము కలిగియున్నట్లు క్రీస్తు పోలికను అనగా పరలోక సంబంధి పోలికను, ఆయనవలె మహిమ గల పునరుత్థానమును కలిగినవారముగా నుందుము అని నేర్చుకొనవలెను.

**మృతుల, సజీవుల పునరుత్థానము - మార్పు చెందుట (50-58వ.)** : రక్త మాంసములతో దేవుని రాజ్యమును స్వతంత్రించుకొనము కాని బూర మ్రోగగానే మృతులు ముందుగా అక్షయులుగా మార్చబడుదురు. తరువాత సజీవులుగానున్న వారు కూడా

అక్షయులుగా మార్చబడి వారి వెంబడి ప్రభువును ఎదుర్కొందురు. జీవమందు మరణము మ్రింగివేయబడును. మరణపు ముల్లు విరువబడెను. అనగా మరణమునకున్న బలము తీసివేయబడెను. క్రీస్తు మూలముగా విశ్వాసులు జయమును కలవారు.

## 16వ అధ్యాయము 6+6+6+6=24 వచనములు
## అంశము : చందా ప్రోగు చేయుటలోని లోపము - ముగింపు

**విభజన - చందాను గూర్చినది - పౌలు ప్రయాణమును గూర్చినది (1-6వ.)** : ప్రతి ఆదివారము సంఘముగా కూడినపుడు ప్రతివాడు తాను వర్ధిల్లిన కొలది చందా ప్రోగు చేయబడవలెను. ఆ ఉపకార ద్రవ్యమును యెరూషలేముకు పంపుట యుక్తమని చెప్పు చున్నాడు. పౌలు కొరింథుకు వచ్చు ప్రయాణమును గూర్చి చెప్పుచున్నాడు.

**పౌలు, ఇతరుల ప్రయాణ వివరములు (7-12వ.)** : ఈ పత్రిక వ్రాయునపుడు ఎఫేసులోనున్నాడు. పెంతెకొస్తు వరకు ఉందునంటున్నాడు. పౌలు క్రీ.శ. 54,55,56లో ఎఫేసులో ఉన్నందున ఈ పత్రిక 56 సం॥ పెంతెకొస్తు ముందు అనగా మార్చి నెలలో ఈ పత్రిక వ్రాయబడెనని తలంచగలము. పౌలు తరువాత కొరింథుకు వత్తునని చెప్పుచున్నాడు. అ.కా. 19:21లో కూడా అలాగే తలంచెను. తిమోతి కొరింథుకు వచ్చునని, అపొల్లో ఇప్పుడు వచ్చుట లేదని చెప్పుచున్నాడు.

**చివరి హెచ్చరికలు (13-18వ)** : స్తెఫను ఇంటివారు అకయలో ముందుగా ప్రభువును నమ్మి, పరిచర్యలో ప్రయాసపడుచున్నారు. వీరివలె ప్రయాసపడువారు ఈ దినములలోను అక్కరగానున్నారు. అట్టివారికి సంఘము సహాయము చేయవలెనని పౌలు కోరుచున్నాడు.

**వందనములు, ముగింపు - ఆశీర్వాదము (19-24వ.)** : అకుల, ప్రిస్కిల్లలు ఎఫేసులో ఉన్నారు. వారి ఇంట సంఘమున్నది. ప్రతి విశ్వాసి కుటుంబము వీరిని మాదిరిగా తీసుకొనాలి. సహోదరులు ఒకరి కొకరు వందనములు చెప్పాలి. ప్రభువు రాకడ నపేక్షించుచూ (మరన్‌ఆత) వందనములలో ఆశీర్వాదముతోను ముగించుచున్నాడు.

# కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక

గ్రంథకర్త : పౌలు . కాలము : క్రీ.శ. 57 స్థలము : మాసిదోనియ. పంపబడుట : తీతు (6:16)

అంశము : పరిచర్య.

## అధ్యాయాల విభజన 2+4+1+2+4 =13 అధ్యా.

**I. 1-2 అధ్యా. ప్రభువునందు జీవించు పరిచర్య :**

**1వ అధ్యాయము** : పరిచర్యలోని ఆదరణ.

**2వ అధ్యాయము** : పరిచర్యలోని క్రమశిక్షణ - ఊరేగింపు.

**II. 3-6 అధ్యా. ప్రభువునందు చేయవలసిన (సేవా సంబంధమైన) పరిచర్య :**

**3వ అధ్యాయము** : పరిచర్య యొక్క మహిమ.

**4వ అధ్యాయము** : పరిచర్యలోని ప్రకాశము - శ్రమలు.

**5వ అధ్యాయము** : పరిచర్య యొక్క విధము - నిరీక్షణ.

**6వ అధ్యాయము** : పరిచర్య యొక్క లక్షణములు.

**III. 7వ అధ్యా. ప్రభువునందు ప్రత్యేకత గల పరిచర్య**

**IV. 8-9 అధ్యా. ప్రభువుకు ఇచ్చు పరిచర్య :**

**8వ అధ్యాయము** : ప్రభువుకు ఇచ్చుట - ఇవ్వబడిన ఈవులను కాపాడు పరిచర్య.

**9వ అధ్యాయము** : ఇచ్చుటను గూర్చిన హెచ్చరిక.

**V. 10-13 అధ్యా. ప్రభువునందు (తనను) భద్రపరచుకొను పరిచర్య :**

**10వ అధ్యాయము** : పరిచర్యలోని విమర్శలకు పౌలు జవాబులు

**11వ అధ్యాయము** : పౌలు అపొస్తలత్వపు ఋజువులు.

**12వ అధ్యాయము** : పౌలు అపొస్తలత్వపు ఋజువులు.

**13వ అధ్యాయము** : చివరి హెచ్చరికలు

పరిచర్యలోని 5 ముఖ్య అంశములను గమనించండి. పరిచర్యలో మొదటి జీవితము రెండవది చేయవలసిన సేవ. (సేవకంటె జీవితము ముఖ్యము మొదటిది

అని గమనించవలెను). ప్రత్యేకత మూడవది. పరిచర్యలో ధననిధిని విప్పుట నాలుగవది. చివరిదిగా నిన్ను నీవు భద్రపరచుకొనుట.

## 1వ అధ్యాయము 3+4+4+6+5+2 = 24 వచనములు
## అంశము : పరిచర్యలోని ఆదరణ

**పీఠిక (1-3వ.)** : పౌలు కొరింథులో 18 నెలలు నిలిచి చేసిన సేవా వివరములు అ.కా. 18వ అధ్యాయములోని మొదటి 18 వచనములలో కలవు. ఆ సేవ ఫలితముగా కొరింథులో మాత్రమే కాక అకయ యందలియంతటను అనగా గ్రీసు దేశమంతటను సంఘములు ఏర్పడినవి. ఇది సేవకులు గమనించదగినది. దేవుడు కనికరము చూపువాడని, ఆదరించువాడని అనుభవ పూర్వకముగా పౌలు వ్రాయుచున్నాడు.

**శ్రమలతో కూడిన జీవితమందు దేవుడిచ్చిన ఆదరణ (4-7వ.)** : క్రీస్తును అంగీకరించుట ద్వారా కొరింథీయులకు శ్రమలు కలిగినది. పౌలు కూడా శ్రమల పాలాయెను. శ్రమలన్నిటిలో పౌలు ఆదరణ పొందెను. తద్వారా ఎట్టి శ్రమలలో జీవించువారినైనను ఆదరించుటకు శక్తిని పొందెను. భక్తులకు శ్రమలు వచ్చు కారణములలో ఇది ఒకటి అని గమనించవలెను.

**శ్రమలనుండి తప్పించిన దేవునియందే నిరీక్షణ (8-11వ.)** : పౌలు అపొస్తలుల కార్యములు 18వ అధ్యాయములో కొరింథులో 18 నెలల సేవ తరువాత 19-21 వచనములలో కొంత కాలము ఎఫెసులో సేవ చేసెను. ఆ దినములలో గొప్ప శ్రమలు, కలిగిన అత్యధిక భారమును బట్టి బ్రతుకుదుమన్న నమ్మకము పోయినదని చెప్పుచున్నాడు కాని దేవుడు మృతులను లేపు శక్తిగలవాడు కనుక మమ్మును గొప్ప మరణము నుండి తప్పించినందున ఇక ముందును తప్పించునని నిరీక్షన కలిగియున్నాడు కనుక మన జీవిత కాలములో కలుగు శ్రమలలో శక్తిగల దేవుని మీద నమ్మకముంచవలెనని చెప్పుచున్నాడు.

**దేవునితో నమ్మకముగా జీవించిన పౌలు (12-17వ.)** : పౌలు లోక రీతిని కాక దేవుడను గ్రహించు పరిశుద్ధతతోను, నిష్కపటముతోను, దేవుని కృపననుసరించి జీవించెను. ఈ విషయమై కొరింథీయులే సాక్షి అంటున్నాడు. ప్రభువైన యేసు దినమున తనకు అతిశయము లేక ఆనందము కలుగును అంటున్నాడు. ఇది ఎంతో మాదిరియైన జీవితము.

**నమ్మదగిన దేవుడు (18-22వ.)** : యేసుక్రీస్తు అవునని చెప్పి కాదను వాడు కాడు. నమ్మదగినవాడు. 2 తిమోతి 2:13వ వచనములో మనము నమ్మదగని వారమైనను ఆయన నమ్మదగిన వాడుగా నుండునని చెప్పబడినది. ఈ నమ్మదగిన దేవుడు అసంఖ్యాకములైన వాగ్దానములను తన గ్రంథమందు మనకిచ్చాడు. అవన్నియును క్రీస్తునందు మన పక్షమున అవునన్నట్లుగా నున్నవి. విశ్వాసకోటి దీని నమ్మక ఏదో ఒక వాగ్దానమును దేవుడు తనకిచ్చెనని నమ్ముచారు కలరు. అన్ని వాగ్దానములు మనవి. వాటిని స్వతంత్రించు కొనాలి. మనకు ఆయన ముద్రవేసి ఆత్మ అను సంచకరువును మనము క్రీస్తునందు విశ్వాసముంచినపుడే ఎఫెసీ. 1:13-14వ. ప్రకారము దయ చేసెను. మన ద్వారా దేవునికి మహిమ కలుగుటకే ఆ వాగ్దానములన్నిటిని మన పక్షమున నెరవేర్చుచున్నాడని గమనించవలెను.

**23-24వ కొరింథీయుల ఆనందములో సహకారుడైన పౌలు** : పౌలు తన జీవితములో కలిగిన శ్రమలలో తాను నేర్చుకొనిన పాఠములను బట్టి కొరింథీయులకు శ్రమలు కలిగి నందున ఆదరణ, ఆనందము కలిగించు తన అనుభవమును వారికి వ్రాయుచున్నాడు.

## 2వ అధ్యాయము 4+7+6=17 వచనములు
## అంశము : పరిచర్యలోని క్రమశిక్షణ

**క్రమశిక్షణను గూర్చి మొదటి ఉత్తరములో వ్రాసిన విధము (1-4వ.)** : పౌలు వ్రాసిన మాటలు కొరింథీయులకు దుఃఖము కలిగించినను, వారి జీవితములు దిద్దబడుట ద్వారా తనకు ఆనందము, ఆదరణ కలుగునని నమ్ముచున్నాడు. అందుకే మొదటి పత్రికలో వారి లోపములను దిద్దుటకై వ్రాసిన మాటలను శ్రమలతోను, మనో వేదనతోను, కన్నీటితోను వ్రాసితినని చెప్పుచున్నాడు. తోటి సహోదరుల జీవితములను దిద్దుటలో మన మందరము ఈ మాదిరిని గమనించవలెను. దీని విషయము గలతీ. 6:1-5వ, మత్తయి 18:15,17వ.లో మరికొన్ని వివరములు కలవు.

**క్రమశిక్షణలో ఉన్నవారిని చేర్చుకొనుట (5-11వ.)** : మొదటి పత్రికలో పౌలు వ్రాసిన దిద్దుబాటులు కొరింథీయులందరికిని దుఃఖము కలిగించెను. కాని పాపములో ఉన్నవాడు దిద్దుకొనియున్నాడు. అటువంటి వానిని చేర్చుకొనుటకు వెనుదీయకూడదు. లేని యెడల వాడు మరి కృంగిపోవును. ఇప్పుడు అట్టివారిని క్షమించాలి, ప్రేమించవలెను. వారిని

చేర్చుకొనపలెను. ఈ విషయము సాతాను మనలనందరిని మోసపరచగలడు. అనేక సంఘములలో శిక్షించు విషయములలో చూపిన శ్రద్ధను, క్షమించి చేర్చుకొనుటలో చూపరు. దీనిని గమనించాలి.

**పరిచర్యలో విజయోత్సవముతో ఊరేగించుచున్న దేవుడు** : సువార్త ప్రకటించుచు పౌలు త్రోయకు రాగా మంచి సమయము ప్రాప్తించినను తీతు కనబడనందున మనసులో నెమ్మదిలేదంటున్నాడు. సహోదరుల ఆత్మీయ స్థితి విషయమై పౌలుకు కలిగిన భారము గమనించదగినది. ఇతరులు వాక్యమును కలిపి చెరుపుదురు. పౌలు ఆ రీతిగా కలిపి చెరుపువాడు కాడు. నిష్కపటమైనవాడు అందువలన దేవుడు ప్రతి స్థలములోను పౌలు ద్వారా క్రీస్తును గూర్చిన జ్ఞానము యొక్క సువాసనను కనుపరచుచూ క్రీస్తునందు దేవుడు పౌలును ఎల్లప్పుడు విజయోత్సవముతో ఊరేగించుచున్నాడు. పౌలు వంటి సేవకులు నశించువారికి మరణపు వాసనగాను, రక్షింపబడు వారికి జీవపు వాసనగాను ఉందురు. క్రీస్తుచేత ఎల్లప్పుడు ఊరేగించబడుచుందురు.

## 3వ అధ్యాయము 6+5+7=18 వచనములు
## అంశము : పరిచర్య యొక్క మహిమ

**పరిచర్యలోని సామర్థ్యము (1-6వ.)** : పౌలు పరిచర్య ద్వారా కొరింథీయులు ప్రభువును విశ్వసించిరి. కొరింథులోని విశ్వాసుల హృదయము మీద పౌలు పరిచర్య ద్వారా తాము మేలు పొందిరని వ్రాయబడినది. ఈ పత్రిక సిరాతో రాతి పలకల మీద వ్రాయబడిన పత్రికకంటే శ్రేష్ఠమైనది. అందువలన పౌలుకు కొరింథుకు వచ్చుటకు సిఫారసు పత్రికలు అవసరము లేదు. తన సామర్థ్యము బట్టి కాక దేవునిని బట్టియే తన పరిచర్య సామర్థ్యము గలదని గుర్తింపబడినదని చెప్పుట గమనించాలి. దేవుడు క్రొత్త నిబంధనకు, ఆత్మ సంబంధమైన సేవకు పరిచారకులుగా నియమించినందున ఇట్టి సామర్థ్యము కలిగినదని చెప్పుచున్నాడు.

**పరిచర్య యొక్క మహిమ (7-12వ.)** : పాత నిబంధన పరిచర్య చేయు మోషే కొండ మీద నుండి దిగి రాగా అతని ముఖము ప్రకాశించెను. ఆ మహిమ మరణకారణమైనది కనుక క్రమేపి తగ్గిపోయినది. నీతికి కారణమగు పరిచర్య ఆత్మ సంబంధమైనది కనుక ఎంతో మహిమ కలదిగానున్నది. ఆ మహిమ శాశ్వతముగానుండును.

**ప్రభువు పోలికగా మార్చబడు శాశ్వత మహిమ గల పరిచర్య (13-18)** : రోమా 3:23వ. పాపము చేయుట ద్వారా గతములో మానవుడు మహిమను పోగొట్టుకొనెను.

రోమా 3:24-25వ. ప్రకారము పాపము పరిహారము కాగా తిరిగి ఆ మహిమను పొందును. మనము ప్రభువు సన్నిధిలో గడిపిన కొలది దినదినము మహిమ నుండి అధిక మహిమను పొందుచూ క్రీస్తు యొక్క పోలికలోనికి మార్చబడుదుము. 1 కొరింథీ. 15:41-44వ. చెప్పబడినట్లు పునరుత్థానమందు కూడా ఈ మహిమను కలిగియుందుము. కనుక ఇది శాశ్వత మహిమ. ఈ లోకము క్రీస్తును చూడలేదు. కనుక ఆయన మహిమను అనగా క్రీస్తు మహిమను అద్దములవలె లోకమునకు చూపవలెను. ఇది మనము చేయవలసిన పరిచర్యలో ఒక భాగము.

## 4వ అధ్యాయము 6+6+6=18 వచనములు
## అంశము : పరిచర్యలోని శ్రమల ద్వారా ప్రకాశము

**పరిచర్యలోని ప్రకాశమును చూడలేని గ్రుడ్డివారుగానున్న అవిశ్వాసులు (1-6వ.) :** దేవుడు మన ద్వారా జరిగించు పరిచర్య గొప్ప మహిమ గలదని పై భాగములో చూచితిమి. కాని సాతాను అవిశ్వాసులైన వారి మనో నేత్రములకు గ్రుడ్డితనము కలుగ చేసినందున వారు ఈ ప్రకాశమును చూడలేకున్నారు. సువార్త ప్రకటన ద్వారా లోకములోని ప్రజలు క్రీస్తు మహిమను చూడగలరు. కనుక మనము మనలను గూర్చి ప్రకటన చేసికొనక, క్రీస్తు మరణ పునరుత్థానములను గూర్చి, ఆయన ప్రభువు అని లోకము గుర్తించవలసిన అవసరమును గూర్చి లోకమునకు క్రీస్తును గురించిన సువార్త ప్రకటించ వలసిన పరిచార కులమని గుర్తించవలెను. అప్పుడు లోకజనులు క్రీస్తు మహిమను చూడగలరు.

**పరిచర్యలోని శ్రమల ద్వారా క్రీస్తు ప్రకాశమును కనుపరచుట (7-12వ.) :** మన శరీరము మంటికుండయైనను ఎంతో గొప్ప మహిమ రాబోవు దినములలో దీనికున్నదని నేర్చుకొంటిమి. పరిచర్య చేయునపుడు శ్రమలపాలగుదుము. కొన్ని పర్యాయములు క్రీస్తు మరణ అనుభవమును మనమును అనుభవింతుము. మరణించి సజీవుడైన క్రీస్తువలె మనమును శ్రమల ద్వారా మరణ అనుభవమును పొందిన పిదప యేసు యొక్క జీవమును అనుభవించి ఆ మహిమను ప్రకాశమును లోకమునకు కనుపరచుదుము. సువాసన గల దేదైనను పిండబడినపుడు ఆ సువాసన వ్యాపించును. అత్తరు బుడ్డి పగిలినపుడే దాని పరిమళము వ్యాపించినట్లు మనము శ్రమల పాలైనపుడు

మన యందున్న క్రీస్తు మహిమ ప్రకాశము లోకమునకు కనుపరచుదుము. కావున ప్రభువుకు చేయు పరిచర్యలో శ్రమలు పొందుటయు ఒక భాగమేనని గమనించవలెను.

**పరిచర్య చేయునప్పుడు కలిగి ఉండవలసిన గురి (13-18వ.)** : శ్రమల ద్వారా బాహ్య పురుషుడు కృషించినను అంతరంగ పురుషుడు దిన దినము నూతన పరచబడును. శ్రమలు క్షణకాలము కాని మహిమ నిత్యము. కనిపించు శ్రమలు అనిత్యములు, కనిపించనివి నిత్యములు. కావున శ్రమలలో అధైర్యపడక క్రీస్తు మహిమ నిమిత్తమే అవి కలిగినవని క్రీస్తు మహిమపై గురియుంచవలెనని నేర్చుకొనుచున్నాము.

## 5వ అధ్యాయము 5+5+5+6=21 వచనములు
## అంశము : పరిచర్య వివరము

**పరిచర్యలోని నిరీక్షణ (1-5వ.)** : భూమి మీద మన మొదటి గుడారము (ఇల్లు) మన శరీరమే. ఇది కృషించుట మాత్రమే కాక ఒక రోజు నశించును కాని మన చేతిపని కాక దేవునిచే కట్టబడుచున్న నివాసము పరలోకములో మనకున్నదని, ఎరుగుదువు. పరలోకము నుండి దిగివచ్చు ఆ గుడారమును అనగా మహిమ దేహమును మనము ధరించుకొందుమన్న నిరీక్షణకలవారమై ప్రస్తుతము ఈ దేహమందు మూల్గుచున్నాము. మన మంటి దేహము మహిమ దేహముగా మార్చబడుటయే మన నిరీక్షణ.

**క్రీస్తు న్యాయపీఠము దగ్గర ఫలమున్నదన్న నిరీక్షణ (6-10వ.)** : పరలోకములో మనకు నివాసము మాత్రమే కాక ఈ లోకములో జరిగించిన క్రియలకు ఫలము కూడా ఉన్నదని గుర్తించవలెను. ఆ ఫలములో వేర్వేరు కిరీటములను కూడా పొందుదుము. కిరీటముల వివరములు 1 కొరింథీ. 9వ అధ్యాయము చివర కలవు. కనుక పరిచర్య చేయునపుడు 1 కొరింథీ. 3:13-15వ. వివరించబడినట్లు ఈ పరిచర్యకు జీతమున్నదని గమనించాలి. కనుక మంటి దేహమందున్నను మంటి దేహము విడిచినను ప్రభువుకు ఇష్టులముగా ప్రీతికరమైన సేవ చేయాలి.

**పరిచర్యలోని వర్తమానము - పరిచర్య చేయవలసిన విధము (11-15వ.)** : క్రీస్తు యేసు అందరి కొరకు మృతిపొంది తిరిగి లేచినందున జీవించు మనము కూడా మన కొరకు కాక, క్రీస్తు కొరకు జీవించాలి. స్వస్థబుద్ధి గలవారుగా అవసరమును బట్టి వెఱ్ఱివారముగానున్నను క్రీస్తు పరిచర్య కొరకు జీవించుట ప్రాముఖ్యమని గుర్తించాలి. కనుక ప్రభువు విషయమైన భయము కలిగి జీవించాలి.

**పరిచర్యలోని వర్తమానము - రాయబారియైన పరిచారకుడు (16-21వ.)** : క్రీస్తు యేసు మన అపరాధములను మనపై మోపక తన మీద మోసికొన్నాడు. పాపమెరుగని ఆయన మన కొరకు పాపముగా చేయబడినాడు. మనము క్రీస్తు నంగీకరించినపుడు మన పాపములకు క్షమాపణ కలిగి నూతన సృష్టిగా చేయబడితిమి. పాతవి గతించి క్రొత్తవిగా దేవుని వలన చేయబడినవి. దేవునితో లోకమును సమాధాన పరచు ఈ పనిని దేవుడు మనకు అప్పగించి పరలోకపు పౌరులమైన మనలను ఈ లోకములో తనకు రాయబారులుగా చేశాడు.

## 6వ అధ్యాయము 5+5+3+5=18 వచనములు
## అంశము : పరిచర్య యొక్క లక్షణములు

**పరిచర్య చేయువారి లక్షణములు (1-5వ, 6-10వ.)** : పరిచర్య ద్వారా మానవులు రక్షణ పొందుటకు ఇప్పుడే అనుకూల సమయమైనందున పరిచర్య చేయువారు ఈ పరిచర్య నిందించబడకుండ జాగ్రత్తగా చూచుకొనవలెను. శ్రమలు, ఇరుకులు, ఇబ్బందులు మొదలగు వాటిలో ఓర్పు కలిగి, పవిత్రత, పరిశుద్ధత కలిగి అన్ని స్థితులలో మనలను మనమే మెప్పించుకొను వారముగానుండాలి. కనుక పరిచారకులమైన మనము 1) సత్యవంతులముగను, 2) తెలియబడిన వారముగను, 3) బ్రతుకుచున్న వారముగను, 4) సంతోషించు వారముగను, 5) ఐశ్వర్యము కలిగించు వారముగను, 6) సమస్తము కలిగిన వారముగను ఉండాలి.

**హృదయ విశాలతను కోరు పరిచర్య (11-13వ.)** : పౌలు కొరింథీయుల పట్ల తన హృదయము విశాలముగానున్నదని కొరింథీయుల హృదయము తన పట్ల సంకుచితమై యున్నదని చెప్పుచున్నాడు. ఈ పరిచర్య చేయునపుడు హృదయ విశాలత అవసరము గనుక కొరింథీయులు తన పిల్లలైనందున స్వతంత్రత కలిగి వారికి హృదయములను విశాల పరచుకొనుడని వేడుకొనుచున్నాడు. పనివాడు హృదయ విశాలతను కలిగి యుండాలి.

**పరిచర్యలో ప్రత్యేకముగా ఉండుటను గూర్చిన హెచ్చరికలు (14-18వ.)** : ప్రభువును విశ్వసించిన వారు అవిశ్వాసులతోను, సాతానుతోను, విగ్రహములతోను, చీకటితోను, దుర్నీతితోను కలిసి యుండరాదు. కనుక అవిశ్వాసుల నుండి, విగ్రహారాధికుల నుండి బయలు వెడలి ప్రత్యేకముగా ఉండాలి. దేవుడపుడు వారి మధ్య సంచరించి వారితో

నుండును. అట్టివారిని చేర్చుకొనును. వారికి తండ్రియైయుండును. "బయటికి పిలువ బడిన వారు కూడుకొనుట" సంఘము అను "ఎక్లీషియా" అను గ్రీకు పదమునకర్థము. కనుక అవిశ్వాసుల నుండి బయలు వెడలి ప్రత్యేకముగా ఉన్నవారే సంఘము అని గుర్తించాలి.

## 7వ అధ్యాయము 4+4+4+4=16 వచనములు
## అంశము : ప్రభువునందలి ప్రత్యేకత గల పరిచర్య

**ప్రత్యేకతను కోరు పరిచర్య - పౌలు జీవితములో కలుగు ప్రత్యేకత (1-4వ.)** : విశ్వాసికి ఈ జీవితయాత్రలో శరీరమునకు, ఆత్మకు కల్మషము కలుగగలదు. ఆ కల్మషము నుండి మనలను మనము పవిత్రులుగా కాపాడుకొనాలి. కనుక 1) ఎవరికిని అన్యాయము చేయకుండా(Wrong), 2) ఎవరిని చెరపకుండా (Corruption), 3) ఎవరికి మోసము(Fraud) చేయకుండా పౌలు జీవించుచున్నాడని తెలుపుచున్నాడు. కొరింథీయులును అలాగే ఉండవలెనని హెచ్చరించుచున్నాడు. ప్రత్యేకముగా ఉండుటకు పిలువబడిన వారి జీవితములును ప్రత్యేకముగా ఉండాలి.

**తీతు రాక వలన కలిగిన ఆదరణ (5-8వ.)** : 2వ అధ్యాయము 12వ వచనములో చెప్పినట్లు పౌలుకు తీతు కనబడనందున మనసులో నెమ్మది లేదు. దానికి తోడు శ్రమలు పోరాటములలో పౌలు ఉండగా తీతు కొరింథు నుండి పౌలు యొద్దకు వచ్చి కొరింథీయుల ప్రత్యేకమైన అభిలాషను గూర్చి పౌలుకు తెలిపెను. పౌలుకు సంతోషము ఆదరణ కలిగెను. కనబడవలసిన తమవంటి వారు కనబడకపోతే నెమ్మది ఉండదు. కనబడవలసిన వారు కనబడుటతో ఆనందము ఆదరణ కలుగును.

**దిద్దుబాటు గల పరిచర్య (9-12వరి.)** : పౌలు కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక వలన వారికి దుఃఖము కలిగినను వారు మారుమనస్సు పొంది జీవితములను దిద్దుకొని ప్రత్యేకత గలవారుగానున్నారు. దైవచిత్తానుసారమైన దుఃఖము మారుమనసును కలుగ చేసినది. కొరింథీయులు నిర్దోషులుగాను, ప్రత్యేకత గలవారుగా, పవిత్రులుగా ఉన్నారని ఋజువు పరచుకొనిరి.

**దిద్దుబాటు వలన ఆదరణను కలిగించు పరిచర్య (13-16వ.)** : ముందు భాగములలో చెప్పబడినట్లు పౌలు మొదటి పత్రిక ద్వారా కొరింథీయుల జీవితములు దిద్దబడెను. పౌలు తీతుతో కొరింథీయులు తమ జీవితములను దిద్దుకొందురని నిరీక్షించి చెప్పెను.

ఆలాగు జరిగినందున అనుటలో పౌలు తన నిరీక్షణలో సిగ్గుపరచబడ లేదని తెలసికొని సంతోషించి కొరింథీయులలో జరిగిన దిద్దుబాటును బట్టి పౌలు ఆదరింపబడెను.

## 8వ అధ్యాయము 9+6+9=24 వచనములు
## అంశము : ప్రభువు పనికి ఇచ్చు పరిచర్య

**ఇచ్చుటలో మాదిరియైన మాసిదోనియ వారు (1-9వ.)** : క్రైస్తవుల మధ్య పేదలున్నారు. నిరుపేదలు బహు తక్కువ. మాసిదోనియ వారు నిరుపేదలు. కాని వారి దాతృత్వము బహుగా విస్తరించినది. పరిశుద్ధుల కొరకైన పరిచర్యలో మాసిదోనియ వారు వారి సామర్థ్యముకంటె ఎక్కువగా ఇచ్చి మాదిరియైరి. తమ్మును తాము ప్రభువుకు అప్పగించి కొనిరి. విశ్వాసమందు, ప్రేమయందు వృద్ధి పొందు కొరింథీయులు సంవత్సరము క్రింద ఇచ్చెదమని చెప్పిరి కాని ఇంకను ఇవ్వలేదు. కనుక కొరింథీయులు ప్రభువుకు ఇచ్చు పరిచర్యలో కూడా ముందుకు రావలెనని పౌలు హెచ్చరించుచున్నాడు. ఈ విషయమై ప్రభువైన యేసు మాదిరిని గూర్చి 9వ. వచనములో ధనవంతుడైన యేసు మన నిమిత్తము దరిద్రుడైన సంగతిని తెలుపుచున్నాడు.

**ప్రభువు పరిచర్యకు ఇవ్వవలసిన విధము (10-15వ.)** : కొరింథీయులు సంవత్సరము క్రితము ఇవ్వవలెనని తలంచిరి కాని ఇవ్వలేదు. తలపెట్టిన రీతిగనే వెంటనే ప్రభువుకు ఇవ్వవలెనని పౌలు హెచ్చరించుచున్నాడు. ప్రభువుకు ఇవ్వవలసిన విధమేదనగా సిద్ధమైన మనసు కలిగియుండి మనకు కలిగిన కలిమి కొలది ప్రభువుకు ఇచ్చుట ప్రీతికరము. అది ఇబ్బందులలో ఉన్న ఇతరులకు, దేవుని సేవలోనున్న సేవకులకు ప్రయోజనకర మగును. హెచ్చుగా కూర్చుకొన్న వారికి ఎక్కువ కాలేదని, తక్కువ కూర్చుకొన్నవారికి తక్కువ కాలేదని ఇశ్రాయేలీయులు అరణ్యములో మన్నాను సమకూర్చుకొనిన సందర్భ మును చెప్పుచున్నాడు. అనేకులు ప్రభువు పరిచర్యకు ఇచ్చు విషయములో వెనుకబడు చున్నారు. ఒక విశ్వాసి జీవితములో సొమ్ము సంచి చివరిదిగా మారు మనస్సు పొందును అని సర్వ సాధారణముగా చెప్పుదురు.

దశమ భాగము ప్రభువుకిచ్చువారు దానితోనే సంతోషపడుచున్నారు. లేవీ. 27:30వ. ప్రకారము దశమభాగము దేవుని సొత్తు. కనుక దేవుని సొత్తయిన దశమభాగము మనము దేవునికివ్వవలసినదే. మనము దేవుని దశమభాగము దేవుని కివ్వవలసినదే. మనము దేవునకి ఇచ్చి ఉన్నాము అని అర్థము. దేవునికి మన బాకీ చెల్లించి దానికంటే ఎక్కువగా

ప్రభువుకిచ్చుట మనకు ఆశీర్వాదము. పాత నిబంధనలో ద్వితీ. 14:22వ. వచనములో ప్రతి సంవత్సరము ప్రత్యేకించి మందిరమునకు తీసుకొని రావాలి. సంఖ్యా. 18:21వ. వచన ప్రకారము అది లేవీయులకు ఇవ్వబడును. రెండవ దశమ భాగమును గూర్చి ద్వితీయ 14:28 వచనములో ఉన్నది. మూడు సంవత్సరముల కొకసారి. ఆ యేటి పంటను ప్రత్యేకించాలి. ఇది రెండవ దశమ భాగము. ఒక దశమభాగము సంఘమున కివ్వగా అది సేవకుల కివ్వబడినది. రెండవ దశమభాగము సంఘ పరిచర్య కొరకు వాడబడును. కనుక ఒక దశమ భాగమిచ్చి తృప్తి చెందక రెండవ దశమ భాగమును దేవునికివ్వాలి.

**ప్రభువుకు ఇవ్వబడిన దానిని కాపాడవలసిన విధము (16-24వ.)** : పరిశుద్ధుల కొరకైన పరిచర్యకు ధనమును పోగు చేయవలెనని పౌలు తలంచినట్లు తీతుకును ఆశ కలిగినది. తీతుతో పాటు సువార్త విషయము ప్రసిద్ధి చెందిన సహోదరుడైన లూకాను కూడా కలపి పౌలు కొరింథీకి పంపుచున్నాడు. విస్తారమైన ప్రభువు ధనమును 1) సమ కూర్చుట, 2) భద్రపరచుటకై ఒకరే కాక అటువంటి ఆశ కలిగిన అనేక సేవకులు చేయుట మంచిదని పౌలు చెప్పుచున్నాడు. లేనియెడల నిందల పాలు కాగలము.

## 9వ అధ్యాయము 5+5+5=15 వచనములు
## అంశము : ఇచ్చుటను గూర్చిన హెచ్చరిక

**ఇచ్చుటను గూర్చిన వివరణ (1-5వ.)** : కొరింథీయులు ప్రభువు పరిచర్యకు ఇచ్చుటకై సిద్ధమనసు కలిగియున్నారని పౌలు మాసిదోనియ వారితో చెప్పగా వారును ప్రేరేపింపబడి ఇచ్చిరి. కాని కొరింథీయులు ఇంకను ఇవ్వలేదు. పౌలు కొరింథుకు వచ్చినపుడు వారితో కూడ మాసిదోనియా వారెవరైనా వచ్చిన యెడల పౌలుకు సిగ్గు కలుగును అని చెప్పుచున్నాడు. కనుక కొరింథీయులు పిసినిగాకాక ధారాళముగా ప్రభువుకు ఇవ్వవలెనని చెప్పుచున్నాడు.

**ఇచ్చువారికి కలుగు దీవెన (6-10వ.)** : కొంచెము ఇచ్చిన యెడల కొద్ది దీవెనలు కలుగును. కనుక హృదయములో ముందుగా నిర్ణయించుకొని ఉత్సాహముగ ప్రభువుకు ఇచ్చిన దేవుడు సర్వ సమృద్ధిని ఇచ్చునని చెప్పుచున్నాడు.

**ఇచ్చుటను గూర్చిన పురికొల్పు (11-15వ.)** : పరిశుద్ధుల కొరకైన ఈ పరిచర్య పరిశుద్ధుల ప్రార్థనల మూలమున విస్తరించి వృద్ధియగుచున్నదని ఇదియు కృపావర

ములలో ఒకటి అని చెప్పుచున్నాడు. దీనిలో పరిశుద్ధుల యోగ్యతయు బయలు పరచ బడును. కనుక ప్రభువుకిచ్చుటలో 1) సామర్థ్యముకంటె ఎక్కువగా ఇచ్చుట (8:4) 2) కలిమి కొలది ఇచ్చుట (8:12), 3) ధారాళముగా ఇచ్చుట (9:5), 4) ఉత్సాహముగా ఇచ్చుట (9:7), 5) పిసినితనముగా కాక (9:5), 6) బలవంతముగా కాక, సణుగుగొనక (9:7), 7) ముందుగా హృదయములో నిశ్చయించుకొని ఇవ్వవలెనని చెప్పుచున్నాడు.

## 10వ అధ్యాయము 6+6+6=15 వచనములు
## అంశము : పరిచర్యలోని విమర్శలకు పౌలు జవాబులు

**శరీర ప్రకారము కాక శక్తిగల పనిచేయువాడైన పౌలు (1-6వ.) :** 1) పౌలు మాదిరియైన పనివాడుగా సాత్వికము, మృదుత్వము, అణకువ గలపనివాడు, 2) అయినను శరీర ప్రకారము నడుచుకొనువాడని విమర్శించబడుచున్నాను. దానికి జవాబుగా తాను శరీరము ధరించుకొనిన వాడైనను శరీర ప్రకారము యుద్ధము చేయువాడను కానని చెప్పుచున్నాడు. 3) శరీర సంబంధమైన యుద్ధోపకరణములు కలిగినవాడు కాదు, 4) దేవునియెదుట సాతాను దుర్గములను పడగొట్టగల శక్తిగల ప్రార్థనను యుద్ధోపకరణముగా గలవాడు, 6) తర్కములకు, ఆటంకములకు దూరముగా నుండును, 7) ప్రతి ఆలోచన క్రీస్తుకు లోబడునట్లు చేయువాడు, 8) కొరింథీయుల సంపూర్ణమైన విధేయతను ఆధారముగా తీసుకొని ఇతరులలోని సమస్త విధములైన అవిధేయతను ప్రతి దండన చేయుటకు సిద్ధపడియున్నానని చెప్పుచున్నాడు. పై అంశములను ప్రతి వాడు కలిగియుండుట ద్వారా తన్ను తాను భద్రపరచు కొనవలెను.

**మాటలయందును (పత్రికలయందును) క్రియలయందును ఏకరీతిగానున్న పౌలు (7-12వ.) :** ప్రతి పనివాడు తానే ప్రభువు పనివాడనని ఇతరులు కారని భావించుచున్నారు. అది తప్పని పౌలు చెప్పుచున్నాడు. పనివాడు పడగొట్టువాడు కాకూడదు. పాడు చేయువాడు కాకూడదు. కట్టువాడై ఉండాలి. 1 కొరింథీ. 3:16లో ఎవడైన పాడుచేసిన యెడల దేవుడు వానిని పాడు చేయుననియున్నది. పౌలు పత్రికలు బలమైనవి, కొన్నిసార్లు భయము కలిగించునవి అని అంగీకరించుదురు, కాని పౌలు శరీరము బలహీనమైనది ప్రసంగ ములు కొరగానివి అని విమర్శించ బడుచున్నాడు. దానికి జవాబుగా పౌలు దూరముగా ఉన్నప్పుడు వ్రాయు పత్రికలలోని మాటలయందెట్టివాడో, సమీపముగానున్నపుడు క్రియలయందట్టి వాడేనని జవాబిచ్చుచున్నాడు. మాదిరియైన పనివాడు మాటలయందు

క్రియలయందు ఏకరీతిగానుండును. కొద్దిమంది తమ్మునుతామే మెచ్చుకొనుచుందురు. మాటలున్నవి. కాని క్రియలలో తాము తమ చుట్టు ఉన్నవారితో సరిచూచుకొనుచూ ప్రభువు తనను పిలిచి పని గూర్చి సరియైన గ్రహింపులేని వారుగానున్నారు.

**దేవుడు తనకిచ్చిన పరిధిలోనే జరిగించవలసిన పరిచర్య (13-18వ.)** : ఈ భాగములో 6 పర్యాయములు మేర అనుపదము కలదు. దేవుడు తన చిత్త ప్రకారము అప్పగించిన పనిగా పౌలు కొరింథుకు వెళ్ళి పని చేశాడు. కొరింథు దేవుడు తనకిచ్చిన మేరలోనే ఉన్నది. కొరింథును ఆధారముగా చేసికొని కొరింథులోను దాని ఆవలి ప్రదేశములలోను విశేషముగా సువార్త వ్యాపింపచేయ నిరీక్షించుచున్నాడు. కాని ఇతరుల ప్రయాస ఫలమును బట్టి అతిశయింపనని చెప్పుచున్నాడు. ఇది మాదిరిగానుండగోరు పని వారందరు గమనించాలి.

## 11వ అధ్యాయము 6+6+3+6+6+6=33 వచనములు
## అంశము : పౌలు అపోస్తలత్వపు ఋజువులు

**కొరింథీయులు తప్పిపోకుండునట్లు కాపాడువాడు (1-6వ.)** : సంఘము పరిశుద్ధుడైన క్రీస్తుకు ప్రధానము చేయబడిన కన్యక సాతాను సంఘమును పరిశుద్ధత నుండి తొలగి పోవునట్లు ప్రయత్నించుచున్నాడు. పౌలు తాను కలిగిన వాక్య అనుభవమును బోధించుట ద్వారాను వారిని స్థిరపరచుచున్నాడు. యేసు ప్రభువు పునరుత్థానుడైన తరువాత యోహాను 21:15-17వ.లో పేతురుతో గొర్రెపిల్లలను మేపవలెనని, గొర్రెలను కాయవలెనని చెప్పాడు. అపొస్తలుడుగా పౌలు కొరింథీయులకు వాక్యమను మేత పెట్టుచూ వారిని సత్యము నుండి, పవిత్రత నుండి తొలగిపోకుండ కాపాడుటలో జాగ్రత్త పడుచున్నాడు. తన పరిచర్య ద్వారా తన అపొస్తలత్వమును ఋజువు పరచుకొనుచున్నాడు.

**ఉచితముగా సువార్త ప్రకటించిన పౌలు (7-12వ.)** : పౌలు కొరింథీయుల యొద్ద ఏమియు తీసుకొనక ఉచితముగా సువార్త ప్రకటించుట పాపమా అని ప్రశ్నించుచున్నాడు. ఇతర సంఘములు తనకు సహాయము చేసినందున వారి ధనమును దొంగిలితిని అంటున్నాడు. ఇతరులకు మాదిరిగానుండుటకు తనకు అతిశయ కారణము కలుగ కుండుటకు ఇక ముందును అకయ లేదా గ్రీసు దేశమంతటిలో ఆలాగే ఉండును అంటున్నాడు.

**దొంగ అపొస్తలులు (13-15వ.)** : నిజమైన అపోస్తలులు నమ్మకమైన పని జరిగించు చుండగా అపొస్తలుల వేషము ధరించుకొనిన మోసగాండ్రును కలరు. నాడున్నట్లే నేటి దినములలోనే ఉందురని నమ్ముచున్నాము.

**అవివేకిగా ఎంచినందున పౌలు జవాబు (16-21వ.)** : ఇతరులైన పనివారు శ్రమలను సహించి దాని విషయమై అతిశయించుచూ పౌలును అవివేకి అని తలంచుచున్నారు. ఇతర పనివారు ఏ ఏ విషయములలో అతిశయించుచున్నారో తాను శ్రమలను సహించితినని అది తనకతిశయ కారణమని ధైర్యముగా సందర్భమును బట్టి చెప్పు చున్నాడు. తాను పొందిన శ్రమలు హింసలను క్రింద 'వివరించుచున్నాడు.

**పౌలు పొందిన శ్రమలు, ఆపదలు (22-27వ.)** : తన చెరసాలలు, అపరిమితమైన దెబ్బలు, ఆపదలను వివరించుచున్నాడు, శరీర ప్రయాసల గూర్చి, ఆహార వస్త్ర లేమిని గూర్చి చెప్పుచున్నాడు. 24 సంగతులను ప్రస్తావించి ఇంకను చెప్పవలసినవి అనేకము లున్నవి అంటున్నాడు.

**పౌలుకు సంఘములన్నిటిని గూర్చి - తన విషయమైన చింత లేదు (28-33వ.)** : తాను పొందిన శ్రమల పై చింతలేదని సంఘములన్నిటిపై చింత, భారము దినదినము కలుగుచున్నది. అనగా అధికమగుచున్నదని చెప్పుచున్నాడు. ఈ విషయమై దేవునిని సాక్షిగా నుంచి చెప్పుచున్నాడు. ఈ విషయమై దేవునిని సాక్షిగా పెట్టి చెప్పుచున్నాడు. ఇవన్నియు తన అపొస్తలత్వపు ఋజువులు, తన్ను భద్రపరచుకొనుట అని గమనించాలి.

## 12వ అధ్యాయము 3+3+3+3+3+3+3=21 వచనములు
## అంశము : పౌలు అపోస్తలత్వమునకు మరి కొన్ని ఋజువులు

**పౌలుకు కలిగిన ప్రత్యక్షతలు (1-3వ.)** : పరదైసునకు వెళ్ళిన ఒక మనుష్యుని గూర్చి మాటలాడుచున్నాడు. ఆయన పౌలేనని మనము నమ్మవచ్చును. పౌలు సేవకు ప్రత్యేకింపబడక మునుపు పరదైసుకు వెళ్ళాడని గ్రహించవచ్చును. తన పేరుతో అతిశయించ ఇష్టపడుట లేదు. మూడవ ఆకాశము పరదైసని చెప్పుచున్నాడు.

కీర్తన 19:1వ ప్రకారము **ఆకాశములు** దేవుని మహిమను వివరించుచున్నవి. నెహెమ్యా 9:6వలో నీవే **ఆకాశమును మహాకాశములను** వాటి సైన్యములను సృజించి వాటినన్నిటిని కాపాడువాడవు అని ఉన్నది. పై వచనములను బట్టి అనేక ఆకాశములు కలవని నేర్చుకొనుచున్నాము. కొన్ని ఆకాశములను/అంతస్థులను మనము తలంచ వచ్చును.

1) భూ మండలము - మానవుల నివాసము (కీర్తనలు 115:16వ.)

2) మేఘ మండలము - మొదటి ఆకాశము (కీర్తనలు 57:9వ.)

3) నక్షత్ర మండలము - రెండవ ఆకాశము (కీర్తనలు 8:3వ.)

4) పరదైసు - మూడవ ఆకాశము (2 కొరింథీ 12:2-3వ.)

5) పరలోకము - యోహాను 14:1-3వ. ప్రకారము విశ్వాసులమైన మన నివాసము కొరకు ప్రస్తుతము నిర్మించబడుచున్నది.

6) దూతల సభా పర్వతము - దేవదూతల సభ జరుగు స్థలము (యోబు 1:6వ. కీర్తన 89:5వ. యెషయా 14:13-14వ.)

7) అత్యున్నత సింహాసనము - దేవుని ఆసనము లేక నివాసము (యెషయా 6:1వ. కీర్తనలు 113:5వ. కీర్తన 97:2వ. యెషయా 14:14వ.)

**అతిశయింప కూడదన్న తీర్మానము (4-5వ.)** : పౌలుకు దేవుడు సంఘ మర్మమును తెలుపుట మాత్రమే కాక (ఎఫెసీ 3వ అధ్యాయము) క్రీస్తు కొన్ని ప్రత్యక్షతలను అనుగ్రహించాడు. తాను వాటి విషయమై అతిశయించకూడదన్న తీర్మానము కలవాడు. పౌలునందు ఇతరులు చూచిన దానికన్న ఎక్కువ ఘనముగా తాను ఎంచబడ కూడదన్న తీర్మానము గలవాడు. అందుచేత తన ప్రత్యక్షతలయందు కాక బలహీనతలయందే అతిశయింప తీర్మానించుకొన్నాడు. ఇది సేవకులకు ఎంతో మాదిరి.

**పౌలుకు గల ముల్లు (7-9వ.)** : పౌలు హెచ్చిపోకుండు నిమిత్తము అతిశయింపకుండుటకై తన శరీరములో ముల్లును దేవుడు సాతాను దూతగా ఉంచాడని చెప్పుచున్నాడు. పౌలు ముమ్మారు వేడుకొనినను దేవుడు దానిని తీసివేయలేదు. ఏ సేవకుడైన తాను హెచ్చిపోగలడని, అతిశయింపగలడని సాతాను ఆ రీతిగా సేవకులను పాడు చేయగలడని గుర్తించాలి. అందుకే ఏదో ఒక బలహీనత లేదా కొన్ని బలహీనతలను దేవుడుతన సెలవుతో మన కనుగ్రహించునని గుర్తించాలి. కాని బలహీనతలలోనే మనము ప్రభువునందు బలవంతులముగా నుండగలము.

**అపొస్తలుని గురుతులు గల పౌలు (10-12వ.)** : పౌలు తాను బలహీనుడనని గుర్తించినపుడే దేవుడు తనను బలవంతుడుగా వాడుకొనుచున్నాడు. తన విషయమై

తాను తక్కిన అపొస్తులులకంటే తక్కువవాడను కానని అపొస్తలుల గురుతులను కనుపరచితినని చెప్పుచున్నాడు.

**పౌలు ప్రేమ (13-15వ.)** : పౌలు కొరింథీయులను ప్రేమించుచున్నందున అనేక పర్యాయములు వారిని చూచుటకై వెళ్ళుచున్నాడు. వెళ్ళిన ప్రతిసారి వారికి భారముగా ఉండకుండ జాగ్రత్త పడుచున్నాడు. తనకు కలిగినదే వారికి ఖర్చుపెట్టు తండ్రివలెనున్నాడు కాని వారికి ఏ విషయములోను భారముగానున్నవాడు కాడు. సేవా జీవితములో ఎవరికి భారముగా నుండరాదు. ఇది సేవకులకు మాదిరి.

**పౌలు సేవా జీవిత రాబడి - ఖర్చుల పట్టీ (16-18వ.)** : పౌలు కొరింథీయుల మధ్య సేవలో తన ఆర్జనను గూర్చి, పెట్టిన ఖర్చుల గూర్చి బహిరంగ పరచుచున్నాడు. ఇది సేవకులకు ఎంతోమాదిరి. సేవ ద్వారా తాను సంపాదించినది ఏమి లేదని బట్టబయలు చేయుచున్నాడు. సేవ సంపాదన కొరకుకాదని గుర్తించాలి. ఆర్థిక రాబడి - ఆర్థిక వ్యయములను ప్రతి సేవకుడు అందరియెదుట ఉంచుట ఎంత మాదిరియో గమనించ గలము.

**పౌలు దుఃఖముతో మార్గము తప్పిన వారిని మారుమనస్సు పొందుడని హెచ్చరించుట (19-21వ.)** : కొరింథీయుల మొదటి పత్రికలో వ్రాసిన 1) కలహములు, 2) అసూయలు, 3) క్రోధములు, 4) కక్షలు, 5) కొండెములు, 6) గుసగుసలు 7) ఉప్పొంగుట, 8) అల్లరులు సర్వ సాధారణముగా అనేక సేవకులలోను పై బలహీనతలు ఉండును. అలాగు ఉండకుండ సేవకుడు ప్రతి విశ్వాసి జాగ్రత్తపడాలి.

## 13వ అధ్యాయము 2+4+4+4=14 వచనములు
## అంశము : చివరి హెచ్చరికలు

**పాపము విషయమైన క్రమశిక్ష (1-2వ.)** : పౌలు కొరింథుకు మొత్తము నాలుగుసార్లు వెళ్ళాడని తలంచవచ్చును. ఈ పత్రిక మాసిదోనియా నుండి వ్రాసిన తరువాత అక్కడకు వెళ్ళాడు. నాలుగవసారిగా రోములోని మొదటి చెర తరువాత విడుదల పొందిన సమయములో వెళ్ళినట్లు చూడగలము. (బైబిల్ చివరి అట్టనున్న పటము చూడండి) ఈ మూడవ సారి వెళ్ళుటలో వారిని క్రమ పరచుటే ముఖ్య ఉద్దేశ్యము.

**స్వ పరీక్ష చేసుకొనుచున్న పౌలు (3-6వ.)** : క్రీస్తు బలహీనుడు కాడు కాని మన బలహీనతలకై సిలువ వేయబడినందున బలహీనులమైన మనము దేవుని శక్తిని బట్టి

జీవము కలవారముగా నుండగలమని చెప్పుచున్నాడు. అందువలన విశ్వాస జీవితములో ఎట్లున్నానోయని తన్నుతాను నిత్యము పరీక్షించుకొనుచు తాను భ్రష్టుడుగా లేడని ఇతరులు తెలిసికొనవలెనని పౌలు కోరుచున్నాడు.

**పౌలు ప్రార్థన (7-10వ.)** : పౌలు భ్రష్టుడు కాకపోయినను తాను భ్రష్టుడైనట్టు తలంచు వారి కొరకై చెప్పు మాటలు గమనించదగినవి. "మేము భ్రష్టులమైనట్లు కనబడినను మీరు మేలైనది చేయవలెనని ప్రార్థించుచున్నాము". మనమును అట్టి ప్రార్థన చేయువారమై ఉండాలి.

10-13వ అధ్యాయములలో పౌలు విమర్శించబడిన రీతిని గమనించగలము. 1) శరీర ప్రకారము నడుచుకొనువాడు. 10:2వ, 2) శరీరమునకు బలహీనుడు 10:10వ, 3) ప్రసంగములు కొరగానివి 10:10వ, 4) దొంగయైన పౌలు 11:8వ, 5) అవివేకియైన పౌలు 11:16వ, 6) పౌలు భ్రష్టుడు అనిరి. 13:7వ.

**ముగింపు - ఆశీర్వాదము (11-14వ.)** : ముగింపులో 1) సంతోషించుడి, 2) సంపూర్ణులై ఉండుడి, 3) ఆదరణ కలిగియుండుడి, 4) ఏకమనసు కలవారై యుండుడి, 5) సమాధాన ముగానుండుడి, 6) దేవుడు మీకు తోడుగానుండుగాకని ఆరు మంచి తలంపులను తనను ఆరు రీతులుగా విమర్శించిన వారికి ఇచ్చుచు ముగించుచున్నాడు. వారిని ఆశీర్వదించుట గమనించదగినది. అలాగే మనలను విమర్శించువారు మనము భ్రష్టులమని చెప్పు వారును ఉందురు. పౌలు అటువంటి వారి క్షేమమును కోరుట వారిని హృదయ పూర్వకముగ క్షమించి ఆశీర్వదించుట నేటి సేవకులకు ఒక మాదిరి. త్రియేక దేవుని ఆశీర్వాదమును గమనించండి.

# గలతీయులకు వ్రాసిన పత్రిక

గ్రంథకర్త : పౌలు . కాలము : క్రీ.శ. 49-57(?) స్థలము : సిరియాలోని అంతియొకయ
**కొనిపోయినవారు ---**

**ముఖ్య ఉద్దేశము** : గలతీలోని కలితీ బోధ - గలతీలో గలిబిలి.

**గలతీయుల చరిత్ర** : గాలులు అని పిలువబడి మూర్ఖపు తెగకు చెందినవారు ఐరోపాలోని ఫ్రాన్సుకు పడమటి వైపు నివసించుచుండిరి. వారు ఫ్రాన్స్‌పై దండెత్తి ఫ్రాన్స్‌ను ఓడించి, క్రీ.పూ. 280 గ్రీసును దాటి, ఆసియా ఖండంలో ప్రవేశించిరి. బిత్తూనియా రాజు తన దేశంలోని తిరుగుబాటును అణచుటకై వారిని ఆహ్వానించగా ఆసియా, బిత్తూనియ సమీపమున నివసించిరి. క్రీ.పూ. 189లో రోమీయుల వశమున ఉండిరి. ఆసియా సమీపాన గాలులు నివసించిన స్థలము గలతీయ అని పిలువబడెను. ఇంగ్లీషులో "గాల్స్ ఏషియా" - గలేషియా - గలతీయగా మారినది. వీరు చంచల మనస్కులు.

**గలతీయ సంఘ స్థాపన** : క్రీ.శ. 47లో పౌలు లుస్త్రకు రాగా పౌలును హెర్మేగాను, బర్నబాను ద్యుపతిగా (JUPITER) భావించి పూజారి ఎద్లను బలిగా చేయతలంచిరి. బహు కష్టముగా పౌలు దానిని ఆపు చేయించెను. (అ.కా. 14:12-19ప) ప్రభువును నమ్మిన శిష్యులను తదుపరి 14:22లో పౌలు బలపరచెను. మరుసటి దినము ఈకొనియ నుండి వచ్చిన యూదులతో కలసి గలతీయులైన లుస్త్రవారు పౌలుపై రాళ్ళు రువ్విరి. పౌలును దేవుడుగా తలంచి శక్యమైతే తమ కన్నులు ఊడ బెరికి ఇత్తుమనిరి. (గలతీ. 4:14) తదుపరి పౌలు నేర్పిన బోధ నుండి తొలగిరని (గలతీ. 1:6) చూడగలము. కనుక పౌలు బర్నబాల పరిచర్య ద్వారా సంఘ మేర్పడి తదుపరి రక్షణకు సున్నతి అవసరమను దుర్బోధకు తావిచ్చినందున వారిని దిద్దుటకై పౌలు ఈ పత్రిక వ్రాసెను. ఎపుడు వ్రాసెనో ఎక్కడ నుండి వ్రాసెనో ఖచ్చితంగా చెప్ప వీలుపడదు.

ఈ పత్రికలో స్వతంత్రము అను పదము 11 పర్యాయములు కలదు. 1) 2:4, 2) 3:28, 3) 4:22, 4) 4:23. 5) 4:26, 6) 4:30. 7) 4:31. 8) 5:1, 9) 5:1, 10) 5:13, 11) 5:13. సున్నతి అక్కరలేదని ధర్మశాస్త్ర దాస్యము నుండి విడిపింపబడితిమని వివరించుచున్నాడు. ఈ పత్రికలోని అంశము క్రీ.శ. 49లో యెరూషలేములో జరిగిన

సున్నతి సభకి (అ.కా. 15వ అధ్యా.) చెందినందున ఈ పత్రిక క్రీ.శ. 49-50లో సిరియాలోని అంతియొకయ నుండి వ్రాయబడినది అని సామాన్యముగా తలంచుదురు. 6:11లో నా స్వహస్తముతో వ్రాసితిని అన్నందున ఇది పౌలు వ్రాసిన అన్ని పత్రికలలో మొదటిది కావచ్చును.

## అధ్యాయాల విభజన 2+2+2= 6 అధ్యా.

**I. 1-2వ అధ్యాయములు** : సువార్త సత్యము, తన అపొస్తలత్వమును దృఢపరచుకొనుట (వ్యక్తిగతము).

**II. 3-4వ అధ్యాయములు** : బోధ. ఎ.3వ అధ్యాయము. విశ్వాసము ద్వారానే రక్షణ - సువార్త సత్యము.

**b) 4వ అధ్యాయములు** : రక్షణ కలిగించిన విశ్వాసము నుండి వెనుకకు (ధర్మశాస్త్రమునకు) మరలరాదు.

**III. 5-6వ అధ్యాయములు** : నడక - 5వ. ఆత్మానుసారమైన నడక. రక్షింపబడి స్వతంత్రులముగా, ఆత్మానుసారముగా నడుచుకొనుట.

## 1వ అధ్యాయము 5+5+7+7=24 వచనములు
## అంశము : పౌలు వ్యక్తిగతము

**శుభములు (1-5వ)** : గలతీయలో ఉన్న సంఘములకు అనుటలో స్థానిక సంఘములను ఉద్దేశించి వ్రాసినట్లు తలంచగలము. ఈ పత్రిక వ్రాయుటకు తన అధికారమును తెలుపుటకై తాను మనుష్యుల వలన కాక దేవుని వలన అపొస్తలుడుగా నియమించబడితినని తెలుపుచున్నాడు. దేవుడు తన చిత్త ప్రకారం మనలను విమోచించాడని క్రియల మూలముగా ఎవరును విమోచింపబడలేదని తెలుపుచున్నాడు. మన పాపము నిమిత్తము యేసుక్రీస్తు తన్నుతానే అనగా తనను, తన ఇష్టప్రకారం అప్పగించుకున్నాడని తెలుపుచున్నాడు.

**పత్రిక ఉద్దేశ్యము - సువార్త సత్యము నుండి భిన్నమైన సువార్త తట్టుకు తిరిగిన గలతీయులను క్రమపరచుట (6-10వ.)**: పౌలు ప్రకటించిన సువార్త ప్రకారం యేసుక్రీస్తు నందలి విశ్వాసవలననేగాని ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల మూలముగ మనుష్యులు

నీతిమంతులుగా తీర్చబడరు. కాని క్రీస్తు సువార్తను చెరపగోరి కలవరపరచు మరొక సువార్తను ఎవరైన ప్రకటించిన యెడల వారు శాపగ్రస్తులగుదురని తెలుపుచున్నాడు. 10వ. మనుషుల దయను కాక, మనుష్యులను సంతోషపెట్టువాడుగా కాక దేవుని దయను సంపాదించుకొనుచూ దేవుని సంతోషపెట్టువాడు క్రీస్తు దాసుడని తెలుపు చున్నాడు.

**ప్రభువు వలన బయలు పరచబడిన పౌలు బోధించిన సువార్త పరిచర్య (11-17వ.) :** 11,12వ. పౌలు బోధించిన సువార్తను యేసుక్రీస్తు నుండి తాను పొందితినని మనుష్యుల వలన దానిని పొందలేదని తెలుపుచున్నాడు. 13-14వ. యూదామతములో తాను అధిక్యత నొందిన వాడినవి తన సమాన వయస్కులలో అనేకులకంటే విశేష ఆసక్తి కలిగినవాడై ఉండెను. 15-17వ. కాని తల్లిగర్భమందు పడినది మొదలుకొని దేవుడు పౌలును ప్రత్యేక పరిచాడని అన్యజనులకు సువార్త ప్రకటించటానికి పిలిచాడని పౌలు గుర్తించి మనుష్య మాత్రులతో సంప్రదించక తనకంటే ముందుగా ఉన్న అపొస్తల యొద్దకు గాని సేవా కేంద్రమైన యెరూషలేముకు కాని వెళ్ళలేదు. అరేబియాలోనికి వెళ్ళి 3సం॥ అయిన తరువాత యెరూషలేముకు వెళ్ళి కేఫాను పరిచయము చేసుకొని 15 దినములుండెను. రక్షింపబడిన తరువాత యెరూషలేముకు వెళ్ళుట ఇదే మొదటి సారి. అక్కడ దేవుడు బయలుపరచిన సువార్తనే తరువాత దమస్కుకు వచ్చి బోధింప ఆరంభించెను.

**సంఘముల ఆమోదము పొందిన పరిచర్య (18-24) :** క్రీ.శ. 32లో రక్షించబడిన పౌలు క్రీ.శ. 35లో కేపా యాకోబులను కలసి పిమ్మట తార్సుకు వెళ్ళెను. క్రీ.శ. 46లో అంతియోకయ సంఘము ద్వారా సేవ కప్పగింపబడెను. (అ.కా. 13:1-3వ) 2:9లో 14 సం॥ తరువాత అనగా క్రీ.శ. 49లో యాకోబు, కేఫా, యోహానులు తమకుడి హస్త మిచ్చినందున యెరూషలేము సంఘము పౌలు పరిచర్యను ఆమోదించెను.

**21-24వ వచనము :** సిరియా కిలికియా ప్రాంతములలోనున్న సంఘములు ముఖ్యముగా యూదయ సంఘములు క్రీస్తునందలి విశ్వాసమును పౌలు ప్రకటించు చున్నాడని దేవుని మహిమ పరచుట పౌలు యొక్క పరిచర్యను ఆమోదించుటయే. సిరియా కిలికియా దేవునికి మహిమ కలిగెను. క్రీ.శ. 35 నుండి క్రీ.శ. 45 వరకు సుమారు 10సం॥రాలు పౌలు సిరియా కిలికియా ప్రాంతములలో సువార్తను ప్రకటించాడు.

## 2వ అధ్యాయము 5+5+5+6=21 వచనములు
## అంశము : తన అపోస్తలత్వమును దృఢపరచుకొనుట

**తనను పిలిచినను వార్త పరిచర్య వ్యర్థము కాకుండుటకు ప్రయాసపడిన పౌలు (1-5వ.) :** 1-2వ. 14సం॥రాలు తరువాత యెరూషలేమునకు దేవ దర్శనం ప్రకారమే

వెలితిని అన్నాడు. తాను రక్షించబడిన పిదప దమస్కులోను, అరేబియాలోను, మరలా దమస్కులోను చాలా దినములుండెను. అవి దినములే. పిమ్మట 3 ఏండ్లకు 1:18 ప్రకారం యెరూషలేముకు తార్సుకు వెళ్ళాను. 10సం॥రాలు సిరియా కిలికియా ప్రాంతంలోను 1సం॥ అంతియొకయిలోను (అ.కా. 11:26) ఉన్నాడు. క్రీ.శ. 46-49 వరకు మొదట సేవా యాత్ర చేసి క్రీ.శ. 49లో బర్నబాతోను, తీతుతోను, బర్నబాతో కలసి అంతియొకయకు వెళ్ళెను. 3,4,5వ. తన పరిచర్యలో రక్షించబడిన గ్రీసు దేశస్థుడైన తీతు (తీతు 1:2) సున్నతి పొందుట కపట సహోదరుల వలన జరిగినది రక్షణ పొందుటకు సున్నతి అవసరం లేదు కనుక సున్నతి సభ తీర్మానమును అనగా రక్షణకు సున్నతి అవసరము లేదను సత్యం స్థిరపరచుటకై పౌలు ఈ పత్రికను వ్రాసెను.

**అపొస్తలత్వము కలిగి ఇతరుల ఆమోదము పొందిన పౌలు పరిచర్య (6-10వ.)** : 6-7వ. ఎన్నికయిన వారిలో కొందరు సున్నతి పొందని వారిని గూర్చి ప్రత్యేక అభిప్రాయం కలిగి ఉన్నారు. పౌలు దేవుని యొద్ద నుండి సువార్త సత్యం పొందినందున ఎన్నికయిన వారి దగ్గర నేర్చుకొనలేదు. ఎన్నికయిన వారిలో సున్నతి పొందిన వారికి అనగా యూదులకు సువార్త బోధించు పరిచర్య దేవుడు పేతురుకు అప్పగించెను. అలాగే సున్నతి పొందని వారికి అన్యులకు సువార్త బోధించు పరిచర్య దేవుడు పౌలుకు అప్పగించెను. 8,9,10వ. సున్నతి పొందిన వారికి అపొస్తలుడవుటకు పేతురుకు సామర్థ్యం కలుగజేసిన దేవుడు అన్యజనులకు అపొస్తలు డగుటకు పౌలుకు సామర్థ్యం అనుగ్రహించాడని ఎన్నికయిన వారు గ్రహించారు. యెరూషలేము సంఘములో స్తంభములైన యాకోబు, కేఫా, యోహానులు అనువారు పౌలుకు తమ కుడిహస్తం ఇచ్చిరి. అనగా పౌలు యొక్క పరిచర్యను ఆమోదించిరి.

**సువార్త సత్యము విషయమై దారితప్పిన అపొస్తలులకు క్రమమును తెలిపిన పౌలు (11-15వ.)** : కేఫా అనబడిన పేతురు అంతియొకయకు వచ్చి అన్యులతో కలసి భోజనము చేయుచుండెను. యాకోబు నుండి కొందరు వచ్చిన తరువాత సున్నతి పొందినవారికి భయపడి అన్యులతో భోజనము చేయుటకు వెనుక తీసెను. తక్కిన యూదులును బర్నబాయు మోసపరచబడి వారితో కలిసిరి. ఈ ప్రవర్తన సువార్త సత్యంనకు వ్యతిరేకమని పౌలు గుర్తించి కెఫాను ఎదిరించాడు.

**3వ అధ్యాయములోని బోధ యొక్క పీఠిక - "విశ్వాసము ద్వారా నీతిమంతులుగా తీర్చబడుట" (16-21వ)**: ఈ భాగంలో గలతీ పత్రికలో చెప్పబడిన సువార్త సత్యం

వివరించబడినది. 16,17,18వ. మనుష్యులు యేసుక్రీస్తునందలి విశ్వాసము వలననే నీతిమంతులుగా తీర్చబడుదురు. అందుకే యేసుక్రీస్తునందు విశ్వాస ముంచుచున్నారు. ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల మూలముగా శరీర క్రియల మూలముగా అనగా యూదులుగాని అన్యులుగాని నీతిమంతులుగా తీర్చబడరు కనుక అందరు క్రీస్తునందు విశ్వాసముంచుట ద్వారా నీతిమంతులుగా తీర్చబడుదురన్న తలంపు కలిగి ఉండాలి.

**19-21వ వచనము** : కనుక దేవుని విషయమై మనము జీవించాలి. క్రీస్తుతో కూడా సిలువ వేయబడిన మనము ఆ క్రీస్తు మనయందు జీవించుచున్నాడని ఎరిగి మనలను ప్రేమించి మన కొరకు అప్పగించుకొనిన క్రీస్తుయందలి విశ్వాసము వలన జీవించాలి. క్రీస్తు మన పాపం కొరకై చనిపోయినందున నీతి ధర్మశాస్త్రము వలన కలుగదని దేవుని కృప ద్వారానే రక్షణ కలుగునని గుర్తించాలి. 2 కొరిం. 5:15లో క్రీస్తు అందరి పాపం కొరకు మృతి పొందినందున జీవించువారు ఇక మీదట తమ కొరకు కాక తమ నిమిత్తం మృతిపొంది తిరిగిలేచిన వాని కొరకే జీవించాలని పౌలు నిశ్చయించుకొన్నాడు; ఈ తీర్మానము అందరు కలిగి ఉండాలి.

## 3వ అధ్యాయము 5+9+8+7=29 వచనములు
## అంశము : సువార్త సత్యము - క్రీస్తునందలి విశ్వాసము ద్వారానే నీతిమంతులుగా తీర్చబడుట

**గలతీయుల అనుభవము (1-5వ.) :**

**1వ వచనము** : రక్షణ పొందుటకై సున్నతి అవసరమని తీతును బలవంతము పెట్టి సున్నతి చేయించినందున వారు భయపడిరని అవివేకులైరని తెలుపుచున్నాడు.

**2వ వచనము** : తమ ఎదుట ప్రదర్శించబడిన సిలువ వేయబడిన యేసునందు విశ్వాసము ద్వారా దేవుని ఆత్మను పొందిరి.

**3-4వ వచనములు** : ఆత్మాను సారముగ అరంభించినవారు శరీర సంబంధమైన క్రియలవైపు అనగా సున్నతి వైపు మరలుట అవివేకమని తెలుపుచున్నాడు.

**5వ వచనము** : విశ్వాసము ద్వారా పరిశుద్ధాత్మను అనుగ్రహించి దేవుడు వారిలో అద్భుతములు జరిగించాడు. ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల మూలముగ కాదని తెలుపుచున్నాడు గనుక తమ కన్నులముందు ఉన్న క్రీస్తు సిలువ నుండి తమ దృష్టిని ధర్మశాస్త్ర క్రియలవైపు మరల్చుకొన కూడదని చెబుతున్నాడు.

**6-29వ. పాత నిబంధన లేఖనముల నుండి ఋజువు - పితరుడైన అబ్రాహాము నీతిమంతుడుగా తీర్చబడిన విధము :** 6-7వ. అబ్రాహాము దేవుని నమ్మెను అది అతనికి నీతిగా ఎంచబడెనని ఆది. 15:4-6 వచనాలలో ఉన్నది. అబ్రాహాము అతని కుమారుడైన ఇష్మాయేలు. ఆది. 17:26లో సున్నతి పొందిరి. పై భాగమును బట్టి సున్నతి పొందక మునుపే అబ్రాహాము నీతిమంతుడుగా తీర్చబడెనని గ్రహించుచున్నాము.

**8-9వ వచనము :** ఆది. 12:3లో నీ యందు భూమి యొక్క సమస్త వంశములు (అనగా అన్యులు కూడా) ఆశీర్వదించబడును అన్నాడు. అలాగైతే నమ్మిన యూదులైన, అన్యులైన అందరు ఆశీర్వదించబడుదురు.

**10-11వ వచనము :** ధర్మశాస్త్ర క్రియలమూలముగ ఏ మనుష్యుడు ఆయన దృష్టికి నీతిమంతుడుగా తీర్చబడడని ధర్మశాస్త్రమందు వ్రాయబడిన విధులను చేయుటయందు నిలకడగా ఉండనివాడు శాపగ్రస్తుడని ద్వితీ. 27:26లో వ్రాయబడి ఉంది.

**12-14వ వచనము :** నీతిమంతుడు విశ్వాసమూలంగా జీవించునని హబక్కూకు 2:4లో వ్రాయబడింది. (రోమా 1:17, హెబ్రీ. 10:38) మ్రానుమీద వ్రేలాడు ప్రతివాడు శాపగ్రస్తుడని ద్వితీ. 21:23లో వ్రాయబడినట్లు క్రీస్తు మనకోసం శాపగ్రాహియై ధర్మశాస్త్రం యొక్క శాపం నుండి విడిపించాడు. కనుక విశ్వాసము ద్వారానే మనుష్యులు నీతిమంతులుగా తీర్చబడుదురు. పరిశుద్ధాత్మను పొందుదురు.

**అబ్రాహాము వాగ్దానము పొందిన విధము (15-22వ.) :** 15-18వ. మనుష్యరీతిగా చూచిన యెడల చేయబడిన ఒడంబడిక లేదా వ్రాయబడి ముద్రించబడిన పత్రములో అతని సంతానం గూర్చి నిబంధన చేసెను. 17:7,8లో ఆ నిబంధనను నిత్య నిబంధనగా స్థిర పరచెను. ఇలాగు జరిగిన పిమ్మట 430 సం॥రాలకు ధర్మశాస్త్రం మోషే ద్వారా అను గ్రహించబడెను. ఈ ధర్మశాస్త్రములో దేవుడు ముందుగా నిత్యకాలమునకు స్థిరపరచిన నిబంధనను కొట్టివేయుడు కనుక అబ్రహామునకు అనుగ్రహించబడిన నిత్య నిబంధన విశ్వాసము ద్వారానే కలిగినది. అతడు యెహోవాను నమ్మెను అది అతనికి నీతిగా ఎంచబడెను. ఆది. 15:4వ.

**19-22వ వచనము :** దేవుడిచ్చిన వాగ్దానములో ఉన్న సంతానమైన క్రీస్తు వచ్చి దేవునికి మానవుల మధ్యవర్తిగా ఉండి మానవుల పాప పరిహారం జరిగించాలి. మానవులు 1) తాము పాపులమని గుర్తించాలి. 2) తమ కొరకై మరణించి తిరిగి లేచిన మధ్యవర్తియైన క్రీస్తునందు విశ్వాసముంచాలి. పైన చెప్పబడినట్లు మానవులు తాము పాపులమని

గుర్తించుట కొరకే ధర్మశాస్త్రం అనుగ్రహించబడింది. కనుక ధర్మశాస్త్ర లేఖనాలు మానవులందరిని పాపంలోనే బంధించినవి. కాని పాపంలో మరణించిన మానవునికి జీవించు శక్తిని ఇవ్వలేదు.

**విశ్వాసము వెల్లడికాక మునుపు - వెల్లడియైన తరువాత మానవులు నీతిమంతులుగా తీర్చబడిన విధము (23-29వ.)** : 23-24వ. ముందుకు బయలు పరచబడబోవు విశ్వాసమును మానవులు అవలంబించాలి. ఆ విశ్వాసము ద్వారా మానవులు నీతి మంతులుగా తీర్చబడినట్లు తాము పాపులమని ఎరుగుటకు ధర్మశాస్త్రము బాలశిక్షకుడుగా ఉండెను. కనుక విశ్వాస మార్గము వెల్లడి కాకమునుపు జీవించిన వారు ధర్మశాస్త్రము ద్వారా తాము పాపులమని గుర్తించి క్రీస్తు యేసు మరణ పునరుత్థానం ద్వారా ముందుకు బయలుపరచబోవు విశ్వాసమార్గం అవలంభించి నీతిమంతులుగా తీర్చబడిరి.

**25-27వ వచనము** : నీతిమంతుడైన క్రీస్తు యేసు మరణించి పునరుత్థానమగుట ద్వారా విశ్వాస మార్గం వెల్లడి అయెను కనుక నీతిమంతుడైన క్రీస్తు ద్వారా పరిశుద్ధాత్మని ద్వారా యోహా. 16:8వ. ప్రకారం మానవులు తాము పాపులని ఒప్పించబడుచున్నారు. కనుక మరణించి పునరుత్థానుడైన యేసుక్రీస్తునందు విశ్వాసముంచుట ద్వారా నీతిమంతులుగా తీర్చబడి దేవుని కుమారులై ఉన్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మం పొందుట ద్వారా క్రీస్తును ధరిచుకొన్నారు.

**28,29వ వచనములు** : ఇందులో రక్షింపబడుటలో యూదుడని గ్రీసు దేశస్థుడని బేధములేదు. దాసుడని స్వాతంత్రుడని బేధం లేదు. పురుషుడని స్త్రీ అని బేధము లేదు. అందరు క్రీస్తును ధరించు కొనినందున క్రీస్తునందు అందరూ ఏకముగా ఉన్నారు. కనుక గ్రీసు దేశస్థులైన అన్యుల విషయమై వేరుగ తలంచకూడదు. పైన చెప్పబడిన వివరాలను బట్టి క్రీస్తు యేసునందు విశ్వాసముంచిన క్రీస్తు యేసు సంబంధులైన వారందరు అబ్రహాము యొక్క సంతానము. అబ్రహాముకిచ్చిన వాగ్ధానమును బట్టి క్రియల మూలముగా కాక విశ్వాస మూలంగానే వాగ్ధానమునకు వారసులగుచున్నారు.

## 4వ అధ్యాయము 7+4+8+11= 31 వచనములు
## అంశము : రక్షణ కలిగిన విశ్వాసము నుండి వెనుకకు మరలరాదు

**పరిపూర్ణకాలంలో విశ్వాసము ద్వారా విమోచించబడుట - నీతిమంతులుగా తీర్చబడుట (1-7వ.)** : కాలము పరిపూర్ణము అనగా క్రీస్తు యేసు భూలోకమునకు వచ్చుటకు

నిర్ణయించబడిన కాలం పరిపూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారుడైన క్రీస్తు యేసును ఈ లోకం లోనికి పంపెను. మానవులందరు పురుషుల ప్రమేయంతో ఈ లోకంలో పుట్టుదురు కాని ఆయన కేవలం కన్యయగు స్త్రీయైన మరియ యందు పుట్టాడు. ధర్మశాస్త్రము ద్వారా పాపంలో బంధించబడిన మానవులను విమోచించుటకు ధర్మ శాస్త్రమునకు లోబడ్డాడు. గలతీ. 3:13వ.లో ముందుగ చెప్పబడినట్టు ధర్మశాస్త్రంలో ద్వితీ. 21:23వ.లో వ్రాయబడిన ప్రకారం మనకోసం మ్రాను మీద వ్రేలాడి శాపగ్రాహి అయ్యాడు. అనగా మన పాపమును బట్టి మనకు కలిగిన శాపములను (నరకశిక్ష) గ్రహించాడు. కనుక మనం పాప శిక్షనుండి విమోచింపబడిన వారమైతిమి. దీనిని విశ్వసించినవారు నీతి మంతులుగా తీర్చబడి పరిశుద్ధాత్మను, రోమా 8:15వ. ప్రకారం దత్తపుత్రాత్మను పొందుదురు. యోహాను 1:12వ. ప్రకారం క్రీస్తునందు విశ్వాసముంచిన వారు దేవుని కుమారులైనారు. కనుక తండ్రికి కలిగిన సమస్తమునకు, అనగా పరలోకమునకు వారసులైనారు.

**మనము నీతిమంతులుగా తీర్చబడిన విశ్వాసమునుండి వెనుకకు మరలరాదు (8-11వ.)** : ఇప్పుడు విమోచించబడినవారు, దేవుని ఎరిగిన వారును దేవుని చేత ఎరుగబడిన వారునై ఉన్నారు. కనుక మునుపటివలె బలహీనమైన వాటికి దాసులు కాకూడదని విశ్వాసము నుండి వెనుదిరిగి ఎటువంటి అచారాల వైపుకు తిరగకూడదని సెలవిచ్చు చున్నాడు.

**పౌలుతో తమకు గతకాలంలో కలిగిన వ్యక్తిగత అనుభవము నుండి నేర్చుకోవాలని కోరుట (12-20వ.)** : 12-15వ. పౌలు గలతీయులకు సువార్త ప్రకటించిన గతకాలంలో శరీర దౌర్బల్యత కలిగెను. శరీరంలో కలిగిన శోధనను బట్టి వారు పౌలును తృణీకరించ లేదు. పౌలు బోధించిన సువార్తను నిరాకరించలేదు. శక్యమైతే మీ కన్నులు ఊడదీసి నాకిచ్చివేసియుందురు అని అనుటను మనము ఈ రీతిగ తలంచవచ్చును. కన్నుల విషయమై ప్రస్తావించబడినందున పౌలు కన్నులకు తొందర కలిగినట్లు తలంచగలము. వారు పౌలును దేవదూతవలెను, క్రీస్తువలెను అంగీకరించిరి. క్రీస్తునందలి విశ్వాసము వలన కలుగు రక్షణను అంగీకరించిరి. పౌలు కంటి జబ్బు కొరకై తమ కన్నులను ఇచ్చుటకు సిద్ధపడిరి. కనుక గతములో పౌలును పౌలు బోధను వారు అంగీకరించినట్లు ఇప్పుడును ఆ బోధయందే నిలిచి ఉండవలెనని కోరుచున్నాడు.

**16-20వ వచనము** : భిన్నమైన సువార్తను తమ యొద్దకు తెచ్చినవారు గలతీయుల మేలును కోరినవారు కారని చెప్పుచు దానియందు లక్ష్యముంచ కూడదని సెలవిచ్చు చున్నారు. క్రీస్తు యేసు యొక్క స్వరూపము వారియందు ఏర్పడవలెనని దానికొరకు తాను ప్రసవవేదన పడుతున్నానని చెప్పుచున్నాడు.

**ధర్మశాస్త్రములోని అలంకారములను కనుపరుచు సాదృశ్యము (దాస్యము - స్వాతంత్ర్యము) (21-31వ.)** : ధర్మశాస్త్రంలో అబ్రాహామునకు స్వతంత్రురాలగు శారా వలన ఇస్సాకు ఆత్మీయముగా పుట్టాడు. దానికంటె ముందుగా హాగరు వలన శరీర ప్రకారము ఇష్మాయేలు పుట్టాడు. శరీరమును బట్టి పుట్టిన ఇష్మాయేలు ఆత్మను బట్టి పుట్టిన ఇస్సాకును ఆది. 21:9వ. ప్రకారము పరిహసించి హింసపెట్టాడు. అలాగే ఆత్మ సంబంధమైన విశ్వాసులను వారు నీతిమంతులుగా తీర్చబడిన కార్యమును శరీర సంబంధమైనవారు హేళన చేయుట జరుగుచున్నది. ఆది. 21:12వ.లో దేవుడు సెలవిచ్చినట్లు దాసియగు హాగరును దాని కుమారుడగు ఇష్మాయేలును వెళ్ళగొట్టాడు. దాసి కుమారుడగు ఇష్మాయేలు స్వతంత్రురాలు కుమారుడగు ఇస్సాకుతో వారసుడుగా ఉండడని దేవుడు సెలవిచ్చాడు. కాబట్టి స్వతంత్రురాలి కుమారులముగా ఉన్న మనము కూడా ఆత్మ సంబంధమైనటువంటి విశ్వాసము ద్వారానే వారసులమైనాము. దాసీ కుమారులము కాము గనుక ఏ మూల పాఠకులకు గాని ఆచారములకు కాని దాసులము కామని తెలుపుతున్నాడు. దీనిని బట్టి ధర్మశాస్త్ర సంబంధమైన ఆచారమగు సున్నతి అక్కరలేదని, దినములు, మాసములు, ఉత్సవకాలములు సం॥రములను ఆచరించ అవసరం లేదని తెలుపుతున్నాడు. కనుక విశ్వాసమార్గంలోనే మనము ఎదుగవలెను కాని వెనుకటి ఆచారములకు మరల వెళ్ళరాదని నేర్చుకొనుచున్నాము.

## 5వ అధ్యాయము 6+6+3+6+5=26 వచనములు
## అంశము : ఆత్మానుసారమైన నడక

**విశ్వాసము ద్వారా రక్షింపబడి, ధర్మ శాస్త్రనడక నడవరాదు (1-6వ.)** : పైన చెప్పబడినట్లు క్రీస్తు మనలను స్వతంత్రులుగా చేసినందున దాస్యమను కాడిక్రింద మనము లేమని సున్నతి పొందుట వలన ప్రయోజనమేమి లేదని చెప్పుచున్నాడు. ధర్మశాస్త్రం ద్వారా నీతిమంతులుగా తీర్చబడగోరువారు క్రీస్తు ద్వారా కలుగు కృప నుండి

తొలగిపోయిన వారని చెప్పుచున్నాడు. కనుక విశ్వాసము ద్వారా నీతిమంతులుగా తీర్చబడి యేసుక్రీస్తునందున్న వారికి సున్నతి పొందుటయందు కాని పొందకపోవుటయందు గాని ఏమియు లేదని చెప్పుచున్నాడు. కనుక ఆత్మ ఫలములో మొదటిదగు ప్రేమ వలన జరిగిన కార్యమునందలి విశ్వాసమే మనలను నీతిమంతులుగా తీర్చినది. దేవుని ప్రేమయే కుమారుడైన క్రీస్తును లోకమునకు పంపి సిలువకు అప్పగించినది. పాప క్షమాపణకై ఆయన చేసిన కార్యమునందు విశ్వాసముంచుట ద్వారా మనము నీతిమంతులుగా తీర్చబడితిమి.

**సత్యమునకు విధేయులై నడుచుకొనుట (7-12వ.)** : 7వ. గతకాలములో గలతీయులు సత్యమునకు విధేయులై నడుచుచుండిరి. కాని ఇప్పుడు ఆగిపోయిరి. 8వ. ధర్మశాస్త్ర సంబంధమైన ఆచారములను ఆచరించుట మనలను పిలిచిన ప్రభువు వలన కలిగినది కాదని అసత్యమని చెప్పుచున్నాడు. 9వ. అసత్యబోధ పులిసిన పిండివలె వ్యాపించి ముద్ద అంతటిని అనగా విశ్వాస కోటిని అసత్యములోనికి నడిపించునని తెలుపుచున్నాడు. 10-12వ. సున్నతిపొందవలెనని పౌలు ఎన్నడు బోధింపలేదు. అలాగు బోధించుట సిలువ వేయబడిన క్రీస్తు ద్వారా నీతిమంతులుగా తీర్చబడు విశ్వాస మార్గమునకు వ్యతిరేకము. కనుక ఎవరైనను అటువంటి బోధ చేయరాదు.

**స్వతంత్రులమైన మనము ఒకరికి ఒకరము దాసులుగా నుండుట (13-15వ.)** : విశ్వాస విషయములో స్వతంత్రత కలిగిన వారమేకాని ఆ స్వతంత్రతను బట్టి ధర్మశాస్త్ర క్రియలు చేయుటకు అప్పగించుకొనుట దాస్యమను కాడి క్రిందికి వెళ్ళుటయే. కనుక సున్నతి అనునటువంటి క్రియల వైపునకు మరలక ఒకనినొకరు ప్రేమించుకొనుచు ఒకరినొకరు గాయపరచుకొన కుండవలెనని చెప్పుచున్నాడు.

**ఆత్మానుసారమైన నడకలో శరీరేచ్ఛలు నెరవేర్చకుండుట (16-21వ.)** : 16-17వ శరీరము ఆత్మకు విరోధముగాను, ఆత్మ శరీరమునకు విరోధముగాను కోరును. కనుక ఆత్మ చేయ నిశ్చయించు వాటిని మనము చేయలేకపోవుచున్నాము. పౌలు రోమా 7:17-25వ. తన స్వంత అనుభవమును చెప్పుచు 19వ వచనములు "చేయగోరు మేలు చేయక చేయగోరని కీడును చేయుచున్నాను" అన్నాడు. 18వ. ఆత్మాను సారమైన నడక

నడచువారు ధర్మశాస్త్ర క్రియలకులోను కానవసరము లేదని చెప్పుచున్నాడు. 19-21వ. శరీర క్రియలను గూర్చి వివరించుచున్నాడు.

**ఆత్మాను సారమైన నడక ఫలములో కూడినది (22-26వ)** : 22-24వ. ఆత్మాను సారమైన నడకలో ఆత్మ ఫలములోనున్న 9 గుణములు కనిపించును. 1. ప్రేమ. 2. సంతోషము, 3. సమాధానము, 4. దీర్ఘశాంతము, 5. దయాళుత్వము, 6. మంచి తనము, 7. విశ్వాసము, 8. సాత్వికము, 9. ఆశా నిగ్రహము.

వీటికి విరోధమైన గుణములు మనలో నుండకూడదు. క్రీస్తు యేసు సంబంధులు అనగా ఆత్మీయ నడక నడుచువారు. శరీరమును దాని ఇచ్ఛలను సిలువ వేసియున్నారు. 25-26వ. ఆత్మననుసరించి క్రమమైన జీవితము జీవించుచు ఒకరితో నొకరు వాదించక, అసూయ కలిగియుండక, వృథాగా అతిశయపడక యుండవలెనని చెప్పుచున్నాడు.

## 6వ అధ్యాయము 5+5+6+2=18 వచనములు
## అంశము : ఆత్మానుసారమైన నడకలోని పరిచర్య

**తప్పితములో చిక్కుకొనిన వానిని ఆత్మానుసారమైన నడకలోనికి నడిపించుట (1-5వ.):** ఆత్మీయులు తప్పితములు చేయగలరు. (1 యోహాను 1:10వ.) ఆలాటి వారిని గూర్చి ప్రచారము చేయక మనమును శోధింపబడుదుమని గుర్తించుకొనాలి. జాగ్రత్తగా పరీక్షించు కొనిన పిదప శోధనలోలేమని నిశ్చయించుకొని సాత్వీకమైన మంచి మనసును కలిగిన వారమై అట్టి వారిని మంచి దారికి తీసుకొని రావాలి. మత్తయి 18:15లో క్రమపరచు విధమున్నది. నీ సహోదరుడు నీ యెడల తప్పిదము చేసిన యెడల నీవు పోయి నీవును, అతడును ఒంటరిగానున్నపుడు అతనిని గద్దించాలి. అతడు నీ మాట వినిన యెడల నీవతని సంపాదించుకొంటివి. అతడు వినని యెడల ఒకరిద్దరిని వెంటబెట్టుకొని అతని యొద్దకు వెళ్ళుము. ఇద్దరు ముగ్గురు సాక్షుల నోట ప్రతి మాట స్థిరపరచబడాలి. అతడు వారి మాట వినని యెడల సంఘమునకు తెలియ చెప్పుము. అతడు సంఘపు మాట వినని యెడల అతని అన్యుడుగా ఎంచుము. గలతీ. 6:1లో అతనిని మంచి దారికి తీసుకొని రావాలి అనుటలో అన్ని విధముల ప్రయత్నములు జరుగాలి. కొరింథీయులు తప్పిదము చేసిన వానిని 1 కొరింథీ. 5:4వ ప్రకారము క్రమశిక్షణ క్రింద ఉంచిరి. ఆ తరువాత ఆ వ్యక్తిని చేర్చుకొనుటలో శ్రద్ధ చూపలేదని 2 కొరింథీ 2:11వలో చూడగలము. మనము ఆలాగుండకూడదు. ఎవడైనను వట్టివాడైయుండి ఎన్నికైనవాడుగా ఎంచుకొన

కూడదు. ప్రతివాడు తాను చేయు పనిని పరీక్షించుకొనాలి. అప్పుడు ఇతరులను బట్టి కాక తనను బట్టియే అతనికి అతిశయము కలుగును.

**ఆత్మానుసారమైన నడకలో అందరికి అలయక మేలు చేయుట (6-10వ.)** : వాక్యోపదేశము చేయువానికి వాక్యోపదేశము పొందువారు అన్ని పంచి పదార్థములలో భాగము ఇవ్వాలి. సమయము దొరికిన కొలది అందరికి మేలు చేయాలి. మరి ముఖ్యముగా విశ్వాస గృహమునకు చెందిన వారికి మేలు చేయాలి. మేలు చేయువారు ప్రభువు నుండి పంటకోయుదుము. 7వ వచనములో మనుష్యుడు ఏమివిత్తునో ఆ పంటనే కోయునని చెప్పబడినది.

**ఆత్మానుసారమైన నడక క్రీస్తు సిలువయందే గురి కలిగి అతిశయించుట (11-16వ.)**: సున్నతి సమస్య ఆ దినములలో పెద్దదిగానుండెను. సున్నతి గలవారు శరీర విషయము లందు అతిశయింతురని అయినను వారు ధర్మ శాస్త్రమును నెరవేర్చరని చెప్పుచున్నాడు. విశ్వాసి లోకమునకు లోకము తనకు సిలువ వేయబడినట్లు ఉండాలి. అందువలన సిలువయందు తప్ప, మరిదేనియందును అతిశయించరాదని చెప్పుచున్నాడు. క్రీస్తు యేసు నందుండి నూతన సృష్టిగా చేయబడుటయే తప్ప శరీర సంబంధమైన సున్నతివంటి ఏ కార్యము ద్వారా ఏమియు కలుగదు.

**ముగింపు (17-18వ.)** : క్రీస్తుతో కూడ పౌలు లోకమునకు సిలువ వేయబడినందున తన శరీరములో క్రీస్తు ముద్రలు ధరించితినని చెప్పుచున్నాడు. ఆశీర్వాదముతో పత్రిక ముగించుచున్నాడు.

# ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక

గ్రంథకర్త : **పౌలు** . **కాలము** : క్రీ.శ. 61 (3:1) **స్థలము** : రోములోని మొదటి చెర 3:1. **కొనిపోయినవారు** : తుకికు 6:21-22అ.

**ముఖ్య ఉద్దేశము** : క్రీస్తునందున్న విశ్వాసి.

**ఎఫెసు పట్టణము** : ఎఫెసు చిన్న ఆసియాలోనున్న పట్టణములన్నింటికి కేంద్రమైన పెద్ద పట్టణము. చిన్న ఆసియా దేశానికి ముఖ్య పట్టణము ఆసియాలోని నలుదిశల నుండి హతసాక్షులను తెచ్చుటచే, దీనిని హతసాక్షుల రహదారియనిరి. ఆసియా సముద్ర తీరమంతటిలో 220 పట్టణములు కలవు. అందులో అనేక ఓడరేవులు కలవు. ఎఫెసు నందలి ఓడరేవు అన్నిటికంటే పెద్దది. ఇది స్వపరిపాలన గల స్వతంత్ర పట్టణము. ఎఫెసు నందు అర్తెమిదేవి లేక డయానా దేవాలయముండుట చేత మిక్కిలి ప్రఖ్యాతి గాంచినది. ఈ దేవాలయము ప్రపంచములోని ఏడు వింతలలో ఒకటి. అ.కా. 19లో ఈ దేవతారాధన వర్ణింపబడినది. ఈ గుడి నిర్మించుటకు 220 సం॥ పట్టెనని చెప్పుదురు. ఈ దేవాలయము మాత్రమే కాదు, నేరములకు వ్యభిచారమునకు అవినీతికి కేంద్రము. దేవదాసిలెందరో కలరు.

ఆ దినములలో ఎఫెసునందు 2 లక్షల మంది జనులు నివసించుచుండిరి.

ఆ పట్టణములో యూదులు కొందరుండిరి. సమాజ మందిరము కూడ ఉండెను. అ.కా. 18:19, 19:8, 13-17. క్రమేణ దాని ప్రభావమంతయు తగ్గిపోయెను. ఇప్పుడు అక్కడ ఒక కుగ్రామము మహమ్మదీయుల పాలన క్రింద కలదు. దానికి అయసలక్ అని పేరు.

**ఎఫెసు సంఘస్థాపన** : పౌలు ఎఫెసు పట్టణములో సంఘం స్థాపించిన సంగతి అ.కా. 18:19లో వ్రాయబడినది. ఆ మొదటి పని కొంచెముగానే ఉండెను. 18:24 చొప్పున పౌలు వెళ్ళిన తరువాత అపొల్లో అను విద్వాంసుడు ఎఫెసుకు వచ్చి కొంత సేవ చేసినట్లు తెలియుచున్నది. అయన సేవ పూర్ణమైనది కాదు. ఎందుకనగా యోహాను బాప్తిస్మము మాత్రమే ఎరిగినవాడైయుండెను. అ.కా. 18:25. అయినను కొంతపని జరిగెను. గనుక పౌలు అ.కా. 19:1-7లో వ్రాసినట్లు రెండవసారి ఎఫెసు పట్టణము దర్శించు సరికి పన్నెండుగురు యోహాను బాప్తిస్మము పొందినవారుయుండిరి. అప్పటికి క్రొత్త నిబంధన లేదు. గనుక పౌలు క్రీస్తు చనిపోయి లేచి ఆరోహణుడై పరిశుద్ధాత్మను పంపెనని

అట్టి క్రీస్తునందు విశ్వాసముంచవలెనని తేటగా బోధించినపుడు ఆ పన్నెండుగురు నమ్మి సరిగా క్రీస్తు శిష్యులై ఆత్మచేత ముద్రించబడి సంఘముగా చేర్చబడిరి. వారితో ఎఫెసు సంఘము విస్తరించ నారంభమాయెను.

ఎఫెసు వారు మునుపు చాలా విగ్రహారాధికులు. వారి దేవత పేరు ఆర్తెమిదేవి (అ.కా. 19:28) ఆమె ఆకాశమునందున్న JUPITER ద్యుపతి యొద్ద నుండి క్రిందపడి వారి దేవత అయెనని వారి నమ్మకము అ.కా.19:35. పౌలు ఎఫెసులో రెండేండ్ల వరకు తురన్ను అను ఒకని పాఠశాలలో లేఖనములను బోధించి ప్రతిరోజును నమ్మినవారిని స్థిరపరచుచు ఎఫెసు సంఘమును దివ్యముగా స్థాపించెను. 19:8-13. సాతాను రేగినను ఆ పని ముందుకు సాగి గొప్ప మర్మములలో కూడిన పత్రికను ఎఫెసీయులకు వ్రాయుట జరిగెను. ఆత్మ బలముతో పౌలు పని చేసి పాతాళ లోకమును కదిలించెను. అందును బట్టియే దయ్యము పౌలు నెరుగుదునని చెప్పగలిగెను. 19:15. ఈ దినములతో సహా ఇట్లు పూనుకొనినవారు నిలువబడి పోరాడితే మంచి గట్టియైన సంఘములు క్రీస్తు పేరట దేశమందేర్పడును సందేహము లేదు. తొలిగా నమ్మినవారిలో తప్పు చేష్టలుండినను పరిశుద్ధాత్మ బలముగా క్రియచేస్తే వారు తిప్పబడి తప్పు చేష్టలను తెలియజేసి యొప్పుకొని విడిచిపెట్టిరి. ఆ చేష్ట కాధారమైన చెడు పుస్తకములను కూడ కాల్చివేసిరి. 19:14-20. వాటివెల 50 వేల వెండి రూకలాయెను. పౌలు ఇంటింటను బహిరంగముగాను సాక్ష్యమిచ్చుచు దేవుని యెదుట మారుమనస్సు పొంది ప్రభువైన యేసుక్రీస్తునందు విశ్వాసముంచవలెనని ప్రకటించెను. 3 సం॥లు క్రీ.శ.54,55,56 ఎఫెసులో నుండి రాత్రింబగళ్ళు ప్రతి మనుష్యునికి మానక బుద్ధి చెప్పెను. అ.కా. 19:10లోనున్నట్లు ఆసియా దేశములోని వారందరు దేవుని వాక్యమును వినిరి. అ.కా. 19:26లోనున్నట్లు ఆసియా దేశవాసులు అనేకులు ప్రభువు వైపు తిరిగిరి. అ.కా. 20:17-38. ఎవరి సొమ్ము ఆశించక చేతులతో పని చేసి కష్టపడి జీవనము చేయుచు సువార్త ప్రకటించెను. ఆయన సేవా విధానము ఆశ్చర్యకరమైనది, మాదిరికరమైనది. 1 కొరి. 15:32లో నేను ఎఫెసులో మృగములతో పోరాడితిని అంటున్నాడు. ఆలాగు మృగములాంటి మనుష్యులతో ఎఫెసులో పోరాడి అనేకులను ప్రభువువైపు త్రిప్పెను. అ.కా. 19:26. పౌలు కాలములో 12 వేల మంది శిష్యులు ఎఫెసీ పరిసర ప్రాంతములోయున్నారని చరిత్ర చెప్పుచున్నది. క్రీ.శ. 63 నుండి తిమోతి ఆ సంఘమందుండి సేవ చేసెను. యోహాను చివరి దినములు ఎఫెసులో గడిపెను. అక్కడ నుండియే యోహాను సువార్తను, మూడు పత్రికలను,

ప్రకటన గ్రంథమును వ్రాసెను. కాని మొదటి శతాబ్ద ముగింపులో ప్రేమను వదిలిన సంఘమని ప్రకటనలో చూచుచున్నాము. చల్లారిన స్థితికి వచ్చినది. ఇప్పుడు అక్కడ సంఘము లేదు.

ఎఫెసీ పత్రికలోనున్న 155వ వచనములలో 80వ వచనములు అనగా సగముకంటే ఎక్కువ వచనములు కొలొస్సయి పత్రికలో కనుపించును. అందువలన ఎఫెసీ, కొలొస్సయి పత్రికలను సమాంతర పత్రికలుగా ఎంచుదురు. ఎఫెసీలో సంఘము క్రీస్తు శరీరము ముఖ్య అంశము ఫిలిప్పీలో సంఘ నడక ముఖ్య అంశము. కొలొస్సయిలో సంఘమునకు శిరసుగానున్న క్రీస్తు ముఖ్య అంశము.

## అధ్యాయాల విభజన

**1-3వ అధ్యాయములు** : విశ్వాసిని గూర్చిన బోధ - సంఘము యొక్క పోలికలు.

**1వ అధ్యాయము** : విశ్వాసిని గూర్చిన దేవుని ప్రణాళిక - సంఘము శరీరము.

**2వ అధ్యాయము** : విశ్వాసి యొక్క జీవిత పరిస్థితి - సంఘము ఆలయము.

**3వ అధ్యాయము** : విశ్వాసుల సంఘమును గూర్చిన ప్రత్యక్షత - సంఘము మర్మము.

**4-6వ అధ్యాయములు** : విశ్వాసి నడక.

**4వ అధ్యాయము** : విశ్వాసులు శరీర అవయవములుగా ఐక్యత కలిగి ఒకరితోనొకరు నడుచుకొనుట; సంఘము - మానవుడు.

**5వ అధ్యాయము** : విశ్వాసులు దేవుని పోలి నడుచుకొనుట, పెండ్లికుమార్తెవలె భర్తయైన క్రీస్తుకు లోబడి నడుచుకొనుట; సంఘము - పెండ్లి కుమార్తె.

**6వ అధ్యాయము** : విశ్వాసులు రాణువ వానివలె అపవాదితో పోరాటములో నడుచు కొనుట (విశ్వాసుల పోరాటము); సంఘము - సైనికుడు.

## 1వ అధ్యాయము 6+6+2+5+4=23 వచనములు
## అంశము : విశ్వాసిని గూర్చిన ప్రణాళిక

**తండ్రియైన దేవుని నిర్ణయము (ప్రణాళిక) (1-6వ.)** : 1-2వ. శుభములు. కృప అన్యుల యొక్క వందన వచనము సమాధానము, యూదులు వందనములు తెలుపు

విధము. 4-6 వచనాలలో నిర్ణయము, ఏర్పాటు అను పదములు కలవు. 8-9 వచనాలలో ఏర్పాటు 10వ వచనములో నిర్ణయము. 11-12 వచనాలలో నిర్ణయము, ఏర్పాటు అను పదములు మొత్తము 6 పర్యాయములు కలవు. కనుక మానవుల పట్ల దేవుని నిర్ణయము లేదా ప్రణాళిక ప్రాముఖ్యమైన అంశమని చూడగలము. 3-6వ. తండ్రియైన దేవుడు తన ఇష్టప్రకారము మనలను తనకు కుమారులనుగా చేసుకొనవలెనని జగత్తుకు పునాది వేయక మునుపే నిర్ణయించాడు. 2. మనము తన ఎదుట పరిశుద్ధులుగాను. నిర్దోషులుగాను ఉండవలెనని నిర్ణయించాడు. 3. పరలోక విషయములో ఆత్మ సంబంధ మైన ప్రతి ఆశీర్వాదము మనకు అనుగ్రహించాడు. 4. తన కృపద్వారా మనలను రక్షించాడు. మానవులకు తన మహిమను క్రీస్తు ద్వారా యిచ్చాడు. ఈ కృపా మహిమకు కీర్తి కలుగవలెనని పై ప్రణాళికను సిద్ధపరచాడు. క్రీస్తును విశ్వసించిన వారు రాబోయే దినములలో దీనిని నెరవేర్చాలి.

**కుమారుడైన దేవుని నెరవేర్పు (7-12వ.)** : దేవుని కృపా మహదైశ్వర్యమును బట్టి ప్రియుడైన క్రీస్తు యేసు 2,000 ఏండ్ల క్రితము తన పవిత్ర రక్తమును కార్చు ఏర్పాటు జరిగినది. ఆ రక్తము ద్వారా మన పాపములకు అపరాధములకు క్షమాపణ. పాప శిక్ష నుండి విడుదల లభించాయి. 8-9వ కాలము పరిపూర్ణమైనపుడు తన ఏర్పాటును అనగా విమోచన ప్రణాళికను మనకు తెలియచేశాడు. తన కృపను మనపట్ల విస్తరింప చేసాడు. 10వ. ప్రస్తుతము భూమిపై కుటుంబములో కాని సమాజములో కాని సంఘములో కాని ఏకత్వము లేదు. అంతటా భిన్నత్వమే ఉన్నది. పరలోకములోనున్న రమ్యత భూలోకములో కూడా కలిగించి పరలోకమందున్నవి భూలోకమందున్నవి సమస్తమును క్రీస్తునందు ఏకముగా సమకూర్చవలెనని తనలో తాను నిర్ణయించుకొన్నాడు. దీని నెరవేర్పునే 4,5,6 అధ్యాయములో కలుగ నేర్పరచెను. 11-12వ. క్రీస్తునందు మనకొక స్వాస్థ్యము ఏర్పరచబడినది. దేవుని చిత్త ప్రకారము చేయబడిన ప్రణాళిక ద్వారా క్రీస్తు యేసు సమస్త కార్యములు జరిగించుచున్నాడు.

**పరిశుద్ధాత్మ దేవుని నెరవేర్పు (13-14వ.)** : 13వ పరిశుద్ధాత్మ దేవుడు మనకు సువార్తను వినిపింప చేసి క్రీస్తు జరిగించిన రక్షణ కార్యమునందు విశ్వాసముంచుటకు మనలను నడిపించుటలో సహాయము చేసి ఆ రక్షణ కార్యము మనలో ముగించినందుకు గురుతుగా పరిశుద్ధాత్మ దేవుడు ఆత్మచేత ముద్రించాడు. 14వ. దేవుడు మనలను తనకు సొత్తుగా చేసికొనినందుకు సంచకరువుగా తన ఆత్మనిచ్చాడు ఎఫెసీ 4:30. ప్రకారము. ఈ ఆత్మ ముద్ర విమోచన దినము వరకు ఉండును.

**దేవుని పిలుపును పిలుపు యొక్క నిరీక్షణను తెలుసుకొను పౌలు మనసును దేవుడు అనుగ్రహించునట్లు పౌలు ప్రార్థన (15-19వ.)** : 15-16వ. ఎఫెసీయులు కలిగిన విశ్వాసము ప్రేమను బట్టి పౌలు దేవునికి స్తుతి చెల్లించుచున్నాడు. 17-19వ ఎఫెసీయులు ఈ క్రింది విషయములను తెలుసుకొనుటయందు ప్రత్యక్షత గల మనస్సును దేవుడు అనుగ్రహించునట్లు ప్రార్థన, విజ్ఞాపన చేయుచున్నాడు.

1. పిలువబడిన పిలుపు యొక్క నిరీక్షణ. (పిలుపు వివరములు అ.కార్యములు 12వ అధ్యాయము చివరలో చూడండి)

2. పరిశుద్ధులలో ఆయన యిచ్చిన స్వాస్థ్యమైన రక్షణ, పరలోకములో కలిగియుండ బోవు మహిమ ఎంత గొప్పదో ఎరుగుట.

3. క్రీస్తునందు వినియోగపరచిన బలాతిశయమును బట్టి విశ్వసించు వారియందు ఆయన చూపు శక్తియొక్క అపరిమితమైన మహత్త్వము.

4. మహిమా స్వరూపుడగు తండ్రిని ఎరుగుట.

**తండ్రియైన దేవుడు క్రీస్తును హెచ్చించిన వివరము (20-23వ.) :**

1. దేవుడు తన బలము చేత క్రీస్తును మృతులలో నుండి లేపాడు.

2. సమస్తమైన ఆధిపత్యముకంటే హెచ్చించాడు.

3. సమస్తమైన అధికారము కంటే హెచ్చించాడు.

4. సమస్తమైన శక్తికంటే అధికముగా హెచ్చించాడు.

5. సమస్తమైన ప్రభుత్వముకంటే అధికముగా హెచ్చించాడు.

6. ఈ యుగమందే కాక రాబోవు యుగమునందును పేరు పొందిన ప్రతినామము కంటే ఎంతో హెచ్చుగా హెచ్చించాడు.

7. పరలోకములో తండ్రి కుడి పార్శ్వమున కూర్చుండబెట్టాడు.

8. సమస్తమును ఆయన పాదముల క్రింద పెట్టాడు.

9. క్రీస్తును సంఘమునకు శిరస్సుగా చేశాడు.

## 2వ అధ్యాయము 3+4+3+2+6+4=22 వచనములు

### అంశము : విశ్వాసి యొక్క జీవిత ప్రవర్తన - పరిస్థితి

1-10వ. విశ్వాసి ప్రవర్తన. 11-22వ. విశ్వాసి యొక్క పరిస్థితి :

**మునుపటి ప్రవర్తన (1-3వ.)** : 1వ. రక్షింపబడక మునుపు అపరాధముల చేత, పాపములచేత చచ్చినవారు 2వ. పాపములు, అపరాధములు చేయుచు వాయు మండల సంబంధమైన అధిపతియగు సాతానును అనుసరించి **మునుపు** నడుచుకొనిన వారు. ఈ ప్రపంచ దర్మమును అనుసరించి మునుపు నడుచుకొనినవారు. 3వ. శరీరము యొక్కయు మనసు యొక్కయు కోరికలను నెరవేర్చుకొనిన వారు. శరీరాశలను **అనుసరించి** మునుపు ప్రవర్తించినవారు. దైవోగ్రతకు పాత్రులైనవారు.

**ప్రస్తుత ప్రవర్తన (4-7వ.)** : 4-5వ. కరుణా సంపన్నుడైన దేవుడు మన యెడల మహా ప్రేమను కనపరచి క్రీస్తుతో కూడా మనలను బ్రతికించాడు. జీవితములో మార్పు నిచ్చి, కృపచేత పాప శిక్షయైన నరకము నుండి రక్షించాడు. 6-7వ. తన కృపా మహదైశ్వర్యమును కనుపరచు నిమిత్తము క్రీస్తు యేసుతో మనలను లేపి మహిమగల పరలోకములో ఆయనతో కూర్చుండబెట్టాడు.

1) ఎఫెసీ. 2:8లో రక్షించబడితిమి, 2) రక్షింపబడుచున్నాము. 1 కొరిం. 1:18. రక్షణ కొనసాగించుకొనుట. ఫిలిప్పీ 2:12. 3) రక్షింపబడుదుము యూదా 3వ. రక్షణలోని మూడు కాలములను గమనించగలరు.

**ఇక మీదటి ప్రవర్తన 8-10వ.)** : రక్షణ ఉచితముగా దేవుని కృప వలన కలిగినందున, ఎవరు దాని విషయమై అతిశయింపక దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్ క్రియలు చేయవలసిన వారుగానున్నారు. 6వ వచనములో చెప్పబడినట్లు పరిశుద్ధముగా ఉండ వలసినందున పరిశుద్ధమైన క్రియలు అనగా సత్‌క్రియలు చేయవలసినవారు.

**విశ్వాసి యొక్క పరిస్థితి (11-22వ)** :

**మునుపటి పరిస్థితి (11-12వ.)** : 1) శరీర విషయము అన్యులు, 2) చేతులతో చేయబడిన సున్నతి లేనివారని అనబడినవారు, 3) ఇశ్రాయేలుతో సహపౌరులు కారు, 4) పరదేశులు, 5) వాగ్దాన నిబంధన లేని పరజనులు, 6) నిరీక్షణలేనివారు, 7) లోక మందు దేవుడు లేనివారు, 8) క్రీస్తుకు దూరస్థులు.

**ఇప్పటి పరిస్థితి (13-18వ.)** : 1) క్రీస్తు యేసునందు, క్రీస్తు రక్తమువలన సమీపస్థులు, 2) యూదులు, అన్యులు సిలువ వలన తమ మధ్యనున్న ద్వేషము తీసివేయబడి ఏకము చేయబడిరి, 3) వీరిద్దరు క్రీస్తునందునూ తన పురుషుడుగా చేయబడిరి, 4) దేవునితో సమాధాన పరచెను, 5) క్రీస్తు వచ్చి యూదులకు అన్యులకు సమాధాన సువార్త ప్రకటించెను, 6) క్రీస్తు ద్వారానే యూదులు అన్యులు అందరు దేవుని సన్నిధికి చేరగలిగిరి.

**ఇక మీదట పరిస్థితి (19-22వ.)** : 1) పరదేశులు, పరజనులు ఏ మాత్రము కారు, 2) పరిశుద్ధులతో ఏక పట్టణస్థులు, 3) దేవుని ఇంటివారుగానుందురు, 4) క్రీస్తను పునాది రాయిపై చక్కని కట్టడముగా అమర్చబడుచున్నారు. 5) ప్రభువునందు పరిశుద్ధ దేవాలయముగా వృద్ధి పొందుచున్నారు, 6) దేవుని నివాస స్థలముగా కట్టబడుచున్నారు.

## 3వ అధ్యాయము 6+7+8=21 వచనములు
## అంశము : విశ్వాసులను గూర్చిన సంఘ మర్మ ప్రత్యక్షత

**సంఘ మర్మము పౌలుకు బయలు పరచబడుట (1-6వ.)** : 1-4వ. సంఘమర్మ ప్రత్యక్షత ఎఫెసీయుల కొరకు పౌలున కనుగ్రహించబడినది. దేవదర్శనము వలన అనుగ్రహించబడినది. దీనిని గూర్చి పౌలు మునుపే వారికి వ్రాసాడు. అది చదివిన యెడల సంగతులు వారికి అర్థమగునని చెప్పుచున్నాడు. (పౌలు వ్రాసిన ఆ పత్రిక మనకు లభ్యము కాలేదు). 5-6వ అపొస్తలులకు ప్రవక్తలకు ఇప్పుడు బయలు పరచ బడినట్లు పూర్వకాలపు మనుష్యులకు బయలు పరచబడలేదు. ఆ సంఘ మర్మమునందు మూడు అంశములు కలవు.

1) సువార్తవలన అన్యజనులు క్రీస్తు యేసునందు యూదులతో సమానవారసులు.

2) ఒక శరీరమందు సాటి అవయవములు.

3) వాగ్దానములలో పాలివారు. ఏ మనుష్యుడైనను, ఏమి చేసినవాడైనను, ఎక్కడ నున్నవాడైనను యథార్థముగా దేవుని వెదకిన ఎడల సత్యమును కనుగొనినవాడై పైన చెప్పిన మూడు ఆధిక్యతలు కలవాడుగానుండును.

**సంఘమర్మ ప్రకటన (7-13వ.)** : 7వ. 1) బయలు పరచబడిన మర్మమునకు దేవుడు పౌలును పరిచారకుడుగా నియమించాడు. 8-11వ. 2) క్రీస్తు యేసునందలి నిత్య సంకల్పమును పరలోకములో ప్రధానులకు, అధికారులకు సంఘము ద్వారా తెలియబడవలెనని తలంచి ప్రకటించు పనిని పౌలుకు అప్పగించాడు. 3) మానవులు శోధింప వీలులేనంతటి క్రీస్తు ఐశ్వర్యమైన పైన చెప్పబడిన ధన్యతను అందరికి తేటపరచు బాధ్యతను అనగా గృహ నిర్వాహకత్వమును పౌలుకు అప్పగించాడు. 12-13వ. 4) ఈ పరిచర్యలో పౌలు శ్రమలను అనుభవించుచూ ఎఫెసీయులు అధైర్య పడకూడదని చెప్పుచున్నాడు.

**సంఘ సంపూర్ణత కొరకు పౌలు ప్రార్థన (14-21వ.)** : విశ్వాసులు తగిన శక్తికలవారు కావలెనని పౌలు ప్రార్థించుచున్నాడు. పౌలు చెరసాలలో సంకెళ్ళతో బంధింపబడి

యున్నాడు. (కొలొస్స. 4:4) బంధకములోనే మోకరించి ప్రార్థించుచున్నాడు. ప్రార్థనలోని అంశములు గమనించదగినవి.

1) అంతరంగ పురుషుని యందు శక్తి కలిగియుండాలి.

2) ఆత్మ వలన బలపరచబడాలి.

3) క్రీస్తు విశ్వాసుల హృదయములలో నివసించాలి.

4) ప్రేమయందు వేరుపారి స్థిరపడాలి.

5) జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమను అనగా నాలుగు కొలతలను 1) పొడవు. 2) వెడల్పు, 3) లోతు. 4) ఎత్తు తెలిసికొనుటకు శక్తిగలవారు కావాలి.

6) దేవుని సంపూర్ణతయందు పూర్ణులు కావాలి.

7) దేవుడు తన మహిమైశ్వర్యమును బట్టి పై ధన్యతలను అనుగ్రహించాలి.

**దేవుని శక్తిగల కార్యము (20-21వ.)** : దేవుడు తన శక్తిని బట్టి అడుగు వాటన్నిటి కంటెను, ఊహించు వాటన్నిటికంటెను, అత్యధికముగా చేయగలవాడని ఆయనకు మహిమ కలుగుగాకని బోధ విషయములను ముగించుచున్నాడు.

## 4వ అధ్యాయము 6+4+6+8+8=32 వచనములు
## అంశము : విశ్వాసులు శరీర అవయవములుగా ఐక్యతను కలిగి ఒకరితో ఒకరు నడుచుకోనాలి

**పిలువబడిన పిలుపునకు తగినట్లు ఐక్యతను కాపాడుకొనుచు నడుచుకొనుట (1-6వ.)**: (శరీరమొక్కటే 4వ.) 1-3వ. పిలువబడిన పిలుపుకు తగినట్లు అనగా ఐక్యత కలిగి నడుచుకొనవలెను. సమాధానమను బంధమును కలిగియుండాలి. ఐక్యతను కాపాడు కొనుట యందు శ్రద్ధ కలిగియుండాలి. దీర్ఘశాంతముతో కూడిన సంపూర్ణ వినయము, సాత్వికమును కలిగి నడుచుకోవాలి. 4-6వ. ఐక్యతను కలిగి యుండుటకు ఏడు కారణములను తెలుపుచున్నాడు. 1) శరీరము (సంఘము) ఒక్కటే, 2)మనలను నడిపించు ఆత్మ ఒక్కడే, 3) పిలుపు యొక్క నిరీక్షణ ఒక్కటే, 4) మనలను పిలిచిన ప్రభువు ఒక్కడే, 5) మన విశ్వాసమొక్కటే, 6) మనము పొందిన బాప్తిస్మ మొక్కటే, 7) తండ్రియైన దేవుడొక్కడే.

**సంఘ అభివృద్ధి కొరకు ప్రతి విశ్వాసికి ఇవ్వబడిన వరముల వివరము (7-10వ.)** : 7-8వ. ప్రతి విశ్వాసికి సంఘక్షేమాభివృద్ధి కొరకు వరములు అనుగ్రహించబడియున్నవి.

వరము యొక్క పరిమాణము ఒక్కొక్కరికి వేరువేరుగానుండును. కీర్త. 16:10లోను, 68:18లోను ప్రభువైన యేసు ఆరోహణమైనపుడు పరదైసులో చెరలోనున్న పాత నిబంధన భక్తులను సాతాను చెరనుండి విడిపించి తనతో పాటే చెరగొని పరలోకమునకు తీసుకొని పోయెను. సంఘ అభివృద్ధి నిమిత్తము భూమిపైనున్న మనుష్యులకు ఈవులను లేదా వరములు కలిగిన వ్యక్తులను అనుగ్రహించాడు. క్రీస్తు మరణించి భూమి యొక్క క్రింది భాగములకు దిగి శత్రువులను అనగా సాతానును అతని పరివారమును జయించి ఆరోహణమగుట ద్వారా వరములను (ఈవులను ఇవ్వశక్తిగల వాడైయ్యాడు. మన కొరకు చనిపోవుట ద్వారా లేని కృపను కుమ్మరించి రక్షించుటకు, తన వరములను కుమ్మరించి అభివృద్ధిని ఇచ్చుటకు శక్తిగల వాడైయ్యాడు.

**పరిచర్య జరిగించుచూ, శరీర అవయవములవలె పరిమాణము చొప్పున పనిచేయుచు క్షేమాభివృద్ధిని కలిగించుట (11-16వ.)** : 11-12వ. విశ్వాసులందరు ఏకత్వము కలిగి దేవుని కుమారుని గూర్చిన జ్ఞానములో ఎదిగి సంపూర్ణులమై క్రీస్తుకు గల సంపూర్ణత కలవారమగుటకు పై వచనములలో చెప్పబడిన వరములు అనుగ్రహించబడినవి.

13-14వ. విశ్వాసులు సంపూర్ణులు కావాలని క్రీస్తు శరీరమైన సంఘము క్షేమాభివృద్ధి చెందుటయే దేవుని ఉద్దేశ్యము. సంఘ క్షేమాభివృద్ధికై పరిచర్య జరుగు నిమిత్తము ముందుగా కొందరిని, అపొస్తలులుగాను, కొందరిని ప్రవక్తలుగాను, తదుపరి కొందరిని సువార్తికులుగాను, కొందరిని కాపరులు (పెద్దలు)గాను ఉపదేశకులుగాను నియమించాడు. కనుక విశ్వాసులు సంపూర్ణులుగా ఎదగవలెను కాని పసిపిల్లలుగాను, గాలికి కొట్టుకొనిపోవు వారుగాను, అలలచేత ఎగురగొట్టబడు వారముగాను ఉండరాదు.

**15-16వ వచనము** : 1) ప్రేమ కలిగిన వారుగానుండాలి, 2) సత్యము చెప్పువారుగా నుండాలి, 3) క్రీస్తువలెనుండాలి. ఇదియే నిజమైన ఎదుగుదల. సంఘము శరీరమై యుండగా క్రీస్తు శిరస్సయి ఉన్నాడు. ఆయన నుండి శరీర అవయవములైన విశ్వాసులందరు చక్కగా అమర్చబడియుండాలి. శరీరములోని ప్రతి అవయవము తన తన పరిమాణము చొప్పున పని చేయగా ప్రతి కీలు వలన కలుగు బలము చేత అతుకబడి శరీరమునకు వృద్ధి కలుగుచున్నది. ఈ పోలికవలెనే సంఘము అను శరీరమునకు అవయవములైన విశ్వాసులు ప్రతి ఒక్కరు ప్రేమచేత ఒకరితో ఒకరు అతుకబడి తమకు ఇవ్వబడిన వరము (7వ.) యొక్క పరిమాణము చొప్పున పని చేయుచుండగా సంఘమునకు క్షేమాభివృద్ధి కలుగచేయాలి.

**20-24వ వచనము** : నూతన స్వభావమును ధరించుకొనుటను గూర్చిన వివరములు. 1) యేసును గూర్చి విని ఆయన సత్యము ఉన్నది ఉన్నట్లు ఉపదేశించ బడినవారు, 2) ప్రాచీన స్వభావమును అనగా మోసకరమైన దురాశలను విడిచినవారు, 3) మనసులో నూతనసత్వము పొందినవారు, 4) నీతి యథార్థమైన భక్తిగల వారు, 5) దేవుని పోలికగా సృష్టింపబడినవారు. 22వ వచనములో వదలుట 24లో ధరించుకొనుట అని వ్రాయబడినది. కొలొస్సయి 3:8-10వ వచనములలో వదలుట అనగా విసర్జించ వలసినవి ధరించుకొనవలసినవి వివరించబడినవి.

**పొరుగు వానితో నడుచుకొను విధము (25-32వ.) :**

**25వ వచనము** : అబద్ధమాడుట మానాలి - సత్యమే చెప్పాలి.

**26వ వచనము** : సూర్యుడస్తమించు వరకు కోపము నిలిచియుండకూడదు.

**27వ వచనము** : అపవాదికి చోటివ్వకూడదు.

**28వ వచనము** : దొంగిలు వాడిక మీదట దొంగిలకూడదు. కష్టించి పనిచేసి అక్కరగల వారికి పంచిపెట్టాలి.

**29వ వచనము** : దుర్భాష నోటికి రానివ్వకూడదు - క్షేమాభివృద్ధికరమైన అనుకూల వచనమే పలుకవలెను.

**30వ వచనము** : దేవుని పరిశుద్ధాత్మను దుఃఖపరచకూడదు - విమోచన దినము వరకు ముద్రించబడియున్నారు.

**31వ వచనము** : ద్వేషము, కోపము, క్రోధము, అల్లరి, దూషణ సకలమైన దుష్టత్వమును విసర్జించాలి.

## 5వ అధ్యాయము 7+7+7+6+6=33 వచనములు

## అంశము : విశ్వాసులు దేవుని పోలి నడుచుకొనుట - పెండ్లి కుమార్తెవలె భర్తయైన క్రీస్తుకు లోబడి నడుచుకొనుట

**ప్రేమ పవిత్రత కలిగి ప్రియులైన పిల్లలవలె నడుచుకొనుట (1-7వ.) :**

**1-2వ వచనము** : ప్రేమ కలిగియుండుట. క్రీస్తు మనలను ప్రేమించిన రీతిగా ఒకరినొకరు ప్రేమించుకొనుచునుండాలి. క్రీస్తు ప్రేమకు గురుతుగా తన్ను తాను దేవునికి బలిగాను అర్పణగాను అప్పగించుకొనగా ఆ బలి దేవునికి పరమళ వాసన నిచ్చినది. అటువంటి ప్రేమనే ఒకరిపట్ల నొకరు కలిగి దేవుని పోలి నడుచుకొనాలి.

**3-4వ వచనము** : పవిత్రత కలిగియుండుట. పరిశుద్ధులైన వారికి తగినట్టు లోభత్వము కాని, జారత్వము కాని మరియే విధమైన అపవిత్రత లేకుండ ఉండాలి. బూతులు, సరసోక్తులు పోకిరి మాటలు పరిశుద్ధులకు తగవు. దేహశుద్ధి (3వ) నోటిశుద్ధి (4వ.) పరిశుద్ధుల కవసరము.

**5-7వ వచనము** : వ్యభిచారము, అపవిత్రత, విగ్రహారాధన, ధనాపేక్ష కలవారు దేవుని రాజ్యమునకు వారసులు కానేరరు. వ్యర్థమైన మాటలాడువారి మీదికి దేవుని ఉగ్రత వచ్చును. పరిశుద్ధులు అట్టి వాటికి విముఖులుగానుండాలి.

**వెలుగు సంబంధులవలె నడుచుకొనుట (8-14వ.) :**

**8-10వ వచనము** : విశ్వాసముంచక మునుపు చీకటియైన వాడు (పాపములోనున్న వాడు) విశ్వసించిన తదుపరి ప్రభువునందు వెలుగు (పరిశుద్ధత)లో నడుచు వాడుగా నుండాలి. వెలుగు ఫలములైన మంచితనము, నీతి, సత్యమును కలిగి నడుచుకొనాలి. వెలుగు సంబంధులు ప్రభువుకు ప్రీతికరమైన దానిని కలిగి నడుచుకొనాలి.

**11-14వ వచనము** : అంధకార క్రియలు నిష్ఫలమైనవి వాటిని ఖండించాలి. వాటిలో నడువకూడదు. రహస్యమందు జరుగునట్టి క్రియలను గూర్చి మాటలాడరాదు. వెలుగు సమస్తమును కనుపరచును. కావున, పరిశుద్ధులు నిద్రించిన వారివలెకాక మేల్కొనిన వారివలెనుండాలి. క్రీస్తు మన మీద ప్రకాశించుచున్నందున ఆయన వెలుగులో నడుచు కొనాలి.

**ఆత్మపూర్ణులై జ్ఞానులవలె నడుచుకొనుట (15-21వ.) :**

**15-16వ వచనము** : 1) చెడ్డ దినములలో మనమున్నాము. అజ్ఞానులవలె కాక జ్ఞానులవలె సమయమును పోనియ్యక, సద్వినియోగము చేసుకొనాలి.

**17-18వ వచనము** : ప్రభువు చిత్తమెరిగి నడుచుకొనాలి. మద్యముతో మత్తులుగా నుండకూడదు. ఆత్మపూర్ణత కలిగియుండాలి.

**19-21వ వచనము** : ఒకనినొకడు హెచ్చరించుకొనాలి. హృదయములో పాటలు, కీర్తనలు, సంగీతములతో ప్రభువును స్తుతించాలి. క్రీస్తునందలి భయముతో ఒకరికొకరు లోబడియుండాలి.

పైనున్న 1-7వ. ప్రేమ కలిగి నడుచుకొనుట 1 యోహాను 4:8లోనున్నట్లు దేవుడు ప్రేమయైయున్న సంగతిని జ్ఞాపకము చేయును. రెండవభాగము 8-14వ. వెలుగులో నడుచుకొనుట 1 యోహాను 1:5లోనున్నట్లు దేవుడు వెలుగైయున్న సంగతిని జ్ఞాపకము చేయును. మూడవభాగము 15-21వ. ఆత్మపూర్ణులైయుండుడి. యోహాను 4:24లో దేవుడు ఆత్మయైయున్నాడు అను సంగతిని జ్ఞాపకము చేయును.

**దేవుడైన క్రీస్తు సంఘమును ప్రేమించి ప్రాణమిచ్చాడు (22-27వ.) :**

| భార్య - సంఘము (భార్యా - భర్తలు) | పురుషుడు - క్రీస్తు (సంఘము - క్రీస్తు) |
|---|---|
| 1. స్త్రీలు స్వపురుషులకు ప్రతి విషయము లోను లోబడియుండాలి. పురుషుడు భార్యకు శిరస్సు. (22వ., 24వ., 23వ.) | 1. సంఘము క్రీస్తుకు లోబడి ఉండాలి. క్రీస్తు సంఘమునకు శిరస్సు. క్రీస్తు సంఘమునకు రక్షకుడు. |
| 2. పురుషులు భార్యలను ప్రేమించాలి. పురుషుడు స్వంత శరీరమువలె తన భార్యను ప్రేమించాలి. భార్యను ప్రేమించువాడు తనను ప్రేమించు కొనును. (25వ., 28వ., 26-27వ.) | 2. క్రీస్తు సంఘమును ప్రేమించాడు. సంఘము పవిత్రముగానుండుటకై క్రీస్తు తన్నుతాను అప్పగించుకొనెను. |
| 3. పురుషుడు శరీరమును ద్వేషించక ప్రేమించినట్లు తన భార్యను ద్వేషించక ప్రేమించాలి, పోషించాలి, సంరక్షించాలి. (29-30వ.) | 3. క్రీస్తు కూడా సంఘమును ద్వేషించక ప్రేమించి పోషించి సంరక్షించు చున్నాడు. |
| 4. పురుషుడు తల్లిని, తండ్రిని విడిచి భార్యను హత్తుకొనును - వారిద్దరు ఏక శరీరమగుదురు. (31వ., 32వ.) | 4. సంఘము క్రీస్తునందు ఏకమై ఉండాలి. |
| 5. ప్రతి పురుషుడు తననువలె తన భార్యను ప్రేమించాలి. భార్య తన భర్త యందు భయము కలిగియుండునట్లు చూచుకొనవలెను. (33వ.) | |

## 6వ అధ్యాయము 4+5+8+3+4=24 వచనములు
## అంశము : విశ్వాసులు కుటుంబములోను, ఉద్యోగములోను, అపవాదితో పోరాటములో రాణువవానివలెను నడుచుకొనుట

**పిల్లలు, తండ్రులు కుటుంబముగా ఒకరితో ఒకరు నడుచుకొనుట (1-4వ.)** : పై భాగములో భార్య, భర్తల విషయమై మాటలాడిన పిదప వీరికి పుట్టిన పిల్లలు తండ్రి తల్లితో వ్యవహరించవలసిన విధమును తెలుపుచున్నాడు.

**1వ వచనము** : పిల్లలు ప్రభువునందు అన్ని విషయములలో (కొలొస్స. 3:20). తమ తల్లిదండ్రులకు విధేయులై ఉండాలి.

**2-3వ వచనము** : మేలు కలుగునట్లు తల్లిని, తండ్రిని సన్మానించాలి. అట్టివారు దీర్ఘాయుష్మంతులగుదురని దేవుని ఆజ్ఞ.

**4వ వచనము** : 1) పిల్లలకు కోపము రేపకూడదు, 2) ప్రభువు యొక్క శిక్షలో అనగా క్రమములో పెంచాలి, 3) ప్రభువు యొక్క బోధలో వారిని పెంచాలి.

**ఉద్యోగములో యజమానులు, పనివారలు ఒకరితో ఒకరు నడుచుకొనుట (5-9వ.)** : ఉద్యోగములో పనివారు శరీర విషయములో యజమానులకు క్రీస్తుకువలె విధేయులై, యథార్థమైన హృదయము కలిగి భయముతోను, వణుకుతోను నడుచుకొనాలి. క్రీస్తు దాసులమని యెరిగి, ప్రభువుకు చేసినట్టే, ఇష్ట పూర్వకముగా దేవుని చిత్తమును మనః పూర్వకముగాను జరిగించాలి. చేయబడిన ప్రతి సత్కార్యమునకు ప్రతి ఫలము ప్రభువు వలన పొందుదురు. 9వ. యజమానులైనవారు పరలోకపు యజమానిని గుర్తించుకొనుచు పనివారిని 1) బెదిరింపక, 2) పక్షపాతము చూపక నడుచుకొనాలి.

**విశ్వాసి రాణువవానివలె అపవాదితోను, అంధకార శక్తులతోను పోరాడుచు నడుచుకొనుట (10-17వ.)** :

**10-11వ వచనములు** : రాణువవానిగా విశ్వాసి కివ్వబడిన ఆజ్ఞ - సైనికునివలె విశ్వాసి తన కవసరమైన శక్తిని ప్రభువు యొద్ద నుండి పొంది బలవంతుడుగా నుండాలి. ప్రభువు శక్తి నుండి అపవాదిని ఎదిరించుట కవసరమైన శక్తిమంతులముగా నుండాలి. దీని కొరకు దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించాలి.

**12-13వ వచనము** : మన పోరాటము శరీరులతో కాదు, ఎన్నడైనను శరీరులతో పోరాడరాదు. ప్రధానులతోను, అధికారులతోను, అంధకారమందలి నాధులతోను, ఆకాశ మండలమందున్న దురాత్మల సమూహముతోను మనకు పోరాటమున్నది. ఈ పోరాటములో అపవాదిని వాని సమూహములను ఎదిరించుటకు దుష్టుని అగ్ని బాణములను ఆర్పుటకు దేవుడిచ్చు సర్వాంగ కవచములను ధరించుకొని శక్తి మంతులము కావాలి.

**14-17వ వచనములు** :

| క్ర.సం | అవయవములు | కవచములు |
|---|---|---|
| 1. | శిరస్సుకు | రక్షణయను శిరస్త్రాణము |
| 2. | చేతిలో | విశ్వాసమనుడాలు ద్వారాదుష్టుని అగ్ని బాణములు ఆర్పుట. |
| 3. | మరొక చేతిలో | ఆత్మ ఖడ్గముయగు దేవుని వాక్యము. |
| 4. | నడుమునకు | సత్యము |
| 5. | శరీరమునకు | నీతియను మైమరపు. |
| 6. | పాదములకు | సమాధాన సువార్తవలనైన సిద్ధ మనసు అను జోడు. |
| 7. | ఆత్మ | ప్రతి సమయమందు ప్రతి విధమైన ప్రార్థన విజ్ఞాపన. |

**18-20వ వచనము** : సమస్త పరిశుద్ధుల కొరకు ప్రార్థించాలి. సువార్త ప్రకటించు పౌలువంటి భక్తుల కొరకును పూర్ణమైన పట్టుదలతో విజ్ఞాపన చేయాలి.

**ముగింపు - ఆశీర్వాదము (21-24వ.)** : 21-22వ. ఎఫెసీయుల యొద్దకు పంపబడిన తుకికు ప్రియమైన సహోదరుడు, ప్రభువునందు నమ్మకమైన పరిచారకుడు. హృదయము లను ఓదార్చువాడు. పౌలు సంగతులు ఎఫెసీయులకు తెలుపువాడు. ఎఫెసీయుల సమాచారమును పౌలుకు తెలుపువాడు.

**23-24వ వచనములు** : ఎఫెసీయులకు దేవుని నుండి సమాధానము, విశ్వాసము, ప్రేమ, కృప కలుగునుగాకని ఆశీర్వదించి పత్రిక ముగించాడు.

# ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక

గ్రంథకర్త : పౌలు . కాలము : క్రీ.శ. 62 (2:24) స్థలము : రోములోని మొదటి చెర (1:12), కొనిపోబడినవారు: ఎపఫ్రొదితు (2:28-30), (4:18).

**ముఖ్య ఉద్దేశ్యము** : క్రీస్తే గురి.

**ఫిలిప్పీ పట్టణ చరిత్ర** : ఈ పట్టణపు మొదటి పేరు చిన్న ఊటలు అను అర్థము గల క్రినైడిస్. సమీపమందున్న పంగియన్ కొండలో బంగారు వెండి గనులు కలవని చెప్పబడినందున ప్రపంచ చక్రవర్తి అలెగ్జాండర్ గారి తండ్రి, గ్రీకురాజగు ఫిలిఫ్ క్రీ.పూ. 358లో ఈ పట్టణము పట్టుకొని తన రాజ్యములో కలుపుకొని దానికి తన పేరును బట్టి ఫిలిప్పీ అను పేరు పెట్టెను. క్రీ.పూ. 168లో రోమీయులు దాని పట్టుకొని తమ రాజ్యములో కలుపుకొనిరి. క్రీ.పూ. 42లో "బాటిల్ ఆఫ్ ఫిలిప్పీ" యుద్ధమందు రోమీయులు మరల జయము పొంది తమ సైన్యమును కూడ అక్కడనుంచిరి. తూర్పు నుండి పడమటి దేశములకు వెళ్ళు వ్యాపారస్తులు ఈ ఓడరేవు నందు విశ్రాంతి తీసికొందురు. కనుక ఇది ఒక ముఖ్య పట్టణముగా నుండెను. తదుపరి మాసిదోనియా దేశము నాలుగు భాగములుగా నుండగా ఒక భాగమునకు ఫిలిప్పీ ముఖ్య పట్టణము, మరొక భాగమునకు థెస్సలోనీక ముఖ్య పట్టణముగా నుండెను. ఫిలిప్పీని "ఎసిటీ ఆఫ్ గోల్డ్‌మైన్స్" అనిరి. అక్కడ ఉన్న బంగారు గనుల కంటే, బంగారము వంటి సంఘమున్నదని గమనించగలము.

**సంఘస్థాపన** : అ.కా. 16:9లో మాసిదోనియా దేశస్థుని ఆహ్వానము మేరకు పౌలు సహచరులతో కలసి రెండవ యాత్రలో మొదటిదిగా ఐరోపా ఖండములో ప్రవేశించి ఫిలిప్పీలో సువార్త ప్రకటింపగా లూదియా, ఆమె ఇంటివారు, పుతోను అను దయ్యము పట్టిన బాలిక, చెరసాలలోని వారు రక్షింపబడిరి. అ.కా. 16:11-35. పౌలు ముందుకు సాగివెళ్ళగా లూకా అక్కడనే ఏడేండ్లుండి వారిని బలపరచెను. (అ.కా. 20:1-2). సంఘ మందు ఎక్కువగా అన్యులుండిరి. స్త్రీలు ఆసక్తిగా నుండి సేవలో ముందుకు సాగిరి కాని వారిలో ఏకత్వము లేకుండెను (4:2).

సంఘస్థాపన వివరములు అ.కా. 16వ అధ్యాయము కలవు. ఈ పత్రికలో సంతోషము అను పదము 8 పర్యాయములు, ఆనందము అను పదము 8 పర్యాయములు, దానికి సంబంధించిన అతిశయమను పదము 4 పర్యాయములు, మొత్తము 20 పర్యాయములు కలవు. అందువలన దీనిని ఆనంద పత్రిక అనిరి.

## అధ్యాయాల విభజన 1+1+1+1= 4 అధ్యా.

**1వ అధ్యాయము** : క్రీస్తు కొరకే బ్రతుకుట (1:21).

**2వ అధ్యాయము** : క్రీస్తు మనసును కలిగియుండుట (2:5).

**3వ అధ్యాయము** : క్రీస్తును గురిగా కలిగి మాదిరిగా యుండుట (3:14).

**4వ అధ్యాయము** : క్రీస్తును బట్టియే సమాధానము సమస్తము చేయగలుగుట (4:13).

## 1వ అధ్యాయము 11+4+11+4=30 వచనములు
## అంశము : క్రీస్తుకొరకే బ్రతుకుట (21వ.)

**పౌలు ప్రార్థించుట (1-11వ.), శుభములు (1-2వ.)** : ఫిలిప్పీ సంఘమందు 1) పరిశుద్ధులు, 2) పెద్దలు (కాపరులు లేదా అధ్యక్షులు), 3) పరిచారకులు కలరు. పౌలు తిమోతిలు తమ్మును క్రీస్తు దాసులుగా పరిచయము చేసికొన్నారు. అందరు క్రీస్తుకు బానిసలమని పౌలు వారికి జ్ఞాపకము చేయుచున్నాడు. ఇది ఒక మాదిరియైన సంఘ క్రమము.

**స్తుతి - ప్రార్థన (3-5వ.)** : క్రీ.శ. 50లో పౌలు తన రెండవ సేవాయాత్రలో ఫిలిప్పీకి వెళ్ళాడు. క్రీ.శ. 62లో ఈ పత్రిక వ్రాయుచున్నాడు. మొదటి దినము నుండి ఇది వరకు సువార్తలో ఫిలిప్పీయులు పాలివారు. అనగా 12 లేక 13 సంవత్సరములు ఫిలిప్పీయులు సువార్త ప్రకటనలో పాలివారుగానున్నారు. గతకాలములో ప్రకటించారు. ఇప్పుడును ప్రకటించుచున్నారు. సువార్త ప్రకటన ఒక మంచి క్రియ. ఈ మంచి క్రియ క్రీస్తు దినము వరకు కొనసాగునని పౌలు చెప్పుచున్నాడు. ఈ విషయము సంతోషముతో పౌలు ప్రార్థించుచూ స్తుతించుచున్నాడు. ఈ గ్రంథము చదువు నీవు సువార్త పని చేయు చున్నావా? ఎంతకాలము నుండి చేయుచున్నావు? గతకాలములో, ప్రస్తుత కాలములో, రాబోవు కాలము క్రీస్తు దినము వరకు ప్రకటింపగలవా?

**అపేక్ష (6-8వ.)** : సువార్త ప్రకటనలో మాత్రమేకాక, సువార్త పక్షమున వాదించుట యందు, దానిని స్థిరపరచుట యందు ఫిలిప్పీయులు పాలివారు. ఇటువంటి ఆత్మీయు లైన ఫిలిప్పీయుల పట్ల పౌలు ఎంతో అపేక్ష కలిగియున్నానని చెప్పుచున్నాడు.

**పౌలు ప్రార్థన (9-11వ.)** : ఫిలిప్పీయుల కొరకు పౌలు చేయు ప్రార్థనలోని ఆరు ముఖ్య అంశములు.

1) పరిశుద్ధులు శ్రేష్ఠమైన కార్యముల విషయమై వివేచించగలవారు కావాలి.

2) పరిశుద్ధులు ప్రేమ గలవారుగానుండాలి, ఆ ప్రేమ తెలివితోను సకల విధములైన అనుభవ జ్ఞానముతో కూడినదిగానుండాలి.

3) వారిని బట్టి దేవునికి స్తోత్రము, మహిమ కలగాలి.

4) పరిశుద్ధులు క్రీస్తు దినము వరకు నిష్కపటులైయుండాలి. 1 కొరింథీ. 5:8.

5) పరిశుద్ధులు క్రీస్తు దినము వరకు నీతిమంతులుగా ఉండాలి. యాకోబు 1:27.

6) పరిశుద్ధులు నీతిఫలములతో నిండుకొనినవారై యుండాలి.

**ప్రబలమైన ప్రకటన (గత కాలము) (12-15వ.)** : పౌలు ఈ పత్రిక వ్రాయునపుడు రోములోని మొదటి చెరలోనున్నాడు. క్రీ.శ. 61-62సం॥ 2:24వ.లో నేనును త్వరగా మీ యొద్దకు వత్తును అన్నందున చెరకాలము చివరలో క్రీ.శ. 62 చివర ఈ పత్రిక వ్రాసాడు. కైసరయలోని కావలిలో అ.కా. 24 అధ్యా. రెండేండ్లు (క్రీ.శ. 58-59), ఖైదీగా రోముకు ప్రయాణము క్రి.శ. 60లోను, రోములోను మొదటి చెరలో రెండేండ్లు (క్రీ.శ. 61-62) ఇప్పటికి మొత్తము ఐదు సంవత్సరములు ఖైదీగా బంధకములలోనున్నాడు. పై కాల మంతటిలో సువార్త ఎక్కువగా ప్రబలమైనదని మనకు చెప్పుట ఎంత ఆశ్చర్యముగా నున్నది. అన్ని పరిస్థితులలో సువార్త ప్రబలింప చేసిన పౌలు మనకెంతో మాదిరి.

రోమా చెరసాల రోముచక్రవర్తి గారి ప్రాంగణములోనున్నది. ఆ ప్రాంగణమును భద్రపరచు 16,000 మంది రాణువవారు ప్రేతోర్యమను సేన అని పిలువబడిరి. వారే చక్రవర్తి గారి ప్రాంగణములోనున్న చెరసాల ఖైదీలను కాయువారు. ఈ చెరసాలలో రెండు సంవత్సరములు అ.కా. 28:28 ప్రకారము పౌలు ఉండెను. (క్రీ.శ. 61-62) అనగా షుమారు 700 దినములు. క్రీస్తు నిమిత్తము పౌలు బంధకములలో నున్నాడని ప్రేతోర్యమను సేనలోని 16,000 మందికి స్పష్టమగుట ఎంత ఆశ్చర్యము. పౌలును కాయుటకు దినమునకు 12 మంది వచ్చినను మొత్తము 700 దినములలో 8,400 మంది మాత్రమే పౌలును కలిసియుందురు. కాని 1:13వ. ప్రకారము 16,000 మంది క్రీస్తు నిమిత్తము పౌలు చెరయని గుర్తించుట ఆశ్చర్యము. రెండు సంవత్సరములు బంధకములలో నుండి 16,000 మంది రాణువ వారికి క్రీస్తును పరిచయము చేయుట మనకు సవాలుగానున్నది. ఆ దినములలో 4:22వ. ప్రకారము కైసరు ఇంటిలో

పరిశుద్ధులు ఏర్పడుట ఆశ్చర్యము. (ప్రస్తుతము) **ప్రకటన విధములు (15-17వ.) :** ప్రకటించువారిలో 1) కొందరు అసూయతో ప్రకటించువారు కలరు.

2) కొందరు కలహబుద్ధితో ప్రకటించువారు కలరు.

3) కొందరు మంచి బుద్ధితో ప్రకటించువారు కలరు.

4) కొందరు పౌలుకు బంధకములతో కూడా శ్రమతోడు చేయవలెనని తలంచు చున్నారు.

5) కొందరు కక్షతో ప్రకటించుచున్నారు.

6) ప్రేమతో ప్రకటించు వారును కలరు.

**ప్రకటన పనివాడు అంగీకరించ వలసిన విధము (18-20వ.) :** ఏ విధముచేత ప్రకటింపబడినను క్రీస్తు ప్రకటింప బడుచున్నందున పౌలు సంతోషించుట గమనించదగిన విషయము. పౌలు తన బ్రతుకు మూలముగాను చావు మూలముగాను తన శరీరమందు క్రీస్తునే ఘనపరచవలెనన్న ఆశ కలవాడుగానున్నాడు.

**క్రీస్తు కొరకే బ్రతుకుట (21-26వ.) :** క్రీస్తును విశ్వసించిన వారు చనిపోయినపుడు ప్రభువు యొద్దకు వెళ్ళుదురు. అందువలన బ్రతుకు కాలమంత క్రీస్తు కొరకే బ్రతుకుదునని చెప్పుచున్నాడు. మరి ముఖ్యముగా ఫిలిప్పీయుల క్షేమము కొరకే అనగా క్రీస్తు కార్యముల కొరకే బ్రతుకుదునని చెప్పుచున్నాడు.

**పౌలు పోరాటము (27-30వ.) :** క్రీస్తు కొరకు ఆయన సువార్త వ్యాప్తికి పౌలు పోరాడుచున్నాడు. క్రీస్తునందు విశ్వాసముంచిన ఫిలిప్పీయులు కూడా అలాగే సువార్త వ్యాప్తి కొరకు పోరాడవలెనని హెచ్చరించుచున్నాడు. ప్రభువు పని జరుపుటను అపవాది ఆటంక పరచును. అపవాది మనలను శ్రమలపాలు చేయును. కనుక ప్రభువు సువార్త ప్రకటన శ్రమలు గల పోరాటముతో కూడినదైయుండును.

## 2వ అధ్యాయము 4+7+7+6+6=30 వచనములు
## అంశము : క్రీస్తు మనస్సును కలిగియుండుట

**వినయమైన మనస్సు ఏకమనసు కలిగియుండుట (1-4వ.) :** ఏకమనస్సు, ఏక ప్రేమ, ఏకభావము అను మాటలు పౌలు ప్రస్తావించుట వలన పరిశుద్ధులలో ఏకత్వము

తరచుగా లోపించగలదు. మొదటి అధ్యాయములో సువార్త ప్రకటనలో శ్రమలుండును అని 1:27-30వ. చూచితిమి. అవి సంఘమునకు వెలుపటి వారి ద్వారా కలుగునవి. ఇప్పుడు ఏకత్వము లేకపోవుట వలన సంఘము లోపలి వారి ద్వారా ఆటంకములు కలుగునని చెప్పుచున్నాడు. సువార్త ప్రకటనకు వెళ్ళవలెనని ఒకరు తలంచగా ఏకమనసు లేని ఇతరుల ద్వారా వద్దని, ఇప్పుడు అక్కరలేదని అపవాది చెప్పించగలడు. కాని సహోదరుల మధ్య వినయమైన మనసు విధేయత కలిగియుండుట ద్వారా అపవాది కలిగించు ఈ ఆటంకమును మనము జయించగలము. ఏకమనసును కలిగి ప్రభువు కార్యములలో ఏకీభవించగలము. ఏక మనసు వినయమైన మనసు (తగ్గింపు) విధేయత ఒకదానితో ఒకటి కలసి యుండును. వినయమైన మనసులో విధేయత, ఏకత్వముండును.

**క్రీస్తు యేసు యొక్క విధేయత, తగ్గింపు (5-11వ.)** : మనము విధేయతను, తగ్గింపును కలిగియుండుటకు క్రీస్తును మాదిరిగా నుంచుచున్నాడు. క్రీస్తు ఏడుమెట్లు తగ్గించు కొన్నట్లు గమనించగలము. ఏడు సంపూర్ణ సంఖ్య. క్రీస్తు సంపూర్తిగా తన్నుతాను తగ్గించు కొన్నాడు.

**ఏడు మెట్లు తగ్గించుకొనిన క్రీస్తు :**

1) దేవుని స్వరూపము కలవాడు కాని యెషయా 52:14వ. ప్రకారము నరరూపము కంటె వికార రూపము కలవాడైనాడు.

2) దేవునితో సమానముగానుండు భాగ్యమును విడిచిపెట్టెను.

3) మనుష్యుల పోలికగా పుట్టాడు. దేవుని సృష్టియైన దూతలకంటే తక్కువవాడుగా చేయబడెను. (హెబ్రీ. 2:9వ.)

4) దాసుని స్వరూపము ధరించుకొన్నాడు. ఏమి లేని నిరుపేదయైన మరియమ్మ కుటుంబములో జన్మించాడు. బానిసలాగా జీవించాడు.

5) రిక్తుడైనాడు. ఇశ్రాయేలీయుడైన బానిస జూబిలీ సంవత్సరమందు విడుదల నొందును. లేవీ. 25:41వ. కొన్ని విషయములలో బానిస స్వతంత్రత కలవాడు. కాని క్రీస్తు రిక్తుడు ఏమి లేనివాడైనాడు.

6) మరణము పొందునంతగా తగ్గించుకొన్నాడు. ఈ లోకములో అందరు బ్రతక వలెనని తలంచుదురు. ఎవరు మరణించుట కిష్టపడరు. యోహాను 10:17-18వ ప్రకారము ఈయన తనంతట తానే తన ప్రాణము పెట్టెను.

7) సిలువ మరణము పొందాడు. మరణములో సామాన్యమైన మరణము కాక ప్రాను మీద వ్రేలాడదీయ బడినవాడు శాపగ్రస్తుడు (గలతీ. 3:13వ.) కనుక సామాన్యమైన మరణము కాక సిలువ మరణము, శాపగ్రస్తమైన మరణము పొందుట ద్వారా ఏడుమెట్లు తన్నుతాను తగ్గించుకొన్నాడు.

**ఏడు మెట్లు హెచ్చింపబడిన క్రీస్తు :**

1) భూమి క్రింద ఉన్న వారికంటే హెచ్చింపు.

2) భూమి పైనున్న వారి కంటె హెచ్చింపు.

3) పరలోకమందున్న వారికంటె హెచ్చింపు.

4) ప్రతివాని మోకాలు యేసు నామమున వంగాలి.

5) ప్రతివాని నాలుక యేసును ప్రభువని ఒప్పుకొనాలి.

6) అత్యున్నత సింహాసనము పై కూర్చుండ బెట్టబడెను. (యెషయా 6:1వ.)

7) ప్రతి నామమునకు పై నామము అనుగ్రహించబడెను.

**ఫిలిప్పీయుల విధేయత - పౌలు విధేయత (12-18వ)** : 12-16వ.లో ఫిలిప్పీయులు ఎల్లప్పుడు విధేయులని మెచ్చుకొనుచు 1) భయముతో, 2) వణుకుతోను, 3) సొంత రక్షణ కొనసాగించవలెనని, మూర్ఖులగు వక్రజనము మధ్య, 4) నిరపరాధులు, 5) నిష్కళంకులు, 6) అనింద్యులుగా నుండవలెనని, 7) సణుగులు, సంశయములు మాని ప్రభువు కార్యములు చేయుమని హెచ్చరించుచున్నాడు. ఫిలిప్పీయులలోని విశ్వాసులు జీవవాక్యమును చేత పట్టుకొని చీకటితో నిండిన లోకమునకు జ్యోతులుగా ఉన్నారని తన పనికి క్రీస్తు తీర్పు తీర్పు దినమందు ఫలము దొరుకుట ద్వారా ఆనందము కలుగునని చెప్పుచున్నాడు. ఫిలిప్పీలో ముందుగా క్రీస్తును నమ్మిన లూదియా పేరుకు దివిటీ అని అర్థము. లేడు పరి నమ్మినవారు దివిటీయగు దేవుని వాక్యమును చేత పట్టుకొని లోకమునందు దివిటీలవలె కనిపించుట మనందరికి ఎంతో మాదిరి.

**17-18వ వచనము** : పౌలైతే విశ్వాసయాగము, ప్రభువు సేవలో పానార్పణముగా పోయబడునంతగా తగ్గించుకొన్నాడు. పానార్పణము అనగా నేల మీద మన్నుపై పోయబడిన నీరును మరలా మనము సమకూర్చలేము. అనగా ప్రభువు సేవలో మనకు ఏమి మిగలకుండా సంపూర్ణముగా ఆయనకై అర్పించుకొనుట. నీరు తన ఆకారమును, సమస్తమును కోల్పోయినట్లు సమస్తము కోల్పోవుట. పౌలు వలె తన్నుతాను తగ్గించు కొనుట సేవకులకు ఎంతో మాదిరి.

**జత పనివాడైన తిమోతి విధేయత (19-24వ.)** : అందరు స్వంత కార్యములు చూచు కొనుచుండగ తిమోతికి స్వంత కార్యములు ప్రాముఖ్యము కావు. (తగ్గింపు) క్రీస్తు కార్యములే ముఖ్యము. వాటి కొరకే నిజమైన చింత. నిజమైన చింతలేకపోయినను, ఉన్నట్లు నటించువారు కలరు. తిమోతి నిజమైన చింత కలవాడు. సువార్త వ్యాపకములో పౌలుకు సేవ చేయునంతటి విధేయత గలవాడు. 24వ వచనములో శీఘ్రముగా వచ్చెదనన్నందున రోములోని మొదటి చెర (క్రీ.శ. 61-62) చివరలో ఈ గ్రంథము వ్రాయబడినదని క్రీ.శ. 62సం॥లో వ్రాయబడినదని తంచగలము.

**ఎపఫ్రొదితు విధేయత (25-30వ.)** : ప్రభువు సేవకు ఎపఫ్రొదితు చూపిన విధేయత తన విషయమై వ్రాయబడిన మాటల వలన తెలియును. 1) జతపనివాడు, 2) తోటి యోధుడు, 3) మీ దూత, 4) పౌలు అవసరములు తీర్చినవాడు, 5) ప్రభువు పనిలో రోగియైనంతగా తగ్గింపు, 6) ప్రభువు పనిలో ప్రాణము లెక్కపెట్టక చావునకు సిద్ధమైనంత తగ్గింపు (2:8లో ప్రభువుకు గల తగ్గింపు), 7) అట్టి స్థితిలోను సహోదరులను చూడవలెనన్న ఆశ గలవాడు. ఇటువంటి పనివారి అవసరత ఈ దినములలో ఎంతో ఉన్నది.

## 3వ అధ్యాయము 3+3+5+5+5=21 వచనములు
## అంశము : క్రీస్తును గురిగా కలిగి మాదిరిగానుండుట

**శరీరమును అస్పదము చేసికొనకూడదు (1-3వ.)** : యూదా మత క్రైస్తవులలో కొందరు శరీరమును ఆస్పదము చేసికొని సున్నతి విషయమై అతిశయింతురు. తద్వార ఛేదనలు, విభజనలు కలుగ గలవు. అటువంటి విషయాలలో జాగ్రత్తగానుండాలి. క్రొ.ని.లో 52 జాగ్రత్త అను పదములు కలవు. ఇక్కడ మూడు జాగ్రత్తలున్నవి. సంవత్సరము లోని 52 వారములలో ఒక్కొక్క వారమునకొక జాగ్రత్త అని గమనించాలి. (వివరములు 240 పేజీలో కలవు)

**పౌలు యొక్క గతకాల గురి (యూదా మతములో మాదిరి) (4-6వ.)** : పౌలు యూదా మతములో తాను కలిగిన ఏడు శరీర సంబంధమైన ఆధిక్యతలను చెప్పుచున్నాడు. చివరిది ధర్మశాస్త్ర సంబంధమైన నీతి విషయము అనింద్యుడు అనునది ఎంతో గొప్ప అధిక్యత. కాని తాను వాటిలో దేనిని ఎంచుకొనలేదు.

**పౌలు యొక్క ప్రస్తుత కాలగురి (క్రీస్తులో మాదిరి) (7-11వ.)**: క్రీస్తును సంపాదించిన పిదప పైన చెప్పిన ధర్మశాస్త్రమువలని నీతిని అస్పదము చేసికొనలేదు. తనకు లాభకరమైన శరీర ఆస్పదములను క్రీస్తు నిమిత్తము నష్టముగా ఎంచుకొనెను. క్రీస్తు అనుగ్రహించు

నీతికలవాడుగా ఆయనలో అగుపడు నిమిత్తము సమస్తము నష్ట పరచుకొందును. అంటున్నాడు. ఏ విధముగానైనను క్రీస్తు మరణములో సమాన అనుభవము కలిగి యుండాలి. (2:5-8వ క్రీస్తు మరణము) ఎంతో కష్టము కాని ఆశించుచున్నాడు. పునరుత్థాన బలము ఎంతో గొప్పది. చనిపోయినవాడు లేచుట, ఆరోహణమగుట ఎంతో శక్తితో కూడిన పని ఆ శక్తి ఏమిటో ఎరుగుట తన ఆశ. దాని కొరకు సమస్తమును నష్టపరచు కొందును అంటున్నాడు. నష్టమే కాక పెంటగా సమానముగా ఎంచుకొనుచున్నాడు. పెంట మన కడుపులో ఏర్పడును కాని బయటకు వచ్చిన పిమ్మట ఏ మాత్రము దానిని ప్రేమించము. ఈ లోకమును లోక సంబంధమైన, సమస్తమును, శరీర సంబంధమైన సమస్తమును పెంటగా ఎంచు కొందును అంటున్నాడు.

**7వ వచనము :** క్రీస్తు నిమిత్తము నష్టముగా ఎంచుకొంటిని (Counted) - గతకాలము.

**8వ వచనము :** నష్టముగా ఎంచుకొనుచున్నాను (Count) - ప్రస్తుతకాలము.

**10-11వ వచనము :** నష్టముగా ఎంచుకొనుచున్నాను లేదా ఎంచుకొందును (Do Count) - ఇంగ్లీషులో భవిష్యత్కాలము. పౌలు గురి యంతయు క్రీస్తే.

**పౌలు భవిష్యత్తు గురి (గురియైన క్రీస్తు యొద్దకు పరుగెత్తుట) (12-16వ.) :** 1) తాను చేసిన సేవ ఎంతో ఉన్నను గెలిచితిననియైనను, సంపూర్ణ సిద్ధి పొందితిని అనియైనను తలంచుట లేదు. ఇది మనకెంతో మాదిరి, 2) దేని నిమిత్తమును క్రీస్తు యేసు చేతపట్టబడెనో తానెరుగును. మనము ఎరుగాలి, 3) వెనుక ఉన్నవాటినన్నిటిని మరచాడు. మరుపు, సేవా జీవితములో ముఖ్యమైనది. యోసేపు గతమంతటిని మరచి తన జ్యేష్ఠ కుమారునికి మనష్షే అనగా మరచుట అను పేరు పెట్టాడు. (ఆది. 41:51వ.) తాను తండ్రి ఇంటిని సమస్త బాధను, అన్నలు కలిగించిన బాధ, పోతీఫరు అతని భార్య కలిగించిన బాధ, పానదాయకుడు కలిగించిన బాధను మరచిపోయిన తరువాతనే దేవుడా యనను హెచ్చించెను. కనుక మరచిపోవుట సేవా జీవితములో ఎంతో అవసరము. ముందున్న వాటికొరకు వేగిరపడుట అవసరము. క్రీస్తు యేసునందలి ఉన్నత పిలుపునకు బహుమానము ముందున్నదని పౌలు ఎరుగును. వాటి కొరకు వేగిరపడుచు గురియైన క్రీస్తు కొరకై పరుగెత్తుచు సమస్తము నష్టముగాను, పెంటగాను ఎంచుకొన్నాడు. సంపూర్ణులు కాగోరువారు అలాగుండాలి. మరిచిపోవువాడే సంపూర్ణుడు కాగలడు.

**గురియైన క్రీస్తును పోలి నడుచుకొనుట (17-18వ.) - గురి లేనివారిని, సిలువకు శత్రువులైన వారిని కనిపెట్టుట (17-21వ.) :** క్రీస్తును గురి కలిగి పౌలు జీవించుచున్నాడు.

పౌలు ప్రభువును పోలి నడుచుకొనుచున్నాడు. (1 కొరి. 11:1వ.) అటువంటి మాదిరియైన వారిని పోలి నడుచుకొనవలెనని హెచ్చరించుచున్నాడు. క్రీస్తు సిలువకు శత్రువులు కలరు. వారికి క్రీస్తు గురికాదు. వారి కడుపే గురిగా (దేవుడు). మన పౌరస్థితి (Citizen Ship) పరలోకమందున్నందున యేసు అను రక్షకుని రాకను గురి కలిగి జీవించాలి. ఇందులో మనము బలహీనమైన దీన శరీరము కలవారమైనను క్రీస్తు తన అపరిమితమైన శక్తిని బట్టి మన దీన శరీరములను తన మహిమ గల శరీరమునకు సమరూపము గలదానిగా మార్చును.

## 4వ అధ్యాయము 3+3+3+3+3+3+2+3=23 వచనములు

## అంశము : క్రీస్తును బట్టియే సమాధానము - సమస్తము చేయగలుగుట

**ప్రభువునందు అందరితో సమాధానము (1-3వ.)** : యువొదియ, సుంటుకేను అను స్త్రీలు రక్షించబడి పౌలుతోను ఇతర సహకారులతోను సువార్త పనిలో ప్రయాసపడిరి. కాని వారిలో ఏక మనసు లేదు. సమాధానము లేదు. అందరితో సమాధాన ముండవలెనని చెప్పుచున్నాడు. సువార్త పనిలో స్త్రీల పరిచర్య 1 కొరింథీ. 14:34వ భాగములో వివరించ బడినది.

**ప్రభువునందు తనలో సమాధానము (4-6వ, 7-9వ.)** : 4-7వ. ప్రభువు రాక సమీపమున ఉన్నందున 1) సహనము కలిగి ఉండాలి, 2) ఆనందముగానుండాలి, 3) ప్రభువుకు కృతజ్ఞత చెల్లించాలి, 4) విన్నపములకై ప్రభువును ప్రార్థించాలి. అప్పుడు దేవుని సమాధానము మనలో, మన హృదయములకు, తలంపులకు కావలి యుండును.

**8-9వ వచనము** : మన ధ్యానము, అనగా మన మనసు 1) సత్యమైన వాటిపై 2) మాన్యమైన వాటిమీద, 3) న్యాయమైనవాటిపై, 4) పవిత్రమైన వాటిపై, 5) రమ్యమైన వాటి మీద, 6) ఖ్యాతిగల వాటి మీద ఉండాలి. దేవుడు సమాధానకర్త కనుక మనకు తోడైయుండి మనలో సమాధానమును నివసింపనిచ్చును.

**ప్రభువు నందు అన్ని పరిస్థితులలో సమాధానము కలిగియుండుట (10-12వ.)** : కొదువలు కొన్ని పర్యాయములు, సమృద్ధి కొన్ని పర్యాయములు మనకుండును. పౌలువలె అన్ని పరిస్థితులలో సంతృప్తి కలిగి సమాధానముగా ఉండాలి.

1) దీనస్థితి - సంపన్న స్థితి (సమాజక అవసరములు)

2) ఆకలిగొనియుండుట - కడుపునిండియుండుట (శరీర అవసరములు)

3) లేమి - సమృద్ధి (కుటుంబ అవసరములు) శరీర, కుటుంబ, సమాజక స్థితులలో సమాధానముగా నుండాలి.

**ప్రభువునందు ఫిలిప్పీయుల ప్రీతికరమైన గతకాల యాగము (13-15వ.)** : పౌలు సువార్తను బోధించుచూ మాసిదోనియా నుండి గ్రీసు దేశమునకు కొరింధుకు వెళ్ళినపుడు ఫిలిప్పీయులు తప్ప మరెవరు పౌలు అవసరములు తీర్చలేదు. 2 కొరింథీ. 11:8వ.లో ఈ సంగతి వివరించబడినది. ఫిలిప్పీయులు, మాసిదోనియా వారు నిరుపేదలైనను దాతృత్వము బహుగ విస్తరించినదని సామర్థ్యముకంటె ఎక్కువగా ఇచ్చిరని 2 కొరింథీ. 8:1-4వ. చెప్పబడినది. (ప్రభువుకు ఇవ్వవలసిన విధము 2 కొరింథీ. 9వ అధ్యాయము చివరలో వివరించబడినది)

**ప్రభువునందు, ఫిలిప్పీయుల ప్రీతికరమైన ప్రస్తుతకాలయాగము (16-18వ.)** : ఈ పత్రిక వ్రాయునపుడు పౌలు రెండేండ్ల నుండి రోమా చెరసాలలో సంకెళ్ళలోనున్నాడు. ఫిలిప్పీయులు ఎపఫ్రొదితు వలన వస్తువులు పంపిరి. అవి ప్రభువుకు మనోహరమైన సువాసనగా, దేవునికి ప్రీతికరమైన ఇష్టమైన యాగముగానున్నవి. ఎపఫ్రొదితు పౌలు యొద్దకు వెళ్ళినందున ఈ పత్రికను ఎపఫ్రొదితు ద్వారా పౌలు ఫిలిప్పీయులకు పంపెనని తలంచగలము.

**ప్రభువునందే ప్రతి అవసరము తీర్చబడుట (19-20వ.)** : దేవుడు సకల ఐశ్వర్య మంతుడు ఐశ్వర్యమంతయు ప్రభువుదే. తన ఐశ్వర్యము చొప్పున అనగా ఎంతోయో మనము తలంచ గలము. దాని చొప్పున మన ప్రతి అవసరము తీర్చబడును.

**క్రీస్తునందు వందనములు - అశీర్వాదము (21-23వ.)** : పౌలు ప్రతి పరిశుద్ధునికి క్రీస్తునందు వందనములు చెప్పుచున్నాడు. ఇది మనకెంతో మాదిరి. ప్రభువు కొరకు పౌలు ప్రయాసపడుట ద్వారా ప్రేతోర్యమను సేనలోని 16,000 మంది క్రీస్తును తెలుసు కొనుటయే కాక (1:13వ) కైసరు చక్రవర్తి ఇంటిలోను పరిశుద్ధులు ఏర్పడిరి. (4:12వ.) ఆశీర్వాదముతో ముగించుచున్నాడు.

చివరిదిగా మొదటి అధ్యాయములో ఎవరికొరకు బ్రతకాలి? (1:21వ.) రెండవ అధ్యాయములో ఏ మనస్సుతో బ్రతకాలి? (2:5వ), మూడవ అధ్యాయములో ఏ గురితో బ్రతకాలి? (3:14వ), నాల్గవ అధ్యాయములో ఎవరియందు గురిని చేరాలి? (4:13వ) అని వివరించాడు అని గమనించగలము.

# కొలొస్సయులకు వ్రాసిన పత్రిక

గ్రంథకర్త : పౌలు . **కాలము** : క్రీ.శ. 61 (4:3) స్థలము : మొదటి చెర (4:2), **కొనిపోబడినవారు:** ఎపఫ్రా 1:7, తుకికు (4:7-9).

**ముఖ్య ఉద్దేశ్యము** : క్రీస్తు దైవత్వము.

కొలొస్సయి పట్టణ చరిత్ర : కొలొస్సయి పట్టణము చిన్న ఆసియా దేశములోని లికస్ లోయలోనున్న నది గట్టున కలదు. ఎఫెసు పట్టనమునకు నూరు మైళ్ళ దూరమున నున్నది. కొలొస్సయికి పడమర పదిమైళ్ళలో లవొదికయ పట్టణము. దానికి సమీపముననే హియెరపొలి (4:13) పట్టణము కలవు. హియెరపొలి నుండి వేడి నీరు ప్రవహించి కొలొస్సయిలో నున్న నీళ్ళతో కలసి లవొదికయ దగ్గర నులివెచ్చగా నుండును. అందుచే నులివెచ్చని అను అర్థము గల లవొదికయ అను పేరు పెట్టబడెను. కొలొస్సయి చిన్న గ్రామమై స్థానిక ఫ్రుగియనులు, గ్రీకులు, యూదులు నివసించిన పట్టణము. క్రీ.శ. 700 సం॥ నాశనమైనది. నేడు శిథిలములు మాత్రమేనున్నవి.

**కొలొస్సయి సంఘ స్థాపన** : పౌలుచే ఈ సంఘము స్థాపించబడలేదని 2:1 వలన తెలియుచున్నది. అ.కా. 18:23లో పౌలు ఫ్రుగియలో వాక్యము ప్రకటించగా ఎపఫ్రా నమ్మెనని తలంచగలము. ఈ ఎపఫ్రా రక్షణ వార్తను కొలొస్సయిలో ప్రకటించి వారిని ప్రభువు యొద్దకు నడిపెనని 1:7 వలన గ్రహించుచున్నాము. పౌలు ఈ పత్రిక వ్రాయు వరకు అక్కడికి వెళ్ళలేదు. (2:1) కొలొస్సయిలో ఏర్పడిన సంఘమందు అన్యులు అనేకు లుండిరి (1:21,27). ఆ సంఘములో జ్ఞానిస్తికులు అను తత్వవేత్తల తప్పుడు బోధలు ప్రవేశించెను. ఈ జ్ఞానిస్తికులు క్రీస్తు శరీరధారిగా రాలేదని బోధించెదరు. మానవుడైన యేసు బాప్తిస్మము పొందినపుడు క్రీస్తు అనబడు దైవత్వము యేసులో ప్రవేశించెనని, ఆయన సిలువ వేయబడక మునుపు ఆ దైవత్వము ఆయన నుండి వెళ్ళిపోయెనని బోధించెదరు. వారి బోధల సారాంశము దేవుడైన క్రీస్తు చనిపోలేదు. మానవుడైన యేసు చనిపోయెను. ఇది మొదటి తప్పుడు బోధ.

2) ఈ జ్ఞానిస్తికుల శరీరము సంపూర్ణముగా పాపముతో నిండినదని దానిని దేహ శిక్షల ద్వారా క్రమపరచవలెనని తలంతురు. ఇది రెండవ తప్పుడు బోధ. ఈ రెండు తప్పుడు బోధలను దిద్దుటకై 1) యేసు క్రీస్తు అదృశ్య దేవుడని, సర్వ పరిపూర్ణము గల వాడని మొదటి రెండు అధ్యాయములలో పౌలు నేర్పించెను, 2) ఆయనతో కూడా

పరిశుద్ధ నడక నడవవలెనని దేహశిక్షలు అక్కరలేదని మూడవ అధ్యాయములోను, పరిశుద్ధ నడక నడిచిన తోటి పనివారల నడకను నాలుగవ అధ్యాయములో చూపించెను.

**కొలొస్సయి పత్రికకు, ఎఫెసీ పత్రికకు గల సంబంధము :** 1) కొలొస్సయి పత్రిక చిన్నదై 95 వచనములు కలది. కాని ఎఫెసీ పత్రికలో 155 వచనాలు కలవు. అందులోని 80 వచనములు అనగా సగానికంటే ఎక్కువ వచనాలలోని విషయములు కొలస్సయి పత్రికలో కనిపించును. ఈ రెండు సమాంతర పత్రికలుగానున్నవి. పేతురు మొదటి పత్రికయు కొంత వరకు కొలొస్సయి పత్రికకు సమాంతర పత్రికగానున్నది. (2) ఎఫెసీలో విశ్వాసి పరమందలి దేవుని కుడిపార్శ్వమున నున్న క్రీస్తుకు శరీరముగా నుండి పరలోకములో క్రీస్తుతో కూర్చున్నవాడుగా కనిపించును. కొలొస్సయి పత్రికలో విశ్వాసి భూలోకమందుండి తనకు శిరస్సుగా యేసుక్రీస్తును పరమందు కలిగినవాడుగా ఉన్నాడు. 3) ఎఫెసీ పత్రిక యేసుక్రీస్తు నందున్న విశ్వాసిని, కొలొస్సయి పత్రిక విశ్వాసియందున్న యేసుక్రీస్తును యేసు దైవత్వమును చూపుచున్నవి.

## అధ్యాయాల విభజన 1+1+1+1 = 4 అధ్యా.

**1వ అధ్యాయము :** క్రీస్తు వ్యక్తిత్వము - అదృశ్యుడైన దేవుని స్వరూపము (15వ.)

**2వ అధ్యాయము :** క్రీస్తు దైవత్వము. శరీరమందున్న సర్వ పరిపూర్ణ దైవత్వము గల క్రీస్తు (9వ.)

**3వ అధ్యాయము :** క్రీస్తుతో పరిశుద్ధమైన నడక.

**4వ అధ్యాయము :** క్రీస్తునందలి తోటి పనివారి నడక.

## 1వ అధ్యాయము 4+4+4+3+4+4+4+2=29 వచనములు
## అంశము : క్రీస్తు వ్యక్తిత్వము - అదృశ్యుడైన దేవుని స్వరూపము

**వందనము - స్తుతి (1-4వ.) :** 1-2 వచనములలో పౌలు శుభములు తెలుపు చున్నాడు. 3-4వ వచనములలో విశ్వాస జీవితమునకు ఆధారమగు మూడు స్తంభముల వంటి 1) నిరీక్షణ, 2) విశ్వాసము, 3) ప్రేమ కొలొస్సయిలోనున్న పరిశుద్ధులు కలిగి యున్నందున వారి కొరకు ప్రార్థన చేయుచు దేవుని స్తుతించుచున్నాడు.

**పరిచయము (5-8వ.) :** సువార్త యొక్క శ్రేష్ఠమైన గుణము ఏ దేశములోనైన ఏ స్థలములోనైనా ఏ కాలములోనైన ఫలించుటయే. కొన్ని చెట్లు కొన్ని దేశములలోనే

ఫలించును. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌లో కాఫీచెట్లు, యాలుకలు, లవంగాలు, మిరియాలు, ఖర్జూరములు ఫలించవు. ఫలించు చెట్లు కూడా వాటి సీజనులోనే ఫలించును. రాళ్ళు కల దేశములో తడిపంటలగు వరి వంటివి పండవు. కాని సువార్త ఎక్కడైన ఫలించును. ఏ కాలములోనైన ఫలించును. మరియు విస్తారముగా వ్యాపించును. పౌలు ద్వారా మేలుపొందిన ఎపఫ్రా ఈ పట్టణవాసి ఎపఫ్రా పని ద్వారా అనేకులు నమ్మిరి. ఆ నమ్మకమైన క్రీస్తు పరిచారకుని ద్వారా కొలొస్సయిలో మంచి సంఘ మేర్పడినది. 2:1వ. ప్రకారము పౌలు కొలొస్సయి పత్రిక వ్రాయు వరకు అక్కడకు వెళ్ళలేదని తెలియుచున్నది.

**కొలస్సయి విశ్వాసుల ఎదుగుదలకై పౌలు - ప్రార్థన స్తుతి 9-12వ.** : 1) పౌలు కొలొస్సయి వారి కొరకు చేయు ప్రార్థనలోని అంశములను గమనించండి. 1) క్రీస్తును గూర్చిన సంపూర్ణ జ్ఞానము, 2) ఆత్మ సంబంధమైన వివేకము, 3) మన పట్ల దేవుని చిత్తమును పూర్ణముగా గ్రహించుట, 4) ప్రతి సత్కార్యము లోసఫలులగుట, 5) దేవుని గూర్చిన జ్ఞానమందు అభివృద్ధి పొందుట, 6) అన్ని విషయములలో ప్రభువును సంతోష పెట్టుట, 7) ఆయనకు తగినట్లు జీవించుట, 8) ఆనందముతో కూడిన దీర్ఘ శాంతమును ఓర్పును కనుపరచుట, 9) ఆయన మహిమ శక్తిని బట్టి సంపూర్ణ బలముతో బలపరచ బడుట. తేజోవాసులైన పరిశుద్ధుల స్వాస్థ్యములో మనలను పాలివారుగా చేసిన తండ్రికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించబడవలెనన్న అపేక్ష కలిగియున్నాడు. ప్రార్థనలోను స్తుతిలోను శరీర సంబంధమైన విషయములే లేవు. మన ప్రార్థనలో 70 శాతమైన శరీర విషయము లుండును. పౌలు ప్రార్థనలోని అంశములు వివరముగా ధ్యానించవచ్చును.

**రక్షకుడైన క్రీస్తు - దేవుడైన క్రీస్తు (13-15వ.)** : 13-14వ వచనములలో క్రీస్తు మనము 1) గతములో చేసిన పాపములకు క్షమాపణ 2) పాప బానిసత్వము నుండి విడుదల, 3) అంధకార సంబంధమైన అధికారము నుండి అనగా సాతాను నుండి విడుదలను దయచేసెను. 15వ వచనములో క్రీస్తు 1) అదృష్యుడైన దేవుని స్వరూపమని చెప్పబడినది. అనగా మనకు కనుపించని ఆత్మయైన దేవుని స్వంతరూపమే క్రీస్తు. అందుకే నన్ను చూచినవాడు తండ్రిని చూచెనని యోహాను 14:9లో చెప్పుచున్నాడు.

**సృష్టికర్తయైన క్రీస్తు (16-17) - సంఘమునకు శిరస్సయిన క్రీస్తు (18-19వ)** : 16-17వ. ఆకాశమందు భూమియందున్న సర్వము క్రీస్తునందు, క్రీస్తు ద్వారా, క్రీస్తును

బట్టి సృజింపబడెను. హెబ్రీ. 1:3వ.లో కుమారుని ద్వారా ప్రపంచములు నిర్మించబడినవి అని ఉన్నది. ఆయన ఆదియని, సంఘమునకు శిరసు అని చూచుచున్నాము.

**పాపుల కొరకు పాట్లు పడిన క్రీస్తు (20-23వ.)** : క్రీస్తు సిలువలో రక్తము కార్చి, భూలోకమునందున్న వాటిని, పరలోకమందున్న వాటిని తండ్రితో సమాధాన పరచెను. గతకాలమందు దేవునికి దూరస్థులైన మానవులను తన సన్నిధిలో పరిశుద్ధులుగా నిలువ బెట్టుకొనవలెనని రక్త మాంసములు గల దేహమును హెబ్రీ. 10:4వ ప్రకారము ధరించు కొని, మరణించాడు. ఈ మంచి వార్తలో గల క్రీస్తు అను పునాదిపై కట్టబడి తొలగిపోక స్థిరముగా నుండవలెనని హెచ్చరించుచున్నాడు.

**సంఘము కొరకు పాట్లు పడిన క్రీస్తు - పాట్లు పడిన పౌలు (24-27వ.)** : సంఘము అను ఆయన శరీరము కొరకు క్రీస్తు పాట్లుపడి కొన్నింటిని మిగిల్చినాడు. వాటిలో మనందరికి వంతులున్నవి. పౌలు తన వంతును తాను సంపూర్ణము చేయుచున్నాడు. మనకును వంతులున్నవి. వాటిని మనము సంపూర్ణము చేయాలి. సంఘము యొక్క మర్మము పౌలుకు అప్పగించబడినది. ఆ మర్మమును ప్రకటించుటకై పౌలు పరిచారకుడై నాడు. పౌలు ద్వారా ఆ మర్మము పత్రికలయందు బయలు పరచబడెనది. (మర్మముల వివరములు 1వ అధ్యాయము చివర గమనించగలరు)

**సంఘము యొక్క పరిపూర్ణత కొరకు ప్రయాసపడిన పౌలు (28-29వ.)** : ప్రతి మనుష్యుడు క్రీస్తునందు పరిపూర్ణుడు కావాలి. అందుకై ప్రకటించుటలోను, బోధించుట లోను బుద్ధి చెప్పుటలోను పౌలు ప్రయాసపడుచున్నాడు. మనమందరము ఈ గురిని మన సంఘములలోనుండు విశ్వాసుల పట్ల కలిగియుండాలి.

**మర్మము** : మర్మము అనుపదము క్రొత్త నిబంధనలో 34 పర్యాయములు కలదు.

**I. దైవభక్తిని గూర్చిన మర్మము** : 1) 1 తిమోతి 3:16వ. 2) 1 తిమోతి 3:9వ., 3) కొలొస్స 2:2వ, 4) 1 కొరింథీ. 2:7వ.

**II. వాక్య మర్మము - క్రీస్తు మర్మము** : 5) కొలొస్స 1:25వ. 6-7), కొలొస్స 1:27వ. 8) 1 కొరి. 2:1వ, 9) 1 కొరి. 4:1వ, 10) 1 కొరి. 13:2వ. 11) 1 కొరి. 14:2వ.

**III. అన్యజనులను గూర్చిన క్రీస్తు మర్మము** : 12) ఎఫెసీ. 3:3వ. 13)ఎఫెసీ. 3:4వ, 14) ఎఫెసీ. 3:5వ, 15) ఎఫెసీ. 3:6వ, 16) ఎఫెసీ. 3:11వ, 17) రోమా 16:25వ,

18) రోమా 16:26వ, 19) ఎఫెసీ. 6:19వ, 20) కొలొస్స 4:3వ, 21) కొలస్స 4:3వ, 22) కొలొస్స 4:3వ,

**IV.** నక్షత్రము : 23) ప్రకటన 1:20వ, 24) ప్రకటన.10:7వ.

**V.** పరలోక **రాజ్యము, దేవుని రాజ్యము** : 25) మత్తయి 13:11వ, 26) మార్కు 4:11వ, 27) లూకా 8:10వ.

**VI. మృతుల పునరుత్థానము** : 28) 1 కొరి. 15:51వ.

**VII. అన్యజనుల ప్రవేశము కొరకు ఇశ్రాయేలు కఠిన మనసు** : 29) రోమా 11:25వ.

**VIII.** ధర్మవిరోధ సంబంధమైన మర్మము : 30) 2 థెస్స. 2:7వ.

**IX.** మర్మమైన **బబులోను** : 31) ప్రకటన 17:5వ, 32) ప్రకటన 17:7వ.

**X.** భార్య భర్తలను గూర్చిన మర్మము : 33) ఎఫెసీ. 5:23వ.

**XI.** మర్మమైన దేవుని చిత్తము : 34) ఎఫెసీ. 1:9వ.

## 2వ అధ్యాయము 7+8+8=23 వచనములు
## అంశము : శరీరమందు సంపూర్ణ దైవత్వము గల క్రీస్తు (9వ.)

**దేవుని మర్మమైన క్రీస్తును ఎరుగుట (1-7వ.)** : 1-2 వ.లో పౌలు కొలస్సయి వారిని, లౌదికయ వారిని ముఖాముఖిగా చూడకపోయినను వారు ప్రేమయందు అతుకబడి దేవుని మర్మమైన క్రీస్తును సంపూర్ణముగా ఎరిగినవారుగా నుండవలెనని ప్రార్థనలో పోరాడుచున్నాడు. 3-4వ.లో క్రీస్తునందు బుద్ధి, విజ్ఞాన, సర్వ సంపదలు గుప్తమైయున్నవని ఎవరి మాటల వలనను మోసపరచ బడకూడదని చెప్పుచున్నాడు. 5-7వ క్రీస్తును అంగీకరించినవారు క్రీస్తులో వేరుపారి అనగా చక్కని పునాది కలిగి, చక్కని ఇంటివలె కట్టబడుచు, విశ్వాస మందు స్థిరపడాలి. కొలొస్సయి వారట్లున్నారు. అందుకు పౌలు సంతోషించుచున్నాడు. అనగా ఒక విశ్వాసి క్రీస్తును ఎరుగుట ద్వారా సంపూర్ణముగా స్థిరపడును.

**శరీరమందు దేవత్వము యొక్క సర్వ పరిపూర్ణతను కలిగిన క్రీస్తు (8-15వ.)** : క్రీస్తు నందు దైవత్వము సంపూర్ణముగా నున్నందున లోకమందున్న నిరర్థక తత్వజ్ఞానము ననుసరించు వారి ద్వారా మోసపరచబడ కూడదని చెప్పుచున్నాడు. నిరర్థక తత్వజ్ఞానము

ననుసరించు జ్ఞాస్తికులను గురించి గ్రంథ ప్రారంభమందలి సంఘ స్థాపనలో చెప్పబడినది. క్రీస్తునందు చేతులతో చేయబడని హృదయ సంబంధమైన సున్నతిని అనగా ఆత్మయందు జరుగు సున్నతిని (రోమా 2:29వ.) పొందితిమి కనుక శరీరేచ్ఛలతో కూడిన స్వభావమును విసర్జించితిమి. క్రీస్తు సిలువలో మన పాప పత్రమును మేకులచే సిలువకు కొట్టి దాని మీదనున్న చేవ్రాతను చెరిపివేసి అడ్డు లేకుండ ఎత్తివేసెను. బాప్తిస్మమందు మనము ఆయనతో పాతి పెట్టబడితిమి. (బాప్తిస్మమును గూర్చి ఈ గ్రంథము చివరలో గమనించండి) నూతన స్వభావముతో ఆయనతో కూడా లేచితిమి. క్రీస్తు ద్వారా దైవత్వమునకు సంబంధించిన కార్యములన్ని మన కను గ్రహించబడినందున క్రీస్తు సర్వ పరిపూర్ణుడైన దేవుడు అని గ్రహించుచున్నాము.

**ధర్మశాస్త్రము యొక్క నిజ స్వరూపమైన క్రీస్తు (16-23వ.)** : ధర్మశాస్త్రములోనున్న బలులు, పండుగలు, రాబోవు క్రీస్తును గూర్చిన ఛాయలే (హెబ్రీ. 10:1-2వ). క్రీస్తు రాక ద్వారా అవన్నియు క్రీస్తునందు నెరవేర్చబడుట చూచుచున్నాము కనుక క్రీస్తు ధర్మశాస్త్రము యొక్క నిజ స్వరూపము. జ్ఞాస్తికులు దేహశిక్ష ద్వారా శరీరేచ్ఛలను నిగ్రహించగలమని బోధించుచున్నారు. అది తప్పని క్రీస్తులోనే సమస్తము నెరవేరునని విశద పరచుచున్నాడు.

## 3వ అధ్యాయము 4+3+4+6+4+4=25 వచనములు
## అంశము : క్రీస్తుతో పరిశుద్ధ నడక

**సంఘముగా పరిశుద్ధ నడక - (1-17వ.) :**

**పరిశుద్ధమైన నడక (1-4వ.)** : మనము మృతిపొంది క్రీస్తుతో కూడ లేపబడితిమి. కనుక భూ సంబంధమైన వాటి పై మనసుండకూడదు. తిరిగి లేచి ఆరోహణమై తండ్రి కుడి పార్శ్వమున కూర్చున్న క్రీస్తు మీదనే మనసును కలిగి ఉండాలి. అనగా పరలోక సంబంధమైన వాటి మీదనే మనసుండాలి.మనకు జీవమైయున్న క్రీస్తు ప్రత్యక్షమైనపుడు ఆయనతో కూడా మహిమ కలవారముగా ప్రత్యక్షమగుదుము. కనుక పరిశుద్ధ నడక నడవవలెను.

**పూర్వపు నడక (5-7వ.)** : భూ సంబంధులముగానున్నపుడు 1) జారత్వము, 2) పవిత్రత, 3) కామాతురత, 4) దురాశ, 5) విగ్రహారాధన అగు ధనాపేక్ష అను వాటిని అనుసరించితిమి. వాటినిప్పుడు చంపివేయాలి. చంపివేయుట అనగా మరెన్నడు మనలో కనబడకూడదు.

**ప్రస్తుత నడక (8-11వ.)** : 8వ.లో 1) కోపము, 2) ఆగ్రహము, 3) దుష్టత్వము, 4) దూషణ, 5) బూతులు అను వాటిని విసర్జించాలి. చనిపోవుట ఒకేసారి కాబట్టి 5-7వ. ఉన్నవి మరెన్నడు కనబడకూడదు. విసర్జించాలి అనగా రోజు ఒకసారి మల విసర్జన చేయుదుము. విసర్జన చేసిన పిదప మన శరీరములో మలము మరలా ఏర్పడును. ఏర్పడు కొలది విసర్జించాలి. అనగా అనుదినము 8వ.లో ఉన్న ఐదు గుణములను ఏర్పడుచుండగా విసర్జించుచుండాలి. 9వ. వచనములోనున్న అబద్ధములను ప్రాచీన స్వభావమును విడిచిపెట్టి నవీన స్వభావమును ధరించుకొనాలి. ఇక్కడ ఉన్నవి. మనము బట్టలు విప్పి శుభ్రపరచుకొని మరలా ధరించునట్లు నిత్యము మనము వాటి నుండి శుభ్రపరచుకొనాలి. వీటిలో ఏ భేదములు లేదు. కనుక అందరు చంపివేయవలసిన వాటిని 1) చంపివేయాలి. విసర్జించవలసిన వాటిని, 2) విసర్జించాలి. విడవవలసిన వాటిని, 3) విడిచి వేయాలి. ధరించవలసిన వాటిని, 4) ధరించాలి.

**ఇక మీదట (రాబోవు) నడక (12-17వ.)** : 1) 12-14 వచనములలో ధరించుకొనవలసినవి వివరించబడినవి. మనలను 5) ఏలవలసినవి, 15వ. వచనములోను, మనలో 6) నివసించవలసినవి 16వ వచనములోను, మనము 7) చేయవలసిన స్తుతి 17వ వచనములో చెప్పబడినది.

**కుటుంబముగా నడక (18-21వ.)** : 18-19వ. 1) భార్యలు భర్తలకు లోబడాలి, 2) భర్తలు భార్యలను ప్రేమించాలి. (వివరములు ఎఫెసీ. 5:22-32వ. కలవు) 20-21వ.లో పిల్లలు అన్ని విషయములలో తండ్రుల మాట వినాలి అని తండ్రులు పిల్లలకు కోపము పుట్టించకూడదని చెప్పినాడు. (ఈ విషయములు ఎఫెసీ 6:1-4వ. చెప్పబడినవి)

**దాసులు యజమానుల పట్ల నడవవలసిన రీతి (22-25వ.)** : 22-25వ. దాసులు యజమానులకు సేవ చేయవలసిన విధము చెప్పబడినది. 4:1వ.లో యజమానులు దాసులపట్ల చేయవలసినవి, చెప్పబడినవి. (దీని వివరములు ఎఫెసీ. 6:5-9వ. కలవు)

## 4వ అధ్యాయము 1+3+2+6+6=18 వచనములు
## అంశము : క్రీస్తు నందలి తోటి పనివారి నడక

**మొదటి వచనమును మూడవ అధ్యాయము చివరలో చూచితిమి :**

ప్రార్థనలో నడుచుకొనవలసిన రీతి (2-4వ.) : ప్రార్థనలో 1) నిలకడగాను, 2) మెలకువగా ఉండాలి. సువార్త ప్రకటనకై అనుకూల సమయము కొరకు ప్రార్థించాలి.

**వెలుపటి వారి యెడల నడుచుకొనవలసిన విధము : (5-6వ.)** : సాక్ష్యము ప్రాముఖ్యమైనది. కనుక సంఘమునకు వెలుపటి వారి యెడల నడుచుకొను రీతి ప్రాముఖ్యమైనది. జ్ఞానము కలిగి నడుచుకొనాలి. సంభాషణ/మాటలు రుచిగానుండాలి. కృపతో నిండినవిగా నుండాలి. ఇవి మన ద్వారా జరుగు సువార్త ప్రకటనకు ఎంతో అవసరమైనవి.

**పనిలో పదిమంది తోటి పనివారల మాదిరి నడక (7-12వ. 13-18వ.)** : 1) 7వ వచనములో తుకికు నడకను, 2) 8-9వ. ఒనేసీము నడకను 3-4. 10వ. వచనములో అరిస్తార్కు, మార్కుల నడక, 5) 11వ వచనములో యూస్తు నడకను, 6) 12-13వ. ఎపఫ్రా నడకను, 7,8) 14వ. వచనములో లూకా, దేమాల నడకను చెప్పుచున్నాడు. 9) 15వ నుంఫాకు, ఇంటనున్న సంఘమునకు వందనములు చెప్పుచున్నాడు, 10) 17వ. అర్ఖిప్పును గూర్చి చెప్పుచున్నాడు. వందనములతో ముగించుచున్నాడు.

బాప్తిస్మము : గ్రీకు భాషలో అను పదమునకు ముంచడమనని అర్థము.

1) నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడును. మార్కు 16:16వ.

2) యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందవలెనని దేవుని ఆజ్ఞ. అ.కా. 10:48వ.

3) సమస్త జనులను శిష్యులుగా చేయుడి. తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మయము ఇయ్యుడి మత్తయి 28:19వ.

4) బాప్తిస్మము పొందుట దేవుని నీతి. దీనిని క్రీస్తు నెరవేర్చాడు. మత్తయి 3:1వ.

5) బాప్తిస్మయములో నీళ్ళలోనికి వెళ్ళుట మునుగుట నీళ్ళ నుండి బయటకు వచ్చుట అ.కా. 8:36-38వ.

6) బాప్తిస్మము పొందినవారు క్రీస్తు మరణములోనికి బాప్తిస్మము పొందుచున్నారు. కొలొస్స. 2:12వ. బాప్తిస్మమందు ఆయనతో కూడా పాతిపెట్టబడి ఆయనను మృతులలో నుండి లేపిన దేవుని విశ్వసించుట ద్వారా ఆయనతో కూడ లేచితిరి.

# థెస్సలొనీకయులకు వ్రాసిన మొదటి పత్రిక

గ్రంథకర్త : పౌలు . కాలము : క్రీ.శ. 52 (3:1) స్థలము : కొరింథు. (3:1) కొనిపోయినవారు ఎవరో తెలియదు.

ముఖ్య ఉద్దేశము : ఆకాశమండలమునకు ప్రభువు రాకడ - మాదిరి.

**ప్రభువు రాకడ నపేక్షించువారు** : 1) సువార్త ప్రకటనలో మాదిరిగానుండుచు (1:7), 2) ప్రయాసపడుచు ఫలము కలిగి (2:19), 3) పరిశుద్ధులై (3:12), 4) పరిశుద్ధతను కాపాడుకొనుచు (4:3), 5) ప్రేమగలవారై (4:9), 6) దుఃఖపడక (4:13), 7) నిందా రహితులుగా ఉండాలి (5:23).

**థెస్సలొనీక పట్టణ చరిత్ర** : ఈ పట్టణపు పాత పేరు థెర్మా (THERMA) అనగా వేడి నీటి బుగ్గలు అని అర్థము. రాజైన అలెగ్జాండర్ చక్రవర్తి గారి సైన్యాధిపతులలో ఒకడైన కసెండర్, అలెగ్జాండర్‌గారికి వరుసకు చెల్లియగు సలోనీకను వివాహమాడెను. అలెగ్జాండర్ మరణానంతరము నలుగురు సైన్యాధిపతులు రాజ్యమును పంచుకొనిరి. కసెండర్ మాసిదోనియాపై దండెత్తి క్రీ.పూ. 315 జయించి జయమునకు గురుతుగా ఒక పట్టణమును కట్టించి ఆ పట్టణమును జయించిన సలోనిక అను అర్థమిచ్చు థెస్సలొనీక అను పేరు పెట్టెను. ఇది సహజమైన ఓడరేవుగల పట్టణము. కనుక వ్యాపారములోను, వ్యభిచార పాపములోను పేరు పొందిన పట్టణము. తదుపరి క్రీ.పూ. 168లో రోమీయులు దానిని జయించి తమ వశమందుంచుకొనిరి. అది మాసిదోనియాలోని నాలుగు భాగములలో దక్షిణమున నున్న భాగమునకు ముఖ్య పట్టణముగా నుండెను. ఫిలిప్పీ ఉత్తర మాసిదోనియాకు ముఖ్య పట్టణమైయుండెను.

**సంఘ స్థాపన** : క్రీ.శ. 51లో ఫిలిప్పీ నుండి పౌలు థెస్సలొనీకకు వచ్చి అ.కా. 17:1-9వ. ప్రకారము మూడు వారములు బోధించెను. యూదులు కొందరు, గ్రీకు దేశస్థులు (విగ్రహారాధికులు) అనేకులు, ఘనత గల స్త్రీలు చాలామంది రక్షింపబడిరి. యాసోను పౌలును తన ఇంట చేర్చుకొనినందున పట్టణస్థులు యాసోనును కొట్టి హింసించిరి. పౌలు తన సహచరులతో బెరయకు, తర్వాత ఏథెన్సుకు అ.కా. 17:10-34 ప్రకారము వెళ్ళిపోయెను. థెస్సలొనీకయులు శ్రమల మధ్య నమ్మి, శ్రమల మధ్య ఆత్మీయ యాత్ర కొనసాగించుచుండగా, శ్రమల మధ్య వారిని బలపరచుటకై పౌలు ఏథెన్సులో నున్నప్పుడు 1 థెస్స. 3:1 ప్రకారము తిమోతిని థెస్సలొనీకకు పంపెను. తిమోతి వారిని స్థిరపరచి, పౌలు కొరింథులో నున్నప్పుడు అ.కా. 18:5 ప్రకారము తిరిగి వచ్చి

వారిని గూర్చి మంచి సమాచారము తేగా ప్రభువు రెండవ రాకడను జ్ఞాపకము చేయుచు అయన కొరకు ఎదురుచూచుచూ జీవించవలెనని హెచ్చరించుచూ ముఖ్యముగా పరిశుద్ధతను గూర్చి కొన్ని హెచ్చరికలిచ్చెను.

థెస్సలొనీకయుల మొదటి పత్రికను కొరింథు పట్టణములో నుండి క్రీ.శ. 52లో వ్రాసెను. 1 థెస్స. 3:9-10వ. లోనున్నట్లు వారిలో గల లోపములు దిద్దుటకై మాదిరికరమైన జీవితమునకు హెచ్చరికలు వ్రాసెను. ఈ పత్రికయందున్న ప్రభువు రాకడను గూర్చి థెస్సలొనీకయులు తప్పుగా తలంచిరి. ప్రభువు తన రెండవ రాకడలో ఆకాశమండలమందు ఏడు ఏండ్లు ఉన్నప్పుడు భూమిపై జరుగు సంగతులను వివరించుచూ ప్రభువు భూమిపై దిగి వచ్చుటను గూర్చిన వివరములు తెలుపుచూ వారు కలిగిన తప్పుడు అభిప్రాయమును దిద్దుచూ క్రీ.శ. 53లో రెండవ పత్రికను కొరింథు నుండియే వ్రాసెను. ప్రస్తుతము అక్కడ ఒక చిన్న పట్టణమున్నను, వాక్య ప్రకారము నడుచుకొను క్రమమైన సంఘము నేటికిని అక్కడ ఉన్నది. (BROTHERN CHRISTIAN ASSEMBLY)

## అధ్యాయాల విభజన

**1-3వ అధ్యాయములు** : మాదిరియైన సంఘము, పనివారు

**4-5వ అధ్యాయములు** : మాదిరికి హెచ్చరికలు.

**1వ అధ్యాయము** : ప్రవర్తనలోను, ప్రకటనలోను, మాదిరి సంఘము.

**2వ అధ్యాయము** : మాదిరి పనివాడు.

**3వ అధ్యాయము** : మాదిరి పనివారుగా పౌలు, తిమోతిలు.

**4వ అధ్యాయము** : మాదిరియైన పనికి హెచ్చరికలు.

**5వ అధ్యాయము** : మాదిరియైన పనికి మరిన్ని హెచ్చరికలు.

## 1వ అధ్యాయము 1+2+2+1+2+2=10 వచనములు
## అంశము : ప్రవర్తనలోను, ప్రకటనలోను మాదిరి సంఘము.

**1వ. శుభములు** : ముందున్న అన్ని పత్రికలలో తనను, అపొస్తలుడుగను, దాసుడుగను పరిచయము చేసికొన్నాడు కాని ఈ పత్రికలో అలాగు కాక తనను ఒక సామాన్యుని వలె పరిచయము చేసికొనుట చూచుచున్నాము. వారిలో ఒకనివలె వారి విశ్వాసమును. ప్రేమను నిరీక్షణను మెచ్చుకొనుచున్నాడు. తనతో పాటి సిల్వానును, తిమోతిని కలుపుకొని వ్రాయుచున్నాడు. కృప గ్రీసు దేశస్తులు శుభములు తెలుపుకొను

విధము, సమాధానము (షాలొమ్) యూదులు శుభములు తెలుపుకొను విధము. ఈ సంఘమందు అ.కా. 17:2-3వ. ప్రకారము క్రీస్తును నమ్మిన గ్రీసు దేశస్తులు, యూదులు ఉన్నందున కృప సమాధానమను రెండు పదములతో శుభములు తెలుపుచున్నాడు.

**ప్రార్థన స్తుతి (2-3వ.)** : విశ్వాసము, ప్రేమ, నిరీక్షణ 1 కొరింథీ. 13:13 ప్రకారము అంతము వరకు నిలుచునవి. ఇవి క్రైస్తవ జీవిత ప్రాముఖ్యతలు వీటిని కలిగి పని చేయుచు, ప్రయాసపడుచు క్రీస్తునందు నిరీక్షణ కలిగి థెస్సలొనీకయులు జీవించు చున్నారు. అందులకై వారి నిమిత్తము పౌలు తన ప్రార్థనలో దేవుని స్తుతించుచున్నాడు.

**థెస్సలొనీకలో ప్రకటింపబడిన సువార్త (4-5వ.)** : అ.కా. 17:1-4వ వచనములలో చెప్పబడినట్లు థెస్సలొనీకలో పౌలు తన వాడుక చొప్పున సమాజము వారి యొద్దకు వెళ్ళి 3 వారములు సువార్త ప్రకటించాడు. ఆ సువార్త శక్తితోను, పరిశుద్ధాత్మతోను, సంపూర్ణ నిశ్చయతతోను ప్రకటింపబడినది. యూదులు కొందరు, గ్రీసు దేశస్తులు చాలా మంది ఘనతగల స్త్రీలలో అనేకులు యేసును రక్షకుడుగా ఒప్పుకున్నారు. పౌలు నమ్ము కొనుటకు ఇష్టపడిన వారిని ఒప్పించేవాడు. ఈ అలవాటు మంచిది. మనము నమ్ము కొనుటకు ఇష్టపడిన వారిని ఒప్పించే తీర్మానము పలికించాలి. తదుపరి వారిని స్థిరపరచాలి.

**6వ వచనము : థెస్సలొనీకలో ఫలించిన సువార్త** - పరిశుద్ధాత్మ కార్యము చేశాడు. ఉపద్రవముల మధ్యనే అనేకులు క్రీస్తును నమ్మి ఆనందించిరి. ప్రభువును పోలి నడుచుకొనుచున్నారు.

**థెస్సలొనీకయులు ప్రకటించిన సువార్త (7-8వ.) - ఫలము** : ప్రభువును నమ్మిన థెస్సలొనీకయులు మాసిదోనియా అంతటను, గ్రీసు దేశమందంతటను సువార్తను ప్రకటించిరి, మ్రోగించిరి. పై రెండు దేశములలో ఉన్న విశ్వాసులకు థెస్సలొనీకయులు మాదిరిగానున్నారు. సువార్త ప్రకటనలో పడవలసిన ప్రయాసకు ఇదెంతో మాదిరి. పౌలువంటి దైవజనులు ఎక్కడికి వెళ్ళినను వారు చెప్పకముందే అక్కడి ప్రజలు ఈ సువార్త విషయమును గూర్చి చెప్పుచున్నారు.

**ప్రభువు రాకడకై ఎదురు చూచు థెస్సలొనీకయులు (9-10వ.)** : థెస్సలొనీకలో నమ్మినవారు ఎక్కువమంది విగ్రహారాధికులు. ప్రభువును అంగీకరించిన తర్వాత విగ్రహములను విడిచిపెట్టి తాము నమ్మిన దేవుడు 1) జీవముగలవాడని, 2) సత్య వంతుడని, 3) మృతులలో నుంచి లేచినవాడని, 4) పరలోకము నుండి మరల వచ్చునని, 5) లోకమునకు రాబోవు ఉగ్రత నుండి వారిని తప్పించునని గుర్తించి, 6) ఆయన వైపు

తిరిగి, 7) ఆయన రాకడకై ఎదురు చూచుచున్నారు. సిద్ధముగానున్నారు. ఇది నేటి విశ్వాస కోటికి ఎంతో మాదిరి.

## 2వ అధ్యాయము 4+4+4+4+4=20 వచనములు

## అంశము : మాదిరియైన పనివాడు

**మాదిరియైన పనివాని బోధన పద్ధతి (1-4వ.)** : శ్రమలలో, అవమానములలో, పోరాటములలో సువార్తను బోధించుటకు ధైర్యము తెచ్చుకొనాలి. అపవిత్రత ఉండ కూడదు. బోధకునికి తగనివి 1) కపటము, 2) అపవిత్రత, 3) మోసము బోధకునికి తగనివి. 1) దేవునిచే యోగ్యులని ఎంచబడుట, 2) మనుష్యులను కాక దేవునినే సంతోష పెట్టుట.

**మాదిరియైన పనివాడు - స్థన్యమిచ్చు తల్లివంటివాడు (5-8వ.)** : తల్లిబిడ్డల నుండి ఏమి అపేక్షించదు. ఆలాగే పనివాడు అపేక్షలేని వాడుగా, ముఖ్యముగా ధనాపేక్షలేని వాడుగా నుండాలి. ఇచ్చకపు మాటలు లేనివాడై ఉండాలి. పనివాడు తనకేమైన అధికారమున్నను వినియోగించ కూడదు. ఘనతను కోరకూడదు కాని తల్లివలె అందరిని గౌరవించు వాడుగానుండాలి. తల్లిగానే కాక తానొక శిశువుగా సాధుత్వము కలిగియుండాలి. ధనాపేక్ష లేకపోయినను సహోదరుల ఆత్మీయత ఎడల విశేష అపేక్ష కలవారుగానుండాలి. సువార్త ప్రకటించుట మాత్రమే కాక అవసరమైతే వారి కొరకు ప్రాణమిచ్చుటకును సిద్ధముగానుండాలి.

**మాదిరియైన పనివాడు - మాదిరియైన నడకగల తండ్రి వంటివాడు (9-12వ.)** : తండ్రి కుటుంబములో ఎవరికిని భారముగానుండడు. జీవనము కొరకు తానే కష్టపడును. ప్రయాసను, కష్టమును లెక్క చేయడు. ప్రవర్తనలో కుటుంబములో అందరికి మాదిరిగా నుండును. ఆలాగే మాదిరియైన పనివాడు ప్రభువు పనిలో ప్రయాసను లెక్క చేయక, ఎవరికిని భారముగా నుండక, తానే కష్టపడుచు దేవుని ఎడల భక్తిని, మానవుల ఎడల నీతిని, ప్రవర్తనలో తన విషయమై అనింద్యుడుగాను ఉండాలి.

పై విషయములలో సంఘమంతయు అనగా సాటి మానవులును దేవుడును సాక్షులుగానుండాలి. తన మాదిరియైన నడకను చూపించుచు తన రాజ్యమునకు, మహిమకు పిలిచిన దేవునికి తగినట్టు జీవించాలని ధైర్యపరచి అందరిని హెచ్చరించువాడై ఉండాలి.

**మాదిరియైన పనివాడు - పనివాడు హింసను సహించిన వాడు (13-16వ.)** : యూదయలోని సంఘములు, యూదుల నుండి శ్రమలను అనుభవించారు. థెస్సలొనీకయులు కూడా తమ సొంత దేశస్థుల వలన శ్రమలను అనుభవించారు. యూదులు ప్రభువైన యేసును, ప్రవక్తలను చంపిరి. యూదులు పౌలును సహచరులను హింసించిరి. అన్యజనులతో రక్షణ విషయమై పౌలు సహచరులు మాటలాడకుండ, యూదులు ఆటంక పరచిరి. ఇటువంటి పరిస్థితిలోనే థెస్సలొనీకయులు వాక్యమును అంగీకరించిరి.

**మాదిరియైన పనివాడు - అక్షయ కిరీటమును నిరీక్షించువాడు (17-20వ.)** : మాదిరియైన పనివాడు రక్షించబడినవారి ఆత్మీయ క్షేమ విషయమై మిగుల అపేక్ష కలిగియుంటాడు. 1) ధన అపేక్షలేనివాడుగాను (5వ), 2) విశేష అపేక్ష కలవాడుగాను, (8వ), 3) మిగుల అపేక్షగలవాడు (17వ) ఉండి ప్రభువు ఆకాశమండలములో సంఘము కొరకు ప్రత్యక్షమై ఏడేండ్ల కాలము ఒక్కొక్కరిని వారి క్రియల ప్రకారము తీర్పు తీర్చినపుడు బహుమానముగా అతిశయ కిరీటము పొందును. ప్రభువు అనుగ్రహించు ఆ కిరీటములలో ఇది ప్రభువును నమ్మినవారిని మాదిరి వ్యక్తులుగా తీర్చి దిద్దిన వారికి అనుగ్రహించబడును. మిగిలిన కిరీటములను గూర్చిన వివరములు 1 కొరింథీ. 9వ అధ్యాయము చివరలో కలవు.

## 3వ అధ్యాయము 5+5+3=13 వచనములు
## అంశము : మాదిరి పనివారుగా పౌలు, తిమోతీలు

**పనివారిని పంపుట (1-5వ.)** : పౌలు థెస్సలొనీకలో పని జరిగిన పిమ్మట శ్రమలను బట్టి బెరయకు తదుపరి, ఏథెన్సుకు వచ్చాడు. థెస్సలొనీకకు సుమారు 300 మైళ్ళ దూరములోనున్నాడు. కాని థెస్సలొనీకలో నమ్మినవారు శ్రమలను బట్టి విశ్వాసములో కదిలి పోవుదురేమోనని బలపరచుటకు ఎవరినైనా పంపవలెనని తలంచాడు. తిమోతి తగినవాడని గుర్తించి తిమోతిని సీలను 300 మైళ్ళ దూరము పంపాడు. ఈ దినములలోను జరిగిన పనులు అనేక స్థలములలో శ్రమలను బట్టి దెబ్బ తింటున్నవి. పౌలువలె పని పాడు కాకుండా కాపాడుట ఎంతో అవసరము. ఈ రీతిగా కాపాడబడిన థెస్సలొనీక సంఘము నేటికి కొనసాగుచున్నదని ఎరుగవలెను. 1 కొరింథీ 15:58వ ప్రకారం ప్రభువు నందలి ప్రయాస వ్యర్థముకాదని గుర్తించాలి.

**ప్రార్థించుట (6-10వ.)** : పౌలు కొరింథులోనుండగా అ.కా. 18:5వ. తిమోతి సీలలు మాసిదోనియా నుండి (థెస్సలొనీకయు) నుండి వచ్చివారిని గురించిన మంచి సమాచారము తెచ్చిరి. ఆదరింపబడిన పౌలు తాను థెస్సలొనీకయులలోనున్న లోపములను దిద్దుటకై రాత్రింబగళ్ళు ప్రార్థించితినని చెప్పుచున్నాడు. పౌలు 1) ప్రార్థన

ద్వారాను, 2) తిమోతిని పౌలు పంపుట ద్వారాను, 3) తిమోతి ప్రయాణ ద్వారాను థెస్సలొనీకయులు శ్రమలలో కూడా విశ్వాసమందు స్థిరపడిరి అని దేవుని స్తుతించెను. తరువాత లోపములు దిద్దబడవలెనని ప్రార్థించుచున్నాడే కాని లోపములను ఇతరులకు తెలుపలేదు. పైగా 1:7లో మీరు మాదిరియైతిరి అని పత్రిక ప్రారంభించాడు. సహోదరులలోని లోపములను దిద్దుటకు స్థిరపరచుటకు ఇది మనకెంతో మాదిరి.

**ప్రభువు రాకడలో పరిశుద్ధతను, ప్రేమను కలిగియుండుట (11-13వ.)** : ప్రభువు తన రెండవ రాకడలో తన పరిశుద్ధులందరితో ఆకాశ మండలమునకు వచ్చినప్పుడు థెస్సలొనీకయులు పరిశుద్ధత విషయమై అనింద్యులుగాను, ప్రేమలో అభివృద్ధి పొంది వర్ధిల్లునట్లుగాను ప్రభువునందు అపేక్షించుచున్నాడు. మనమును సమస్త పరిశుద్ధుల ఎడల, మరి ముఖ్యముగా మన ద్వారా మేలు పొందినవారి యెడల అటువంటి అపేక్ష కలిగియుండాలి.

## 4వ అధ్యాయము 2+6+4+6=18 వచనములు
## అంశము : మాదిరియైన పనికి హెచ్చరికలు

**సామాన్యమైన హెచ్చరికలు (1-2)** : విశ్వాసులు 1) నేర్చుకొనిన వాక్య ప్రకారము నడుచుకొనుట, 2) దినదినము అంతకంతకు అభివృద్ధి చెందుట ఈ రెండు ప్రాముఖ్యమైనవి. ప్రతి విశ్వాసి ఈ రెండు పరిక్షలు తన విషయమై చేసుకొవాలి.

**శరీరమును పరిశుద్ధముగా కాపాడుకొనుటను గూర్చిన హెచ్చరిక (3-8వ.)** : పరిశుద్ధులు 1) జారత్వమునకు దూరముగానుండాలి (అవివాహితులు చేయు పాపము జారత్వము, వివాహితులు చేయు పాపము వ్యభిచారము). 2) కామాభిలాషకు దూరముగానుండాలి, 3) మనము పరిశుద్ధులగుటయే దేవుని చిత్తము గనుక అపరిశుద్ధులముగా నుండరాదు. ఆలాగు పాపమునకు తావిచ్చుట పరిశుద్ధాత్మను మనకు అనుగ్రహించిన దేవుని ఉపేక్షించుటయే. ప్రభువు ప్రత్యక్షమైనపుడు వీటన్నిటిని గూర్చి ప్రతిదండన చేయునని గుర్తించుకొనాలి.

**ప్రేమను గూర్చిన హెచ్చరిక (9-12వ.)** : మాసిదోనియలోనున్న సహోదరులందరు ఒకరినొకరు ప్రేమించుకొనుచున్నారని జ్ఞాపకము చేయుచు మరి ఎక్కువగా ప్రేమలో అభివృద్ధి చెందవలెనని చెప్పుచున్నాడు. అగాపే ప్రేమచేత మనము ఒకరినొకరు ప్రేమించు కొనాలి. (మత్తయి 22:39వ.) (1 కొరింథీ. 13వ అధ్యాయ ప్రారంబమందు ప్రేమ వివరములు చూడండి)

**ప్రభువు ఆకాశ మండలమునకు వచ్చు రాకడను గూర్చిన హెచ్చరిక (13-18వ.)** : లోకులు నిరీక్షణ లేనివారు కనుక చనిపోయిన తరువాత ఏమగునోయని చనిపోయిన వారిని గూర్చి చింతించుదురు. క్రీస్తు మృతిపొంది తిరిగిలేచినందున క్రీస్తునందు మృతులైన వారును లేపబడుదురని క్రీస్తు ప్రధాన దూత శబ్దముతోను, దేవుని బూరతోను పరలోకము నుండి ఆకాశ మండలమునకు దిగిరాగా క్రీస్తు నందుండి మృతులైన వారు మొదట బ్రతికింపబడి అక్షయ దేహమును ధరించుకొందురు. (1 కొరి. 15:51వ.) ఆ మీదట ప్రభువును నమ్మి సజీవులుగానున్నవారు కూడా మార్చబడి వారితో కూడా ఏకముగా ఆకాశమండలమందున్న ప్రభువును ఎదుర్కొనుటకు మేఘముల మీద వెళ్ళుదురు. అప్పటి నుండి సదాకాలము ప్రభువుతో నుందురు. కనుక శ్రమల కాలమందు భూలోకములో కలుగు శ్రమలలో క్రీస్తును నమ్మినవారు పాలు పొందరు.

## 5వ అధ్యాయము 11+11+3+3=28 వచనములు
## అంశము : ప్రభువు ఆకాశమండలమునకు వచ్చు రాకడను గూర్చిన హెచ్చరిక - మిగిలిన హెచ్చరికలు

**ప్రభువు ఆకాశమండలమునకు వచ్చు రాకడ (1-11వ.)** : 1-4వ. ప్రభువు దినము దొంగవచ్చినట్లు వచ్చును. లోకులు కనిపెట్టని గడియలో వచ్చును. కొందరు అదృశ్యులైనట్లు లోకము ఎరుగుదురు. కాని ఏమి జరుగునో వారికి తెలియదు. సంఘము పూర్తిగా ఎత్తబడిన పిమ్మట శ్రమలు ఆరంభమగును. లోకమునకు శ్రమలు అప్పటినుండి ఆరంభమై దానియేలు 9:27వ. చెప్పబడినట్లు మొదటి 31/2 ఏండ్లు శ్రమలు కలుగును. తరువాత 31/2 ఏండ్లు మహా శ్రమలు కలుగును. ప్రకటన 13వ అధ్యాయము ప్రకారము క్రీస్తు విరోధి పాలన భూమిపై ఏడేండ్లు జరుగును. యూదులు లోకములో ఉన్న అన్యులగు వారు వాటినుండి తప్పించుకొనలేరు. ప్రకటన 6వ అధ్యా. నుండి 18వ అధ్యాయము వరకు చెప్పబడిన శ్రమలన్నియు కలుగును. 5-8వ.లో మనము వెలుగు సంబంధులము కనుక 4:13-18వ.లో చెప్పబడి నట్లు ఆకాశమండలమునకు వెళ్ళుదుము క్రీస్తునందు మృతులైనవారు, సజీవులు వెళ్ళుదురు కనుక సంఘమంతయు వెళ్ళును. కొద్ది మందియే వెళ్ళుదురను బోధ సరియైనది కాదు. కనుక మనకు క్రీస్తు దినము ప్రారంభమైనదని ఎరుగుదుము. 2 కొరింథీ. 5:10వ ప్రకారము 1 కొరింథీ. 3:13-15వ. ప్రకారము మనము క్రీస్తు న్యాయపీఠము దగ్గర తీర్పు తీర్చబడి ఫలము కిరీటములు బహుమానములు పొందుదుము. పని అగ్నిచే పరీక్షించబడునని 1 కొరింథీ. 3:13లో

ఉన్నది. అలాగే హెబ్రీ. 10:27లో కూడా న్యాయపు తీర్పు క్రీస్తు న్యాయపీఠము దగ్గర జరుగు తీర్పు తీక్షణమైన అగ్ని ఇక ఉండును అన్నాడు. 1 కొరి. 3:13వ. ప్రకారము ఈ అగ్ని మన క్రియలను పరీక్షించును. 1 కొరి. 3:15వ. ప్రకారము మనము రక్షింపబడుదుము రక్షణ శాశ్వతమైనదని గుర్తించుదుము గాక కాని మన క్రియలు కాలిపోయిన యెడల మనకు నష్టము కలుగును. అనగా పొందబోవు ఫలములో నష్టము కలుగును. కనుక మనము మెలుకువగానుండాలి. మత్తులముగా నుండరాదు. విశ్వాస, ప్రేమ, నిరీక్షణలు కలిగి ముందుకు సాగాలి. మానవుల పట్ల దేవుని నియమము ఇక్కడ చెప్పబడినది "రక్షణ పొందుటకే దేవుడు నియమించెను కాని ఉగ్రత పాలగుటకు కాదు".

**వేర్వేరు 16 హెచ్చరికలు (12-22వ.)** : 12-13వ వచనములో సంఘములో ప్రయాస పడువారి పట్ల ఏ రీతిగానుండాలో చెప్పుచున్నాడు. 1) బుద్ధి చెప్పువారిని మన్నన చేయాలి. 2) వారి పనిని బట్టి వారిని ఘనముగా ఎంచాలి, 3) ఒకరితో ఒకరు సమాధానముగా నుండాలి. 14-15 వచనములలో సంఘములోని సహోదరుల ప్రవర్తనను గూర్చి చెప్పుచున్నాడు, 4) అక్రమముగా నడుచుకొనువారికి బుద్ధి చెప్పాలి, 5) ధైర్యము చెడిన వారిని ధైర్యపరచాలి, 6) బలహీనులకు ఊతనివ్వాలి, 7) అందరి ఎడల దీర్ఘశాంతము కలవారై ఉండాలి, 8) కీడుకు ప్రతికీడు చేయకూడదు, 9) మనుష్యులందరి యెడల ఎల్లప్పుడు మేలైనది చేయాలి, 15-22 వచనములలో వ్యక్తిగతముగాను దేవునితో ఉండవలసిన సంబంధమును గూర్చి చెప్పుచున్నాడు. 11) ఎల్లప్పుడు సంతోషముగా నుండాలి, 12) ఎడతెగక ప్రార్థన చేయాలి, 13) ప్రతి విషయములో దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించాలి, 14) దేవుని ఆత్మను ఆర్పకూడదు, 15) ప్రవచించుటను నిర్లక్ష్యము చేయకూడదు, 16) సమస్తమును పరీక్షించి మేలైన దానిని చేపట్టాలి.

**చివరి హెచ్చరిక ఒకరి కొరకు ఒకరు ప్రార్థన (22-25వ.)** : ప్రభువు రాకడ సమయమునకు 1) ప్రాణము (మానసికముగాను, హృదయములోని తలంపులు, ఊహలలోను) 2) శరీరము, 3) ఆత్మ నిందా రహితముగా కాపాడుకొనవలెనను హెచ్చరిక చివరిదిగా చెప్పుచున్నాడు. తన కొరకు ప్రార్థించమని చెప్పుచున్నాడు.

**ముగింపు - వందనములు (26-28వ.)** : సహోదరుల మధ్య పవిత్రత ముఖ్యమని, పవిత్రతతో ముద్దు పెట్టుకొని సహోదరులకు వందనములు చెప్పమన్నాడు. ఈ పత్రిక సహోదరులందరికి చదివి వినిపించమని ఆశీర్వాదముతో పత్రిక ముగించుచున్నాడు. ఈ గ్రంథమందలి 5వ అధ్యాయములో చివరి వచనములో ప్రభువు రాకడ ప్రస్తావించబడి నందున దీనిని రాకడ పత్రిక అనిరి.

1) 1:10వ., 2)2:19., 3) 3:12-13వ., 4) 4:18-24వ., 5) 5:23వ.

# థెస్సలొనీకయులకు వ్రాసిన రెండవ పత్రిక

గ్రంథకర్త : పౌలు . కాలము : క్రీ.శ. 53 (2:1) స్థలము : కొరింథు.

**ముఖ్య ఉద్దేశము** : భూమి మీదకు ప్రభువు రాకడ.

## అధ్యాయాలు విభజన

**1-2 అ. బోధ** : 1 అధ్యా. శ్రమలలో **ఆదరణ**

**3 అ.** నడక : 2 అధ్యా. ప్రభువు దినాన్ని గూర్చిన **వివరణ**. 3వ అధ్యా. పని చేయకుండుటను గూర్చిన సవరణ (మాదిరికి అవసరమైన దిద్దుబాటును గూర్చిన హెచ్చరికలు)

## 1వ అధ్యాయము 5+5+2=12 వచనములు
## అంశము : శ్రమలలో ఆదరణ - (గతమును గూర్చిన మెప్పు)

**విభజన** : శ్రమలు **(1-5వ.)** : అ.కా. 17:1-9. వచనములలో థెస్సలొనీకయ వారు క్రీస్తును నమ్ముకొనగా యాసోను మిగిలిన వారు హింసించబడిరి. శ్రమల వలన కదిలించబడకూడదని మొదటి పత్రిక వ్రాయబడెను. అందులో ప్రభు దినమును గూర్చి పౌలు ప్రస్తావించినందున దాని విషయమై కొంత తప్పుడు అభిప్రాయము కలిగెను. మొదటి పత్రిక 5:1-11వ. ప్రభువు దినమందు భూలోకములో శ్రమలు కలుగునని వ్రాసెను. ప్రస్తుతము వీరికి కలుగు శ్రమలను బట్టి ప్రభువు దినము వచ్చెనని తప్పుగా తలంచిరి. ప్రభు దినము వచ్చినదని అందులకే తాము శ్రమలలో ఉన్నామని తలంచిరి. దానికి తాము అనుభవించు శ్రమలే గుర్తని థెస్సలొనీకయులు తలంచిరి ఆ తప్పుడు అభిప్రాయమును తేటపరచుటకే ఈ రెండవ పత్రికను వ్రాసెను. కాని ముందుగా వారి విశ్వాసము అభివృద్ధి పొందుచున్నదని యెదుటి వారి యెడల వారు చూపు ప్రేమలో వృద్ధి పొందుచున్నారని తెలిపెను. తరువాత వారు శ్రమలలో ఓర్పును కనపరచుచున్నారని దేవుని రాజ్యములో యోగ్యునిగ కనబడుటకు ఇది అవసరమని చెప్పుచున్నాడు.

**దేవుని న్యాయమైన తీర్పును బట్టి ఆదరణ (6-10వ.)** : ప్రభువైన యేసుక్రీస్తు భూమి మీద ప్రత్యక్షమైనపుడు దేవుని ఎరుగని వారిని దేవుడు శ్రమల ద్వారా తీర్పు తీర్చి శిక్షించును. ప్రభువును నమ్మినవారు ముందుగా ఆకాశమండలమునకు వెళ్ళిరి. అక్కడ తీర్పు తీర్చబడి ఫలము పొందినందున విశ్రాంతిగానుందురు. ప్రభువును నమ్మిన పరిశుద్ధులు దేవుని మహిమగలవారై అందరి చేత ప్రసంసించబడుదురని చెప్పుచున్నారు.

క్రీస్తును నమ్మని వారికి ఈ మహిమలో పాలు పంపులు లేవు. భూలోకములో క్రీస్తు విరోధి పాలనలో శ్రమలు మహా శ్రమలు కలుగును.

**పరిశుద్ధుల కొరకు ప్రార్థన (11-13) :** దేవుని చేత పిలువబడిన పరిశుద్ధులు విశ్వాస యుక్తమైన ప్రతి ఆలోచనను ప్రతి కార్యమును బలముతో సంపూర్ణము చేయవలెనని ప్రార్థించుచున్నాడు. విశ్వాసులయందు ప్రభువు నామము, ప్రభువునందు విశ్వాసులు మహిమ పొందునట్లు పౌలు ప్రార్థించినాడు.

## 2వ అధ్యాయము 3+5+4+5=17 వచనములు
## అంశము : ప్రభువు దినమును గూర్చిన వివరణ - (ప్రస్తుత తప్పు)

ప్రభువు దినము ఒక 24గం॥ దినము కాదు. యేసు ఆకాశమండలమునకు రాగా సంఘము ఆయన యొద్దకు వెళ్లి ఏడేండ్ల తరువాత ప్రభువు శరీర రీతిగా తన వారిని యూదులను విమోచించుటకు భూలోకమునకు వచ్చు కాలమంతయు ప్రభువు దినము.

**ప్రభువు దిన ప్రారంభము (1-3వ.) :** ప్రభువు దినము అనగా ప్రభువు రెండవ రాకడ సంభవించినదని థెస్సలొనీకయులు తలంచినట్లుంది. పౌలు ఆలాగు పత్రిక వ్రాసాడని, లేదా ఆత్మ వలన ప్రవచనము చెప్పబడినదని ఎవరైనా చెప్పినందున ప్రభువు దినము వచ్చినదని వీరు తలంచిరి. ప్రభువు ఆకాశమండలమునకు రాగా సంఘ మంతయు ఆకాశమండలమునకు వెళ్ళి ఆయన యొద్ద కూడు కొందరు ఏండేండ్ల భూలోకములో శ్రమలు ప్రారంభమగును.. (సంఘము థెస్సలొనీకయ ఆకాశ మండలమునకు వెళ్ళలేదు కాని సంఘమునకు శ్రమలు కలుగుచున్నవని) 1 థెస్స. 3:1 వచన ప్రకారము తెలియుచున్నది. ఈ శ్రమలను బట్టి ప్రభువు దినము వచ్చినదని థెస్సలొనీకయులు తప్పుగా తలంచు చున్నారు. లోకములో భ్రష్టత్వము సంభవించాలి. నాశన పాత్రుడు, పాప పురుషుడగు క్రీస్తు విరోధి బయలుపడాలి. క్రీస్తు విరోధి ఆ దినమునకు ముందుగానే భూలోకములో ఉండును కాని క్రీస్తు ఆకాశ మండలమునకు రాగా సంఘము ఎత్తబడిన వెంటనే బయలుపడును.

**ధర్మ విరోధి గుణములు, బయలు పడుట - నాశనమగుట (4-8వ.) :** క్రీస్తు విరోధి బయలుపడి దేవుడనబడి, దేవాలయములో కూర్చుండి పూజింపబడును. ధర్మ విరోధ సంబంధమైన మర్మము మొదటి నుండీ క్రియ చేయుచున్నందున సంఘములకు శ్రమ కలుగుచున్నది. కాని ధర్మ విరోధియగు క్రీస్తు విరోధి ఏడేండ్ల శ్రమల కాల

ప్రారంభములో బయలుపడును. ఏడేండ్ల చివర క్రీస్తు ప్రభువు ప్రకటన 19:8వ. ప్రకారము గొఱ్ఱెపిల్ల వివాహ అనంతరము ఒలీవల కొండపైకి వచ్చి క్రీస్తు విరోధిని ప్రకటన 19:20-21వ. ప్రకారము అగ్ని గుండములో వేయును.

**ధర్మ విరోధి రాక - వివరములు (9-21వ.)** : రక్షణకు అవసరమైన క్రీస్తునందలి ప్రేమను అనుసరించని వారు క్రీస్తు విరోధి రాకను గుర్తించలేరు. క్రీస్తు విరోధి రాక అబద్ధ విషయమైన బలముతోను సూచక క్రియలు, మహత్కార్యములతోను సాతాను కనుపరచు బలముతో నుండును. కనుక రక్షణను నిరాకరించినవారు క్రీస్తు విరోధి రాకడను గుర్తించలేరు. పాపమును ప్రేమించి క్రీస్తును నమ్మనివారు ఆ దినములలో అబద్ధములను నమ్మునట్లు మోసము చేయు శక్తిని దేవుడు వారికి పంపును. అందువలన లోకులకు క్రీస్తు రాకడ వివరములు తెలియవు.

**ప్రార్థన - స్తుతి (13-17వ.)** : మానవుల పట్ల దేవుని ఏర్పాటు ఏమిటో వ్రాయబడినది. దేవుని ఆత్మ ద్వారా మనము పరిశుద్ధ పరచబడి రక్షణ **పొందుటకే** దేవుడు మనలను ఏర్పరచుకొనెను. అందులకై దేవుని స్తుతించాలి. ఇది **మన గతకాల స్థితి.**

**14వ వచనము** : మన పిలుపును తెలుపుచున్నది. మనము రక్షించబడి యేసు యొక్క మహిమను పొందుటకై దేవుడు మనలను పిలిచాడు. 2 కొరింథీ. 3:18వ ప్రకారము మహిమ నుండి అధిక మహిమ పొందుచున్నాము. ఇది **మన ప్రస్తుత కాలస్థితి.** దేవుడు ప్రతి సత్కార్యమునందు, సద్వాక్యమునందు స్థిరపరచును గాక! ఇది మన **భవిష్యత్ కాలస్థితి.** ఈలాగున పౌలు ప్రార్థనలు స్తుతులు విశ్వాసి యొక్క భూత, వర్తమాన భవిష్యత్ కాలములకు చెందినవిగానున్నవి.

## 3వ అధ్యాయము 5+5+5+2=17 వచనములు
## అంశము : పని చేయకుండుటను గూర్చిన సవరణ
## (దిద్దుబాటును గూర్చి భవిష్యత్తుకు హెచ్చరికలు)

**ఒకరికొరకు ఒకరు ప్రార్థన (1-5వ.)** : పౌలు కొరకైన ప్రార్థన. పౌలు ద్వారా ప్రభువు వాక్యము బహు త్వరగా వ్యాపించబడు నిమిత్తము, దుష్టుల చేతులలో నుండి పౌలు తప్పింపబడు నిమిత్తము ప్రార్థించవలెనని కోరుచున్నాడు. 3-5 వచనములలో థెస్స లోనికయులపట్ల, పౌలు ఆకాంక్ష చెప్పబడినది. ప్రభువు కాపాడాలని స్థిరపరచవలెనని దేవునియందలి ప్రేమను, ఓర్పును కలిగియుండవలెనని చెప్పుచున్నాడు.

**మాదిరియైన జీవితమునకు హెచ్చరికలు (6-10వ.)** : పౌలు తన జీవిత మాదిరిని గూర్చి చెప్పుచున్నాడు. తానైతే ఎవరికి భారముగా నుండకూడదని థెస్సలోనికయలో నుండగాను (1 థెస్స. 2:9), ఎఫెసులో నుండగాను (అ.కా. 20:34) కొరింథులో నుండగను (1 కొరి. 4:12) స్వహస్తములతో పని చేసి జీవించాడు. అధికారము లేకకాదని మాదిరిగా ఉండు నిమిత్తమే ఆలాగు చేసాడు. ఎవడైనా పని చేయని యెడల భోజనము చేయకూడదన్నాడు. అక్రమముగా నడుచుకొను వారి నుండి తొలగిపోవలెనని చెప్పుచున్నాడు.

**పని చేయని వారికి హెచ్చరిక (11-15వ.)** మనము ఇతరులకు మేలు చేయాలి కాని, పని చేయక ఇతరుల జోలికి పోవుట అక్రమమని సెలవిచ్చుచున్నాడు. పని చేయని వారిని శత్రువులుగా భావించక సహోదరులుగా భావించి బుద్ధి చెప్పాలి. వినని వారితో అవసరమైతే సాంగత్యము చేయకూడదు.

**ముగింపు - వందనములు (16-17వ.)** : ప్రభువు సమాధానము అనుగ్రహించాలని క్రీస్తు కృప తోడై ఉండాలని ముగించుచున్నాడు.

*గమనిక* : 1) 1 థెస్సలోనికయ పత్రిక ప్రభువు రాకడలోని ఆకాశమండలమునకు వచ్చుటను గూర్చి వివరించుచుండగా 2 థెస్సలోనికయ ప్రభువు రాకడలో భూమి పై జరుగు సంగతులు ప్రభువు భూమి మీదకు వచ్చు సంగతిని వివరించుచున్నది, 2) ప్రభువు రాకడను గూర్చి క్రొత్త నిబంధనలోని 27 పుస్తకములలో 315 పర్యాయములో ప్రస్తావించబడినది. మత్తయి మొదలు, ప్రకటన వరకు ఫిలెమోను పత్రిక, రెండవ మూడవ యోహాను పత్రికలలో తప్ప మిగిలిన అన్ని గ్రంథములలో ప్రభువు రాకడ ప్రస్తావించబడినది.

# తిమోతికి వ్రాసిన రెండు పత్రికలు

తిమోతికి పత్రికలు : తిమోతి లుస్త్ర పట్టణ నివాసి (అ.కా. 16:1-2వ.) అవ్వలోయి తల్లి యూదురాలైన యునీకె, తండ్రి గ్రీసు దేశస్థుడు. బాల్యము నుండి పరిశుద్ధ లేఖనములను ఎరిగినవాడు. అవ్వ, తల్లి విశ్వసించినవారు.

పౌలు మొదటి యాత్రలో లుస్త్ర పట్టణములో (అ.కా. 14:9) రాళ్ళతో కొట్టబడిన సందర్భమున తిమోతి క్రీ.శ. 47లో రక్షింపబడి 2 తిమోతి 3:10 ప్రకారము పౌలును వెంబడించెను. క్రీ.శ. 47-50 మధ్య తర్వాత లుస్త్ర, ఈకొనియ సహోదరుల వలన మంచి పేరు పొందినవాడు.

అ.కా. 16:3-5 వచనాల ప్రకారము పౌలుతో కలసి సంఘములను స్థిరపరచి, క్రొత్త సంఘము స్థాపనలో పాత్రకలవాడు. 1 థెస్స. 3:1, ఫిలిప్పీ. 2:20 ప్రకారము సహోదరుల క్షేమము విషయమై నిజమైన చింతగలవాడు. 1 తిమోతి 5:22 ప్రకారము కడుపు జబ్బు, తరచుగా వచ్చు ఇతర శరీర బలహీనతలు కలవాడు. 2 తిమోతి 1:7ను బట్టి పిరికితనము గలవాడని తలంచగలము. నమ్మకమైన వాడని పౌలు యొక్క జతపనివాడని పిలువ బడెను.

క్రీ.శ. 61-62లో పౌలు రోములోని చెరలోనుండెను. విడుదల పొందిన పిమ్మట తిమోతితో కలసి పౌలు ఎఫెసునకు వెళ్ళెను. సత్యమునకు భిన్నమైన బోధలు అక్కడ ఉన్నందున వాటిని సవరించుటకై తిమోతిని ఎఫెసులో విడిచి మాసిదోనియాకు వెళ్ళెను. (1 తిమోతి 1:3-4వ.) తదుపరి జీవముగల దేవుని సంఘములో జనులు ఏలాగు ప్రవర్తింప వలెనో తెలుపు నిమిత్తము ఈ మొదటిపత్రిక క్రీ.శ. 63లో వ్రాసెనని 3:14-15 వచనములలో చూచుచున్నాము. సంఘములో ప్రకటన, ప్రార్థన, పాలన, పరిచర్య, పవిత్రత ప్రయాస వరుసగా 1-6 అధ్యాయముల సారాంశము. పౌలు మరలా రెండవసారి రోములోని చెరలో క్రీ.శ. 65-66లో నుండి తన నిర్యాణ కాలము సమీపించినపుడు తిమోతికి రెండవ పత్రిక వ్రాసెను. కావున రెండవ పత్రిక క్రీ.శ. 66లో వ్రాసెనని తలంచగలము. ఈ పత్రికయందు క్రీస్తు యొక్క పనివాడు కలిగియుండవలసిన గుణములను, పోలికలను, మెలుకువలను. పోరాటమును గూర్చి 1,2,3,4 అధ్యాయములలో వ్రాసెను. ఇది పౌలు వ్రాసిన చివరి పత్రిక. క్రీ.శ. 67లో నీరో చక్రవర్తిచే పౌలు శిరచ్ఛేదమును చేయబడెను. తిమోతి చివరి దినముల వరకు ఎఫెసులో సంఘ పెద్దగానుండెను.

ఎఫెసులో అర్తెమిదేవి గుడి సమీపమున జరుగు తిరునాళ్ళలలో విగ్రహారాధనకు వ్యతిరేకముగా బోధించుచుండగా దుడ్డుకర్రలతో కొట్టబడి క్రీ.శ. 67లో చంపబడ్డాడు. కాన్‌స్టాంటినోపిల్ పట్టణమందు అతని ఎముకలు పాతి పెట్టబడినవి. తిమోతి అను పేరుకు దేవుని ఘనపరచువాడు అని అర్థము. తిమోతి జీవితమందు సహోదరుల వల్ల సేవకు పంపబడుట, మంచి పేరు పొందినవాడు కనుక సంఘములోని జనుల ప్రవర్తనను గూర్చి పనివారి ప్రవర్తన గురించి తిమోతి మొదటి పత్రికలోను రెండవ పత్రికలోను వరుసగా పౌలు వ్రాసెను. తిమోతి ప్రియుమైన కుమారుడని 2 తిమోతి 1:1లో నేర్చుకొనుచున్నాము.

# తిమోతికి వ్రాసిన మొదటి పత్రిక

గ్రంథకర్త : పౌలు . **కాలము** : క్రీ.శ. 63 స్థలము : మాసిదోనియా.

**ముఖ్య ఉద్దేశము** : సంఘంలో జనుల ప్రవర్తన (3:14)

**అధ్యాయాల విభజన** : ఎ. 1-3 అధ్యా. బోధ. 1 అ. ప్రకటన, 2 అ. ప్రార్థన, 3. అ. పాలన, బి. 4-6 అధ్యా. నడక. 4 అ. పరిచర్య 5 అ. పవిత్రత - పై విచారణ, 6 అ. ప్రవర్తన ప్రయాసను గూర్చిన హెచ్చరికలు.

## 1వ అధ్యాయము 2+2+3+4+6+3=20 వచనములు
## అంశము : సంఘములో ప్రకటన

**శుభములు (1-2వ.)** : సంఘములోని ప్రవర్తన గూర్చి వ్రాయుచున్నందున పౌలుతన అధికారమునకు గుర్తుగా తనను అపొస్తలుడుగా పరిచయం చేసుకొన్నాడు. దేవుడు మనకు రక్షణ ఇవ్వగా క్రీస్తు యేసు సంఘమునకు రక్షణ అని తెలుపుచున్నాడు.

**ప్రకటనలో చేయకూడనివి (3-4వ.)** : మాసిదోనియా వెళ్ళుచుండగా అని ఉన్నందున పౌలు మాసిదోనియాకు వెళ్ళిన పిదప మాసిదోనియా నుండి రోములోని రెండు చెరల మధ్య కాలమున బహుశ క్రీ.శ. 63లో ఈ పత్రిక వ్రాసెను అ.కా. 20:28-31 వరకు వంకర మాటలు పలుకు మనుష్యులు మీలోనే బయలుదేరుదురని ఎఫెసీ. సంఘ పెద్దలకు చెప్పెను. ఆ ప్రకారమే సంఘములో సత్యమునకు భిన్నమైన బోధలు, కల్పనా కథలు, మితములేని వంశావళులు ఉన్నందున అవి ఉండకూడదని హెచ్చరించెను. 5-7వ.

**ప్రకటనలోని సారాంశము** : 1. పవిత్ర హృదయము మంచి మనస్సాక్షి. కపటములేని విశ్వాసము నుండి కలుగు ప్రేమను కలిగి ప్రకటించాలి. కాని కొందరు వీటిని మానుకొని నిష్ప్రయోజనమైన ఉపదేశకులై ఉన్నారని తెలుపుచున్నాడు. 8-11వ. ప్రకటనలో

ధర్మశాస్త్రం ఉపయోగించు విధము : ధర్మశాస్త్రము పాపమును చూపించుచున్నది కనుక పాపములో ఉన్నవారికి నియమించ బడింది. నీతిమంతులు దానిని ధర్మానుకూలముగా ఉపయోగించుట మేలుకరము అని చెప్పాడు.

**ప్రకటించిన పరిచర్యకు నియమించబడిన పౌలు (12-17వ.)** : పౌలు పూర్వము దూషకుడు హానికరుడు హింసకుడై పాపులలో ప్రధాన పాపియైనను దేవుడు రక్షించి తల్లి గర్భములో పడినపుడే తన సేవకు ప్రత్యేకపరచి నియమించాడు. (గలతీ. 1-15) (పౌలు జీవితచరిత్ర ప్రారంభములో చూడండి)

**తిమోతికి హెచ్చరికలు (18-20వ.)** : హుమెనైయును, అలెక్సుంద్రును మంచి మనస్సాక్షిని త్రోసివేసి విశ్వాస విషయములో ఓడ బద్దలైపోవు వానివలె అపాయకరమైన పరిస్థితిలో ఉన్నారు. తిమోతి అలా ఉండక మంచి మనస్సాక్షి విశ్వాసము కలవాడై మంచి పోరాటము పోరాడవలెనని చెప్పుచున్నాడు.

## 2వ అధ్యాయము 7+1+7=15 వచనములు
## అంశము : సంఘములో ప్రార్థన

**విభజన - ప్రార్థన (1-7వ.)** : ఎవరికొరకు ప్రార్థన చేయవలెనో 2వ.లో చెప్పుచున్నాడు. ఏ రీతిన ప్రార్థించాలో 2వ.లో చెప్పుచున్నాడు. ప్రార్థించుట ద్వారా మనకు ఏమి కలుగునో 1వ.లో చెప్పుచున్నాడు. ప్రార్థనా ఉద్దేశమును దేవుని ఇష్టమును 3-4వ.లో తెలుపుచున్నాడు. మనుష్యులందరి రక్షణ కొరకు యేసుక్రీస్తు నరుడై మధ్యవర్తియై తన్నుతాను విమోచన క్రయ ధనముగా సమర్పించుకొనినందున అట్టి కార్యము నిమిత్తమై మనుష్యులందరి కొరకు ప్రార్థనలు విజ్ఞాపనలు (పట్టుదలతో కూడిన ప్రార్థన) యాచనలు, (బిచ్చగాడివలె బ్రతిమిలాడుట), కృతజ్ఞతాస్తుతులు. (దేవుడు జవాబు ఇచ్చునని నిరీక్షణ కలిగి స్తుతించడం)

**సంఘములో పురుషుల - స్త్రీల ప్రార్థనా పద్ధతి (8-9వ.)** : పురుషులు స్త్రీలు వ్యక్తి గతముగా ఇంటిలోను ప్రార్థించినను సంఘము కూడు ప్రతి స్థలములోను పురుషులు పవిత్రమైన చేతులెత్తి ప్రార్థించాలి. స్త్రీలు అణకువగా ఉండాలి. అనగా స్త్రీలు సంఘములో గట్టిగా ప్రార్థించరాదు. పురుషులు పవిత్రత కలిగి కోపము సంశయములు లేనివారై ప్రార్థించాలి.

**సంఘములలో స్త్రీలు అనుసరించవలసిన పద్ధతి (9:5వ.)** : స్త్రీలకు సత్క్రియలే నిజమైన అలంకరణ బాహ్యమైన అలంకరణను అలంకరించుకొన కూడదు, సంఘము

లలో స్త్రీలకు ఉపదేశించడం కాని పురుషునిపై అధికారం చేయుటకు కాని సెలవు లేదని చెప్పుచున్నాడు. స్త్రీలు స్వస్థబుద్ధి కలిగి విశ్వాసము ప్రేమ పరిశుద్ధతల యందు నిలకడగ ఉండవలెనని చెప్పుచున్నాడు. దీని వివరణగా సృష్టి క్రమములో మొదట ఆదాము తరువాత హవ్వ నిర్మించబడిరని స్త్రీ మోసపరచబడి అపరాధములో పడెను. ఆదాము మోసపరచబడలేదు. అపరాధ పరిహారార్థ బలిలో నష్టమును భరించినట్లు (లేవి. 6:4-5) స్త్రీలు ఆ క్రమమును పాటించవలెను. (స్త్రీల పరిచర్యను గూర్చి 1 కొరింథీ. 14:34వ.లో చెప్పబడినది)

## 3వ అధ్యాయము 7+6+3=16 వచనములు
## అంశము : సంఘములో పాలన

**విభజన - పెద్దలను గూర్చి విధి (1-7వ.)** : అ.కా. 20:28-31వ.లలో పెద్దలు తాము ప్రవర్తన విషయములోను మంద యొక్క ప్రవర్తన విషయములోను జాగ్రత్తగా ఉండాలి. అధ్యక్షులు, పెద్దలు, కాపరులు పై విచారణ కర్తలు అను పదములన్నియు పెద్దలను సూచించును. పెద్దయగువాడు 1) వ్యక్తిగతంగా నిందా రహితుడుగాను, 2) కుటుంబముగా ఏకపత్నీ పురుషుడు, తమ పిల్లలను స్వాధీన పరచుకొనువాడు, తన ఇంటివారిని బాగుగా ఏలువాడుగా ఉండాలి, 3) సమాజములో మితానుభవము గలవాడుగాను, స్వస్థబుద్ధి గలవాడుగాను, మర్యాదస్థుడుగాను ఉండి మద్య పానీయు, కొట్టువాడు జగడమాడువాడు కాక ధనాపేక్ష లేనివాడై సాత్వికుడుగాను ఉండాలి, 4) సంఘములో బోధింప తగినవాడుగాను, అతిథి ప్రియుడుగాను ఉండాలి సంఘములో క్రొత్తగా చేరినవాడై యుండకూడదు, 5) సంఘమునకు వెలుపటి వారి ద్వారా మంచి సాక్ష్యము పొందినవాడుగాను ఉండాలి.

**పరిచారకులను గూర్చిన విధి (8-13వ.)** : పరిచర్య చేయువారు ఇంచుమించుగా పైన చెప్పబడిన గుణములనే కలిగియుండాలి. పరిచారకుల గుణములు అ.కా. 6:1-6వ.లలో చెప్పబడినవి. పరిచర్య చేయుటలో స్త్రీలు కూడ ఉండుట గమనించగలము. కెంక్రేయలో ఫీబే సంఘ పరిచారకురాలుగా ఉన్నదని రోమా. 16:1 నుంచి నేర్చుకొనుచున్నాము.

**పత్రిక సారాంశము (14-16వ.)** : నిరాక్షేపమైన దేవుడు ఆయన యందుంచవలసిన భక్తి 1:3వ.లో తిమోతిని ఎఫెసులో విడిచిన పోలే శీఘ్రముగా ఎఫెసుకు వెళ్ళవలెనని

తలంచెను కాని ఆలస్యమైన యెడల సంఘములలో జనుల ప్రవర్తన అను అంశమును ఈ గ్రంథముగా వ్రాసిపంపెను. యేసుక్రీస్తు క్రింద చెప్పబడిన విషయములను బట్టి ఎవరును ఆక్షేపింపని దేవుడు. జనులందరు ఆయనయందు భక్తిని ఉంచాలి.

1. ఆయన నశరీరుడుగా ప్రత్యక్షమైయెను. హెబ్రీ. 2:14, హెబ్రీ. 10:5, 10వ. యోహాను 1:1-14వ. హెబ్రీ. 9:26వ.

2. ఆత్మ విషయమున నీతిపరుడు దేవుడు అని తీర్పు పొందెను. రోమా 3:11వ. యెషయా 53:11వ, యోహాను 8:46వ, హెబ్రీ. 7:26వ.

3. దేవదూతలకు కనబడెను. లూకా 2:9వ, మత్తయి 1:13వ, అ.కా. 9:1వ.

4. రక్షకుడని జనములలో ప్రకటింపబడెను. మత్తయి 1:21వ, లూకా 2:9వ. 1 తిమోతి 4:10వ, మత్తయి 28:19వ.

5. లోకమందు నమ్మబడెను. యోహాను 12:19, ఫిలిప్పీ, 3:10.

6. ఆరోహణుడు. అ.కా. 1:9, కొలస్స. 3:1.

7. తేజోమయుడైను. ప్రకటన 1:16, 21:23.

## 4వ అధ్యాయము 6+4+6=16 వచనములు
## అంశము : సంఘములో పరిచర్య

**విభజన - మంచి పరిచారకుడుగా దైవభక్తిని అనుసరించుట - ప్రకటించుట (1-6వ.):** కడవరి దినములలో దయ్యముల బోధయందు లక్ష్యముంచువారు అబద్ధికుల వేషధారణ వలన మోసపోవువారు విశ్వాస భ్రష్టులగుదురు. కనుక మంచి పరిచారకుడు దయ్యముల బోధయందు కాక విశ్వాస సుబోధ సంబంధమైన వాక్యము చేత ఎదగాలి. ఈ మంచి బోధను సహోదరులకు వివరించాలి. ఇది మంచి పరిచారకుల లక్షణము.

**ప్రయోజనకరమైన పరిచారకుడుగా దైవభక్తిని సాధకము చేయుట (7-10వ.) :** లోకమందున్న శరీర సంబంధమైన సాధకముగుట కొంచెము మట్టుకే ప్రయోజనము కాని దైవభక్తి ఇప్పటి జీవము విషయములోను రాబోవు జీవము విషయములలోను ప్రయోజనకరమైనది. కనుక దైవభక్తిని ప్రయాసముతో సాధకము చేసుకొనుటయందు పాటుపడాలి.

**అభివృద్ధినొందు పరిచారకుడుగా బోధయందు జాగ్రత్తగానుండుట (11-16వ.)** : పరిచారకుడు ఎవరిచేత తృణీకరింపబడకూడదు, 1. మాటయందు, 2. ప్రవర్తనయందు, 3. ప్రేమయందు, 4. విశ్వాసమందు, 5. పవిత్రతలో మాదిరిగా ఉండాలి.

1. లేఖనము చదువుటయందు, 2. హెచ్చరిక చేయుటయందు, 3. బోధించుట యందు జాగ్రత్తగా ఉండాలి, 4. అభివృద్ధి అందరికి తేటగా కనిపించాలి. 5. నిలకడగా ఉండాలి ఇవియే అభివృద్ధికి గల పరిచారకుని లక్షణాలు.

## 5వ అధ్యాయము 3+5+5+3+4+5=25 వచనములు
## అంశము : పవిత్రత పై విచారణ ప్రయాసను గూర్చిన హెచ్చరికలు

**విభజన - అందరిని హెచ్చరించుట (1-3వ.)** : సంఘములలో పొరబాటులు జరిగినపుడు అన్నదమ్ములని యౌవనస్తులను, అక్కచెల్లెండ్రని పూర్ణ పవిత్రతో యౌవన స్త్రీలను, తల్లులని వృద్ధ స్త్రీలను హెచ్చరించాలి. వృద్ధులయితే తండ్రులుగా భావించి గద్దింపక హెచ్చరించాలి.

**విధవరాండ్రుల పోషణ, పవిత్రతను, గూర్చిన హెచ్చరిక (4-8వ.)** : విధవరాలికి పిల్లలుగాని మనుమలుగాని యుండిన యెడల వీరు తమ తల్లిదండ్రులకు ప్రత్యుప కారము చేయాలి. స్వకీయులను పోషింపలేనివాడు అవిశ్వాసికంటే చెడ్డవాడు. అనాధులైన విధవరాలు దేవునియందు నిరీక్షణ కలిగి ప్రార్థనలో నిత్యము నిలకడగా ఉండాలి. సుఖభోగములయందు ప్రవర్తింపకూడదు.

**విధవరాండ్రుగా లెక్కించువారు (9-13వ.)** : అరవైయేండ్ల కంటే తక్కువ వయస్సు లేక (పని చేయుటకు తగిన శక్తిలేనివారు) ఒకే పరుషునికి భార్య అయి ఉండి మంచి క్రియల యందు పేరుపొంది తన జీవిత కాలములో పిల్లలను పెంచి పరదేశులకు ఆతిథ్యమిచ్చి పరిశుద్ధుల పాదములు కడిగి శ్రమపడువారికి సహాయము చేసే వ్యక్తి అయి ఉండాలి. ఇటువంటి విధవరాలికి సంఘము సహాయము చేయవలెను. యౌవనస్తులైన విధవ రాండ్రను ఈ లెక్కలో చేర్చకూడదు.

**యౌవ్వన స్త్రీలకు హెచ్చరికలు (14-16వ.)** : యౌవన స్త్రీలు వివాహము చేసుకొని విరోధికి అవకాశము ఇవ్వకుండా ఇంటిలోను బయటను జాగ్రత్తగా ఉండాలి. ఇంతకు ముందే కొంతమంది తప్పిపోయి ఉండిరి. విశ్వాసరాండ్రయిన స్త్రీలు తమ ఇంటికి చెందిన విధవరాండ్రకు సహాయము చేయవలెను కాని వారిని సంఘమునకు భారముగా ఉంచకూడదు.

**పెద్దలను గూర్చిన హెచ్చరికలు (17-20వ)** : బాగుగా పాలన చేయు పెద్దలను వాక్యమందును ఉపదేశమందును ప్రయాసపడు వారిని సంఘము రెట్టింపు సన్మానమునకు పాత్రులుగా ఎంచాలి. పని చేయు పెద్దల అవసరములను సంఘములోని సహోదరులు తీర్చాలి. సర్వ సాధారణంగా పెద్దలు తమ అవసరముల కొరకై కష్టపడి పని చేయుదురు. 18వ.లో పనివాడు తన జీతమునకు పాత్రుడు అని ఉన్నందున పని కొరకై అ.కా. 13:2 ప్రకారము ప్రత్యేకించబడిన పనివాని గూర్చి 18వ. వచనములో చెప్పబడినది అని గుర్తించవలెను. ప్రత్యేకించబడిన పనివాడు పెద్దగా నుండిన యెడల వాని అక్కరలు సంఘము తీర్చాలి. పాపము చేయువారిని గద్దించాలి కాని పెద్ద మీద సాక్షులు ఉంటే తప్ప ఏ దోషము ఆరోపించకూడదు.

**తిమోతికి హెచ్చరికలు (21-25వ.)** : సంఘములోని ఏ పరిచర్య అయినను పక్షపాతముగానైన విరోధ భావముతో చేయక పవిత్రుడుగా ఉండవలెనని హెచ్చరించెను. తిమోతి ఇప్పుడు ఎఫెసులో ఉన్నను తరుచుగా కడుపునొప్పి శరీర బలహీనతలు కలిగి యున్నాడు. పౌలు ఎఫెసులో ముందుగా మూడేండ్లు పని చేసినపుడు అనగా క్రీ.శ. 56లో అతని చేతిగుడ్డలు కాని నడికట్టులు కాని ఎవరికైన తగిలిన యెడల వారి జబ్బులు బాగయ్యెను. తిమోతి ఇప్పుడు ఎఫెసులోనున్నను పౌలు ఆలాగు చేయక ద్రాక్షరసమును పుచ్చుకొనుమనుటలో స్వస్థత వరములు శాశ్వతము కాదని తెలుసుకొనవలెను. దేవుడు తన శక్తిని బట్టి ఎట్టివారినైనను ఏ సమయములోనైనను స్వస్థపరచగలడు అని గుర్తించుకొనవలెను, కాని ఆ వరములు శాశ్వతము కావు.

## 6వ అధ్యాయము 2+4+4+4+2+3+2=21 వచనములు
## అంశము : ప్రయాసను గూర్చి హెచ్చరిక

**దాసులకు హెచ్చరిక (1-2వ.)** : సమాజములో దాసులుగా ఉన్నవారు తమ యజమానులు పూర్ణమైన ఘనతకు పాత్రులని ఎంచవలెను. ఒకవేళ యజమానులు విశ్వాసులైతే సహోదరులని తృణీకరించక, సేవాఫలము పొందువారు ప్రియులు కనుక మరి ఎక్కువగా సేవ చేయాలి లేనియెడల దేవుని నామము ఆయన బోధ దూషించబడును.

**వ్యర్థముగా ప్రయాసపడు వారికి హెచ్చరికలు (3-6వ.)** : దైవభక్తికి అనుగుణమైన బోధను అంగీకరింపక దైవభక్తిని లాభ సాధనము అనుకొని భిన్నమైన బోధలు ఉపదేశించు

వారు కలరు. అట్టి వారి ప్రయాసము వ్యర్థము దాని వలన అసూయలు, కలహములు, దూషణలు, దుర్మణములు చెడిన మనస్సు కలుగును, కాని సంతుష్టి సహితమైన దైవభక్తి గొప్ప లాభసాధనమే!

**ధనవంతులగుటకు అపేక్షించు వారికి హెచ్చరిక (7-10వ.)** : మనము ఈ లోకము లోనికి ఏమియు తీసుకొనిరాలేదు. కనుక లోకములో నివసించునంత కాలము దేవుడిచ్చిన అన్న వస్త్రములు కలవారమై సంతృప్తి కలిగియుండుట నేర్చుకోవాలి కాని ఈ లోకములో ధనవంతులగుటకు అపేక్షించువారు శోధనలలో పడి దురాశలకులోనై నష్టమును నాశనమును తెచ్చుకొందురు. కొందరు ధనమును అపేక్షించి విశ్వాసము నుండి తొలగిపోయిన వారు కలరు. కనుక ధనాపేక్ష సమస్త కీడులకు మూలము.

**దైవజనుడైన తిమోతికి హెచ్చరిక (11-14వ.)** : దైవజనుడు పైన చెప్పబడిన వాటిని విసర్జించి నీతిని భక్తిని విశ్వాసమును ప్రేమను ఓర్పును సాత్వికమును సంపాదించు కొనుటకు ప్రయాసపడుచు క్రీస్తు ప్రత్యక్షమగు వరకు నిష్కల్మషముగాను నిందా రహితముగాను జీవించాలి. 2 తిమోతి 3:16లో దైవజనుడు ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడియుండాలని ప్రతి లేఖనము ఉపదేశించుట ఖండించుట తప్పు దిద్దుట నీతియందు శిక్ష చేయవలెనని చెప్పుచుండవలెను.

**ప్రభువు ఔన్నత్యమును గూర్చి హెచ్చరిక (15-16వ.)** : యేసు ప్రభువు 1) శ్రీమంతుడు, 2) అద్వితీయుడు, 3) సర్వాధిపతి, 4) రాజులకు రాజు, 5) ప్రభువులకు ప్రభువు, 6) సమీపింపరాని తేజస్సులో నివసించువాడు, 7) అమరత్వము కలవాడు. 8) ఘనత కలవాడు, 9) ప్రభావము కలవాడు అని ప్రభువును గురించి చెప్పుచున్నాడు.

**ధనవంతులైన వారికి హెచ్చరిక (17-19వ.)** : ఈ లోకమందు ధనవంతులగు వారు ధనమునందు నమ్మికయుంచక దేవునియందే నమ్మికయుంచాలి. ఆయనే మనకు సుఖమును అనుభవించుటకు, సమస్తమును మనకు ధారాళముగా దయచేయువాడు. కనుక తమ ధనములో ఇతరులకు పాలిచ్చుచూ సత్క్రియ అను ధనము కలిగి రాబోవు కాలమునకు మంచి పునాది వేసుకొనవలెను.

**ముగింపులో తిమోతికి హెచ్చరికలు (20-21వ.)** : 1) దేవుడు అప్పగించిన దానిని కాపాడాలి, 2) అపవిత్రమైన మాటలకు అబద్ధముగా చెప్పబడిన విపరీత వాదములకు దూరముగా ఉండాలి. ఆ విషయములో కొందరు ప్రవీణులమనుకొని విశ్వాస విషయములో తప్పిపోయిరని హెచ్చరించెను.

# తిమోతికి వ్రాసిన రెండవ పత్రిక

గ్రంథకర్త : పౌలు . కాలము : క్రీ.శ. 66 స్థలము : రెండవరోములోని చెర.

**ముఖ్య ఉద్దేశము** : క్రీస్తు యొక్క పనివాడు.

పౌలు రోముకు చెరకు వెళ్ళినపుడు అ.కా. 28:21వ వచనములో "నిన్ను గూర్చి చెడుతనము తెలియపరచలేదు" అని ఉన్నది. కాని 2 తిమోతి 2:9లో "నేను నేరస్థుడనై యున్నట్లు సువార్త విషయమై సంకెళ్ళతో బంధింపబడి, శ్రమ పడుచున్నాను" అన్నాడు. అందువలన రోములో రెండు పర్యాయములు చెరలోనున్నట్లు తలంచగలము. ఫిలేమోను 24వ. దేమా జతపనివాడని ఉన్నది. కాని 2 తిమోతి 4:10లో దేమా ఇహ లోకములోనికి వెళ్ళెనని ఉన్నది. ఈ మాటలను బట్టియు ఫిలేమోను పత్రిక రోములోని మొదటి చెరలో వ్రాయబడెనని, 2 తిమోతి రెండవ చెరలో క్రీ.శ. 66లో వ్రాయబడెనని గమనించగలము. ఈ రెండు చెరల మధ్యనున్న వ్యవధికాలములో 1 తిమోతి పత్రిక, తీతు పత్రికలందు పౌలు ప్రయాణ వివరములు కలవు. కనుక 1 తిమోతి పత్రిక, క్రీ.శ. 63లోను, తీతు పత్రిక, క్రీ.శ. 64లోను విడుదల కాలమందు వ్రాయబడెనని గ్రహించు చున్నాము.

గ్రంథ **విభజన** : 1 అ. పనివాని గుణములు, 2 అ. పనివాని పోలికలు, 3 అ. పనివాని మెలుకువలు, 4 అ. పనివాని పోరాటం.

## 1వ అధ్యాయము 2+6+6+4=18 వచనములు

## అంశము : పనివాని గుణములు

**శుభములు (1-2వ.)** : ఈ పత్రికలో సంఘములలో విశ్వాస విషయమైన భ్రష్టత్వము ప్రవేశించినదని చెప్పుచున్నందున పనివాడు చేయవలసిన కార్యములను చెప్పుచున్నాడు కనుక తన అపొస్తలత్వమును అనగా తన అధికారమును జ్ఞాపకము చేయుచున్నాడు.

**పనివాని యొక్క 7 గుణములు (3-8వ.)** : 1) 4వ. నిష్కపటమైన విశ్వాసము కలవాడు, 2) 3వ. కన్నీటి ప్రార్థన చేయువాడు, 3) 6వ. కృపావరము ప్రజ్వలింప చేయువాడు, 4) 7వ. పిరికితనము లేనివాడు, 5) 8వ. సువార్త నిమిత్తము శ్రమపడువాడు, 6) 8వ. సిగ్గుపడని వాడు, 7) 8వ. శ్రమానుభవములో పాలివాడు.

**పనివాని యొక్క మరో "7" గుణములు (9-14వ.)** : 1) 10వ. పరిశుద్ధమైన పిలుపుతో పిలువబడినవాడు, 2) 11వ. సువార్త ప్రకటించువాడు, 3) 11వ బోధకుడుగా నియమింపబడినవాడు, 12వ విశ్వాస ప్రేమలు కలవాడు, 4) 12వ. ప్రభువు కాపుదలను రూఢిగా నమ్మువాడు, 5) 13వ. విశ్వాస ప్రేమలు కలవాడు, 6) 13వ. హితవాక్య ప్రమాణం గైకొనువాడు. 7) 14వ. అప్పగింపబడిన దానిని కాపాడువాడు. తన తరువాత తరముల వారికి తాను నేర్చుకొనిన సంగతులు అప్పగించువాడు.

**మాదిరిలేని పనివాడు - మాదిరియైన పనివాడు (15-18వ.)** : 1) 15వ. మాదిరి లేని పనివారైన పుగెల్లు హెర్మొగెనే పౌలును విడిచిపోయిన ఆసియాలోని వారిని గూర్చి చెప్పబడినది. 16-18వ.లలో మాదిరియైన పనివాడగు ఒనేసి ఫోరు యొక్క "6" గుణములు కలవు. 1) రోమా చెరలో.నున్న పౌలు యొద్దకు వచ్చెను. 2) పౌలు సంకెళ్ళను గురించి సిగ్గుపడలేదు, 3) పౌలు కొరకు శ్రద్ధగా వెదికెను, 4) పౌలును కనుగొనెను, 5) అనేక పర్యాయములు ఆదరించెను, 6) ఎఫెసులో కూడా పౌలుకు ఉపచారము చేసెను. ఇట్టివారు ప్రభువు వలన కనికరము పొందుదురు. ఈ అధ్యాయములో పనివారికి ఉండవలసిన "20" గుణములు కలవు.

## 2వ అధ్యాయము 6+7+6+7=26 వచనములు
## అంశము : పనివాని పోలికలు

**విభజన - పనివాని సామర్థ్యము నమ్మకత్వమును గూర్చిన '6' పోలికలు (1-6వ.)** : 1) 1వ. బలవంతుడు, 2) 2వ. తాను వినిన సంగతులు తన తరువాత రానున్న మూడు తరములకు అప్పగించబడు ఏర్పాటు చేసినవాడు, 3) 3వ సైనికుడు, 4) 4వ జీవన వ్యాపారములలో చిక్కుకొననివాడు, 5) 5వ నియమము ప్రకారము పోరాడి కిరీటము సంపాదించుకొను జెట్టియైనవాడు, 6) 6వ పాటుపడు వ్యవసాయకుడు.

**పనిని గూర్చిన ఆలోచన (7-13వ.)** : 1) 8వ. మన కొరకు మృతిపొంది తిరిగి లేచిన క్రీస్తును జ్ఞాపకము చేసికొనవలెను, 2) 9వ. మనము బంధించబడినను సువార్త బంధించబడకూడదు, 3) 10వ. ఇతరులు రక్షించబడు నిమిత్తము శ్రమలనన్నిటిని ఓర్చుకొనాలి. 4) 11వ మనమాయనతో చనిపోయిన వారమైతే ఆయనతో బ్రతుకుదుము, 5) 12వ మనమాయనతో సహించినవారమైతే ఆయనతో కూడా ఏలుదుము, 6) 12వ మన మాయనను ఎరుగమంటే ఆయన మనలను ఎరుగననును, 7) 13వ. మనము నమ్మలేని వారమైనను ఆయన నమ్మతగినవాడుగా నుండును.

**ఉపదేశించువాడు (14-19వ.)** : 1) 15వ. యోగ్యుడుగానుండాలి, 2) 15వ. సిగ్గుపడ నక్కరలేని పనివాడుగానుండాలి, 3) 16వ. అపవిత్రమైన వట్టి మాటలకు విముఖుడై ఉండాలి, 4) 18వ. ఇతరుల విశ్వాసమును చెరుపువారముగా నుండరాదు, 5) వాక్య సత్యము విషయమై తప్పిపోకూడదు.

**యజమానుడు వాడుకొనుపాత్ర (20-26వ.)** : 1) 21వ. పవిత్రమైన పాత్ర, 2) 21వ ఘనత నిమిత్తమైన పాత్ర, 3) 24వ సాత్వికుడు, 4) 25వ జగడమాడని వాడు, 5) 26వ సాధువు, 6) 26వ సమర్థుడు, 7) 26వ. కీడును సహించువాడు.

## 3వ అధ్యాయము 5+4+4+4=17 వచనములు
## అంశము : పనివాని మెలుకువలు

**పనివాడు విముఖుడుగా నుండవలసినవారు (1-5వ.)** : 1) 2వ. స్వార్థ ప్రియులు, 2) 2వ. ధనాపేక్షులు, 3) 2వ. బింకములాడువారు, 4) 2వ. అహంకారులు, 5) 2వ. దూషకులు, 6) 2వ తల్లిదండ్రులకు అవిధేయులు, 7)2వ. కృతజ్ఞతలేనివారు, 8) 2వ. అపవిత్రులు, 9) 3వ అనురాగ రహితులు, 10) 3వ. అతి ద్వేషులు, 11) 3వ. అపవాదకులు, 12) 3వ. అజితేంద్రియులు, 13) 3వ. క్రూరులు, 14) 3వ. సజ్జన ద్వేషులు, 15) 3వ ద్రోహులు, 16) 3వ మూర్ఖులు, 17) 3వ. గర్వాంధులు, 18) 3వ. దేవుని కంటే సుఖానుభవమును ఎక్కువగా ప్రేమించువారు, 19. 5వ. పైకి భక్తిగలవారువలె నుండి దాని శక్తిని ఆశ్రయించనివారు.

**వారి చర్యలు (6-9వ.)** : 1) 6వ. పాప భరితులుగానుందురు, 2) 6వ. దురాశల వలన నడిపింప బడుదురు, 3) 7వ. ఎల్లప్పుడు నేర్చుకొనుచున్నను, సత్య విషయమైన అనుభవ జ్ఞానము పొందలేనివారు. 4) 7వ. అవివేక స్త్రీల ఇండ్లలో చొచ్చినవారిని చెరపట్టు కొనిపోదురు, 5) 8వ. ఎదిరించుదురు, 6) 8వ. చెడిన మనసు కలిగియుందురు. 7) 8వ. విశ్వాస విషయమై భ్రష్టులుగా నుందురు. 8) 8వ. సత్యమును ఎదిరింతురు, 9) 9వ. అవివేకము తేటపడును, 10) 9వ. ముందుకు సాగలేరు.

**సద్భక్తితో బ్రతుకుట (10-13వ.)** : పౌలు, లుస్త్ర పట్టణములో మొదటి సేవా యాత్రలో కనుపరచిన సద్భక్తి చెప్పబడినది. 1) పౌలు బోధ, 2) ప్రవర్తన, 3) ఉద్దేశము, 4) విశ్వాసము, 5) దీర్ఘశాంతము, 6) ప్రేమ, 7) ఓర్పు, 8) హింసలు సహించుట, సద్భక్తితో బ్రతుకువారు పై గుణములను కలిగియుండాలి.

**సద్భక్తిని బోధించుట(14-17వ.)** : పనివాడు సద్భక్తిని బోధించవలెను. కనుక సద్భక్తిని వివరముగా తెలుపు పరిశుద్ధ లేఖనములను తిమోతివలె 1) ఎరుగుచుండాలి, 2) దినదినము నేర్చుకొను చుండాలి, 3) రూఢి అని తెలుసుకోవాలి, 4) వాటియందు తాను నిలకడగా ఉండాలి, 5) లేఖనములను ఉపదేశించుచూ, ఖండించుచూ, తప్పు దిద్దుచూ, నీతియందు శిక్ష చేయుచు సద్భక్తిని బోధించాలి.

## 4వ అధ్యాయము 8+10+4=22 వచనములు
## అంశము : పౌని వాని పోరాటము

**విభజన - పోరాటపు గురియైన కిరీటము (1-8వ.)** : 1,2 వచనములలో పోరాడు వాడు చేయవలసిన పనులను చెప్పుచున్నాడు.

1. వాక్యమును ప్రకటించాలి, 2) అనుకూల సమయమందు ప్రయాసపడాలి, 3) ప్రతికూల సమయమందును ప్రయాసపడాలి, 4) సంపూర్ణ దీర్ఘశాంతముతో ఉపదేశము చేయాలి. ఖండించాలి, గద్దించాలి. బుద్ధి చెప్పాలి. 3-4వ.లలో పనివాని మెలుకువలు చెప్పుచున్నాడు. ఎందుకనగా జనులు హితబోధను సహింపరని తమ దురాశకు అనుకూలమైన బోధకులను పోగుచేసుకొని సత్యమునకు చెవి నివ్వరని కల్పనా కథలకు తిరుగుదురని హెచ్చరించుచున్నాడు. 5-6వ.లలో చివరిగా మరికొన్ని హెచ్చరికలు ఇచ్చుచున్నాడు. మంచి పందెమందు పోరాడువాడు అన్ని విషయములలో 1) మితముగా ఉండాలి, 2) శ్రమపడాలి, 3) సువార్తికుని పని చేయాలి, 4) పరిచర్యను సంపూర్తిగా చేయాలి, 5) అవసరమైతే ప్రాణములను పానార్పణముగా పౌలువలె అర్పించుటకు సిద్ధముగా ఉండాలి. 7-8వ.లలో పౌలు తన ఆత్మీయ పోరాటమును గూర్చి ప్రభువు మంచి పోరాటము పోరాడితివి అని ప్రభువు తీర్పు తీర్చాడని చెప్పుచున్నాడు. అంతము వరకు విశ్వాసము కాపాడుకొన్నాడు. ప్రభువు ద్వారా నీతి కిరీటము పొంద బోవుచున్నాడు. అందరు తనవలె క్రీస్తు దినమందు కిరీటమును పొందవలెననే అపేక్ష కలిగి ఉండవలెనని చెప్పుచున్నాడు.

**పౌలును విడిచి పోయినవారు (9-18వ.)** : దేమా. ఫిలేమోను పత్రిక 24వ. జత పనివాడుగా ఉండెను. కాని ఇహ లోకమును స్నేహించి 1 యోహాను 2:15 ప్రకారము

దేవునికి దూరమై పౌలును విడిచి వెళ్ళిపోయాడు. (4:9వ.) క్రేస్కే గలతీయకు వెళ్ళిపోయెను. తీతు దల్మతియ అనగా యుగోస్లేవియాకు వెళ్ళెను. ఎరస్తు కొరింథిలో నిలిచిపోయెనని 20వ.లో చెప్పెను. అలెక్సంద్రు అను కంచరవాడు పౌలును ఎదిరించెను. కీడు చేసెను. ప్రభువు సిలువకు వెళ్ళినపుడు శిష్యులందరు ప్రభువును విడిచినట్లు ఇపుడు అందరు పౌలును విడిచిపెట్టిరని పౌలు చెప్పుచున్నాడు. 17వ అందరు విడిచినను ప్రభువు తమ ప్రక్కన నిలిచి బలపరచి సింహమగు సాతాను నోట నుండి తప్పించెనని చెప్పెను. లూకా మాత్రమే తన యొద్దనున్నాడు. మార్కు పరిచారము నిమిత్తము ప్రయోజనకరమైన వాడైనందున తమ యొద్దకు తిమోతితో కూడ రావలెనని కోరుకొన్నాడు. అ.కా. 13:13; 15:37-38 మార్కు పరిచర్యలో వెనుకబడి, పౌలు బర్నబాలు వేరగుటకు కారణమాయెను. ఇపుడు మార్కు మార్పుబడి పరిచారకుడాయెను. తుకికును పరిచర్య కొరకై పౌలు ఎఫెస్సునకు పంపెను.

**ముగింపు ఆశీర్వాదము (19-22వ.)** : త్రోపిము రోగి అయినందున మిలేతులో విడిచితిని అనుచున్నాడు. స్వస్థపరచితిని అనలేదు. ఎఫెసు పట్టణంలో తాను అనేకులను స్వస్థపరచెను. అ.కా. 19:12. కాని ఇపుడు తాను ప్రేమించు త్రోఫిముకు స్వస్థత కలుగలేదు. కనుక స్వస్థతలు అప్పుడప్పుడు జరుగుచున్నను, నిత్యము జరుగవని తెలుసుకోవాలి. ఆది సంఘమునకు దేవుడిచ్చిన స్వస్థత వరము బైబిల్ వ్రాయబడిన కాలములోనే నిలిచి పోయినదని గుర్తించ వలెను. తన వందనములు సహోదరుల వందనములు చెప్పుచు గ్రంథమును ముగించెను.

# తీతు పత్రిక

గ్రంథకర్త : పౌలు . కాలము : క్రీ.శ. 64 స్థలము : నికొపొలి మార్గము (3:12)

ముఖ్య ఉద్దేశము : సంఘములో (3:12) పాలన - ప్రవర్తన.

**తీతు పత్రిక** : క్రీ.శ. 63-64లో రోములోని చెర నుండి విడుదల పొందిన సమయములో ఈ పత్రిక క్రీ.శ. 64లో నికొపొలి మార్గమందుండి వ్రాసెను. గలతీ. 2:3లో తీతు అన్యుడుగా కనిపించును. పౌలు పరిచర్యలో రక్షింపబడెను (2 తిమోతి 1:1) కాని ఇతరులు సున్నతి అవసరమని బలవంతపెట్టి సున్నతి చేసిరి. (గలతీ. 2:2-3). క్రేతులో పౌలు సేవకు వెళ్ళుచూ తీతును వెంటబెట్టుకొని వెళ్ళెను. సంఘములో లోపములను దిద్దుటకై తీతును అక్కడే ఉంచి తాను ముందుకు వెళ్ళిపోయెను. తదుపరి తీతు 3:12 ప్రకారము పౌలు నికొపొలి మార్గమందున్నప్పుడు ఈ పత్రిక వ్రాసెను. క్రీ.శ. 64లో వ్రాసినట్లు తలంచగలము. తీతు అను పేరుకు పెంచువాడు అని అర్థము. అందుకొరకే కాబోలు పౌలు దిద్ది, పెంచి, పాలించుటను గురించిన విధులు తీతుకు తెలిపెను. తీతును పౌలు తనకు నిజమైన కుమారుడని 1:2లో చెప్పుటలో తీతు యొక్క నమ్మకత్వము కనిపించుచున్నది.

## అధ్యాయాల విభజన

**1వ అధ్యాయము** : సంఘములో పాలన, సంఘములో లోపములు దిద్దుట.

**2వ అధ్యాయము** : సంఘములో సహోదరుల ప్రవర్తన.

**3వ అధ్యాయము** : సమాజములో సహోదరుల ప్రవర్తన.

## 1వ అధ్యాయము 4+5+7=16 వచనములు
## అంశము : సంఘంలో పాలన - లోపములు దిద్దుట

**శుభములు (1-4వ.)** : శుభములు తెలుపుతూ క్రీస్తును నమ్మినవారు విశ్వాసయాత్రలో కొనసాగుటకు అవసరమైన సంగతులు తెలుపుతూ దేవుడు మనకిచ్చిన జీవము నిత్యమైనదని, నిరీక్షణ కలదని తెలుపుచున్నాడు. దేవుని యొక్క అతి ప్రాముఖ్యమైన గుణముగు అబద్ధమాడనేరని స్వభావము గలవాడని తెలుపుచున్నాడు.

**పెద్దల నియామకము - వారి గుణములు (5-9వ.)** : సంఘములలో లోపములు దిద్దబడాలి. సంఘ పరిపాలన జరిగించుటకు పెద్దలు అవసరము. అపొస్తలుడు తాను

కలిగిన అధికారమును బట్టి పెద్దలును నియమించు పనిని తీతుకు అప్పగించుచున్నాడు. అందులకై తాను అపొస్తలుడను అధికారము కలిగినవాడనేనని 1:2లో పరిచయం చేసుకొను చున్నాడు. ఈ దినములలో అపొస్తులు లేరు. కనుక పెద్దలను నియమిచు అధికారము ఎవ్వరికినీ లేదు. పరిశుద్ధాత్మ దేవుడే పెద్దలను నియమించును. పరిశుద్ధాత్మ నియమించిన పెద్దలను సంఘము గుర్తించుట జరుగును. పెద్దలకు ఉండవలసిన గుణములు.

1) నిందారహితుడు, 2) ఏకపత్ని పురుషుడు, 3) దుర్వ్యాపార విషయములో, నేరము మోపబడనివాడు, 4) అవిధేయులు కాక విశ్వాసులైన పిల్లలు కలవాడు, 5) స్వేచ్ఛా పరుడుగా ఉండకూడదు, 6) ముక్కోపిగా ఉండకూడదు, 7) మద్యపానిగా ఉండ కూడదు, 8) కొట్టువాడుగా ఉండకూడదు, 9) అతిధి ప్రియునిగా ఉండాలి, 11) సజ్జన ప్రియుడుగా ఉండాలి, 12) స్వస్థ బుద్ధి కలిగి ఉండాలి, 13) నీతిమంతుడుగా ఉండాలి, 14) పవిత్రుడుగా ఉండాలి, 15) ఆశానిగ్రహం కలిగి ఉండాలి, 16) హితబోధ విషయమై ఇతరులకు బోధించువాడుగా ఉండాలి, 17) ఎదురాడువారి మాటలు ఖండించుటకు శక్తిగలవాడుగా ఉండాలి, 18) ఉపదేశము అనుసరించి నమ్మదగిన బోధను గట్టిగా చేపట్టువాడై ఉండాలి.

**లోపములు దిద్దుట (10-16వ.)** : క్రేతీయులు, దేవుని ఎరుగుదుమని చెప్పుకొందురు గాని వారి క్రియలు ఆలాగు లేవు. వారి క్రియలలో లోపము కలదు. 1) 10వ అవిధేయులు, 2) వదరుబోతులు, 3) మోసపుచ్చువారు, 4) 11వ. ఉపదేశింపకూడని వాటిని ఉపదేశించుచు, కుటుంబములు పాడుచేయువారు, 5) 12వ. అబద్ధికులు, 6) దుష్ట మృగము వంటివారు, 7) సోమరులు, 8) తిండిబోతులు, 9) 13,14వ. కల్పనా కథలవైపు చెవి యొగ్గుచున్నారు, 10) సత్యము నుండి తొలగిపోవు మనుష్యుల కట్టడలను లక్ష్యపెట్టుచున్నారు, 12) 15వ. వారి మనస్సులు, మనస్సాక్షి అపవిత్రత పరచబడినవి, 12) 16వ. అసహ్యులుగా ఉన్నారు, 13) అవిధేయులు, 14) ప్రతి సత్ కార్య విషయములో భ్రష్టులు, 15) తమ క్రియల వలన దేవుని ఎరుగము అనుచున్నారు. ఈ లోపములు దిద్దుటకై పౌలు తీతును క్రేతులో విడిచిపెట్టి వెళ్ళాడు. సంఘములలో సహోదరుల జీవితంలోని లోపములను ఇతరులకు చెప్పక ప్రార్థనా పూర్వకంగా చక్కదిద్దుట ఎంతో అవసరము.

# ౨వ అధ్యాయము ౨+3+3+౨+5=15 వచనములు
## అంశము : సంఘమందు జనుల ప్రవర్తన

**వృద్ధుల ప్రవర్తన (1-2వ.)** : వృద్ధులు 1) మితానుభవముగలవారుగా ఉండాలి, 2) మాన్యులుగా ఉండాలి, 3) స్వస్థ బుద్ధిగలవారుగా ఉండాలి, 4) విశ్వాస, ప్రేమ, సహనమందు లోపములేనివారై ఉండాలి.

**వృద్ధ స్త్రీలు యౌవన స్త్రీల ప్రవర్తన (3-5వ.)** : వృద్ధ స్త్రీలు కొండెకత్తెలుగా ఉండకూడదు, 2) మిగుల మద్య పానాసక్తులుగా ఉండకూడదు, 3) ప్రవర్తనయందు భయభక్తులు కలిగి ఉండాలి. యౌవ్వన స్త్రీలకు అవసరమైన హెచ్చరికలు చేయాలి. యౌవనస్త్రీలు ప్రవర్తన యందు భయభక్తులు కలిగి ఉండాలి, 4) తమ భర్తలను శిశువులను ప్రేమించువారై యుండాలి, 5) పవిత్రులైయుండాలి, 6) ఇంటి పనులు చేసుకొను వారుగా ఉండాలి, 6) మంచివారైయుండాలి, 7) దేవుని వాక్యము దూషింపకుండునట్లు చూసుకోవాలి. స్త్రీల పరిచర్యను గూర్చి 1 కొరింథీ. 14:34వ ధ్యానములో చూడండి)

**యౌవన పురుషుల ప్రవర్తన (6-8వ.)** : 1) స్వస్థబుద్ధి కలిగియుండాలి, 2) పరపక్షమందుండువాడు. మనలను గూర్చి చెడుమాట చెప్పకూడదు, 3) సత్కార్య విషయములో మాదిరిగా ఉండాలి, 4) ఉపదేశము మోసము లేనిదైయుండాలి. నిరాక్షేపమైన హిత వాక్యముతో కూడినదైయుండాలి.

**దాసుల ప్రవర్తన - యజమానుల ప్రవర్తన (9-10వ.)** : దాసులైనవారు 1) యజమానులకు ఎదురు చెప్పకూడదు, 2) ఏమియు అపహరింపకూడదు, 3) సంపూర్ణమైన మంచి నమ్మకము కనుపర్చాలి, 4) అన్ని కార్యములయందు యజమానులను సంతోషపెట్టాలి, 5) యజమానులకు లోబడియుండాలి.

**ప్రవర్తన యొక్క ప్రాముఖ్యత (11-15వ.)** : ప్రవర్తన ఎందుకు ప్రాముఖ్యమైనదో, మన రక్షకుడైన క్రీస్తు ప్రత్యక్షమయిన కారణములను బట్టి తెలియును. 1) మనము భక్తిహీనతను విడిచిపెట్టాలి, 2) ఇహలోక సంబంధమైన దురాశలను విడిచిపెట్టాలి, 3) స్వస్థ బుద్ధితో బ్రతకాలి, 4) నీతితో బ్రతకాలి, 5) సత్ కార్యముల యందు ఆసక్తిగల ప్రజలుగా ఉండాలి. అందులకై ఆయన మనలను సమస్తమైన దుర్నీతినుండి విడిపించాడు. తన కోసము పవిత్రపరచుకున్నాడు. తన సొత్తుగా చేసుకొన్నాడు. అందువలన విశ్వాసులకు ప్రవర్తన ప్రాముఖ్యమైనది. 15వ.లో వీటిని గూర్చి భోధించాలని హెచ్చరించాలని, దుర్బోధను ఖండించాలని, తీతును ఎవ్వరూ తృణీకరించకుండా చూచుకోవాలని హెచ్చరించుచున్నాడు.

# 3వ అధ్యాయము 3+4+4+4=15 వచనములు

## అంశము : సమాజంలో జనుల ప్రవర్తన.

**విభజన - అధికారులకు విధేయత (1-3వ.)** : యజమానులకు లోబడియుండవలెనని దాసులకు 2. అధ్యా. 9-10వ.లో హెచ్చరించాడు. వాటితోపాటు మరికొన్ని హెచ్చరికలు చెప్పుచున్నాడు. అధికారులకు 1) లోబడి విధేయులుగా ఉండాలని మరొకసారి చెప్పుచున్నాడు. 2) ప్రతి సత్కార్యము చేయుటకు సిద్ధపడియుండాలి, 3) మనుష్యులందరి యెడల సంపూర్ణ సాత్వికము కనపరచాలి, 4) ఎవనిని దూషింపకూడదు, 5)జగడ మాడకూడదు, 6) శాంతులుగా ఉండాలి, 7) మునుపటి ప్రవర్తను విడిచిపెట్టాలి.

**దేవుని దయ ప్రత్యక్షమగుట (4-7వ.)** : రక్షించుట, పరిశుద్ధాత్మనుకుమ్మరించుట. 2:11లో సమస్త మనుష్యులకు రక్షణకరమైన దేవుని కృప ప్రత్యక్షమై అని ఉన్నది. 3:4లో రక్షకుడైన దేవుని యొక్క దయయు, ప్రేమయు ప్రత్యక్షమైనవి అని ఉన్నవి. అందువలన రక్షకుడైన యేసుక్రీస్తు ఈ లోకములో ప్రత్యక్షమైనప్పుడు కృపను, ప్రేమను, దయను ప్రత్యక్షపరచెనని గుర్తించాలి. ఆయన కృపామయుడుగాను, దయామయుడుగాను, ప్రేమామయుడుగాను లోకములో చెప్పబడుచున్నాడు. 1) మానవులు పాపులైయుండగా ఎఫెసీ. 1:6. ప్రకారము దేవుడు తన దయను బట్టి మనలను పరిశుద్ధ పరచి కుమారులుగా స్వీకరించవలెనని మనలను ముందుగా తనకోసం నిర్ణయించుకొన్నాడు. 2) మానవుని పాపమును క్షమించుటకు హెబ్రీ. 9:22. ప్రకారము రక్తము చిందించబడాలి. రక్తము చిందించుటకై మొదటి యోహాను 3:16 ప్రకారం క్రీస్తు తన ప్రేమను బట్టి మన కొరకు ప్రాణము పెట్టి తన రక్తమంతటిని చిందించాడు. 1 యోహాను 4:10 ప్రకారము దేవుడు తన ప్రేమను బట్టి మన పాపములకు ప్రాయశ్చిత్తం చేశాడు అనగా కప్పి వేశాడు. కొలస్స 3:15 ప్రకారం సిలువ రక్తంద్వారా పాప పత్రముపై ఉన్న వ్రాతలను తుడిపివేసి అపరాధములన్నిటిని క్షమించాడు. రోమా 5:8,9. ప్రకారము ప్రేమను బట్టియే ఆయన రక్తము వలన మనలను నీతిమంతులుగా తీర్చాడు. దేవుని ఉగ్రతైన నరకశిక్ష నుండి తప్పించాడు. 3) ఎఫెసీ. 2:6-8వ ప్రకారము చనిపోయిన మనలను కృపచేత లేపి పరలోకములో కూర్చుండబెట్టాడు.

ఇది మన వలన కలిగినది కాదు గాని దేవుని వరమే. తీతు 3:5-7 కూడా కృప ద్వారా నరకశిక్ష నుండి రక్షించి నీతిమంతులుగా తీర్చి నిత్య జీవమునకు వారసులుగా చేసి నిరీక్షణను మనకు ఇచ్చాడు. సర్వసత్యములోనికి నడిపించు పరిశుద్ధాత్మను కుమ్మరించాడని చూచుచున్నాము.

**సత్క్రియలు శ్రద్ధగా చేయుట - మత భేదము కలిగిన వారిని విసర్జించుట** : పై భాగములో దేవుడు మనపట్ల చేసిన కార్యములను వివరముగా చూచితివి. అందువలన విశ్వాసం ఉంచిన వారు ఆయనకొరకై మంచి క్రియలు శ్రద్ధగా చేయుట ప్రయోజనకరమైనది. తరబాయులకు, విభాగములకు, కలహములకు, మతభేదములకు దూరముగా ఉండాలి.

**ముగింపు (12-15వ.)** : నెకపొలిలో శీతాకాలం గడపాలని చెప్పినందున ఈ పత్రిక నెకపొలికి వెళ్ళు మార్గములో క్రీ.శ. 64లో వ్రాసెనని తలంచుచున్నాము. తీతు దగ్గర ఉన్న సహోదరులైన జెనానుకు, అపొల్లోనుకు తక్కువ కాకుండా చూచుకొనవలెనని చెప్పుచున్నాడు. అందువలన సహోదరుల క్షేమ విషయమై నిజమైన చింత కలవాడని తన మాదిరిని మనము అనుసరించాలని నేర్చుకొనుచున్నాము. వందనములతో ముగించుచున్నాడు.

# ఫిలేమోను పత్రిక 3+4+5+6+7=25వ.

గ్రంథకర్త : పౌలు . కాలము : క్రీ.శ. 61 (1:1) స్థలము : రోమాలోని మొదటి చెర. కొనిపోయినవారు : ఒనేసీము - తుకికు (కొలస్స. 4:7-9)

**అంశము** : ఒనేసీమును చేర్చుకొనుట.

ఫిలేమోను కొలస్సయి పట్టణవాసి (కొలస్స. 4:12,17). పౌలు పరిచర్య ద్వారా రక్షింపబడెను (19వ.). ఫిలేమోను ఇంటిలో సంఘము కూడుచుండెను. అప్పియా ఫిలెమోను భార్య, అర్థిప్పు వారి కుమారుడు (23వ) ఈ ఇంటిలో ప్రయోజనమైన వాడని అర్థము, గల పేరు కలిగిన ఒనేసీమను బానిసయుండెను. ఒనేసీము నిష్ప్రయోజకుడై యజమానికి ఋణముండి, తదుపరి నష్టము కలిగించి (18వ.), పారిపోయి రోము చెరలో ఉన్న పౌలును కలిసెను. పౌలు ద్వారా రక్షింపబడి, మార్చబడిన ప్రయోజనకారియై (10వ.) పౌలుకు ప్రాణమువంటివాడు పరిచర్య చేయుచుండెను కాని ఫిలేమోనుతో సమాధానపడు నిమిత్తమై పౌలు జాబు వ్రాసి ఒనేసీము తుకికులతో పంపెను.

రోమా చట్ట ప్రకారము ఆ దినాలలో బానిసలను వస్తువులను కొన్నట్టుకొనుట, వాడుకొనుట, అమ్ముకొనుట వాడుకయందుండెను. లోకములో బానిసలను వేడుక కొరకై చంపినను నేరము కాదు. కాని ధర్మశాస్త్ర ప్రకారము లేవి 25:53లో వారు కుటుంబీకులవలె నుండిరి. ఆది. 17:27. ప్రకారము నిబంధనతో పాలు కలవారు. సునాద సంవత్సరము నిర్గమ. 21:2 ప్రకారము విడుదల పొందిరి. బానిసకు హాని కలిగించుట నేరము. నిర్గమ. 21:26-27. బానిసను చంపువాడు శిక్షకు పాత్రుడు నిర్గమ. 21:20. పారిపోయిన బానిసను యజమాని కప్పగింపకూడదు. (ద్వితీ. 23:15-16). కాని విమోచించబడిన బానిస యజమానితో సమాధాన పడుట సమంజసము. అందులకై పౌలు ఈ పత్రిక వ్రాసి ఒనేసీమును ఫిలేమోను యొద్దకు పంపెను.

**సంఘ చరిత్రలో ఈ రీతిగా వ్రాయబడినది** : ఒనేసీము మారుమనస్సు పొంది ఫిలేమోను దగ్గరకు వచ్చిన తర్వాత 50 ఏండ్లకు ఇగ్నేషియస్ అనునతడు అంతయోకయ సంఘమునకు పెద్దగా ఉండెను. రోముకు కొనిపోబడి చెరలో నుండి హతసాక్షి అయెను.

చెరలోఉన్న కాలములో అనేక సంఘములకు పత్రికలు వ్రాశాడు. అందులో ఎఫెసీ సంఘమునకు వ్రాసిన పత్రికలో ఒనేసీమును ప్రయోజనకరమైన సంఘ పెద్దగా ప్రస్తావించాడు. కనుక మారుమనస్సు పొందినవారు. తమ జీవితములను దిద్దుకొనుట ద్వారా ఎంత గొప్పగా హెచ్చింపబడెదరో నేర్చుకొనవచ్చును. ఫిలేమోను అను పేరుకు ప్రేమ కలవాడని అర్థము. అప్పియ అను పేరుకు - ప్రియురాలు అని అర్థము, అర్ఖిప్పు అను పేరుకు - గుఱ్ఱమునకు అధిపతి లేదా గుఱ్ఱమువంటి బలము కలవాడు అని అర్థము.

**పీఠిక, ఫిలేమోను కుటుంబము (1-3వ.)** : ఫిలేమోను అతని భార్య అప్పియా వారి కుమారుడు - అర్ఖిప్పు ముగ్గురును క్రీస్తును తమ రక్షకునిగా అంగీకరించారు. ఫిలేమోను ఇంటిలో సంఘము అప్పియ, అర్ఖిప్పు సహకరించువారు కొలస్సీ. 4:17 ప్రకారము ప్రభువు యొక్క పరిచర్యలో ఒక భాగము యౌవనస్తుడైన అర్ఖిప్పుకు అప్పగింపబడవలెనని వ్రాయబడినది. ప్రభువు చేత పరిచర్య అప్పగింపబడుట ఎంత భాగ్యము ఇటువంటి కుటుంబము మనకు ఎంత మాదిరిగా ఉన్నది. సంఘము ఇంటియందు కూడుకొనుటకు తమ గృహమును ఇచ్చుట గమనించతగినది. ఈ దినములలో ఇటువంటివారు అక్కరగా ఉన్నారు.

**ఫిలేమోను గుణములు (4-7వ.)** : సహోదరుల యెడల ఫిలేమోను కలిగిన ప్రేమ ఎంతో ప్రశంసనీయము. మత్తయి 22:39,40. ప్రకారము 1 పేతురు 1:22 ప్రకారము పరిశుద్ధ గ్రంథమంతటి సారాంశము ప్రేమ కలిగియుండుటలో ఇమిడి ఉన్నది. ఫిలేమోను శ్రేష్ఠమైన వరములు కలిగినవాడు. ఆ వరములను సాధకం చేయుట ద్వారా ఇతరులను క్రీస్తు కొరకై సంపాదించుచున్నాడు. 7వ వచనములో పరిశుద్ధుల హృదయములకు విశ్రాంతిని కలిగించుచున్నాడని వ్రాయబడియున్నది. పౌలుకు విశేషమైన ఆనందమును, ఆదరణను కలిగించాడు. పై వచనములలో ఫిలేమోను యొక్క సమర్పణ తన ఇంటివారితో కలసి కనపరచిన త్యాగము, 1,2,3 వచనములలో చూస్తున్నాము. 4,5 వచనములలో అయన సాక్ష్యమును 6వ వచనములో ఆయన ప్రార్థనను 7వ వచనములో ఆయన ప్రేమను గమనించదగినది.

**ఒనేసిమును గూర్చిన పరిచయము (8-12వ.)** : ఈ పత్రిక ప్రారంభము నందలి అంశములలో ఈ భాగము యొక్క వివరములు చూచితిమి. ఎంతటి నిష్ప్రయోజన మైనవానినైనను క్రీస్తు మార్చగలడని చూచుచున్నాము. పాపములో ఎంత లోతుగా కూరుకొని పోయిన వాడైనను క్రీస్తు ద్వారా మార్చబడగలరు. పౌలుకు ఒనేసీము పరిచర్య అవసరమే కాని దానికంటే అవసరమైనది యుక్తమైనది సమాధానము. దానిని జరిగించుటకై సుమారు 1000 మైళ్ళు దూరము ఒనేసీమును పంపుచున్నాడు.

**ఒనేసీము కొరకు వేడుకొనుట (13-18వ.)** : పరిచర్య కంటే ఒనేసీము, ఫిలేమోనుతో సంగతులు సరిచేసికొనుట ముఖ్యమని, యుక్తమైనదని మనము నేర్చుకొనవలెను. ఈ విషయము అజ్ఞాపించు అధికారము అపొస్తలత్వము పౌలుకున్నను, అపొస్తలుడుగా కాక ఒనేసీము సహఖైదీగా వేడుకొనుచున్నాడు. ఒనేసీము ఇక మీదట, బానిసగా కాక సహోదరుడుగా ఉండునని చెప్పుచున్నాడు.

## ఒనేసీముకు క్రీస్తునందు కలిగిన ఆధిక్యతలు

| మునుపు | | ఇపుడు |
|---|---|---|
| నరక శిక్షకు పాత్రుడు | - | శిక్ష నుండి తప్పించబడెను |
| నిష్ప్రయోజకుడు | - | పౌలుకు ప్రయోజకుడు |
| ఫిలేమోనుకు నష్టము కలిగించినవాడు | - | ఫిలేమోనుకు ప్రయోజకుడు |
| బానిస | - | సహోదరుడు |
| శత్రువు | - | ప్రాణము వంటివాడు |
| ద్వేషించబడిన వాడు | - | ప్రేమకు పాత్రుడు |
| రుణమున్న వాడు | - | రుణము తీర్చబడినవాడు |
| ఎడబాసిన వాడు | - | ఎల్లప్పుడు ఉండువాడు |
| దిద్దుబాటును ఇష్టపడని వాడు | - | దిద్దుకొనుటకు ఇష్టపడినవాడు |

ఒనేసిము తన జీవితములో పాత సంగతులను సరిచేసుకొనుటకు ఇష్టపడుట ఎంత మంచిది.

**ఫిలేమోనుపై పౌలుకు కలిగిన విశ్వాసము - పౌలు జతపనివారు (19-25వ.)** : నీ 19-22 వచనాలోనే ఆత్మ విషయమై నాకు రుణపడియున్నావని చెప్పటలో 1) పౌలు పరిచర్యలో ఫిలేమోను రక్షించబడియున్నాడని నేర్చుకొనుచున్నాము, 2) ఫిలేమోను పౌలునకు ఆనందము కలిగించువాడు. మరియు 3) పరిచర్యలో సహాయము చేయువాడు. పౌలు హృదయము నకు 4) విశ్రాంతి కలిగించువాడు, 5) పౌలు చెప్పిన దానికంటే ఎక్కువగా చేయువాడు, 6) పౌలు మాటకు విధేయత చూపువాడు, 7) ప్రార్థనాపరుడు, 8) పౌలు నిమిత్తము బస సిద్ధము చేయువాడు 23-24వ.లలో ఎపఫ్రా తనతో కూడా ఖైదీలో ఉన్నాడని చెప్పుచున్నాడు. ఒకప్పుడు సేవలో వెనుకబడిన మార్కును ఇప్పుడు జతపనివాడని అంగీకరించుచున్నాడు. అరిస్తార్కు, దేమా లూకాను కూడా జతపని వాడుగా ప్రస్తావించుచున్నాడు. 25 వచనములో ఆశీర్వాదముతో పత్రికను ముగించుచున్నాడు.

# హెబ్రీయులకు వ్రాసిన పత్రిక

గ్రంథకర్త : పౌలు . కాలము : క్రీ.శ. 61 -66(?) స్థలము : ఇటలీ (13:24)

**అంశము** : క్రీస్తు శ్రేష్ఠుడు - యేసు మీద లక్ష్యముంచుడి (12:1) - ఏడు జాగ్రత్తలు.

**గ్రంథ ఉద్దేశ్యము** : హెబ్రీయులు అనగా నదిని దాటినవారని అర్థము. సంఘ ప్రారంభ దినములలో అనేక వేలమంది యూదులు సువార్త విని క్రీస్తును నమ్మిరి. (అ.కా. 21:20వ) వీరిలో కొందరు నిజముగా నమ్మి బాప్తిస్మము పొందినవారు. మరి కొందరు నిజమైన రక్షణ అనుభవము లేకయే సంఘమందు చేర్చబడిరి. సంఘము క్రీ.శ.30లో పుట్టినది. ఈ పత్రిక క్రీ.శ. 66లో వ్రాయబడినందున ప్రారంభములో నమ్మినవారు 30 ఏండ్ల ప్రాయములో నమ్మిరని తలంచిన యెడల వారిప్పుడు 66 ఏండ్ల పైబడియుండాలి. వారు చనిపోయి ఉండాలి లేదా వృద్ధులుగానుండాలి. తరువాత నమ్మతిమన్న వారు రెండవ తరమువారై నిజమైన లోతైన అనుభవము గల విశ్వాసులుగా నుండకపోవచ్చును. వీరే క్రీస్తు నుండి త్వరగా వేరై పోగలరు.

యూదా మతము అనేక ఆచారములు గలది. క్రీస్తునందు జీవించుట ఆత్మానుసారమైనది, కాని అక్షర సంబంధమైనది కాదు. క్రైస్తవులకు హింసలు ఎక్కువకాగా హెబ్రీయులు క్రైస్తవ్యము నుండి యూదా మతమునకు తిరిగి వెళ్ళుచుండిరి. హెబ్రీ. 13:2లో చెరను గూర్చిన ప్రస్తావనయున్నందున పౌలు, పేతురులు చెరలో నుంచబడిన కాలమును జ్ఞాపకము చేసికొనదగును. అందుచే ఈ పత్రిక క్రీ.శ. 61-66 మధ్య వ్రాయబడినదని తలంచుచున్నాము. వ్రాసిన వారిని గూర్చి భిన్నమైన అభిప్రాయములు గలవు. లూకా, సీల, ఫిలిప్పు, అపొల్లోయని తలంచువారు కలరు. కాని పత్రిక శైలిని బట్టి పౌలు వ్రాసెనని సర్వ సాధారణముగా అంగీకరింతురు.

పౌలు పేతురులు నీరో చక్రవర్తి కాలమందు చెరలోనుండగా పేతురు పౌలుకంటే ముందుగా చంపబడెను. శ్రమలను బట్టి యూదులు శ్రేష్ఠమైన అధికారి, నాయకుడు, యాజకుడు, సేవకుడు, కర్త, క్రీస్తు మీద లక్ష్యముంచక పాత ఆచారముల వైపు తిరుగుచున్నట్లు కన్పించును. కనుక పౌలు ఈ పత్రికలో క్రీస్తు, వారి ప్రవక్తలు, పితరులు, దూతలకంటే, నాయకుల యాజకత్వము కంటె, గుడారము దాని సేవకత్వముకంటే శ్రేష్ఠుడని క్రీస్తును గూర్చి బోధించెను. క్రీస్తు విశ్వాస, నిరీక్షణ ప్రేమలకు కర్తయని క్రీస్తు

మీద లక్ష్యముంచుడని హెచ్చరించుచూ వ్రాసెను. యూదులు పౌలు పై అసూయ కలిగినందున తన పేరును వ్రాయలేదు. గలతీ. 2:9లో పౌలు అన్యులకును, పేతురు యూదులకును అపోస్తలుడుగా నుండవలెనని వారు చెప్పుకొనినందున పౌలు తన పేరును ప్రస్తావించక ఈ పత్రిక వ్రాసెనని తలంచగలము. ఈ పత్రికలో ఏడు ప్రాముఖ్య మైన జాగ్రత్తలు కలవు. 1) 2:1-4వ., 2) 3:7-19వ. 3) 4:11-14వ. 4) 5:11-14వ. 5) 10:19-39, 6) 12:15-24వ, 7) 12:25-29వ.

## అధ్యాయాల విభజన 2+2+3+3+3= 13 అధ్యా.

**I. 1-2వ అధ్యాయములు** : శ్రేష్టమైన ఆధిపత్యము.

**II. 3-4వ అధ్యాయములు** : శ్రేష్ఠమైన నాయకత్వము.

**III. 5-7వ అధ్యాయములు** : శ్రేష్ఠమైన యాజకత్వము.

**IV. 8-10వ అధ్యాయములు** : శ్రేష్ఠమైన సేవకత్వము.

**V. 11-13వ అధ్యాయములు** : శ్రేష్ఠమైన కర్తవ్యము (క్రైస్తవ ప్రాముఖ్యతలగు విశ్వాస, నిరీక్షణ, ప్రేమలకు క్రీస్తు శ్రేష్ఠమైన కర్త.

**I. 1-2వ అధ్యాయములు : శ్రేష్టమైన ఆధిపత్యము.**

**1వ అధ్యాయము** : ప్రవక్తలకంటె, దూతలకంటె, తోటి వారందరి కంటె శ్రేష్ఠుడు.

**2వ అధ్యాయము** : దూతలకంటె శ్రేష్ఠుడు,

**II. 3-4వ అధ్యాయములు : శ్రేష్టమైన ఆధిపత్యము.**

**3వ అధ్యాయము** : మోషే కంటే శ్రేష్ఠుడు.

**4వ అధ్యాయము** : యెహోషువకంటే శ్రేష్ఠుడు.

**III. 5-7వ అధ్యాయములు : శ్రేష్ఠమైన యాజకత్వము.**

**5వ అధ్యాయము** : అహరోనుకంటే శ్రేష్ఠుడు.

**6వ అధ్యాయము** : అబ్రాహాము కంటే శ్రేష్ఠుడు.

**7వ అధ్యాయము** : లేవీకంటే శ్రేష్ఠుడు.

**IV. 8-10వ అధ్యాయములు : శ్రేష్ఠమైన సేవకత్వము.**

8వ అధ్యాయము : శ్రేష్ఠమైన గుడారమునకు నిబంధనకు సేవకుడు.

9వ అధ్యాయము : శ్రేష్ఠమైన నిబంధన ద్వారా కలిగిన బల్యర్పణ.

10వ అధ్యాయము : శ్రేష్ఠమైన బలినర్పించిన వాడు.

V. 11-13వ అధ్యాయములు : **శ్రేష్ఠమైన కర్తవ్యము.**

11వ అధ్యాయము : శ్రేష్ఠమైన విశ్వాసమునకు కర్త.

12వ అధ్యాయము : శ్రేష్ఠమైన నిరీక్షణకు కర్త.

13వ అధ్యాయము : శ్రేష్ఠమైన ప్రేమకు కర్త.

**I.** సంపూర్ణత - **14 పర్యాయములు** : 1) సంపూర్ణుడు 2:10, 2) సంపూర్తి 4:3, 3) సంపూర్ణ సిద్ధి 5:9, 4) సంపూర్ణులు 6:2, 5) సంపూర్ణ సిద్ధి 7:11, 6) సంపూర్ణ సిద్ధి 7:18, 7) సంపూర్ణము 7:25, 8) సంపూర్ణ సిద్ధి 7:28, 9) సంపూర్ణ సిద్ధి 9:9, 10) సంపూర్ణ సిద్ధి 10:1, 11) సంపూర్ణులు 10:14, 12) సంపూర్ణ 10:22, 13) సంపూర్ణులు 11:40, 14) సంపూర్ణ సిద్ధి 12:23.

**II.** శ్రేష్ఠము - **13 పర్యాయములు** : 1),2) శ్రేష్ఠము, శ్రేష్ఠుడు 1:4, 3) శ్రేష్ఠమైన వస్తువులు 7:4, 4) శ్రేష్ఠమైన నిరీక్షణ 7:10, 5) శ్రేష్ఠమైన నిబంధన 7:20, 6) శ్రేష్ఠమైన సేవకత్వము 8:6, 7) శ్రేష్ఠమైన బలులు 9:23, 8) శ్రేష్ఠమైన స్వాస్థ్యము 10:34, 9) శ్రేష్ఠమైన బలి 11:4, 10) శ్రేష్ఠమైన దేశము 11:16, 11) శ్రేష్ఠమైన పునరుత్థానము 11:35, 12) శ్రేష్ఠమైనది 11:40, 13) శ్రేష్ఠమైన రక్తము 12:4.

**III.** పరలోకము - **11 పర్యాయములు** : 1) పరలోక సంబంధమైన పిలుపు 3:1, 2) పరలోక సంబంధమైన వరము 6:4, 3) పరలోకమందు...... ఆసీనుడు 8:2, 4) పరలోక సంబంధమగు వస్తువులు 8:5, 5) పరలోకమందున్న వాటిని పోలిన వస్తువులు 9:23, 6) పరలోక సంబంధమైనవి 9:23, 7) పరలోకమందు ప్రవేశము 9:24, 8) పరలోక సంబంధమైన దేశము 11:16, 9) పరలోకపు యెరూషలేము 12:22, 10) పరలోకమందు వ్రాయబడిన జేష్ఠుల సంఘం 12:2, 11) పరలోకము నుండి బుద్ధి చెప్పువారు 12:25.

**IV.** గొప్ప - **10 పర్యాయములు** : 1) గొప్ప రక్షణ 2:3, 2) గొప్ప ప్రధాన యాజకుడు 4:14, 3), 4) గొప్పవాడు 6:13, 6:16, 5) గొప్ప యాజకుడు 10:21, 6) గొప్ప పోరాటము

10:32, 7) గొప్ప బహుమానము 10:35, 8) గొప్ప భాగ్యమైన నింద 11:24, 9) గొప్ప సాక్షి సమూహము 12:1, 10) గొప్ప కాపరి 13:20.

**V. నిరంతరము - 9పర్యాయములు** : 1) నిరంతర సింహాసనము 1:8, 2),3),4),5),6) నిరంతర యాజకుడు 5:6, 6:20, 7:3, 7:17, 7:22, 7) నిరంతరము ఉన్నవాడు 7:24, 8) నిరంతరము జీవించువాడు 7:25, 9) నిరంతరమును సంపూర్ణ సిద్ధి పొందిన కుమారుడు 7:28.

**VI. రక్షణ - 11 పర్యాయములు** : 1) రక్షణయను స్వాస్థ్యము 1:14, 2) గొప్ప రక్షణ 2:3, 3) రక్షణ 2:4, 4) రక్షణ కర్త 2:10, 5) రక్షింపగలవాడు 5:7, 6) నిత్యరక్షణ 5:10, 7) రక్షణ కర్త 6:9, 8) రక్షించుటకు శక్తిమంతుడు 7:25, 9) రక్షణ 9:28, 10) ఆత్మరక్షణ 10:39, 11) ఇంటి వారి రక్షణ 11:7.

**VII. ఒక్కసారే - 8పర్యాయములు** : ఒక్కసారే పని చేసి ముగించెను 7:28, 2),3) ఒక్కసారే ప్రవేశము 9:7, 9:12, 4) ఒక్కసారే ప్రత్యక్షత 9:26, 5) ఒక్కసారే మృతి 9:27, 6) ఒక్కసారే అప్పగింపబడి 9:28, 7) ఒక్కసారే శుద్ధి 10:2, 8) ఒక్కసారియే అర్పణ 10:10.

**VIII. నిత్యములు - 7 పర్యాయములు** : 1) నిత్యరక్షణ 5:10, 2) నిత్య తీర్పు 6:2, 3) నిత్య విమోచన 9:11, 4) నిత్యమువెళ్ళుట 9:6, 5) నిత్య స్వాస్థ్యము 9:15, 6) నిత్య ఆత్మ 9:14, 7) నిత్య నిబంధన 13:21.

## 1వ అధ్యాయము 4+4+4+2=14 వచనములు
## అంశము : ప్రవక్తల కంటె దూతలకంటె తోటివారందరికంటె శ్రేష్ఠుడు

ప్రవక్తలకంటే శ్రేష్ఠుడైన క్రీస్తు (1-4వ.) : దేవుడు పూర్వకాలమందు నానా సమయములలో అనగా సీనాయి కొండ మీద నుండి, యొర్దాను అద్దరిని..... నానా విధములుగా, అనగా వాక్కు ప్రత్యేక్షమగుట ద్వారా, స్వప్నముల ద్వారా ప్రవక్తల ద్వారా యాజకుల ద్వారా, దేవదూతల ద్వారా మాట్లాడాడు. ఈ దినముల అంతమందు కుమారుడైన యేసుక్రీస్తు ఈ లోకమునకు వచ్చి పరిశుద్ధ గ్రంథమును మనకు అనుగ్రహించి ముగించినందున ప్రస్తుతము పరిశుద్ధ గ్రంథము ద్వారానే మనతో మాట్లాడు చున్నాడు కనుక దర్శనములు ప్రత్యక్షతలు ఈ దినములలో అవసరము లేదు. ప్రవక్తల

కంటే క్రీస్తు శ్రేష్ఠుడని క్రీస్తునకు గల ఏడు ఆధిక్యతలను 2-4 వచనములలో చెప్పుచున్నాడు. 1) సమస్తమునకు వారసుడు, 2) ప్రపంచములను నిర్మించినవాడు చెప్పుచున్నాడు, 3) దేవుని మహిమయొక్క తేజస్సు, 4) తత్వము యొక్క మూర్తిమంతము, 5) మహత్తుగల మాటచేత సమస్తమును నిర్వహించగలవాడు, 6) పాపముల విషయమై శుద్ధీకరణ చేసినవాడు, 7) దేవుని కుడి పార్శ్వమున కూర్చున్నవాడు.

**దూతలకంటే క్రీస్తునకు కలిగిన శ్రేష్ఠత్వము (5-8వ.)** : 1) 5వ.లో క్రీస్తు కుమారుడని పిలువబడుచున్నాడు. 2) 5వ.లో నేను ఆయనకు తండ్రినైయుందునని చెప్పుచున్నాడు. భూలోకమునకు ఆది సంభూతుడుగా వచ్చినవాడు 3) 6వ.లో దేవదూతలందరు ఆయనకు నమస్కారము చేయవలెనని చెప్పుచున్నాడు. 4) 7వ.లో దూతలు అయనకు సేవకులు అని చెప్పుచున్నారు, 5) 8వ.లో క్రీస్తు సింహాసనము నిరంతరము నిలుచునని చెప్పుచున్నాడు, 6) ఆయన రాజదండము న్యాయార్థమైనది అనగా క్రీస్తు రారాజు అని అర్థము.

**తోటివారందరికంటే శ్రేష్ఠుడు (9-12వ.)** : 1) ఆనందతైలముతో అభిషేకించబడిన వాడు, 2) ఆదియందు భూమికి పునాది వేసినవాడు, 3) ఆకాశములను సృజించినవాడు, 4) భూమ్యాకాశములను ఉత్తరీయము వలె మడిచినవాడు, 5) వస్త్రమువలె వాటిని మార్చినవాడు, 6) ఏకరీతిగా ఉన్నవాడు సంవత్సరములు తరగవు, 7) శత్రువులను పాదపీఠముగా కలిగినవాడు.

**దూతల పరిచర్య (13-14వ.)** : పాపము చేసిన దూతలకు రక్షణ లేదు. తీర్పుకొరకై బంధించబడియున్నారు కాని పాపము చేసిన మానవులకు దేవుడు రక్షణను యేసు రక్తము వలన ఏర్పరచి, రక్షణ పొందబోవు మానవులకు పరిచారము చేయుటకై దేవదూతలను సేవకులుగా నియమించాడు.

## 2వ అధ్యాయము 4+5+5+4=18 వచనములు
## అంశము : దూతలకంటే శ్రేష్ఠుడు, ఆదాముకంటే శ్రేష్ఠుడు

**మొదటి జాగ్రత్త (1-4వ.)** : రక్షణను నిర్లక్ష్యం చేయకూడదు - వినిన సంగతులను విడిచిపెట్టు వారిని గూర్చి మాట్లాడుచున్నాడు. యూదులు తాము వినిన క్రీస్తు

బల్యర్పణను గూర్చిన సంగతులు విడిచిపెట్టి దర్మశాస్త్రములోని అర్చనలు ఆచారములు బల్యర్పణలు అను వాటివైపు తిరుగుచున్నందున ధర్మశాస్త్ర ఆచారములవైపు తిరగ కూడదని యేసు ద్వారా కలుగు రక్షణయందు నిలిచియుండుటకు విశేషముగా జాగ్రత్త పడవలెనని చెప్పుచున్నాడు. 2-4వ.లలో క్రీస్తు ద్వారా కలగబోవు రక్షణను గూర్చి పాత నిబంధన గ్రంథములు దేవదూతల ద్వారా పలకబడిన మాటలు స్థిరపరచ బడెను అని చెప్పుచున్నాడు. ఈ రక్షణవార్త యేసు ప్రభువు బోధించుట ద్వారా ఆరంభమై దేవుడు తన చిత్తానుసారముగ సూచక క్రియల చేతను, అద్భుతముల చేతను వివిధములైన పరిశుద్ధాత్మ వరములు అనుగ్రహించుట చేతను స్థిరపరచెను. అందువలన ఈ సంగతులను విడిచిపెట్టి కొట్టుకొని పోకూడదని చెప్పుచున్నాడు. మార్కు. 4:15వ.లో విత్తువాని ఉపమానంలో త్రోవ ప్రక్కన విడిచిపెట్టిన విత్తనములను దుష్టుడు కొనిపోగా అక్కడ ఫలము రాలేదు. 2:1-4. వచనముల భాగము త్రోవ ప్రక్కన పడిన విత్తనముతో పోలినది.

**దూతలకంటె, ఆదాముకంటె క్రీస్తు శ్రేష్ఠుడు (5-9వ.)** : రాబోవు లోకమును దేవుడు దూతలకు లోపరచలేదు మనుష్యుడైన ఆదామును మానవుడుగా జన్మించిన క్రీస్తును దేవుడు దర్శించాడు ఆదాము పాపము చేసి దేవుడు తనకిచ్చిన స్థానము పోగొట్టుకొన్నాడు. కాని క్రీస్తు తన స్థానము నిలుపుకున్నాడు. దేవదూతలకంటె, ఆదాము మరియు క్రీస్తు తక్కువగా చేయబడిరి. ఆదాము పాపము చేసి దేవుడిచ్చు మహిమను పోగొట్టుకున్నాడు గాని క్రీస్తు మహిమా ప్రభావముతో కిరీటము ధరించినవాడై హెచ్చించబడెను దేవుడు తాను చేసిన సృష్టి మీద ఆదామునకు, క్రీస్తుకు అధికారమిచ్చెను ఆదాము ఆ అధికారమును కోల్పోయెను. కాని క్రీస్తు నేటికిని అధికారిగా ఉన్నాడు. ఆదాము మొదలు ప్రతి మానవుడు చేసిన పాపము కొరకై క్రీస్తు మరణమును అనుభవించాడు. మహిమా ప్రభావములో కిరీటము ధరించినవాడైనందున ఆదాముకంటే, దేవదూతలకంటే క్రీస్తు శ్రేష్ఠుడుగా ఉన్నాడు.

**శ్రమల ద్వారా సంపూర్ణ శ్రేష్ఠుడైన రక్షణకర్తయైన క్రీస్తు (10-14వ. 15-18వ.)** : దేవుడు తాను పవిత్రుడైనందున తన పిల్లలమైన మనమును పవిత్రులముగా నుండవలెనని కోరుచున్నాడు. మానవులు రక్తమాంసము గలవారై, పాపము చేసినవారు. దేవుడు ఆత్మయైనను మన నిమిత్తము రక్త మాంసములలో పాలివాడైనాడు. పాపమును బట్టి

మానవుడు అపవాదికి దాసుడై మరణమునకు పాత్రుడు కాగా పరిశుద్ధుడైన దేవుడు తన రక్తమును చిందించుట ద్వారా పాపమును పరిహరింప తలపెట్టాడు. అందులకు రక్తమాంసము గల దేహమును, అనగా మానవ శరీరమును ధరించుకొన్నాడు. (1 తిమోతి 3:15వ. హెబ్రీ 10:4వ) క్రీస్తు తాను సృజించిన దేవదూతల స్వభావమును ధరించుకొనక, దూతలకంటె తక్కువైన **మానవుల స్వభావమును అన్ని విషయములలో ధరించుకొన్నాడు** అన్ని విషయములలో ఏమి లేని రిక్తుడుగానుండెను. మానవులవలె అన్ని విషయములలో శోధించబడి శ్రమ పొందినను పాపము లేనివాడుగానున్నందున శోధనలో ఉన్న వారికి సహాయము చేయశక్తి గలవాడైయున్నాడు. ప్రజల పాపములకు పరిహారము చేయుటకు ప్రస్తుతము దేవుని కుడిపార్శ్వమున విజ్ఞాపన చేయు నిరంతర యాజకుడుగాను, ఉత్తరవాదిగాను ( 1 యోహాను 2:1-2వ) ఉన్నాడు.

## 3వ అధ్యాయము 6+5+8=19 వచనములు
## అంశము : క్రీస్తు మోషే కంటె శ్రేష్ఠుడు

**మోషే కంటె శ్రేష్ఠుడు (1-6వ.)** : మనము పరలోక సంబంధమైన పిలుపు కలవారము. పిలుపును గూర్చిన వివరము అ.కా. 12వ అధ్యాయము చివరలో చూడగలము. ఈ లోకములోని పనులకై పిలువబడినప్పుడు ఏ పిలుపు ఉన్నతమైనదో దానిని మనము ఎన్నుకొందుము. క్రీస్తు మనలను పర సంబంధమైన పిలుపుతో పిలిచాడు కాబట్టి ఎంతో జాగ్రత్తగా ఆ పని చేయాలి. మోషేకంటే క్రీస్తు శ్రేష్ఠతలు క్రింద చెప్పబడినవి.

1) 2వ. మోషే దేవుని ఇల్లంతటిలో నమ్మకస్థుడు కాని క్రీస్తు ఇంటికి పైగానున్న వాడుకనుక శ్రేష్ఠుడు 3వ. మోషే కంటె ఎక్కువ మహిమకు అర్హుడు. మోషే ఇంటిలో సేవకుడు, క్రీస్తు ఇంటికి అధిపతి కట్టినవాడు.

**రెండవ జాగ్రత్త - జీవముగల దేవుని విడిచిపెట్టకూడదు (7-19వ.)** : 7-11వ.లలో ఇశ్రాయేలీయులు అరణ్య ప్రయాణములో శోధించబడినప్పుడు హృదయములను కఠిన పరచుకొనిరి కాని దేవునియందు నమ్మికయుంచలేదు. ఇశ్రాయేలీయులు తప్పిపోయిరి కనుక వారు విశ్రాంతిలో ప్రవేశింపలేదు. అటువలెనే జీవముగల దేవుని యొద్దకు వచ్చు వారిలో విశ్వాసము లేని దుష్ట హృదయము ఉన్న యెడల శ్రమలు కలిగినప్పుడు పాపము చేత భ్రమ కలిగి జీవము గల దేవుని విడిచిపెట్టి పోగలరు. అరణ్యములో పితరులు అవిశ్వాసము చేత ప్రవేశింపక పోయినట్లు మీరును హృదయంమందు

విశ్వాసము లేనివారు కనుక వీరు అవిశ్వాసులే. దీనిని విత్తువాని ఉపమానంలోని రెండవ విత్తనంతో పోల్చవచ్చు. హృదయమందు విశ్వాసము లేక కేవలం నోటితోనే క్రీస్తును అంగీకరించితి మన్నవారు. విశ్వాసులు కారు. శ్రమలలో ఈ విషయము బయలుపడును కనుక వారు జీవముగల దేవుని విడిచిపెట్టిరి.

## 4వ అధ్యాయము 5+5+3+3=16 వచనములు
## అంశము : యెహోషువ కంటే శ్రేష్ఠుడు

**విభజన - యెహోషువ వలన కలిగిన విశ్రాంతి అసంపూర్ణమైనది (1-5వ.)** : ఇశ్రాయేలు జనులకు వాక్యము ప్రకటింపబడినను వారు వినిన వారితో విశ్వాసము కలవారితో కలసి ఉండలేదు కనుక ఆ వాక్యము నిష్ప్రయోజనమాయెను. దేవుని కార్యములన్నియు సంపూర్ణములైనను విశ్వాస విషయములో సంపూర్ణ కార్యము వీరిలో జరగలేదు కనుక కనాను దేశములో వారికి నిజమైన విశ్రాంతి దొరకలేదు.

**క్రీస్తు ద్వారా కలిగిన విశ్రాంతి సంపూర్ణమైనది (6-10వ.)** : 8-10వ.లలో యెహోషువ వారికి విశ్రాంతి కలుగజేసిన యెడల ఆ తరువాత మరి యొక దినమును గూర్చి చెప్పక పోవును. కనుక దేవుని ప్రజలకు నిజమైన విశ్రాంతి దొరకలేదు. దీనిని బట్టి యేసుక్రీస్తు వారు నిజమైన విశ్రాంతి నివ్వడానికి ఈ లోకమునకు వచ్చెనని మత్తయి 11:28,29,30. వచనములలో చదువుచున్నాము. యేసు క్రీస్తు ద్వారా పాపముల నుండి రక్షించ బడినపుడు పాపభారము పోయి విశ్రాంతి లభించింది. ఇది ఆత్మకు విశ్రాంతి. క్రీస్తు సేవను మోయుట వలన ప్రాణములకు విశ్రాంతి కలుగును. మనసునకు, ప్రాణమునకు నెమ్మది కలుగుతుంది. క్రీస్తు వచ్చినపుడు క్షయమైన శరీరము అక్షయతను ధరించుకొనును గనుక శరీరమునకు విశ్రాంతి కలుగుతుంది యెహోషువ కలుగజేసిన విశ్రాంతిలో ఇవి లేవు కనుక క్రీస్తు యెహోషువ కంటే శ్రేష్ఠుడు.

**మూడవ జాగ్రత్త - అవిధేయత వలన పడిపోవుట (11-13వ.)** : అవిధేయత అనగా 12వ. ప్రకారము వాక్యమునకు అవిధేయత అని గమనించాలి వాక్యము సజీవమైనది బలముగలది ఖడ్గము కంటే వాడిగలది. 1) ప్రాణమును, 2) ఆత్మను, 3) శరీరములోని కీళ్ళను, మూలుగులను విభజించునంత మట్టుకు దూరును. హృదయము యొక్క ఆలోచనలు తలంపులను శోధించడము అనగా ప్రాణమును దేహమును ఆత్మను

పవిత్రంగా ఉంచును అని అర్థము. వాక్యమునకు అవిధేయులైన వారు కీర్తనలు 119:11లో చెప్పబడినట్లు (నీ ఎదుట నేను పాపము చేయకుండునట్లు నా హృదయములో నీ వాక్యముంచుకొనియున్నాను) వాక్యమునకు అవిధేయత చూపిన యెడల పాపములో పడగలరు. మనము దేవునికి లెక్క చెప్పవలెను కనుక ఈ విషయములో జాగ్రత్త కలిగి యుండాలి.

**ప్రధాన యాజకుడైన క్రీస్తు (14-16వ.)** : ఈ భాగము అయిదవ అధ్యాయమునకు పీఠికగా తలంచగలము. యేసుక్రీస్తు గొప్ప ప్రధాన యాజకుడైన అహరోనుకంటెను మిగిలిన ప్రధాన యాజకులకంటెను శ్రేష్ఠుడైయున్నాడు. మన బలహీనతలయందు సహానుభవము కలవాడు. మనవలె శోధింపబడును కాని పాపము లేనివాడుగా ఉండెను కనుక మనకు సమయోచితమైన సహాయము చేయుటకై హెబ్రీ. 2:18 ప్రకారం శక్తి కలిగినవాడు.

## 5వ అధ్యాయము 5+5+4 =14 వచనములు

## అంశము : అహరోనుకంటే ప్రధాన యాజకులకంటె శ్రేష్ఠుడు

**అహరోను యాజకత్వము (1-5వ)** : 1) ప్రతి ప్రధాన యాజకుడు మనుష్యులలో నుండి వచ్చిన వాడు కాని క్రీస్తు దేవుని యొద్ద నుండి వచ్చినవాడు, 2) ప్రధాన యాజకులు మనుష్యుల చేత నియమించబడువాడు కాని క్రీస్తు దేవుని చేత నియమించబడెను, 3) ప్రధాన యాజకుడు కొద్ది కాలమే జీవించును కనుక ఒకరి తరువాత ఒక్కరు వచ్చి అనేకులైరి మరియు వారి యాజకత్వము కాల పరిమితి కలది. క్రీస్తు ఒక్కడే, క్రీస్తు నిరంతర ప్రధాన యాజకుడు, 4) ప్రధాన యాజకుడు. బలహీనతలకు లోనైనవాడు కనుక తమ పాపముల కొరకు అర్పణ చేయువాడు. క్రీస్తు పాపము అవసరము లేనివాడు కనుక తన కోసము అర్పణ లేనివాడు. ప్రధాన యాజకుడు సంపూర్ణ సిద్ధి కలుగజేయని బలులు ఏటేటా అర్పించిరి. క్రీస్తు సదాకాలము నిలుచు ఒకే బలిని అర్పించెను, 5) క్రీస్తు బలి సంపూర్ణ సిద్ధి కలుగజేసినందున క్రీస్తును దేవుడు మహిమ పరచెను.

**మెల్కీసెదెకు క్రమము చొప్పుననున్న ప్రధాన యాజకుడైన క్రీస్తు (6-10వ.)** : కీర్తనలు 110:4వ.లో ప్రస్తావించబడిన మెల్కీసెదెకు ఆయనే అని 7:1-3వ. గ్రహించగలము. శరీర ధారియైయున్న దినములో మహారోదనముతోను కన్నీళ్ళతోను ప్రార్థించి భయభక్తులు

కలిగి దేవునికి యాచనలు సమర్పించినందున అంగీకరింపబడును. తాను పొందిన శ్రమల వలన విధేయత నేర్చుకొనెను. క్రీస్తు సంపూర్ణ సిద్ధి కలిగినవాడై నిత్య రక్షణకు కారకుడై మన పక్షముగా తండ్రి యొద్ద విజ్ఞాపన చేయు నిరంతర యాజకుడైయున్నాడు.

## 6వ అధ్యాయము 8+4+8 = 20 వచనములు

## అంశము : అబ్రాహాము కంటె శ్రేష్ఠుడు

**నాలుగవ జాగ్రత్త - వాక్యము వినుటకు మందులగుట - ఫలము పొందకపోవుట (11-14వ, 6:1-8వ, 9:12వ.)** : విశ్వాసులు వాక్యమును వినుటకు మందులగుట జరుగుచున్నది. అందుకే అనేక సంఘములలో బోధకులుగా నుండవలసిన వారు శిశువులుగా నుండి పాలు త్రాగుచున్నారు. సంఘములలో బోధకులు అనేకులు లేరు. ఉన్న బోధకులు వాక్య అనుభవము లేనివారు. మూల పాఠములను నేర్చుకొనుచున్నారు (5:12). మూల ఉపదేశ ములను మానవలెనని 6:2లో చెప్పుచున్నాడు. 5వ. వెలిగించబడి, పరలోక సంబంధమైన వరమును రుచిచూచి పరిశుద్ధాత్మలో పాలివారు అనగా రక్షించబడినవారు కొంతకాలము వాక్యమును అనుభవించి, దేవునిశక్తిని ప్రభావమును అనుభవించిన తరువాత తప్పి పోయినవారు ప్రభువును సిలువ వేసినట్లే వారిని చూచిన లోకస్తుల ద్వారా క్రీస్తుకు అవమానము కలుగును. 6వ వచములో తప్పిపోయిరి అనగా పాపములో పడిరి. 7వ వచనములో భూమి తనపై పడు వర్షమును త్రాగి మంచి ఫలములు ఫలించుట. వాక్యమను నీటిని త్రాగి ప్రభువుకు ఆత్మ ఫలమును (గలతీ. 5:22) ఫలించినట్లే లేదా ముండ్ల తుప్పలు గచ్చ తీగలు మొలుచుట వాక్యమును విని మందులుగా నుండి జీవితములో పాపమును కలిగియుండుటతో సమానము. తుదకు ముండ్ల తుప్పలను రైతు కాల్చివేయును. ఆలాగే 2 కొరింథీ. 5:10వ. ప్రకారము విశ్వాసి తాను జరిగించిన క్రియలు మంచివైనను చెడ్డవైనను అని తీర్పు తీర్చబడును. 1 కొరింథీ. 3:13-15వ. ప్రకారము చెడ్డ క్రియలు అగ్ని పరీక్షలో కాలిపోవును. మంచి క్రియలు/ కార్యములు, జీతమును/ఫలమును ఇచ్చును. ఈ భాగములో 6వ వచనములో తప్పిపోయిన వారిని గురించిన ఆలోచన జరుగుచున్నది. వారి క్రియలు 1 కొరింథీ 3:13-15వ ప్రకారము ముండ్లతుప్పలు కాలిపోవునట్లు కాలిపోవును. కాని తన మట్టుకుతాను అగ్నిలోనుండి లాగినట్లు రక్షింపబడును కనుక వెలిగింపబడినవారు పరసంబంధమైన

పిలుపులో పాలు పొందినవారు, పరిశుద్ధాత్మలో పాలుపంపులు పొందినవారు అనగా రక్షింపబడిన వారు. వారికి రక్షణ శాశ్వతము కాని తప్పిపోయి పాపములో పడినందుకు ఫలము పోయినది. మనము ఇంతకంటే మంచి స్థితిలోనుండాలి. ఆసక్తిని తుదమట్టుకు కనపరచవలెను. వాక్యమును విని నెరవేర్చుటకు మందులము కారాదు.

**అబ్రహాముకంటే శ్రేష్ఠుడు (13-20వ.)** : దేవుడైన క్రీస్తు నేను తండ్రి ఏకమైయున్నాము అని నా యందు తండ్రి, తండ్రియందు నేను ఉన్నాము అని యోహాను 14:9-10వ. చెప్పాడు. దేవుడు అబ్రహాములో వాగ్దానము చేసినపుడు ఏ గొప్పవాని తోడు అనక తన తోడు అనుటలో దేవుడు అబ్రహాముకంటే గొప్పవాడు తండ్రియైన దేవునిలో క్రీస్తు ఉన్నందున క్రీస్తు గొప్పవాడు. క్రీస్తు అబ్రహాముకు దేవుడు తండ్రి మరియు క్రీస్తు, 1) నిశ్చయముగా నిన్ను ఆశీర్వదింతును, 2) నిశ్చయముగా నిన్ను విస్తరించుదును అన్నాడు. గలతీ 3:14,29వ ప్రకారము దేవుని వాగ్దానములన్ని సంఘమునకు నెరవేరును. వాగ్దానము చేసిన వాడగు క్రీస్తు, ప్రధాన యాజకుడగు యేసు మనకంటె ముందుగా పరలోకములో ప్రవేశించినందున మన నిరీక్షణకు లంగరు వంటి నిశ్చయము పరలోకములో ఉన్నది. దీని భావము అబ్రాహాము కంటే శ్రేష్ఠుడైన క్రీస్తు అబ్రహామునకు చేసిన వాగ్దానమును ఆయన శరీర సంతానముయైన ఇశ్రాయేలుకు, ఆత్మీయ సంతానయైన సంఘమునకు నెరవేర్చును.

## 7వ అధ్యాయము 3+7+6+6+6=28 వచనములు
## అంశము : లేవీకంటే శ్రేష్ఠుడు

**క్రీస్తును పోలిన రాజు, యాజకుడైన మెల్కీసెదెకు (1-3వ.)** : మెల్కీసెదెకు షాలేము (యెరూషలేము) రాజు, దేవుని నిరంతర యాజకుడు, సమాధాన రాజు, మనుష్య కుమారుడైన క్రీస్తును పోలినవాడు కనుక అబ్రహాము దగ్గర పదియవవంతు పుచ్చుకొన్నాడు.

**లేవీకంటే శ్రేష్ఠుడు (4-10వ.)** : అబ్రాహామునకు ఆది 14వ అధ్యా. సొదమ గొమర్రా రాజును శత్రువుల నుండి విడిపించినపుడు కొల్లసొమ్ము దొరికెను. అందులో అబ్రహాము మెల్కీసెదెకునకు దశమభాగమిచ్చెను. అబ్రహాము దశమభాగ మిచ్చినపుడు అందరి దగ్గర దశమ భాగము పుచ్చుకొను లేవి అబ్రహాము గర్భమందున్నందున లేవీయు మెల్కీసెదెకుకు దశమ భాగము ఇచ్చినట్లేయని చూడగలము. దశమ భాగము ఇచ్చిన

వానికంటె పుచ్చుకొనువాడు శ్రేష్ఠుడు కనుక లేవీకంటె మెల్కీసెదెకు శ్రేష్ఠుడు. మెల్కీసెదెకును పోలిన మనుష్య కుమారుడైన క్రీస్తు లేవీకంటే శ్రేష్ఠుడు.

**లేవీ యాజకత్వము క్రీస్తుకు అప్పగించబడినందున క్రీస్తు శ్రేష్ఠుడు (11-16వ.) :** ధర్మశాస్త్రమునందు యాజకత్వము లేవీయుల కివ్వబడినది. కాని లేవీ గోత్రమునకు, అహరోను క్రమమునకు చెందనివాడు, మెల్కీసెదెకు క్రమమునకు చెందిన క్రీస్తుకు యాజకత్వ మివ్వబడినది. శరీరానుసారముగా నెరవేర్చబడు ఆజ్ఞలు గల ధర్మశాస్త్రమును బట్టి లేవీయులు యాజకులైరి. నాశనములేని జీవమునకున్న శక్తిని బట్టి క్రీస్తు యాజకుడై నందున క్రీస్తు లేవికంటే శ్రేష్ఠుడు.

**క్రీస్తు మరణించి లేచినందున నిరంతరము జీవించు యాజకుడు (17-22వ.) :** ధర్మశాస్త్రము బలహీనమైనది, నిష్ప్రయోజనమైనది కనుక నివారణ చేయబడినది. దాని వెంట శ్రేష్ఠమైన నిరీక్షణ (నిబంధన) ప్రవేశపెట్టబడి నిరంతరము ఉండువాడైన క్రీస్తును, మార్పులేని యాజకత్వము జరిగించు క్రీస్తును, నిరంతర యాజకుడుగా నియమించెను.

**బలహీన యాజకులైన లేవీయులు - సంపూర్ణ యాజకుడైన క్రీస్తు (23-28వ.) :** లేవీ గోత్రమందలి యాజకులు బలహీనులు, పాపమును బట్టి మరణించుట చేత ఎల్లప్పుడు ఉండలేరు. 26వ. క్రీస్తు పవిత్రుడు, నిర్దోషి, నిష్కల్మషుడు, పాపులలో చేరక ప్రత్యేకముగా నున్నవాడు కనుక సంపూర్ణుడు, తన యొద్దకు వచ్చు వారిని సంపూర్ణముగా రక్షించువాడు. పాపముల విషయమై సదాకాలము నిలుచు ఒకే బలిని ఒక్కసారే అర్పించి ముగించెను.

## 8వ అధ్యాయము 6+7=13 వచనములు
## అంశము : శ్రేష్ఠమైన గుడారమునకు, నిబంధనకు సేవకుడైన క్రీస్తు

**శ్రేష్ఠమైన గుడారమునకు సేవకుడు (1-6వ.) :** ధర్మశాస్త్ర ప్రకారం నియమించబడిన యాజకులు పరలోక సంబంధమగు వస్తువుల ఛాయా రూపకమైన గుడారమందు (ప్రత్యక్ష గుడారము అను దేవాలయము) సేవ చేయుదురు. క్రీస్తు పరలోకమందలి ఆలయము అనగా మహామహుడగు దేవుని సన్నిధిలో (దేవాలయము అనగా దేవుడు నివసించు స్థలము లేదా దేవుని సన్నిధి) కుడి పార్శ్వమున కూర్చుండియున్నాడు కనుక ప్రత్యక్ష గుడారముకంటే శ్రేష్ఠమైన గుడారమగు పరలోకములో సేవకుడుగా దేవుని సన్నిధియగు పరిశుద్ధ ఆలయములో ప్రధాన యాజకుడుగా ఉన్నాడు కనుక క్రీస్తు శ్రేష్ఠమైన

గుడారమునకు సేవకుడు. ప్రతి ప్రధాన యాజకుడు భూమి మీద అర్పణలు అర్పించుదురు. క్రీస్తు కన్నీళ్ళతోను, రోదనతోను మన కొరకు ప్రార్థనలు యాచనలు గత 2000 యేండ్లుగా దేవునికి సమర్పించుచున్నందును భూమి మీదనుండిన యాజకుల కంటె శ్రేష్ఠమైన అర్పణను క్రీస్తు అర్పించుచున్నాడు. అందువలన లేవి గోత్రమునకు చెందిన యాజకుల సేవకత్వముకంటే క్రీస్తు సేవకత్వము శ్రేష్ఠమైనది.

**శ్రేష్ఠమైన నిబంధనకు సేవకుడు (7-13వ.)** : మొదటి నిబంధన లోపము కలిగినది కనుక దేవుడు క్రొత్త నిబంధన చేసెను. రోమా 8:2వ ప్రకారము మానవులను పాపము వలన వచ్చు జీతము మరణము అను పాప మరణముల నియమము నుండి ధర్మ శాస్త్రము విడిపింపలేక పోయినది. క్రీస్తు యేసునందలి జీవమునిచ్చు ఆత్మయొక్క నియమము (క్రొత్త నిబంధన) పాప మరణముల నియమము నుండి నన్ను విడిపించెను. ఈ క్రొత్త నిబంధన క్రీస్తు యేసునందున్నదని శ్రేష్ఠమైన నిబంధనయని, క్రీస్తు శ్రేష్ఠమైన నిబంధనకు మధ్యవర్తియని నేర్చుకొనుచున్నాము.

## 9వ అధ్యాయము 5+5+6+6+6=28 వచనములు
## అంశము : శ్రేష్ఠమైన నిబంధనను బట్టి కలిగిన శ్రేష్ఠమైన బల్యర్పణ చేసిన క్రీస్తు

**పాతన నిబంధనలోని ప్రత్యక్షగుడార ఉపకరణములు (1-5వ)** : మొదట నిబంధన సేవా నియమములు లోక సంబంధమైన మందిరములోని పరిశుద్ధ స్థలములోనుండును. మొదట మందిరముగా ఒక గుడారము ఏర్పడింది. అందులో ముందుగా పరిశుద్ధ స్థలము దాని లోపల అతి పరిశుద్ధ స్థలముండెను. పరిశుద్ధ స్థలములో 1) దీప స్థంభము, 2) సన్నిధి రొట్టెల బల్ల దాని మీద రెండు వరుసలలో ఉంచబడిన ఆ 6+6 రొట్టెలు, 3) దూపవేదికనుండెను. రెండవ తెరకు లోపల అతి పరిశుద్ధ స్థలము ఉండెను. అందులో 1) మన్నాగల బంగార పాత్ర, 2) చిగిరించిన అహరోను కర్ర, 3) నిబంధన పలకలు కలిగిన ఒక్క పెట్టెవంటి బంగారు రేకుతో తాపబడిన నిబంధన మందసము ఉండెను. ఈ మందసము పైనున్న కరుణ పీఠమును కప్పుచున్న రెండు కెరూబులు రెండు ఎదురెదురు మూలలపైననుండును.

**గుడారములోని సేవ - మొదట నిబంధనలోని లోపము (6-10వ.)** : గుడారములో యాజకులు సేవ చేయుచు నిత్యము మొదట గుడారమగు పరిశుద్ధ స్థలములోనికి

మాత్రమే వెళ్ళుదురు. సంవత్సరమునకు ఒక్కసారి మాత్రమే ప్రధాన యాజకుడు ఒక్కడే రక్తము చేత పట్టుకొని రెండవ గుడారములోనికి అనగా అతి పరిశుద్ధ స్థలములోనికి ప్రవేశించును. ఆ రక్తము తన కొరకు ప్రజల పాపముల కొరకు అర్పించును. ప్రజలయితే పరిశుద్ధ స్థలములోనికి కాని, అతి పరిశుద్ధ స్థలములోనికి కాని వెళ్ళక, ఆవరణములో ఉంటారు. దీని భావము పరలోకమునకు సాదృశ్యముగానున్న అతి పరిశుద్ధ స్థలములోనికి ప్రధాన యాజకు సంవత్సరమునకు ఒక్కసారి మాత్రమే వెళ్ళును యాజకులు కాని ప్రజలు కాని వెళ్ళుటకు వీలు లేదు. పాతనిబంధన దాని సేవ లోపము కలది. కనుక ప్రతి ఏట అర్పించబడు బలులు, అర్పణల ద్వారా ఆరాధికునికి సంపూర్ణ సిద్ధి కలుగలేదు. అందుకే ప్రధాన యాజకులు సంవత్సరము తర్వాత సంవత్సరము బలులు అర్పించుచుండిరి.

**పరలోకమందున్న దేవుని యొద్దకు మార్గమును ఏర్పర్చిన క్రీస్తు బల్యర్పణ - రక్తము ద్వారా క్రొత్త నిబంధనకు మధ్యవర్తియైన క్రీస్తు (11-16వ.)** : 10:1 ప్రకారము ధర్మశాస్త్రము రాబోవుచున్న మేలుల ఛాయ కలది కాని, క్రీస్తు రాబోవుచున్న మేలుల నిజ స్వరూపమని కొలస్స. 2:17లో ఉన్నది. క్రీస్తు రాబోవుచున్న మేలుల విషయమై ప్రధాన యాజకుడుగా వచ్చి నిత్యమైన విమోచన, తన రక్తము ద్వారా సంపాదించి పరిపూర్ణమైన గుడారమగు తన శరీరము ద్వారా మేకల రక్తముతో కాక తన స్వరక్తముతో ఒక్కసారే పరిశుద్ధ స్థలమయిన పరలోకములో ప్రవేశించెను కనుక ఆయన మరణము ద్వారా మన అపరాధములకు క్షమాపణ దొరికినది. నిత్యమైన స్వాస్థ్యమగు పరలోకము మనకు లభించుటను గూర్చిన వాగ్దానమునకు అనగా క్రొత్త నిబంధనకు క్రీస్తు మధ్యవర్తియై యున్నాడు.

**ధర్మశాస్త్ర ప్రకారము రక్తము చిందించుట ద్వారా పాప క్షమాపణ (17-22వ.)** : మొదట నిబంధనలో యాజకులు ఎడ్ల యొక్కయు మేకల యొక్క రక్తమును, గ్రంథము మీదను, గుడారము మీదను సేవా పాత్రల మీదను ప్రజలందరి మీదను ప్రోక్షించెదరు. ఎందుకనగా 22వ. ప్రకారము రక్తము చిందించకుండా పాప క్షమాపణ కలుగదు.

**క్రీస్తు యొక్క శ్రేష్ఠమైన బల్యర్పణ ద్వారా కలిగిన సంపూర్ణ పాప క్షమాపణ (23-28వ.)**: హెబ్రీ. 10:4 ప్రకారము ఎడ్లయొక్కయు మేకల యొక్కయు రక్తము పాపము తీసివేయుట అసాధ్యము. ధర్మశాస్త్ర ఆచరణను బట్టి పరలోకమందున్న వాటిని పోలిన వస్తువులు జంతు బలుల వలన శుద్ధి చేయబడెను కాని పరలోక సంబంధమైనవి వీటికంటె శ్రేష్ఠమైన

క్రీస్తు బల్యర్పణ ద్వారా శుద్ధి చేయబడెను కనుక క్రీస్తు దేవాలయములోని అతి పరిశుద్ధ స్థలములో ప్రవేశించ లేదు కాని అతి పరిశుద్ధ స్థలము దేనికి పోలికగానున్నదో ఆ పరలోకములో ప్రవేశించెను.

ప్రధాన యాజకునివలె అనేక పర్యాయములు కాక తన్ను తాను ఒక్కసారే బలిగా అర్పించుకొనుట ద్వారా పాప నివారణ చేయును. తన కొరకు కనిపెట్టుకొను యుండు వారి రక్షణ కొర్కై ఇంకొక్కసారి ఈ లోకములో ప్రత్యక్షమాయెను. క్రీస్తు యొక్క మూడు ప్రత్యక్షతలు రెండు భూలోకములో ఒకటి పరలోకములో ఈ భాగములో చూడగలము. 1) 26వ. ప్రకారము పాప నివారణ చేయుటకు 2 వేల యేండ్ల కాలములో ఈ లోకములో ప్రత్యక్షమాయెను. (గతకాలము) 2) 24వ. ప్రకారము మన కొర్కై విజ్ఞాపన చేయుటకు క్రీస్తు ప్రస్తుతము గత 2వేల యేండ్లుగా పరలోకములలో ప్రత్యక్షమైయున్నాడు. (వర్తమాన కాలము) 3) 28వ ప్రకారము తన కొరకు కనిపెట్టుకొని యుండు వారి రక్షణ కొర్కై పాపము లేకుండా ఈ లోకములో రెండవసారిగా లేదా చివరి సారిగా ప్రత్యక్షమగును.

## 10వ అధ్యాయము 4+5+5+4+7+6+8=39 వచనములు
## అంశము : శ్రేష్ఠమైన బలిని అర్పించిన క్రీస్తు (9:21-10:18)

**విభజన - పాత నిబంధన బలులు (1-4వ.)** : ధర్మశాస్త్రము రాబోవుచున్న మేలుల ఛాయయేగాని నిజ స్వరూపము కానేకాదు కనుక అర్పించబడు బలులు కూడా స్వరూపము కలిగినవి కావు. వాటిద్వారా పాప క్షమాపణ కలుగదు. అవి జ్ఞాపకార్థమైనవే కనుక ఏటేట పాపమును జ్ఞాపకము చేయును. పుట్టిన దినమువలే ఏటేటా చేసిన పాపము జ్ఞాపకమునకు వచ్చుచుండెను. పాపము తీసివేయబడలేదు.

**క్రొత్త నిబంధన బలికి లేఖనముల ఆధారము (5-9వ.)** : క్రీస్తు యేసు కీర్త. 40:6-9 వచనములలో తనను గూర్చి ప్రవచించబడిన రీతిగా తన్ను తాను బలిగా అర్పించుకొను నిమిత్తము శరీరము అమర్చుకొని ఈ లోకమునకు వచ్చెను.

**శ్రేష్ఠమైన బలిని అర్పించిన క్రీస్తు (10-14వ.)** : ప్రతి ప్రధాన యాజకుడు పాపమును ఎన్నటికి తీసివేయని అనేక బలులనే మాటిమాటికి అర్పించుచు గుడారములో నిలువబడి సేవ చేయుచుండెను. ఈయనైతే పాపములను క్షమించుటకు సదాకాలము నిలుచు ఒక్కబలిని ఒక్కసారే అర్పించి కార్యము ముగించినందున దేవుని కుడిపార్శ్వమున

కూర్చుండియున్నాడు. ప్రతి ప్రధాన యాజకుడు భూమి మీద దేవాళయములో నిలువబడియుండుట ద్వారా కార్యము సంపూర్తి కాలేదని క్రీస్తు పరలోకములో కూర్చుండి యుండుట ద్వారా పాప క్షమాపణ కార్యమును సంపూర్తి చేసి యున్నాడని నేర్చుకొను చున్నాము.

**క్రీస్తు బలివలన కలిగిన ఫలితము (15-18వ.)** : క్రీస్తు బలి వలన పాపములకు సంపూర్ణమైన క్షమాపణ కలిగినందున పాప పరిహారార్థ బలి ఇక ఎన్నడును ఉండదు, 17వ.లో పాపములను, అతిక్రమములను ఇక ఎన్నడు జ్ఞాపకము చేసుకొనను అన్నాడు. కీర్త. 103:12, యెషయా 37:17లో, మీకా 7:19లో, యెషయా 43:2లో చెప్పిన మాటను యేసు ప్రభువు మరల జ్ఞాపకము చేసియున్నాడు. 1 కొరి. 6:11 వ్రాయబడిన మాట ప్రకారము దేవుని ఆత్మయందు కడుగబడినవారై పరిశుద్ధ పరచబడి, నీతిమంతులుగా తీర్చబడితిరి.

**అయిదవ జాగ్రత్త - మనస్సాక్షికి కల్మషము తగలకుండా కాపాడుకొనుట (19-39వ.):** యేసుక్రీస్తు తన శరీరమందు మరణము ద్వారా చిందించిన రక్తమును బట్టి అతి పరిశుద్ధ స్థలమైన పరలోకమున ప్రవేశించినందున మనమును అక్కడకు వెళ్ళుదుమను నిరీక్షణ కలిగియున్నాము. పరిశుద్ధ స్థలములో ప్రవేశించవలసిన వారము కనుక పాపము చేసి మనస్సాక్షికి కల్మషము కలిగించు వారముగానుండరాదు. ప్రోక్షించబడిన హృదయము కలవారమై దేవుని సన్నిధికి అనగా పరలోకమునకు చేరువారమైయుండాలి. కొందరు సమాజముగా కూడుట మానుచున్నారు. సహవాసమునకు రాకపోవుట ద్వారా క్రీస్తుకు దూరము కాగలము. బుద్ధి పూర్వకముగా పాపము చేయుగలము. 32వ వచనంలో మీరు వెలిగింపబడినవారని, 26వ.లో సత్యము గూర్చి అనుభవ జ్ఞానము కలవారని వ్రాయబడినందున హెచ్చరిక విశ్వాసులను గూర్చినదియే అని గుర్తించుచున్నాము. 26 వచనములో బుద్ధి పూర్వకముగా పాపము చేయుచుండిన యెడల (Keep on Sinning) న్యాయపు తీర్పును ఎదుర్కొనాలి. విరోధులను దహించు తీక్షణమైన అగ్నియుండునని వ్రాయబడినది.. న్యాయపు తీర్పు జరుగుస్థలము క్రీస్తు న్యాయపీఠమే అని గమనించ వలెను. 2 కొరి. 5:10, 1 కొరి. 3:13-15లో వివరములు హెబ్రీ 6:1-8వ వచనములలో వివరించబడియున్నవి. మరొకసారి వాటిని చదవండి. హెబ్రీ. 10:29లో కృపకు మూలముగ

ఆత్మను తిరస్కరించుట అనగా పరిశుద్ధాత్ముడు పాపము చేయకూడదని మన హృదయములో మనకు చెప్పుచున్నను బుద్ధి పూర్వకముగా పాపము చేయుటయే అని గమనించాలి. అటువంటి వారికి ఎక్కువైన దండన అనగా వారి ఫలమును పోగొట్టుకొని నష్టము పొందుటయే అని గమనించగలము. 30వ.లో ప్రభువు తన ప్రజలకు అనగా రక్షింపబడిన వారికి తీర్పు తీర్చునని ప్రతిఫల మిచ్చునని ఉన్నందున దీని వివరము 2 కొరి. 5:10 యే అని నేర్చుకొనవలెను. 32-39వ.లలో క్రీస్తులో వెలిగింపబడిన వారు శ్రమలతో కూడిన గొప్ప పోరాటము సహించినవారు శ్రేష్ఠమైనదియు స్థిరమైనదియునైన స్వాస్థమున్నదని ఆస్తిని కోల్పోవుటకు సంతోషముగా ఒప్పుకొనువారు ఇపుడు వెనుక తీయకూడదని అనగా పాపమునకు తావు ఇవ్వకూడదని హెచ్చరించుచున్నారు. 9:35-37వ.లో త్వరగా రాబోవు క్రీస్తుద్వారా ప్రతి ఫలముగ కలుగు బహుమానమందు గురిపెట్టు కొనవలెననియు చెప్పుచున్నారు.

## 11వ అధ్యాయము 7+7+8+7+6+5=40 వచనములు

## అంశము : శ్రేష్ఠమైన శక్తిగల విశ్వాసమునకు కర్త (విశ్వాసము యొక్క విజయం)

విభజన - విశ్వాసపరులైన పూర్వీకుల విజయములు (1-7వ.) : 1-3వ.లలో విశ్వాసము యొక్క నిర్వచనం గురించి చెప్పుచున్నాడు. విశ్వాసమనగా అదృశ్యమైనవి ఉన్నవనుటకు రుజువు. అనేకులు క్రీస్తు మాకు కనబడితే నమ్ముతామంటారు కాని కనబడకుండ నమ్ముటయే విశ్వాసము 4వ.లో విశ్వాసమును బట్టి హెబేలు కయీనుకంటే శ్రేష్ఠమైన బలి అర్పించాడని హెబేలు నీతిమంతుడని దేవుడు సాక్ష్యమిచ్చెను. హెబేలు ఆరాధన సమర్పణ శ్రేష్ఠమైనది 5-6వ.లలో విశ్వాసమును బట్టి హనోకు యొక్క విజయము చెప్పబడింది. హనోకు దేవునికి ఇష్టుడని, ఆది. 5:22 ప్రకారము దేవునితో నడిచెనని సాక్ష్యము పొందెను. 7వ. నోవహు విజయము చెప్పబడింది. నోవహు విశ్వాసమును బట్టి తానుచూడని సంగతులను అనగా రాబోవు జల ప్రళయమును గురించి లోకమునకు 2 పేతురు 2:5 వచన ప్రకారము ప్రకటించి అందు నుండి రక్షింపబడుటకు అవసరమైన ఓడను సిద్ధము చేసుకొనెను. నీతికి వారసుడని చెప్పబడింది.

విశ్వాస పరులైన పితరుల విజయము (8-14, 15-22వ.) : 8-19వ.లలో విశ్వాస వీరుడైన అబ్రాహాము విజయము చెప్పబడింది. కల్దీయుల దేశములో ఉండగా అబ్రాహాము

మహిమగల దేవుని పిలుపుకు లోబడ్డాడని అ.కా. 7:1-4లోనున్నది. ఎక్కడికి వెళ్ళవలెనో ఎరుగక బయలు వెళ్ళెను. దేవుడు శిల్పియు నిర్మాణకుడైన పరలోక పట్టణము అనగా శ్రేష్ఠమైన దేశము కొరకు ఎదురు చూచెను. ఈ లోకములో పరదేశులమని గుర్తించి తాను బయలుదేరి వచ్చిన దేశమును, ఊరును జ్ఞాపకమందు ఉంచుకొనలేదు. తాను బయలుదేరి వచ్చిన ఊరిపేరు ఊరు అయినను జ్ఞాపకమందు ఉంచుకొనలేదని మరలా వెళ్ళుటకు వీలు లేనట్లుగా మరిచాడని చెప్పబడింది. మీ ఊరు ఏదని ఎవరైనా అడిగినను నా ఊరు జ్ఞాపకము లేదంటాడు. మాటల మధ్య ఊరు ప్రస్తావన వచ్చినను జ్ఞాపకమునకు రాకపోవుట ఆశ్చర్యము.

అందుకే అబ్రాహామును దేవుడు పరిశోధించుటకై తన కుమారుడైన ఇస్సాకును బలి చేయమన్నపుడు దేవుడు మృతులను సైతము లేపుటకు శక్తిమంతుడని ఇస్సాకును బలిగా ఇవ్వడానికి సిద్ధమయ్యాడు. అందుకు దేవుడు అబ్రాహాము దేవుడని పిలువ బడుటకు సిగ్గుపడలేదు. 20-22వ.లలో విశ్వాసపరులైన ఇస్సాకు, యాకోబు, యోసేపుల విజయము చెప్పబడింది.

**విశ్వాసపరుడైన మోషే విజయము (23-29వ.)** : మోషే పుట్టినపుడు సుందరుడైనను బానిసగా పుట్టినవాడే కాని, రాజకుమార్తె యొక్క కుమారుడుగాను రానున్న దినములలో ఐగుప్తును పాలించు రాజుగ పెరిగెను. కాని మోషే పెద్దవాడైనపుడు 1. ఐగుప్తు ధనముకంటే క్రీస్తు విషయమైన నింద అనుభవించుట గొప్ప భాగ్యమని, 2) అల్పకాల పాప భోగము కంటె దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలని, 3) ఫరో కుమార్తె కుమారుడుగా అనిపించుకొనుట కంటె క్రీస్తు కుమారుడుగా కొనసాగుట మేలని తీర్మానించుకున్నాడు. ఫరో రాజు గ్రహించగా ఐగుప్తును విడిచిపోయాడు. పస్కాలోని రక్త ప్రోక్షణ ద్వారా రక్షణను ఆచరించాడు. ఎర్ర సముద్రములో పొడి నేల మీద నడిచి వెళ్ళాడు. నలభై ఏండ్లు అరణ్యములో ఇశ్రాయేలీయులను కనాను వరకు నడిపించాడు. అందువలన మోషేను విశ్వాస పరుడైన విజయుడుగా గమనించుచున్నాము.

**విశ్వాస పరులైన విడుదల పొందిన వారి విజయము (30-35వ.)** : విశ్వాసమును బట్టి రాహాబు నశింపక నాశనము నుండి తప్పించుకొనెను. గిద్యోను, బారాకు, సమ్సోను, ఎఫ్తా, దావీదు, సమూయేలు అను ప్రవక్తలు అనేక కార్యములు చేసిరి. విశ్వాసమును

బట్టి దానియేలు సింహపు నోళ్ళు మూయించెను. దావీదు సింహమును చీల్చెను. కాని ఇంగ్లాండు దేశములో గొప్ప సేవ చేసిన డేవిడ్ లివింగ్స్టన్‌ను సింహము పట్టుకొనెను. షద్రక్, మేషక్, అబెద్నగోలు అగ్ని గోళములను చల్లార్చెను. స్త్రీలు కొద్దిమంది మృతులైన తమ వారిని బేతనియలోని లాజరువలె బ్రతుకుట ద్వారా పొందిరి. (యోహా. 11 అధ్యా.)

**విశ్వాస వరులైనను విడుదల పొందనొల్లక యాతన పెట్టబడిన వారి విజయం (35-43వ.)** : కొందరు తిరస్కారము కొరడా దెబ్బలును బంధకముల ఖైదీను మరణము మట్టుకు అనుభవించిరి. చరిత్రలో వ్రాయబడినట్టు యిర్మీయా స్తెఫను, పౌలును చనిపోవు వరకు రాళ్ళ చేతకొట్టబడిరి. ప్రవక్తయైన యెషయా వలె రంపముల చేత కోయబడిన వారు ఖడ్గముతో చంపబడిన వారు అనేకమంది కలరు. అడవులలోను, కొండలలోను దాగియుండిరి. అట్టివారికి ఈ లోకము యోగ్యము కాదు. పొందనొల్లకపోయినను, విడుదల పొందనొల్లక యాతన పడినను వారందరు విశ్వాసము ద్వారా విజయులే అని నేర్చుకొనగలము. 39-40వ.లో పైన చెప్పబడినను మనము లేకుండ వారు సంపూర్ణులు కాకపోయిరని వ్రాయ బడెను కనుక దేవుడు మన కొరకు మరి శ్రేష్ఠమైన వాటిని సిద్ధపరచియున్నాడని గమనించ వలెను.

## 12వ అధ్యాయము 4+7+3+10+5=29 వచనములు
## అంశము : శ్రేష్ఠమైన శక్తిగల నిరీక్షణకు కర్త

**నిరీక్షణతో కూడిన ఓర్పుగలవారైయుండుట (1-4వ.)** : పై అధ్యాయములో క్రీస్తు విశ్వాసమునకు కర్తయని చూచితిమి. 11వ అధ్యాయములో చెప్పబడినవారితో పాటు పాత నిబంధన భక్తులు, క్రొత్త నిబంధన కాలములో మరణించి ప్రభువు చెంతనున్న భక్తులు గొప్ప సాక్షి సమూహముగా మేఘమువలె మనలను ఆవరించియున్నారు. మన ముందున్న ఆత్మీయ పందెపు రంగమందు ఎంత ఓపికతో నిరీక్షణ కలిగి పరుగెత్తు చున్నామో గమనించుచున్నారు. 11వ అధ్యాయములో వారి పరుగును ముందుగా ప్రభువు మనకు జ్ఞాపకము చేయుట గమనించదగినది. అదే సమయములో క్రీస్తు యేసు పరుగును కూడా మొదటి వచనములో జ్ఞాపకము చేయుచున్నాడు. మనమును విసుకక క్రీస్తును తలంచుకొని నిరీక్షన కలిగి గురియొద్దకు పరుగెత్తాలి. 1) మన మీద ఉన్న ప్రతి భారమును విడిచి పెట్టాలి, 2) పాపమును విడిచిపెట్టాలి. అనేక భారములను విశ్వాసులు తమపై మోపు కొందురు. వాటన్నిటిని విడిచిపెట్టాలి.

**ప్రభువిచ్చు శిక్షను (తర్ఫీదు) గూర్చిన నిరీక్షణ కలిగియుండుట (5-11వ.)** : ఈ ఏడు వచనములలో 9 పర్యాయములు శిక్ష అను పదము కనుపించును. తండ్రివలె ప్రభువు పందెమందు పరుగెత్తు మనలను శిక్షించును. తండ్రి క్రమశిక్ష కొరకే శిక్షించును కాని నశింపచేయుటకు కాదని గమనించాలి. అలాగే ప్రభువు మనకు క్రమశిక్షను అలవరచుటకే శిక్షించును కాని మనలను నశింపచేయుటకు కాదు. శిక్షాఫలము మనము పొందుదుమని 7వ వచనములో చెప్పుచున్నాడు. 10వ వచనములో మనము పరిశుద్ధతలో పాలు పొంద వలెనని మన మేలు కొరకే మనలను శిక్షించుచున్నాడని గమనించదగినది.

**సడలిన మోకాళ్ళను బలపరచుట (ప్రార్థన) (12-14వ.)** : ప్రభువు పరిశుద్ధుడు మనము పరిశుద్ధులముగానుండాలి కనుక బలహీనమైన మన చేతులు (సాక్ష్యము) బలపరచ బడుట, బలహీనమైన మోకాళ్ళు (ప్రార్థన) బలపరచబడుట ఎంతో అవసరము. 1 తిమోతి 2:8వలోనున్న పవిత్రమైన చేతులెత్తుట మంచి సాక్ష్యము కలిగి ప్రార్థనలో శక్తిని పొందుటకు గురుతు.

**ఆరవజాగ్రత్త. పరిశుద్ధత లేకపోవుట - దేవుని కృపను పొందకుండ తప్పిపోవుట (15-24వ.)** : క్రీస్తును నమ్మినవారు పరలోకపు యెరూషలేము అనగా ప్రకటన 21వ అధ్యాయములో చెప్పబడిన నూతన యెరూషలేములోనికి వెళ్ళువారు అక్కడ పరిశుద్ధుడైన యేసుతో నుండవలెను. కనుక పాపమును ప్రేమింపకూడదు. ఏశావు వలె శరీరమునకు గాని దాని ఆశలకు గాని తావివ్వకూడదు. శరీరమును ప్రేమించినవారు లోకమును ప్రేమించి లోతుగా వెళ్ళిన వారు మారుమనస్సు పొంది మరల విశ్వాస యాత్రలోనికి రాని ఆదికాండము లోతువంటి వారనేకులు కలరు. కనుక జాగ్రత్తగా నుండాలి.

**ఏడవ జాగ్రత్త. బుద్ధి చెప్పువారిని విసర్జించకుండుట - ప్రీతికరమైన సేవ చేయుట (25-29వ.)** : భూలోకములోను, పరలోకములోను మనకు బుద్ధి చెప్పువారున్నారు. వారి మాటలను 13:17లో చెప్పబడినట్లు మన్నన చేయుచూ జాగ్రత్త లేనియెడల దేవుని తీర్పు ఉన్నదని గమనించాలి. మన దేవుడు దహించు అగ్ని (29వ.) 1 కొరింథీ. 3:13-15వ. ప్రకారము మన క్రియలు అగ్నిచేత పరీక్షింపబడి మనము ఫలమును/జీతమును/ కిరీటములను పొందుదుము. దహించు అగ్ని ద్వారా మన పని/క్రియలు కాలిపోయి మనకు నష్టము కలుగవచ్చును కాని అగ్నిలో నుండి తప్పించుకొన్నట్టు "తన మట్టుకు

రక్షింపబడును" అన్న మాట ప్రకారము రక్షణ శాశ్వతము. హెబ్రీ 6:1-8వ వచనములలోను ఈ సంగతి వివరించబడినది.

## 13వ అధ్యాయము 6+7+6+6=25 వచనములు
## అంశము : శ్రేష్ఠమైన శక్తిగల ప్రేమకు కర్త

**వ్యక్తిగత జీవితములో శక్తిగల ప్రేమను గూర్చిన ఏడు హెచ్చరికలు (1-6వ.) :** ఈ భాగమందున్న ప్రేమ అను పదము PHICADELPHIA అని 2) అతిథ్యము అను పదము PHILOGURIOUS అని గ్రీకు భాషలో ఉన్నది. PHILO అనగా ప్రేమ అని అర్థము. శ్రేష్ఠమైనది ప్రేమ అని 1 కొరి. 13:13లోనున్నది. ఆ శ్రేష్ఠమైన ప్రేమకు క్రీస్తు కర్త. మనమును ఆ ప్రేమ సంబంధమైన కార్యములు జరిగించు వారముగానుండాలి.

1) సహోదర ప్రేమలో నిలువరముగానుండాలి (1వ.), 2) అతిథ్యము చేయ మరవకూడదు (1వ), 3) బంధకములలో ఉన్నవారిని జ్ఞాపకము చేసుకొనాలి (2వ.) కొద్దిమంది శరీర బంధకములలోను, మరి కొద్దిమంది మానసిక బంధకములలోను, మరి కొద్దిమంది ఆత్మీయ బంధకములు బలహీనతలలో ఉన్నారు. వారిని జ్ఞాపకము చేసుకొనాలి, 4) కష్టములలో ఉన్న వారిని జ్ఞాపకము చేసుకొనాలి (3వ), 5) వివాహము (ప్రేమ) అన్ని విషయములలో ఘనమైనది. పవిత్రత ముఖ్యము (4వ), 6) ధనాపేక్ష లేనివారుగానుండాలి (5వ.), 7) ప్రభువు సహాయకుడు గనుక భయపడకుండా ఉండాలి.

**సహవాస జీవితమును గూర్చిన హెచ్చరికలు (7-13వ.) :** సహవాసములో ఉన్న మనకు వాక్యమును బోధించి, నాయకులుగానున్న వారున్నారు. 1) వారిని, 2) వారి ప్రవర్తన ఫలమును తలంచుకొనాలి, 3) వారి విశ్వాసమును అనుసరించాలి. అన్నింటి కంటే గొప్ప బోధకుడు నాయకుడైన యేసు మాదిరి మనమనుసరించాలి. మనలను ప్రేమించి మన పాప క్షమాపణ కొరకు భారమైన సిలువను యెరూషలేము పట్టణ వెలుపలికి (11వ వచన ప్రకారము శిబిరము వెలుపలికి) మోసి మన కొరకు పాప పరిహారార్థముగా బలియై దహించ బడిన యేసును జ్ఞాపకముంచుకొనాలి. ఆయన ప్రేమతోనే మన కొరకు ప్రాణము పెట్టెనని దీని వలన క్రీస్తు ప్రేమ ఎట్టిదో మనము తెలుసుకొనగలము (1 యోహాను 3:16వ.) అందుకే క్రీస్తును శ్రేష్ఠమైన ప్రేమకుకర్తగా తలంచుచున్నాము.

**ఆత్మీయ జీవితమును గూర్చిన హెచ్చరికలు (14-19వ.)** : ఆయన శ్రేష్ఠమైన ప్రేమను తలపోసికొనుచు అశాశ్వతమైన ఈ లోకములో మన నోరు విప్పి జిహ్వా ఫలమును అనగా నాలుక ద్వారా దేవునికి స్తుతులు చెల్లించవలెనని నేర్చుకొనుచున్నాము. క్రీస్తు నివసించు ఆ రాజ్యమును మనము పొందుదుమన్న నిరీక్షణతో దాని కొరకై ఎదురు చూచుచున్నాము.

**శ్రేష్ఠమైన కాపరియైన క్రీస్తు (20:21వ.) - వందనములు (22-24వ.) (20-25వ.)** : క్రీస్తును 1) గతములో మన కొరకు ప్రాణము పెట్టిన మంచి కాపరిగా యోహాను 10:11వ. వచనములోను, ప్రస్తుతము మనలను భద్రపరచు గొప్ప కాపరిగా హెబ్రీ. 13:20వ.లోను, 3) మన కొరకు మరల ప్రత్యక్షమగు ప్రధాన కాపరిగా, 1 పేతురు 5:4వ.లోను చూతము. హెబ్రీయులు ప్రతి మంచి విషయములో దేవుని చిత్త ప్రకారము చేయుటకు దేవుడు వారిని సిద్ధపరచవలెనని ఆశించుచున్నాడు.

మన సహోదరుడైన తిమోతి అని సంబోధించినందున గ్రంథకర్త తిమోతికి సన్నిహితుడైన పౌలేనని తలంచగలము. తిమోతికి విడుదల కలిగినదన్నందున గ్రంథకర్త చెరలోనున్నాడని తలంచగలము. ఇటలీలోని సహోదరులు వందనములు చెప్పుచున్నారు అని అన్నందున ఇటలీ నుండి పౌలు తాను విడుదల పొందని రోములోని రెండవ చెర నుండి క్రీ.శ. 66లో ఈ పత్రిక వ్రాసెనని తలంచగలము.

# పాపము - పరిహారము

పాపము అను పదము ఆదికాండము 4:7వ. నుండి ప్రకటన 18:5వ. వరకు ఏడు వందలకంటే ఎక్కువ పర్యాయములు బైబిలునందు కలదు. దానికి సంబంధించిన అతిక్రమము అను పదము 100కంటే ఎక్కువ పర్యాయములు దోషము అనుపదమును వందకంటే ఎక్కువ పర్యాయములు కనిపించును.

**I. పాపము అను అర్థమిచ్చు గ్రీకు భాషా పదములు :** పాపము అను పదమునకు గ్రీకులో "హెమార్టైమా" అని "పారాబేసిస్" అను రెండు పదములు వాడబడినవి. హెమార్టైమా: ఈ పదము యొక్క అర్థము గురితప్పుట. రోమా 2:23వ. ప్రకారము దేవుడు మానవునికి తన మహిమనిచ్చాడు. కాని మానవుడు ఆ మహిమను పొందు భాగ్యమును పోగొట్టు కొన్నాడు. మహిమను పొందలేకపోవుట దేవుడు పెట్టిన గురిని తప్పుటయే. మహిమను పొందలేకపోయినందుకు కారణమైన స్వభావ సామర్థ్య హీనతయే పాపము. పాపము శరీర బలహీనత కాదు అను గమనించాలి.

**రెండవ పదము పారాబేసిస్** : దీని భావము దాటకూడని గీతను దాటుట. పరుగు పందెములో కుడి ఎడమ ప్రక్కలలో గీతలుండును. పొరపాటున కాని, తెలిసి కాని ఆ గీతలను దాటుట తప్పు. అలాగే మానవ జీవిత పరుగులో దేవుడిచ్చిన ఆజ్ఞలు దాటకూడని గీతలుగా కలవు. ఆ ఆజ్ఞలను అతిక్రమించుట పాపము. 1 యోహాను 3:4వ ప్రకారము ఆజ్ఞ అతిక్రమమే పాపము. పాపము క్రియా పూర్వకముగానైనను, తలంపులతోనైనను చేయగలము. "వ్యభిచరింపవద్దు" (ద్వితీ. 5:18వ) అను ఆజ్ఞ దేవుడిచ్చాడు. శరీరముతో వ్యభిచరించుట పాపము. అంతేకాక ఒక స్త్రీని మోహపు చూపుతో చూచు ప్రతి వాడు అప్పుడే తన హృదయమందు పాపము చేసిన వాడగును" మత్తయి 5:28. ఇది తలంపుల లోని పాపము. పాపము శరీరములోని ఏ అవయవము ద్వారానైనను క్రియా పూర్వకముగా చేయగలము. తలంపులతోనైనను చేయగలము. కనుక పరిశుద్ధుడైన దేవునికి వ్యతిరేకమైన ఏ తలంపైనను, చర్యయైనను పాపమే.

**II. పాపపు ఉనికి - ప్రారంభము** : దేవుడు మానవుని సృజించక మునుపు దేవదూతలను సృజించెను లేదా చేసెను. దూతలలో ముగ్గురు ప్రధాన దూతలు 1) అపవాది - దేవుని స్తుతించు పని కలవాడు. యెహె. 28:13వ, 2) మిఖాయేలు

యుద్ధములు చేయువాడు ప్రకటన 12:7వ, 3) గబ్రియేలు - వర్తమాన దూత. లూకా 1:19వ. యెహె. 28:11-15వ. దేవునిచే సృజించబడిన అపవాదిని దేవుడు ఏదెను తోటలోనుంచాడు. పిల్లన గ్రోవులు వాయించువారు సిద్ధమైయుండగా అపవాదిని దేవుడు నియమించాడు. దీనిని బట్టి దేవుని కీర్తించి స్తుతించుపని అప్పగించబడినది అని తలంచగలము. 15వ. నీవు నియ మించబడిన దినము మొదలు పాపము నీలో కనబడు వరకు నీవు యథార్థవంతుడవు అని ఉన్నది. అపవాది నియమించబడినపుడు పాపము కనబడలేదు. అనేక దినముల తరువాత పాపము కనిపించినది. యెషయా 14:12-15వ.లో దేవునికంటె తక్కువ స్థాన మందుండు అపవాది ఆకాశమునకు, దేవుడు నివసించు మేఘ మండలము (మన మేఘ మండలము కాదు. కీర్తన. 97:1వలో అయన చుట్టునున్న మేఘ అంధకార మండము) మీదికెక్కుదును. తన సింహాసనమును దేవుని సింహాసనము పైగా హెచ్చించాలని, మహోన్నతునిలో తనను సమానునిగా చేసుకొనవలెనని తలంచాడు. ఇది తలంపులలోని పాపము. ఈ పాపమును బట్టి అక్కడ నుండి త్రోసివేయబడ్డాడు. ప్రకటన 12:3-4వ. ప్రకారము తనతో పాటు తనతో ఏకీభవించిన దూతలలోని మూడవ భాగము కూడా భూమి పైకి నెట్టి వేయబడిరి. చాలాకాలమైన తరువాత దేవుడు నరుని అనగా ఆదామును హవ్వను తన స్వరూపమందు, తన పోలిక చొప్పున చేశాడు. (ఆది. 1:27వ.) అపవాది హవ్వతో నోటి మాటల ద్వారా ఆది 3:4-5వ ఆ పండు తినిన యెడల మీరు చావనే చావరు అని ఒక అబద్ధము, దేవతల వలె నుందురని రెండవ అబద్ధము పలిగెను. అందుకే సాతాను అబద్ధములకు జనకుడని యోహాను 8:44వ.లో ఉన్నది. హవ్వయు దేవుడు దానిని ముట్టకూడదని ఆజ్ఞాపించెనని అబద్ధము చెప్పెను. ఇదినోటి మాటల ద్వారా చేయు పాపము. తదుపరి హవ్వ ఆదాములు ఆ పండు తినుట ద్వారా క్రియా పూర్వకముగా పాపులైరి. కనుక ఆదాము, హవ్వలు సృజించబడినపుడు పవిత్రులే. కొంతకాలము తరువాత అపవాది పాపమును వారి ముందుంచగా వారు పాపమును వారి 1) తలంపులు. 2) వారి నోటి మాటలులోనికి, 3) వారి క్రియలలోనికి ఆహ్వానించి పాపులైరి.

**III. వివిధ పాపములు** : దేవుని వాక్యమందు వ్రాయబడిన పాపములు. కీర్త. 90:8వ ప్రకారము రహస్య పాపములు అనగా మానవ కన్నులను కనిపించని రహస్య పాపములు కలవు అని గుర్తించాలి.

1) ఆజ్ఞ అతిక్రమమే పాపము. 1 యోహాను 3:4వ.

2) సకల దుర్నీతి పాపము. 1 యెహాను 5:17వ.

3) బలహీనులైన వారి మనస్సు నొప్పించుట క్రీస్తుకు విరోధమైన పాపము. 1 కొరింథీ. 8:12వ.

4) విశ్వాస మూలము కానిది పాపము - రోమా 14:23వ.

5) మేలైనది చేయనెరిగి ఆలాగు చేయకపోవుట పాపము - యాకోబు 4:17వ.

6) జారత్వము పాపము. 1 కొరి. 6:18వ.

7) అహంకార దృష్టి, గర్వ హృదయము పాపయుక్తములు. సామె. 21:4వ.

8) నరుల చెడుతనము పాపము. ఆది. 6:5వ.

9) పొరుగువారిని తిరస్కరించుట పాపము - సామె. 14:21వ.

10) అబద్ధ ప్రమాణము చేయుట పాపము - లేవీ. 6:3వ.

11) దేవుని ఆజ్ఞ విషయము చేయరాని కార్యము చేయుట పాపము. లేవీ. 4:2.

12) సోదె చెప్పుట పాపము - 1 సమూ. 15:23వ.

13) తిరుగుబాటు చేయుట పాపము - 1 సమూ. 15:23వ.

14) ప్రార్థన చేయుట మానుట పాపము - 1 సమూ. 12:23వ.

15) ఆత్మ విషయమైన దూషణ క్షమాపణ లేని పాపము - మత్తయి 12:31వ.

16) భక్తిహీనుని వచ్చుబడి పాపము - సామె. 10:16వ.

17) అయోగ్యముగా ప్రభువు యొక్క శరీరమైన రొట్టె రసమును పుచ్చుకొనుట పాపము - 1 కొరింథీ. 11:27వ.

18) సత్క్రియ చేయకపోవుట పాపము - ఆది 4:7వ.

19) దేవునికి విరోధమైనది పాపము - ఆది. 39:9వ.

20) మూర్ఖుని యోచన పాపము - సామెతలు 24:9వ.

21) మోహపు చూపుతో చూచుట హృదయములో పాపము - మత్తయి 5:28వ.

22) హృదయ చెడుతనము పాపము - మార్కు 7:21.

23) కూలివానికి ఏనాటి కూలి ఆనాడు ఇవ్వకపోవుట పాపము - ద్వితీ. 24:14వ.

24) శపితమైనది తీసుకొనుట పాపము - యెహోషువ 7:11వ.

25) యెహోవాను విసర్జించుట పాపము - 1 సమూ. 12:10వ.

26) దురభిమానమైన పాపము - కీర్తనలు 19:13వ.

ఇవి కొన్నియే. ఇవికొన్నియే. వీటికి అనుబంధమైన అనేకములు కలవు.

**IV. పాపము భద్రపరచబడిన విధము :**

1) పాపము ఎల్లప్పుడు మన ఎదుటనున్నది. కీర్త. 51:3వ.

2) పాపము మిమ్మును పట్టుకొనును - సంఖ్యా. 32:23.

3) పాపము ఇనుపగంటముతో వ్రాయబడినది - యిర్మీయా 17:2వ.

4) నా అతిక్రమము సంచిలో ముద్రింపబడినది - యోబు 14:17వ.

5) క్రియలు గ్రంథములో వ్రాయబడినవి. ఆ గ్రంథములు విప్పబడును - ప్రకటన 20:14వ.

**V. a) పాపపు పోలికలు :**

1) పాపము రక్తము వంటిది, కెంపువంటిది - యెషయా 1:18వ.

2) పాపము మరకవంటిది. యిర్మీయా 2:22వ.

3) పాపము బురదవంటిది. 2 పేతురు 2:22వ.

4) పాపము వాంతికి వంటిది. 2 పేతురు 2:22వ.

**b) పాపము చేయువారి పోలికలు :**

1) కుక్క (2 పేతురు 2:22వ).

2) పంది (2 పేతురు 2:22వ.)

3) సింహములు (కీర్తనలు 22:16వ, 22:11-21వ.)

4) గురుపోతులు (కీర్తనలు 22:11-21వ.)

5) వృషభములు (కీర్తనలు 22:11-21వ.)

**VI. పాపమునకు కారణము** : యాకోబు 1:15వ. వలన "దురాశ గర్భము ధరించి పాపమును కనును" అని నేర్చుకొనుచున్నాము. అవ్వ ఆదాముల అవివేక దురాశయే వారిని పాపమునకు నడిపించినది.

**VII. పాపపు ఫలితము** : ఆదాము అను ఒక మనుష్యుని ద్వారా పాపమును పాపము ద్వారా మరణమును లోకములో ప్రవేశించినవి (రోమా 5:12వ.) మనుష్యు లందరు పాపులైరి. రోమా 3:9వ. 3:23వ. 1 యోహాను 1:8వ. 1 రాజులు 8:46వ. ప్రసంగి 7:20వ. పాపమును బట్టి రెండు మరణములకు పాత్రులైరి.

**1) ఆత్మీయ మరణము** : వెంటనే కలిగినది ప్రకటన 21:8వ. ప్రకారము ఆత్మ శరీరమును విడిచిన పిదప అగ్ని గంధకములతో మండు గుండములో నిత్యము కాలుట అని గమనించగలము.

**2) శరీర మరణము** : ఆదాము అవ్వలు సృజించబడినపుడు వారికి మరణము లేదు. పాపమును బట్టి మరణము కలిగినది. పాపమునకు దాసులయ్యారు. రోమా 6:17వ. రోమా 7:19,21,24వ.

1) పాపము వలన వచ్చు జీతము మరణము రోమా 3:23వ.

2) మరణము అదరికి సంప్రాప్తమాయెను రోమా 5:12వ. పాపము తీసివేయబడుట.

ఈ పాపమును తీసివేయుటకు క్రీస్తు ప్రత్యక్షమాయెను అని 1 యోహాను 3:5వ. చెప్పుచున్నది. మొదటి రాకడలో మానవులు చేసిన పాపమునకు ప్రాయశ్చిత్తముగా అనగా కప్పివేయుటకు (హెబ్రీలో ప్రాయశ్చిత్తము అను పదము KAPPORETHఅని ఉన్నది) రక్త మాంసములు గల దేహముతో ఈ లోకములో క్రీస్తు ప్రత్యక్షమయ్యాడు. పాప క్షమాపణకు అవసరమైన తన రక్తమును చిందించాడు. ఇది మానవులు గత కాలములో చేసిన పాపములకు తరువాత కాలములో అనగా రక్షించబడిన తరువాత మరణము వరకు చేయు పాపములను కూడా కప్పుటకు ఈ రక్తము సరిపోవునది. ఆలాగు పాపమును పరిహరించి చనిపోయిన మానవులను బ్రతికించును. పాపమునకు జీతమైన ఆత్మ మరణము నుండి ఎఫెసీ. 2:1-6. ప్రకారము రక్షించబడినపుడే బ్రతికించును. శరీర మరణము నుండి క్రీస్తు ఆకాశమండలమునకు వచ్చినప్పుడు బ్రతికించును. తదుపరి 1 కొరింథీ 15:26వ. వచన ప్రకారము మరణమును నశింపచేయును. ఆ రీతిగా పాపము కాని, పాపపు జీతమైనను మరణము కాని లేకుండ పూర్తిగా తీసివేయును.

**పాపము ద్వారా కలుగు శరీర, మానసిక సామాజిక ఫలితములు :** 1) పాపము మనసునకు గ్రుడ్డితనము కలుగచేయును (1 యోహాను 2:11వ.) 2) సంతోషము - ఆనందమును కోల్పోవుట (కీర్తనలు 51:12వ.) 3) ప్రేమను కోల్పోవుట 1 యోహాను 2:5వ.), 4) సహవాసమును కోల్పోవుట (ఆది. 3:10,23వ.) 5) శరీర బలహీనత రోగము మరణము (1 కొరి. 11:30వ.) 6) వర్షము కురియకపోవుట 2 దిన. 6:26వ. 7) పాపమునకు శిక్షగా కరువు, శత్రువు తరుముట, తెగులు 1 దిన. 21:8-12వ.

**VIII. క్షమాపణ అని పాపము :** మత్తయి 12:31వ. పరిశుద్ధాత్మకు విరోధముగా చేయు పాపమునకు క్షమాపణ లేదు అని ఉన్నది. పరిశుద్ధాత్మ లోకమును పాపమును గూర్చి, నీతిని గూర్చి, తీర్పును గూర్చి ఒప్పుకొన చేయును. పరిశుద్ధాత్మకు విరోధముగా అనగా పరిశుద్ధాత్మ దేవుడు ఒప్పించు విషయములను అంగీకరించకపోవుట అని అర్థము. పరిశుద్ధాత్మ పాపమును గూర్చి, నీతిమంతులుగా తీర్చబడు విధమును గూర్చి ఒప్పుకొన చేయుచుండగా ఒప్పుకొనని వాడు క్షమాపణ పొందలేదు.

**IX. పాపము చేయకుండుట కవసరమైన జాగ్రత్తలు :** పాపము చేయకుండ దేవుని వాక్యము కాపాడును.

1) పాపము చేయకుండునట్లు హృదయములో వాక్యము ఉంచుకొనుట. కీర్తనలు 119:11వ.

2) వాక్యమైన సత్యమందు (పాపము లేకుండ) వారిని ప్రతిష్ఠ చేయుము. యోహాను 17:17వ.

3) లేఖనములు తప్పులను దిద్దును, నీతియందు శిక్ష చేయును. 2 తిమోతి 3:16వ. పాపము చేయువాడు వాక్యమునకు దూరమగునని గుర్తించగలము.

**X. మరణకరమైన పాపము :** 1 యోహాను 5:16 వచనములో మరణకరమైన పాపము కలదు అని ఉన్నది. రక్షణ శాశ్వతమైనందున ఈ మరణము శరీర మరణమే 1 కొరింథీ. 11:30లో అయోగ్యముగా....... రోగులు, బలహీనులునైయున్నారు. నిద్రించు చున్నారనియున్నది. కనుక మరణము శరీర సంబంధమైనదేనని నేర్చుకొనుచున్నాము అపొస్తలుల కార్యములు 5:1-12వ. అననీయ సప్పీరాల మరణము. హెబ్రీ. 6:4&10వ. 10:26-30వ. వివరణను గమనించగలరు. 1 కొరింథీ 5:5లో యేసు దినమందాత్మ

రక్షించబడి, శరీరము నశించునట్లు అని ఉన్నది. 1 కొరింథీ. 3ం15లో పని కాలిపోవును. తన మట్టుకు తాము రక్షించబడును అనని ఉన్నది. రక్షన శాశ్వతము శరీర మరణము కలుగవచ్చును. 1) మోషేకు శరీర మరణము కలిగెను. ద్వితీ. 32:48-52వ. 2) ఉజ్జియా 2 సమూ. 6:1-7వ.

**XI. పాపమునకు పరిహారము** : పాప పరిహారమును గూర్చి పాత నిబంధనలో వ్రాయబడినవి గమనించుదము. సామె. 28:13వ.లో అతిక్రమములు దాచిపెట్టువాడు వర్థిల్లడు. దాని ఒప్పుకొని విడిచి పెట్టువాడు కనికరము పొందును. కీర్తనలు 32:5వ దోషమును కప్పుకొనక దేవుని యెదుట ఒప్పుకొనాలి. దేవుడు కృప చూపుచూ దోషమును పాపమును పరిహరించును. 1) పాపము పరిహరించబడుటకు బలి అర్పించవలెనని నిర్గమ 29:36వ. వచనములో ఉన్నది. 2) బలి పశువు రక్తము బలిపీఠము కొమ్ములకు పూయబడాలి. (లేవి 4:25, 34వ) 3) బలి అర్పించబడు జంతువు నిర్దోషమైనదై ఉండాలి. (లేవీ. 4:3) 4) యాజకుడు ప్రాయశ్చిత్తము చేయుట ద్వారా క్షమాపణ కలుగును. ధర్మ శాస్త్రము రాబోవుచున్న మేలుల ఛాయయని, బలుల పండుగల నిజ స్వరూపము క్రీస్తు అని హెబ్రీ 10:1వ.లోను, కొలస్సయి 2:16-17వ.లోను ఉన్నది కనుక క్రొత్త నిబంధనలో, హెబ్రీ. 10:4వ. గొర్రెల యొక్కయు మేకల యొక్కయు రక్తము పాపమును తీసివేయుట అసాధ్యమని ఉన్నది.

నిజ స్వరూపమైన క్రీస్తు ఈ లోకములో ప్రత్యక్షమై (1 తిమోతి 3:15), మానవ పాపములను తన మీద మోసికొన్నాడు. (యోహాను 1:29వ.) పరిశుద్ధుడు మన కొరకు పాపముగా చేయబడెను. (2 కొరింథీ. 5:21వ.) దేవుడు తన స్వంత కుమారుని పాప శరీరాకారముతో పంపి ఆయన శరీరమందు మన పాపమునకు శిక్ష విధించెను. (రోమా 8:4వ) మనమింకను పాపులమైయుండగా క్రీస్తు మనకొరకు చనిపోయెను. (రోమా 5:8వ) నిర్దోషియగు క్రీస్తు, యాజకుడైన క్రీస్తు, బలియై తనరక్తమును బలిపీఠమైన సిలువ యందు కార్చాడు. ఆయన రక్తము ప్రతి పాపము నుండి పవిత్రులనగా చేయును. (1 యోహాను 1:7వ) కాబట్టి ఆయన రక్తము ద్వారా నీతిమంతులముగా తీర్చబడితిమి (రోమా 5:9వ.) నిశ్చయముగా ఆయన ద్వారా ఉగ్రతయైన నరకశిక్ష నుండి రక్షింప బడుదుము. (రోమా 5:9వ.) పాప పరిహారములో గతములో చేసిన పాపమునకు క్షమాపణ మాత్రమే కాక, నీతిమంతులముగా తీర్చబడుదుము. లోకములోనున్న న్యాయాధిపతులు

చేసిన కొన్ని తప్పులను క్షమించగలరు కాని నీతిమంతులని తీర్పు తీర్చలేరు. అనేక Judgement Copyలలో నేరస్తులను 1) నేరస్తులుగా ఋజువుపరచి, 2) నేరస్తులని ప్రకటించి, 3) శిక్ష నుండి కొన్ని పర్యాయములు మినహాయించుట జరుగును. నేరస్తుడని స్పష్టముగా ప్రకటింతురు. కాని 1 కొరింథీ. 6:11వ. ప్రకారము క్రీస్తు మన పాపములను క్షమించి నీతిమంతులుగా తీర్చుచున్నాడు. ఇది మానవులు చేయలేనిది. దేవుడే చేయునది. ఇదియే పాప పరిహారము.

**XII. పాపము చేసితిమని పలికినవారు :**

**ఎ) యథార్థముగా దేవుని ఎదుట ఒప్పుకొననివారు :**

1) ఫరో - నిర్గమ. 9:27, 10:16వ.

2) బిలాము - సంఖ్యా. 22:34వ.

3) ఆకాను - యెహోషువ. 7:20వ.

4) సౌలు - 1 సమూయేలు 26:21వ.

5) ఇస్కరియోతు యూదా, - మత్తయి 27:4వ.

**బి) యథార్థముగా దేవునితో ఒప్పుకొనినవారు :**

1) దావీదు - 2 సమూయేలు 12:13, 24:10వ.

2) యోబు - యోబు 7:20, 40:3,4వ. 42:6వ.

3) తప్పిపోయినకుమారుడు - లూకా 15:21వ.

రోమా 10:9వ ప్రకారము 1) యేసు ప్రభువని నోటితో ఒప్పుకొనాలి, 2) దేవుడాయనను మృతులలో నుండి లేపెనని హృదయమందు విశ్వసించాలి. దీని భావము యేసు మన పాపముల కొరకై మృతిపొంది తిరిగి లేచాడు. అనగా పాప క్షమాపణ జరిగినది. హృదయమందు నమ్మాలి. ఆ యేసును నీ జీవితమునకు ప్రభువుగా, యజమానిగా నోటితో ఒప్పుకొనాలి.

హృదయములో నమ్ముట - నోటితో ఒప్పుకొనుట రోమా 10:10వ. ప్రకారము 1) హృదయములో నమ్ముట ద్వారా నీతి కలుగును, 2) నోటితో ఒప్పుకొనుట ద్వారా రక్షణ కలుగును. విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షణ (ఎఫెసీ 2:8వ.) ఈ అనుభవము మీకున్నదా?

# కొన్ని ముఖ్య అంశముల వివరణ

| అంశము | | వివరించబడిన గ్రంథము, అధ్యాయము |
|---|---|---|
| 1. పరిశుద్ధాత్మ రాక కొరకు కనిపెట్టుట | - | అ.కా. 2 అధ్యా. చివర. |
| 2. అ.కా. భాషలు మాటలాడిన వారి వివరములు | - | అ.కా. 2:1-13వ, 19:1-20వ. |
| 3. బైబిలు గ్రంథములో చనిపోయి బ్రతికింపబడినవారు | - | అ.కా. 9వ అధ్యా. చివర. |
| 4. అ.కా. కార్యము నందలి మూడు ముఖ్య ఆజ్ఞలు | - | అ.కా. 10వ అధ్యా. చివర. |
| 5. ప్రభువు పిలుపు | - | అ.కా. 12వ అధ్యా. చివర. |
| 6) అరేయోపగు సభ | - | పౌలు చరిత్ర చివర. |
| 7) సన్‌హెడ్రిన్ మహాసభ | - | పౌలు చరిత్ర చివర. |
| 8) సువార్త ప్రకటింపబడిన విధము | - | అ.కా. 20వ. అధ్యా. చివర |
| 9) సున్నతిని గూర్చిన వివరణ | - | అ.కా. 15వ అధ్యా. రోమా 2 అధ్యా. చివర. |
| 10) కిరీటములు | - | 1 కొరింథీ. 9 అధ్యాయము చివర. |
| 11) సువార్త ప్రకటించువారి జీవన విధానము | - | 1 కొరింథీ. 9వ అధ్యా. చివర. |
| 12) ప్రేమను గూర్చిన వివరణ | - | 1 కొరింథీ. 13వ అధ్యా. ప్రారంభము |
| 13) పరిశుద్ధాత్మ అనుగ్రహించు వరములు | - | 1 కొరిం. 12-14 అధ్యా. |
| 14) ప్రభువుకు ఇచ్చు విధము | - | 2 కొరింథీ. 9వ అధ్యా. చివర. |
| 15) వివిధ ఆకాశములను గూర్చిన వివరము | - | 2 కొరిం. 14:34-38వ. |
| 16) పరిచర్యలో స్త్రీల స్థానము | - | (1 కొరింథీ. 14:24-38వ, అ.కా. 21:1-16వ.) |
| 17) క్రీస్తు తగ్గించుకొనుట - హెచ్చింపబడుట | - | ఫిలిప్పీ 2:5-11వ. |
| 18) తప్పిదములో చిక్కుకొనిన సహోదరుని దారిని తెచ్చుట | - | గలతీ 6:1-5వ, 2 కొరి. 2:6-11వ. |
| 19) ప్రభువు రెండవ రాకడ | - | 1 థెస్స. 4:13-5:1-11వ. |
| 20) ప్రభువు దినమును గూర్చిన వివరణ | - | 2 థెస్స. 2:1-3వ. |
| 21) మర్మముల వివరములు | - | కొలొస్స 1 అధ్యా. చివర |

22) బాప్తిస్మము యొక్క వివరములు - కొలొస్స. 4వ అధ్యా. చివర

23) రక్షణ శాశ్వము అను వివరణ - 1) హెబ్రీ 6వ అధ్యా. ప్రారంభము, 2) హెబ్రీ. 10:19-39వ, 3) 1 కొరింథీ. 3:10-15వ, 4) పాపము - పరిహారములోని..

24) FEAR NOTలు క్రొత్త నిబంధనలో ఇంగ్లీషులో 31 పర్యాయములు కలవు. జాగ్రత్త అను పదములు క్రొత్త నిబంధనలో తెలుగులో 52 పర్యాయములు కలవు. నెలలోని 31 రోజులకు దేవుడు అభయమిచ్చుచున్నాడు. 52 జాగ్రత్తలు అనగా సంవత్సరములోని 52 వారములలో ప్రతి వారములోను జాగ్రత్త అనగా కలిగి యుండాలి అని అర్థము.

**25) 52 జాగ్రత్తలు** : (1-7) మత్తయి 2:8, 6:1, 7:15, 10:7, 16:6, 16:11, 16:12. (14-18) లూకా 12:1, 15:8, 17:3, 20:45, 21:34, (19-21) అ.కా. 5:35, 15:29, 20:28, 22) రోమా 12:8, (23-30) 1 కొరి. 3:11, 10:12, 7:11, 8:7, 8:8, 8:20, 10:9, 10:9. (31) ఎఫెసీ. 5:15, (32-34) ఫిలిప్పీ. 3:2, 3:2, 3:2, (35-36) కొలొస్స. 2:8, 4:17, (37-38) 1 తిమోతి 4:13, 4:16, (39) 2 తిమోతి 4:15, (40-44) హెబ్రి. 2:1, 3:12, 4:11, 8:5, 12:16, 12:44, 12:48, (45-49) 2 పేతురు 1:5, 1:10, 1:5, 3:11, 3:140, (50) 1 యోహాను 5:21. (51) 2 యోహాను 1:8, (52) ప్రకటన 27.


26) ఆరాధన - ప్రభురాత్రి భోజనము యొక్క వివరము - అ.కా. 21:9, 1 కొరింథీ. 11:26-34.

27) కాపరియైన క్రీస్తును గూర్చిన వివరము - హెబ్రీ. 13:20,21.

28) విశ్వాసము వలన దొరికిన పది ఫలములు - రోమా 5:1-11.

29) ఆత్మానుసారులు - శరీరానుసారులు - రోమా 8:1-17.


30) సేవ కొరకు ప్రత్యేకించబడిన సేవకులకు - 2 కొరింథీ. 9:11-15, ఈవులు ఇవ్వవలసిన విధము - 1 తిమోతి 5:17-20.



ఇటలీ
రోము
త్రిసత్రములు
అప్పియా సంతపేట
పొతియొలీ
స్పెయిన్
మాసిదోనియ
నల్ల సముద్రము
ఫిలిప్పీ
త్రోయ
చిన్న ఆసియా
గలతీయ
నికొపొలి
అకయ
కొరింథు
ఎఫెసు
కొలొస్సయి
మిలేతు
అంతియొకయ
సిసిలి
సురకూసై
మెలితే
ఉ
క్నీదు
మూర
రొదు
క్రేతు
ఫేనిక్సు
సల్మోనే
లసయ
కౌద
మంచిరేవులు
కుప్ర
సీదోను
తూరు
కైసరయ
యెరూషలేము
మధ్యధరా సముద్రము
లిబియ
పౌలు రోమా ప్రయాణము క్రీ.శ. 60
పౌలు రోమా రెండు చెరల మధ్య సంచరించిన ప్రదేశములు క్రీ.శ. 63-64 ?



పౌలు పత్రికలను వ్రాసిన ప్రదేశములను చూపు పటము
ఇటలీ
హెబ్రీయులకు క్రీ.శ. ౬౬ ?
రోము
ఎఫెసీయులకు క్రీ.శ. ౬౧
కొలొస్సయులకు క్రీ.శ. ౬౧
ఫిలేమోనుకు క్రీ.శ. ౬౧
ఫిలిప్పీయులకు క్రీ.శ. ౬౨
II తిమోతికి క్రీ.శ. ౬౬
మాసిదోనియ
II కొరింథీయులకు క్రీ.శ. ౫౭
I తిమోతికి క్రీ.శ. ౬౩
ఫిలిప్పీ
థెస్సలొనీకయ
తీతు పత్రిక క్రీ.శ. ౬౪
నికొపొలి
అకయ
కొరింథీయులకు క్రీ.శ. ౫౬
ఎఫెసు
I థెస్సలొనీకయులకు క్రీ.శ. ౫౨
కొరింథు
II థెస్సలొనీకయులకు క్రీ.శ. ౫౩
రోమా పత్రిక క్రీ.శ. ౫౭
నల్ల సముద్రము
గలతీయ
చిన్న ఆసియా
గలతీయులకు క్రీ.శ. ౪౯ ?
కొలొస్సయి
అంతియొకయ
సిసిలి
రేగియ
సురకూసి
మెలితే
ఉ
క్నీదు
మూర
రొదు
క్రేతు
ఫేనిక్సు
సల్మోనే
లసియ
కౌద
కుప్ర
సీదోను
తూరు
కైసరయ
యెరూషలేము
మధ్యధరా సముద్రము
లిబియ


మాసిదోనియ
త్రేస
ఫిలిప్పీ
నెయపొలి
థెస్సలొనీక
బెరయ
సమొత్రాకే
త్రోయ
అస్సు
బితూనియ
గలతీయ
కప్పదొకియ
అకయ
(గ్రీసు)
మితులేనే
ఆసియా
ఫ్రుగియ
అంతియొకయ
లుస్త్ర
దెర్బే
కిలికియ
తార్సు
కీయొసు
ఎఫెసు
మిలేతు
కొరింథు
కెంక్రేయ
ఏథెన్సు
సమొసు
పెర్గే
పంఫూలియ
అత్తాలియ
అంతియొకయ
సెలూకియ
కోసు
పతర
రొదు
సలామీ
సిరియ
కుప్ర
పాఫు
క్రేతు
మధ్యధరా సముద్రము
తూరు
తొలెమాయి
కైసరయ
యెరూషలేము
పౌలు మొదటి సేవా యాత్ర క్రీ.శ. 46-48
పౌలు రెండవ సేవా యాత్ర క్రీ.శ. 50-53
పౌలు మూడవ సేవా యాత్ర క్రీ.శ. 54-57

# అపొస్తలుడైన

# పౌలు పత్రికల పరిచయము



రచయిత

టి.పి. వరప్రసాద రెడ్డి

# అపోస్తలుడైన పౌలు పత్రికల పరిచయము

రీరీరీరచయిత

**టి.పి. వరప్రసాదరెడ్డి**

ప్రచురణ

**గాస్పెల్ అసెంబ్లీ పబ్లిషింగ్స్**

7-270 కోర్టురోడ్,

**అనంతపురము - 515 001**

ఫోన్ : 275070, సెల్ : 9440285883

ప్రథమ ముద్రణ : సెప్టెంబరు 2005

వెల రూ. **40-00**

ప్రతులకు

## టి.పి. వరప్రసాదరెడ్డి

13-1-765 రెవిన్యూ కాలని.

**అనంతపురము - 515 001**

ఫోన్ : (08554) 277493, సెల్ : 94402 85883

*No part of our Publications may be Reprinted without our written Permission*

Designed & Type Setting :

*LOGOS GRAPHICS,*

Rajendra Nagar 3rd Line,

GUNTUR - 522 006 Ph : 2230827

Printed at

*SUDARSAN PRINTERS*

GUNTUR - 522002. Ph. 0863 - 2246245

# విషయ సూచిక


| | విషయము | అధ్యా. | వచనాలు | పుట |
|---|---|---|---|---|
| 1. | పౌలు చరిత్ర | | | 4 |
| 2. | పౌలు వ్రాసిన పత్రికల వివరములు | | | 10 |
| 3. | అపొస్తలుల కార్యములు | 28 | 1007 | 14 |
| 4. | రోమీయులకు వ్రాసిన పత్రిక | 16 | 433 | 51 |
| 5. | కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక | 16 | 437 | 82 |
| 6. | కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక | 13 | 257 | 115 |
| 7. | గలతీయులకు వ్రాసిన పత్రిక | 6 | 149 | 131 |
| 8. | ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక | 6 | 155 | 143 |
| 9. | ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక | 4 | 104 | 157 |
| 10. | కొలొస్సయులకు వ్రాసిన పత్రిక | 4 | 95 | 167 |
| 11. | థెస్సలొనీకయులకు వ్రాసిన మొదటి పత్రిక | 5 | 89 | 175 |
| 12. | థెస్సలొనీకయులకు వాసిన రెండవ పత్రిక | 3 | 46 | 183 |
| 13. | తిమోతికి వ్రాసిన మొదటి పత్రిక | 6 | 113 | 188 |
| 14. | తిమోతికి వ్రాసిన రెండవ పత్రిక | 4 | 83 | 195 |
| 15. | తీతుకు వ్రాసిన పత్రిక | 3 | 46 | 200 |
| 16. | ఫిలేమోనుకు వ్రాసిన పత్రిక | 1 | 25 | 205 |
| 17. | హెబ్రీయులకు వ్రాసిన పత్రిక | 13 | 303 | 209 |
| 18. | పాపము - పరిహారము | | | 231 |
| 19. | కొన్ని ముఖ్య విషయముల వివరణ | | | 239 |
| 20. | పౌలు ప్రయాణముల పటములు. | | | టైటిల్ లోపల, వెలుపట |

# ముందుమాట

క్రొత్త నిబంధన యందలి 27 పుస్తకములను ఐదు భాగములుగా విభజించవచ్చును. 1) క్రీస్తుచరిత్ర - సువార్తలు - 4, 2) సంఘచరిత్ర - అపోస్తలుల కార్యములు - 1. 3) పౌలు పత్రికలు - 14, 4) సామాన్య పత్రికలు - 7, 5) ప్రవచనము - ప్రకటన - 1. మొత్తం 27 పుస్తకములు.

ఈ గ్రంథమందు అపోస్తలుడైన పౌలు వ్రాసిన 14 పత్రికలను (హెబ్రీ పత్రికతో) క్లుప్తముగా పరిచయము చేయుచున్నాము. వాటికంటే ముందుగా 14 పత్రికలను వ్రాసిన పౌలు చరిత్రను, పౌలు సేవా యాత్రలను, పత్రికలను వ్రాసిన అవసరతను, పత్రికలను వ్రాసిన పట్టణ వివరములను ఎరుగుట అవసరము. కనుక ఆ వివరములు గల అపోస్తలుల కార్య గ్రంథమును ముందుగా పరిచయము చేయుచున్నాను. మొత్తము క్రొత్త నిబంధనలోని 15 పుస్తకములు ఈ గ్రంథమందు క్లుప్తముగా పరిచయము చేయబడినవి.

ఈ గ్రంథములోని ఏ పుస్తకమునైనా ధ్యానించుటకు క్రింద కనుపరచిన సలహాలను పాటించండి. మొదటిదిగా ఇందులో చెప్పబడిన గ్రంథ అంశము, గ్రంథ విభజన బాగుగా అర్థమగు వరకు అనేక పర్యాయములు చదవండి. రెండవదిగా ఎవరికి వ్రాయబడినదో ఆ పట్టణ వివరములు, మూడవదిగా అక్కడ సంఘము ఏర్పడిన వివరములు బాగుగా అర్థమగు వరకు చదవండి. నాలుగవదిగా ఒక్కొక్క విభజనలోనున్న ఒక్కొక్క అధ్యాయ అంశమును ధ్యానించండి. ఐదవదిగా ఒక్కొక్క అధ్యాయ విభజన చూడండి. ఆరవదిగా అందులోని ఒక్కొక్క భాగమునకు వ్రాయబడిన క్లుప్తమైన సంగతులను ధ్యానించండి. ఒక్కొక్క భాగమును గూర్చిన వివరమైన తలంపులను ప్రభువే తన సమృద్ధి నుండి మీకు అనుగ్రహించును.

మరొకమాట! పౌలు పత్రికలను ఈ గ్రంథమందు విభజించినట్లే, విభజించవలెనని తలంచవద్దు. ఇది ఒక రకమైన విభజన మాత్రమే! దేవుడు మీకు మరొక రీతిగా విభజన నేర్పించిన యెడల ఆ రీతిగానే ధ్యానించండి. ఒక్కొక్క గ్రంథమును అనేక రీతులుగా విభజించి ధ్యానించగలమని గుర్తుంచుకొనండి. ప్రభువు మీకు ఈ గ్రంథమును సంపూర్తిగా గ్రహించు శక్తిని ప్రసాదించును గాక!

**అనంతపురము,**      **ఇట్లు**

**09-09-2005**      **వరప్రసాద రెడ్డి**

# గ్రంథకర్తను గూర్చిన పరిచయము

## పౌలు చరిత్ర

పౌలు అనగా చిన్నవాడు అని అర్థము. కిలికియలోని తార్సులో పుట్టాడు. (అ.కా. 9:11). యూదామతాభిమాని. రోమా పౌరసత్వము కలవాడు. (22:28) బాల్య యవ్వనకాల చదువులకై యెరూషలేములో ఉండి గమలీయేలు పాదముల దగ్గర అతివిద్య నభ్యసించాడు. (26:24). స్తెఫనును చంపినపుడు రాళ్ళతో కొట్టినవారి వస్త్రములకు కావలి ఉన్నాడు. ఇందును బట్టి క్రైస్తవ్యము వాస్తవము కాదు అని తలంచినట్లు తెలుసుకోగలము. క్రీస్తు మార్గమందుండిన వారి నందరిని హింసించేవాడు. (8:3). పౌలు మొదటి పేరు సౌలు అ.కా.13:9 వరకు ప్రారంభము నుండి సౌలు అను పేరు 20 పర్యాయములు కలదు. తరువాత పౌలు అను పేరు 128 పర్యాయములు కలదు.

క్రీ.శ. 32లో దమస్కుకు క్రీస్తు శిష్యులను హింసించుటకై వెళ్ళుచూ ప్రభువును మార్గమందు చూచి మారుమనస్సు పొందాడు. (9:3-23). ఆనాటి నుండి యేసే క్రీస్తని దమస్కులో బోధింప మొదలు పెట్టాడు. అరేబియాకు వెళ్ళి తిరిగి దమస్కుకు వచ్చి బోధించాడు. తన జీవితకాలములో ఐదు పర్యాయములు యెరూషలేముకు వెళ్ళాడు.

3 సంవత్సరములు అయిన తరువాత, రక్షించబడ్డాక మొదటిగా క్రీ.శ. 35లో యెరూషలేముకు వెళ్ళాడు (గలతీ. 1:16-17). అపొస్తలులను బర్నబా సహాయముతో కలసి యేసు నామమును ధైర్యముగా బోధించాడు. (అ.కా. 9:26-29) ప్రతి స్థలమందును యూదులు తనను చంపజూచినందున తార్సుకు వెళ్ళాడు. (అ.కా. 9:30).

క్రీ.శ. 35-44 వరకు 10 సంవత్సరములు సిరియా, కిలికియలో బోధించాడు.

క్రీ.శ. 45లో బర్నబా ద్వారా అంతియొకయకు వచ్చి ఒక సంవత్సరము అంతియొకయలో ఉన్నాడు. (అ.కా. 11:25) కరువుకు ప్రోగు చేయబడిన సహాయమునందించుటకు రెండవసారిగా యెరూషలేముకు వెళ్ళాడు.

క్రీ.శ. 46లో అంతియొకయ సంఘములో పరిశుద్ధాత్ముడు పిలిచిన పనికై బర్నబాతో కూడా ప్రత్యేకించబడ్డాడు. (అ.కా. 13:1-3).

క్రీ.శ. **46-49 వరకు బర్నబాతో కలసి మొదటి సేవా యాత్ర** : 1200 మైళ్ళు (500 మైళ్ళు భూమి మీద, 700 మైళ్ళు సముద్రము మీద) జరిగించాడు. అ.కా 13-15 అధ్యాయాలు) సలామి, కుప్ర, పాపు, పంఫూలియ, పెర్గె, గలతీయ, అంతియొకయ,

ఈకొనియ, లుస్త్ర, దెర్బే, లుస్త్ర, ఈకొనియ, పెర్గె, అత్తాలియలో సేవ జరిగించిరి. యెరూషలేముకు మూడవదిగా 49లో సున్నతి సభకు వెళ్ళాడు. దీనినే గలతీ 2:1వ.లో 14 సంవత్సరములైన తరువాత యెరూషలేముకు అనగా క్రీ.శ. 35 నుండి 49 వరకు 14 సంవత్సరములు అని అర్థము.

**క్రీ.శ. 50-53 వరకు రెండవ సేవాయాత్ర** : 2700 మైళ్ళు (1300 మైళ్ళు సముద్రము పై, 1400 మైళ్ళు భూమిపై) జరిగించాడు. (అ.కా. 16-18 అధ్యాయాలు) రెండవయాత్రలో ఐరోపా ఖండమందలి ఫిలిప్పీ, థెస్సలొనీక, బెరయ, ఎథెన్సు, కొరింథు, కెంక్రేయ పట్టణాలలో సేవ జరిగించాడు. ఎఫెసు, కైసరయలగుండా నాల్గవసారి యెరూషలేముకు వెళ్ళాడు.

క్రీ.శ. 52లో థెస్సలొనీకయులకు మొదటి పత్రిక వ్రాశాడు. (1 థెస్స. 3:1).

క్రీ.శ. 53లో థెస్సలొనీకయులకు రెండవ పత్రిక వ్రాశాడు.

**క్రీ.శ. 54-57 వరకు మూడవ సేవా యాత్ర** : 2,700 మైళ్ళు (1350 మైళ్ళు సముద్రము పై, 1350 మైళ్ళు భూమి పై) ఆసియా, ఐరోపాలలో జరిగించాడు. (అ.కా. 19-20 అధ్యాయాలు)

క్రీ.శ. 54-56 వరకు ఎఫెసులో 3 ఏండ్లు సేవ జరిగించాడు.

క్రీ.శ. 56లో కొరింథీయులకు మొదటి పత్రిక వ్రాశాడు.

క్రీ.శ. 57లో కొరింథీయులకు రెండవ పత్రిక, క్రీ.శ. 57 చివర రోమా పత్రిక వ్రాశాడు.

క్రీ.శ. 49-57 మధ్యన గలతీయులకు పత్రిక వ్రాశాడు.

క్రీ.శ. 57లో యెరూషలేముకు ఐదవసారిగా వెళ్ళి బంధింపబడి క్రీ.శ. 58-59 వరకు కైసరయలో విడిగా కావలిలో రెండేండ్లు ఉన్నాడు.

క్రీ.శ. 60లో రోముకు ప్రయాణమై 2100 మైళ్ళు (1900 మైళ్ళు సముద్రము పై, 200 మైళ్ళు భూమిపై) ఖైదీగా వెళ్ళాడు.

క్రీ.శ. 61-62లో మొదటిసారి రోము చెరలో ఉన్నాడు.

క్రీ.శ. 61లో ఎఫెసు, కొలొస్స, ఫిలేమోను పత్రికలు వ్రాశాడు.

క్రీ.శ. 62లో ఫిలిప్పీ పత్రిక వ్రాశాడు.

క్రీ.శ. 63-64 విడుదలలోనున్న కాలము.

క్రీ.శ. 63లో విడుదల పొంది 1 తిమోతి పత్రిక వ్రాశాడు.

క్రీ.శ. 64లో తీతు పత్రిక వ్రాశాడు. విడుదల కాలము (క్రీ.శ. 63-64)లో స్పెయిన్, (రోమా 15:24-27) కొరింథు, మిలేతు. త్రోయ (2 తిమోతి 4:12) క్రేతు (తీతు 1:5) నికోపొలికి (తీతు 3:12) కొలొస్సయికి (ఫిలే 25వ) వెళ్ళాడు.

క్రీ.శ. 65-66లో రెండవసారి రోము చెరలో ఉన్నాడు.

క్రీ.శ. 66లో 2వ తిమోతి పత్రిక వ్రాశాడు.

క్రీ.శ. 67లో నీరో చక్రవర్తిచే శిరచ్ఛేదనము చేయబడి ప్రభువు దగ్గరకు వెళ్ళాడు. పౌలు 3 సేవా యాత్రలు ఒక్కొక్కటి 4సం॥ల కాలము గలవి. 13వ అధ్యాయము నుండి వరుసగా మూడు అధ్యాయములలో వివరించబడినవి. తదుపరి 3 చెరలు ఒకటి కైసరయలోను రెండు రోములోను ఒక్కొక్కటి 2సం॥ల కాలమని గమనించవలెను.

క్రీస్తు తర్వాత క్రీస్తు అంతటి సేవ జరిగించిన పౌలు వంటి భక్తులు సంఘ చరిత్రలో లేనే లేరు. ప్రతి పట్టణములో దూషణలు, బంధకాలు, శ్రమలు అనుభవించాడు. అనేక పట్టణములలో రాళ్ళచే కొట్టబడ్డాడు. అన్నింటికంటే మించి శరీరమునందున్న ముల్లుకై ముమ్మారు ప్రార్థించాడు. (2 కొరింథీ. 12:8) దేవుడు తీసివేయలేదు. 2 కొరింథీ. 11:23-28 లోని పౌలు శ్రమలు నమ్మశక్యము కానివైనందున ఆయన రక్తమాంసములు గల దేహము కలిగినవాడు కాడేమో అనిపించును. లోకమునకు మురికిగాను అందరికి పెంటగాను, (1 కొరింథీ. 4:10-13) ఎంచబడి, శరీర ప్రకారము నడుచుకొనువాడని (2 కొరింథీ. 10:2). ప్రసంగములు కొరగానివని, శరీరమునకు బలహీనుడని అందరిచేత తృణీకరింపబడెను. (2 కొరింథీ. 10:10) అవివేకి అని తలంచబడెను. (2 కొరి. 11:16)తనకు కలిగిన యావత్తు సేవకై ఖర్చుచేసి తన్ను తాను వ్యయపరచుకొనెను. (2 కొరింథీ. 12:15). భ్రష్టుడని తలంచబడెను. (2 కొరి. 13:6)

ఎవరిని మోసపుచ్చి ఆర్జించుకొన్నవాడు కాడు. (2 కొరింథీ. 12:15-17) తన జీవితకాలపు ఆర్థిక సంబంధమైన ఆర్జన, వ్యయముల వివరములను సమర్పించెను. ప్రతి విశ్వాసి, సేవకుడు తాను సంపాదించినది, సేవకు తనది ఖర్చు చేసినది బహిరంగ పరచాలి. రక్షింపబడక మునుపు పులివంటి వాడుగా అందరిని హింసించాడు.1) (అ.కా. 9:1) రక్షించబడి సేవకు ప్రత్యేకించబడిన పిదప 1 థెస్స 2:7లో పిల్లిగా (సాధువుగా) నున్నాడు. (క్రీ.శ. 51). 2) 1 కొరింథీ 15:9లో అపొస్తలులందరి కంటే ఎక్కువగా ప్రయాస పడినను అపొస్తలులకంటే తక్కువ వాడనని. అలా అనిపించుటకు అయోగ్యుడనన్నాడు. (క్రీ.శ. 56).3) ఎఫెసి 3:11లో పరిశుద్ధులందరిలో అత్యల్పుడనన్నాడు. (క్రీ.శ. 61). 4)1 తిమోతి 1:15లో పాపులలో ప్రధాన పాపిని అన్నాడు. (క్రీ.శ. 63:65) పౌలు క్రీ.శ.

51,56,61,65లో క్రమముగా నాలుగంతలు తగ్గించుకొని పాపులలో ప్రధానిగా ఎంచుకొన్నాడు. కాని 2 తిమోతి 4:8లో ప్రభువు నీతిమంతులలో ప్రధానిగా ఎంచి నీతి కిరీటమును యిచ్చితిని అన్నాడు. ఇది ఎంత ఆశ్చర్యము!

ఈయన చరిత్రలో క్రీ.శ. 46 నుండి 66 వరకు 20 ఏండ్లలో చేసిన సేవ ప్రతి 5 సం॥ అనుభవములో క్రీ.శ. 51,56,61,66లో తగ్గించుకొనిన విధము ప్రతి క్రైస్తవ విశ్వాసికి, సేవకులకు పురికొలుపుగా ఉన్నది. పౌలు తన జీవితములో ప్రభువు చేత నీతిమంతుడని 2 తిమోతి 4:8వ. తీర్పు తీర్చబడక మునుపు అపొస్తలుల కార్యములో సుమారు 7 న్యాయస్థానముల దగ్గర ఏ నేరము లేనివాడని తీర్పుపొందెను.

**1.అరేయోపగు సభ** : (అ.కా. 17:19-34వ.) గ్రీసు దేశమునకు ఉత్తర ప్రాంతమునకు ఏథెన్స్ రాజధాని. అందులో మార్స్ దేవత కొండపై ఒక సభా మందిరము నిర్మించబడినది. అది ఒక పార్లమెంటు వంటిది. అందులో పార్లమెంటు సభ్యుల వంటి సభికులుందురు. ఏథెన్సు వారు పౌలుతో తర్కించి వాదించి (17-18వ.) అరేయోపగు సభలోనికి తీసుకొని పోయిరి. ఆ సభవారు పౌలు చెప్పు సంగతులను తేటైన సువార్తను వినిరి. అంతట అందరు మారుమనస్సు పొందవలెను అని పౌలు పలికిన మాటలను వినిరి. పౌలు మీద ఏ నేరము ఋజువు పరచలేదు కదా! ఆ సభలో సభ్యుడగు అనగా దేశరాజధానిలో జరుగు పార్లమెంటు వంటి సభ సభ్యుడగు దియొనూసి క్రీస్తునందు విశ్వాసముంచెను.

**2. గల్లియోను న్యాయపీఠము** : (అ.కా. 18:12-17వ.) గ్రీసు దేశమునకు దక్షిణ రాజధాని కొరింథు గ్రీసు దేశ అధిపతియగు గల్లియోను న్యాయపీఠము ముందు పౌలును యూదులు నిలిపి నేరము మోపిరి. గల్లియోను పౌలులో నేరము లేదని యెరిగి ఇది ధర్మశాస్త్రమును గూర్చిన వాదము మీరే చూచుకొనుడని పౌలును సమాధానము కూడా చెప్పనివ్వక యూదులు తోలివేసెను.

**3. ఎఫెసు పట్టణకరణము యొక్క సభ** : (అ.కా. 19:35-41వ.) చిన్న ఆసియా దేశరాజధానియగు ఎఫెసు పట్టణస్థులు చాలా గలిబిలి అల్లరి చేసిరి. గ్రామీకరణము సంగతులన్ని విని పౌలును అతనితో ఉన్న వారిని గూర్చి వారు గుడిని దోచిన వారు కారని, ఎఫెసు వారి దేవతను దూషింపలేదని చెప్పి పౌలును గూర్చి మంచి సాక్ష్యమిచ్చి సభను ముగించెను.

4. సన్‌హెద్రిన్ మహాసభ : (అ.కా. 23:1-10వ.) గ్రీకు భాషలో సన్ అనగా కలిసికొనుట, హెద్రా అనగా స్థలము అని అర్థము. సన్‌హెద్రిన్ అనగా కూడుకొను స్థలము. ప్రధాన యాజకుడు అధ్యక్షుడుగాను 1) 24 యాజకుల విభాగ అధిపతులు,

2) 24 శాస్త్రులు, 3) 24 ప్రజల పెద్దలు కలసి 23:4వ ప్రకారము ధర్మశాస్త్రము చొప్పున తీర్పు తీర్చు సభ. సంఖ్యా. 13:16లో మోషేతో దేవుడు 70 మంది పెద్దలను నీతో కూడా భారము మోయుదురని సెలవిచ్చెను. క్రీ.పూ. 1440 నుండి ఈ క్రమము ఏర్పడినది. 1 దిన. 24:1-18వ. అహరోను కుమారులైన ఏలియాజరు కుటుంబమునకు చెందిన 16 మందిని ఈ తామారు కుటుంబమునకు చెందిన 8 మందిని యాజక ధర్మ వివిధ భాగములకు నియమించెను. ఈ రీతిగా 24 యాజక విభాగ అధిపతులు ఈ సభలోనుండు రాజైన హేరోదు ఆజ్ఞ ప్రకారము వీరిలో నుండి ప్రధాన యాజకులు నియమించబడుచు మార్చబడుచుండిరి. ఈ 72 మంది సభ్యులు కలసి నేరములను విచారించి నేరములేదని నిశ్చయించిన సభ్యుల ఉద్దేశమును మొదట తీసుకొందురు. ఎక్కువ మంది సభ్యుల తీర్మానమునే ప్రధాన యాజకుడు స్థిరపరచును. అ.కా. 6,7 అధ్యా. స్తెఫను విషయేము అలాగే మత్తయి 26:57,59,65వ యేసు విషయము సభ కూడిరి. వీరిని మరణశిక్ష విధించు అధికారము లేదు. ఇది ఒక మత సంబంధమైన ఉన్నత న్యాయస్థానము. మరణశిక్ష విధించుటను గవర్నరు మాత్రమే తీర్మానించును. ఈ సభవారు అ.కా. 23:9వ పౌలులో ఏ దోషము కనబడలేదని తీర్మానించిరి.

5. **గవర్నరగు ఫేలిక్సు తీర్పు** : (అ.కా. 24:1-27వ) ప్రధాన యాజకుడు కొందరు పెద్దలు న్యాయవాదితో కలసి గవర్నరగు ఫేలిక్సుకు పౌలుపై ఫిర్యాదు చేసిరి. 22వ వచనములో ఫేలిక్సు క్రీస్తు మార్గమును ఎరిగినవాడు పౌలుపై ఏ నేరమును అంగీకరించ లేదు. పైగా 24వ వచనములో పౌలు నీతిని గురించి మాటలాడి సువార్త చెప్పగా వినెను కాని పౌలును నీతిమంతుడు కాదనలేదు.

6. **గవర్నరగు ఫేస్తు, రాజగు అగ్రిప్పల న్యాయపీఠము** : (అ.కా. 25,26అధ్యా.) పౌలును విచారించిన పిదప మరణముకైనను బంధకములకైనను తగినదేదియు చేయలేదని 26:31వ. పలికిరి. అగ్రిప్పరాజు కూడా విశ్వసించవలెనని పౌలు రాజుతో 26:28-29వ పలికెను.

7. **రోమా** : (అ.కా. 28:16-23వ.) పౌలు రోమాకు ఖైదీగా వెళ్ళి తనకు కావలి ఉన్న సైనికులతో ప్రత్యేకముగా ఉండుటకు సెలవు పొందెను. యూదయ నుండి ఫిర్యాదుల పత్రిక పంపబడలేదు. పౌలును గూర్చి ఏ చెడు సంగతి తెలియపరచలేదని 28:12వ.లో చెప్పబడినది. పైగా రోమాలోని ప్రేతోర్యమను సేనలోని 16,000 మంది కైసరు ఇంటివారు క్రీస్తును ఎరుగు ఆశ్చర్యము ఈ ఏడు తీర్పులలో నేరము చేయలేదని చెప్పబడుట సేవకులమైన మనకెంత మాదిరి!

# పౌలు వ్రాసిన పత్రికల వివరములు

1 కొరింథీ. 4:16,17లో మీరు నన్ను పోలి నడుచుకొనవలెనని తిమోతిని మీ యొద్దకు పంపుచున్నాను. అతడు నేను "నడుచు"కొను విధము నేను "బోధించు" విధము మీకు తెలియజేయును అన్నాడు. యెహోషువ 1:8లో ధర్మశాస్త్రమును **భోధించుటలో** తప్పిపోకూడదు...... దాని ప్రకారము **చేయుటకు** జాగ్రత్తపడాలి. అలాగే పౌలు 1. బోధ, 2. నడుచుకొనవలసిన విధమును పత్రికల ద్వారా వ్రాసి ఇతరులతో సంఘములకు పంపాడు. పౌలు వ్రాసిన 14 పత్రికల వివరములు క్రింద కనపరచబడినవి. (హెబ్రీ పత్రికను పౌలు వ్రాశాడని నమ్ముచున్నాము) క్రొత్త నిబంధనయందు మొత్తము 260 అధ్యాయములు 7,959 వచనములు కలవు. పౌలు వ్రాసిన పత్రికలందు 100 అధ్యాయములు 2,335 వచనములు కలవు. రోమా పత్రిక నుండి ఫిలేమోను పత్రిక వరకు ప్రతి పత్రిక మొదటి అధ్యాయము మొదటి నాలుగు వచనములతో కృపా సమాధానములు కలుగును గాకని శుభములు ప్రారంభములోనే తెలుపుట గమనించ గలము. హెబ్రీ పత్రికతో కలసి ప్రతి పత్రికలో చివరి అధ్యాయము చివరి నాలుగు వచనములలో కృప మీకు కలుగును గాక అని ముగించుట గమనించగలము. కావున ఈ పత్రికలు కృపతో ప్రారంభించబడి కృపతో ముగించబడుచున్నవి.కృప అను పదము క్రొత్తనిబంధనలో 122 పర్యాయములు కలదు.

సమాధానము - షాలేము అనునది యూదులు ఒకరికొకరు తెలుపుకొను వందన వచనము. మహమ్మదీయులు దీనినే సలాముగా పలుకుదురు. గ్రీసు దేశస్థులు అనగా అన్యులు కృపను వందన వచనముగా వాడుదురు. కావున పౌలు ప్రతి పత్రికలో యూదుల యొక్కయు, గ్రీసు దేశస్తుల యొక్కయు వందన వచనముతో ప్రారంభించుచున్నాడు.

## పౌలు వ్రాసిన పత్రికల వివరములు

| వ.స. | పత్రిక | ఎక్కడనుండి ఎప్పుడు వ్రాశాడు | ఎవరితో పంపాడు | క్రీస్తును గూర్చిన వివరణ | బోధ | నడక | స్తుతి | ప్రార్థన | ఆత్మ ప్రస్తావన |
|---|---|---|---|---|---|---|---|---|---|
| I. | సువార్త పత్రిక<br>1. రోమా పత్రిక | కొరింధు నుండి క్రీ.శ. 57 | ఫీబే 16:1 | మన నీతియైన క్రీస్తు 3:21-24వ | 1-8 అ. | 9-16 అ. | 1:8 | 1)1:9-10, 2) 8:15,26,34<br>3)10:1, 4)12:12<br>5) 15:5,30-32 | 36 |
| II. | దోషములు దిద్దు పత్రికలు<br>2. 1 కొరింథీ.<br>3. 2 కొరింథీ.<br>4. గలతీయ.... | ఎఫెసు నుండి క్రీ.శ.56<br>మాసిదోనియా క్రీ.శ. 57<br>క్రీ.శ. 49-57? అంతియోకయ? | స్తెఫను 16:17<br>తీతు 8:6<br>--- | 2. మన పునరుత్థానమైన క్రీస్తు 15:22 3. మన ఆదరణయైన క్రీస్తు. 4. దాస్యము నుండి విడిపించిన క్రీస్తు 3:14. | 1-8 అ.<br>1-7 అ.<br>3-4అ. | 9-16 అ.<br>8-13 అ.<br>5,6 అ. | 1. 1:4<br>2. 14:16.<br>1:3-5.<br>--- | 1)7:5,2)11:4-13<br>3)12:3, 4)14:14.<br>1) 1:10, 2)12:8, .<br>3) 13:7-9,<br>1)1:17, 2) 4:6. | 40<br>12<br>18 |
| III. | సంఘము-క్రీస్తును గూర్చిన పత్రికలు | | | | | | | | |
| | 5. ఎఫెసీ.<br>(విశ్వాసిస్థితి)<br>6. ఫిలిప్పీ.<br>(విశ్వాసి విధేయుత)<br>7. కొలస్స.<br>(క్రీస్తు దైవత్వము | రోమా చెర 1<br>క్రీ.శ. 61<br>రోమా చెర 1<br>క్రీ.శ. 62<br>రోమా చెర 1<br>క్రీ.శ. 61 | తుకికు 6:21,22<br>ఎపఫ్రొదితు 2:25-28<br>ఎపఫ్రా 1:7,8<br>తుకికు కొల. 4:7-9. | 5. సంఘమును శరీరముగా గల క్రీస్తు (1:22),<br>6. తగ్గించుకొనిన క్రీస్తు 2:5, 7. పరిపూర్ణ దేవుడైక్రీస్తు సంఘమునకు శిరస్సయిన క్రీస్తు 2:9 | 1-3 అ.<br>1-2 అ.<br>1-2 అ. | 4-6 అ.<br>3-4 అ.<br>3-4 అ. | 1. 1:3,16.<br>2. 5:20<br>1:3.<br>1) 1:3.<br>2) 3:17 | 1)1:17-19,2)3:1<br>3)3:19, 4)6:18-20<br>1)1:4-6. 2) 1:9, 3) 4:6.<br>1) 1:3-6, 2) 1:9-12<br>3) 2:1-2, 4. 4:4,12. | 13<br>4<br>4 |

## పౌలు వ్రాసిన పత్రికల వివరములు

| | పత్రిక | ఎక్కడనుండి ఎప్పుడు వ్రాశాడు | ఎవరితో పంపాడు | క్రీస్తును గూర్చిన వివరణ | బోధ | నడక | స్తుతి | ప్రార్థన | ఆత్మ ప్రస్తావన |
|---|---|---|---|---|---|---|---|---|---|
| IV. వ.స. | ప్రభువు రాకడ | పత్రికలు | | | | | | | |
| | 8. 1 థెస్స. (ఆకాశ మండలమునకు) | కొరింథీ. క్రీ.శ. 52 | ---- | సంఘము కొరకురానున్న క్రీస్తు 4:10. | 1-3 అ. | 4-5 అ. | 1) 1:3, 2) 5:16, | 1) 3:10, 2) 5:15, 3) 5:25. | 5 |
| | 9. 2 థెస్స. (భూమి మీదకు) | కొరింథీ. క్రీ.శ. 53 | ----- | సంఘముతో రానున్న క్రీస్తు. 1:6. | 1-2 అ. | 3 అ. | 1) 1:3, 2) 2:13. | 1) 1:11-12, 2) 3:1-2. | 2 |
| V. | కాపరి పత్రికలు | | | | | | | | |
| | 10. 1 తిమోతి (సంఘంలో జనుల ప్రవర్తన) | ఎఫెసు. క్రీ.శ. 63 | ---- | మధ్యవర్తియైన క్రీస్తు. 2:15. | 1-3 అ. | 4-6 అ. | 1) 1:17, | 1) 2:1-28, 1:3-5. | 3 |
| | 11. 2 తిమోతి (పనివాని విధులు) | రోమాచెర 2 క్రీ.శ. 66 | ---- | కిరీటమిచ్చు క్రీస్తు 4:8. | 1-2 అ. | 3-4 అ. | 1:4, | | 2 |
| | 12. తీతు (సంఘపాలన) | నికొపొలి మార్గమున క్రీ.శ. 64. | ------- | మహా దేవుడు, రక్షకుడైన క్రీస్తు 2:13. | 1 అ. | 2-3 అ. | 4:18. | | 2 |
| | 13. ఫిలేమోను | రోమా చెర 1 క్రీ.శ. 61. | ఒనేసీము 1:12. తుకికు కొల. 4:7-9 | రుణము తీర్చు క్రీస్తు. | | | 1:4 | 1) 1:4. | 2<br>1 |
| VI. | క్రీస్తు శ్రేష్ఠత్వపు | పత్రిక | | | | | | | |
| | 14. హెబ్రీ. | ఇటలీ క్రీ.శ. 66 | ---- | విశ్వాసమునకు కర్త కొనసాగించువాడైన క్రీస్తు 12:1 | ---- | ----- | | 1) 5:7, 2) 13:18 | 8 |

## పత్రికలలో పెద్ద పత్రికలు వాటి వివరములు
## పౌలు వ్రాసినది 14 పత్రికలలో పెద్దవి 4. వాటి విభజనలు వివరములు గమనించగలరు

| పత్రిక | రోమా పత్రిక | 1 కొరింథీ పత్రిక | 2 కొరింథీ. పత్రిక | హెబ్రీ పత్రిక |
|---|---|---|---|---|
| విభజన | 5+3+3+5=16 అధ్యా. | 6+2+2+6=16 అధ్యా. | 2+4+1+2+4=13 అధ్యా. | 2+2+3+3+3=13 అధ్యా. |
| అంశము | సువార్త ప్రకటన | లోపములు దిద్దుట | పరిచర్య జరిగించుట | క్రీస్తు శ్రేష్ఠత్వము |
| వివరము | 1-5 అధ్యా. పాపము - పరిహారము | 1-6 అధ్యా. తెలియ వచ్చిన లోపములు దిద్దుట | 1-2 అధ్యా. ప్రభువు నందు జీవించు పరిచర్య | 1-2 అధ్యా. శ్రేష్ఠమైన అధిపతి |
| | 6-8 అధ్యా. పరిశుద్ధత | 7-8 అధ్యా. వ్రాసిన విషయములలోని లోపములు దిద్దుట | 3-6 అధ్యా. ప్రభువు నందు చేయవలసిన పరిచర్య | 3-4 అధ్యా. శ్రేష్ఠమైన నాయకుడు<br>5-7 అధ్యా. శ్రేష్ఠమైన యాజకుడు |
| | 9-11 అధ్యా. ప్రభువు తన ప్రజలు | 9-10 అధ్యా. విమర్శించిన విషయములలోని లోపములు దిద్దుట | 7 అధ్యా. ప్రభువు నందలి ప్రత్యేకత గల పరిచర్య. | 8-10 అధ్యా. శ్రేష్ఠమైన సేవకుడు |
| | 12-16 అధ్యా. పరిచర్య | 11-16 అధ్యా. కూడి వచ్చి వరములను వాడుకొనుటలోని లోపములు దిద్దుట | 8-9 అధ్యా. ప్రభువుకు ఇచ్చు పరిచర్య.<br>10-13 అధ్యా. ప్రభువు నందు తనను భద్రపరచుకొను పరిచర్య | 11-13 అధ్యా. శ్రేష్ఠమైన కర్త. |

# అపొస్తలుల కార్యములు

గ్రంథకర్త : లూకా అని లూకా సువార్త మొదట అధ్యాయము 1:4వ వచనములు అ.కా. 1:2వ. చదివిన యెడల స్పష్టమగును.

అపొస్తుల కార్యములు 1:2 వచనంలో యేసు పరమునకు చేర్చుకొనబడిన దినము వరకు జరిగిన సంగతులను థెయొఫిలా పేరట నా మొదట గ్రంథమందు వ్రాసితిని అన్నాడు. ముందుగా థెయొఫిలా అను పేరుతో వ్రాయబడిన గ్రంథము లూకా ద్వారా వ్రాయబడిన సువార్తయే. లూకా 24:50-53 వచనములు యేసు పరలోకమునకు ఆరోహణమై చేర్చుకొనబడుటతో ముగించబడినది. పై వివరములను బట్టి లూకా ఈ గ్రంథమును వ్రాసెనని స్పష్టమగును. కొలస్సయి పత్రిక 4:14 ప్రకారము లూకా వైద్యుడని అపొస్తుల కార్యములు 16:8లో పౌలు తిమోతి సీలలు ముసియను దాటి త్రోయకు వచ్చిరి అని ఉన్నది. వచ్చిరి అనగా లూకా ఉన్న ఊరికి వచ్చిరి కనుక లూకా పౌలు రెండవ సేవా యాత్ర ప్రారంభము వరకు చిన్న ఆసియాలోని త్రోయలో నివసించెనని నేర్చుకొనుచున్నాము.

**కాలము** : అ.కా. 28:28-30 వచనములలో పౌలు రెండు సంవత్సరములు రోములో మొదటిసారి చెరలో ఉన్న సందర్భము చెప్పబడుటతో అ.కా. గ్రంథము ముగించబడినది. కనుక రోమ్‌లోని మొదట చెర తదుపరి అనగా క్రీ.శ. 62-63లో ఈ గ్రంథము వ్రాయబడెను అని తలంచగలము.

**స్థలము** : ఈ గ్రంథమందలి చివరి వచనములలో రోములోనున్నందున బహుశ రోము నుండి వ్రాసియుండవచ్చును.

**అంశము** : మీరే నాకు సాక్షులు (1:8).

గ్రంథ విభజన : 2+5+5+8+8=28 అధ్యాయములు

I. అ.కా. 1:8 పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చినపుడు మీరు శక్తి నొందుదురు. 1,2 అధ్యాయములు.

II. కనుక మీరు యెరూషలేములో నాకు సాక్షులు (3-7 అధ్యాయములు)

III. యూదయ సమరయ దేశముల యందంతట నాకు సాక్షులు (8-12 అధ్యా.)

IV. V. భూదిగంతముల వరకు నాకు సాక్షులు (13-20, 21-28 అధ్యా.)

I. 1,2 అధ్యాయములు పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చుట - శక్తినొందుట సంఘ సాక్ష్యము ఏర్పడుట.

**1. 1వ అధ్యాయము** : ఆరోహణుడైన ప్రభువు - ఆత్మ రాకడను అపేక్షించిన అపొస్తులలు.

**2. 2వ అధ్యాయము** : ఆత్మ భూమి పైకి దిగివచ్చుట, శిష్యులను నింపుట - అనేకులు క్రీస్తును నమ్మి సంఘముగా చేర్చబడుట.

II. 3-7 అధ్యాయములు యెరూషలేములో సాక్ష్యము.

ఎ) 3-5 అధ్యాయాలు శిష్యులైన పేతురు, యోహానుల సాక్ష్యము.

**3. 3వ అధ్యాయము** : శక్తిగల యేసు నామమును గూర్చి పేతురు యోహానుల సాక్ష్యము.

**4. 4వ అధ్యాయము** : ఆటంకములు చెరసాలల మధ్య సంఘ అభివృద్ధి.

**5. 5వ అధ్యాయము** : మోసములు చెరసాల మధ్య మరి ఎక్కువైన సంఘ అభివృద్ధి. (Added).

బి) 6-7 అధ్యాయములు స్తెఫను సాక్ష్యము.

**6. 6వ అధ్యాయము** : భిన్నత్వంలో ఏకత్వము - బహుగ సంఘ విస్తరణ. (Greatly multiplied) శ్రమలలో స్తెఫను.

**7. 7వ అధ్యాయము** : సభ ఎదుట స్తెఫను సాక్ష్యమిచ్చుట - హతసాక్షియగుట.

**III. 8-12 అధ్యాయాలు** : యూదయ సమరయులో సాక్ష్యము (కేంద్రము యెరూషలేము)

**8. 8వ అధ్యాయం** : ఫిలిప్పు సమరయ పట్టణంలో సమరయులకు సాక్ష్యమిచ్చుట.

**9. 9వ అధ్యాయము** : పేతురు యూదయలో సాక్ష్యమిచ్చుట - భూదిగంతంలో సేవకై నియమించబడిన యూదుడైన పౌలు రక్షించబడుట (9:15).

**10. 10వ అధ్యాయము** : పేతురు సమరయ పట్టణంలో అన్యులకు అనగా శతాధిపతియైన కొర్నేలికి ఇతర అన్యులకు సాక్ష్యమిచ్చుట.

**11. 11వ అధ్యాయము** : బర్నబా, పౌలులు సిరియాలోని అంతియొకయలో అన్యులకు సాక్ష్యమిచ్చుట.

**12. 12వ అధ్యాయము** : యెరూషలేములో శిష్యుడైన యాకోబు చంపబడుట. దేవుని వాక్యము ప్రబలమవుట.

**IV. 13-20 అధ్యాయాలు** : భూదిగంతములకు అనగా ఆసియా ఐరోపాలో సాక్ష్యము (కేంద్రము సిరియాలోని అంతియొకయ) మూడు సేవా యాత్రలు ఒక్కొక్కరు మూడు (15అ.) మూడు (16-18అ.)

**19-21 అధ్యాయాలు** : మూడు వివరించబడినవి. ఒక్కొక్కటి 4 సం॥కాల పరిమితి కలది. 1) 46-49 సం॥, 2) క్రీ.శ. 50-53 సం॥, 3) క్రీ.శ. 54-57 సం॥)

**ఎ) 13-15 అధ్యాయాలు** : పౌలు బర్నబాతో కలసి చేసిన మొదట సేవా యాత్ర (ఆసియా ఖండములో)

**13. 13వ అధ్యాయము** : కుప్రద్వీపంలో పంఫూలియా, పిసిదియాలోనున్న అంతి యొకయలోనున్నయూదులకు సాక్ష్యము.

**14. 14వ అధ్యాయము** : గలతీయ దేశమందలి ఈకొనియ, లుస్త్ర, దెర్బె పట్టణము లలో యూదులకు అన్యజనులకు సాక్ష్యము.

**15. 15వ అధ్యాయము** : యెరూషలేములో జరిగిన సభలో అన్యులకు సున్నతి అవసరము లేదని తీర్మానము చేయుట.

**బి) 16-18 అధ్యాయాలు** : పౌలు రెండవ సేవా యాత్ర ముఖ్యంగా ఐరోపా ఖండములో

**16. 16వ అధ్యాయము** : మాసిదోనియ దేశమునకు ముఖ్య పట్టణమైన ఫిలిప్పీలో సాక్ష్యము.

**17. 17వ అధ్యాయము** : మాసిదోనియ దేశమునకు మరొక ముఖ్య పట్టణమైన థెస్సలోని కయలోను, బెరయలోను, గ్రీసు దేశములోని ఉత్తర ప్రాంతమునకు ముఖ్య పట్టణమైన ఏథెన్సులో సాక్ష్యమిచ్చుట - ఏథెన్సులో అన్యజనులకు ఇచ్చిన సాక్ష్యము.

**18. 18వ అధ్యాయము** : దక్షిణ గ్రీసు దేశమునకు ముఖ్య పట్టణమైన కొరింథులో సాక్ష్యమిచ్చుట.

**సి) 19-20-21:1-14వ అధ్యాయాలు** : పౌలు మూడవ సేవా యాత్ర (ఆసియా ఐరోపా ఖండాలలో)

**19. 19వ అధ్యాయము** : చిన్న ఆసియా దేశమునకు ముఖ్య పట్టణమైన ఎఫెసు పట్టణంలో సాక్ష్యమిచ్చుట.

**20.20వ అధ్యాయము** : మాసిదోనియా గ్రీసు దేశములలో సాక్ష్యము ఎఫెసు పెద్దలకు సంఘమును గూర్చిన వర్తమానము.

**గమనిక** : అ.కా. 9:15లో (దేవుడు) ప్రభువు పౌలు అన్యజనుల యెదుటను రాజుల యెదుటను సాక్ష్యము ఇవ్వాలని యేసు నామము కొరకు శ్రమలు అనుభవింపవలెనని తెలిపినందున పౌలు చెరలలో నుండి పై అధికారులకు గవర్నరులకు అగ్రిప్పరాజుకు, రోములోనుండు రాణువ వారికి, చక్రవర్తియగు కైసరు ఇంటివారికి సాక్ష్యమిచ్చుట Vవ భాగములో కలదు.

**V. 21-28 అధ్యాయములు** : పై అధికారులు దేశ అధికారులు చక్రవర్తి ఇంటివారికి చెరసాలలో ఉండి సాక్ష్యము ఇచ్చుట. పౌలు మూడు పర్యాయములో చెరలలో ఒక్కొక్క సారి 2 సం॥లు ఉండెను. 1) కైసరయలోని కావలి క్రీ.శ. 58-59సం॥, 2) రోములోని మొదటి చెర క్రీ. 61-62సం॥, 3) రోములోని రెండవ చెర క్రీ.శ. 65-66 సం॥.

**ఎ) 21-22 అధ్యాయములు** : పటాలము పై అధికారికి, కూడి వచ్చిన యూదులకు సాక్ష్యము ఇచ్చుట.

**21. 21వ అధ్యాయము** : పౌలు మిలేతు నుండి ఓడ ఎక్కి కైసరయకు వచ్చి యెరూషలేములో బంధింపబడి పటాలపు పై అధికారితో సాక్ష్యము ఇచ్చుటకై సెలవు పొందుట.

**22.22వ అధ్యాయము** : పౌలు తాను పొందిన మారు మనస్సును గురించి వివరమైన సాక్ష్యమిచ్చుట.

**బి) 23-24 అధ్యాయములు** : రోమా ప్రభుత్వ దేశాధికారియగు ఫెలిక్సుకు యూదురాలు అయిన ద్రుస్సిల్ల అను అతని భార్యకు కైసరయలోని కావలిలో రెండు సంవత్సరములు ఉండి సాక్ష్యమిచ్చుట.

**23.23వ అధ్యాయము** : యెరూషలేములో పౌలును చంపుటకై సిద్ధపడిన 40 మంది నుండి సహస్రాధిపతి కాపాడుట 470 మంది సైనికుల కాపలాతో పౌలును కైసరయకు పంపుట.

**24.24వ అధ్యాయము** : పౌలు అధిపతికి మరియు దేశాధిపతియగు ఫేలిక్సుకు అతని భార్యకు, వచ్చిన యూదులకు సాక్ష్యమిచ్చుట.

**సి) 25-26 అధ్యాయములు** : దేశాధికారులగు ఫేస్తుకు అగ్రిపరాజుకు సాక్ష్యమిచ్చుట.

**25.25వ అధ్యాయము** : కైసరయలో దేశాధిపతియగు ఫేస్తు పౌలును విచారించుట.

**26.26వ అధ్యాయము** : దేశాధికారులగు ఫేస్తు, అగ్రిప్ప రాజు అతని భార్యయగు బెర్నీకేలకు పౌలు సాక్ష్యమిచ్చుట.

**డి) 27-28 అధ్యాయములు** : కైసరయ నుండి ఇటలీకి వెళ్ళి రెండేండ్లు చెరలో నుండి యూదులకు, అన్యులగు సైనికులకు, కైసరు ఇంటి వారికి సాక్ష్యము ఇచ్చుట.

**27.27వ అధ్యాయము** : కైసరయ నుండి ఓడలో రోముకు బయలుదేరి మార్గమందు ప్రాణాపాయముల మధ్య ప్రయాణం కొనసాగుట.

**28.28వ అధ్యాయము** : రోముకు చేరి రెండు సంవత్సరములు కావలి ఉన్న సైనికులతో అద్దె ఇంట ప్రత్యేకముగా నివసించి తన యొద్దకు వచ్చువారికందరికి. ప్రేతోర్యమను సేనలోని వారికి, కైసరు ఇంటి వారికి సాక్ష్యమిచ్చుట.

**మరొక గమనిక** : మూడవ భాగములో యూదయ సమరయలో సాక్ష్యము తరువాత నాలుగు అయిదు భాగములలో భూదిగంతముల వరకు పౌలు ద్వారా అన్యజనులకు సాక్ష్యము అపొస్తలు కార్యము 9:15-16 వచనములలో ప్రభువు సెలవిచ్చినట్లు చెప్పబడినది. దీనికి సిద్ధపాటుగా మూడవ భాగములోని 9వ అధ్యాయముతో పౌలును రక్షించి అన్యులకు రాజులకు సాక్ష్యమిచ్చుటకై సిద్ధపరచెను. 8వ అధ్యాయములో సమరయులకు రక్షణ కలదని అపొస్తలలు నేర్చుకొనిరి. రాజులు రెండవ గ్రంథములో 17:24లో అష్షూరు రాజు పది గోత్రముల ఇశ్రాయేలీయులను చెరగొని పోయి షోమ్రోను దేశమునందు అష్షూరు ప్రజలను నివసింప జేసెను. ఈ అష్షూరీయులకు ఇశ్రాయేలీయులకు కలిగిన సంతానమే సమరయులు. యోహాను సువార్త 4:9 వచనంలో యూదులు సమరయులతో సాంగత్యము చేయరు అని చెప్పబడింది. అందుచేత సమరయులకు

రక్షణ కలదని యూదులు గుర్తించులాగున ఫిలిప్పు సమరయలో సాక్ష్యమివ్వగా సమర యులు రక్షింపబడిరి. 10వ అధ్యాయములో కైసరయలోని శతాధిపతియగు కొర్నేలి రక్షణ ద్వారా ఇశ్రాయేలు దేశములో నివసించు అన్యులకు రక్షణ కలదని గుర్తించిరి. 11వ అధ్యాయములో సిరియ దేశములోని అంతియొకయలోని అన్యులు రక్షించబడుట ద్వారా అంతియొకయ కేంద్రముగా పౌలు నాయకత్వమున 13-28 అధ్యాయములలో భూదిగంతములలో సువార్త ప్రకటన జరిగెను.

## 1వ అధ్యాయము : 5+6+3+6+6 = 26 వచనములు

## అంశము : ఆరోహణుడైన ప్రభువు ఆత్మ రాకడను అపేక్షించిన అపోస్తులులు.

**ఉపోద్ఘాతము** : ఈ గ్రంథము థెయొఫిలా పేరుతో వ్రాయబడింది. లూకా సువార్తలో ఘనత వహించిన థెయొఫిలా అని ఉన్నది. సువార్త వ్రాయబడిన సమయానికి ఘనత వహించినవాడు అనగా రోమా ప్రభుత్వ అధికారిగా ఉండెను. సువార్త తన పేరుతో వ్రాయబడినందున రోమా ప్రభుత్వము ఆయనను అధికారి బాధ్యతల నుండి తప్పించిరి. అందుకే ఇప్పుడు ఓథెయొఫిలా అని మాత్రమే పిలువబడుచున్నాడు. క్రీస్తు కొరకై శ్రమ పడుట నష్టము పొందుట. ఇందులో చూడగలము. 5వ వచనము ప్రకారము పరిశుద్ధా త్మలో బాప్తిస్మము పొందుట అనగా భూమి మీదికి పరిశుద్ధాత్మ యోహాను సువార్త 14:16-18 వచనముల ప్రకారము దిగి వచ్చి శిష్యులను శక్తి చేత నింపుటను సూచించును.

**భూమి మీద ప్రభువు చివరిరోజు - చివరి ఆజ్ఞ (6-11వ)** : ప్రభువు ఆరోహణమగు దినమున శిష్యులతో ఇశ్రాయేలునకు రాజ్యము అనుగ్రహించబడుటను గూర్చి వివరించి గ్రంథ ప్రారంభములో చెప్పబడిన మీరు నాకు సాక్షులు అని ఆజ్ఞ. (1:8) ఇచ్చి ఆరోహణమై పోయెను.

**ఏక మనసుతో ప్రార్థించిన అపోస్తలులు (12-14వ)** : అది విశ్రాంతి దినము కనుక ఓలీవల కొండ నుండి విశ్రాంతి దినమునకు నడవదగిన 1.4 కి.మీ. దూరముననున్న యెరూషలేమునకు వెళ్ళి మేడగదిలో శిష్యులు కొందరు స్త్రీలతో కలసి ప్రార్థన చేయుచుండిరి.

**యూదా మరణము (12-14వ)** : ఇస్కరియోతు యూదా మరణించుట అతని ఉద్యోగము వేరొకడు తీసుకొనును అని కీర్తన గ్రంథములో వ్రాయబడినట్లు జ్ఞాపకము చేసుకొనిరి.

**యూదా స్థానములో శిష్యుని ఏర్పాటు (21-26వ)** : అపోస్తులకు చిహ్నములగు 1. క్రీస్తును చూచినవారు, 2. క్రీస్తు పరమునకు చేర్చుకొనబడిన దినము వరకు ఆయనతో కలసినవాడు 1:22 యగు మత్తీయను పదకొండు మంది అపొస్తలుతో కూడా లెక్కించిరి. తరువాత మత్తీయ ప్రభువుచే వాడబడినట్లు గ్రంథములో వ్రాయబడ లేదు. 2 కొరింథీ 12:12లో అపోస్తలుల చిహ్నములను కనుపరచితిచిని అని గలతీ. 2:9లో అన్యజనులకు అపోస్తలుడనగుటకు సామర్థ్యము కలుగచేసెనని వ్రాసినందున పౌలును అపోస్తలుడుగా లెక్కింతురు

## 2వ అధ్యాయము : 13+12+11+11 =47 వచనములు

## అంశము : ఆత్మ దిగివచ్చి శిష్యులను నింపుట - అనేకులు క్రీస్తును నమ్మి సంఘముగా చేర్చబడుట.

పెంతెకోస్తు దినమున సంభవములు (1-13వ) : పెంతెకొస్తు పండుగ క్రీస్తు పునరుత్థానము నుండి 50వ దినమున వచ్చినది. ఈ దినమున పరిశుద్ధాత్మ ఆకాశము నుండి భూమి పైకి వచ్చాడు. ఈ సందర్భంలో బలమైన గాలివంటి ధ్వని ఆకాశము నుండి వచ్చుట అగ్నిజ్వాలలు వంటి నాలుకలు విభాగించబడుట కనబడినది. దీనికి గుర్తుగా ఆత్మ వారికి వాక్‌శక్తి అనుగ్రహించగా చేరి వచ్చిన జనులలో ప్రతి మనుష్యుడు తన తన స్వభాషలో వారు మాట్లాడుట. కనీసము 17 భాషలలో వారు మాట్లాడుట వినిరి. భాషలు అక్కడ చేరిన అవిశ్వాసులకు సూచనలని 1 కొరింథీ. 14:22 చూచు చున్నాము. అలాగే సూచనగా క్రింద కనపరచిన సందర్భములో లేఖనములలో ఈ గ్రంథమందు చూచెదము.

1. అ.కా. 8:9-10వ.లో బహుశా సమరయులు భాషలతో మాటలాడిరి. ఆ వచనముల ధ్యానము చదవండి.

2. అ.కా. 10:44-46లో పేతురు బోధ విని అన్యజనుల మీద పరిశుద్ధాత్మ దిగాడు. అన్యజనులు భాషతో మాట్లాడిరి. దీనిని బట్టి 11:18లో అన్యజనులకును దేవుడు జీవార్థమైన మారుమనస్సును దయచేసి యున్నాడని అపొస్తులు గుర్తించిరి. అలాగైతే భాషలు ఇక్కడ కూడా అన్యజనుల రక్షణ ఉన్నదని గుర్తించుటకు ఇవ్వబడ్డాయి.

3. అ.కా. 19:6లో పౌలు యోహాను బాప్తిస్మము పొందిన కొందరి శిష్యులను చూచి మీరు విశ్వసించినపుడు పరిశుద్ధాత్మను పొందితిరా అన్నాడు. ఈ ప్రశ్నలలో

జవాబుఉన్నది. ఒక వ్యక్తి విశ్వసించినపుడే పరిశుద్ధాత్మను పొందును. దీనికి మరే గుర్తు అక్కరలేదు. కాని ఈ శిష్యులు పరిశుద్ధాత్మ పరము నుండి దిగి రాక మునుపు బాప్తిస్మము యిచ్చు యోహాను ద్వారా బాప్తిస్మము పొందితిరి. అందుచేత పరిశుద్ధాత్మను వారు పొందలేదు. పౌలు ఆ విషయములను విశదపరచి వారికి బాప్తిస్మము ఇవ్వగా పరిశుద్ధాత్మ వారి మీదికి వచ్చుట ముందు యోహాను బాప్తిస్మము పొందినవారు భాషలతో మాట్లాడుట చూచుచున్నాము కనుక ఈ సందర్భములో కూడా పరిశుద్ధాత్మ పరము నుండి అ.కా 2:1లో రాకముందు నమ్మినవారి స్థితి కాని అ.కా. 2:1లో తరువాత నమ్మినవారు నమ్మినపుడే పరిశుద్ధాత్మను పొందుతారు. దీనికి వేరే సూచనలు అవసరం లేదు. ఎఫెసి. 1:13-14లో చదవండి.

**పేతురు సువార్త వర్తమానము - క్రీస్తు మరణ పునరుత్థానముల సాక్ష్యము (14-25 మరియు 26-36వ) :**

**14-21 వచనం :** పరిశుద్ధాత్మ దిగి వచ్చుట ప్రభువు నామమున ప్రార్థన చేయువారు రక్షింపబడుట యోవేలు 2:28-32 వచనాలలో ప్రకటించారు.

**22, 23 వచనం :** దేవుని అనాది కాల సంకల్పమును బట్టి యేసు క్రీస్తు దుష్టుల చేత సిలువ వేయబడి చనిపోయెను. లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము చనిపోయెను. 1 కొరింథీ. 15:3.

**24-28 వచనం :** మరణము ఆయనను బంధించుట అసాధ్యము గనుక దేవుడు ఆయనను లేపెను. ఎవ్వడును నా ప్రాణము తీసుకొనలేడు. దానిని పెట్టుటకు నాకు అధికారము కలదు. తిరిగి తీసుకొనుటకు నాకు అధికారము కలదు. యోహాను 10:18 క్రీస్తు పునరుత్థానములను గూర్చి దావీదు కీర్తనల గ్రంథము 16:10లో ప్రవచించాడు.

**29-36 వచనం :** సిలువ వేయబడి తిరిగి లేచిన యేసును దేవుడు ప్రభువుగాను క్రీస్తుగాను నియమించాడు. అనగా రాబోవు రాజైన మెస్సియా ఈయనే అని అపొస్తులలు సాక్ష్యము ఇచ్చిరి.

**మూడువేల మంది విశ్వసించి సంఘముగా చేర్చబడుట - అనుదినము కూడా కొనుట (37-47వ) :**

**37-40 వచనం :** ఈ మాటలు వినిన వారిలో ఇంచుమించు మూడు వేల మంది హృదయమందు పొడవబడి వాక్యమందు విశ్వాసముంచి రక్షింపబడిరి.

**41-42 వచనం :** 1. బాప్తిస్మము ద్వారా సంఘములో చేర్చబడుట, 2. బోధలోను, 3. సహవాసములోను. 4. రొట్టె విరుచుటయందును, 5. ప్రార్థనలోను యెడతెగక యుండిరి. కనుక పైన చెప్పిన అయిదు అనుభవములను నమ్మి రక్షింపబడిన వారు నెరవేర్చవలసిన దేవుని ఆజ్ఞలని నేర్చుకొనుచున్నాము.

**43-47 వచనం :** రక్షణ పొందుచున్న వారిని దేవుడు అనుదినము చేర్చుట సంఘాభి వృద్ధికి గుర్తు.

**గమనిక :** పాత నిబంధన కాలమందు పరిశుద్ధాత్మ భూమి పైకి వచ్చుచూ పోవుచూ ఉండెను. కాని అ.కా. 2:1-4వ. పరిశుద్ధాత్మ భూమి పైకి దిగివచ్చాడు. యోహాను 14:16-17వ. ప్రకారము ఎల్లప్పుడు మనలోను, మనతోను ఉండును. ఎఫెసీ. 4:30వ. ప్రకారము విమోచన దినము వరకు, అనగా రెండవరాకలో ప్రభువు 1 థెస్స. 4:13-18వ. ప్రకారము ఆకాశ మండలమునకు వచ్చి సంఘమును తన యొద్దకు చేర్చుకొను వరకు పరిశుద్ధాత్మ భూలోకములో ఉండును. అపొస్తలుల కార్యములు మొదటి అధ్యాయములో పరిశుద్ధాత్మ భూలోకమునకు ఇంకను రానందున మేడగదిలో వారు కనిపెట్టుకొని యుండిరి. 2:1-4వ. భూమి పైకి వచ్చిన పరిశుద్ధాత్మ వారిలో ప్రవేశించాడు. ప్రస్తుత కాలములో పరిశుద్ధాత్మ భూమి మీదనే ఉన్నందున ఈ దినములలో క్రీస్తు నంగీకరించు వారు అపొస్తలుల కార్యములు మొదటి అధ్యాయము వారివలె కనిపెట్టుకొనవలసిన పని లేదు. ఎఫెసీ. 1:13వ. ప్రకారము సత్య వాక్యమును విని క్రీస్తునందు విశ్వాసముంచి వాగ్దానము చేయబడిన ఆత్మచేత ముద్రించబడుదురు. క్రీస్తును నమ్ముట, ఆత్మ చేత ముద్రించబడుట ఒకేసారి జరుగునని గమనించాలి. ఉదాహరణగా సాయంత్రము 6గంటలకు రైలు మనస్టేషన్‌కు వచ్చి 30 ని॥లు ప్లాటు ఫారము పైనుండును అనుకుందాము. 5:30 గం॥లకు స్టేషన్‌కు వెళ్ళినవారు 30 నిమిషములు కనిపెట్టి రైలు వచ్చిన వెంటనే ఎక్కుదురు. 6:15 నిమి॥ స్టేషన్‌కు వెళ్ళినవారు రైలు కొరకు కనిపెట్టక స్టేషన్‌లో ఉన్న రైలెక్కి కూర్చుందురు. అలాగే పరిశుద్ధాత్మ ప్రస్తుతము భూలోకములోనే ఉన్నందున ఆయన రాకకై కనిపెట్టుకొన వలసిన పని లేదు. విశ్వసించి నపుడే ఆయన మనలో ప్రవేశించును. మనతోను, మనలోను ఎల్లప్పుడు ఉండును. కాని మరొకమాట. ఆత్మపూర్ణులైయుండుడని ఎఫెసీ. 5:18లో ఉన్నది. మనలో పరిశుద్ధాత్మ ఎల్లప్పుడు ఉండును కాని ఆయన పూర్ణమైన స్వతంత్రత ఇవ్వాలి. ఆయనను మన ఇంటిలో ఒక అతిథిగా ఒక గదిలో ఉంచామనుకుందాము. అతిథికి స్వతంత్రత ఉండదు.

నీరు కావాలన్న, స్నానము చేయాలన్నా మన సెలవుకై కనిపెట్టును. కాని మన ఇంటి స్వంతదారుడుగా పరిశుద్ధాత్మ ఉన్న యెడల ఆయన స్వతంత్రత గలవాడై అన్ని సిద్ధము చేసి మనకెప్పుడు ఏమి కావాలో అన్నింటిని అనుగ్రహించును. కావున, ఆత్మపూర్ణత అనగా పరిశుద్ధాత్మ దేవుని సంపూర్ణ స్వతంత్ర నిచ్చి ఆయన అధీనమునకు మనలను మనము అప్పగించుకొనుట అని అర్థము. మనము స్వతంత్రత ఇవ్వని యెడల ఆయన దుఃఖపడుచునుండును. కాని వెళ్ళిపోక విమోచన దినము వరకు ఉండును. ఆత్మను దుఃఖపరచకుడి విమోచన దినము వరకు ముద్రించబడియున్నారు అని ఎఫెసీ 4:30లో ఉన్నది.

## 3వ అధ్యాయము 5+5+6+5+5+ = 26 వచనములు
## అంశము : శక్తిగల యేసు నామము

**దేవాలయపు గుమ్మము వద్దనున్న పుట్టు కుంటివాడు - యేసు నామమున స్వస్థత - దేవుని స్తుతించుట (1-5వ, 6-10వ)** : దేవాలయపు ద్వారము. శృంగారమని పిలువబడినది. (BEAUTY) కాని అక్కడ ఉన్నది పుట్టుకతో కుంటివాడు. 4:22. ప్రకారము నలుబది యేండ్ల కంటే ఎక్కువ కాలము కుంటివాడు. దీని భావము భూమి మీద ఉన్న దేవాలయములు, వాటి ద్వారములు అందులో నుండు దేవుడు చూడ ముచ్చటైన వారేగాని, అందులోనికి వచ్చు మానవులందరు పాపులు. (కీర్తనలు 51:5) జీవించుట చనిపోవుట పాపములోనే (యోహాను 8:21) యేసు నామము వానికి పూర్ణ స్వస్థత ఇచ్చినట్టు పాపముల నుండి స్వస్థతను క్రీస్తు నామమున పొందగలము. వివరములు 2వ అధ్యాయములో చూడగలము. వాడు గంతులువేయుచు దేవాలయములోనికి వెళ్ళుట క్రీస్తును విశ్వసించిన వారు జీవితకాలమెల్ల స్తుతించాలి అని దీని భావము.

**పేతురు ప్రసంగము యేసునామమందలి శక్తిని గూర్చిన సాక్ష్యము (11-16వ)** : చేరి వచ్చిన జన సమూహములకు క్రీస్తు 1. పరిశుద్ధుడని, 2. నీతిమంతుడని, 3. జీవాధి పతియని, 4. నిరాకరించబడినవాడని, 5. చంపబడిన వాడని, 6. మృతులలో నుండి లేపబడెనని, 7. ఆయన నామమందు విశ్వాస ముంచవలెనని పేతురు బోధించాడు.

**యేసు నామమందలి శక్తిని గూర్చి ఆది నుండి ప్రవక్తల సాక్ష్యము (17-21వ)** : దేవుడు సమస్త ప్రవక్తల నోట ఆది నుండి క్రీస్తు యేసును పంపెదనని యేసు మరణం

ద్వారా మానవుల పాపములు తుడిచి వేయబడును అని యేసు ఆరోహణుడై పరలోకవాసి అయియుండగా మానవులు మారుమనస్సు పొంది యేసు వైపు తిరుగవలెనని హెచ్చరించెను.

**యేసు నామమందలి శక్తిని గూర్చి మోషే, సమూయేలుల సాక్ష్యము (22-26వ)** : యేసు నామమందలి శక్తిని గూర్చి ప్రవక్తలైన మోషే, సమూయేలు, అబ్రాహాము, యెషయాల సాక్ష్యము. మోషే దేవుడు నా వంటి ప్రవక్తను మీ సహోదరులలో నుండి మీ కొరకు పుట్టించునని సాక్ష్యమిచ్చెను. (ద్వితీ. 18:16-17వ) అలాగే సమూయేలు మొదలు అందరు ప్రవక్తలు సాక్ష్యమిచ్చిరి.

అబ్రాహాముతో నీ సంతాన మూలమున భూలోక వంశములన్ని ఆశీర్వదించబడునని క్రీస్తును గూర్చి సెలవిచ్చెను. (ఆది 12:3). క్రీస్తు సేవకుడుగా ఈ లోకానికి వచ్చి ప్రతి మానవుని పాపము నుండి మళ్ళించెనని చెప్పెను.

## 4వ అధ్యాయము 4+8+10+8+6+ = 37 వచనములు

## అంశము : ఆటంకములు, చెరసాల మధ్య అభివృద్ధి

**చెరసాల కలవరముల మధ్య నమ్మినవారు (1-4వ)** : సిలువను గూర్చిన వార్తతో సువార్త ప్రారంభం కాగా, సిలువ శ్రమలు సువార్త ప్రకటనను వెంబడిస్తాయి. మూడవ అధ్యాయములో సువార్త ప్రకటనకు కలవరపడిన దేవాలయ అధిపతులు పేతురు యోహానులను పట్టుకొని ఆ రాత్రి కావలిలో నుంచిరి. సద్దూకయ్యులు 2 దిన. 31:9లో ఉన్న ప్రధాన యాజకుడైన సాదోకు సంతతి వారు పునరుత్థానము లేదని ఈ జీవితకాలము తరువాత ఏమిలేదని దేవదూతలు లేరని నమ్ముతారు. వారి బోధకు క్రీస్తు పునరుత్థానము వ్యతిరేకమైనందున వీరును దేవాలయ అధిపతులతో కలుసుకొనిరి.

**పేతురు ప్రసంగము - రక్షణ పొందు విధము (5-12 వ)** : మరునాడు అధికారులు పేతురు యోహానులను ప్రశ్నించగా పేతురు సిలువ వేయబడిన యేసు నామముననే రక్షణయని మరి ఏ నామమున రక్షణ లేదని యేసు నామముననే పుట్టు కుంటివాడైన మనుష్యుని స్వస్థపరిచెనని ఖండితముగా చెప్పెను.

**బెదిరింపులు (13-22 వ.)** : పేతురు యోహానుల ధైర్యము చూచినపుడు స్వస్థత పొందిన మనుష్యుడు అక్కడనే ఉండగా అధికారులు ఏమి మాట్లాడక పేతురు

యోహానులను బెదిరించిరి కాని వారుకన్న వాటిని విన్నవాటిని చెప్పక యుండలేమని చెప్పిరి.

**ప్రార్థన (23-31 వ.)** : విడుదల పొందిన సహోదరులకు జరిగిన విషయములు తెలుపగా వారందరు ఏక మనస్సుతో ప్రార్థించిరి. అందరు ఆత్మచే నింపబడి వాక్యమును ధైర్యముగా బోధించిరి.

**విశ్వసించినవారు కలిసియుండుట (32-37వ)** : విశ్వసించిన వారు ఏకమనస్సుతో కలిగినదంతా సమిష్టిగా నుంచుకొనిరి. ఆస్థిపాస్తులు కలవారు అమ్మి వాటివెల అపొస్తులుల పాదముల యొద్ద ఉంచిరి. ప్రతి వానికి అక్కరల కొలది పంచి పెట్టబడెను. బర్నభా తన భూమిని అమ్మి దాని వెల అపొస్తులుల పాదముల యొద్ద పెట్టిరి.

## 5వ అధ్యాయము 6+5+5+5+5+6+5+5 = 42 వచనములు

## అంశము : మోసములు చెరసాలల మధ్య మరి ఎక్కువైన సంఘాభివృద్ధి

**పరిశుద్ధాత్మను మోసపుచ్చి మరణించిన అననీయ (1-6వ)** : అననీయ తన భార్యతో కలసి పొలము అమ్మి దాని వెలలో కొంత దాచుకొని మిగిలినది అపొస్తులులకు ఇచ్చెను. ఇది పరిశుద్ధాత్మను మోసపుచ్చుట అని పేతురు చెప్పగనే అననీయ మరణించి పాతిపెట్ట బడెను.

**పరిశుద్ధాత్మను శోధించుటలో ఏకీభవించి మరణించిన సప్పీర (7-11వ)** : జరిగినది ఎరుగక భార్య అయిన సప్పీరా కూడా అబద్ధము ఆడగా ప్రభువు ఆత్మను శోధించుటకు ఏకీభవించినది అని పేతురు చెప్పిన వెంటనే అక్కడనే చనిపోయెను. పాతిపెట్టబడెను. సంఘమంతటికి మిగుల భయము కలిగెను.

**అపొస్తలుల ద్వారా అనేక సూచక క్రియలు (12-16వ)** : అపొస్తలులు అందరు ఏకముగా నుండి అనేకమైన సూచక క్రియలు మహత్కార్యములు జరిగించిరి. పురుషులు స్త్రీలు. మరి ఎక్కువగా విశ్వాసులై ప్రభువు పక్షముగా చేరిరి (Added).

**చెరసాల నుండి ప్రభువు దూత ద్వారా తప్పించబడి బోధించిన అపొస్తలులు (17-21వ):** ప్రధాన యాజకులు అపొస్తులను చెరసాలలో ఉంచిరి కాని ప్రభువు దూత వారిని విడిపించగా దేవాలయములోనికి వెళ్ళి బోధించుచుండిరి.

**ప్రధాన యాజకుల ఎదుట అపోస్తలులు (22-26వ)** : బంట్రోతులు చెరసాలలో వారు లేనందునను దేవాలయములో బోధించుచున్నారని తెలుసుకొని వారిని తీసుకొని వచ్చిరి.

**యెరూషలేము క్రీస్తును గూర్చిన సాక్ష్యముతో నింపబడినది (27-32వ)** : వారిని ప్రధాన యాజకుల యెదుట నిలువబెట్టగా ప్రధాన యాజకుడు యెరూషలేమును మీ బోధతో నింపితిరని సాక్ష్యమిచ్చెను. పేతురును అపొస్తులను సిలువ వేయబడి చనిపోయి తిరిగి లేచిన యేసు ద్వారా పాప క్షమాపణ కలుగునని సాక్ష్యమిచ్చెను.

**అవమాన పరచబడి, దెబ్బలుతిని సేవను కొనసాగించిన అపొస్తలులు (33-37వ)** : వినినవారు ఆగ్రహించి అపొస్తులను చంపనుద్దేశించగా గమలియేలు అను మనుష్యుడు వారిని అలాగు చేయకుండా నివారించెను. 38-42 మహాసభవారు అపొస్తులులను కొట్టి బోధింపకూడదని ఆజ్ఞాపించి విడుదల చేసిరి కాని సంతోషించి ప్రతి దినము ఇంటింటా దేవాలయములో మానక యేసుని ప్రకటించిరి.

## 6వ అధ్యాయము 7+8+15 = 30 వచనములు

## అంశము : భిన్నత్వంలో ఏకత్వము, బహుగ సంఘ విస్తరణ (1-7వ)

**సంఘము లోపటి వారి ద్వారా తొందరలు - వాక్యము ప్రబలమగుట ద్వారా శిష్యుల సంఖ్య బహుగా విస్తరించుట (1-7వ)** : అనుదిన పరిచర్యలో గ్రీకుభాష మాట్లాడు విధవ రాండ్రను చిన్నచూపు చూచిరని హెబ్రీయుల మీద సణుగులు ప్రారంభము కాగా హెబ్రీయులైన అపొస్తులులు గ్రీకు భాష మాట్లాడు మంచి సాక్ష్యము కలిగిన ఏడుగురిని పరిచర్యకై నియమించి సమస్యను పరిష్కరించిరి. మొదట వచనాలలో శిష్యుల సంఖ్య విస్తరించినది అని (Multiplied) ఏడవ వచనంలో బహుగా విస్తరించినది అని (Greatly Multiplied) ప్రజలే కాక యాజకులలో అనేకమంది విశ్వసించినందున ప్రధాన యాజకులు మాత్రమే ఇక మిగిలిపోయిరి. (5:14లో Added అని 6:1, Multiplied అని 6:7, Greatly Multiplied) అని ఉన్నది.

**సంఘమునకు వెలుపటి వారి ద్వారా శ్రమలు - మహా సభ ఎదుట స్తెఫను (8-15వ)**: పరిచారకుడైన స్తెఫను పరిశుద్ధాత్మతోను, బలముతోను నిండిన వాడైనందున ఎవరును అతని మాటలను ఎదిరించలేకపోయిరి. ప్రజలు, పెద్దలు, శాస్త్రులు, అబద్ధపు సాక్షులను ఏర్పర్చుకొని మహాసభలో స్తెఫను నిలువబెట్టి అబద్ధ సాక్ష్యములు చెప్పించిరి. కాని స్తెఫను వారికి దేవదూతవలె కనిపించెను.

# 7వ అధ్యాయము 16+19+15+10 = 60 వచనములు
## అంశము : సభ ఎదుట స్తెఫను క్రీస్తును గూర్చి సాక్ష్యమిచ్చి హతసాక్షి అగుట

**యాకోబు కుమారులైన గోత్ర కర్తలు, యోసేపు పై అసూయపడుట (1-16వ) :** అబ్రాహాము మహిమగల దేవుని పిలుపునకు విధేయత చూపి కనానులో నివసించి ఇస్సాకును కనగా ఇస్సాకు యాకోబును, యాకోబు పన్నెండు మంది గోత్రకర్తలను కనెను. వారు అసూయతో యోసేపును ఐగుప్తులోనికి పోవుటకు అమ్మివేసిరి. కరువును బట్టి యాకోబు అతని సంతానమంతయు ఐగుప్తుకు వెళ్ళిరి. యాకోబు యోసేపు పితరులు చనిపోయిరి.

**పితరులు మోషే పై తిరుగుబాటు చేసి మోషేను త్రోసివేయుట (28వ, 17-35వ) :** నిర్గమకాండములో యోసేపుని ఎరుగని వేరొక ఫరో ఐగుప్తును పరిపాలించుచు ఇశ్రాయేలీయులను శ్రమపెట్టెను. మోషే లేవీ వంశములో పుట్టెను. కాని ఫరో ఇంటిలో రాజ కుమార్తె కుమారుడిగా నలభైయేండ్లు పెంచబడెను. తన జనులకు కలుగు బాధను చూచి బాధపెట్టిన ఒక్క ఐగుప్తీయుని చంపెను. ఫరోకు భయపడి మిధ్యాను అరణ్యమునకు పారిపోయెను. మిద్యాను యాజకుడగు యిత్రో కుమార్తెయగు సిప్పోరాను వివాహమాడి నలుభైయేండ్లు తన మామమందను మేపెను. పర్వతారణ్య మందు మండుచున్న పొదనుండి దేవుడు మాట్లాడగా మోషే విని విధేయత చూపి ఇశ్రాయేలీయులను ఐగుప్తు చెరనుండి విడిపించుటకు విమోచకుడుగా నియమించబడెను.

**అరణ్య ప్రయాణములో మోషేను ఎదిరించి ఐగుప్తుకు వెళ్ళగోరుట - యెహోషువ ద్వారా కనాను ప్రవేశించుట. న్యాయాధిపతులు, రాజుల ద్వారా కాపాడబడుట (36-50వ) :** ఐగుప్తు నుండి పితరులను విడిపించి నలుబది యేండ్లు అరణ్యములో సూచక క్రియలు చేసి కనానుకు వారిని తోడుకొని వచ్చెను. కాని పితరులు మార్గములో మోషేను త్రోసివేసి హృదయములలో ఐగుప్తుకు పోదలచిరి. దూడను తీసుకొని బలి అర్పించిరి. తరువాత పితరులు యెహోషువ నాయకత్వమున కానాను స్వతంత్రించుకొనిరి. తరువాత న్యాయాధిపతుల ద్వారా దావీదు రాజు సొలొమోను రాజుచే పాలించబడిరి. దేవాలయము కూడా నిర్మించబడెను.

**యూదులు పరిశుద్ధాత్మను ఎదిరించుట - స్తెఫనును చంపుట (51-60వ) మరియు ఇరవైమంది రాజులచే పాలించబడిరి :** పితరులు అవిధేయులైనట్లు స్తెఫను కాలములోను

ఇశ్రాయేలీయులు పరిశుద్ధాత్మను ఎదిరించిరని ధర్మశాస్త్రము గైకొనలేదని స్తెఫను తెలిపెను. మహాసభవారు ఈ మాటలు విని స్తెఫను రాళ్ళతో కొట్టి చంపిరి. యౌవనస్థుడైన సౌలు అనబడిన పౌలు స్తెఫను చావును సమ్మతించెను.

## 8వ అధ్యాయము 8+8+8+1+5+5+5 = 40 వచనములు

## అంశము : ఫిలిప్పు సమరయులో సాక్ష్యము సంఘాభివృద్ధి, ఐతియోపీయుడైన మంత్రియగు నపుంసకుడు రక్షింపబడుట

**శ్రమలను బట్టి చెదరిన వారిలో ఫిలిప్పు సమరయ పట్టణంలో సువార్త ప్రకటించగా కలిగిన సంతోషము (1-8వ)** : యెరూషలేములో కలిగిన హింసను బట్టి యూదయ, సమరయ దేశములకు చెదిరిపోయిన వారు సువార్త ప్రకటించుచు సంచారము చేసిరి. ఫిలిప్పు యెరూషలేమునకు 50 మైళ్ళు దూరమున సమరయ వరకు వెళ్ళి సువార్త ప్రకటించెను. ఫిలిప్పు చేసిన సూచక క్రియలను బట్టి జనులు సువార్తయందు లక్ష్య ముంచగా ఆ పట్టణంలో మిగుల సంతోషము కలిగెను.

**నమ్మినవారు బాప్తిస్మము పొందుట (9-16వ)** : ఫిలిప్పు ప్రకటించిన యేసును గూర్చిన సువార్త నమ్మి పురుషులు స్త్రీలు బాప్తిస్మము పొంది, యెరూషలేము నుండి పేతురు యోహానులు వచ్చి నమ్మినవారు పరిశుద్ధాత్మను పొందవలెనని ప్రార్థించి, సమరయులు పరిశుద్ధాత్మను పొందుటను చూచిన అపొస్తలులు సమరయులకు రక్షణ కలదని గుర్తించిరి.

*గమనిక* : క్రీ.పూ. 721లో పదిగోత్రముల ఇశ్రాయేలు వారు అష్షూరు దేశమునకు చెరకు వెళ్ళగా ఇశ్రాయేలు దేశములోని పది గోత్రముల స్థానంలో అన్యజనులగు అష్షూరియులు నివసించిరి. తరువాత కాలములో ఈ అన్యులు ఇశ్రాయేలీయులను వివాహము చేసుకొనగా. జన్మించినవారే సమరయులు. యూదులు సమరయులతో సాంగత్యము చేయరని యోహాను 4:9లో చూతుము. యూదులు సమరయులను యెరూషలేము దేవాలయమునకు రానివ్వని కారణమున గెరీజీము కొండపై సమరయులు ఆరాధించేవారు (యోహాను 4:20-22). అందువలన సమరయులకు రక్షణ కలుగునని యూదులు అంగీకరింపరు. కనుకనే పరిశుద్ధాత్మ సమరయులకు అనుగ్రహించబడుట యూదులు చూచిరి. బహుశ అ.కా. 11:45-46లో ఉన్నట్టు నమ్మిన సమరయులు భాషలతో మాట్లాడియుండ వచ్చును. ఏలయనగా భాషలు అవిశ్వాసులకు

సూచన 1 కొరింథీ. 14:22. (భాషలను గూర్చి చివరి పేజీలోనున్న ముఖ్య విషయముల వివరణ చూడండి)

**గారడీ సీమోను ద్రవ్యము ఇచ్చి వరమును సంపాదించుకొన తలంచుట వలన గద్దింపబడుట (17-24వ)** : సమరయులు నమ్మి బాప్తిస్మము పొందినపుడు గారడీ సీమోను కూడ నమ్మి బాప్తిస్మము పొందెను. నమ్మిన సమరయులు పరిశుద్ధాత్మ అను వరమును పొందుట సీమోను చూచి అపొస్తులుల ఎదుట ద్రవ్యము పెట్టి అటువంటి వరము పొందగోరెను. గారడీ సీమోను నమ్మకము వాస్తవమైనది కాదు. అందుచేత అపొస్తులుల ద్వారా గద్దించబడి....

**సమరయుల అనేక గ్రామములలో సాక్ష్యము (25వ)** : సమరయ సమరయులకు రక్షణ కలదని తెలుసుకొనినందున పట్టణంలో అపొస్తులులు వాక్యము బోధించి యెరూష లేమునకు వెళ్ళుచు మార్గమందు అనేక సమరయుల గ్రామములో వాక్యము బోధించిరి.

**గ్రంథము చదువుచున్న ఐతియోపీయుడైన నపుంసకుడగు ధనాగారపు మంత్రిని ఫిలిప్పు కలుసుకొనుట (26-30 వ)** : ఇతియోపియా యెరూషలేమునకు కొన్ని వందలమైళ్ళ దూరము ఆ దేశపు ధనాగారపు మంత్రి యూదేతరుడే గాని యూదా మతమును అవ లంభించినవాడు. ఆ దినములలో మహా తెలివి గల నపుంసకులను ప్రాముఖ్యమైన విభాగములకు అనగా ధనాగారము వంటి విభాగమునకు మంత్రులుగా నియమించెదరు. ఇతను యెరూషలేమునకు రథముపై ఆరాధించుటకు వచ్చి తిరిగి వెళ్ళుచుండెను. రథములో కూర్చుండి యెషయా గ్రంథము యాభై మూడవ అధ్యాయము చదువు చుండెను గాని గ్రహింపకుండెను. ఫిలిప్పు ప్రభువు దూత ద్వారా బోధించబడి సమరయ నుండి ప్రయాణమై యెరూషలేము ఇతియోపియా మార్గకూడలిని రథము అక్కడ చేరు సమయములో కలుసుకొని నీవు చదువుచున్నది గ్రహించుచున్నావా అని అడిగెను.

**గ్రంథమందలి లేఖనములను వివరించి ఫిలిప్పు సువార్త ప్రకటించుట (31-35వ)** : ఎంతో తెలివైన మంత్రియైనను లేఖనములను గ్రహింపలేడు. ప్రతి సువార్తికుడు ప్రతి సహోదరుడు విద్యాహీనులకైనను తెలివి కలిగి పెద్ద స్థానములో ఉన్నవారికైనను లేఖన ములు వివరించుట అవసరము. క్రీస్తు మరణ పునరుత్థానములు మానవ పాప క్షమాపణ కొరకే అని ఫిలిప్పు సువార్తను వివరించి తెలిపెను. నమ్మినవారు బాప్తిస్మము పొందవలెనని ఇలా బోధించియుండెను.

**నపుంసకుడు నమ్ముట - బాప్తిస్మము (36-40వ)** : నపుంసకుడు పూర్ణ హృదయముతో యేసును హృదయములో నమ్మి రోమా 10:9 ప్రకారము నోటితో ఒప్పుకొని రక్షించబడి నీతిమంతుడుగా తీర్చబడెను. మార్గమందు నీళ్ళను చూచి నపుంసకుడు తాను నమ్మినట్లుగా తెలిపి బాప్తిస్మము ఇమ్మని అడిగెను. ఇద్దరు నీళ్ళలోకి దిగగా ఫిలిప్పు బాప్తిస్మము ఇచ్చెను. నపుంసకుడు సంతోషించి వెళ్ళిపోయెను. 60 మైళ్ళ దూరమున నున్న ఫిలిప్పు, కైసరయకు వచ్చుచు మార్గమందు ఉన్న పట్టణములలో సువార్త ప్రకటించుచూ వచ్చెను.

గమనిక : మంత్రి ద్వారా ఇతియోపియా దేశములో అనేకులు విశ్వసించిరి. నాటి నుండి నేటికి అనగా 2000సం॥ వరకు ఆ దేశములో క్రైస్తవులు ఉన్నారు. జవహర్‌లాల్ నెహ్రూగారు భారత ప్రధానిగా ఉన్నప్పుడు ఇతియోపియా ప్రధానియగు హైలి సలాసిగారు భారత దేశమునకు వచ్చిరి. విమానాశ్రయములో విమానము నుండి బైబిల్ చేతపట్టుకొని దిగిరి. ఫిలిప్పు చేసిన పరిచర్య ద్వారా నపుంసకుడు మారుట 2 వేల యేండ్లుగా ఆ ఫలము నిలచియుండుట ఆశ్చర్యము!

## 9వ అధ్యాయము 9+9+7+5+5+4+4 = 43 వచనములు

### అంశము : పౌలు రక్షణ, పౌలు ప్రకటన ప్రారంభము పేతురు యూదయలో సాక్ష్యము, సంఘ అభివృద్ధి.

**దమస్కు మార్గమున రక్షించబడిన పౌలు (1-9వ)** : శిష్యులను బెదిరించి హత్య చేయు లక్ష్యముతో యెరూషలేములో నుండి అధికార పత్రిక తీసుకొని దమస్కునకు వెళ్ళుచుండెను. మార్గమందు యేసు ప్రభువును చూచి రక్షకుడుగా అంగీకరించి చూపును కోల్పోయి దమస్కు పట్టణములోనికి పోయెను.

**ప్రార్థించి ప్రభువు చిత్తమెరిగి బాప్తిస్మము పొందిన పౌలు (10-18వ)** : దమస్కులో అననీయ ద్వారా అన్యజనులు యెదుటను రాజుల యెదుటను క్రీస్తు నామమును భరించి శ్రమలు పొందుటకు దేవుడు తనను ఏర్పర్చుకొనెను అని తెలుసుకొనెను - బాప్తిస్మము పొందెను. కంటిచూపును పొందెను.

**దమస్కులో ప్రకటించిన పౌలు (19-25వ)** : దమస్కులో యేసు రక్షకుడని క్రీస్తు అనగా ఈ లోకమునకు రాబోవు అభిషిక్తుడుగ మెస్సియా అని రుజువు పరచెను.

యూదులు అతనిని చంపగోరగా శిష్యుల ద్వారా తప్పించబడి 120 మైళ్ళ దూరమున యెరూషలేమునకు వచ్చెను.

**రక్షించబడిన పిదప మొదటసారి యెరూషలేమునకు వెళ్ళి ప్రకటించి తార్సుకు వెళ్ళిన పౌలు (26-30వ)** : యెరూషలేముకు పౌలు రాగా శిష్యులు భయపడి చేర్చుకొనలేదు. బర్నబా హెచ్చరిక పుత్రుడు కనుక పౌలును వారికి పరిచయం చేసెను. యెరూషలేములో ధైర్యముగా క్రీస్తును బోధించుచుండగా యూదులు చంప ప్రయత్నించిరి. సహోదరునితో కూడా కైసరయకు వచ్చి తార్సుకు వెళ్ళిపోయెను.

**యూదయ గలిలయ సమరయలో విస్తరించిన సంఘము - యూదా పట్టణంలో పేతురు పరిచర్య (31-35 వ)** : యూదయ గలిలయ సమరయ దేశములయందు సంఘములు. 1. క్షేమముగాను, 2. అభివృద్ధినొందుచు అనగా సంఘముల లెక్క పెరుగుచు, 3. సమాధానం కలిగి, 4. ప్రభువునందు భయము కలిగి, 5. పరిశుద్ధాత్మ ఆదరణ కలిగి, 6. విస్తరించుచుండెను. ఇది మాదిరికరమైన సంఘ అభివృద్ధి అని గమనించవలెను. పేతురు యూదయలోని సకల ప్రదేశములో సంచారము చేయుచు లుద్దలోనున్న పరిశుద్ధుల యొద్దకు వచ్చెను. పక్షవాయువు గల ఐనెయ్యను స్వస్థ పరచెను. ఆ పట్టణంలోని వారందరు ప్రభువు తట్టు తిరిగిరి. ఇది సంఘముల విస్తరణకు గుర్తు.

**యూదయలోని యొప్పేలో శిష్యురాలగు దొర్కా కాయిలాపడి మరణించగా పేతురు ప్రార్థించి బ్రతికించెను (36-39 వ, 40-43వ)** : ఎ) మరణించిన వారు శిష్యుల ద్వారా అపొస్తలుల కార్యములలో బ్రతికిన మూడు సందర్భములు కలవు.

**1.** అ.కా. 9:40 : పేతురు ద్వారా యొప్పేలో దొర్కా అను స్త్రీ బ్రతికించబడెను.

**2.** అ.కా. 14:20 : లుస్త్రలో రాళ్ళచేత కొట్టబడి చనిపోయిన పురుషుడైన పౌలు బ్రతికెను.

**3.** అ.కా. 20:10 : పౌలు ద్వారా త్రోయలో చనిపోయిన ఐతుకు అను యౌవనస్థుడు బ్రతికింపబడెను.

**బి) యేసు క్రీస్తు దినములలో చనిపోయి యేసుచే బ్రతికించబడిన వారు (క్రీస్తుకాక)** :

**1.** లూకా 7:15 : నాయీను అను గ్రామములో విధవరాలు **కుమారుడగు** చిన్నవాడు బ్రతికించబడెను.

2. లూకా 8:55 : సమాజ మందిరపు అధికారి కుమార్తెయగు చిన్నది బ్రతికించబడుట.

3. యోహాను 11:44 : బేతనియ గ్రామమందు నాలుగు దినములు సమాధిలో ఉండిన పెద్దవాడగు లాజరు బ్రతికించబడుట.

**సి) పాత నిబంధనలో చనిపోయి బ్రతికినవారు :**

1. 1 రాజులు 17:24 : ఏలియా ద్వారా సారెపతు విధవరాలు **కుమారుడైన చిన్నవాడు** బ్రతుకుట.

2. 2 రాజులు 4:35 : ఎలీషాద్వారా షూనేమీయురాలు కుమారుడు బ్రతికించబడుట.

3. 2 రాజులు 13:20-21వ : ఎలీషా చనిపోయిన తరువాత అతనిని సమాధిలో పెట్టిరి. ఒక సంవత్సరము తరువాత మరొక శవమును ఎలీషా సమాధిలో పెట్టబడు చుండగా ఆ శవము ఎలీషా శవమునకు తగిలి బ్రతికి కాళ్ళు మోపి నిలిచెను.

## 10వ అధ్యాయము 8+8+8+8+8+8 = 48 వచనములు
## అంశము : పేతురు సమరయలో సాక్ష్యము - కొర్నేలి ఇతరుల రక్షణ

**విభజన - అన్యుడైన కొర్నేలి రక్షణ కొరకైన సిద్ధపాటు (1-8వ)** : సమరయ దేశములోని కైసరయలో అన్యుడైన శతాధిపతియగు కొర్నేలి అను భక్తి పరుడు ఉండెను. అన్యుడైనను దేవునికి ప్రార్థన చేయువాడు. ప్రార్థన దేవుని సన్నిధికి చేరినది కాని పాప క్షమాపణ, రక్షణ అనుభవము లేదు. దేవుని దూత పేతురు ద్వారా సువార్త విని, రక్షణ పొందవలెనని కొర్నేలికి సెలవియ్యగా పేతురును పిలువ నంపించెను.

**కొర్నేలి రక్షణకై పేతురు సిద్ధపాటు (9-16 వ)** : పేతురు యొప్పే పట్టణంలో మిద్దెపై ప్రార్థన చేయుచుండగా పెద్ద దుప్పటియందు చతుష్పాద జంతువులు, పురుగులు పక్షులు ఉండుట చూచెను. వాటిని చంపుకొని తినుమని ఒక్క శబ్దము వినబడగా అవి నిషిద్ధమైనవని పేతురు జవాబిచ్చెను. మరలా ఆ శబ్దము దేవుడు పవిత్ర పరచినవి నిషిద్ధమైనవిగా ఎంచవద్దని చెప్పెను. ఆ పాత్ర పైకి ఎత్తబడెను.

**పేతురు రాక కొరకై కొర్నేలి కనిపెట్టుకొని యుండుట (17-24వ)** : కొర్నేలి పంపిన సైనికులు పేతురుకు సంగతులు వివరించగా పేతురు యొప్పే నుండి బయలుదేరి, 60 మైళ్ళ దూరముగానున్న కైసరయకు వెళ్ళెను.

**కొర్నేలి పేతురుకు సంగతులు వివరించుట (25-32 వ)** : కొర్నేలి దూత తనకు ప్రత్యక్షమయి 1 నుండి 8వ చెప్పిన సంగతులను పేతురునకు వివరించెను.

**పేతురు సందేశము (33-40 వ)** : పేతురు తాను దుప్పట్లో చూచిన అపవిత్రమైన వాటిని దేవుడు పవిత్ర పరచినందున అతడు తినవలెనని చెప్పబడిన సంగతులు జ్ఞాపకము చేసుకొనెను. తద్వారా అన్యజనులనైనను యేసు తన రక్తము ద్వారా పవిత్ర పరచి రక్షించును అని గ్రహించెను. మానవుల పాప క్షమాపణకై మరణించి తిరిగి లేచిన యేసుని గూర్చి సాక్ష్యమిచ్చెను.

**కొర్నేలి ఇతరులు రక్షణ పొందుట - బాప్తిస్మము (41-48 వ)** : పై భాగములో పేతురు చెప్పిన మాటలు కొర్నేలి ఇతరులు విని విశ్వసించగా పరిశుద్ధాత్మ వారిపై కుమ్మరించబడి వారు భాషలతో మాట్లాడుట చూచిరి. (భాషలు మాట్లాడుటను గూర్చి చివరి పేజీలోనున్న ముఖ్య విషయముల వివరణ చూడండి) పేతురు యూదులు అన్యులవలె విశ్వసించుట వలన ఆత్మను పొందినట్లు వారు మాట్లాడిన భాషలను బట్టి వారికి బాప్తిస్మము ఇచ్చెను.

*గమనిక* : అన్యులకు రక్షణ లేదని నమ్మిన యూదులకు అన్యులకు సైతం రక్షణ కలదని యెరుగునట్లు 1 కొరింథీ. 14:22 ప్రకారము అవిశ్వాసులైన వారికి సూచనగా బాషలు ఇవ్వబడెను. 10:48లో నమ్మినవారు బాప్తిస్మము పొందవలెననునది దేవుని ఆజ్ఞ అయి ఉన్నది. 10:42లో నమ్మినవారు ధృఢ సాక్ష్యము ఇవ్వవలెనని మరొక దేవుని ఆజ్ఞ చెప్పబడింది. ఆ రెండింటికంటే ముందుగా అంతట అందరు మారు మనస్సు పొందవలెనని దేవుని ఆజ్ఞ. 17:30లో చెప్పబడింది. కనుక మారు మనస్సు పొందుట మొదటి ఆజ్ఞ. బాప్తిస్మము పొందుట రెండవ ఆజ్ఞ. ధృఢ సాక్ష్యమిచ్చుట మూడవ ఆజ్ఞ అపొస్తుల కార్యములో మూడు ముఖ్యమైన ఆజ్ఞలు కలవు.

## 11వ అధ్యాయము 6+6+6+6+6=30 వచనములు

## అంశము : అంతియొకయిలో అన్యుల రక్షణ బర్నబా పౌలుల ద్వారా సంఘ అభివృద్ధి

విభజన - యెరూషలేము వారికి పేతురు తనకు కలిగిన దర్శనము వివరించుట (1-6వ 7-12వ ) : పేతురు సున్నతి లేని వారితో భోజనము చేశాడని యెరూషలేము వారు వాదించగా 10వ అధ్యాయము తనకు కలిగిన దర్శనమును వివరించెను.

**అన్యులకు దేవుడు మారుమనస్సు దయచేయునని సహోదరులు గ్రహించుట (13-18వ):** పేతురు కొర్నేలి పంపిన మనుష్యులతో కైసరయకు వెళ్ళి కొర్నేలికి దేవుడు తెలిపిన మాటలు వినిన పిదప వారికి సువార్త ప్రకటించి పరిశుద్ధాత్మ వారి మీద వ్రాలుటను గూర్చి వివరించెను. అన్యజనులకు జీవార్థమైన మారు మనస్సు దేవుడు దయచేయునని సహోదరులు గ్రహించి దేవుని మహిమ పరిచిరి.

**సిరియలోని అంతియొకయలో అన్యులు రక్షించబడి ప్రభువు పక్షమున చేర్చబడుట (19-24వ) :** చెదరిపోయిన వారు యెరూషలేము నుండి నూరు మైళ్ళ దూరములోనున్న ఫేనికేకు, 200 మైళ్ళ దూరములోనున్న కుప్రకు, 300 మైళ్ళ దూరములోనున్న అంతియొకయకు వెళ్ళి సువార్త ప్రకటించగా అంతియొకయలో నమ్మిన అన్యులు అనేకులు ప్రభువు తట్టు తిరిగిరి. యెరూషలేము నుండి అంతియొకయకు పంపబడిన బర్నబా వారిని హెచ్చరించగా బహు జనులు ప్రభువు పక్షముగా చేరిరి.

**బర్నబా పౌలు కలసి ఒక్క సంవత్సరము ఉండి సంఘమును స్థిరపరచుట (25-30వ):** యెరూషలేములో కలిగిన కరువుకు సహాయము కొనిపోవుట. బర్నబా తార్సుకు వెళ్ళి పౌలును తీసుకొని వచ్చెను. వారిద్దరు అంతియొకయలో ఒక్క సంవత్సరము ఉండి సంఘమందు వాక్యమును బోధించి శిష్యులను క్రీస్తును స్వంతము చేసుకొనిరి అను అర్థము గల క్రైస్తవులు అని పిలువబడునంతగా పెంచిరి. (క్రిస్టియనో) యెరూషలేము నుండి వచ్చిన ప్రవక్తలు భూలోకమంతట గొప్ప కరువు కలుగునని సూచించగా శిష్యులతో ప్రతివాడును తన తన శక్తి కొలది యూదయలో కాపురమున్న సహోదరులకు సహాయము సమకూర్చిరి. ఆ ధనమును బర్నబా పౌలుల చేత యెరూషలేమునకు పంపెను. ప్రభువునకు తమ తమ శక్తికొలది ఇవ్వవలెనని ప్రతి శిష్యుడు నేర్చుకొనుట గమనించ తగినది. పౌలు రక్షించబడిన పిదప యెరూషలేమునకు వెళ్ళుట ఇది రెండవసారి. క్రైస్తవులు అను పదము క్రొత్త నిబంధనలో మూడు పర్యాయములు కలదు. 1) అ.కా. 11:26వ, 2) అ.కా. 26:28వ, 3) 1 పేతురు 4:16వ.

## 12వ అధ్యాయము 5+5+5+5+5 = 25 వచనములు
## అంశము : యెరూషలేములో పేతురు చెరసాలలో ఉంచబడుట
## ప్రార్థన ద్వారా పేతురుకు కలిగిన విడుదల

**విభజన - చెరసాలలో ఉంచబడిన పేతురుకై సంఘము ప్రార్థించుట (1-5వ) :** రాజైన హేరోదు - శిష్యుడైన యాకోబును చంపించి పేతురును కూడా చంపవలెనని

తలంచి చెరసాలలో 16 మంది సైనికుల కాపుదలతో ఉంచెను. సంఘము పేతురు విడుదలకై అత్యాశక్తితో ప్రార్థించెను.

**దేవుడు దూత ద్వారా పేతురును చెరసాల నుండి విడిపించుట (6-10వ) :** రాత్రివేళ దూత నిద్రించుచున్న పేతురును లేపగా సంకెళ్ళు అతని చేతినుండి ఊడిపడెను. చెరసాల నుండి బయటికి తీసుకొని వచ్చి దూత వెళ్ళిపోయెను.

**పేతురు మరియ ఇంటిలో ప్రార్థించుచున్న మరియ ఇంటికి వచ్చుట (11-15 వ) :** పేతురు వచ్చి తలుపుతట్టగా రోదె అను చిన్నది గుర్తు పట్టి సహోదరులకు తెలిపెను.

**పేతురు విడిపించబడిన వివరము సహోదరులకు వివరించి వెళ్ళిపోవుట (16-20వ):** సహోదరులు తలుపు తీయగా ప్రభువు తనను చెరసాల నుండి ఎలాగు తీసుకొని వచ్చెను అను సంగతులు వివరించి వేరొక చోటికి వెళ్ళిపోయెను. తెల్లవారగనే పేతురు కనబడ నందున హేరోదు రాజు కావలి వారిని చంపించి యూదయ నుండి కైసరయకు వెళ్ళి అక్కడ నివసించెను.

**హేరోదు మరణము - పౌలు బర్నబాలు మార్కుతో కలసి అంతియొకయకు వచ్చుట (21-25 వ) :** పేతురును చంపదలచిన హేరోదు తానే పురుగులు పట్టి చనిపోయెను. క్రీస్తుకు మరణ శిక్ష విధించిన అధిపతియగు పిలాతు తన పదవిని పోగొట్టుకొని శిక్షింపబడి చనిపోయెను. దేవుని పిల్లలను హింసించు వారికి ఇటువంటి శ్రమలు కలుగగలవు. పౌలు బర్నబాలు ఉపకార ద్రవ్యమును యెరూషలేములో సహోదరులకు అప్పగించి తిరిగి అంతియొకయకు వచ్చెను.

## ప్రభువు పిలుపు

1) మనలను పిలిచినవాడు పరిశుద్ధుడు - 1 పేతురు 1:5వ.

2. మనము **పరిశుద్ధులముగా ఉండుటకు పిలిచాడు** - రోమా 1:7వ.

3. తల్లి గర్భమందుండనే...... పిలిచాడు - గలతీ. 1:15వ.

4. చీకటి నుండి ఆశ్చర్యకరమైన తన **వెలుగులోనికి పిలిచాడు** - 1 పేతురు 2:9వ.

5. తన **కుమారుని సహవాసమునకు పిలిచాడు** - 1 కొరిం. 1:9వ.

6. **ఆశీర్వాదమునకు** వారసులమగుటకు **పిలిచాడు** - 1 పేతురు 3:9వ.

7. తన మహిమను బట్టి పిలిచాడు (2 పేతురు 1:3వ) - నిత్య మహిమకు పిలిచాడు. 1 పేతురు 5:10వ.

8. నిత్య స్వాస్థ్యము కొరకు పిలిచాడు - హెబ్రీ. 9:15వ.

9. సమాధానముగా ఉండుటకు పిలిచాడు - 1 కొరి. 7:15వ.

10. పరలోకపు పిలుపుతో పిలిచాడు - హెబ్రీ. 3:1వ.

11. పరిశుద్ధమైన పిలుపుతో పిలిచాడు - 2 తిమోతి 1:9వ.

12. ఉన్నత పిలుపుతో పిలిచాడు - ఫిలిప్పీ 3:14వ.

13. నిరీక్షణ గల పిలుపుతో పిలిచాడు - ఆ నిరీక్షణ ఎట్టిదో ఎరగాలి - ఎఫెసీ. 1:18వ.

14. పిలుపును నిశ్చయము చేసుకోవాలి. 2 పేతురు 1:10వ.

15. పిలుపుకు తగినట్లు నడుచుకొనాలి. ఎఫెసీ. 4:1వ.

16. తల్లి గర్భమందుండగా పిలిచినను ప్రభువు పౌలును పిలిచినట్లు సంఘమునకు తర్వాత చెప్పాడు. పిలుపునకు లోబడి అబ్రాహామువలె....... ఎక్కడికి వెళ్ళవలెనో ముందుగా ఎరుగక పోయినను బయలుదేరాలి. హెబ్రీ. 11:8వ. ఆలాగు బయలుదేర్రి వెళ్ళిన పౌలును ముందు అధ్యాయములలో చూతుము. అ.కా. 13:1-2వ.

## 13వ అధ్యాయము 4+8+10+10+10+10 = 52 వచనములు
## అంశము : బర్నబా పౌలులు ప్రభువు పిలిచిన పనికై ప్రత్యేక పర్చుట - కుప్ర గలతియలో సాక్ష్యమిచ్చుట

**విభజన - ప్రభువు పిలిచినపనికి పౌలు బర్నబాలు ప్రత్యేకింపబడి ప్రార్థనతో పంపబడుట (1-4వ)** : అంతియొకయలోనున్న సంఘములో అయిదు మంది బోధకులు ప్రవక్తలు సేవించుచుండగా పౌలు బర్నబా ఇద్దరిని ప్రభువు తాను పిలిచిన పనికి ప్రత్యేకించమని సెలవిచ్చెను. వారు ప్రత్యేకించబడి ప్రార్థనతో పంపబడగ సెలూకయకు కుప్రకు వచ్చిరి.

**పౌలు పరిశుద్ధాత్మతో నిండినవాడై కుప్రలో పరిచర్య చేయుట (5-12 వ)** : కుప్రలోని సలామిలో పని చేసిన పిమ్మట పాపు అను ఊరికి రాగా ఆ ద్వీపమునకు అధిపతి విశ్వసించెను. గారడీవాడైన బర్ యేసు ఎదిరించి గ్రుడ్డివాడాయెను.

**పిసిదియాలోని అంతియొకయలో సువార్త ప్రకటన - నమ్మినవారు, దూషించి వెళ్ళగొట్టిన వారు (13-52 వ)** : పిసిదియలోనున్న అంతియొకయకు వచ్చి సమాజమందిరమునకు

వచ్చి కూర్చుండెను. సమాజ మందిరపు అధికారులు బోధించవలెనని కోరగా పౌలు నిలువబడి చరిత్ర గ్రంథములో నుండి సాక్ష్యమిచ్చెను. అలాగే 23-32వ. వరకు ప్రవక్తల గ్రంథమునందలి వచనముల ద్వారా క్రీస్తు మరణ పునరుత్థానములను వివరించిరి. అటు తరువాత 33-42 వచనములలో కీర్తన గ్రంథమునందలి క్రీస్తు మరణము పునరుత్థానము ఆరోహణము క్రీస్తు ద్వారానే పాప క్షమాపణ కలుగునని క్రీస్తు ద్వారానే నీతిమంతులముగా తీర్చబడుదమని వివరించిరి. లూకా 24:44వ ప్రకారము ధర్మశాస్త్రము, ప్రవక్తల గ్రంథములో, కీర్తన గ్రంథములో క్రీస్తు విషయమైన సంగతులు వివరించినట్లు గమనించగలము. సమాజ మందిరములో అనేకులు యూదులు యూదా మత ప్రవిష్టులు వాక్యమును అంగీకరించి పౌలు బర్నబాను వెంబడించిరి. కాని మరుసటి విశ్రాంతి దినమున వీరిని దూషించి హింసించి వెళ్ళగొట్టిరి.

## 14వ అధ్యాయము 6+6+6+6+4 =28 వచనములు

## అంశము : గలతియ దేశములోని ఈకోనియ, దెర్బే లుస్త్ర పట్టణంలో సాక్ష్యము

**విభజన - ఈ కొనియలో సాక్ష్యము (1-6వ)** : యూదుల సమాజ మందిరములలో తేటగా బోధింపగా అనేకులు యూదులు గ్రీను దేశస్థులు విశ్వసించిరి. మరికొందరు యూదులు అధికారులతో కలసి రాళ్ళు రువ్వి చంపవలెనని తలంచిరి.

**లుస్త్రలో సాక్ష్యము (7-12 వ 13-18 వ)** : లుస్త్రలో పుట్టినది మొదలుకొని కుంటి వాడైన ఒక్క మనుష్యుని పౌలు స్వస్థ పరచగా ఆ పట్టణస్థులు పౌలు బర్నబాలను మనుష్య రూపము దాల్చిన దేవతలుగా భావించి వారికి హెర్మే ద్యుపతి అను పేరులు పెట్టి ఎడ్లను బలి అర్పింపవలెనని తలంచిరి. పౌలు బర్నబాలు బహు ప్రయాసపడి జన సమూహములు తమకు బలి అర్పించుట ఆపు చేసిరి.

**లుస్త్రలో రాళ్ళచే కొట్టబడి చనిపోయి తిరిగి బ్రతికిన పౌలు - లుస్త్ర దెర్బే ఈకొనియ అంతియొకయలో ఏర్పడిన సంఘము (19-24 వ)** : అంతియొకయ ఈకొనియ నుండి యూదులు వచ్చి జన సమూహముతో కలసి పౌలుపై రాళ్ళు రువ్వి చనిపోయెనని తలంచి

2 తిమోతి 3:10 ప్రకారము తిమోతి ఈ సమయంలో రక్షించబడినట్లు చూడగలము. పౌలు లేచి లుస్త్రలోను దెర్బేలోను ఈకొనియ అంతియొకలో సువార్త ప్రకటించి

అనేకులను శిష్యులుగా చేసి వారిని స్థిరపరచి, ప్రతి సంఘములో పెద్దలను ఏర్పరచి ముందుకు వెళ్ళిపోయెను.

**మొదట సేవా యాత్ర ముగింపు (15-28 వ)** : పెర్గేలో వాక్యము బోధించి అత్తాలియకు వెళ్ళి ఓడ ఎక్కి మొదట బయలుదరిన అంతియొకయకు వచ్చి సంఘమును సమకూర్చి అన్యజనులు విశ్వసించులాగున దేవుడు చేసిన కార్యములు వివరించిరి.

## 15వ అధ్యాయము 5+6+10+10+10 = 41 వచనములు
## అంశము : యెరూషలేములో జరిగిన సున్నతి సభ

**విభజన - రక్షణకు సున్నతిని గూర్చిన వివాదము (1-5వ)** : యూదయ నుండి వచ్చిన కొందరు సున్నతి పొందితేనే గాని రక్షణ పొందరని భోదించిరి. పౌలును బర్నబాకు వారితో తర్కము కలిగినపుడు ఈ విషయమై వివరణ కొరకు సంఘము ద్వారా యెరూషలేమునకు పంపబడిరి. పౌలు యెరూషలేమునకు రక్షణ పొందిన పిదప వెళ్ళుట ఇది మూడవసారి.

**పేతురు యాకోబు ఇతర పెద్దలు రక్షణకు సున్నతి అవసరం లేదని స్థిరపరచుట (6-31 వ)** : 6-11వ పేతురు కైసరయలో దేవుడు అన్యులను సున్నతి లేకయే రక్షించుటను గూర్చి చెప్పెను 12-21 వచనములలో పౌలు బర్నబాలు దేవుడు అన్యజనులను రక్షించ బడిన సంగతిని వివరింపగా పెద్దయైన యాకోబు అన్యజనులకు సున్నతి అక్కరలేదని పేతురు తీర్మానమును యాకోబు స్థిరపరచెను. 22-31వ సహోదరులు ఈ విషయములను ఉత్తరముగా వ్రాసి యూదా సీల ద్వారా అంతియొకయకు పంపిరి. అంతియొకయ వారు ఈ పత్రికను చదువుకొని ఆదరణ పొందిరి. ఇదే సమయములో గలతియలోని సంఘములలో రక్షణకు సున్నతి అన్యులకు అవసరమని తప్పు బోధ ప్రవేశించెను. దీని సరిదిద్దుటకై క్రీ.శ. 49 తరువాత పౌలు గలతీయులకు పత్రిక వ్రాసెను.

**పౌలు బర్నబాలు మార్కును గూర్చి వాదము కలిగి వేరైపోవుట (32-41)** : యూదా సీలలు యెరూషలేమునకు వెళ్ళి పోగా పౌలు బర్నబాలు మొదట యాత్రలో ఏర్పడిన సంఘములను దర్శించుటకై ఇష్టపడిరి. మొదటి యాత్రలో మధ్యలోనే ఆగిపోయిన మార్కు బర్నబాకుమేనల్లుడు (కొలస్స 4:10) ఈ మార్కును వెంటబెట్టుకొని పోవుటకు బర్నబా ఇష్టపడెను కాని పౌలు అంగీకరించలేదు. తీవ్రమైన వాదము కలిగి బర్నబా మార్కును వెంటబెట్టుకొని కుప్రకు వెళ్ళెను. పౌలు సీలను ఏర్పరచుకొని సిరియ కిలికియ దేశముల ద్వారా ప్రయాణము చేసిరి. మొదట యాత్రలో తాము పని చేసిన గలతీయ ప్రాంతములోని దెర్బే లుస్త్ర పట్టణములకు వచ్చారు.

గమనిక : బర్నబా కుప్ర పనిని ఎంతో ప్రేమించాడు. కాని బర్నబాను చివరలో కుప్ర వారు హత్య చేసిరి. మార్కు శరీరమును తెచ్చిసలామిలో పాతి పెట్టాడు.

## 16వ అధ్యాయము 5+5+5+4+5+5+5+6 =40 వచనములు
## అంశము : శ్రమలు చెరసాలల మధ్య ఫిలిప్పీయులో సువార్త ప్రకటన - ఏర్పడిన సంఘ సాక్ష్యము

విభజన - **తిమోతితో** కలసి సంఘములను స్థిరపరచుట విస్తరింప చేయుట **(1-5వ)**: పౌలు లుస్త్రకు దెర్బేకు రాగా మొదట యాత్రలో అ.కా. 14:20లో రక్షించబడిన తిమోతి ఈ ప్రాంతములోని సహోదరుల వలన మంచి పేరు పొందిన శిష్యుడుగా ఉండెను. పౌలు తిమోతిని తనతో కూడ రమ్మని కోరి సీలతో కలసి ఆయా పట్టణములలో నున్న సంఘములను స్థిరపరచిరి.

**మాసిదోనియలో సువార్త ప్రకటనకై దేవుని పిలుపు (6-10 వ)** : ఆసియాలో కాని బితూనియాలో కాని దేవుడు ఆత్మ సువార్త ప్రకటింపనియ్య లేదు. పౌలు లూకా ఉండు త్రోయకు వచ్చినపుడు రాత్రివేళ మాసిదోనియ దేశస్థుడు సహాయము చేయమని పౌలును కోరినట్లు పౌలునకు దర్శనము కలిగెను. ఆ దర్శనము ప్రకారము పైనున్న ముగ్గురితో లూకా కలసి మాసిదోనియాకు కలసి బయలుదేరిరి.

**ఫిలిప్పులో లూదియా ఆమె ఇంటివారు రక్షించబడుట (11-15 వ)** : త్రోయ నుండి 150 మైళ్ళ దూరములోనున్న ఫిలిప్పికి అయిదు దినముల సముద్ర ప్రయాణము ద్వారా వచ్చిరి. **మాసిదోనియా** దేశములోని నాలుగు ముఖ్య పట్టణములలో ఆ ప్రాంతమునకు ఫిలిప్పి ముఖ్య పట్టణం విశ్రాంతి దినమున గవిని దాటి నదీ తీరమున ప్రార్థనా కూడిక జరిగించగా స్త్రీలు కూడి వచ్చిరి. నిరుత్సాహ పడక మాట్లాడుచుండగా లూదియ అను స్త్రీ విని విశ్వసించి తన ఇంటి వారితో కలసి బాప్తీస్మము పొందెను. సహోదరులను తన ఇంటిలో చేర్చుకొనెను.

పుత్రోను దయ్యము పట్టి సోదె చెప్పు చిన్నదానిని స్వస్థ పరచుట - గ్రామాధికారుల యొద్ద నిలిచిన **పౌలు సీలలు (16-19 వ)** : దయ్యము పట్టిన బిడ్డ సోదె చెప్పుట ద్వారా లాభము వచ్చుచుండెను. పౌలు ఆ దయ్యము వెళ్ళిపోవునట్లు చేసెను. లాభ సాధనము పోయెనని యజమానులు పౌలు సీలలను గ్రామాధికారుల యొద్దకు ఈడ్చుకొని పోయిరి.

**కొట్టబడి చెరలో నుంచబడుట (20-24వ - 25-29వ)** : చెరసాలలో సువార్త ప్రకటన. న్యాయాధిపతులు పౌలు సీలలను కొట్టించి కాళ్ళకు బొండ వేసి చెరసాలలో వేయించిరి.

పౌలు సీలలు దుఃఖించక రాత్రివేళ ప్రార్థించి రక్షణ సువార్త ప్రకటించిరి. గొప్ప భూకంపము కలిగి చెరసాల తలుపులు తీయబడినను ఖైదీలు పారిపోలేదు. ఖైదీలు రక్షణ పొందిరని తలంచగలము. నిద్రించిన చెరసాల అధిపతి లేచి జరిగినది చూచి వణుకుచు పౌలు సీలల యొద్దకు వచ్చెను.

**చెరసాల నాయకుడు ఇంటి వారు రక్షించబడి బాప్తీస్మము పొందుట (30-34వ) :** చెరసాల నాయకునికి సహోదరులు రక్షణ సువార్త ప్రకటించగా తాను రక్షించబడెను. తన ఇంటివారు కూడా రక్షించబడి అందరును బాప్తీస్మము పొందిరి.

**ఫిలిప్పీయుని విడిచి వెళ్ళమని న్యాయాధిపతులు పౌలును వేడుకొనుట (35-40వ) :** ఉదయమున పౌలు రోమా పౌరసత్వము కలవాడని న్యాయాధిపతులు తెలుసుకొని భయపడి పట్టణము విడిచి వెళ్ళమని వేడుకొనిరి. వారు చెరసాల నుండి బయటకు వచ్చి లూదియ ఇంటికి వచ్చి సహోదరులను ఆదరించి థెస్సలొనికయకు వెళ్ళి పోయిరి. ఈ అధ్యాయములోని పదజాలమును బట్టి అనగా 40వ వచనములోనున్న "పోయిరి" అను పదమును బట్టి లూకా వెళ్ళి పోలేదని అక్కడే నిలిచి ఉండెనని గుర్తించగలము. 20:6వ. వరకు అనగా మూడవ యాత్ర ఇంచుమించు చివరి వరకు 7 సం॥కాలము అక్కడనే ఉండి సంఘమును స్థిరపరచెను కాని లూకా తన చివరి దినములలో మాసిదోనియా ప్రాంతములో సేవ చేసి తన 84 ఏట మరణించి అక్కడనే సమాధి చేయబడెను.

## 17వ అధ్యాయము 9+6+6+6+7 =34 వచనములు
## అంశము : మాసిదోనియా గ్రీసు దేశములలో ఏర్పడిన సంఘ సాక్ష్యము

విభజన - శ్రమల మధ్య థెస్సలొనీకయలో ఏర్పడిన సంఘ సాక్ష్యము (1-9వ) : ఫిలిప్పీ పట్టణం నుండి 100 మైళ్ళ దూరములోనున్న థెస్సలొనికయకు పౌలు, సీలలు వచ్చిరి. యాసోను ఇంటిలో నుండి మూడు విశ్రాంతి దినములలో సమాజ మందిరములో బోధించెను. కొందరు యూదులు చాలామంది అన్యులు ఘనత గల స్త్రీలలో అనేకులు యేసును రక్షకుడిగా ఒప్పుకొని వారితో కలుసుకొనిరి. మత్సరము కల యూదులు యాసోనును అధికారుల యొద్దకు ఈడ్చుకొని పోయి చాడీలు చెప్పినందున అధికారులు కలవరపడిరి. యాసోను నొద్ద జామీనా వేసుకొని విడిచిపెట్టిరి. థెస్సలొనికయ సేవలో గమనించదగిన మూడు ప్రాముఖ్యమైన విషయములు.

1. సమాజ మందిరములో యేసుక్రీస్తును రక్షకుడుగా వివరించుట పౌలు వాడగా.

2. ఈ సంగతులు నమ్మిన వారిని రోమా 9:10 ప్రకారము నోటితో ఒప్పింప చేయుట.

3. భూలోకమును తలక్రిందులు చేసిన వారని పేరు పొందుట.

**కలవరముల మధ్య బెరయలో ఏర్పడిన సంఘ సాక్ష్యము (10-15వ)** : థెస్సలొనికయలో తొందరను బట్టి పౌలు సీల తిమోతిలను సహోదరులు యాభైమైళ్ళ దూరంలోనున్న బెరయకు పంపిరి. పౌలు సమాజ మందిరములో బోధింపగా యూదులలో అనేకులు ఘనత గల అన్యులలో స్త్రీ పురుషులు చాలామంది విశ్వసించిరి. బెరయలో కూడా కలవరము కలిగినందున పౌలును సహోదరులు ఏథెన్సుకు పంపిరి. పౌలు సీల బెరయ లోనే నిలిచిపోయిరి. బెరయ విశ్వాసుల ప్రత్యేకత ఏమనగా పౌలు సీల చెప్పిన సంగతులు ఆలాగున ఉన్నవో లేవో అని ప్రతి దినమున లేఖనములును పరిశోధించే వారు.

**గ్రీసు దేశములోని ఏథెన్సులో ఎర్పడిన సంఘ సాక్ష్యము (16-34వ)** : 16-21వ.లలో పౌలు బెరయ నుండి 250 మైళ్ళ దూరము గల ఉత్తర గ్రీసు దేశమునకు ముఖ్య పట్టణమైన ఏథెన్సుకు వచ్చెను. గ్రీసు దేశస్తులు జ్ఞానమును వెతుకుట ద్వారా దేవుని తెలుసుకొందుమని అనుకొందురు. ఆ ఏథెన్సు పట్టణము విగ్రహములతో నిండినందున పౌలు ఆత్మలో పరితాపము చెంది సమాజ మందిరములోను, సంత వీధులలోను జనులతో తర్కించుచుండెను. ఏథెన్సు వారు క్రొత్త సంగతులను చెప్పుకొనుట వినుట యందు మాత్రమే ఆసక్తి కలవారు ఏథెన్సు పట్టణములో మార్స్ (Mars) అను దేవత పర్వతము పై జరుగు సభను అరేయొపగు సభ పార్లమెంటు అందురు. ఈ సభకు ఏథెన్సు రాజధాని లోని సభ్యులు వత్తురు. పౌలును ఈ సభలోనికి తీసుకొని పోయిరి. 22-27వ.లలో అరేయొపగు సభలో నిలిచి నిజ దేవునిని గూర్చిన వివరములు పౌలు తెలిపెను. 28-34వ. లలో అందరు మారుమనస్సు పొందవలెనని దేవుడు ఆజ్ఞాపించు చున్నాడని మృతులలో నుండి లేచిన యేసును నమ్ముటకు ఆధారములను తెలియ జేసెను. కొందరు మనుష్యులు విశ్వసించి పౌలును హత్తుకొనిరి. అరేయొపగు సభ సభ్యుడైన (పార్లమెంటు సభ్యుడు) దియొన్నూసియు కాడిమోయు పెయ్య అను అర్థము గల దమరియను అను ఒక స్త్రీ వారిలో ఉండెను. ఏథెను అను పేరునకు అనిశ్చయత్వము అని అర్థము. ఏథెన్సులో గొప్పవారిని పౌలు సంపాదించుట మనకు మాదిరి.

## 18వ అధ్యాయము 4+7+7+5+5 = 28 వచనములు
## అంశము : కొరింథులో ఏర్పడిన సంఘ సాక్ష్యము

**విభజన - పౌలు అకుల ప్రిస్కిల్లతో కలసి పని చేయుట (1-4వ)** : పౌలు ఏథెన్సు నుండి యాభై మైళ్ళ దూరమున ఉన్న దక్షిణ గ్రీసు దేశమునకు ముఖ్య పట్టణమైన కొరింథునకు వచ్చి అకుల, ప్రిస్కిల్ల అను భార్య భర్తలను కలుసుకొనెను. వారు పౌలువలె డేరాలు కుట్టు వృత్తిగలవారు. యూదుల యొక్క ప్రత్యేకత ఏమనగా పాఠశాలలో ఏదో ఒక్క వృత్తి విద్యను చదువులతో పాటు పిల్లలకు నేర్పించే వారు పౌలు తన వాడుక చొప్పున సమాజ మందిరములోను బయట అన్యులకును యూదులకు సువార్త ప్రకటించి ఒప్పించెను.

**కొరింథులో విశ్వసించిన వారికి వివరములు (5-18వ)** : 17:15-16వ.లలో సీల తిమోతియులు థెస్సలోనికయకు వెళ్ళినట్లు 1 థెస్స. 3:1వ.లను బట్టి గ్రహించగలము. సీల తిమోతి ఇప్పుడు కొరింథునకు వచ్చి థెస్సలోనికయలను గూర్చి పౌలునకు తెలిపి నందున కొరింథు పట్టణం నుండి థెస్సలోనికయలకు మొదట పత్రిక క్రీ.శ. 52లో ప్రభువు రాకడను గురించి వ్రాసెను. దీని విషయమై కలిగిన గలిబిలిని సవరించుటకు వెంటనే అనగా క్రీ.శ. 53లో మాసిదోనియా నుండి థెస్సలోనికయకు రెండవ పత్రికను వ్రాసెను. 5-11వ కొరింథులో యూదులకు ధృడముగా పౌలు సాక్ష్యము ఇచ్చినందున యూదులు ఎదురాడి దూషించిరి. ప్రభువు ఈ పట్టణంలో బహుజనమున్నారని దర్శన మందు పౌలునకు తెలుపగా పౌలు 18 నెలలు ఆ పట్టణమందుండి వాక్యమును బోధించెను కొరింథీలలో అనేకులు సమాజ మందిరపు అధికారియైన క్రిస్పు అతని ఇంటి వారు విశ్వాసముంచి బాప్తీస్మము పొందిరి. 12-18వ.లలో పౌలును న్యాయపీఠము ముందు నిలువబెట్టగా అకయ అధిపతియగు గల్లియోను వివరములు తెలుసుకొని పౌలు ఏ అన్యాయము చేయలేదని తెలుసుకొని అందరిని న్యాయపీఠము నుండి పంపివేసెను. పౌలు అక్కడ నుండి బయలుదేరి 8 మైళ్ళ దూరమునున్న కెంక్రేయకు వచ్చి యూదుల ఆచార ప్రకారము తన తల వెంట్రుకలు కత్తిరించుకొని అకుల ప్రిస్కిల్లతో కలసి సిరియాకు బయలుదేరును. కొరింథులో 18 నెలల సేవా వివరములు అపొస్తలుల కార్యములు 18వ అధ్యాయములోని 1-18వ.లలో ఉండుట గమనించదగినది.

**ఎఫెసీ. యెరూషలేము గుండావెళ్ళి అంతియొకయచేరి రెండవసేవాయాత్ర ముగించుట (19-23వ)** : కెంక్రేయ నుండి 250 మైళ్ళ దూరముననున్న ఎఫెస్సునకు వచ్చి సమాజ

మందిరములోని యూదులతో తర్కించి అకుల ప్రిస్కిల్లను అక్కడ విడిచిపెట్టి **పౌలు** యెరూషలేమునకు అంతియొకయకు 650 మైళ్ళ ప్రయాణము ద్వారా వెళ్ళెను. రక్షించ బడిన తరువాత పౌలు యెరూషలేమునకు వెళ్ళుట ఇది నాలుగవసారి. కొంతకాలమైన తరువాత గలతీయ ప్రుగియ ప్రాంతములలో శిష్యులను స్థిరపరచెను.

**అకుల ప్రిస్కిల్లల ప్రోత్సాహము ద్వారా అపొల్లో కొరింథునకు వచ్చి సహాయము చేయుట (24-28వ)** : అకుల ప్రిస్కిల్లలు యెరూషలేములో ఉండగా అపొల్లో అను విద్వాంసుడు యెహోవాను బాప్తిస్మము తెలుసుకొను వాడైనను ఎఫెసునకు వచ్చి యేసును గూర్చి ధైర్యముగా మాట్లాడుచుండెను. ప్రిస్కిల్ల అకులలు అతనిని చేర్చుకొని దేవుని మార్గము విశదపరిచిరి. సహోదరుల ప్రోత్సాహంతో అపొల్లో కొరింథికు వెళ్ళి విశ్వసించిన వారికి చాలా సహాయము చేసెను. అపొల్లో వంటి వ్యక్తులను చేర్చుకొని సంగతులను విశద పరచి ప్రోత్సహించు అకుల ప్రిస్కిల్లలు వంటివారు ఈ దినములలో ఎంతో అవసరత ఉన్నది.

## 19వ అధ్యాయము 7+7+6+7+7+7 =41 వచనములు
## అంశము : ఎఫెసులో ఏర్పడిన సంఘ సాక్ష్యము

**విభజన - ఎఫెసులో సేవా - ఏర్పడిన సంఘ సాక్ష్యము (1-20వ)** : పౌలు ఎఫెస్సులో మూడు సంవత్సరములు అనగా క్రీ.శ. 54-56 వరకు సేవ చేసిరని అ.కా. 20:23 నుండి తెలుసుకొనగలము. ఎఫెసులో బాప్తిస్మము ఇచ్చు యోహాను కాలములో యోహాను బాప్తిస్మము పొందిన పన్నెండుగురు పురుషులు కలరు బాప్తిస్మము ఇచ్చు యోహాను కాలము నాటికి పరిశుద్ధాత్మ భూమి పైకి రానందున వారు పరిశుద్ధాత్ముడు ఉన్నాడన్న సంగతి తెలియని వారు. తన వెనుక వచ్చు యేసునందు విశ్వాసము ఉంచవలెనని బాప్తిస్మము ఇచ్చు యోహాను బోధను ఎరిగి బాప్తిస్మము పొందిరి. వీరు పౌలు ద్వారా యేసునందు విశ్వాసముంచుటను విని విశ్వాసముంచి బాప్తిస్మము పొందిరి. వీరికి పరిశుద్ధాత్మ అనుగ్రహించబడెననుటకు సూచనగా 1 కొరింథీ. 14:22 ప్రకారము భాషలు అనుగ్రహించబడెను. పెంతెకొస్తు దినమున భాషలు అ.కా. 2:1-4లో అనుగ్రహించబడిన తరువాత 1) 9:6-12వ. సగము అన్యులు, సగము యూదులకు సమరయులకు రక్షణ కలదని యూదులు నమ్మినట్లు, 2) 10:43-48వ. అన్యుడైన కొర్నేలికి రక్షన కలదని యూదులు నమ్మినట్లు, 3) బాప్తిస్మము ఇచ్చు యోహాను ద్వారా బాప్తిస్మము పొందిన

వారు ఎఫెసులో రక్షించబడినట్లు గురుతుగా 20:1-10వ.లో భాషలు ఈ మూడు సందర్భములలోనే 1 కొరి. 14:22 ప్రకారము సూచనగా ఇవ్వబడినవని గుర్తించవలెను. కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక ఎఫెసు నుండి క్రీ.శ. 56లో వ్రాయబడెను అని 1 కొరింథీ. 16:9 వలన తెలుసుకొనుచున్నాము. 1 కొరింథీ. 13:8లో భాషలైనను నిలిచిపోవునని వ్రాయబడియున్నవి. క్రీ.శ. 56 తరువాత వ్రాయబడిన మరి ఏ గ్రంథమందైనను భాషల ప్రస్తావన లేనందున నాటి నుండి భాషల వరము నిలలిచి పోయెనని గ్రహించగలము. ఎఫెసు పట్టణంలో పౌలు శరీరమునకు తగిలిన చేతి గుడ్డలను రోగుల యొద్దకు తెచ్చినపుడు రోగములు వారిని విడిచెను. కాని 2 కొరింథీ. 10:10 ప్రకారము పౌలు శరీర రోగమునకు బలహీనుడై ప్రభువుకు ప్రార్థించినను తన బలహీనత యందు నా శక్తి పరిపూర్ణమగుచున్నది. ప్రభువు సెలవిచ్చాడే కాని బలహీనతలు తీసివేయలేదు కావున 2 కొరింథీ. 12:9. స్వస్థతల వరము శాశ్వతమైనది కాదని గుర్తించ వలెను. 2 తిమోతి 4:20లో త్రోఫిము రోగి అయినందున మిలేతులో విడిచి వచ్చితిని అనుటలో త్రోఫిమునకు స్వస్థత కలుగలేదని గ్రహించగలము. గనుక స్వస్థత వరము శాశ్వతమైనది కాదని గుర్తించగలము.

ఎఫెసులో ముందుగా మూడు నెలల, తరువాత తురను ఒకని అను పాఠశాలలో రెండు సంవత్సరములు అ.కా. 20:31 ప్రకారము ఎఫెసులో మూడేండ్లు సేవ చేసెను. ఈ దినములలో చిన్నాసియా 200 గ్రామముల వారు దేవుని వాక్యమును వినునట్లు చూడగలము. అనేకులు విశ్వసించిరి. మాంత్రిక విద్యను అభ్యసించినవారు 50 వేల వెండి రూకల వెల గల పుస్తకములు కాల్చి వేసిరి. ఇది నేటి దినములలో కోటి రూపాయిల వెల కావచ్చు. ప్రభువు వాక్యము ఎంత ప్రబలముగ వ్యాపించెనో దీనిని బట్టి గమనించ గలము.

**ఎఫెసులో క్రీస్తు మార్గమును గూర్చిన అల్లరి (21-41 వ)** : ఎఫెసు తరువాత మాసి దోనియాకు, అకయకు, యెరూషలేముకు తరువాత రోముకు వెళ్లినట్లు పౌలు జీవిత చరిత్రలో చూడగలము కాని ఎఫెసులో ఉండగనే ఆత్మద్వారా ఈ ప్రయాణము అంతటిని మనస్సులో ఉద్దేశించినట్లు (21వ) గమనించగలము. 23వ వచనము తరువాత ఎఫెసు పట్టణములో ఉన్న అర్తెమిదేవి గుడి భూలోక మందంతటను ప్రసిద్ధి చెందినది అని వ్రాయ బడినది. ప్రాచీన ప్రపంచపు ఏడు వింతలలో TEMPLE OF DIANA కూడా ఒకటి. ఎఫెసు పట్టణంలోని ప్రజలు అర్తెమిదేవి వెండి గుళ్ళను అమ్ముట ద్వారా జీవనం చేయువారు. పౌలు ప్రకటన వలన ఎఫెసు పట్టణంలోని ఆసియా దేశమందంత టను

బహుజనులు క్రీస్తును ఒప్పుకొనినందున అర్తిమిదేవి గొప్పతనము తొలగిపోయి వెండిగుళ్ళ వ్యాపారము దెబ్బతిందని గ్రహించిరి. ఎఫెసీయులు తమ జీవనము దెబ్బతిందని తలంచి పట్టణంలో గొప్ప గలిబిలి చేసిరి. ఆసియా దేశాధికారులు పౌలునకు స్నేహితులైనందున ఆ గలిబిలి నుండి తప్పించిరి. పట్టణ కరణము పౌలు ఇతర సహోదరులు ఏ దోషము లేని వారని ప్రకటించి సభను ముగించెను. 34వ.లో ఎఫెసీయుల అర్తిమిదేవి మహాదేవి అని జనులు రెండు గంటల సేపు ఏక కంఠముతో కేకలు వేయుట సువార్త ప్రకటించు మనకు హెచ్చరికగా ఉన్నది. నిజదేవుని ఆరాధికులమైన మనము కొన్ని గంటలైన సువార్త ప్రకటించాలని నేర్చుకొనుచున్నాము.

## 20వ అధ్యాయము 6+6+4+2+3+3+3+4+4+3=38 వచనములు

## అంశము : మాసిదోనియ గ్రీసులలో సాక్ష్యము - ఎఫెస్సు సంఘ పెద్దలకు సేవను గూర్చిన వివరము తెలుపుట

**మాసిదోనియ గ్రీసు త్రోయలో సేవ (1-12వ)** : ఎఫెసు నుండి మాసిదోనియాకు గ్రీసుకు వెళ్ళి యూదులు తన విషయమై కుట్ర చేయుచున్నందున మాసిదోనియా మీదగా త్రోయకు వచ్చెను. 6వ.లో మేము ఫిలిప్పును విడిచి అని ఉన్నందున ఇంతవరకు గత ఏడేండ్లగ ఫిలిప్పిలోనున్న లూకా వీరితో కలసి త్రోయకు వచ్చినట్టు చూడగలము. 7-12వ.లలో ఆదివారము రొట్టె విరిచితిమి అన్నందున ఆదివారము సంఘము రొట్టె విరువవలెనని నేర్చుకొనుచున్నాము. నెలకు ఒక్క ఆదివారమని కాని సంవత్సరమునకు ఒక్క ఆదివారము అని కానిలేనందున అ.కా. 2:42లో రొట్టె విరుచుట యందు యెడతెగక యుండిరని ఉన్నందున యెడతెగక ప్రతి సంవత్సరములోను ప్రతి నెలలోను వచ్చు ఆదివారములలో రొట్టె విరువవలెనని నేర్చుకొనుచున్నాము. ఐతుకు అనే యౌవనుడు క్రిందపడి చనిపోగా పౌలు బ్రతికించెను. ఈ రీతిగా చనిపోయిన వారు బ్రదుకుట అ.కా.లలో మూడు పర్యాయములు జరిగెనని 9వ అధ్యాయము చివరిలో తలంచితిమి. త్రోయ నుండి మిలేతుకు వచ్చెను.

**ఎఫెసు పెద్దలకు సేవను గూర్చిన ఆరు వివరములను తెలిపెను (17-38వ)** : 17-18వ.లలో మొట్టమొదటిదిగా నడక ప్రాముఖ్యమైనదని తెలిపెను. రెండవదిగా 19-21వ.లలో సేవా విధానము తెలిపెను. దీనికి అనుబంధముగా 17:17; 5:42; 17:4, 3-4వ. గమనించవలెను. మూడవదిగా 22-24వ.లలో సేవా ఉద్దేశము. నాలుగవదిగా

25-27వ.లలో సేవలోని వర్తమానమును గూర్చి ఐదవదిగా 28-30వ.లలో సేవలోని మెలకువలను తెలిపెను. చివరిదిగా అనగా ఆరవదిగా 31-32వ సేవలోని తన మాదిరిని తెలుపుతూ 36-38వ.లలో ప్రార్థించి సాగివెళ్ళెను.

సువార్త సేవా విధానము :

1. **అ.కా. 5:42వ వచనము** : ప్రతి దినము దేవాళయము ఇంటింట మానక బోధించిరి.
2. **అ.కా. 17:17వ వచనము** : ప్రతి దినము సమాజ మందిరము, సంత వీధిలో బోధించిరి.
3. **అ.కా. 20:20వ వచనము** : బహిరంగముగాను, ఇంటింట బోధించిరి.
4. **అ.కా. 20:31వ వచనము** : రాత్రింబగళ్ళు కన్నీటిలో ప్రతి మనిషి మానక బుద్ధి చెప్పిరి.
5. **మార్కు 1:38వ వచనము** : ఇతర సమీప గ్రామములోను ప్రకటించుటకు వెళ్ళి ఇందు నిమిత్తమే ప్రభువు ఈ లోకానికి వచ్చాడు.
7. **లూకా 4:43వ వచనము** : ఇతర పట్టణములలోను ప్రకటించుటకు వెళ్ళాలి. ఇందు నిమిత్తమే ప్రభువు పంపబడ్డాడు.

**అ.కా. 17:34వ వచనము** : వాడుక చొప్పున సమాజ మందిరములో జనులను ఒప్పించుచుండిరి. పై భాగములన్ని కలిపిన 1) ప్రతి దినము, మానక, ప్రతి మనిషికి, ఇంటింట బహిరంగముగా, సంతవీధిలో, సమాజ మందిరములో, దేవాళయములో ప్రతి గ్రామము, పట్టణములలో బోధించిరి. ఇది మనకెంత మాదిరి.

## 21వ అధ్యాయము 6+10+10+10+4 = 40 వచనములు
## అంశము : యెరూషలేమునకు యాత్ర - బంధింపబడుట

**విభజన - తూరు - కైసరయకు వెళ్ళుట (1-16వ)** : తూరుగుండా కైసరయలోని సువార్తికుడైన ఫిలిప్పు ఇంటికి వచ్చెను. ఫిలిప్పు ఇంటిలో ప్రవచించు నలుగురు కన్యకలైన కుమార్తెలు ఉండిరి. వీరికి స్వంత కుటుంబములు లేవు. 1 కొరింథీ. 14:30. ప్రకారము స్త్రీలు సంఘములలో మౌనంగా ఉండవలెను కనుక సంఘకూడిక కానటువంటి సామాజిక కూడికలయందు. ప్రత్యేకము స్త్రీల కూడికలలో. ప్రవచించెను, ప్రత్యేకముగా యౌవనస్థుల, కూడికలలో, ప్రవచించెను. ప్రత్యేకముగా చిన్న పిల్లల కూడికలలో ప్రవచించవచ్చును.

**యెరూషలేము చేరి దేవాలయములో మ్రొక్కుబడి చెల్లించుట (17-36వ)** : రక్షించబడిన పిదప యెరూషలేమునకు ఐదవసారి చేరి అక్కడ ఉన్న యూదులు పౌలును శ్రమ పెట్టవలెనని తలంచినందున పౌలు యెరూషలేము దేవాలయమునకు వెళ్ళి, మ్రొక్కుబడి యున్న మనుష్యులతో కూడి శుద్ధి చేసుకొనెను. పౌలు యూదుడు కనుక వారి ఆచారములను జరిగించెను.

**యూదులు పౌలును చంపజూచుట - పై అధికారి బంధించుట - జనులతో మాట్లాడుటకు పౌలు సెలవు పొందుట (27-40వ)** : పౌలును చంపవలెనని పై అధికారికి తెలియగా పై అధికారి శతాధిపతితో వచ్చి పౌలును బంధించెను - జనులతో మాట్లాడ వలెనని పౌలు కోరగా పై అధికారి పౌలుకు సెలవిచ్చెను.

## 22వ అధ్యాయము 21+9=30 వచనములు
## అంశము : పౌలు యెరూషలేములో శతాధిపతులకు సహస్రాధిపతికి, జనులకు సాక్ష్యమిచ్చుట

**విభజన - పౌలు తన రక్షణ అనుభవము నుండి సాక్ష్యమిచ్చుట (1-21వ)** : పౌలు హెబ్రీ భాషలో తాను యూదుడనని గమలియేలు పాదముల యొద్ద ధర్మశాస్త్రమునందు శిక్షితుడనని తెలిపెను. దమస్కు మార్గమందు యేసుని చూచి, విశ్వాసముంచి రక్షించబడి బాప్తీస్మము పొందుట వివరించెను. ముందుగా స్తెఫను చావునకు సమ్మతించినవాడు ఇప్పుడు క్రీస్తుకు సాక్షిగా ఉన్నాని తెలిపెను.

**సౌలును చంపవలెననని కోరిన ప్రజలు - పౌలు రోమీయుడని శిక్షించక విడిచిపెట్టిన సహస్రాదిపతి (22-30వ)** : జన సమూహము పౌలును చంపివేయుమని కేకలు వేయగా సహస్రాధిపతి పౌలును కొరడాలతో కొట్టి విమర్శింప ఆజ్ఞాపించెను. పౌలు పుట్టుకతోనే రోమీయుడని సహస్రాధిపతి శిక్షింపక విడిచిపెట్టెను.

## 23వ అధ్యాయము 10+10+10+5=35 వచనములు
## అంశము : మహాసభ ఎదుట నిలిచిన పౌలు, కైసరయలోని కావలికి వెళ్ళిన పౌలు

**విభజన - మహాసభ ఎదుట పౌలు - కలహముల మధ్య కోటలోనికి కొనిపోబడుట (1-10వ)** : ఇరువది నలుగురు వివిధ విభాగముల యాజకులు, ఇరువది నలుగురు

ప్రజల పెద్దలు, ఇరువది నలుగురు శాస్త్రులు మొత్తము 70-72 మంది కలసి కూడిన మహాసభను సన్‌హెడ్రిన్ సభ అందురు. ప్రధాన యాజకుడు అధ్యక్షుడుగా నుండి మత పరమైన సమస్యలను తీర్చు ఉన్నత న్యాయస్థానము. సహస్రాధిపతి పౌలును ఈ సభ యెదుట నుంచెను. పౌలు పరిసయ్యుడు కనుక పరిసయ్యుల పక్షమునున్న శాస్త్రులు పౌలుయందు ఏ దోషము మాకు కనబడలేదు అనిరి. మొదటి వచనంలో పౌలు తాను మంచి మనస్సాక్షి కలవాడనని చెప్పుకొనుటలో మనకు ఎంతో మాదిరికలదు. సభలో కలహము ఎక్కువైనందున సహస్రాధిపతి పౌలును కోటలోనికి తీసుకొని పోయెను.

**యూదులు పౌలును చంపుటకై సిద్ధపడినందున సహస్రాధిపతి పౌలును కైసరయకు పంపుట (11-30వ)** : యూదులలో నలభైమంది కంటే ఎక్కువమంది పౌలును చంప వలెనని యోచించి మహాసభకు రేపు తీసుకొని రావలెనని అడుగుచుండిరి. అది తెలిసిన పౌలు మేనల్లుడు సహస్రాధిపతికి ఈ విషయము తెలుపగా నాలుగువందల డెబ్బైమంది సైనికులను పౌలును కాపాడుటకు నియమించి కైసరయలోని అధిపతియైన ఫేలిక్సు యొద్దకు పంపెను.

**పౌలు కైసరయలోని కావలిలో ఉంచబడుట (21-35వ)** : నేరము మోపువారు వచ్చు వరకు కైసరయలోని కావలిలో ఉంచవలెనని ఫేలిక్సు అజ్ఞాపించెను.

## 24వ అధ్యాయము 9+12+6=27 వచనములు
## అంశము : పౌలు అధిపతియైన ఫేలిక్సుకు అతని భార్యయైన ద్రుసిల్లకు సాక్ష్యమిచ్చుట

**యూదులు పౌలు మీద ఫేలిక్సు ఎదుట నేరము మోపుట (1-9వ)** : యెరూషలేము నుండి ప్రధాన యాజకుడు, పెద్దలు ఒక్క న్యాయవాది కైసరయకు వచ్చి పౌలుపై మత భేదమునకు నాయకుడని నేరము మోపిరి.

**ఫేలిక్సు సెలవుతో పౌలు జవాబు ఇచ్చుట (10-21వ)** : పౌలు తన విశ్వాసమును వివరించి తెలిపి తనయందు ఏ నేరము లేదని వివరించి తెలిపెను.

**పౌలు ఫేలిక్సుకు సువార్తను అందించుట (22-27వ)** : కైసరయలోని కావలిలో రెండు సంవత్సరములు ఉండుట. పౌలు విడిగా కావలిలో ఉండి ఫేలిక్సు కోరికపై తేటగా సువార్త అందించెను. పౌలు వలన ద్రవ్యము దొరుకునని ఫేలిక్సు ఆశించెను. కాని ద్రవ్యము దొరకనందున రెండు సంవత్సరముల తరువాత పౌలును బంధకముల లోనే విడిచి వెళ్ళెను.

## 25వ అధ్యాయము 5+7+10+5=27 వచనములు
## అంశము : అధిపతియైన ఫేస్తు ఎదుట నిలిచిన పౌలు

**యెరూషలేములోని యూదుల ఫిర్యాదుకు పౌలు అధిపతియైన ఫేస్తుకు ఇచ్చిన జవాబు (1-12వ)** : 1-5వ ఫేస్తు యెరూషలేమునకు రాగా యూదులు తమ ఫిర్యాదులను ఫేస్తునకు తెలిపి యెరూషలేమునకు పౌలును పిలిపించి విచారించవలెనని కోరిరి. ఆలాగు యెరూషలేమునకు వచ్చు సమయములో పౌలును చంపవలెనని కోరిరి. 6-12వ. ఫేస్తు కైసరయలో న్యాయపీఠము మీద కూర్చుండి యూదులు మోపిన నేరములను విచారించెను కాని అవి ఋజువు కాలేదు. ఫేస్తు పౌలుతో యెరూషలేములో విచారించబడుట నీకిష్టమా అని అడుగగా పౌలు రోములోని కైసరయ ఎదుట చెప్పుకొందును అనెను.

**అధిపతియైన ఫేస్తు అగ్రిప్ప రాజులు కలసి పౌలు విషయమై ఆలోచించిరి (13-27వ)**: అధికారియైన ఫేస్తు అగ్రిప్పరాజుతో పౌలు విషయమై వివరించి మరునాడు అధికార మందిరములో పౌలును పిలిపించి విచారించుటకు ఏర్పాటు చేసాడు.

## 26వ అధ్యాయము 23+6+3=32 వచనములు
## అంశము : రాజైన అగ్రిప్ప ఎదుట అధిపతియైన ఫేస్తు ఎదుట సాక్ష్యమిచ్చిన పౌలు

**విభజన - అగ్రిప్ప ఎదుట, ఫేస్తు ఎదుట పౌలు సాక్ష్యము (1-28వ)** : 22వ అధ్యాయములో తన జీవిత ప్రారంభము నుండి కలిగిన మతాసక్తిని, రక్షించబడిన విధము, సేవ చేసే విధము వివరించినట్లు, రాజైన అగ్రిప్ప ఎదుట అధిపతియైన ఫేస్తు ఎదుట పౌలు సాక్ష్యమిచ్చెను. 24-29వ.లలో ఫేస్తు అగ్రిప్పలు పౌలుతో మాట్లాడగా వారిద్దరు కూడా పౌలువలె క్రీస్తునందు ఉండవలెనన్న తన ఉద్దేశము పౌలు తెలిపెను.

**నిర్దోషి అయిన పౌలు (30-32వ)** : పౌలు మరణశిక్ష కొరకైనను, బంధకములకైనను తగిన నేరమేమియు చేయలేదని వారు గ్రహించి విడుదల చేయవలెనని తలంచిరి కాని రోమాలోని చక్రవర్తి ఎదుట నిలుచుదునని చెప్పినందున రోమాకు పంపుటకు తీర్మానము చేసిరి.

## 27వ అధ్యాయము 8+12+12+12=44 వచనములు
## అంశము : రోముకు ప్రయాణము - ప్రయాణములోని ఆపదలు

**ప్రయాణ వివములు (1-8)** : పౌలు ఇతర ఖైదీలతో కలసి శతాధిపతి కాపలా క్రింద ఓడలో ఇటలీకి పంపబడెను. మార్గమందు గాలి ఎదురై బహు కష్టముగా మంచి రేవులు అను స్థలమునకు చేరిరి.

**ప్రయాణములోని ఆపదలు - ధైర్యపరచిన ప్రభువు (9-26వ)** : ప్రయాణములో గాలి ఎదురైనందున ఓడ నడిపించుట చేతకాక కొట్టుకొని పోనిచ్చిరి. పెద్ద గాలి కొట్టుచున్నందున సరుకులు సముద్రములో పడవేసి ప్రాణములతో తప్పించుకొందుమను ఆశలేకపోయెను. కాని రాత్రివేళ ప్రభువు ధైర్యపరచగా పౌలు ప్రయాణికులను ధైర్యపరచెను.

**మెలితే ద్వీపమున ఓడ చిక్కుకొని పోవుట - ప్రయాణికులందరు క్షేమముగా దిగుట (27-44వ)** : 27-35వ. వరకు ఓడలోని ప్రయాణికులను ధైర్యపరచి ఆహారము పుచ్చుకొనుమని వేడుకొనెను. 36-44. వారు ఆహారము పుచ్చుకొనిన తరువాత ఉదయమైనపుడు ఒక ద్వీపము దగ్గర ఓడ చిక్కుకొని పోగా ఓడలోని 276 మంది సురక్షితముగ ఒడ్డుకు చేరిరి.

## 28వ అధ్యాయము 10+6+7+8 =31 వచనములు
## అంశము : రోములోని చెరలో రెండేండ్లు గడిపిన పౌలు

**విభజన - మెలితే నుండి రోమా చేరుట (1-16వ)** : మెలితే ద్వీపములో మూడు నెలలు గడిపిరి. పౌలు ప్రార్థన ద్వారా జరిగిన స్వస్థతలను బట్టి ద్వీపములోని ముఖ్యుడు వారిని క్షేమంగా సాగనంపిరి. 11-16వ.లలో ఆయా ఓడరేవుల గుండా సాగివెళ్ళి రోమాకు వచ్చి తనకు కావలి ఉన్న సైనికులతో ప్రత్యేకముగా ఉండుటకై సెలవు పొందెను.

**రోమాలోని చెరలో రెండేండ్ల సాక్ష్యము (17-38వ)** : పౌలు రోములోనుండగా తనపై ఫిర్యాదులు రాలేదు. రెండు సంవత్సరములు సైనికులతో కూడా ప్రత్యేకముగా ఉన్న ఇంటికి అద్దె చెల్లించి తన యొద్దకు వచ్చువారందరికి సువార్త ప్రకటించెను. ఫిలిప్పీ 1:13ను బట్టి ప్రేతోర్యమను సేనలో 16 వేల మంది సైనికులకు సువార్త ప్రకటించెనని నేర్చుకొనుచున్నాము. ఫిలిప్పీ 4:27 ప్రకారము కైసరయ ఇంటిలోని వారు కూడా సువార్త విని రక్షించబడెనని తెలుసుకొనుచున్నాము.

# రోమీయులకు వ్రాసిన పత్రిక

గ్రంథకర్త : పౌలు (1:1),కాలము : క్రీ.శ. 57 (1:13), స్థలము : కొరింథు (16:23), కొనిపోయినవారు : ఫీబే (16:1) లేఖికుడు తెర్తి 16:22

**ముఖ్య ఉద్దేశ్యము** : సువార్త దేవుని నీతి - విశ్వాసము ద్వారా నీతిమంతులుగా తీర్చబడుట. నీతిమంతులుగా జీవించుట (1:17)

**రోమా పట్టణ చరిత్ర** : రోమా పట్టణము టైబర్ నది ముఖ ద్వారమునకు 15 మైళ్ళ దూరమున గల పట్టణము. క్రీ.పూ. 753 రోములస్ అను నాయకునిచే ఒక కొండపై చిన్న కోటగా కట్టబడి క్రమేపి ఏడు కొండలపై వ్యాపించిన పట్టణము. మొదటి నుండి రోమా రాజ్యమునకు అది ముఖ్య పట్టణమై క్రీ.పూ. 31 నుండి క్రీ.శ. 476 వరకు ప్రపంచమును పాలించిన 6వ రాజ్యముగానుండినది. పడమటి రోమా రాజ్యం క్రీ.శ. 476లో పతనం కాగా అందులో నుండి మతపరమైన పోపుల రోమా రాజ్యము పుట్టి నేటికి కొనసాగుచున్నది. పట్టణములోని ఏడు కొండల పేర్లు 1. కాపిటోలిన్, 2. క్విరినల్, 3. విమినల్, 4. ఎస్కివలిన్, 5. కయోలిన్, 6. అవింటన్, 7. పాలటన్.

పౌలు రోములోని చక్రవర్తి యొక్క మమర్తినను చెరసాలలో రెండేండ్లు క్రీ.శ. 61-62 వరకు ఉండి కొంతకాలము (క్రీ.శ. 63-64) విడిచిపెట్టబడి రెండవమారు రోములోని చెరలో (క్రీ.శ. 65-66 వరకు) నుండి క్రీ.శ. 67లో నీరో చక్రవర్తిచే శిరచ్ఛేదన చేయబడెను. పేతురు కూడా అదే చెరసాలలో 9 నెలలుండి తలక్రిందులుగా సిలువ వేయబడి చనిపోయెను. రోమాలో పేతురు సమాధిపై ప్రసిద్ధమైన భవనముగా ఒక దేవాలయము కట్టబడెను.

**రోమా సంఘస్థాపన** : పౌలు రోమా పట్టణమునకు వెళ్ళవలెనని ఆశించెను. కానీ క్రీ.శ. 57లో ఈ పత్రిక వ్రాయు వరకు అక్కడికి వెళ్ళలేదు. పెంతెకోస్తు దినమున క్రీ.శ. 30లో సువార్త విని నమ్మిన వారిలో అ.కా. 2:10 ప్రకారము రోమా నుండి పరవాసులుగా వచ్చిన వారు కలరు. వీరు తదుపరి రోమాకు వెళ్ళినపుడు సువార్తను అక్కడ ప్రకటింపగా అనేకులు నమ్మి సంఘముగా ఏర్పడినట్లు తలంచగలము.

2 కొరింథీ. 9:2-5 వచనాలలో అకయవారు యెరూషలేములోని పేదలకు కొంత సొమ్ము ఇవ్వవలెనని చెప్పాడు. రోమా 15:26లో అకయ వారిచ్చిరని ఆ సొమ్ము తీసుకొని

యెరూషలేముకు వెళ్ళుచున్నట్లు చెప్పినందున రెండవ కొరింథు పత్రిక తరువాత రోమీయులకు క్రీ.శ. 57లో పత్రిక వ్రాసాడు. రోమా 16:23లో గాయియు ఇంటిలోనున్నాను అన్నాడు. గాయియు 1 కొరింథీ. 1:15వ. ప్రకారము కొరింథు వాడైనందున ఈ పత్రికను పౌలు కొరింథులో నుండి వ్రాసాడని నిర్ణయించగలము.

రోమా పత్రిక 1:17లోనున్న "నీతిమంతుడు విశ్వాస మూలమున జీవించునన్న వాక్యము సంఘ సంస్కరణ కర్తలైన మార్టిన్ లూథర్‌ను, జాన్‌వెస్లీని, జాన్ కెల్విన్‌ను, రక్షణ అనుభవమునకు ఉజ్జీవమునకు నడిపించినది. ఈ పత్రిక చదువు మనము కూడా ఒక ఉజ్జీవమును దేవుడు మనలో జరిగించుటకు సిద్ధముగా నుండవలెను". నీతిమంతుడు విశ్వాస మూలమున జీవించునన్న వాక్య ఆధారముగా గ్రంథ విభజన 1. విశ్వాస మూలమున నీతిమంతుడుగా తీర్చబడుట 1-8 అధ్యా. 2. నీతిమంతుడుగా జీవించుట సేవించుట 9-16 అధ్యా.

## అధ్యాయాల విభజన 5+3+3+5 = 16 అధ్యా.

I. ఎ) పాపము 1:1 - 3:8 (69వ.)

బి) పరిహారము 3:9-5:21 (69వ.) 1-5 అధ్యా.

II. 1. పరిశుద్ధత (87వ.) 6-8 అధ్యా.

III. ప్రభువు - తన ప్రజలు (90వ.) 9-11 అధ్యా.

IV. పరిచర్య (91+27వ.) (118వ) 12-16 అధ్యా.

**I. పాపము - పరిహారము (1-5,6) : (దీనిని వివరణ 18వ భాగములో కలదు)**

1. **1 అధ్యాయము** : అన్యుల పాపము - ఫలితము.

2. **2 అధ్యాయము** : యూదుల పాపము - ఫలితము.

3. **3 అధ్యాయము** : యూదులు అన్యులు అందరు పాపులై దేవుడను గ్రహించు విమోచనము ద్వారా నీతిమంతులగుట.

4. **4 అధ్యాయము** : విశ్వాసము ద్వారా నీతిమంతులగుటను గూర్చి ప్రవక్తలు ధర్మ శాస్త్రము ఇచ్చిన సాక్ష్యము.

5. **5 అధ్యాయము** : క్రీస్తునందలి విశ్వాసము ద్వారా కలిగిన ఫలము.

**II. పరిశుద్ధత (6-8) :**

**6. 6వ అధ్యాయము :** పాపము విషయమై మృతులుగా ఎంచుకొనుట. దేవునికి దాసులైనందున పరిశుద్ధతను ఫలముగా కలిగియుండుట.

**7. 7వ అధ్యాయము :** ధర్మశాస్త్రము - పరిశుద్ధ జీవితముకైన పోరాటము.

**8. 8వ అధ్యాయము :** పరిశుద్ధాత్మ శక్తి ద్వారా పరిశుద్ధ జీవితము.

**III. ప్రభువు - తన ప్రజలు (9-11 అధ్యా.) :**

**9. 9వ అధ్యాయము :** ఇశ్రాయేలీయుల మధ్యగతకాల పరిచర్య.

**10. 10వ అధ్యాయము :** ఇశ్రాయేలీయుల మధ్య ప్రస్తుత కాల పరిచర్య.

**11. 11వ అధ్యాయము :** ఇశ్రాయేలీయుల మధ్య అంత్య కాల పరిచర్య.

**IV. పరిచర్య (12-16 అధ్యా.) :**

**12. 12వ అధ్యాయము : పరిచర్య వివరములు.**

**13. 13వ అధ్యాయము :** పరిచర్య వివరములు.

**14. 14వ అధ్యాయము :** బలహీనుల పట్ల పరిచర్య.

**15. 15వ అధ్యాయము :** బలహీనులను చేర్చుకొను పరిచర్య - ప్రకటించు పరిచర్య పేదలపట్ల పరిచర్య.

**16. 16వ అధ్యాయము :** వివిధ పరిచర్యలు - పరిచారకులైన జత పనివారు - వందనములు.

## 1వ అధ్యాయము 8+9+6+9 = 32 వచనములు
## అంశము : అన్యుల పాపము (1:22,23) - ఫలితము (1:32)

1. **శుభములు - పత్రిక సారాంశము - స్తుతి (1-8వ) :** ఎ) పరిశుద్ధులుగా ఉండుటకు పిలువబడినవారు అనగా పాపపరిహారము పొందుట (1-5 అధ్యా.)

2. **పరిశుద్ధులుగా జీవించుట 6-8 అధ్యాయములు :**

3,4. బి) యేసుక్రీస్తు దాసుడుగా ఉండుటకు **పిలువబడినవారు** అనగా యేసు క్రీస్తు పరిచర్య చేయుచూ జీవించుట (9-16 అధ్యా.)

యేసుక్రీస్తు వారుగా ఉండుటకు **పిలువబడినవారు** 9-16 అధ్యా.)

పౌలు పరిచయములోనే తాను సువార్త నిమిత్తము ప్రత్యేకించబడిన క్రీస్తు దాసుడనని ఈ పత్రిక చివరలోనున్న "పరిచర్య" చేయువాడనని పరిచయము చేసుకొనుచున్నాడు. సువార్త 1. దేవునిచే వాగ్దానము చేయబడినది, 2. ముందుగా పరిశుద్ధ లేఖనములలో ప్రవక్తల ద్వారా చెప్పబడినది, 3. మృతి పొంది తిరిగి లేచిన క్రీస్తునందు సమస్త జనులు విశ్వాసముంచుటకు నడిపించుటయే సువార్త పరిచర్య ఉద్దేశము. రోమాలో ఉన్న పరిశుద్ధులును, పరిశుద్ధులుగా ఉండుటకు (6-8 అధ్యా.) పిలువబడినవారని జ్ఞాపకము చేయుచున్నాడు.

8వ వచనములో రోమీయుల విశ్వాసము సర్వలోకములో ప్రచురింపబడు చున్నందున స్తుతించుచున్నాడు.

**పౌలు ప్రార్థన 11-13వ అపేక్ష - 14-15వ సంసిద్ధత - 16-17వ బాధ్యత (9-17వ)** :

**పౌలు స్తుతి - ప్రార్థన (9-10వ)** : రోమాలోని పరిశుద్ధుల విశ్వాసము సర్వలోకములో ప్రచురము చేయబడుటను బట్టి దేవుని స్తుతించుచూ వారిని చూచుటకు సమయము దయ చేయువలెనని ఎల్లప్పుడు ఎడతెగక ప్రార్థించుచున్నాడు. నేటి విశ్వాసులకు ఇది ఎంతో మాదిరిగానున్నది.

**పౌలు అపేక్ష (11-13)** : పౌలు ఇంతవరకు రోమాకు వెళ్ళలేదని చూచితిమి. పౌలు అక్కడకు వెళ్ళి రోమీయులను 1. స్థిరపరచవలెనని, వారి ద్వారా తాను, తన ద్వారా వారు 2 ఆదరించబడవలెనని, లేని వారికి 3. ఆత్మ సంబంధమైన వరమేదైనా ఇవ్వవలెనని 4. రోమీయులలో కూడా సువార్త ప్రకటించి ఆత్మల ఫలము పొందవలెనని అపేక్షించు చున్నాడు. ప్రతి విశ్వాసి సువార్తికుడు ఇటువంటి అపేక్ష కలవాడుగానుండాలి.

సంసిద్ధత **(14-15వ)** : అన్ని జాతుల వారికీ, అన్ని రకములైన స్థితి గతులలోనున్న వారికి సువార్త ప్రకటించుటకు పౌలువలె మనమును సిద్ధముగానుండాలి. సువార్త ప్రకటించుట మనకున్న ఋణమును తీర్చుట.

బాధ్యత **(16-17వ)** : సువార్తను గూర్చి 1. సిగ్గుపడకూడదు, 2. సువార్తలో దేవుని శక్తి యున్నది. 3. సువార్తను విశ్వసించుట ద్వారా దేవుని నీతి బయలు పరచబడును.

అనగా సువార్తయందలి విశ్వాసము మానవులను నీతిమంతులుగా తీర్చి ఆలాగు జీవించుటకు సహాయము చేయును. ఇది పత్రిక మూలాంశము.

**దేవుని లక్షణములు - అన్యుల లక్షణములు (18-23వ) :**

**దేవుని లక్షణములు (18-20) :** 1. దేవుడు నిత్య శక్తిగలవాడు, 2. దేవుని దైవత్వము సృజించబడిన వస్తువులను ఆలోచించుట వలన తేట పరచబడును, 3. సత్యమును అడ్డగించు మనుష్యుల మీద ఆయన కోపము బయలు పరచబడును.

**అన్యుల పాపములు (21-23వ) :** 21-23వ అన్యుల పాపములు చెప్పబడినది. 1. దేవునిని ఎరిగి మహిమ పరచకుండుట, 2. కృతజ్ఞతా స్తుతులు చెల్లింపకుండుట, 3.అవివేక హృదయము కలిగియుండుట, జ్ఞానులమని చెప్పుకొనుచు బుద్ధిహీనులుగా నుండుట, 4. అక్షయుడగు దేవుని మహిమను క్షయమగు మనుష్యుల యొక్కయు, పక్షుల యొక్కయు, జంతువుల యొక్కయు పురుగుల యొక్కయు ప్రతిమా స్వరూపము లుగా మార్చుట.

**అన్యుల పాపముల వివరము - ఫలితముగా రెండవ మరణము (24-32వ) :**

**1. 24-25 వచనము :** దేవుని సత్యమును అసత్యమునకు మార్చి సృష్టికర్తకు బదులు సృష్టిని పూజించి సేవించినందున వారి హృదయ దురాశలు అనుసరించుటకు దేవుడు వారిని అపవిత్రతకు అప్పగించాడు.

2. **26-27 వచనము :** స్త్రీలు, పురుషులు స్వాభావిక ధర్మమును విడిచి పురుషులతో పురుషులు, స్త్రీలతో స్త్రీలు అవాచ్యమైనది చేయుచు కామ తప్తులైనందున దేవుడు తుచ్ఛమైన అభిలాషలకు వారిని అప్పగించాడు.

**3. 28 వచనము : దేవునికి మనసులో చోటివ్వని కారణమున దేవుడు** చేయరాని కార్యములు చేయుటకు భ్రష్టమైన మనస్సుకు వారిని అప్పగించాడు.

4. **29-31 వచనము :** పైన వచనములలో అన్యుల యొక్క విగ్రహారాధన చెప్పబడినది. ఈ మూడు వచనములలో 21 పాపములు చెప్పబడినవి.

**32 వచనము :** దేవుని న్యాయవిధిని బట్టి ఇట్టి అన్యులు రెండవ మరణమైన అగ్నిగుండము/నరకమునకు పాత్రులు.

## ౨వ అధ్యాయము 4+6+6+7+6 = ౨౯ వచనములు
## అంశము : యూదుల పాపము (౨:1) - పాపము ఫలితము (౨:5)

**యూదుల పాపములు (అన్యులతోపాటు యూదులును పాపులే) (1-4వ)** : 1. తీర్పు తీర్చకుడి అని మత్తయి 7:1లో ఉన్నను యూదులు అందరికి తీర్పు తీర్చకుడి అను అజ్ఞను అతిక్రమించుటయే పాపము. 2. ఎదుటి వారికి తీర్పు తీర్చుచు వాటిని జరిగించుట పాపము. 3. సత్యమును అనుసరించి దేవుడు తీర్పు తీర్చును. 4. దేవుడు మారు మనస్సు పొందునట్లు ప్రేరేపించినను విధేయత చూపకపోవుట పాపము చేయుటయే.

**పాప ఫలితములు (5-10వ)** : 6వ. హృదయ కాఠిన్యము కలిగి మారు మనస్సు పొందని వారి పై దేవుడు తన ఉగ్రతను కనుపరచు తీర్పు దినమందు దేవుని ఉగ్రతను కుమ్మరించును. 7వ. సత్ క్రియలు చేయు యూదునికి, అన్యులకు తమ క్రియలను బట్టి నిత్యజీవమను ఫలమిచ్చును. 8-9వ సత్యమునకు లోబడక దుర్నీతికి లోబడు యూదులకైనను, గ్రీసు దేశస్తులకైనను శ్రమలు వేదనలు కలుగును.

**ధర్మశాస్త్రము కలవారు లేనివారు అందరును పాపులై తీర్పు పొందుదురు (11-16వ.):** ధర్మశాస్త్రము లేని అన్యులు తమ మనస్సాక్షి వారి తలంపుల విషయము చేయు తీర్పును బట్టి తమ హృదయములలో ధర్మ శాస్త్రము వ్రాయబడినట్టున్నారు. కావున, ధర్మశాస్త్రము లేక పాపము చేసినవారును ధర్మశాస్త్రము లేకయే నశించుదురు. ధర్మశాస్త్రము కలిగి పాపము చేసినవారు ధర్మ శాస్త్రమును బట్టి తీర్పు తీర్చబడి శిక్ష పొందుదురు. ఇవన్నియు దేవుడు మానవులను విమర్శ చేయు దినమున జరుగును.

**ధర్మ శాస్త్రమును అనుసరించియు నెరవేర్చలేకపోవుట అను పాపము (17-23) :** యూదులు ధర్మశాస్త్రము కలవారు, ఎరిగినవారు, ఉపదేశము పొందినవారు, ఉపదేశించు వారైనను ధర్మశాస్త్రమును మీరి నెరవేర్చ లేకపోవుట ద్వారా పాపులని తీర్చబడుచున్నారు.

**నిజమైన సున్నతి - శరీర సంబంధమైన సున్నతి ద్వారా నీతిమంతులు కాకపోవుట (24-29)** : శరీరమందు బాహ్యమైన సున్నతి సున్నతి కాదు. బాహ్యమునకు యూదుడు యూదుడు కాడు. అంతరంగమందు ఆత్మయందు జరుగు హృదయ సంబంధమైన సున్నతియే నిజమైనసున్నతి. కొలొస్స. 2:11 ప్రకారము, శరీరేచ్ఛలతో కూడిన స్వభావమును విసర్జించుటయే చేతులతో చేయబడని క్రీస్తు సున్నతి. ఈ సున్నతిని క్రీస్తును అంగీకరించిన వారందరు పొందిరి అని వ్రాయబడినది.

# 3వ అధ్యాయము 8+12+11 = 31 వచనములు
# అంశము : అన్యులు యూదులు అందరు పాపులై దేవుడనుగ్రహించు మహిమను పొందలేక పోవుట (3:9-3:23) - క్రీస్తునందలి విమోచనము ద్వారా నీతిమంతులగుట (3:24-31)

ఈ భాగమందు యూదులను గూర్చిన నాలుగు జవాబులతో కూడి ప్రశ్నలు కలవు (1-8వ) :

**1. యూదులకు కలిగిన గొప్పతనమేమి? సున్నతి వలన ప్రయోజనమేమి?**

జ॥ దేవోక్తులు యూదుల పరము చేయబడినవి. ఇది యూదుల ఆధిక్యతయే.

**2. కొందరు అవిశ్వాసులైన నేమి. వారు అవిశ్వాసులైనందున దేవుడు నమ్మతగినవాడు కాకపోవునా?**

జ॥ దేవుడు సత్యవంతుడు నమ్మదగినవాడు కాని ఎన్నడును అబద్ధికుడు కాడు.

**3. మన దుర్నీతి దేవుని నీతికి ప్రసిద్ధి కలుగ చేసిన యెడల ఏమందుము? ఉగ్రతను చూపించు దేవుడు అన్యాయస్తుడగునా?**

జ॥ దేవుడు అన్యాయస్తుడైన యెడల లోకమునకు తీర్పు తీర్చు నీతి గల న్యాయాధిపతి ఎట్లు కాగలడు.

**4. మన అసత్యము వలన దేవుని సత్యము ప్రభలమైన మనము పాపులమైనట్లు తీర్పు పొందనేల?**

జ॥ కీడు ముందుగా జరిగిన పిదప మేలు కలుగును అని కొందరు చెప్పినట్లు యూదులు చెప్పిన యెడల దేవుడు వారికి శిక్షా విధి కలుగ చేయుట న్యాయమే.

**అందరు పాపులు (9వ.) (9-20వ.)** : స్వభావమును బట్టి (10-12వ.) సంభాషణను బట్టి (13-14వ) ప్రవర్తనను బట్టి (15-18వ.) - యూదులు అన్యులు అందరు పాపులు శిక్షకు పాత్రులు (19-20వ.)

9వ. యూదులు అన్యులు ఏ మాత్రము ఒకరికి ఒకరు తీసిపోక అందరు పాపులై యున్నారని ముందుగా తేల్చబడినది.

**ఎ) 10-12వ స్వభావమును బట్టి అందరు పాపులు** : 1) దేవుని వెదకరు, 2) దేవుని గ్రహించరు, 3) త్రోవ తప్పెదురు, 4) పనికి మాలిన వారు, 5) మేలు చేయరు. కీర్తనలు 14:2 ప్రకారము బుద్ధిహీనులైరి,

**బి) సంభాషణను బట్టి అందరు పాపులు (13-14వ.)** : నోరు, పెదవులు, నాలుక, గొంతుక, పాపముచే నిండియున్నది. కీర్తన 5:9, 10:7, 140:3 ప్రకారము **అపరాధులును దుష్టులును** అయిరి.

**సి) ప్రవర్తనను బట్టి అందరు పాపులు (15-18వ.)** : రక్తము చిందించుటకు పరుగెత్తు పాదములు కలవారై యెషయా 59:7 ప్రకారము **పాపులైరి.**

18వ. వారి కన్నుల యెదుట దేవుని భయము లేక కీర్తనలు 36:1 ప్రకారము **భక్తిహీనులైరి.**

అందరు 1. బుద్ధిహీనులు, 2. అపరాధులు, 3. దుష్టులు, 4. పాపులు, 5. భక్తిహీనులు.

**యూదులు అన్యులు అందరు పాపులై శిక్షకు పాత్రులు (19-20 వ.)** : ధర్మశాస్త్రము పాపమును చూపించినది కాని పాపిని నీతిమంతుడుగా తీర్చలేదు. అందుచే అందరు **పాపులై** నిరుత్తరులుగా శిక్షకు పాత్రులైయున్నారు.

**ధర్మశాస్త్రమునకు వేరుగా** బయలు పరచబడిన **దేవుని నీతి** - ధర్మశాస్త్రము, ప్రవక్తలు **సాక్ష్యమిచ్చుట (21-22 వ.)** : ధర్మశాస్త్రమునకు వేరుగా క్రీస్తు యేసునందలి విశ్వాస మూలమున నమ్ము వారందరికిని నీతి కలుగుచున్నది. దీనిని గూర్చి ధర్మశాస్త్రము ప్రవక్తలు పాతనిబంధన గ్రంథమందు సాక్ష్యమిచ్చిరి. (సాక్ష్య వివరము 4వ అధ్యాయములో గలదు)

**అందరు పాపులు - నమ్మువారు నీతిమంతులు (23-24 వ.)** : 1:23లో విగ్రహారాధన ద్వారా అన్యులు పాపులు, 2:23లో ధర్మశాస్త్రము మీరుట వలన యూదులలో 3:9-20 వచనాలలో వివరించినట్లు అందరు పాపులై దేవుడనుగ్రహించు మహిమను పొందలేకపోవు చున్నారు.

**నమ్మువారు నీతిమంతులగుట (24వ.)** : క్రీస్తు యేసు సిలువలో చేసిన విమోచనను నమ్మువారు క్రీస్తును చేర్చుకొను వారు కృపచేత అనగా ఉచితముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు.

**సిలువ రక్తమందలి విశ్వాసము ద్వారా నీతిమంతులగుట (25-26వ.)** : నీతిమంతుడైన దేవుడు మానవుల పూర్వపు పాపములను క్షమించి, క్రీస్తు కల్వరిలో

కార్చిన రక్తమందు విశ్వాసముంచు వారిని నీతిమంతులుగా తీర్చుచున్నాడు. రోమా 10:9-10లోనున్నట్లు హృదయములో విశ్వాస ముంచినవారు నోటితో ఒప్పుకొనాలి. విశ్వసించుట ద్వారా నీతి, ఒప్పుకొనుట ద్వారా రక్షణ కలుగును.

**యూదులు, అన్యులు, విశ్వాసము ద్వారానే నీతిమంతులగుట (27-29 వ.)** : యూదులైనను, అన్యులైనను అని ఎంచ వీలు లేదు. ఎందుకనగా క్రియలను బట్టి కాక విశ్వాసమును బట్టియే అందరు నీతిమంతులుగా తీర్చబడుచున్నారు.

**విశ్వాసము ధర్మ శాస్త్రమును నిరర్థకము చేయక స్థిరపరచును (30-31వ.)** : సున్నతి గల యూదులు ధర్మ శాస్త్రము సాక్ష్యమిచ్చిన విశ్వాస మూలమునను, సున్నతి లేని అన్యులు తాము వినిన విశ్వాసము ద్వారాను నీతిమంతులుగా తీర్చబడుచున్నందున ధర్మశాస్త్రము నిరర్థకము కాక స్థిరపరచబడినది.

## 4వ అధ్యాయము 4+4+4+6+7 =25 వచనములు
## అంశము : విశ్వాసము ద్వారా నీతిమంతులగుటను గూర్చి 3:21 ప్రకారము ప్రవక్తలు, ధర్మశాస్త్రము ఇచ్చిన సాక్ష్యము

**ప్రవక్తల సాక్ష్యము (1-'వ)** : అబ్రాహాము ధర్మశాస్త్రము అనుగ్రహింపబడక ముందటి వాడు. దావీదు ధర్మశాస్త్రమను గ్రహించబడిన తరువాతనున్నవాడు.

**అబ్రాహాము సాక్ష్యము (1-4వ.)** : 1-3వ. అబ్రాహాము ప్రవక్త అని ఆది. 20:7లో పిలువబడ్డాడు. అబ్రాహామును యూదులు తండ్రియని పిలిచి (యోహాను 8:53) గొప్ప వాడుగా మూల పురుషుడుగా ఎంచిరి. అబ్రహాము ధర్మశాస్త్రము అనుగ్రహింప బడని కాలమునాటి వాడైనను క్రియలను బట్టి కాక విశ్వాసము ద్వారానే నీతిమంతుడుగా తీర్చబడెను. "అబ్రహాము దేవుని నమ్మెను. అది అతనికి నీతిగా ఎంచబడెను". ఆది. 15:6.

4వ. "పని చేయువానికి జీతము ఋణమే" క్రియల మూలమున నీతిమంతులుగా తీర్చబడితే అది జీతమగును దానము కాదు.

**దావీదు యిచ్చిన సాక్ష్యము (5-8వ)** : రక్షణ దానమైనందున క్రియల మూలముగా కాక భక్తిహీనుడు విశ్వాసము ద్వారానే నీతిమంతుడని తీర్చబడును. కీర్త. 30:1లో దావీదు "తన అతిక్రమమునకు పరిహారము నొందినవాడు తన పాపమునకు ప్రాయశ్చిత్తము నొందినవాడు ధన్యుడని చెప్పాడు.

బి) ధర్మశాస్త్రము యిచ్చిన సాక్ష్యము (9-25వ.) :

**సున్నతి లేనపుడు విశ్వాసము ద్వారా అబ్రహాము నీతిమంతుడని తీర్చబడెను (9-12వ.):** ధర్మశాస్త్ర ప్రకారము యూదులు సున్నతి ఆచరించాలి. దేవుడు ఆది. 17:10-14లో సున్నతిని గూర్చిన ఆజ్ఞ ఇచ్చాడు. అబ్రహాము ఆది. 17:23లో సున్నతి పొందాడు. కాని ఆది. 15:6లోనే అబ్రహామును దేవుడు నీతిమంతుడని తీర్చాడు. కాబట్టి అబ్రహాము సున్నతి పొందక మునుపే సున్నతిని గూర్చిన ఆజ్ఞ ఇవ్వకముందే దేవుడు అబ్రహామును విశ్వాసము ద్వారా నీతిమంతుడుగా తీర్చి విశ్వాసులందరికి తండ్రిగా నియమించినందున మనుష్యులు సున్నతి ద్వారా కాని దుర్నీతి క్రియల ద్వారా కాక విశ్వాసము ద్వారానే నీతిమంతులగుదురని ధర్మశాస్త్రము సాక్ష్యమిచ్చుచున్నది.

**ధర్మశాస్త్రమును బట్టి కాక విశ్వాసము ద్వారానే అబ్రహాముకు వాగ్దానము కలుగుట (13-18వ.)** : "నీవు అనేక జనములకు తండ్రివగుదువు" అను వాగ్దానమును ఆది. 17:4లో దేవుడు అబ్రహామునకు ధర్మశాస్త్ర మూలమున కాక విశ్వాసము ద్వారానే అబ్రహాము నూరేండ్లవాడై శరీరము మృతతుల్యమైనపుడు అనుగ్రహించాడు.

**విశ్వాసమును బట్టియే అబ్రహామునకు జీవితకాలములో దేవుడిచ్చిన వాగ్దానములు నెరవేర్చబడుట (19-25వ.)** : 19-21వ. అబ్రహాము నూరేండ్లవాడు శారా 90 ఏండ్లగలదై వారి శరీరములు మృత తుల్యముగానుండెను. శారాకు స్త్రీ ధర్మము నిలిచి గర్భము మూయబడినను విశ్వాసమును బట్టి అబ్రహాము సందేహించలేదు. వాగ్దానము చేసిన దానిని దేవుడు నెరవేర్చుటకు సమర్థుడని విశ్వసించి బలము పొందెను. దేవుడు తన వాగ్దానమును నెరవేర్చి మృతమైన శరీరముల నుండి వారికి విశ్వాసమును బట్టియే కుమారుని అనుగ్ర హించాడు. 22-25వ. సారాంశముగా అబ్రాహాముకు మాత్రమే కాక క్రీస్తునందు ఆయనను మృతులలో నుండి లేపిన దేవునియందు విశ్వాసముంచు మనకును దేవుని వాగ్దానములు నెరవేరును. క్రీస్తు మన అపరాధములను క్షమించుటకై మృతిపొంది విశ్వాసము ద్వారా మనలను నీతిమంతులుగా తీర్చుటకే వాగ్దానములను నెరవేర్చుటకే లేపబడెనని గ్రహించుచున్నాము.

## 5వ అధ్యాయము 11+10=21 వచనములు

## అంశము : క్రీస్తునందలి విశ్వాసము ద్వారా కలిగిన ఫలము

1. విశ్వాసము వలన లభించిన పది ఫలములు (1-11వ.) : 1) సమాధానము 1వ., 2) కృపయందు ప్రవేశము 2వ., 3) కృపలో నిలిచియుండుట 2వ., 4. అతిశయము

2వ., 5) సిగ్గుపరచని నిరీక్షణ 5వ., 6) పరిశుద్ధాత్మ అనుగ్రహము 5వ., 7) దేవుని ప్రేమ కుమ్మరింపు 5వ., 8) మనము బలహీనులము, భక్తిహీనులము, చెడ్డవారము పాపులమై యుండగా క్రీస్తు మరణము ద్వారా నీతిమంతులుగా తీర్చబడుట 6వ., 9) ఉగ్రత నుండి క్రీస్తు మరణము ద్వారా రక్షణ 9-10వ., 10) సమాధాన స్థితియు క్రీస్తు ద్వారానే 11వ.

**శిక్షావిధి తొలగి నీతి విధి కలిగిన విధము (12-21వ.)** : 12-14వ. ఆదాము ద్వారా కలిగిన పాపస్వభావము (జన్మపాపం) మనుష్యులందరు చేసిన పాపము (కర్మపాపము)ను బట్టి శరీర మరణము (ఆది. 3:19) ఆత్మ మరణము (ప్రక. 21:8) కలిగెను.

15-17వ. కృపాదానము క్రీస్తు ద్వారా కలిగి (15వ), మనలను నీతిమంతులుగా తీర్చి (16వ.), జీవమిచ్చి ఏలికలుగా (17వ.) చేసెను.

18-21వ. ఆదాముయొక్క ఒక అపరాధము మనుష్యులందరికి శిక్షావిధి కలిగించగా, క్రీస్తు యొక్క ఒక పుణ్యకార్యము మనుష్యులకందరికి నీతి విధి కలుగుటకు కారణ మాయెను.

## 6వ అధ్యాయము 4+4+3+3+4+5 = 23 వచనములు
## అంశము : పాపము విషయము మృతులుగా ఎంచుకొనుట - దేవుని దాసులైనందున పరిశుద్ధతను ఫలముగా కలిగియుండుట (11, 22వ)

**1-4వ. పాపము విషయము చనిపోతిమి (2వ.) బాప్తీస్మము వలన పాతిపెట్ట బడితిమి** : మనము పాపముల విషయమై చనిపోయిన వారము బాప్తీస్మము పొందితిమి అనగా చనిపోయిన మనము పాతిపెట్టబడితిమి. పాపము విషయము చనిపోయి పాతిపెట్ట బడినందున క్రీస్తు మృతులలో నుండి లేచినట్లు మనమును నూతన జీవము పొంది లేచినవారమైనందున, మనలో నూతనమైన పరిశుద్ధతతో కూడిన నడక యుండవలెను.

**పాపము విషయమై చనిపోయినందున పాప విముక్తులము (బాప్తీస్మ సాదృశ్యము 7వ) (5-8వ.)** : అయన మరణము యొక్క సాదృశ్యమందు పునరుత్థాన సాదృశ్య మందును మనము అయనతో ఐక్యముగలవారమైనందున మన పాప శరీరము సిలువ వేయబడినదని ఎరిగి పాపము నుండి విముక్తి పొందితిమని మరువక పాపమునకు దాసులము కాకూడదు. పాపమును చేయరాదు.

**పాపము విషయమై చనిపోయినందున క్రీస్తునందు సజీవులుగా ఎంచుకొనుట (11వ.)**: పాపముల విషయము క్రీస్తుతో కూడా చనిపోతిమి. క్రీస్తుతో తిరిగి లేచితిమి. అందుచే

ఆయన మీద మరణమునకు ప్రభుత్వము లేనట్లు మన మీదను పాపమునకు మరణము నకు ప్రభుత్వము లేదని ఎరుగవలెను. అందువలన పాపము విషయము మృతులుగాను, నీతి విషయమై సజీవులుగాను మనలను మనము ఎంచుకొని పాపము చేయకుండా నీతిగల జీవితము అనగా పరిశుద్ధ జీవితము జీవించాలి.

**మన పై పాపము ప్రభుత్వము చేయకూడదు (14వ) 12-14వ.** : మనము పాపము నుండి విమోచించబడితిమి. మన శరీర అవయవములను దుర్నీతికి అనగా పాపానికి సాధనములుగా కాక నీతికే సాధనములుగా అప్పగించుకొనాలి.

**నీతికి దాసులము (18వ.) 15-18వ.** : ఒకప్పుడు పాపమునకు దాసులము. కాని పాపము నుండి విడిపించబడితిమి. కావున ఇప్పుడు పాపమునకు దాసులము కాదు. కాని మనము పాపమునకు దాసులముగా లోబడుటకు అప్పగించుకొనగలము. ఆలాగు పాపమునకు దాసులముగా మనకు అప్పగించబడిన ఉపదేశమునకు అనగా విధేయత చూపుటకు దాసులుగా అప్పగించు కొంటిమి.

**పాపము నుండి విమోచించబడినందున ఫలముగా పరిశుద్ధతను (22వ) నిత్య జీవమును (23వ) పొందితిమి (19-23)** : మనము పరిశుద్ధత అను ఫలమును పొంది నందున ఒకప్పుడు పాపమునకు మన అవయవములను అప్పగించుకొనినట్లు నీతికి దాసులముగా మన అవయవములను అప్పగించుకొనాలి. ఎందుకనగా మనము పాపము నుండి విమోచించబడితిమి. దేవునికి దాసులమై పరిశుద్ధతను నిత్యజీవమును పొందితిమి.

## 7వ అధ్యాయము 6+6+5+4+4 = 25 వచనములు

## అంశము : పరిశుద్ధ జీవితముకైన పోరాటము - ధర్మశాస్త్రము, పరిశుద్ధత - మనలోనున్న నియమములు

ధర్మశాస్త్రమును గూర్చిన వివాహ సంబంధమైన దృష్టాంతము (1-6వ.) : 1. ధర్మశాస్త్రము మనుష్యుని మీద ప్రభుత్వము చేయుచున్నది (1వ.) 2. ధర్మ శాస్త్రము పరిశుద్ధమైనది (12వ.) 3. ధర్మశాస్త్రము నీతిగలది (12వ), 4. ధర్మశాస్త్రము ఉత్తమమైనది (12వ) 5. ధర్మశాస్త్రము ఆత్మ సంబంధమైనది (14వ). 6. ధర్మశాస్త్రము శ్రేష్ఠమైనది (17వ). 7. ధర్మశాస్త్రము నందు ఆనందించుచున్నాము (22వ.) శ్రేష్ఠమైనదియు, ఆత్మ సంబంధమైనదియునైన ధర్మశాస్త్రము పరిశుద్ధమైనదై ఆనంద మిచ్చునదిగానున్నది. ఈ

ధర్మశాస్త్రము మనుష్యులపై ప్రభుత్వము చేయుచున్నది. వివాహ చట్ట ప్రకారము భర్త బ్రతికినంత కాలము భార్య నైతిక సామాజిక బాధ్యతగా భర్తకు బద్ధురాలు. భర్త చనిపోయిన పిదప మరొక పురుషుని వివాహమాడవచ్చును. మనుష్యునిపై ప్రభుత్వము చేయు ధర్మశాస్త్రము మనకు భర్తవలెనున్నది.

**క్రీస్తు శరీరమందు మృతిపొందెను. (రోమా 7:4)** : మనలను దేవుని యొద్దకు తెచ్చుటకు అనీతిమంతుల కొరకు నీతిమంతుడైన క్రీస్తు శరీర విషయములో చంపబడి ఆత్మ విషయము బ్రతికింపబడెను. 1 పేతురు 3:18. సువార్త వలన అన్యులు యూదులతో పాటు క్రీస్తు యేసునందు ఒక శరీరమందలి పాటి అవయవములుగా నున్నారు. (ఎఫెసు 3:6) క్రీస్తు శరీరములో అవయవములుగానున్నవారు క్రీస్తు శరీరము మరణించుట ద్వారా వారును మరణించినందున వారిపైనున్న ధర్మశాస్త్రము యొక్క ప్రభుత్వము నుండి విడిపింపబడిరి. విడిపించబడినందున వేరొక పురుషుడైన క్రీస్తును వివాహమాడి దేవుని కొరకు ఫలములను ఫలించాలి. ఒకప్పుడు శరీర సంబంధులమై, పాపేచ్ఛలు కలిగి మరణార్థమైన ఫలములను ఫలించితిమి. ఇప్పుడు ధర్మశాస్త్రము నుండి విడుదల పొందినందున ప్రాచీన స్థితిగలవారము కాక ఆత్మాను సారమైన నవీన స్థితిగలవారమై సేవ చేయుచు దేవుని కొరకు ఫలములను ఫలించాలి.

**పరిశుద్ధత - ధర్మశాస్త్రము (7-12)** : ధర్మశాస్త్రమందు ప్రాముఖ్యమైన పది ఆజ్ఞలు, ఇతర ఆజ్ఞలు కలవు. ఆజ్ఞల ద్వారా పరిశుద్ధత అనగా ఏమియు మనమెరుగలము. కాని ఎక్కడ ఆజ్ఞ ఉండునో దానిని అతిక్రమించవలెనన్న దురాశలు మనయందు పుట్టును. దురాశ పాపమునకు నడిపించును. పాపమును బట్టి మానవుడు మరణించుచున్నాడు. కావున జీవార్థమైన ఆజ్ఞలు మరణార్థమైనట్టుగానున్నవి.

**పరిశుద్ధతను గూర్చిన పోరాటము (13-17వ.)** : ధర్మశాస్త్రము పరిశుద్ధమైనది, ఆత్మ సంబంధమైనది శ్రేష్ఠమైనది మనము పాపమునకు అమ్మబడి శరీర సంబంధులముగా నున్నాము. పాపము మనయందు నివసించుచున్నది. కావున చేయ నిశ్చయించునది చేయక ద్వేషించునదే చేయుచున్నాము. అలాగు చేయుట మనయందు నివసించు పాపమే కాని మనము కాదని 17వ వచనము చెప్పుచున్నది.

**పరిశుద్ధతను గూర్చిన మరింత పోరాటము (18-21వ.)** : మన శరీరమందు మంచి ఏమియు లేదని అందువలన మేలు చేయవలెనను కోరిక ఉన్నను అలాగు చేయుట

కలుగుట లేదు. అనగా మేలు చేయక కీడును చేయుచున్నాము. ఆలాగు చేయు మన యందు నివసించు పాపమేయని మనము కాదని 20వ. వచనము చెప్పుచున్నది. పాపము పాము వంటిది. పాము మన శరీరములోని అవయవములలోనున్న ఎడల ఏ క్షణమైనా మనలను కాటు వేయగలదు. కావున విశ్వాసి అజాగ్రత్తగా ఉన్న ఎడల పాపమునకు లోనగును. దావీదు, సమ్సోను, మోషేలు పాత నిబంధనలోను, మార్కు దేమాలు క్రొత్త నిబంధనలోను ఉదాహరణలు.

**మనలోనున్న నియమము (22-25వ.)** : మన అవయవములలో పాప నియమ మున్నది. అంతరంగ పురుషునిలో అనగా మనసులో ధర్మశాస్త్రమును బట్టి దైవ నియమము ఉన్నది. కాని శరీర అవయవములలోనున్న పాప నియమము మనలను చెరపట్టి లోపరచుకొనుచున్నది. మరణమునకు లోనగు శరీరము నుండి మనలను ఎవరు విడిపింతురను ప్రశ్న మనలోనున్నను, మనసు విషయములో దైవ నియమము నకు, శరీర విషయములో పాప నియమమునకు మనము దాసులమైయున్నాము. అందుకై పౌలు దేవుని స్తుతించుచున్నాడు.

## 8వ అధ్యాయము 4+3+4+6+5+3+5+4+5=39 వచనములు
## అంశము : పరిశుద్ధాత్మ శక్తి ద్వారా పరిశుద్ధ జీవితము

**ఆత్మ నియమము ద్వారా పాప మరణముల నియమము నుండి కలిగిన విడుదల (1-4)** : దేవుడు తన కుమారుడైన క్రీస్తును మానవ పాప పరిహారము నిమిత్తము, పాప శరీరాకారముతో పంపి ఆయన శరీరమందు మన పాపమునకు శిక్ష విధించెను. ధర్మ శాస్త్రము తనయందున్న నీతివిధిని మన పక్షముగా నెరవేర్చలేకపోయినది. అనగా పాపము యొక్క శిక్ష మన మీదనున్నందున మనలను నీతిమంతులుగా తీర్చలేకపోయినది. కాని దేవుడు తన కుమారుని మీద మన పాప శిక్షను విధించి సమాప్తి చేసినందున మనలను నీతిమంతులుగా తీర్చాడు. క్రీస్తు యేసు చేసిన పాప క్షమాపణ కార్యమును బట్టి ఆయనయందున్న జీవమునిచ్చు ఆత్మ యొక్క నియమము పాప మరణముల నియమము నుండి మనలను విడిపించాడు.

**ఆత్మానుసారులు - శరీరానుసారులు 5-7వ.)** : 1. ఆత్మాను సారులు ఆత్మ విషయము మీద మనస్సుంతురు - శరీరానుసారులు శరీర విషయముల మీద మనస్సుంతురు.

2. ఆత్మానుసారమైన మనసు జీవము, సమాధానము - శరీరానుసారమైన మనసు దేవునికి విరోధము మరియు లోబడదు.

**ఆత్మ స్వభావము - శరీర స్వభావము (8-11వ.)** : దేవుని ఆత్మ ఎవరి యందు నివసించునో వారు ఆత్మ స్వభావము గలవారు, శరీర స్వభావము కలవారు కారు. క్రీస్తు ఎవరియందుండునో వారి శరీరము పాపము విషయము మృతమైనదిగాను ఆత్మ నీతి విషయము జీవించునదిగానున్నది. మృతులలో నుండి యేసును లేపిన ఆత్మ ఎవరియందుండునో వారి శరీరములు చావునకు లోనైనవైనను దేవుడు తన ఆత్మ ద్వారా వారిని జీవింప చేయును.

**శరీరము చేత నడిపించబడక ఆత్మ చేత నడిపించబడుట (12-17)** : క్రీస్తును నమ్మిన వారియందు ఆత్మ నివసించుచున్నందున మనము ఆత్మ చేతనే నడిపించబడాలి కాని శరీరము చేత నడిపించబడకూడదు. శరీరము చేత నడిపించబడిన యెడల మనము చావవలసిన వారము. ఆత్మచేత శరీర క్రియలను చంపిన యెడల జీవించుదుము. ఆత్మచేత నడిపించబడు వారు దేవుని కుమారులు వారు దత్త పుత్రాత్మను పొందినవారు. నాయనా తండ్రి అని మొరపెట్టువారు వారియందున్న ఆత్మవారు పిల్లలని సాక్ష్యమిచ్చు చున్నాడు. దేవుని పిల్లలు దేవుని వారసులు. దేవునికి కలిగిన సమస్తమునకు క్రీస్తు తోడి వారసులు.

**విమోచన కొరకై నిరీక్షించుచున్న సృష్టి** : పరలోకము నుండి ప్రభువు ప్రత్యక్షమైన పిదప దేవుని పిల్లలు మహిమగల స్వాతంత్ర్యమును పొందుదురు. దీని తదుపరి నాశన మునకు లోనైన ఈ సృష్టి దాస్యము నుండి విడిపింపబడును. ఈ నిరీక్షణ కలదిగా సృష్టి ప్రస్తుతము ప్రసవ వేదనపడుచు మూలుగుచున్నది.

**విమోచన కొరకై నిరీక్షించుచున్న మన దేహము (3-25)** : పరిశుద్ధాత్మను ఫలముగా పొందిన మనము కూడా మన దేహ విమోచన కొరకు కనిపెట్టియున్నాము. మనము రక్షించబడినప్పుడే ఆత్మ విమోచన, ప్రాణ (మనస్సు, స్వభావము) విమోచన, దేహ విమోచన పొందుదుమన్న నిరీక్షణ కలవారముగానున్నాము. రక్షింపబడిన వెంటనే ఆత్మ విమోచన జరిగినది. ప్రాణ (మనసు) విమోచన దినదినము జరుగుచున్నది. దేహ విమోచన క్రీస్తు రెండవ రాకడలో జరుగును.

**భూలోకములో ఆత్మ విజ్ఞాపన (26-30వ.)** : పెంతెకొస్తు దినమున భూమి మీదకు వచ్చిన పరిశుద్ధాత్మ మన కొరకు, మన బలహీనతలలో సహాయము కొరకు, దేవుని చిత్త ప్రకారము విజ్ఞాపన చేయుచున్నాడు. అందువలన పరిశుద్ధులును, దేవుని ప్రేమించు వారికి అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడిన వారికి మేలు కలుగుటకై సమస్తము సమకూడి దేవుడు జరిగించుచున్నాడు. ఎందుకనగా, దేవుడు మనలను ముందుగా ఎరిగి, తన కుమారునితో సమరూపము కలవారమగుటకు జగత్తు పునాది వేయక మునుపే నిర్ణయించి, యుక్తకాలములో మనలను పిలిచి, యేసుక్రీస్తు సిలువలో కార్చిన రక్తమునందలి విమోచనము ద్వారా నీతిమంతులుగా తీర్చి మహిమ పరచెను.

**పరలోకములో క్రీస్తు విజ్ఞాపన (31-34వ.)** : మన పాపముల క్షమాపణ కొరకు తన సొంత కుమారుని అనుగ్రహించి, నీతిమంతులనుగా తీర్చిన దేవుడు మన పక్షమున నున్నాడు. మన పాప క్షమాపణ కొరకు చనిపోయి తిరిగి లేచిన యేసు మనకు శిక్ష విధించగలవాడైనను దేవుని కుడి పార్శ్వమున నుండి మన కొరకు విజ్ఞాపన చేయు చున్నాడు. సారాంశముగా తండ్రియైన దేవుడు మన పక్షమున నుండగా, కుమారుడైన దేవుడు మన కొరకు పరలోకమందు విజ్ఞాపన చేయుచుండగా, పరిశుద్ధాత్మ దేవుడు భూలోకములో మన బలహీనతలను చూచి సహాయము చేయుచుండగాను మన కొరకు విజ్ఞాపన చేయుచుండగను విరోధులెవరును లేరని సెలవిచ్చుచున్నాడు.

**విజ్ఞాపన ఫలితముగా ఎడబాయని తండ్రియైన దేవుని ప్రేమ నుండి క్రీస్తు ప్రేమ నుండి అన్ని పరిస్థితులలోను అత్యధిక విజయములు (35-39వ.)** : విశ్వాస జీవితములో 1) 1 పేతురు 4:12 ప్రకారము అగ్నివంటి శ్రమలు కలిగి, 2) యోబు 6:19 ప్రకారము ఏడు బాధలు కలిగి, 3) 1 కొరింథీ. 4:12 ప్రకారము హింస కలిగి, 4. అ.కా 11:28 ప్రకారం కరవు కలిగి, 5) 2 కొరింథీ. 11:28 ప్రకారము వస్త్రహీనత కలిగి, 6. 2 కొరింథీ. 11:26 ప్రకారము ఉపద్రవములు కలిగి, 7. అ.కా. 12:2 ప్రకారం ఖడ్గము ఎదురై దినమెల్ల వధింపబడిన వారముగాను వధకు సిద్ధమైన గొర్రెలముగా ఎంచబడుదుము. 1 కొరింథీ 15:31వ. పౌలు నేను దిన దినము చనిపోవుచున్నాను అన్నాడు. పైన చెప్పబడిన వాటి ద్వారా మరణము కలుగవచ్చును లేదా జీవమైనను కలుగవచ్చును. ఉన్నవైనను, రాబోవునవైనను, ఎత్తైనను, లోతైనను, సృష్టింపబడినదేదైనను, దేవదూతలు గాని, ప్రధానులుగాని, అధికారులుగాని ప్రభువు ప్రేమ నుండి మనలను ఎడబాపవు. వీటన్నిటిలో అత్యధిక విజయము పొందుచున్నాము.

## 6-7-8 అధ్యాయముల సారాంశము

6వ. అధ్యాయములో పాపము నుండి క్రీస్తు రక్తము ద్వారా విమోచించబడి పాప విముక్తులమని తీర్పు పొందితిమి. దేవునికి (నీతికి) దాసులమైనందున ఫలముగా పరిశుద్ధతను అంతములో నిత్యజీవమును పొందుదుము.

7వ. అధ్యాయములో పాపము మన శరీరములోని అవయవములలో నివసించు చున్నది. పాపము మనలను చెరపట్టి లోపరచు కొనినందున శరీర విషయమై పాప నియమమునకు మనసు విషయము దైవ నియమమునకు దాసులమైయున్నాము.

8వ. పాప మరణముల నియమము నుండి, క్రీస్తునందలి జీవమునిచ్చు నియమము ద్వారా విడిపించబడితిమి కనుక మనయందు నివసించు ఆత్మ ద్వారా సర్వ సత్యములోనికి నడిపించబడుచు శరీరేచ్ఛలను నెరవేర్చకుండ అత్యధిక విజయము పొందగలము.

## 9వ అధ్యాయము 5+4+4+5+4+4+3+4 =33 వచనములు
## అంశము : ఇశ్రాయేలీయుల మధ్య గతకాలములో జరిగిన పరిచర్య

**1-13వ వచనము** : ఇశ్రాయేలు సంబంధులందరు ఇశ్రాయేలీయులు కారు. అబ్రాహాము సంతానమైనంత మాత్రము చేత పిల్లలు కారు.

**ఇశ్రాయేలీయుల ఆధిక్యత (1-5వ)** : భూమి మీద తన జనాంగముగా ఎన్నుకొనిన ఇశ్రాయేలీయులకు గల ఆధిక్యతలు క్రింద కనుపరచబడినది.

**1. దత్త పుత్రత్వము** : ఇశ్రాయేలీయులను కుమారులుగా అంగీకరించాడు. "ఇశ్రాయేలు నా జ్యేష్ఠ కుమారుడు". నిర్గమ. 4:22. అలాగే యోహాను 1:12. ప్రకారము సంఘము కూడా అంగీకరించబడిన కుమారులు.

**2. మహిమ** : యిర్మీయా 13:11లో "నాకు మహిమ కలుగుటకై.... ఇశ్రాయేలీయులను నన్ను అంటియుండ చేసితిని". 2 కొరింథీ. 8:23 ప్రకారం సంఘము క్రీస్తు మహిమ, 2 కొరింథీ 3:18 ప్రకారము ప్రభువు మహిమను ప్రతిఫలింప చేయువారు.

3. నిబంధనలు : పాత నిబంధన ఇశ్రాయేలీయుల కివ్వబడినది. క్రీస్తు తర్వాత నూతన నిబంధనయు ఇవ్వబడినది. (హెబ్రీ. 8:9,8). సంఘమునకు కూడా రెండు నిబంధన లివ్వబడినది.

**4. ధర్మశాస్త్ర ప్రకారము** : అ.కా. 7:53 ప్రకారము "ధర్మశాస్త్రమును యూదులు పొందిరి". హెబ్రీ. 8:10 వారి హృదయము మీదవాటిని వ్రాయుదును.

**5. అర్చనాచారాదులు** : పూర్వకాలమున అర్చనా ఆచారములు యూదులకివ్వ బడినది. ఆలాగే సంఘమునకును బాప్తీస్మముపొందుట, రొట్టెవిరుచుట, ప్రార్థన చేయుట, అపోస్తలుల బోధ అను ఆచారములు అ.కా. 2:42 ప్రకారము కలవు.

**6. వాగ్ధానములు** : దేవుడు అబ్రాహామునకు అతని సంతానమునకు వాగ్దానములు చేశాడు. 2 కొరింథీ. 1:20 ప్రకారము అన్ని వాగ్దానములు మనవి". 1 పేతురు 1:4 ప్రకారం అమూల్యమును అత్యధికమైన వాగ్ధానములు సంఘమునకిచ్చాడు.

**7. పితరులు వీరి వారు** : యూదులు అబ్రహామును తండ్రి అనిరి. యోహాను 8:53. గలతీ. 3:7-9. ప్రకారము విశ్వాస సంబంధులైన అన్యులు అబ్రాహాము పిల్లలు.

**8. శరీరమును బట్టి క్రీస్తు వీరిలో పుట్టెను** : క్రీస్తు దావీదు సంతానము (9:5) క్రీస్తు అబ్రాహాము కుమారుడగు దావీదు కుమారుడగు నిమిత్తము అని మత్తయి 1:1వలోనున్నది. కాని యోహాను 8:44 వచనములో క్రీస్తు యూదులను మీరు మీ తండ్రియగు అపవాది సంబంధులని చెప్పెను. కనుక ఇశ్రాయేలు సంబంధులందరు ఇశ్రాయేలీయులు కారు. అబ్రహాము సంతానమంతయు పిల్లలు కారు.

శరీర సంబంధియైన **ఇష్మాయేలు - ఆత్మ సంబంధియైన ఇస్సాకు (6-9)** : ఇస్సాకు వలననైనదియే నీ సంతానమని దేవుడు అబ్రహాముతో సెలవిచ్చినందున ఇష్మాయేలు అబ్రహామునకు పుట్టినను ఆత్మీయ వాగ్ధానముల విషయములో ఇష్మాయేలు సంతానమునకు తావు లేదు. (ఆది. 17:17-22వ)

**ప్రేమించబడిన యాకోబు ద్వేషించబడిన ఏశావు (10:13వ)** : ఏశావు యాకోబు ఇస్సాకుకు రిబ్కా ద్వారా కలిగిరి. కాని వారి అంతర్యమును ఎరిగిన దేవుడు తన ముందు తెలివిని బట్టి పెద్ద వాడు చిన్న వానికి దాసుడగునని సెలవిచ్చెను. తదుపరి యాకోబు సంతానము దేవుని దీవెనలకు పాత్రులైరి. ఏశావు సంతానము ఇశ్రాయేలుకు పుట్టిన వారైనను ఆశీర్వాదమును పొందలేదు.

కావున అబ్రహాము సంతానమైనంత మాత్రాన పిల్లలు కాలేదు. ఇశ్రాయేలు సంబంధులందరు ఇశ్రాయేలీయులుగా దేవుని దీవెనలు పొందలేదు.

**దేవుడు అన్యాయస్థుడు కాదు (14-26)**

**కరుణించబడిన మోషే - కఠినపరచబడిన ఫరో (14-18వ)** : దేవుని కరుణను పొందుటకు మనమెవరము పాత్రులము కాము. మన క్రియల వలన ఆయన కృపను సంపాదించలేము. అది ఉచితముగా దేవుడనుగ్రహించని యెడల ఎవరము పొందలేము. మోషేను దేవుడు కరుణించాడు. ఫరోను కఠిన పరచుట అనగా ఫరో హృదయ అంతర్యమును దేవుడు ఎరుగును. ఫరో హృదయమును కఠిన పరచుకొనునని ఎరిగి సెలవిచ్చుచున్నాడు. ఫరోను దేవుడు దీవించి, హెచ్చించినను "ఆయన ఎవరు" అనుచు ఆయనను ఫరో - తృణీకరించాడు.

**దేవుని అధికారము (19-22వ.)** : దేవుడు తన ముందెలి విని బట్టి అధికార పూర్వముగా చెప్పుచున్నాడు. మనమును ఆయన మనసును ఎరిగిన వారముగా ఉండాలి. ఈ విషయములో దేవునికిఎదురు చెప్పకూడదు. ఒకే ముద్ద నుండి కుమ్మరివాడు రెండు కుండలను ఒకటి ఘనతకు మరొకటి ఘనహీనతకు వాడునట్లు చేయు అధికారము కలిగియున్నాడు. అలాగే తాను సృజించిన మానవుల అంతర్యమెరిగి ఒకరు మహిమ పొంద అర్హులని, మరొకరు మహిమను పోగొట్టుకొని దేవుని ఉగ్రత పొందుదురని సెల విచ్చు అధికారము కలిగియున్నాడు.

**యూదులను అన్యులను దేవుడు తన మహిమకు పిలుచుట (23-26వ.)** : యూదులనేమి అన్యులనేమి తన మహిమకు అనాదికాలము నుండియే పిలుచు చున్నాడు. "నా ప్రజలు కాని వారికి నా ప్రజలని పేరు పెట్టుదునని, ప్రియురాలు కాని దానికి ప్రియురాలని పేరు పెట్టుదునని చెప్పుచున్నాడు. నా ప్రజలు కారని అన్యుల విషయము పలికిన దేవుడు అ చోటనే జీవముగల దేవుని కుమారులని పేరు పెట్టుదు నంటున్నాడు. హోషేయ (1:9-10)

**ఇశ్రాయేలీయుల విమోచన (27-29వ.)** : ఇసుకవలె ఇశ్రాయేలువారున్నను గత కాలములో శేషమే రక్షించబడిరి.

**అన్యుల విమోచన (30-33వ.)** : నీతిని వెంటాడని అన్యులు విశ్వాస మూలమైన నీతిని పొందిరి. ఇశ్రాయేలీయులు అనేకులు ఆ విశ్వాస మార్గమును అందుకొనలేదు. వారి హృదయ కాఠిన్యమును బట్టి క్రియలద్వారా వెదకిరి గాని విశ్వాసము ద్వారా వెదక లేదు. ఈ వచనములు పదియవ అధ్యాయమునకు పీఠికగానున్నవి. పదియవ అధ్యాయ సారాంశమిదియేనని క్రింద చూడగలము.

# 10వ అధ్యాయము 4+8+9 =21 వచనములు
## అంశము : ఇశ్రాయేలీయుల మధ్య ప్రస్తుత కాలమందు జరుగుచున్న పరిచర్య

**దేవుని నీతికి లోబడని ఇశ్రాయేలీయులు (1-4వ.)** : ఇశ్రాయేలీయులకు ఆసక్తి యున్నను విశ్వాస మార్గమున నీతి మంతులముగా తీర్చబడుదుమని ఎరుగక, తమ స్వనీతిని అధారము చేసుకొనిరి. కనుక దేవుని మార్గమైన విశ్వాస మార్గమునకు లోబడ లేదు. విశ్వసించు ప్రతి వానికి నీతి కలుగునట్లు క్రీస్తు ధర్మ శాస్త్రమునకు సమాప్తమాయెను. ఈ సంగతి ఇశ్రాయేలీయులు గ్రహించలేదు.

**ప్రస్తుత కాలములో ఇశ్రాయేలీయులు అన్యజనులు రక్షింపబడవలసిన విధము (5-12):** ద్వితీ. 30:11-14వ. రోమా 10:6-10వ సరిపోల్చి చూడవలెను. ధర్మశాస్త్రములో ద్వితీ. 30:12,13లోనున్న దానిని అనుపదము రోమా 10:6-10లో క్రీస్తును అని యున్నది. కాబట్టి ఇశ్రాయేలీయులైనను, అన్యులైనను పరలోకము నుండి ఈ లోకమునకు వచ్చి, మన పాపముల విషయమై చనిపోయి, పాతిపెట్టబడి, తిరిగి లేచిన యేసునందు నమ్మిక యుంచాలి. ద్వితీ. 30:14. ప్రకారము ఈ వాక్యములను హృదయములోను నోటను యుంచుటను గూర్చి పౌలు రోమా 10:9,10 వచనములో నోటితో ఒప్పుకొనవలెనని హృదయమందు విశ్వసించవలెనని చెప్పుచున్నాడు. హృదయమందు విశ్వసించుట వలన నీతిమంతులుగా తీర్చబడునని, నోటితో ఒప్పుకొనుట వలన రక్షణ పొందునని వివరించు చున్నాడు.

**ఇశ్రాయేలీయులు ప్రస్తుతకాలమందు దూరముగానుండుట (13-21వ)** : ప్రభువు నామమున ప్రార్థన చేయుట వలన రక్షణ కలుగును. ఇశ్రాయేలీయులు విశ్వసించ నందున ప్రార్థించుట లేదు. వినుట లేదు. ప్రకటించువారు ఇశ్రాయేలీయుల మధ్యకు పంపబడుట లేదు. వెళ్ళినవారు ప్రకటించినను యెషయా 53:1. ప్రకారము "మేము తెలియజేసిన సమాచారము ఎవడు నమ్మెను". వారు నమ్ముట లేదు. ప్రభువును వెదకని అన్యులకు ప్రత్యక్షమై ఆయన దొరుకుచున్నాడు. అవిధేయులై ఎదురాడు ప్రజల వైపు దినమంతయు చేతులు చాపుచున్నాడు. ప్రభువు పక్షపాతము లేక అన్యులను ఇశ్రాయేలీయులను ఒకే రీతిగా దర్శించుచున్నాడు. కాని ఈ దినములలో అన్యులు రక్షించబడినట్లు ఇశ్రాయేలీయులు రక్షించబడుట లేదు.

# 11వ అధ్యాయము 6+6+6+6+6+6 =36 వచనములు
## అంశము : ఇశ్రాయేలీయుల మధ్య అంత్యకాల పరిచర్య

**రక్షించబడు శేషము (1-6వ.)** : బెన్యామీను గోత్రము చిన్నదైనను అదే గోత్రికుడగు పత్రిక వ్రాసిన పౌలును దేవుడు ఆకాలమందు రక్షించాడు. ప్రవక్తయైన ఏలియా కాలములో అనగా గత కాలములో ఏలియాను మాత్రమే కాక బయలుకు మోకాళ్ళూని 7,000 మంది పురుషులను దేవుడు శేషముగా నిలుపుకొన్నాడు. ఆలాగుననే రాబోవు కాలముననను దేవుడు తన కృప చొప్పున ఒక శేషమును రక్షించుకొనును.

**మిగిలిన వారి కాఠిన్యము వలన అన్యులకు తెరువబడిన ద్వారము (7-12వ.)** : దేవుడు వారికి నిద్ర మనను కలిగించెనని యెషయా 29:10లోను వారి కన్నులకు చీకటి కమ్మెనని కీర్తనలు 69:22లోను చెప్పబడినది. వారి తొట్రుపాటు వలననే అన్యులకు సువార్త ద్వారము తెరువబడినది.

**కాఠిన్యమునకు కారణములు (13-18వ.) (19-24వ)** : 1. లోకమును దేవునితో సమాధాన పరచుటకై దేవుడు వారిని తాత్కాలికముగా విసర్జించాడు.

2. వేరు పరిశుద్ధమైతే కొమ్మలు పరిశుద్ధమే కాని అడవి ఒలీవల వంటి అన్యులను అంటుకట్టు నిమిత్తము ఒలీవ చెట్టు కొమ్మలైన ఇశ్రాయేలు వారిలో కొందరు విరువ బడిరి.

3. వారు తమ అవిశ్వాసమందు నిలువకుండా ఉండిన యెడల మరల స్వంత చెట్టునకు అంటు కట్టబడుదురు.

**ఇశ్రాయేలు పునరుద్ధరణ (25-30వ.)** : అన్యజనుల ప్రవేశము సంపూర్ణమైన పిదప సీయోను నుండి భక్తిహీనత తీసివేయబడగా వారు క్రీస్తును గురించి పాప క్షమాపణ పొంది రక్షింపబడుదురు. ఇది మర్మము. నూతన నిబంధనలో మర్మము అను పదము 34 పర్యాయములు కలదు.

**దేవుని బుద్ధి జ్ఞానముల బాహుళ్యము (31-36వ.)** : యూదుల అవిధేయత వలన అన్యులు కరుణించబడినట్లు అందరి యెడల కరుణ చూపు దేవుడు ఒక్కొక్కరిని వేరు వేరు సమయములలో అవిధేయత స్థితిలో బంధించెను. అందుచేత దేవుని బుద్ధి జ్ఞానముల బాహుళ్యము గంభీరము అని సెలవిచ్చుచున్నాడు.

# 12వ అధ్యాయము 3+6+7+5 = 21 వచనములు
## అంశము : పరిచర్య వివరములు

**పరిచర్య నిర్వచనము - వ్యక్తిగత పరిచర్య** : ప్రభువు పట్ల చేయవలసిన యుక్తమైన పరిచర్య ఎట్లనగా 1. పరిశుద్ధమైనదిగా నుండాలి, 2. దేవునికి అనుకూలమైన సజీవ యాగముగా శరీరములను ఆయనకు సమర్పించాలి, 3. లోక మర్యాదలను అనుసరింప కూడదు, 4. ఉత్తమమైన, అనుకూలమైన, సంపూర్ణమైన దేవుని చిత్తమును పరిక్షించి తెలిసికోవాలి, 5. మనసులు మారి రూపాంతరము పొందినవారముగా నుండాలి. 6. తన్నుతాను ఎంచుకొన తగిన దానికంటే ఎక్కువగా ఎంచుకొనరాదు. తాను కలిగిన విశ్వాస పరిమాణం ప్రకారం తగిన రీతిగానే ఎంచుకొనాలి, 7. ఘనత విషయములో ఒకనినొకడు గొప్పగా ఎంచుకొనాలి (1:10)

**పరిచర్యలో వరములను వాడుకొనుట సంఘ పరిచర్య (4-9వ.)** : ఒక శరీరములో అనేక అవయవములుండగా ఒక్కొక్క దానికి వేరు వేరు పనులున్నట్లు దేవుడు తన కృపను బట్టి ఒక్కొక్కరికి వేరు వేరు కృపావరముల నిచ్చియున్నాడు. 1. ప్రవచనము, 2. సహాయకరమైన సేవ, 3. బోధించుట, 4. హెచ్చరించుట, 5. పంచిపెట్టుట, 6. పై విచారణ చేయుట, 7. కరుణించుట. 8. నిష్కపటమైన ప్రేమ కలిగి చెడ్డదానిని అస హ్యించుకొని, మంచి దానిని హత్తుకొనుచు పని జరిగించాలి. వరముల వివరములు 1 కొరింథీ. 12:8-11వ,28వ.లో కలవు.

**సహోదరులపట్ల పరిచర్య (10-16వ.)** : 1. సహోదరులను ప్రేమించుటలో ఒకరియందొకరు అనురాగము కలవారుగా ఉండాలి. 2. ఘనత విషయములో ఒకరి నొకరు గొప్పగా ఎంచుకొనాలి. 3. ఆసక్తి విషయములో మందులుగా నుండకూడదు. 4. ఆత్మయందు తీవ్రత కలిగియుండాలి. 5. నిరీక్షణ కలవారై సంతోషముగానుండాలి. 6. శ్రమలయందు ఓర్పుగలవారైయుండాలి. 7. ప్రార్థనయందు పట్టుదల కలవారై యుండాలి. 8. పరిశుద్ధుల అవసరములలో పాలు పొందాలి. 9. శ్రద్ధగా అతిధ్యమివ్వాలి. 10. హింసించు వారిని దీవించాలి కాని శపించకూడదు. 11. సంతోషించు వారితో సంతోషించాలి. 12. ఏడ్చు వారితో ఏడవాలి. 13. ఒకనితో ఒకనిగా మనసు కలిగియుండాలి. 14. హెచ్చు వాటియందు మనస్సుంచక తగ్గువాటియందు ఆసక్తి కలిగియుండాలి. 15. ఎవరికి వారే బుద్ధిమంతులమని అనుకొనకూడదు.

**మనుష్యులందరి పట్ల పరిచర్య (17-21)** : 1. కీడుకు ప్రతికీడు మనుష్యులలో ఎవరికి చేయకూడదు. 2. అందరి దృష్టికి యోగ్యమైన దానిని గూర్చి ఆలోచన కలిగి యుండాలి. 3. సమస్తమైన మనుష్యులతో సమాధానము శక్యమే. 4. మనకు మనమే పగ తీర్చుకొనక దేవుని ఉగ్రతకు చోటివ్వాలి. ఎందుకనగా పగ తీర్చుట కాని ఫలమిచ్చుట కాని దేవుని పనియే. 5. శత్రువు ఆకలిగొంటే అతనికి భోజనము పెట్టాలి. 6. దప్పిగొంటే దాహమివ్వాలి. 7. కీడు వలన జయింపబడక మేలు చేత కీడును జయించాలి.

## 13వ అధ్యాయము 4+3+3+4=14 వచనములు
## అంశము : పరిచర్యలోని వివరములు

**బాహ్య ప్రపంచములో అధికారుల పట్ల పరిచర్య (1-4వ.)** : 1. ప్రతి అధికారము దేవుని వలన కలిగినది. 2. అధికారులు దేవుని వలన నియమింపబడిరి. 3. కావున అధికారులకు లోబడి ఉండాలి. 4. అధికారుల నెదిరించువాడు దేవుని నియమమును ఎదిరించి తనకు తానే శిక్ష తెచ్చుకొనువాడు. 5. మేలు కలుగుటకు అధికారులు దేవుని పరిచారకులు. 6. కీడు చేయువారి మీద చెడు చేయువారి మీదను ఆగ్రహము చూపుటకు వారు దేవుని పరిచారకులు. 7. చెడ్డ కార్యములకే కాని మంచి కార్యములకు భయంకరులు కారు. కనుక అధికారులకు మేలు చేసి వారితో మెప్పు పొందాలి.

**అధికారులు సుంకమునకు సన్మానమునకు పాత్రులు (5-7 వ.)** : 1. అధికారులు దేవుని సేవకులు, 2. ఎల్లప్పుడు పని కలిగియుందురు. కనుక వారికి పన్ను చెల్లించాలి. 3. సుంకము చెల్లించ వలసిన వారికి సుంకము చెల్లించాలి. 4. ఎవరికి భయపడవలెనో వారికి భయపడాలి. 5. ఎవరిని సన్మానించాలో వారిని సన్మానించాలి. 6. అందరికి వారి వారి రుణములు తీర్చాలి.

**ఇరుగు పొరుగు వారిని ప్రేమించు పరిచర్య (8-10)** : 1. ఒకరినొకరు ప్రేమించుటలో తప్ప ఎవనికిని అచ్చియుండకూడదు. 2. పొరుగు వారిని ప్రేమించుట ధర్మ శాస్త్రమును నెరవేర్చుటయే ఎందుకనగా ధర్మశాస్త్రములోని నైతిక ఆజ్ఞలన్ని అందులో ఇమిడియున్నవి. 3. ప్రేమ పొరుగువారికి కీడు చేయదు. ప్రేమను గూర్చిన వివరములు పుస్తకము చివరిలో కలవు.

**పరిచర్యలోని నిరీక్షణ మెలకువలు (11-4)** : కాలముల నెరగాలి, ఇప్పుడు విశ్వాసు లందరు నిద్ర మేలుకొను వేళయైనదని తెలిసికొనాలి. రాత్రి చాలాగడచి పగలు

సమీపముగానున్నందున అంధకార క్రియలు విసర్జించాలి - తేజస్సంబంధమైన యుద్ధోపకరణములు ధరించుకొనాలి. 1. అల్లరితో కూడిన ఆట, 2. అల్లరితో కూడిన పాట, 3. మత్తు, 4. కామ విలాసములు, 5. పోకిరి చేష్టలు, 6. కలహములు, 7. మత్సరములు ఉండరాదు, 8. పగటియందు నడుచుకొన్నట్లు మర్యాదగా నడవాలి, 9. ప్రభువైన క్రీస్తును ధరించుకొనాలి, 10. శరీరేచ్ఛలు నెరవేర్చుకొనుటకు ఆలోచన చేసుకొనకూడదు.

## 14వ అధ్యాయము 4+4+4+4+4+3=23 వచనములు
## అంశము : బలహీనుల పట్ల పరిచర్య

**తిండి విషయములో బలహీనుల పట్ల పరిచర్య (1-4వ.)** : విశ్వాసులైన వారు తిండిని గూర్చిన విశ్వాస విషయములో కొన్నిసార్లు బలహీనులగుదురు. అటువంటి వారిలో కూరగాయలనే తినువారున్నారు. ఇతరులు సమస్తమును తినవచ్చని నమ్ముచున్నారు. ఈ విషయములలో ఒకరొకొకరు తీర్పు తీర్చకూడదు. ఇతరులు దేవుని సేవకులు వారిని నిలువబెట్టుకొనుట దేవుని చిత్తమే కనుక పరుని సేవకులకు మనము తీర్పు తీర్చక వారిని చేర్చుకొనవలెను.

**దినములను లక్ష్యపెట్టు వారి పట్ల పరిచర్య (5-8వ.)** : ఒకరు ఒక దినముకంటే మరొక దినమును మంచిదని ఎంచుచున్నారు. హెబ్రీ. 10:1-2వ ప్రకారము ధర్మశాస్త్రము రాబోవుచున్న మేలుల ఛాయ, నిజ స్వరూపము కలది కాదు. ధర్మశాస్త్రమందు రాబోవు ఆత్మీయ మేలులను చూపు కొన్ని పండుగ దినములు కలవు. విశ్రాంతి దినాచరణ, పస్కా పండుగ మొదలగునవి. కొద్ది మంది బలహీనులై వాటిని క్రొత్త నిబంధన కాలమందు ఆచరించువారున్నారు. తినుట తినకుండుట దినములను లక్ష్యపెట్టుట అన్నియు ప్రభువు కొరకే చేయాలి. మనలో ఎవరమైన బ్రతికినను ప్రభువు కొరకే బ్రతకాలి. క్రీస్తు చనిపోయి బ్రతికినందున ఆయన అందరికి ప్రభువు. మనమును ప్రభువు వారము.

**ప్రతివారును ఎవరికి వారే లెక్క అప్పగించుట (9-12 వ.)** : ఎదుటి సహోదరునికి తీర్పు తీర్చక, నిరాకరించకనుండాలి. మనలో ఒక్కొక్కరము దేవుని న్యాయపీఠము ఎదుట 2 కొరింథీ. 5:10 ప్రకారము నిలువాలి, లెక్క అప్పగించాలి. దేవుడు తీర్పు తీర్చి ఒక్కొక్కరికి మన క్రియలకు ఫలమిచ్చువాడు.

**ఒకనినొకరు ఆటంకపరచకుండుట - తీర్పు తీర్చకుండుట (13-16 వ.)** : భోజన విషయములో ఏదియు నిషిద్ధము కానందున, భోజన విషయములో ఆటంకము కలిగించకూడదు. ఆలాగు చేయుట ద్వారా సహోదరుడు అభ్యంతరపడి ఆత్మీయతలో వెనుకపడిన యెడల ఎవరి నిమిత్తము క్రీస్తు చనిపోయెనో అది నిరర్థకమగును.

**దేవుని రాజ్యము భోజన పానాదులు కావు - నీతి సమాధానము ఆనందము (17-20వ.):** దేవుని రాజ్యము, నీతితోను, సమాధానముతోను ఆనందముతోను కూడినది. భోజన పానాదులతో కూడినది కాదు. దేవుని పనిలో సమాధానము, పరస్పర క్షేమాభివృద్ధి కలుగ చేయువాటిని ఆసక్తితో వెంటాడుచు ముందుకు సాగాలి కాని, భోజనము నిమిత్తము దేవుని పని పాడు చేయకూడదు. సమస్త పదార్ధములు పవిత్రములు. మంచివే అయినందున అనుమానించక భుజించాలి. అనుమానించి తినిన యెడల అది దోషమగును.

**విశ్వాస మూలము కానిదే పాపము (21-23వ.) :** దేవుని పనిలో సహోదరులకు ఆటంకమైన వాటిని తినుట, త్రాగుట, మానివేయుట మంచిది. ఎవరి విశ్వాసము కొలది వారు ముందుకు సాగాలి. కాని అనుమానించువాడు విశ్వాసము లేకుండా భుజించుచున్నాడు కనుక "విశ్వాస మూలము కానిది ఏదో అది పాపము". పాపము యొక్క నిర్వచనములు చివరి పేజీలో కలవు.

**క్రీస్తు మనలను చేర్చుకొన్నట్టు బలహీనులను చేర్చుకొను పరిచర్య (154 అధ్యా. 1-7వ):** క్రీస్తు తన్ను తాను సంతోష పరచుకొనలేదు. పొరుగువారమైన మనలను సంతోషపరచుటకై నిందలను భరించాడు. కావున బలవంతులైన సహోదరులు తమ్మును తాము సంతోష పరచుకొనక బలహీనుల దౌర్బల్యములను భరించుచూ పొరుగువారికి క్షేమాభివృద్ధిని కలిగించాలి. బలవంతులు, బలహీనులు మన మందరము కలసి దేవునికి మహిమ కలుగునట్లు ఒకరినొకరు చేర్చుకొని ఒకరితో నొకరు మనసు కలిగియుండాలి. ఓర్పునకు ఆదరణకు, నిరీక్షణకు కర్తయైన దేవుడు అటువంటి మనసును అనుగ్రహించాలి అని దేవుని వేడుకొనుచున్నాడు.

## 15వ అధ్యాయము 7+6+8+3+5+4=33 వచనములు
## అంశము : బలహీనులను చేర్చుకొను పరిచర్య
## ప్రకటించు పరిచర్య - పేదల కొరకైన పరిచర్య

**14వ అధ్యాయములో చూచితిమి (1-7వ) :**

**యూదులకు, అన్యులకు అంగీకారమైన సువార్త ప్రకటన పరిచర్య (8-13వ.) :** ఇశ్రాయేలీయులలోని పితరులకు దేవుడు చేసిన వాగ్దాన ప్రకారము క్రీస్తు సున్నతి గలవారికి అనగా యూదులకు పరిచారకుడయ్యాడు. 9-11వ. అన్యజనులలో నిన్ను స్తుతించుదును. (కీర్తనలు 18:49) అన్యజనులారా ఆయన ప్రజలతో సంతోషించుడి.

(ద్వితీ. 32:43) అన్యజనులారా ప్రభువును స్తుతించుడి. (కీర్త. 117:1). యెష్షయి వేరు చిగురునందు అన్యజనులు నిరీక్షణనుంచుదురు. (యెషయా 11:10). పై వచనముల ఆధారముగా యూదులు, అన్యులు విశ్వాసము ద్వారా సమస్తానందముతోను, సమాధానముతోను నింపబడుదురు కనుక సువార్త ప్రకటన యూదులను అన్యులను సమానముగా క్రీస్తు అంగీకరించు పరిచర్యయని గుర్తించవలెను.

**పౌలుకు అనుగ్రహించబడిన ప్రకటించు పరిచర్య (14-21వ.)** : అన్యజనులు పరిశుద్ధ పరచబడి దేవునికి ప్రీతికరమైన అర్పణయగునట్లు యాజక ధర్మము జరిగించుటకై దేవుడు పౌలుకు కృపననుగ్రహించి పరిచారకుడుగా నియమించాడు. క్రీస్తు వాక్యము ద్వారాను, క్రియల చేతను, గురుతుల బలము చేతను, మహాత్కార్యముల బలము చేతను, పరిశుద్ధాత్మ బలముచేతను పౌలుద్వారా అన్యజనులు క్రీస్తుకు విధేయులయ్యారు. పౌలు ఇందు నిమిత్తము యెరూషలేము నుండి ఇల్లూరి వరకు (బైబిల్ గ్రంథములోని పౌలు ప్రయాణముల పటములో చూచిన యెడల కుడివైపు క్రింద నుండి ఎడమ వైపు పై వరకు) సువార్త పూర్ణముగా ప్రకటించాడు. మిక్కిలి ఆశగలవాడై యెషయా 52:15 ప్రకారము క్రీస్తు నామమెరుగని చోట్ల ప్రకటించవలెనని చెప్పుచున్నాడు.

**పౌలు ప్రకటనకైన ప్రయాణము (22-2వ.)** : పౌలు రోమా పత్రికను వ్రాయు వరకు రోమాను దర్శించలేదని మొదటి అధ్యాయము 13వ వచనములో చూచితిమి. సువార్తలో తనకున్న మిక్కిలి అపేక్షను బట్టి రోమాకు తదుపరి స్పెయిన్ వెళ్ళవలెనన్న తన తలంపును తెలుపుచున్నాడు. (విడుదల కాలములో వెళ్ళిన ప్రదేశముల పటము చూడండి)

**సువార్త ప్రకటనతో కలిసిన పేదల కొరకైన పరిచర్య (25-29వ.)** : పరిశుద్ధులలో పేదలకొరకు మాసిదోనియా వారు, అకయవారు చందా వేసిన సొమ్మును తీసుకొని యెరూషలేములోని వారి కప్పగించుటకై వెళ్ళుచున్నాడు. పరిశుద్ధులలో పేదలకు చేయు పరిచర్యయు ఫలమని చెప్పుచున్నాడు. ఈ పరిచర్య ముగించి రోముమీదుగా స్పెయిన్‌కు వెళ్ళుదునని తెలుపుచున్నాడు. ఆత్మ సంబంధమైన విషయము మాత్రమే కాక, శరీర విషయములలో కూడా పాలివారుగా ఉండవలెనని సెలవిచ్చుచున్నాడు.

**పరిచర్య కొరకు ప్రార్థన కోరిన పౌలు (30-33వ.)** : పరిశుద్ధులలో పేదల కొరకు చేయబడు పరిచర్య ప్రభువుకు ప్రీతికరమగునట్లు ప్రార్థించమని కోరుచున్నాడు. తదుపరి రోమాకు వచ్చి చేయవలసిన పరిచర్య కొరకును ప్రార్థనలో పోరాడమని వారిని బ్రతిమాలు కొనుచున్నాడు. ఆమేన్ అని పత్రికను ముగించుచున్నాడు.

# 16వ అధ్యాయము 4+4+4+4+4+4+3=27 వచనములు
## అంశము : వందనములు - ముగింపు

వందనములు చెప్పుటయు పరిచర్యలో ఒక భాగమే. వందనములు చెప్పవలసిన విధమును నేర్చుకొనవలెను.

**పరిచారకురాలగు ఫీబే - జత పనివారగు ప్రిస్కిల్ల, అకుల (1-4వ.) :**

**పరిచారకురాలగు ఫీబెను చేర్చుకొనుటకు సిఫారసు (1-2వ.) :** కెంక్రేయ సంఘ పరిచారకురాలగు ఫీబే పౌలునకు సహాయము చేసెనని తెలుపుచూ పరిశుద్ధులగు తగినట్లు చేర్చుకొని సహాయము చేయుమని చెప్పుచున్నాడు. ఇటువంటి పరిచర్యలకు సిఫారసు అవసరము.

**3-16వ వచనములలోని వందనములు :** 14 వచనములలో సుమారు 20 పర్యాయములు వందనములు, 27 మందికి చెప్పుచున్నాడు. ఒక్కొక్కరు దేవుని పనిని జరిగించు విధము కూడా చెప్పబడినది.

**3-4 వచనము** : ప్రిస్కిల్ల అకుల - జతపనివారు.

**5-8, 9-12, 13-16వ వచనములు - పనివారు - వారి వివరములు :**

**5వ వచనము** : ఎపైనెటు - ఆసియాలో క్రీస్తుకు ప్రథమ ఫలము.

**6వ వచనము** : మరియ - రోమా వారి కొరకు బహుగా ప్రయాస పడినది.

**7వ వచనము** : అంద్రోనీకు, యూనీయా - పౌలు తోడి ఖైదీలు - అపొస్తలులలో ప్రసిద్ధి కెక్కినవారు - పౌలుకంటే ముందు క్రీస్తులోనున్నవారు.

**8వ వచనము** : అంప్లీయతు - ప్రభువునందు పౌలుకు ప్రియుడు.

**9వ వచనము** : ఊర్బాను, స్టాకు - క్రీస్తునందు జతపనివారు.

**10వ వచనము** : అపెల్లెకు - క్రీస్తునందు యోగ్యుడు.

**12వ వచనము** : త్రుఫైనా, త్రుఫోసా - ప్రభువునందు ప్రయాసపడువారు. పెర్సిసు ప్రభువునందు బహుగా ప్రయాసపడినది.

**13వ వచనము** : రూపుతల్లి - పౌలుకును తల్లివంటిది.

**14-15వ వచనములు** : పదిమంది పరిశుద్ధులకు వందనములు చెప్పబడినవి.

**16వ వందనములు చెప్పు విధము** : పవిత్రత కలిగి, ముద్దు పెట్టుకొని వందనములు చెప్పాలి.

**నేర్చుకొనిన పరిచర్యకు వ్యతిరేకమైన బోధకుల నుండి తొలగిపోవలెనని హెచ్చరిక (17-20వ.)** : నేర్చుకొనిన బోధకు వ్యతిరేఖముగా బేధములు, ఆటంకములు కలిగించు వారిని కనిపెట్టుట, వారి నుండి తొలగిపోవుట. వారు కడుపుకు దాసులు. ఇంపైన మాటల వలన నిష్కపటుల మనసులను మోసపుచ్చుదురు. అటువంటి వారి విషయము జాగ్రత్తగా ఉండాలి. మేలుకరములైనవి, కీడుకరములైన వాటిని గూర్చిన హెచ్చరిక కలదు. సాతానుకు ఓటమిని దేవుడిచ్చునని సెలవిచ్చుచున్నాడు.

**పౌలుతోనున్న పనివారల వివరములు (21-24వ.) వారు చెప్పుచున్న వందనములు:**

**21వ వచనము** : తిమోతి - జతపనివాడు.

**22వ వచనము** : తెర్తియు - పౌలు చెప్పుచుండగా ఈ పత్రిక వ్రాసినవాడు.

**23వ వచనము** : గాయి - పౌలుకు ఆతిథ్య మిచ్చినవాడు. సంఘము తన ఇంటిలోనున్నది. ఎరస్తు పట్టణ ఖజానాదారుడు.

**24వ వచనము** : క్రీస్తు కృపతో పత్రిక ముగింపు.

**25-27వ వచనము ముగింపు** : అనాది కాలము నుండి రహస్యముగా నుంచబడిన మర్మము అనగా అన్యజనులు విశ్వాసమునకు విధేయులగునట్లు పౌలు సువార్త ప్రకటన ప్రకారము రోమాలోని పరిశుద్ధులను దేవుడు స్థిరపరచుటకు శక్తిమంతుడని ఆయనకు కలుగు నిరంతర మహిమను గూర్చి తెలుపుచూ పత్రిక ముగించుచున్నాడు. (మర్మములను గురించిన వివరములు కొలొస్సయి 1వ అధ్యాయము చివర కలవు)

# కొరింథీయులకు వ్రాసిన పత్రికలు

కొరింథు పట్టణ చరిత్ర : కొరింథు పాత పట్టణము క్రీస్తు పూర్వం 1500 ఏండ్లలో కట్టబడింది. క్రీ.పూ. 146లో రోమా వారిచే నాశనము చేయబడింది. కానీ క్రీ.శ. 46లో కైసరు చక్రవర్తి మరలా కట్టించెను. గ్రీసు దేశంలో దక్షిణ - ఉత్తర ప్రాంతములను వేరు చేయు 4 మైళ్ళు వెడల్పు గల భూభాగమున కొరింథు పట్టణము కలదు. గ్రీసు దేశానికి తూర్పు పడమరలలోనున్న దేశముల మధ్య వ్యాపారస్తులు గ్రీసు దేశము చుట్టూ తిరుగక కొరింథుగుండా వెళ్ళుట వలన దూరము తగ్గును. సముద్ర దొంగల బారి నుండి తప్పింప బడుదురు. అందుచే అందరూ కొరింథు గుండా వెళ్ళుట వలన ఆ పట్టణము బహు ధనము సంపాదించు వ్యాపార సంబంధమైన పట్టణముగా నుండెను. అపొల్లో దేవత గుడి గల పట్టణము. అందులో 1000 మంది దేవ దాసీలు ఉండుట వలన బహుగా వ్యభి చారముతోను, విగ్రహాలతోను నిండిన పట్టణము. ఏథెన్స్ దీనికి సుమారు 4 మైళ్ళ దూరమందుండి నావికా బలమును కలిగిన పట్టణము. గ్రీసు దేశమంతటిలో ప్రాముఖ్యమైన పట్టణము. స్పార్ధా అను పట్టణములో మిగిలిన రాణువవారు ఉండిరి. తూర్పున 8 1/2 మైళ్ళలో కెంక్రేయ గలదు. కొరింథు పట్టణము గుండా ఓడలు పోగలిగినంత కాలువను 4 మైళ్ళ భూభాగమందు త్రవ్విరి. గ్రీసు దేశము ఇప్పుడు పెద్ద భూభాగమై ఉత్తరమున థెస్సలోనిక పై వరకు వ్యాపించినది. దక్షిణమున క్రేతు ద్వీపము కూడా ప్రస్తుతము గ్రీసు దేశములోను పౌలు అ.కా. 27 అధ్యాయములో ప్రయాణము చేసిన రోదు. క్నేదు వంటి వందలాది దీవులును గ్రీసులోనే ప్రస్తుతమున్నవి. గ్రీసులో నేడు ఇది ఒక కోటి జనాభా ఉన్నారు. 1.31. లక్షల చదరపు కిలోమీటర్ల వైశాల్యము గల దేశము. గ్రీసు దేశానికి ప్రస్తుతము ఏథెన్స్ ముఖ్య పట్టణముగా ఉన్నది. కాని నాటి గ్రీసు దేశానికి ఎథెన్స్ ఉత్తరమున, కొరింథు పట్టణము దక్షిణమున ముఖ్య పట్టణములు. పౌలు అ.కా. 17లో ఏథెన్సులోను 18 అధ్యా. కొరింథులోను సేవ చేశాడు. గ్రీసులోనే ఒలింపిక్ ఆటలు (ఒలింపియార్)లో క్రీ.పూ. 776లో ప్రారంభము అయినవి. ఒలింపిక్స్ మొదట 5 దినములు జరిగెడివి. అప్పటిలో స్త్రీలు పాల్గొనేవారు కారు. గ్రీసు దేశమంతటి నుండి పురుషులు మాత్రమే పాల్గొనేవారు. క్రీ.శ. 394 వరకు కొనసాగినవి. పిమ్మట రోమా చక్రవర్తి వాటిని ఆపివేసెను. తిరిగి క్రీ.శ. 1896లో ప్రారంభమై ప్రతి 4సంIIలకు ఒక్కసారి ఆయా దేశములలో జరుగును. క్రీ.శ. 1922 నుండి స్త్రీలునూ పాల్గొనుచున్నారు. 1 కొరింథీ. 9:24-26లో పందెపు రంగము, పరుగెత్తుట, పోట్లాడుటను గురించి మాటలాడుచున్నాడు.

ప్రాచీన ప్రపంచపు ఏడు వింతలలో ఒక వింతైన జూపిటర్ విగ్రహము గ్రీసు దేశములోని ఒలింపియర్‌లో కలదు. దీనినే అపోస్తలుల కార్యము 19:34వ వచనంలో

ద్యుపతిగా చూడగలము. ఇది పిమ్మట అగ్నిమంటలలో క్రీ.పూ. 5వ శతాబ్దంలో కాలి పోయినది.

కొరింథు పట్టణము పై కారణములను బట్టి క్రొత్త నిబంధన కాలమున ప్రాముఖ్య పట్టణముగాను, విగ్రహారాధనచేతను, ధనము చేతను, వ్యభిచారము చేతను అనగా శరీరాశలు, శరీర అతిశయముతో నిండిన పట్టణముగా చూడగలము.

**కొరింథు సంఘస్థాపన** : కొరింథు అనగా వెక్కసముగా సంతృప్తి చెందినది అని అర్థము. కొరింథు పట్టణమును పౌలు క్రీ.శ. 52లో తన రెండవ (సేవాయాత్ర) దండయాత్రలో సందర్శించి అక్కడికి రోమా నుండి క్రొత్తగా వచ్చిన అకుల, ప్రిస్కిల్లాతో కలసి సువార్తను ఆతురముగా బోధించగా కొరింథీయులలో విగ్రహారాధికులైన అనేకులు, ఆయా పాపములలోనున్న అనేకులు, జారులు, సమాజ మందిరపు అధికారి ఇంటి వారందరూ విశ్వసించి బాప్తీస్మము పొందిరి. రాత్రివేళ ప్రభువు దర్శనము నందు భయపడక మాట్లాడుము. మౌనముగా నుండకుము. నేను నీకు తోడై ఉన్నాను. అనగా 1½ సం॥లు అక్కడ ఉండెను. అపొస్తలుల కార్యములో 18వ అధ్యాయములోని 18వ వచనములలో కొరింథులో చేసిన 18 నెలల సేవా వివరాలు కలవు. పిమ్మట పౌలు అకుల, ప్రిస్కిల్లాలు ఎఫెసుకు వెళ్ళిరి. పౌలు వారినక్కడ విడిచి అంతియొకయకు వెళ్ళెను. అలెక్సెంద్రియా వాడైన అపొల్లో ఎఫెసుకు వచ్చి అకుల, ప్రిస్కిల్లాల వలన బలపడి కొరింథుకు పంపబడెను. కొరింథుకు వచ్చి విశ్వసించిన కొరింథీయులకు చాలా సహాయము చేసెను. పౌలు 3వ సేవాయాత్రలో ఎఫెసులో 3 సం॥లు ఉండెను. క్రీ.శ. 56సం॥లో పెంతెకొస్తు ముందు క్రీ.శ. 56 జూన్ముందు (1 కొరింథు 16:9). కొరింథు నుండి స్తెఫను, అకాయికు అనువారు జాబు తీసుకొనిరాగా కొరింథీయులలో తనకు తెలిసిన లోపాలు, వారు వ్రాసిన లోపములు విమర్శించిన లోపములు, కూడి వచ్చుటలోని లోపములకును జవాబుగా కొరింథీయుల మొదటి పత్రిక వ్రాసి తిమోతిని వారితో కూడా పంపెను.

**పత్రిక అంశము** : లోపములు దిద్దుట.

**పత్రిక విభజన** : 6+2+2+6=16 అధ్యాయాలు.

**1-6 అధ్యాయాలు** : తెలియవచ్చిన లోపాలు దిద్దుట.

**7-8 అధ్యాయాలు** : వ్రాసిన విషయములలోని లోపాలను దిద్దుట.

**9-10 అధ్యాయాలు** : విమర్శించిన విషయములలోని లోపాలను దిద్దుట.

**11-16 అధ్యా.** : కూడి వచ్చి వరములను వాడుకొనుటలోని లోపములు దిద్దుట.

2 కొరింథీ 1:1లో కొరింథులోను, అకయయందంతటను ఉన్న పరిశుద్ధులకని వ్రాయబడినందున కొరింథిలో నున్న 18 మాసాలలో అకయ దేశములోని మరికొన్ని స్థలాలలో ఆయన పని చేసి సంఘము లేర్పరచెనని తలంతుము.

1 కొరింథు 5:9లో జారులతో సాంగత్యము చేయవద్దని నా పత్రికలో మీకు వ్రాసి ఉంటిని అన్నందున మొదటి కొరింథు పత్రిక కంటె ముందుగా మరియొక పత్రిక వ్రాసినాడు. దాని వివరములు మనకు లభ్యము కాలేదు. బైబిల్‌నందలి మొదటి కొరింథు పత్రిక నిజానికి రెండవ పత్రికగా తలంచగలము. అటులయిన బైబిల్‌లోని రెండవ పత్రిక నిజానికి మూడవ పత్రిక కాగలదు. 2వ కొరింథు 7:8,9 వచనములలో నా పత్రిక దుఃఖపెట్టినందున మీరు మారుమనస్సు పొందినవారు అని సంతోషించుచున్నాను కాని 2వ కొరింథీ. 2:5-8లో అట్టి మారుమనస్సు పొందిన వానిని ఇకను శిక్షింపక క్షమించి ఆదరించుట మంచిది లేని ఎడల వాడు దుఃఖములో మునుగునని బ్రతిమాలుచూ ఈ రెండో పత్రిక (3వ పత్రిక) వ్రాసెను.

2వ కొరింథీ 2:5-7 వచనములలో మొదటి కొరింథీ 5వ అధ్యాయములో జారత్వము జరిగించిన వాడు దిద్దుకొన్నట్లున్నది. 2వ కొరింథీ 12:2లో జారత్వము జరిగించి మారుమనస్సు పొందని వారిని గూర్చి దుఃఖపడవలసి వచ్చునేమో అని భయపడు చున్నాను, అని అన్నందున 10 నుండి 13 అధ్యాయాలు, రెండవ అధ్యాయము కంటె ముందటి సంగతులు అని గమనించగలము. అందువలన 10-13 అధ్యాయాలు 3వ పత్రికగాను, 1-9 అధ్యాయాలు నాలుగవ పత్రికగానూ కూడా తలంచవచ్చును.

2వ కొరింథు 2:12, 4:7ను బట్టి మాసిదోనియా నుండి వ్రాసెనని క్రీ.శ. 57 వ్రాసెనని తలంచగలము.

# రెండవ కొరింథీ పత్రిక

**పత్రిక అంశము** : పరిచర్య.

**పత్రిక విభజన** : 2+4+1+2+4=13 అధ్యా.

**1-2 అధ్యా.** : ప్రభువు నందలి జీవించు పరిచర్య.

**3-6 అధ్యా.** : ప్రభువు నందు చేయవలసిన పరిచర్య.

**7వ అధ్య.** : ప్రభువునందు ప్రత్యేకత గల పరిచర్య.

**8-9 అధ్యా.** : ప్రభువు కిచ్చు పరిచర్య.

**10-13 అధ్యా.** : ప్రభువు నందు (తన్ను) భద్రపరచుకొను పరిచర్య. (పౌలు పై విమర్శకు జవాబులు - ఋజువులు)

# కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక

గ్రంథకర్త : పౌలు . కాలము : క్రీ.శ. 56 (16:9). స్థలము : ఎఫెసీ. (16:9). కొనిపోయిన **వారు** : స్తెఫను (16:17).

**ముఖ్య ఉద్దేశము** : లోపములు దిద్దుట.

1) పౌలు మొదటి కొరింథీ. 3:6లో నేను నాటితిని, అపొల్లో నీళ్ళు పోసెను అనుట వలన కొరింథి సంఘములో వీరిరువురు పని చేసిరని లేఖనముల వలన తెలియు చున్నది. నేను కేఫావాడను, అని కొందరు అనుటను బట్టి పేతురు పరిచర్యలో మేలుపొందినవారు కూడా కొరింథు సంఘములో గలరని తలంచగలము. అతి విద్య చదివిన పౌలు (అ.కా. 26:24) విద్యలేని పామరుడైన పేతురు (అ.కా. 4:13). విద్వాంసుడైన అపొల్లో (అ.కా. 18:24), వీరికి పరిచయమైనందున కొరింథీయులకు పరిచారకులైన వీరు కలిగినట్టి లోకజ్ఞానమును బట్టి అభిప్రాయ బేధములు కలిగినవి. అందుచేత లోకజ్ఞానమును ఆధారము చేసికొనుటలో లోపములను 1,2 అధ్యాయాలలో తెలిపెను. 2) పనిని గూర్చి పరిచారకులను గూర్చిన అవగాహనలోని లోపములను 3,4 అధ్యాయాలలో తెలిపెను. 3) పట్టణములో వ్యభిచారముండుట చేత విశ్వసించిన కొరింథీయులలోను జారత్వముండుట ఒకరిపై ఒకరు అన్యుల ఎదుట వ్యాజ్యమాడుట లోపములని 5,6 అధ్యాయాలలో తెలిపెను. 4) వివాహ జీవితమును గూర్చి 7వ అధ్యాయములో తెలిపెను. 5) విగ్రహార్పితమైనది భుజించుటను గూర్చియు అందులోని లోపములను 8 అధ్యాయాలలో తెలిపెను. 6) పనివారలను గూర్చిన విమర్శలకు జవాబును 9వ అధ్యాయములో తెలిపెను. 7) పితరుల జీవితములోని లోపములను 10వ అధ్యా. తెలిపెను. 8) కూడి వచ్చుటలోను, 9) ప్రభువు రాత్రి భోజనము చేయుటలోని లోపమును 11వ అధ్యాయములోను, 10) ఆత్మీయ వరములను తెలుసుకొనుటలోని లోపములను గూర్చి 12వ అధ్యాయములోను, 11) ప్రేమలేని తనమను లోపమును గూర్చి 13వ అధ్యాయములోను, 12),13) ఆత్మ సంబంధమైన వరములను వాడుకొనుటలోని లోపములను 14వ అధ్యాయాలలోనూ, 14) పునరుత్థానమును గూర్చిన అవగాహనలోని లోపములను 15వ అధ్యాయములోను, 15) చందా పోగుచేయుటలోని లోపములను 16వ అధ్యాయములో వ్రాయుచూ ముగింపు మాటలు పలికెను.

# అధ్యాయముల విభజన 6+2+2+6=16 అధ్యా.

**I. 1-6 అధ్యా. తెలియవచ్చిన లోపములను దిద్దుట :**

**1) 1-2 అధ్యాయము** : లోకజ్ఞానమును ఆధారము చేసుకొని విభజింపబడుట అను లోపము.

**2) 3-4 అధ్యాయము** : పని పరిచారకులను గూర్చిన అవగాహనలోని లోపము.

**3) 5-6 అధ్యాయము** : జారత్వము, వ్యాజ్యము అను లోపములు.

**II. 7-8 అధ్యాయాలు వ్రాసిన విషయంలోని లోపములను దిద్దుట :**

**4) 7వ అధ్యాయము** : వివాహ జీవితమును గూర్చి అవగాహనలోని లోపములు.

**5) 8వ అధ్యాయము** : విగ్రహార్పితములు భుజించుటలోని లోపములు.

**III. 9-10 అధ్యాయములు విమర్శించిన విషయములోని లోపములను దిద్దుట :**

**6) 9వ అధ్యాయము** : సువార్త ప్రకటించువాడు జీవించుటలోను ప్రకటించుటలోని లోపములు.

**7) 10వ అధ్యాయము** : పితరుల దృష్టాంతముల నుండి బుద్ధి మాటలు.

**IV. 11-16 అధ్యాయములు కూడివచ్చుటలోని లోపములు దిద్దుట (వరములను వాడుకొనుట, పునరుత్థానము, చందా అను లోపములు) :**

**8) 11వ అధ్యాయము** : 1-16వ, స్త్రీ పురుష క్రమములోని లోపములు.

**9) 11వ అధ్యాయము** : 17-34వ ప్రభురాత్రి భోజనమునకు కూడి వచ్చుటలోని లోపము.

**10) 12వ అధ్యాయము** : ఆత్మీయ వరములను తెలుసుకొనుటలోని లోపములు.

**11) 13వ అధ్యాయము** : ప్రేమలేని తనము అను లోపము.

**12) 14వ అధ్యాయము** : 1-25వ. ఆత్మీయ వరములను వాడుకొనుటలోని లోపములు.

**13) 14వ అధ్యాయము** : 26-40వ. ఆరాధనకు కూడివచ్చు వరములను వాడుకొనుటలోని లోపములు.

**14) 15వ అధ్యాయము** : పునరుత్థానమును గూర్చిన అవగాహనలోని లోపములు.

**15) 16వ అధ్యాయము** : చందా పోగు చేయుటలోని లోపములు - ముగింపు.

# 1వ అధ్యాయము 9+8+8+6=31 వచనములు
# అంశము : లోకజ్ఞానమును ఆధారము చేసుకొని సహోదరులతో బేధములు కలిగి ఉండుట అను లోపము (20వ.)

**పీఠిక (1-9వ.)** : 1-3వ. సంఘ క్రమములను గూర్చి లోపములు దిద్దుటకై ఈ పత్రిక వ్రాయుచున్నందున తాను క్రీస్తు యేసు యొక్క అపొస్తలుడనని దేవుని చేత పిలువబడిన వాడనని చెప్పుచున్నాడు. సంఘములోనున్న వారిని దిద్దుట పత్రిక ఉద్దేశము కాని సంఘము అనగా 1) క్రీస్తు యేసునందు పరిశుద్ధ పరచబడినవారు. 2) పరిశుద్ధులుగా నుండుటకు పిలువబడినవారని జ్ఞాపకము చేయుచున్నాడు. సంఘమందు సమాధానము లేదు కనుక సమాధానము మీకు కలుగును గాక అని వ్రాయుచున్నాడు.

**కొరింథీయులలోనున్న తప్పులు దిద్దాలి (4-9వ.)** : కాని ముందుగా తప్పులు చెప్పకుండా 4-6 వచనములలో మీకు కృప అనుగ్రహించబడినది. క్రీస్తును గూర్చిన సాక్ష్యము మీలో స్థిరపరచబడినది. ఉపదేశములో, జ్ఞానములో మీరు ఐశ్వర్యవంతులు అంటున్నాడు. తప్పులు దిద్దాలి కాని 7-9వ వచనములలో మీరు కృపావరముల యందు లోపము లేనివారు. ప్రభువు ప్రత్యక్షత కొరకు ఎదురు చూచుచున్నారు అని మెచ్చుకొను చున్నాడు. మిమ్మును పిలిచిన నమ్మదగిన దేవుడు నిరపరాధులుగా స్థిరపరుస్తాడు అంటున్నాడు. ఎవరిలోనైన తప్పులను దిద్దవలసిన మాదిరి యిందులో చూడగలము.

**పత్రిక యొక్క ఉద్దేశము (10-17)** : మీలో ఏకభావము, ఏకమనసు, ఏక తాత్పర్యము లేవని తెలిసినది. కక్షలు, కలహములు ఉన్నవి. వ్యక్తులను ఆధారము చేసికొని విభజించ బడియున్నారు. 9వ వచనములో యేసుక్రీస్తు సహవాసమునకు మనము పిలువబడ్డామని చెప్పుచున్నాడు. అనగా వ్యక్తుల పేరున విభజించబడుట తప్పు. వరము కలిగిన సేవకులైన పౌలు, పేతురు, అపొల్లోలను గౌరవించాలి కాని వారిని మన సహవాసమునకు కేంద్రము లుగా ఎంచకూడదు. మనము పిలువబడినది యేసుక్రీస్తు సహవాసమునకు. మనకు నచ్చినవారిని బాప్తిస్మమిచ్చిన వారిని కేంద్రముగా కలిగి వారిని బట్టి విభజించబడ కూడదు. విశ్వాసులమైన మన ముఖ్య ఉద్దేశ్యము 1. సిలువ వ్యర్థము కాకూడదు అనగా, 2. సిలువను గూర్చిన వార్త ప్రకటింపబడాలి, 3. వాక్చాతుర్యము లేకుండా ప్రకటించాలి అందులో శక్తియున్నది.

**లోక జ్ఞానము చేత దేవుని ఎరుగలేము (18-25)** : లోకపు జ్ఞానులు, శాస్త్రులు. తర్కవాదులు తమ జ్ఞానము చేత దేవుని ఎరగలేరు. సువార్త ప్రకటన లోకానికి వెర్రితన

మైనను దాని మానవులునమ్మి రక్షణపొందాలి. అందుకై సిలువ వేయబడిన క్రీస్తు ప్రకటించ బడుచున్నాడు. గ్రీకులు జ్ఞానము దైవమని తలంచి జ్ఞానమును వెదకుచున్నారు. యూదులకు గ్రీసు దేశస్తులకు క్రీస్తే దేవుని శక్తి దేవుని జ్ఞానము. కనుక క్రీస్తు సిలువను గూర్చిన వార్తయే ప్రాముఖ్యమైనది కాని లోక జ్ఞానము ప్రాముఖ్యము కాదు.

**రక్షణ కొరకైన పిలుపులో లోక సంబంధమైన జ్ఞానులు సిగ్గుపరచబడిరి (26-31) :** దేవుడు పిలిచినవారిలో లోకరీతిని జ్ఞానులు, ఘనులు, అనేకులు పిలువబడక, వెర్రివారు, బలహీనులు, నీచులు, తృణీకరింపబడినవారు, ఎన్నికలేని వారు పిలువబడిరి. దేవునిచేత ఏర్పరచబడిరి. కనుక మన స్థితినిబట్టి కాక ప్రభువును బట్టియే అతిశయించాలి. పౌలు అతివిద్య చదివినవాడు (అ.కా. 26:24). అపొల్లో విద్వాంసుడు (అ.కా. 18:24) పేతురు విద్యలేని పామరుడు (అ.కా. 4:13) లోక జ్ఞానము కల పౌలు అపొల్లో వంటివారు, జ్ఞానములేని పేతురు వంటివారు కొరింథీయులకు పరిచయమైనందున, వారి జ్ఞానమును బట్టి కొరింథీయులు అతిశయించకుండ విభజింపబడకూడదని ఈ అధ్యాయములో చెప్పుచున్నాడు. సిలువ వేయబడిన క్రీస్తు సిలువను గూర్చిన ప్రకటన, దేవుని పిలుపును లక్ష్యముంచాలని లోక స్థితిగతులు, జ్ఞానమును బట్టి అతిశయించకుండ మనము క్రీస్తునందే అతిశయించాలి.

## 2వ అధ్యాయము 5+6+5=16 వచనములు
## అంశము : దేవుని జ్ఞానమునందు మర్మముగా నున్న పరిశుద్ధాత్మని శక్తి కనుక లోక జ్ఞానమును ఆధారము చేసుకొనరాదు.

**లోక జ్ఞానాతిశయము, వాక్చాతుర్యమును సువార్త ప్రకటనకు తగనివి (1-5వ.) :** లోక జ్ఞానము తనకున్నను మొదటి అధ్యాయములో చెప్పబడినట్లు జ్ఞానాతిశయముతో గాని వాక్చాతుర్యముతో గాని దేవుని శక్తి ప్రకటించలేదని చెప్పుచున్నాడు. 1) సిలువ వేయబడిన యేసునే ప్రకటించాడు. 2) జ్ఞాన యుక్తమైన తియ్యని మాటలు వినియోగించలేదు, 3) పరిశుద్ధాత్మయు దేవుని శక్తియు కనుపరచు దృష్టాంతములనే వినియోగించాడు. శరీరమునకు, లోక జ్ఞానమునకు మనము తావియ్యని యెడల పరిశుద్ధాత్మ తన కార్యము జరిగించును.

**లోక జ్ఞానము (కాక) మరుగైన దేవుని జ్ఞానము (6-11వ.) :**

**దేవుని ఆత్మ బయలు పరచిన సంగతులు బోధించాలి (12-16వ.) :** క్రీస్తునందు పరిపూర్ణుల (పసి బిడ్డలు కాక ఎదిగినవారు) మధ్య దేవుని జ్ఞానము బోధించాలి. దేవుని

జ్ఞానమనగా, 1) ఈ లోక జ్ఞానము కాదు, 2) లోకాధికారులు తమ జ్ఞానముతో లోకమును పరిపాలించ గలరు. దేవుని జ్ఞానము దానికి భిన్నమైనది, 3) దేవుని జ్ఞానము మర్మముగా నున్నది. 4) ఈ జ్ఞానము జగదుత్పత్తి నుండి మరుగుగానున్నది. 5) లోకాధికారుల కది అర్థము కాలేదు, కావున క్రీస్తును సిలువ వేసిరి, 6. దేవుడు మనకు సిద్ధపరచినవి, 7) దేవుని ఆత్మ మనుష్యుల కంటికి, చెవికి, హృదయానికి గోచరము కాలేదు. వాటిని మనకు బయలు పరచును. దేవుని మర్మము దేవుని ఆత్మ వలననే తెలిసికొనగలము. ప్రకృతి సంబంధులు దేవుని ఆత్మ విషయములు గ్రహింపజాలరు, అంగీకరించరు కనుక మనము మనుష్య జ్ఞానముతో కాక ఆత్మ సంబంధమైన సంగతులను ఆత్మానుభవములో ఆత్మ నేర్పు మాటలతో వివేచించాలి, నేర్చుకోవాలి, సరిచూచుకొనాలి, బోధించాలి.

రెండవ అధ్యాయ సారాంశము దేవుని ఆత్మయే ప్రాముఖ్యమైనది. 1) పాపులు రక్షింపబడుట పరిశుద్ధాత్మ ద్వారానే దేవుడు మన కొరకు సిద్ధపరచినవి బయలు పరచుట. ఆ పరిశుద్ధాత్మ ద్వారానే, 3) బోధించుట కవసరమైన మాటలనిచ్చువాడు పరిశుద్ధాత్మయే. 4) మనకు క్రీస్తు మనసు ననుగ్రహించువాడు పరిశుద్ధాత్మయే!

## మనము క్రీస్తు మనసును కలిగియుండాలి

## 3వ అధ్యాయము 4+5+6+5+3=23 వచనములు

## అంశము : పనిని గూర్చిన అవగాహనలోని లోపము

శరీర సంబంధులు, పసిబిడ్డలు బలహీనులు, ప్రకృతి సంబంధులుగానున్న **కొరింథీయులు (1-4)** : ప్రభువునందలి పరిచర్యను గురించిన సరియైన అవగాహన లేకపోవుటకు వారియొక్క బలహీనమైన ఆత్మీయస్థితియే కారణము. వారింకను ప్రభువులో 1. పాలు త్రాగువారుగాను, 2. పసిపిల్లలు గాను, 3. బలము లేనివారుగాను, 4. అన్నము తినలేనివారుగాను, 5. శరీర సంబంధులుగాను, 6. ప్రకృతి సంబంధులుగాను ఉన్నారు. పౌలు ఇంతవరకు ఆత్మ సంబంధమైన మనుష్యులుగా లేరని చెప్పుచున్నాడు. వారిని పాలతోనే పసిపిల్లలను పెంచినట్లు పెంచాడు. కొరింథీయులు బలము లేనివారు, అన్నము తినలేని వారు. హెబ్రీ. 4:12, 5:12-14 వ. 1 పేతురు 2:2-3 వచనములు ధ్యానించపచ్చును.

ఇంకను మనుష్యరీతిగానే నడచుకొనుచున్నారు. పౌలు, అపొల్లోలు వరముగల వారైనను కొరింథీయులు వారిని వేరు వేరు పక్షముగా చేసి కొరింథీయులు కూడా

భాగములుగా విడిపోవుట సరికాదు. ఇది మనుష్యరీతిగా నడుచుకొనుట ప్రకృతిలో ఈలాంటివి జరుగును. లోకములోని మానవులు ఒకరొక పక్షమున, మరొకరు మరొకరి పక్షమున ఎంచుకొందురు. మొదటి అధ్యాయము చివర నేర్చుకొన్నట్లు అందరు ప్రభువునందే అతిశయించాలి. రెండవ అధ్యాయము చివరలో నేర్చుకొన్నట్లు క్రీస్తు మనసు కలిగిన వారుగానుండాలి. కాని లోకములోనున్నట్లు వరములు కలిగిన దైవజనులను వేరు వేరు పక్షములుగా తలంచి వారిని ప్రకృతి సంబంధులైన మనుష్యులవలె ప్రవర్తించు చున్నారని తెలుపుచున్నాడు.

**పరిచారకులు పనులు - ఫలము** : అపొల్లో పౌలులు పనిచేయు పరిచారకులే. ప్రభువు పనిని గురించిన కొన్ని విషయాలు గమనించాలి. 1) పని అనుగ్రహించువాడు ప్రభువే! 2) పని ఫలితమే కొరింథీయులు విశ్వసించుట, 3) పౌలుకు ప్రభువు నాటే పని నిచ్చాడు, 4) అపొల్లోకు నీరుపోసే పని నిచ్చాడు అనగా ఒక్కరికి పని పూర్తిగా అప్పగింప బడలేదు, 5) నాటువానిలోను, నీరుపోయువాని లోను ఏమియు లేదు. వృద్ధి నిచ్చినవాడు ప్రభువు, 6. నాటువాడు నీళ్ళు పోయువాడు ఒకటే అనగా తేడాలు లేవు. జత పనివారు (9వ) అనగా సమానమైన వారు. హెచ్చు తగ్గులు లేవు, 7) వారు చేసిన పనికి కష్టము కొలది ప్రభువు జీతమిచ్చాడు. కాని వారికి అతిశయము లేదు. ఇందులో దేవుని పనిని వ్యవసాయముతో పోల్చుచున్నాడు. నాటినవాడు నీరుపోసినవాడు ప్రతివానికి ఇక్కడ జీతమివ్వబడును. ఇది సువార్త ప్రకటించి ఆత్మలను సంపాదించు పని. మరొక పనియైన దేవుని గృహము కట్టబడుటను గూర్చి క్రింది భాగములో వివరించబడినది.

**పని పరీక్షించబడుట - ఫలము (జీతము) పొందుట (10-15)** : దేవుని గృహము దేవుని ఆలయమేనని 16వ వచనములో చెప్పుచున్నాడు. సువార్త పనిలో సంపాదించబడిన వారందరు 1 పేతురు 2:5 ప్రకారము సజీవమైన రాళ్ళవలె నుండి ఆత్మ సంబంధమైన మందిరముగా కట్టబడుచున్నారు. దేవుని గృహము, ఆలయము, మందిరము ఒకటియే. ఈ మందిరమునకు క్రీస్తే పునాది. పౌలు పునాది వేసాడు. అనేకులు దానిపై కట్టుచున్నారు. ఎలాగు కట్టుచున్నారో జాగ్రత్తగా చూడాలి. 2 థెస్స. 1:7,8 ప్రకారము ప్రభువు పరము నుండి అగ్నిజ్వాలలతో ప్రత్యక్షమైనప్పుడు అగ్నిచేత పరీక్షింపబడును. ఇక్కడ మూడు రకములైన పనులు కనబడుచున్నవి.

1. అగ్నికి నిలిచినపని - జీతము కలదు - తనమట్టుకు రక్షింపబడును.

2. 5వ. అగ్నిలో కాలిపోయిన పని - జీతము లేదు - తన మట్టుకు రక్షించబడును.

3. 17వ. దేవుని ఆలయమును పాడు చేసిన పని - దేవుడు వానిని పాడు చేయును (శరీర సంబంధమైన నష్టము కలుగును) - రక్షణ శాశ్వతము.

**పరిశుద్ధముగానుండుట - జ్ఞాని అగునట్లు వెర్రివాడుగా నుండుట (16-20)** : 16-17వ దేవుని ఆలయము పరిశుద్ధమైనది. మీరు ఆ ఆలయమైయున్నారు. అనగా, పరిశుద్ధత మనయందు నివసించాలి. ఆలయము పాడగుట సంఘమందు పాపమునకు తావిచ్చుటయే. 16వ వచనములో దేవుని (పరిశుద్ధ) ఆత్మ మీలో నివసించుచున్నాడు. పరిశుద్ధత మనయందు వ్యక్తిగతముగాను, సంఘముగాను సంపూర్ణ స్వాతంత్ర్య ముండవలెను. అప్పుడు దేవుని ఆత్మ నివసింపగలడు. 18-20వ. పైన చెప్పబడిన విషయములలో ఎవడును తన్ను తాను మోసపరచు కొనరాదు. 1) ఆలాగైతే లోక జ్ఞానమును అనగా శరీర సంబంధమైన జ్ఞానమును ఆధారము చేసికొనకూడదు. కాని తాను జ్ఞానిని అనుకొనువాడు లోక దృష్టికి వెఱ్ఱివాడు కావటానికి సిద్ధముగా నుండాలి. ఎందుకనగా ఈ లోక జ్ఞానము దేవుని దృష్టికి వెఱ్ఱితనము జ్ఞానుల యోచనలు వ్యర్థములని ప్రభువు సెలవిచ్చుచున్నాడు.

**పరిచారకులైన మనుష్యుల యందు అతిశయింపకూడదు (21-23వ.)** : ఈ భాగము నాలుగవ అధ్యాయమునకు ఉపోద్ఘాతము గాను, మొదటి మూడు అధ్యాయముల సారాంశముగానున్నది. మనుష్యులైన పరిచారకులందరు అతిశయించకూడదు.. మనము క్రీస్తుకు చెందినవారము కాని, మనుష్యులకు కాదు. మనుష్యులైన పౌలు, అపొల్లో కేఫాలను దేవుడు మనకొరకు ఇచ్చినందున వారు మనవారు. మానవ జీవన విధానములు, మరణ భయములు, లోకమందున్న ప్రస్తుత శక్తి విధానములు, రాబోవు విధానముల క్రీస్తు వలన మన కొరకు ఏర్పరచబడినవే. ఎందుకనగా, మనమందరము క్రీస్తు వారము అనగా మనుష్యులైన పౌలువారము, కేఫావారము అపొల్లోవారముకాదు.

మొదటి అధ్యాయము చివరలో 31వ వచనములో 1) ప్రభువునందే అతిశయింప వలెను. (పరిచారకులైన మనుష్యులందు కాదు) రెండవ అధ్యాయము చివర 16వ వచనములో 2) మనమైతే క్రీస్తు మనసు కలవారము. దేవుని జ్ఞానమైన ఆత్మను కలవారము కనుక లోక జ్ఞానముతో కాక ఆత్మానుభవముతో అనగా క్రీస్తు ఆత్మతో సంగతులు వివేచించాలి). మూడవ అధ్యాయము చివరలో 23వ వచనమందు 3) మీరు క్రీస్తు వారు. (మనుష్యుల వారుగా నుండరాదు)

# 4వ అధ్యాయము 5+8+8=21 వచనములు
## అంశము : పరిచారకులను గూర్చిన అవగాహనలోని లోపము

**పరిచారకులు నమ్మకమైన దేవుని గృహ నిర్వాహకులు - వారిని విమర్శింపరాదు (1-5)** : పరిచారకులు దేవుని సేవించినవారు. దేవుని మర్మముల విషయములో గృహ నిర్వాహకులు. దేవుని ఇంటిలో నమ్మకస్థులై వారికి బయలుపరచబడిన దేవుని మర్మముల సత్యమును సరిగా అందించువారు. ఇందులో మనుష్య విధానములకు జ్ఞానమునకు తావు లేదు కనుక ఏ మనుష్యుడు వారిని విమర్శించకూడదు. తమ మట్టుకు తాము జాగ్రత్తగా నుందురు. అయినను వారు నీతిమంతులని కాదు గాని విమర్శ దినమందు దేవుడు వారిని తీర్పు తీర్చును. అంధకార మందలి రహస్యములను వెలుగులోనికి తెచ్చి దేవుడు వారిని అందరిని తీర్పు తీర్చి ప్రతి వానికి తగిన మెప్పునిచ్చును.

**పరిచారకుల స్థితి (6-13)** : పరిచారకులలో ఒకరి పక్షమున మనము చేరి ఇతరుల మీద ఉప్పొంగ కూడదని చెప్పుచున్నాడు. పరిచారకులకు వరములను ఆధిక్యతలను ఇచ్చినవాడు దేవుడే. పరిచారకులు తాము కలిగిన వాటిని ప్రభువు వలనను ఇతరుల వలనను పొందిరి. ఇందులో వారి గొప్పతన మేదియు లేదు. వారికి వేరు వేరు పక్షములు లేవు. మనము వారిలో ఒకరి పక్షమున చేరుట లేఖనములను అతిక్రమించుటయే!

| క్ర.సం | వచనము | కొరింథీయులు | పరిచారకులైన సేవకులు |
|---|---|---|---|
| 1. | 8వ | కొదువలేక తృప్తులైరి | కొదువలు కలవారు |
| 2. | 8వ | ఐశ్వర్యవంతులైరి, రాజులైరి | పరిచారకులు విడువబడిరి |
| 3. | --- | ----------- | మరణదండన విధింపబడినవారు |
| 4. | 9వ | --------- | లోకమునకు మనుష్యులకు వేడుకానున్నారు అందరికంటే కడపటనున్నవారు |
| 5. | 10వ | క్రీస్తు నిమిత్తము బుద్ధిమంతులు | క్రీస్తు నిమిత్తము వెర్రివారు |
| 6. | 10వ | బలవంతులు | బలహీనులు |
| 7. | 11వ | ఘనులు | ఘనహీనులు |
| 8. | | | |

| | | | |
|---|---|---|---|
| 9. | | | ఆకలి దప్పులు కలవారు |
| 10. | | | దిగంబరులు |
| 11. | | | పిడిగుద్దులు తినువారు |
| 12. | | | నిలువరమైన నివాసము లేనివారు. |
| 13. | 12వ | | స్వహస్తములతో కష్టపడి పనిచేయుచున్నారు. |
| 14. | | | నిందింపబడుచున్నవారు |
| 15. | 12వ | | హింసింపబడుచు దీవించువారు |
| 16. | 13వ | | దూషింపబడియు బ్రతిమాలుకొనువారు |
| 17. | 13వ | | లోకమునకు మురికిగా ఎంచబడినవారు |
| 18. | 13వ | | అందరిచేత పెంటగా ఎంచబడుచున్నవారు |

**క్రీస్తునందు సువార్త వలన కనిన పరిచారకులు తండ్రులు - వారి మాదిరి ననుసరించి నడుచుట (14-17వ.)** : పరిచారకులు సువార్త ప్రకటించి ఆత్మలను సంపాదించు వారుగా నుండాలి. అట్టి వారే తండ్రులు. ఉపదేశకులైన వారు వేల కొలది కలరు. వీరు పాఠశాలలో పాఠములను బోధించు ఉపాధ్యాయుల వంటివారు. పిల్లల భవిష్యత్తు విషయము శ్రద్ధలేదు. కాని పరిచారకులు ఆత్మలను సంపాదించుదురు. సంపాదించిన ఆత్మలకు నడవవలసిన రీతిని బోధించి బ్రతిమిలాడి ప్రయాసతో వారిని పెంచుదురు. అవసరమైనపుడు నమ్మకమైన మాదిరిగల తిమోతివంటి జతపనివారిని పంపి పౌలు తాను బోధించు విధమును నడుచుకొను విధమును కొరింథీయులకు జ్ఞాపకము చేయుచున్నట్లు ప్రతి పరిచారకుడు చేయాలి. ఈ పరిచర్య ఎంతో అవసరమైనది. "బోధ - నడక" ఈ పుస్తకములో ప్రారంభములో తెలిసినట్లు పౌలు వ్రాసిన ప్రతి పత్రికలోను మనము చూడగలము. పరిచారకులు కేవలము బోధించుట మాత్రమే కాక మాదిరియైన నడకను కలిగియుండాలి.

**తండ్రులైన పరిచారకులు వ్యక్తిగతముగా వెళ్ళి పరామర్శించాలి (18:21)** : తిమోతి వంటివారిని పంపుట మాత్రమే కాక వ్యక్తిగతముగా వెళ్ళాలి. పౌలు తిమోతిని పంపినందున

ఇక పౌలు రాడని కొద్దిమంది ఉప్పొంగుచు శక్తిలేని వట్టి మాటలతో కాలము గడుపు చున్నారు. పౌలు వెళ్ళి వారితో సరి దిద్దుదునని సెలవిచ్చుచున్నాడు. దేవుని రాజ్యము యొక్క శక్తిని గూర్చి వారికి తెలుపుదునంటున్నాడు. ప్రేమ సాత్వీకమైన మనసుతోను వెళ్ళుట యుక్తమని తెలుపుచున్నాడు. బెత్తముతో మీ యొద్దకు రావలెనా? అనుట ఆలాగు వెళ్ళుదునని తెలుపుట కాదు. ఎవరి యొద్దకైనను పౌలు ఆ రీతిగా వెళ్ళినట్లు లేఖనముల యందు మనము చూడము. కాని 5:4లో జారత్వము చేసిన వ్యక్తి విషయములో తీర్పు తీర్చుటను వివరముగా ఐదవ అధ్యాయములో చూడగలము. నైతిక పాపము విషయమై సహనము చూపక తీర్పు తీర్చుట అవసరమే. దేవుని రాజ్యము శక్తితో యున్నది.

3,4 అధ్యాయాలో పరిచారకులను గూర్చిన 6 సాదృశ్యములు చెప్పబడినవి.

1. వ్యవసాయదారుడు నాటువాడు, నీరుపోయువాడు...... 3:6.
2. కట్టువాడు - కట్టుట. 3:10.
3. గృహ నిర్వాహకుడు - నమ్మదగిన నాయకుడు 4:1.
4. తండ్రి - ఆదరించువాడు. 4:15.
5. ఉపదేశకుడు - బోధించాలి. 4:17.
6. క్రమపరచువాడు - చక్క దిద్దాలి. 4:21.

## 5వ అధ్యాయము 5+3+5=13 వచనములు
## అంశము : జారత్వమను లోపము - జారులతో సాంగత్యములోని లోపము

సంఘమందున్న జారత్వమను లోపము - క్రమశిక్షణ (1-5వ.) : జారత్వమున్నదన్న (వదంతి)........దట. ఇది కొనసాగుచున్న పాపము. 4వ అధ్యాయములో విమర్శింప వద్దన్న పౌలు జారత్వము వంటి విషయములో తీర్పు తీర్చితిని అంటున్నాడు. వెలివేయుడి అని 13వ వచనములోను, సాతాను కప్పగించుడని 5వ వచనములోను చెప్పుచు శరీరేచ్ఛలు నశించుటకై, శరీరము నశించుటకై ఆలాగు చేయమన్నాడు. కాని ఆ వ్యక్తిని పూర్తిగా పొగొట్టుకొనుమని చెప్పుట లేదు. 2 కొరింథీ. 2:7లో విశేషభారము మోపకూడదని, శిక్ష తదుపరి ఆదరించుట మంచిదని లేని యెడల అతనికి అత్యధిక దుఃఖము కలుగునని

చెప్పుచున్నాడు. అందువలన క్రమశిక్షణ ఉద్దేశము ఆ వ్యక్తి దిద్దుకొని తిరుగ సంఘములో చేర్చబడవలె ననునదియే. అనేక పర్యాయములు సంఘముల మధ్య ఈ రీతిగా జరుగుట లేదు. దీర్ఘ పరిశీలన ఎంతో అవసరము.

**పాపము లేకుండ జీవించుట - పులియని రొట్టెల పండుగ (6-8వ.)** : ప్రభువు పిల్లలు పాపము లేకుండా జీవించాలి. మొదటి 5వ వచనములలోనున్న నైతిక పాపము సంఘమంతటిని పాడు చేయును. కొంచెము పులుపు ముద్దంతటిని పాడు చేయుట అను సామాన్యముగా వంట ఇంటిలో జరుగు కార్యములతో పోల్చి చెప్పుచున్నాడు. ధర్మ శాస్త్రమందలి పులియని రొట్టెల పండుగ. పులుపు లేకుండా పండుగ ఏడు దినములు ఆచరించాలి. దీని భావము రక్షింపబడినవారు పాపము లేకుండా ఏడు దినములు అనగా జీవితకాలమంతా జీవించాలి. దుర్మార్గత, దుష్టత్వము పాపములని, నిష్కాపట్యము సత్యము పులియని రొట్టెలని సెలవిచ్చుచున్నాడు.

**జారులతో సాంగత్యము (9-13వ.)** : లోకములో అనగా ప్రభువును అంగీకరించని వారిలో 1) జారత్వము చేసినవారు కలరు, 2) లోభులు అనగా డబ్బు విషయములలో అన్యాయముగా సంపాదించవలెనన్న ఆపేక్ష గలవారు లోకములో కలరు, 3) దోచుకొను వారు, 4) విగ్రహారాధికులు జారులతో సాంగత్యము చేయకూడదని 9వ వచనములో చెప్పి విశ్వాసులు పైన చెప్పబడిన వారితో సాంగత్యము చేయకూడదని పౌలు చెప్పుట లేదు. లోకములో అనుదిన జీవితములో మనము అటువంటి వారితో కలసి ఉద్యోగము చేయాలి, కలసి ప్రయాణించాలి. అమ్ముటలో కొనుటలో వారితో సంబంధముండును. అటువంటి వారితో సాంగత్యము చేయకుండుట అనగా ఈ లోకములో నుండి వెళ్ళి పోవునంత వరకు సాధ్యము కాదు. సాంగత్యము చేయని యెడల వారికి సువార్త ప్రకటించుట ప్రభువు కొరకు వారిని సంపాదించుట వీలు కాదు. కాని సహోదరులలో పైన చెప్పబడిన నాలుగు గుణములతో కలసి 5. తిట్టుబోతులు, 6. త్రాగుబోతులు ఉన్న యెడల అట్టి వారితో సాంగత్యము చేయరాదు. కలసి భోజనము చేయరాదని చెప్పుచున్నాడు. అటువంటి సహోదరులను వెలి వేయాలి. ఆ వివరములు 1-8 వచనములలో గమనించితిమి కనుక సారాంశముగా వెలుపటి వారికి మనము తీర్పు తీర్చక ప్రభువు తీర్పుకే అప్పగించాలి కాని సహోదరుల నైతిక విషయమును గూర్చి సంఘము తీర్పు తీర్చి వారిని క్రమపరచవలెను.

# 6వ అధ్యాయము 3+5+3+5+4=20 వచనములు
## అంశము : వ్యాజ్యము - జారత్వము అను లోపములు.

**వ్యాజ్యములు అను లోపము(1-11వ.):**

**అనీతిమంతుల యెదుట వ్యాజ్యమాడు కొరింథీయులు (1-7వ.) :**

**పరిశుద్ధుల అధిక్యత :** పరిశుద్ధులు ప్రకటన 20:11-15 వచనములలోనున్న ధవళమైన సింహాసనము ఎదుట లోకములోని పాపులకు జరుగు తీర్పు తీర్చుదురు. (2వ) యూదా 6,11వ. 2 పేతురు 2:4లోనున్న దేవదూతలకు చేయబడు తీర్పు పరిశుద్ధులచే తీర్పు తీర్చబడును. గనుక అనీతిమంతుల యెదుట వ్యాజ్యమాడుట లోపము.

**పరిశుద్ధుల అవివేకము (4-8వ.) :** కొరింథు సంఘమందలి విశ్వాసులలో ఒకరిపై ఒకరికి జీవన సంబంధమైన విషయములో వ్యాజ్యములు కలుగగా సహోదరులతో ఆలోచించి దిద్దుకొనుటకు బదులు అవిశ్వాసుల యెదుట వ్యాజ్యమాడుచున్నారు. ఇది తప్పని అసలు ఒకని మీద ఒకడు వ్యాజ్యమాడుట కేవలము లోపమని అంతకంటే అన్యాయము సహించుట మేలని, సొత్తులు అపహరింపబడనిచ్చుట మేలని చెప్పు చున్నాడు. పరిశుద్ధులు లోకము యెడల ఎంతో జాగ్రత్తగా నుండవలెనని లేని యెడల దేవుని నామము దూషణపాలగునని నేర్చుకొనుచున్నాము.

**నీతిమంతులుగా తీర్చబడిన అన్యాయస్థులైన కొరింథీయులు (9-11వ.) :** కొరింథీయులు ఒకప్పుడు అన్యాయస్థులు, జారులు, వ్యభిచారులు, దొంగలు, లోభులు త్రాగుబోతులై దేవుని రాజ్యమునకు అయోగ్యులైయుండిరి. కాని వారు ప్రభువైన యేసు నామమున కడుగబడి నీతిమంతులుగా తీర్చబడిరి. కనుక అనీతిమంతుల యొద్దకు వెళ్ళి వ్యాజ్యమాడుట కేవలము లోపమని చెప్పుచున్నాడు.

**జారత్వమను లోపము (12-16వ.) :** ఒకప్పుడు జారులైన వారిని యేసు ప్రభువు కరుణించి పరిశుద్ధపరచి నీతిమంతులుగా తీర్చినందున దేహమును జారత్వమునకు అప్పగింపకూడదని చెప్పుచున్నాడు. దేహమును, ఆత్మ ప్రాణములను ప్రభువు విమోచించాడు. మరణించిన పిదప మనుష్య దేహములను ప్రభువు తన శక్తి వలన లేపును. మన దేహములు క్రీస్తు శరీర అవయవములని చెప్పుచున్నాడు. ఇటువంటి గొప్ప ధన్యత గల దేహమును జారత్వమున కప్పగింపక ప్రభువు నిమిత్తము వాడవలెనని చెప్పుచున్నాడు.

**దేహముతో దేవుని మహిమపరచుట (17-20వ.)** : దేహము దేవుని వలన అనుగ్రహించ బడినది. పరిశుద్ధాత్మకు ఆలయమైయున్నది. 1 కొరింథీ. 15:42-44వ ప్రకారము మానవ శరీరము క్షయమైనది, బలహీనమైనది. ఘనహీనమైనది, ప్రకృతి సంబంధమైనది కాని పునరుత్థానములో అక్షయమైనదిగాను, బలమైనదిగాను, ఘనమైనదిగాను ఆత్మ సంబంధ మైనదిగా లేపబడును. ఇంతగొప్ప స్థితి మనకిచ్చుటకు క్రీస్తు విలువ పెట్టి మన ప్రాణ ఆత్మ శరీరములను కొన్నాడు. ఇంతగొప్ప స్థితి శరీరమునకున్నందున శరీరమును హానికరమైన జారత్వమున కప్పగింపకుండ దేవుని మహిమ పరచుట కప్పగించాలి. "మన శరీరము దేవుని మహిమ కొరకే".

## 7వ అధ్యాయము 8+8+8+6+5+5=40 వచనములు

## అంశము : వివాహాలు - విడుదలలు - వివాహ జీవితమును గూర్చిన అవగాహనలోని లోపము (27వ)

**వివాహ జీవితమును గూర్చిన హెచ్చరికలు (1-8వ.)** : శరీరము దేవుని మహిమ కొరకని చెప్పిన తరువాత పెండ్లి కాని వారు శరీరమును పూర్తిగా దేవుని మహిమకు వాడ వీలగును. పెండ్లియయిన వానికి శరీర శ్రమలు కలుగును. కనుక వివాహ జీవితమునకు దూరముగానుండుట మంచిదే కాని జారత్వము అను పాపమునకు శరీరము నడుపుచున్నందున ప్రతివానికి స్వంత భార్యయుండుట మంచిది. భార్య శరీరముపై భర్తకు, భర్త శరీరముపై భార్యకు సంపూర్ణమైన అధికారముండును. భార్య భర్తలు తమలో ఒకరి యెడల మరొకరు వారి వారి ధర్మములు నడుపాలి. కొంతకాలము వరకు ఉభయుల సమ్మతి చొప్పున తప్ప ఒకరినొకరు యెడబాయకూడదు. సాతాను శోధనకు అవకాశమివ్వకూడదు. కాని వివాహము లేకుండా ఉండగలుగుట. దేవుని కృపావరము కలిగియుంటే అలాగే ఉండుట మంచిదేనంటున్నాడు. ఇది పౌలు యొక్క హితోపదేశము.

**విడుదలను గూర్చిన హెచ్చరికలు (9-16వ.)** : పెండ్లి చేసుకొనుట మేలేకాని పెండ్లి చేసికొనిన వారు ఎడబాటును కోరకూడదు. మత్తయి 19:6. ప్రకారము, దేవుడు జతపరచిన వారిని మనుష్యుడు వేరుపరచకూడదు. ఇద్దరిలో ఒకరు అవిశ్వాసులై విడిచినను విడిచిపెట్టబడినవారు పెండ్లి చేసికొనకూడదు. అవిశ్వాసురాలైన భార్యలు గలవారు తనతో కాపురము చేయుటకు భార్య ఇష్టపడిన యెడల భార్యను యెడబాయ

కూడదు. అలాగే అవిశ్వాసులైన భర్తలు గల భార్యలు తన భర్త తనతో కాపురము చేయ ఇష్టపడిన యెడల యెడబాయకూడదు. అవిశ్వాసులైన సహోదరులు తమను బట్టి పరిశుద్ధ పరచబడుదురు. పిల్లలు పవిత్రముగానుండుటకు ఇది అవసరము. అవిశ్వాసియైన వాడు ఎడబాసిన యెడబాయ వచ్చును. కాని సహోదరునికి నిర్బంధము లేదు. విశ్వాసులైన వారు అవిశ్వాసులైన సహచరులను రక్షణలో నడిపించవీలగును.

**వివాహ జీవితములో పిలువబడిన స్థితి - ఆ స్థితియందే దేవుని మహిమ పరచుట (17-24వ.)** : కొరింథీయులలో యూదులు, అన్యులు ఉన్నందున కొందరు సున్నతి పొందినవారు మరికొందరు సున్నతి పొందనివారు. సున్నతి గలిగి పిలువబడినవారు. ఆ స్థితియందే ఉండుట. సున్నతి లేక పిలువబడినవారు ఆ స్థితియందే ఉండి దేవుని మహిమ పరచవలెను. ఆలాగే సామాజిక జీవితములో దాసులుగా నుండి పిలువబడిన వారు అదే స్థితిలోనేయుండి స్వతంత్రులుగానున్న వారు స్వతంత్రులగుటకు శక్తియుండిన యెడల మరి మంచిది. అందరు క్రీస్తు దాసులుగానున్నారు. కనుక మనుష్యులకు దాసులు కాక తాము పిలువబడిన స్థితిలోనే దేవునితో సహవాసము కలిగియుండాలి.

**వివాహితులు - అవివాహితులను గూర్చినది (25-30వ. 32-35వ.)** : 25-30వ. పెండ్లియైన వారు తామున్న స్థితిలోనే ఉండుట, పెండ్లి కాని వారు తామున్న స్థితిలోనే ఉండుట మంచిదని చెప్పుచున్నాడు. పెండ్లి చేసుకొనుట పాపము కాదు కాని పెండ్లియైన వారికి శరీర సంబంధమైన శ్రమలు కలుగును. 31-35వ లోకము దాని నటన త్వరగా గతించును గనుక లోకములో ఉన్నవి తమవి కానట్టు గుర్తెరిగి, అపరిమితముగా లోకమును అనుభవించకుండ ప్రభువును మాత్రమే సంతోషపెట్టాలి. పెండ్లియైనవారు తమ సహచరులను ఏలాగు సంతోషపెట్టవలెనని లోక సంబంధమైన వాటిని గూర్చి చింతించుదురు. పెండ్లి కాని వారు ఎలాగు పవిత్రతను కాపాడుకోవలెనో ప్రభువును ఏలాగు సంతోషపెట్టగలమని ప్రభువు విషయమైన కార్యములను గూర్చి చింతించుదురు. యోగ్య ప్రవర్తన కలిగి ప్రభువు సన్నిధానవర్తనులై యుండుటయే ప్రాముఖ్యమైనది.

**కుమార్తె వివాహ విషయమై తండ్రి బాధ్యత - విధవరాండ్రను గూర్చిన హెచ్చరిక (36-40వ.)** : 36-38వ. కుమార్తెకు వివాహ వయసు వచ్చినను, మీరినను తన ఇష్ట ప్రకారము వివాహము చేయుటలో పాపమేమియు లేదు. కుమార్తె పెండ్లి చేసికొనవచ్చును. కాని తన కుమార్తెకు పెండ్లిచేయ అవసరము లేకయుండి తన ఇష్ట ప్రకారము జరుప గలవాడైన యెడల అదియును మంచిదే. పెండ్లి చేయుట మంచిదే. చేయకపోవుటయు మంచిదే. ఎట్లయినను ప్రభువును సంతోష పెట్టుటయే ప్రాముఖ్యము.

**ముగింపు (32-40వ.)** : భార్య తన భర్త బ్రతికినంత కాలమే బద్ధురాలు కాని భర్త చనిపోయిన తరువాత మరొకరిని ప్రభువునందు పెండ్లాడాలి. కాని విధవరాలుగా నుండినను మంచిదే. ఏ రీతిగానైనను ప్రభువును సంతోషపెట్టవలెనని ఆలోచన కలిగి ఉండాలి.

## 8వ అధ్యాయము 3+3+3+4=13 వచనములు
## అంశము : విగ్రహార్పితములు భుజించుటలోని లోపము (4వ)

**ప్రేమ క్షేమాభివృద్ధిని కలుగచేయును (1-3వ.)** : మొదటి అధ్యాయమున్నట్లు 22వ. కొరింథీయులు జ్ఞానమును వెదుకువారు. ఆ జ్ఞానము వారిని ఉప్పొంగ చేయును. జ్ఞానమునకు మితము లేదు కనుక ఒకడు తాను నేర్చుకొనవలసినది ఇంకను ఉన్నట్లు గుర్తించాలి. ప్రేమ ఉప్పొంగక క్షేమాభివృద్ధిని కలుగచేయును. మనుష్యుడు దేవుని ప్రేమించిన దేవుని యెరుకలో తానున్నానని గుర్తించి తృప్తిగానుండును. కావున ప్రేమ కలిగి క్షేమాభివృద్ధి చేసుకొను వారముగానుండాలి.

**విగ్రహాలు వట్టివి - వేరొక దేవుడు లేడు (4-6వ.)** : విగ్రహములు మానవులు చేసినవైనందున అవివట్టివి అందులో దైవత్వము లేదు. ప్రభువు అనబడినవారు లోకమందున్నారు. దేవతలూ అనబడినవారు ఆకాశమందు భూలోకమందు ఉన్నట్లు లోకము నమ్ముచున్నారు. నిజమైన దేవుడొక్కడే ఆయన నుండియే సమస్తము కలిగెను. ప్రభువు ఒక్కడే. ఆయన యేసు. ఆయన ద్వారా సమస్తము కలిగెను. మనము క్రీస్తు ద్వారా కలిగి తండ్రి నిమిత్తము ఉన్నాము కనుక దేవుని నిమిత్తమే జీవించాలి.

**విగ్రహార్పితములు భుజించుట ఇదివరకు విగ్రహముల నారాధించిన ఇప్పటి బలహీనులైన విశ్వాసుల కభ్యంతరము (7-9వ.)** : ఇది వరకు విగ్రహముల నారాధించిన బలహీనులైన విశ్వాసులు తాము భుజించునవి విగ్రహములకు అర్పించబడినవని నమ్మి భుజింతురు కనుక వారి మనస్సాక్షి బలహీనమై అపవిత్రమగును కనుక విగ్రహార్పితములను భుజించుట బలహీనుల కభ్యంతరము కలిగించుటయే.

**బలహీనుల కభ్యంతరము కలిగించుట క్రీస్తుకు విరోధముగా పాపము చేయుట (10-13వ.)** : మనము విగ్రహ ఆలయమందు పంక్తిలో కూర్చుండుట బలహీనుడైన సహోదరుడు చూచిన యెడల విగ్రహములకు బలి ఇవ్వబడిన పదార్థములను తినుటకు

ధైర్యము తెచ్చుకొనును. క్రీస్తు తన కొరకు మరణించెనను సంగతిని బలహీనుడైన సహోదరుడు అపార్థము చేసుకొని నశించును. కనుక బలహీనుడైన సహోదరుని మనస్సాక్షిని నొప్పించి క్రీస్తుకు విరోధముగా పాపము చేసిన వారమగుదుము. భోజనమును బట్టి సహోదరులకు అభ్యంతరము కలిగించరాదు.

## 9వ అధ్యాయము 13+1+13=27 వచనములు
## అంశము : సువార్త ప్రకటించువాడు ప్రకటించుటలోను జీవించుటలోని లోపము

నాలుగవ అధ్యాయములో పనివాని పరిస్థితి, చివరలో పనిని గూర్చిన సాదృశ్యములు పనిని గూర్చి పనివారిని గూర్చిన మరికొన్ని వివరములు ఈ అధ్యాయ మందు గమనించండి.

**పీఠిక - పని - ఫలము (1-3వ.)** : 3వ వచనములో నన్ను విమర్శించు వారికి నేను చెప్పు సమాధానమిదే అని ఉన్నందున విమర్శించిన లోపములను దిద్దుటకైన జవాబు ఈ అధ్యాయమందు కలదని గుర్తించవలెను. 1-2వ సువార్త ప్రకటనకై అ.కా. 13:1-3లోనున్నట్లు ప్రత్యేకించబడినవారు స్వతంత్ర్యులే. ప్రభువు చేత పిలువబడిన వారు, ఆమోదించబడినవారు. వారి సువార్త ప్రకటన ద్వారా ఫలమును అనగా నమ్మిన వారిని రుజువు కలిగినవారు.

**సువార్త పనిలో ఫలము - పనిలో అధికారము (4-6వ.)** : 4వ వచనములో సువార్త కొరకై ప్రత్యేకించబడినవారు తిని త్రాగుటకు గల అధికారమేమి? 5వ వచనములో భార్యను వెంటబెట్టుకొని తిరుగుటకు గల అధికారమేమి? 6వ వచనములో పని చేయుటలో గల అధికారమేమి అని మూడు ప్రశ్నలు కన్పించుచున్నవి.

**సువార్త పని - ఫలమును గూర్చి లోకాచారము నుండి ధర్మశాస్త్రము నుండి వివరణ (7-9వ.)** : 7వ వచనములో సువార్త ప్రకటించు పరిచర్య 1) దండులోని కొలువుతోను, 2) ద్రాక్షాతోట వేసి ఫలములు కోసికొను పనితోను, 3) మందను కాచి మంద పాలు త్రాగుటతోను పోల్చబడినది. పనివాడు స్వంతము వేసిన తోట కన్పించుచున్నది. ఒక మందను కాయుటను కూడా చూపించుచున్నాను. ఇందులోని విషయములు 1) సువార్త ప్రకటించుట ద్వారా సంఘ సాక్ష్యములు ఏర్పడాలి, 2) ఏర్పడిన సంఘమును మందలను కాయాలి, 3. త్యాగ సహితముగా, సమర్పణ కలిగి ఎంతో క్రమశిక్షణతో దండులోని

కొలువువలె పని చేయాలి. ద్రాక్షా తోటలోని ఫలము తినాలి, మందపాలు త్రాగాలి. సువార్త ప్రకటన ద్వారా తాను సంపాదించిన సంఘము యొక్క ఫలము అనగా రాబడి సువార్తికుని పోషణకై వాడబడాలి. సువార్తికుడు కాయుచున్న మంద పాలు త్రాగుట కూడా ఈ తలంపును బలపరచుచున్నది. దండులోని కొలువుకు సైనికునికి జీతము లభించినట్లు సువార్తికుడు ఫలమును పొందాలి కాని తన స్వంత ఖర్చుపెట్టుకొని పని చేయకూడదు. 8వ. పై ఉదాహరణలు లోకాచారము నుండి చెప్పబడినవి. సైనికుని వంటి క్రమశిక్షణ, 2) వ్యవసాయ దారునివలె తోటలు వేయుట, 3) మందల కాపరివలె **కాయుట** అను మూడు పనులు ప్రత్యేకించబడిన పనివాడు చేయాలి.

9వ. ధర్మశాస్త్ర ఆచారము నుండి కళ్ళము త్రొక్కుచున్న ఎద్దు మూతికి చిక్కము పెట్టకూడదని చెప్పుచున్నాడు.

**వ్యవసాయ విధానము నుండి - ఆలయ పరిచర్య నుండి వివరణ (10-13వ.)** : వ్యవసాయమందు, దున్నుట, విత్తుట, కోయుట, కళ్ళము త్రొక్కించుట అను పనులు ఉండును. పనివాడు పంటలో పాలు పొందినట్లు ఆత్మ సంబంధమైనవి విత్తువాడు శరీర ఫలములు కోసికొనుట గొప్ప కార్యము కాదని, శరీర ఫలములు సువార్త ప్రకటించు వానికి ఇవ్వవలెనని చూచుచున్నాము. 12-13వ. ఆలయ కృత్యములు జరిగించువారు, బలిపీఠము నొద్ద కనిపెట్టుకొనియుండువారు బలిపీఠము పై అర్పించబడిన వాటిని పుచ్చుకొని ఆలయము వలన జీవనము చేయుదురు. కాని పౌలు సువార్తకు అభ్యంతరము కలుగకుండునట్లు ఈ అధికారమును వినియోగించుకొనలేదు.

**సువార్త ప్రచురించు వాని జీవనము కొరకైన ఫల సారాంశము (14వ.)** : పైనున్న 13 వచనములలో సువార్త ప్రచురించు వారి విధానము, జీవన విధానము లోకాచారమును బట్టి, ధర్మ శాస్త్రమును బట్టి, వ్యవసాయ విధానమును బట్టి, యెరూషలేము దేవాలయ పరిచర్యను బట్టి చెప్పిన పిమ్మట సారాంశము చెప్పుచున్నాడు. ప్రభువు నియమమేదనగా సువార్త ప్రచురించువారు సువార్త వలన జీవించాలి. సంఖ్యా 18:21వ. ద్వితీ. 14:22-28వ వచనములలో దశమభాగములన్ని లేవీయులకు ప్రత్యేకించబడిన సేవకులకు ఇవ్వబడినవి అని ఉన్నది. వారి అవసరములన్ని సువార్త వలన మేలు పొందిన సంఘములు తీర్చాలి. సువార్త ప్రకటన అనికాక సువార్త ప్రచురణ అని వ్రాయబడినది. ప్రచురణ అనగా కన్నులకు కన్పించునది. ప్రకటించువారు క్రీస్తును కన్నుల యెదుట గలతీ. 3:1వ. ప్రకారము ప్రదర్శించాలి. అప్పుడు సువార్త ప్రకటన ప్రచురణగానుండును.

**సువార్త ప్రకటన కొరకు పిలుపు - భారము - జీతము (15-18వ.)** : 15-16వ సువార్త ప్రకటన కొరకై పిలువబడి ఆ భారము తనపైనున్నదని గుర్తించుచున్నాడు. ఆ భారము దించు వరకు తనకు శ్రమ ఉండును. గనుక సువార్త ప్రకటింపక పోయిన యెడల నాకు శ్రమ అంటున్నాడు. తన కిష్టమున్నను లేకపోయినను బాధ్యత తనపై ఉన్నందున ప్రకటింతునంటున్నాడు. ఇష్టపడి చేసిన జీతము దొరుకును.

**తాను సువార్తను ఉచితముగా ప్రకటించుటయే జీతమని చెప్పుచున్నాడు (17వ.)** : 17వ. జీతము దొరుకును. 18వ. జీతమేమి, 19వ. జీతము ఉచితము. ఉచిత జీతముగల పనిని ఇష్టపడిచేయు వారెవరు లోకములోనుండరు. కాని సువార్త ప్రచురించువాడు ఉచిత జీతము కొరకు ఇష్టపడి పని చేయు పోలును మాదిరిగానుంచుకొనాలి.

**సువార్తలో సంపాదించవలసిన వివరము - ఫలము (19-22)** : 19వ. అందరిని సంపాదించుటకు అందరికి నన్ను నేను దాసునిగా చేసుకొనుట. 20వ. యూదులను సంపాదించుటకు యూదులకు యూదునివలె నుండుట ధర్మశాస్త్రమునకు లోబడిన వారిని సంపాదించుటను ధర్మశాస్త్రము లోబడినవానివలె నుండుట. 21వ. ధర్మశాస్త్రము లేనివారిని సంపాదించుటకు ధర్మశాస్త్రము లేనివాడనుగా ఉండుట. 22వ. బలహీనులను సంపాదించుటకు బలహీనుడుగానుండుట ఏ విధముచేతనైన కొందరిని రక్షించుట ముఖ్య ఉద్దేశము కనుక అందరికి అన్ని విధముల వాడుగానుండుట.

**పొందబోవు ఫలము (కిరీటము) (23-26వ)** : సువార్త ప్రకటన యను సేవా జీవితమును ఒక పందెపు రంగమందు పరుగెత్తి బహుమానము పొందుటతో పోల్చుటను చూడగలము. పరుగెత్తువాడు అన్ని విషయములలో మితముగానుండును. గురి గలిగి నియమ ప్రకారము పరుగెత్తును. పరుగెత్తుటలో అపరిమితముగా పరుగెత్తును క్షయమగు కిరీటము పొందును. కాని యేసు ప్రభువు తన పిల్లలకు, ఆకాశ మండలమందు 2 కొరింథీ. 5:10వ.లోనున్న తీర్పులో అక్షయ కిరీట మిచ్చును.

**ముగింపు (27వ)** : 2 తిమోతి 2:4లోనున్నట్లు నియమ ప్రకారము పోరాడకుంటే కిరీటము దొరుకదు కనుక ఇతరులకు ప్రకటించిన తరువాత మనమే భ్రష్టులము (DISQUALIFY) కాకుండునట్లు జాగ్రత్తపడాలి. మన శరీరమును నలుగగొట్టుకొని లోపరచు కొనాలి. క్షయమగు శరీరాశలను విసర్జించి అన్ని విషయములలో మితముగా నుండి నియమ ప్రకారము జీవించువాడు అక్షయ కిరీటము పొందును. మిగిలిన కిరీటములను గూర్చి ఆలోచింతము.

**1) అక్షయ కిరీటము** : (1 కొరి. 9:25వ) క్షయమైన శరీరము కొరకు శరీరరేచ్ఛలోను. క్రమ పరచుకొని నియమ ప్రకారము పరుగెత్తువారు ఈ కిరీటము పొందుదురు.

**2) జీవ కిరీటము** : శోధనలకు లొంగక, శోధనను జయించి నమ్మకముగా జీవించిన వారికి జీవ కిరీటమివ్వబడును. (యాకోబు 1:12వ. ప్రకటన 2:10)

**3) నీతి కిరీటము** : జీవితకాలమంతా పాపమునకు తావివ్వక నీతిగా జీవించు వారికివ్వబడును. (2 తిమోతి 4:8).

**4) మహిమ కిరీటము** : కాపరులు, ఉపదేశకులు బోధకులు తమకప్పగింపబడిన మందలకు మాదిరిగానుండుట ద్వారా పొందుదురు. (1 పేతురు 5:2-4వ).

**5) ఆనంద అతిశయ కిరీటము** : ఆత్మలను సంపాదించు వారి కివ్వబడును (1 థెస్స. 2:19).

**6) సువర్ణ కిరీటములు** : దైవత్వమును కలిగి జీవించిన వారికివ్వబడును. (ప్రక.4:4).

**7) ముండ్ల కిరీటము** : ముండ్లు శాపమునకు గురుతు (ఆది. 3:18వ) మన శాపమును గ్రహించిన క్రీస్తు గురుతుగా ముండ్ల కిరీటము ధరించి మనకు ఆరు రకములైన కిరీటములను ఇచ్చుట ఆశ్చర్యము.

## 10వ అధ్యాయము 5+5+3+4+5+5+6=33 వచనములు
## అంశము : పితరుల లోపముల దృష్టాంతము నుండి బుద్ధిమాటలు

**పితరుల అధిక్యతలు (1-5వ.)** : పితరులైన ఇశ్రాయేలీయులు ఐగుప్తు నుండి పస్కా (గొఱ్ఱెపిల్ల రక్తము) ద్వారా విడిపించబడుట (నిర్గమ 12 అధ్యా.) యేసు రక్తము ద్వారా రక్షింపబడుటకు సాదృశ్యము. ఎర్ర సముద్రములో మేఘము క్రింద దాటుట (నిర్గమ 14వ అధ్యా.) బాప్తిస్మమునకు సాదృశ్యము. నిర్గమ. 16వ అధ్యా. మన్నా భుజించుట 17లో బండను చీల్చగా వచ్చిన నీటిని త్రాగుట రొట్టె రసములో పాల్గొనుటకు ఆరాధనకు గురుతు. కాని వారు దేవునికి అయిష్టులుగా నుండి అరణ్యములో సంహరించబడుట 1 కొరింథీ. 11:28-30వ. ప్రకారము శిక్ష పిదప మరణించుటకు సాదృష్యము.

**పితరుల క్షీణత (6-10వ.)** : 1) 6వ. చెడ్డ వాటిని ఆశించిరి, 2) 7వ. జనులు తినుచూ త్రాగుచూ ఆడుటకు లేచిరి. 3) 7వ. కొందరు విగ్రహారాధికులైరి. 4) 8వ. కొందరు వ్యభిచరించిరి, 5) 9వ. ప్రభువుని శోధించిరి, 6) 9వ. కొందరు సర్పముల **వ**లన నశించిరి, 7) 10వ కొందరు సణిగి సంహారకుని చేత నశించిరి.

**బుద్ధి మాటలు (11-13వ.) :** తాను నిలుచున్నానని తలంచువాడు పడకుండ జాగ్రత్తగా చూచుకొనవలెను. ఎందుకనగా మనుష్యులకు కలుగు శోధనలే సహింప గలిగినంత శోధనలే కలుగును. శోధనతోపాటు తప్పించుకొను మార్గమును కూడా దేవుడు కలుగజేయును. ఉపాధ్యాయుడు పిల్లలకు పరీక్ష పత్రమిచ్చి, వాటికి జవాబులు వ్రాయు మార్గమును కూడా చూపినట్లుగా పై సంగతులున్నది. అందులకై దేవుని స్తుతించాలి. క్రొత్త నిబంధనలో 52 సార్లు జాగ్రత్త అను పదములు కలవు. ఒక్కొక్క వారమునకు ఒక్కటి ప్రకారము సంవత్సరమంతటికి 52 జాగ్రత్తలు కలవు. కావున ప్రతి విశ్వాసి సంవత్సర మంతయు అన్ని వారములలో జీవితకాలముతో జాగ్రత్తగానుండాలి. జాగ్రత్తల వివరములు చివరి పేజీలో చూడండి.

**విగ్రహార్పితములను భుజించుటను గూర్చిన బుద్ధిమాటలు (14-33వ.) :**

**ప్రభువు బల్ల........(18-22వ.) దయ్యముల బల్ల :** ప్రభువును నమ్మినవారు ప్రభువు రాత్రి భోజనములో పాలు పొందుచు తమ కొరకు బలియైన ప్రభువును, తమ పాపములను కడిగిన యేసు రక్తమును జ్ఞాపకము చేసికొందురు. విగ్రహములకు బలి అర్పించిన వాటిని తిను వారు గమనించవలసిన దేమనగా : 1) విగ్రహములకు అర్పించు బలులు దయ్యములకు అర్పించుటయే, 2) అట్టివి తినుట దయ్యముల బల్లలో పాలుపొందుట కనుక విగ్రహార్పితములను భుజింపకుండా జాగ్రత్తపడాలి.

**తినుటయందు గల స్వాతంత్ర్యమును వినియోగించుట - విమర్శింపబడకుండుట (23-27వ. 28-33వ) :** మనస్సాక్షి విషయమై విచారణ చేయక కటిక వాని అంగడిలో అమ్మె వాటిని భుజింపవచ్చును. అవిశ్వాసులలో ఒకడు విందుకు పిలిచినపుడు ఏ విచారణ చేయక తినవచ్చును. కాని ఇది విగ్రహార్పితమని ఎవరైనా చెప్పిన యెడల ఎదుటి వాని మనస్సాక్షి నిమిత్తము భుజించకుండుట మంచిది. మనము తీర్పు తీర్చబడుటకు అవకాశమివ్వకూడదు. భోజన పానముల నిమిత్తము దేవుని పని పాడు కాకూడదు, దేవుని సంఘమునకు అభ్యంతరము కలుగకూడదు. మన స్వప్రయోజనము ముఖ్యము కాదు. అనేకులు రక్షింపబడుటయే ముఖ్యము కాని ఎవరికి మనము అభ్యంతరముగానుండరాదు.

## 11వ అధ్యాయము 16+18=34 వచనములు
## అంశము : స్త్రీ, పురుషులు కూడివచ్చుటలోని లోపము
## ప్రభురాత్రి భోజనమునకు కూడివచ్చుటలోని లోపము.

విభజన - స్త్రీ, పురుషుడు కూడి ప్రార్థించుటలోను, ప్రవచించుటలోనున్న లోపములు **(1-16వ.)** : 1-5 వచనములలో దేవుని సృష్టి క్రమమును జ్ఞాపకము చేయుచున్నాడు.

స్త్రీకి శిరస్సు పురుషుడు. పురుషునికి శిరస్సు క్రీస్తు, క్రీస్తుకు శిరస్సు దేవుడు గనుక స్త్రీ ముసుకు లేకుండా ప్రార్థించుట, ప్రవచించుట తనతోనున్న పురుషుని అవమాన పరచుటయే. పురుషుడు ముసుకు వేసుకొనకూడదు. ఏలయనగా తనకు శిరస్సయిన క్రీస్తు అక్కడలేడు. స్త్రీయే ఉన్నది కనుక ముసుకు వేసికొనుట క్రీస్తును అవమాన పరచుటయే. 6-10 వచనములలో స్త్రీ ముసుకు వేసికొనని ఎడల తల వెంట్రుకలు కత్తిరించుకొనవలెను. స్త్రీ, పురుషుని నుండి కలిగినందున, స్త్రీ పురుషుని కొరకే కలిగినందునను స్త్రీ, పురుషుని మహిమ కనుక స్త్రీ ముసుకు వేసుకొనాలి. దేవదూతలను బట్టి స్త్రీకి ముసుకు అధికార సూచన. 11-16 వచనములలో స్త్రీకి వేరుగా పురుషుడు లేడని, పురుషునికి వేరుగా స్త్రీ లేదని చెప్పుచున్నాడు. పై భాగములో స్త్రీకి శిరస్సు పురుషుడు అనగా ఇది కుటుంబ వ్యవస్థ. పర పురుషుడు స్త్రీకి శిరస్సు కాడని గుర్తించాలి. స్త్రీ, పురుషుని కొరకు అనుట, స్త్రీ, పురుషుని నుండి కలిగినదనుట భార్య భర్తలైన స్త్రీ, పురుషుల గూర్చియే ప్రస్తావించుచున్నాడు. 1 కొరింథీ. 14:34వ. స్త్రీలు సంఘములలో మౌనము ఉండవలెను గనుక స్త్రీ సంఘములో ప్రవచించుటకు వీలు లేదు. పై భాగములోని వివరములు భార్యభర్తలైన వారిని గురించియేనని గుర్తింపవలెను.

**ప్రభురాత్రి భోజనమునకు సంఘము కూడి వచ్చుటలోని లోపము (17-34వ.) :** కక్షలు కలిగి ప్రభురాత్రి భోజనమునకు కూడి రాకూడదు. ప్రభురాత్రి భోజన సంస్కారము ప్రభువు ఇచ్చిన క్రమము, 1) రొట్టె విరుచుట, 2) పాత్రలోనిది త్రాగుట, 3) ప్రభువు వచ్చు వరకు ఆయన మరణమును ప్రచురించుట అనగా సువార్త ప్రకటన జరగాలి. ప్రతివాడు తన్నుతాను పరీక్షించుకొని అయోగ్యులుగా కాక, వివేచించి తిని, త్రాగాలి. లేనియెడల శిక్షగా 1. బలహీనత, 2. రోగము, 3. మరణము సంభవించును. కనుక కూడివచ్చుట శిక్షావిధికి కారణము కాకుండ చూచుకొనాలి.

## 12వ అధ్యాయము 3+4+4+8+8+4=31 వచనములు

### అంశము : ఆత్మ అనుగ్రహించు వరములను (CHARISMA) తెలిసికొనుటలోని లోపము (1వ.)

వరములకు సామర్థ్యమునకు గల తేడాను గుర్తించుట అవసరము. వరము పర సంబంధమైనది, ఆత్మ సంబంధమైనదై ఒక వ్యక్తికి రక్షించబడిన పిదప సంఘ క్షేమాభివృద్ధి కొరకు అనుగ్రహించబడును. కాని సామర్థ్యము ఒక వ్యక్తికి పుట్టుకతోనే అనుగ్రహించబడును. రక్షించబడిన పిదప సామర్థ్యమును కూడా సంఘ క్షేమాభివృద్ధి కొరకు వాడాలి.

**కొరింథీయుల ఆత్మీయ స్థితి (1-3వ)** : విగ్రహారాధికులైన అన్యజనులలో నుండి వీరు యేసును రక్షకుడుగా అంగీకరించిన వారు తమ ఆత్మీయ స్థితిని గురించి - ఆత్మ సంబంధమైన వరములను గూర్చి అవగాహనలేని వారుగానున్నారు. పరిశుద్ధాత్మ ద్వారానే ఒకడు యేసును రక్షకుడుగాను, ప్రభువుగాను అంగీకరించును. అలాగే ఆత్మ ద్వారానే కొరింథీయులు క్రీస్తును, రక్షకుడుగాను ప్రభువుగానే అంగీకరించిరని అనగా ఆత్మ ముద్రను ఎఫెసీ 1:13 ప్రకారము కలిగియున్నారని తెలుపుచున్నాడు. ఆత్మ సంబంధమైన వరములు ఆత్మ మన కనుగ్రహించబడిననాడు, అనగా రక్షించబడిననాడే అనుగ్రహించ బడినవి. వాటిని ఆ వ్యక్తి తరువాత గుర్తించును. ఎఫెసీ. 4:7వ. రోమా 12:6 ప్రకారము, వరము యొక్క పరిమాణము క్రీస్తుచే కృపతో పాటు, రక్షణతో పాటు అనుగ్రహించ బడును.

**వరముల పరిచర్యలో త్రియేక దేవుని పాత్ర (4-7వ.)** : మొదటిదిగా వరములు నానా విధములుగానున్నవి. అసంఖ్యాకములు, కొందరు తలంచునట్లు 8-11 వచనములలోనున్న వరములు 9 మాత్రమే కాదు. 28వ వచనములో మరి అయిదు వరములు చెప్పబడినవి. రోమా 12:6-8వ కొన్ని ఎఫెసీ 4:6-8వ మరికొన్ని చెప్పబడినవి. వరములను వాడుచూ జరిగించు పరిచర్యలు నానా విధములుగానున్నవి (5వ). పరిచర్య ద్వారా జరుగు కార్యములును నానా విధములుగానున్నవి. 4-6 వచనములలో వివరించ బడిన ఆత్మ ప్రత్యక్షత అందరి ప్రయోజనము కొరకు పరిశుద్ధాత్మ దేవుడు యేసు ప్రభువు దేవుడు తండ్రియైన దేవుడు అనగా త్రియేక దేవుని ద్వారా అనుగ్రహించబడినదని గుర్తించవలెను.

**వరములను తన చిత్త ప్రకారము, పరిశుద్ధాత్మ, ప్రతి ఒక్కరికి ప్రత్యేకముగా పంచి ఇచ్చుట (8-11వ, 28వ)** : వరములలో కొన్ని నిలిచిపోయినవని, నిరర్థకమగునని 1 కొరింథీ. 13:8లోనున్నందున కొన్ని వరములు తాత్కాలికమైనవి అనగా కాలపరిమితి కలవి. కొన్ని శాశ్వతమైనవని గమనించగలము. వరముల వివరములు.

| క్ర.సం | వరములు | వివరము |
|---|---|---|
| 1. | అపొస్తలత్వము (12:28<br>క్రీస్తును చూచినవారు, క్రీస్తుతోను<br>శిష్యులతోను కలిసి ఉన్నవారు. (అ.కా. 1:22)<br>మత్తీయ (అ.కా. 1:26). పౌలు (రోమా 1:1)<br>బర్నబా (అ.కా. 14:14). యాకోబు (గలతీ. 1:19)<br>యూదా అపొస్తలత్వమును పోగొట్టుకొనెను.<br>కనుక పరిమితియున్నది. | పరిమితి గలది. |

| క్ర.సం | వరములు | వివరము |
|---|---|---|
| 2. | ప్రవచనము (12:10) ఎఫెసి. 2:20. ప్రకారము సంఘ పునాది కాలమునకు పరిమితమైనది. | కాలపరిమితి కలదు. |
| 3. | అద్భుతములు (12:28) | తాత్కాలికమైనది |
| 4. | స్వస్థపరచుట (12:28) | తాత్కాలికమైనది |
| 5. | బుద్ధివాక్యము (12:8) దేవుని వాక్య ప్రత్యక్షత కాలము ముగిసినది. కాని వాక్య వివరణ నేటి దినములలోకూడా అనుగ్రహించబడుచున్నది. | పరిమితమైనది. |
| 6. | విశ్వాసము (1 కొరింథీ. 12:8) | |
| | ఎ) రక్షణ కొరకు (అ.కా. 16:31) | అందరికి |
| | బి) పవిత్రపరచుకొనుట. (ఎఫెసీ. 6:16) | అందరికి |
| | సి) గృహ నిర్వాహకత్వము (1కొరి. 12:9) | కొందరికి |
| 7. | భాషలు (1కొరి. 12:10) | తాత్కాలికమైనవి (నిలిచిపోవునవి 13:8) |
| 8. | భాషలకు అర్థము చెప్పుట (1కొరి. 12:10) | తాత్కాలికమైనవి (13:8) |
| 9. | జ్ఞాన వాక్యము (1 కొరి. 12:8) | శాశ్వతమైనది. |
| 10. | ఆత్మల వివేచన (1 కొరి. 12:10) | తాత్కాలికమైనవి |
| 11. | పంచిపెట్టుట (రోమా 12:8) | కొందరికి శాశ్వతమైనది. |
| 12. | హెచ్చరించుట (రోమా 12:8) | కొందరికి శాశ్వతమైనది. |
| 13. | పరిచర్య చేయుట (1కొరి. 12:28. రోమా 12:8) | కొందరికి శాశ్వతమైనది. |
| 14. | కరుణించుట (రోమా 12:8) | కొందరికి శాశ్వతమైనది. |
| 15. | ప్రభుత్వము చేయుట (1కొరి. 12:28) | కొందరికి శాశ్వతమైనది. |
| 16. | బోధించుట 1 కొరి. 12:28) | కొందరికి శాశ్వతమైనది. |
| 17. | సువార్తికులు (ఎఫెసీ. 4:11) | కొందరికి శాశ్వతమైనది. |
| 18. | కాపరులు (ఎఫెసీ. 4:11) | కొందరికి శాశ్వతమైనది. |

వాక్యమును బోధించి కాయుట (యోహాను 21:15617)

గమనిక : పైనున్న 18 మాత్రమే వరములను తలంచక వరములు నానా విధములని, అసంఖ్యాకములని గుర్తించవలెను. 11వ. ఆత్మ నానా విధములైన వరములను తన చిత్త ప్రకారము (మన ఇష్ట ప్రకారము కాక) ప్రతివానికి (ఒక్కొక్కరికి) ప్రత్యేకముగా పంచియిచ్చును. అందరి ప్రయోజనము కొరకు అవి వాడబడుచుండాలి.

**వరములను వాడు వారు శరీర అవయవములవలె ఐక్యత కలిగి ఉండాలి (12-19వ.):**

**శరీర అవయవములవలె పరస్పర అవసరతను తీర్చగలగాలి (20-27వ.) :** విశ్వాసులందరు క్రీస్తు శరీరమునకు అవయవములు. కాని అందరికి ఒకే పని లేదు. ఒక్కొక్క అవయవమునకు వేరు వేరు పనులున్నట్లు ఒక్కొక్కరికి వేర్వేరు వరములు కలవు. (రోమా 12:7). అవయవములన్నియు ఏ రీతిగా ప్రాముఖ్యమైనవో విశ్వాసులందరు దేవునికి ముఖ్యమే. ఏ అవయవమైనను నేను శరీరమునకు చెందనని చెప్పకూడదు. అవయవములన్ని శరీరమందుండి ఐక్యముగానున్నట్లు విశ్వాసులందరు సంఘమందు ఉండి ఐక్యముగానుండాలి.

**దేవుడు సంఘమునకిచ్చిన వాటిలో శ్రేష్ఠమైన వాటినపేక్షించుట :** అందరికి అన్ని వరములు అనుగ్రహించబడవని పై భాగములను ధ్యానించి నేర్చుకొంటిమి. నానా విధములైన వరములను పరిశుద్ధాత్మ తన ఇష్టానుసారముగా అనుగ్రహించును. మనము శ్రేష్ఠమైన వాటిని అపేక్షించాలి.

## 13వ అధ్యాయము 3+4+5+1=13 వచనములు
## అంశము : ప్రేమను కలిగియుండకపోవుట అను లోపము

ప్రేమ అనుపదము గ్రీకు భాషలో నాలుగు వేరు వేరు పదములుగానున్నది. 1) అగాపే, (AGAPE) 2) ఫిలో, (PHILOE) 3) స్టొర్గోస్, (STORGOS) 4) ఈరో.

1. అగాపే అనగా దేవుడు మానవుల పట్ల కుమ్మరించిన ప్రేమ (రోమా 5:5). ఇందులో ప్రేమించువానికి తనకంటే ప్రేమించబడు వాడే ప్రాముఖ్యము. మనము దేవుని ప్రేమించితిమి అని కాదు తానే మనలను ప్రేమించి (1 యోహాను 4:10వ).

2) ఫిలో అనగా ఇద్దరు మానవులకుమధ్య ఉండు సహోదర ప్రేమ. అతడు నన్ను భోజనమునకు రమ్మనినాడు. నేను అతనికి భోజనము పెట్టాలి. అతడు నన్ను ప్రేమించాడు. కనుక నేను అతనిని ప్రేమించాలి. ఒకరికి ఒకరు బదులు చూపునది.

3. స్టోర్గోస్ అనగా కుటుంబ సభ్యుల మధ్య ఉండు అనురాగము. కుమారుడు తండ్రికి కీడు చేసినను తండ్రి కుమారుని ప్రేమిస్తాడు. కాని తనకున్న పరిధిలోనే కనుక ఇది శాశ్వతము కాదు.

4. ఈరోస్ అనగా స్వ లాభమును అపేక్షించు ప్రేమ. ప్రేమించబడువానికంటే ప్రేమించు వాడు తన స్వలాభమును చూచుకొనుట ఎదుటివాని లాభమును లెక్కచేయకుండుట. ఇది మోసముతో కూడినది (ERRATIC).

**ప్రేమ యొక్క ప్రయోజనము (1-3వ.)** : 1. ఈ అధ్యాయములో ప్రేమ అను గ్రీకుపదము అగాపే 9 పర్యాయములు కలదు. ముందు అధ్యాయములో కృపా వరములను గూర్చి తెలిపి వాటి విషయము ఉన్నత స్థితిలోనుండాలని సహోదరులు ఆశించుదురు. కాని ప్రేమలేక వరములను కలిగియుండుట వ్యర్థమని, నిష్ప్రయోజమని చెప్పుచున్నాడు.

**1వ వచనము** : మనుష్యుల భాషలతో మాటలాడుట గొప్ప సంగతియే కాని, దేవదూతల భాషలతో మాటలాడుట మరీ గొప్ప సంగతి. కాని ప్రేమ గల హృదయము లేకుండ ఎన్ని భాషలు మాటలాడినను గట్టి శబ్దము చేయునట్టి గంటలవలె ఉంటారు అన్నాడు.

**2వ వచనము** : 1. ప్రవచన వరము, 2. లేఖనముల యందలి జ్ఞానము, 3. పరిపూర్ణ విశ్వాసము అను వరములున్నవాడు ప్రేమ లేని యెడల వ్యర్థుడే. 3వ. బీదల పోషణకై ఆస్థి అంతటిని ఇచ్చినంతటి త్యాగము కలిగినవారు కాని, ప్రాణ త్యాగము చేసిన వారు కాని యధార్థమైన ప్రేమ లేని యెడల ప్రయోజనముండదు.

**ప్రేమ యొక్క గుణములు (4-7వ.)** :

**ఎ) నిజమైన ప్రేమలో ఉండు గుణములు** :

1. ప్రేమ దీర్ఘకాలము సహించును.
2. ప్రేమ దయ చూపించును.
3. ప్రేమ సత్యమునందు సంతోషించును.
4. ప్రేమ అన్నిటిని తాళుకొనును.
5. ప్రేమ అన్నిటిని నమ్మును.
6. ప్రేమ అన్నిటిని నిరీక్షించును.
7. ప్రేమ అన్నిటిని ఓర్చుకొనును.

8. ప్రేమ శాశ్వత కాలముండును.

9. ప్రేమ మత్సరపడదు.

10. ప్రేమ డంబముగా ప్రవర్తించదు.

11. ప్రేమ ఉప్పొంగదు.

12. ప్రేమ, అమర్యాదగా నడవదు.

13. స్వప్రయోజనమును విచారించదు.

14. త్వరగా కోపపడదు.

15. అపకారమును మనసులో ఉంచుకొనదు.

16. దుర్నీతి విషయమై సంతోషించదు.

సామెతలు 10:21వ. వచనములో ప్రేమ దోషమును కప్పును, ద్వేషము రేపును అని ఉన్నది. కనుక ప్రేమతో సమస్తము కప్పువారముగానుండాలి కాని రూపకూడదు.

ప్రేమ యొక్కశ్రేష్ఠత **(8-12)** : ఆత్మీయ వరములగు భాషలు నిలిచిపోయినవి, జ్ఞానము నిరర్థకమగునది 14:1లో ప్రవచన వరమును విశేషముగా అపేక్షించమన్నాడు కాని అదియు నిరర్థకమగును వరములలో కొన్ని నిలిచిపోవునవి. ప్రేమయే శ్రేష్ఠమైనది అని చెప్పుచున్నాడు. పూర్ణమైనది వచ్చినపుడు పూర్ణము కానివి నిరర్థకమగును అనుటలో భాషలు, ప్రవచనములు, జ్ఞానము పూర్ణము కానివని ఆత్మీయులు పెద్ద వారైనపుడు పిల్లవాని చేష్టలు మానివేయాలని, నిరర్థకమగునవి కాక శాశ్వతమైన ప్రేమ మీద దృష్టి యుంచవలెనని చెప్పుచున్నాడు. విశ్వాసము, నిరీక్షణ, ప్రేమ అను మూడు క్రైస్తవ జీవిత ప్రాముఖ్యతలు కాని క్రీస్తు ప్రత్యక్షమైనపుడు విశ్వాసముతోను నిరీక్షణతోను పని ఉండదు.

నిరీక్షించునది కనబడునపుడు నిరీక్షణతో పని ఉండదు. విశ్వాసము నిరీక్షించు వాటి నిజ స్వరూపము. (హెబ్రీ. 11:1) కాన విశ్వాసమునకు కర్తయైన క్రీస్తును చూచునపుడు, విశ్వాసముతోను, నిరీక్షణతోను పని ఉండదు. ప్రేమ ఒక్కటే క్రీస్తుకు, మనకు మధ్య శాశ్వతముగా నిలుచునది. కావున, ప్రేమయే శ్రేష్ఠమైనది.

## 14వ అధ్యాయము 6+7+6+6+8+7=40 వచనములు
## అంశము : వరములను వాడుకొనుటలోని లోపములు

**భాషలు Vs ప్రవచనము - ప్రవచనవరము యొక్క అవసరత శ్రేష్ఠము - సంఘ క్షేమాభివృద్ధి (1-6వ, 7-13వ)** : ఈ అధ్యాయమందు క్షేమాభివృద్ధి అను పదము ఏడు పర్యాయములు కలదు.

**1-3వ వచనము** : సంఘ క్షేమాభివృద్ధి ప్రాముఖ్యమైన అంశము. అందువలన సంఘమంతటికి హెచ్చరిక, ఆదరణ, క్షేమము, అభివృద్ధి కలుగునట్లు భాషల వరమును కాక ప్రవచన వరము అపేక్షించాలి. భాషతో మాటలాడువాడు మనుష్యులతో కాక దేవునితో మాటలాడును. ప్రవచించువాడు మనుష్యులతో మాటలాడి క్షేమాభివృద్ధి కలిగించును.

**4-6వ వచనము** : అర్థము చెప్పువాడు లేని యెడల భాషతో మాటలాడుట తనమట్టుకే క్షేమము. అందువలన ప్రవచనమే శ్రేష్ఠము. అందరు ప్రవచించవలెనని పౌలు కోరుచున్నాడు. భాషతో మాటలాడువాడు, వాక్య సత్యమును, వాక్యమందలి జ్ఞాన ఉపదేశమును, ప్రవచనమును గూర్చి గాని బోధను గాని మాటలాడడు. కనుక భాషల ద్వారా ప్రయోజనము లేదు.

**7-9వ వచనము** : వాయిద్యములు వాయించినపుడు స్వరములోని భేదమును బట్టి స్పష్టమగును. ఆలాగే నాలుకతో స్పష్టమైన మాటలు పలుకని యెడల గాలితో మాటలాడినట్లు ఉండును.

**10-13వ వచనము** : లోకమందున్న భాషలు అన్నియు స్పష్టములే. అందువలన అర్థము తెలియక మాటలాడు వాడు విను వానికి పరదేశిగానుండును. భాషతో మాటలాడువాడు అర్థము చెప్పలేని యెడల ప్రయోజనముండదు. కనుక సంఘమునకు క్షేమాభివృద్ధి కలిగించు ఆత్మ సంబంధమైన వరముల విషయమై ఆసక్తిగా నుండాలి.

**భాషలతో మాటలాడుట, ప్రార్థించుట (14-19వ.)** : భాషతో ప్రార్థించుట, ఆత్మతో ప్రార్థించుట, పాడుట, స్తోత్రము చేయుట వలన ఎదుటి వ్యక్తి గ్రహింపలేడు, ఆమెన్ చెప్పలేడు. క్షేమాభివృద్ధిని పొందలేడు. కనుక సంఘములో భాషతో పదివేల మాటలు పలుకుట కంటే మనసుతో ఐదు మాటలు బోధ కలుగునట్లు పలుకుట మేలు కనుక ప్రవచనము భాషలకంటే మేలు.

**భాషలు అవిశ్వాసులకు సూచన (20-25వ.) - ప్రవచన ఉద్దేశము సంఘ క్షేమాభివృద్ధియే** : యెషయా 28:11-12. వచనములలోనున్నట్లు బుద్ధి విషయము పసి పిల్లలుగా ఉండవద్దని చెప్పుచూ 21-23 వచనములలో భాషల విషయమై మాటలాడు చున్నాడు. అనగా భాషలు శిశువులుగా నుండి ఆత్మీయ అనుభవము లేనిస్థితికి చెందినవని స్పష్ట పరచుచున్నాడు. అ.కా. 2వ అధ్యాయములో పేతురు మాటలు 17 జనాంగముల వారికి వారివారి భాషలలో అర్థమైనవి. అది సంఘము యొక్క శిశువు దశ అని

చెప్పుచున్నాడు. అయినను ఇశ్రాయేలు వారు ఎక్కువ మంది నమ్మలేదు. భాషలు అక్కడ చేరిన 17 దేశములకు చెందిన అన్యులకు సూచనగా ఇవ్వబడినవని, విశ్వాసులైన వారికి సూచనలు కాదని 22వ. వచనములో చెప్పుచున్నాడు. ఆత్మీయులైన కొరింథీయులు భాషలతో మాటలాడినపుడు లోపలికి వచ్చిన క్రొత్త వారికి వెర్రిగానుండును. కనుక ప్రవచనమైతే క్రొత్త వారు తమ పాప స్థితిని గుర్తించి రక్షింపబడుటకు ప్రయోజన కరముగా నుండును కనుక భాషలు సంఘ ప్రారంభ కాలమునకు చెందినవని స్థిరపరచుచున్నాడు. 13:8-12వ ప్రకారము నేను పిల్లవాడనై యున్నపుడు పిల్లవానివలె ప్రవర్తించితిని. ఇపుడు పెద్దవాడనై పిల్లవాని చేష్టలు మానివేసితిని. అనుటలో భాషలు నిలిచిపోవునని 13:8లో చెప్పిన మాటను స్థిరపరచును. ఈ గ్రంథము క్రీ.శ. 56లో వ్రాయబడినది. క్రీ.శ. 57లో రెండవ కొరింథీ, రోమా పత్రిక క్రీ.శ. 61లో ఎఫెసీ, కొలస్స, ఫిలేమోను, పత్రికలు, క్రీ.శ. 62లో ఫిలిప్పీ పత్రిక, క్రీ.శ. 63లో మొదటి తిమోతి, క్రీ.శ. 64లో తీతు పత్రిక, క్రీ. 65,66లో రెండవ తిమోతీ పత్రిక, హెబ్రీ పత్రికలు వ్రాయబడినవి. క్రీ.శ. 57 తదుపరి వ్రాయబడిన గ్రంథములందు భాషల ప్రస్తావన లేనందున 1 కొరింథీ. 13:8లో చెప్పబడినట్లు భాషలు నిలిచిపోయినవని గ్రహింపవలెను. సంఘ ప్రారంభ కాలమునకు చెందినవైనందున ఈ కాలమునకవి అవసరము లేదు.

| క్ర.సం | వాక్య ప్రవచన అవసరత | భాషల అవసరత |
|---|---|---|
| 1. | 1వ.ప్రవచనవరము అపేక్షించతగినది | 1వ. భాషలను అపేక్షించుమని చెప్పబడలేదు |
| 2. | 2-4వ. ప్రవచనము ద్వారా సంఘమునకు క్షేమాభివృద్ధి కలుగును | 2వ భాషలద్వారా మాటలాడు వానికే క్షేమాభివృద్ధి |
| 3. | 5వ. ప్రవచింపవలెనని మరి విశేషముగా కోరుచున్నాను. | 5వ. భాషలతో మాటలాడ వలెనని కోరుచున్నాను. |
| 4. | 5వ. ప్రవచించువాడే శ్రేష్ఠుడు | 5వ. భాషతో మాటలాడువాడు అర్థము చెప్పాలి. |
| 5. | 6వ. ప్రవచనము ప్రయోజనకరమైనది | 6వ. భాషలు ప్రయోజనకరము కాదు |
| 6. | 7-9వ. ప్రవచనములో స్పష్టమైన మాటలుండును | 7-9వ. భాషలలో స్పష్టమైన మాటలు లేకపోవుట వలన మేలు లేదు |
| 7. | 10-11వ. ప్రవచనము స్పష్టమైనందున అందరికి అర్థమగును. | 10-11వ. భాషలు స్పష్టము కాని యెడల మాటలాడువాడు పరదేశిగానుండును |
| 8. | 12-14వ. భాషలేకుండా ప్రార్థించుట | 12-14వ. భాషతో ప్రార్థించుట |

| | | |
|---|---|---|
| | వలన మనసుకు ఫలవంతముగానుండును | వలన మనసు ఫలవంతముగా నుండదు. |
| 9. | 16వ. భాషలేకుండా ప్రార్థించుట వలన అందరికి అర్థమగును. | 16వ. భాషతో ప్రార్థించినపుడు అందరికి అర్థము కాదు. |
| 10. | 16వ. భాష లేకకుండా చేసిన ప్రార్థనకు అందరు ఆమెన్ చెప్పుదురు. | 16వ. భాషతో చేసిన ప్రార్థనకు అందరు ఆమెన్ చెప్పలేరు. |
| 11. | 19వ. ప్రవచనము ద్వారా ఇతరులకు బోధ కలుగు ఐదు మాటలైనను శ్రేష్ఠమే. | 19వ. భాషతో పదివేల మాటలు పలికినను మనసుకు మేలు లేదు. |
| 12. | 20వ. ప్రవచనము వయసు వచ్చినవారి అనుభవము. | 20వ. భాషలు శిశుప్రాయములో నున్నవారి అనుభవము. |
| 13. | 22వ. ప్రవచనము విశ్వాసులకు సూచన. | 22వ. భాషలు అవిశ్వాసులకు సూచన |
| 14. | 23వ. ప్రవచనము క్రొత్తవారికి అర్థమగును. | 23వ. భాషలు క్రొత్తవారికి వెర్రిగానుండును |
| 15. | 27-31వ. అందరు ఒకరి తరువాత ఒకరు ప్రవచించవచ్చును. | 27-31వ. భాషలతో మాటలాడిన ఎడల అర్థము చెప్పబడాలి |
| 16. | 31వ. అందరికి నేర్పుదల హెచ్చరికలు ఉండును. | 31వ. అందరికి హెచ్చరిక ఉండదు. |
| 17. | 32-33వ ప్రవచనము ద్వారా సంఘములో సమాధానము కలుగును. | 32-33వ. భాషలతో అల్లరి కలుగగలదు. |

**కూడి వచ్చి వరములను వాడుకొనుట - సంఘ క్షేమాభివృద్ధి (26-33వ.)** : ఆరాధనకై ఆదివారము కూడవలెని అ.కా. 20:7లో చెప్పబడినది. 26వ. ఆలాగు కూడి వచ్చినపుడు ఒకడు కీర్తన పాడవలెను. ఆలాగే మరొక కీర్తన పాడవచ్చును. మరి యొకడు అనగా మొదటివాడు కాదు, ఇంకొకడు ప్రభువుయైయున్నాడా? (ఆరాధన) మనకేమి చేసాడా? (స్తుతి) క్లుప్తముగా బోధించాలి, బయలు పరచబడినవి. మరియొకడు తనకు బయలు పరచబడినది ప్రకటించాలి. 27-28 వచనములో నున్న భాషతో మాటలాడుట, అర్థము చెప్పుట నిలిచి పోయినవని గమనించాలి. 29-31వ. అందరికి బోధ కలుగునట్లు ఒకరి తరువాత మరొకరు ప్రవచించాలి లేదా ప్రకటించాలి. ఒకడు, మరొకడు, మరియొకడు అనుటలో పురుషులు మాత్రమే పై కార్యక్రములు జరిగించాలని అర్థమగును. తరువాత రొట్టె కొరకు, రసము కొరకు ప్రార్థన కూడా పురుషులే. 34వ వచనములోనున్న స్త్రీలు సంఘములలో మౌనముగా నుండవలెనను మాట పై తలంపులను స్థిరపరచుచున్నది.

**సంఘములలో స్త్రీలు మాటలాడకూడదు - సంఘ క్షేమాభివృద్ధి (34-38వ.)** : సంఘములలో అని బహువచనము చెప్పబడినందున కొరింథీ సంఘములో మాత్రమే

కాక అన్ని సంఘములలోను స్త్రీలు మౌనముగా నుండవలెనని గుర్తించాలి. మాటలాడుట అనగా సంఘముతో మాటలాడుటకు (భోధించుటకు) మరియు దేవునితో మాట లాడుటకు (ప్రార్థించుటకు) దేవుని సెలవులేదని గుర్తించాలి. పాత నిబంధన గ్రంథము హెబ్రీ. 10:1వ. ప్రకారము రాబోవుచున్న మేలుల ఛాయగలది. అందుచేత పాత నిబంధనలో కూడా ఇశ్రాయేలీయుల సర్వ సమాజము ముందు స్త్రీలు బోధించుట కాని, బహిరంగముగా ప్రార్థించుట కాని, స్తుతించుట కాని జరుగలేదు. నిర్గమ. 15:20లో మిర్యాము తంబుర చేత పట్టుకొనినపుడు స్త్రీలు ఆమెను వెంబడించిరి. స్త్రీలు మాత్రమే కాని ఇశ్రాయేలీయుల సమాజము కాదు. కేవలము స్త్రీల మధ్య మిర్యాము పల్లవి ఎత్తి పాడినది. ఇది స్త్రీల సభ మాత్రమే కనుక స్త్రీల సభలో స్త్రీలు పల్లవి ఎత్తుట, తద్వారా స్తుతి, ప్రార్థన బోధ కలిగించుట ఛాయరూపకమైన ధర్మశాస్త్ర గ్రంథమందు కలదు. 1 సమూ. 1:10-13వ. వచనాలలో మందసమున్న స్థలమందు హన్నా ఉన్నది. ఇది ప్రత్యక్ష గుడారమైనందున, సంఘమునకు గురుతు. అందుచే హన్నా మనసులో ప్రార్థించుచున్నది (12వ). స్వరము వినపడలేదు (13వ.) ఈ క్రమమును బట్టి సంఘములలో అనగా ప్రపంచమందున్న అన్ని సంఘములలో అ.కా. 2:42 ప్రకారము అపొస్తలుల బోధలో గాని, సహవాసము ప్రార్థన, రొట్టె విరుచుటయందు స్త్రీలు మౌనముగా నుండ వలెననునది దేవుని ఆజ్ఞ అని గుర్తించుకొనాలి. ఇవి కాని కూడికలు 1) స్త్రీల మధ్య కూడిక - పైన చెప్పబడినట్లు కేవలము స్త్రీలే ఉన్నారు కనుక స్త్రీలు స్తుతించుట, పల్లవి ఎత్తుట, ప్రార్థించుట, వాక్యము నుండి హెచ్చరికలు చేయుట క్రమమేనని గుర్తించాలి. అ.కా. 21:1-9వ. సువార్తికుడైన ఫిలిప్పు ఇంట ప్రవచించు కన్యకలైన నలుగురు కుమార్తెలుండిరి. వారు కన్యకలు స్వంత గృహములు వారికి లేవు. కనుక స్త్రీల మధ్య పరిచర్య కేవలము తమ గృహముల వరకేనని తలంచకూడదు. యోహాను 4:39వ. సమరయ స్త్రీ ఆ ఊరిలోని అనేకులకు సువార్తనందించగా వారు క్రీస్తును అంగీకరించిరి. స్త్రీలు సువార్త ప్రకటన బహిరంగముగా పట్టణములో చేయవచ్చును. సమయర స్త్రీ సువార్త ప్రకటన పట్టణములోనే, సంఘములో కాదని గుర్తించాలి. తీతు 3:2-5వ. వృద్ధ స్త్రీలు.... యౌవనస్త్రీలకు.... మంచి ఉపదేశము చేయువారైయుండాలి, కనుక స్త్రీలు సంఘకూడిక కాని ప్రత్యేకమైన స్త్రీల కూడికలలోను, యవ్వనుల కూడికలలోను, ఉపదేశము చేయవచ్చును. 37-38 వచనముల ప్రకారము ఏ ఆత్మ సంబంధికాని, ప్రవక్త గాని ఇవి దేవుని ఆజ్ఞలు అని గుర్తించాలి.

**ముగింపు (39-40వ)** : కావున కొరింథీ సంఘమునకు క్రీ.శ. 56లో వ్రాస్తు ప్రవచించుటనే ఆసక్తితో అపేక్షించమన్నాడు. భాషలను ఆటంకపరచ వద్దన్నాడు కాని అపేక్షించమనలేదు. భాషలు సంఘ శిశుకాలమునకు ఇవ్వబడినందున ఆకాలమందు ఆటంకపరచవద్దన్నాడు. తదుపరి 1 కొరి. 13:8వ ప్రకారము అవి నిలిచిపోయినవి.

## 15వ అధ్యాయము 4+7+8+9+6+7+8+9=58 వచనములు
## అంశము : పునరుత్థానమును అర్థము చేసికొనుటలోని లోపము

**క్రీస్తు పునరుత్థానమునకు లేఖనముల రుజువు (1-4వ.)** : పాత నిబంధన యందు క్రీ.పూ. 1000లో నివసించిన దావీదు 22వ కీర్తనలో క్రీస్తు మరణమును గూర్చి, 16 కీర్తనలలో పునరుత్థానమును గూర్చి చెప్పబడినది. ఆలాగే క్రీ.పూ. 700లో యెషయా 53వ అధ్యాయము లోను క్రీ.పూ. 520లో జెకర్యా గ్రంథము 9-13 అధ్యాయమందును మరి ఇతర గ్రంథములందును క్రీస్తు మరణ పునరుత్థానములు చెప్పబడినవి. యోహాను 10:18నందు యేసుతానే "నా ప్రాణము పెట్టుచున్నానని ప్రాణము పెట్టుటకు తిరిగి తీసుకొనుటకు నాకు అధికారము కలదని, పునరుత్థానమును గూర్చి పలికెను.

**క్రీస్తు పునరుత్థానమునకు చరిత్ర నుండి రుజువు (5-11వ.)** : పునరుత్థానమైన పిదప మొదట కేఫాకు, 12 మంది శిష్యులకు, ఐదువందల మందికి, యాకోబుకు. ఆలాగే పౌలు కు కనబడిన వివరములు సువార్తలలోను అపొస్తలుల కార్యములలోను చూడగలము. సుమారు పదకొండు పర్యాయములు యేసు పునరుత్థానము తదుపరి కనబడిన వివరములు వ్రాయబడినవి. అట్టి యేసుకు పౌలు ప్రకటించుటకు, ప్రయాస పడుట, అందరికంటే ఎక్కువగా ప్రయాసపడుటకు సహాయపడిన దేవుని కృపను గూర్చి చెప్పుచున్నాడు.

**క్రీస్తు లేపబడినందున తర్కము నుండి మృతులు లేపబడుదురను రుజువు (12-19వ.)** : మృతులలో నుండి ఒకరు లేపబడిన యెడల మృతులందరు లేపబడుదురని నమ్మ వచ్చును. బియ్యము ఉడికించినపుడు ఒక్క గింజ పిసికిన యెడల అన్నము ఉడికినదని నమ్మినట్లే మృతి పొందిన క్రీస్తు లేచినందున మృతులందరు లేతురని నమ్ముచున్నాము. మృతులు లేపబడని యెడల మన విశ్వాసము వ్యర్థమే. మన పాపములు క్షమించబడ లేదు. మనము మనుష్యులందరి కంటె దౌర్భాగ్యులము అగుదుము కనుక మృతులు లేపబడుట వాస్తవమని నమ్మాలి.

**దైవికముగా క్రీస్తు పునరుత్థానము జరిగినందున - మృతుల పునరుత్థానము జరుగును (20-28వ.)**: ఒక మనుష్యుడైన ఆదాము పాపము, మరణముల ద్వారా అందరు పాపులై మరణించుదురు. అలాగే క్రీస్తు అను ఒకని పునరుత్థానము ద్వారా అందరు తమ తమ వరుసలో బ్రతికింప బడుదురు. తరువాత సమస్త ఆధిపత్యము కొట్టివేయబడి క్రీస్తు తండ్రికి అధికారము అప్పగించి దేవునికి తానే లోబడును.

**అనుభవమును బట్టి బాప్తిస్మమందు పాతిపెట్టబడి తిరిగి లేచుట, పరిశుద్ధుల పునరుత్థాన సాదృశ్యమే (29-34వ.)** : మనము బాప్తిస్మము పొందినపుడు ప్రాచీన పురుషుడు చనిపోగా మనము పాతిపెట్టబడితిమి. నూతన పురుషుడు పునరుత్థానులమై జీవించుచున్నందున తిరిగి నీటి నుండి పైకి లేపబడితిమి. దినదినము క్రీస్తు కొరకు మనము చనిపోవుచున్నా మని పౌలు తన అనుభవము చెప్పుచున్నాడు. రోమా 8:36వ.లో దీని వివరములు కలవు. కనుక తిరిగి క్రీస్తునందు మనము బ్రతుకుదుమని నిరీక్షణ కలిగియున్నాము.

**సృష్టిలోని విషయముల పోలిక నుండి (35-41వ.)** : గోధుమగింజ భూమిలో విత్తబడి చనిపోయి తిరిగి బ్రతికింపబడినట్లు చనిపోయిన మన్నయిన శరీరము పాతిపెట్టబడుట భూమిలో విత్తుటయే. గోధుమగింజ బ్రతికినట్లు మృతులు పునరుత్థానులగుదురు. దేవుడే గోధుమగింజకు శరీరమిచ్చినట్లు మనకును పునరుత్థానమందు నూతన శరీరమునిచ్చును. సూర్య, చంద్ర, నక్షత్రములకు వేరు వేరు ప్రకాశములున్నట్లు పునరుత్థానములో వేరు వేరు మహిమలను మనమును కలిగియుందుము.

**మృతుల పునరుత్థాన వివరములు (42-49వ.)** : శరీరము క్షయమైనది, ఘనహీన మైనది, ప్రకృతి సంబంధమైనది, కాని పునరుత్థానములో అక్షయమైనదిగాను, ఘనమైనది గాను, బలమైనదిగాను, ఆత్మ సంబంధమైనదిగాను లేపబడును. మొదటి మనుష్యుడైన ఆదాము జీవించు ప్రాణి అని, కడపటి ఆదామగు క్రీస్తు జీవింపచేయు ఆత్మ అనగా పునరుత్థాన మిచ్చువాడని గమనించగలము. ఆదాము పోలికను శరీరరీతిగా మనము కలిగియున్నట్లు క్రీస్తు పోలికను అనగా పరలోక సంబంధి పోలికను, ఆయనవలె మహిమ గల పునరుత్థానమును కలిగినవారముగా నుందుము అని నేర్చుకొనవలెను.

**మృతుల, సజీవుల పునరుత్థానము - మార్పు చెందుట (50-58వ.)** : రక్త మాంసములతో దేవుని రాజ్యమును స్వతంత్రించుకొనము కాని బూర మ్రోగగానే మృతులు ముందుగా అక్షయులుగా మార్చబడుదురు. తరువాత సజీవులుగానున్న వారు కూడా

అక్షయులుగా మార్చబడి వారి వెంబడి ప్రభువును ఎదుర్కొందురు. జీవమందు మరణము మ్రింగివేయబడును. మరణపు ముల్లు విరువబడెను. అనగా మరణమునకున్న బలము తీసివేయబడెను. క్రీస్తు మూలముగా విశ్వాసులు జయమును కలవారు.

## 16వ అధ్యాయము 6+6+6+6=24 వచనములు
## అంశము : చందా ప్రోగు చేయుటలోని లోపము - ముగింపు

**విభజన - చందాను గూర్చినది - పౌలు ప్రయాణమును గూర్చినది (1-6వ.)** : ప్రతి ఆదివారము సంఘముగా కూడినపుడు ప్రతివాడు తాను వర్ధిల్లిన కొలది చందా ప్రోగు చేయబడవలెను. ఆ ఉపకార ద్రవ్యమును యెరూషలేముకు పంపుట యుక్తమని చెప్పు చున్నాడు. పౌలు కొరింథుకు వచ్చు ప్రయాణమును గూర్చి చెప్పుచున్నాడు.

**పౌలు, ఇతరుల ప్రయాణ వివరములు (7-12వ.)** : ఈ పత్రిక వ్రాయునపుడు ఎఫేసులోనున్నాడు. పెంతెకొస్తు వరకు ఉందునంటున్నాడు. పౌలు క్రీ.శ. 54,55,56లో ఎఫేసులో ఉన్నందున ఈ పత్రిక 56 సం॥ పెంతెకొస్తు ముందు అనగా మార్చి నెలలో ఈ పత్రిక వ్రాయబడెనని తలంచగలము. పౌలు తరువాత కొరింథుకు వత్తునని చెప్పుచున్నాడు. అ.కా. 19:21లో కూడా అలాగే తలంచెను. తిమోతి కొరింథుకు వచ్చునని, అపొల్లో ఇప్పుడు వచ్చుట లేదని చెప్పుచున్నాడు.

**చివరి హెచ్చరికలు (13-18వ)** : స్తెఫను ఇంటివారు అకయలో ముందుగా ప్రభువును నమ్మి, పరిచర్యలో ప్రయాసపడుచున్నారు. వీరివలె ప్రయాసపడువారు ఈ దినములలోను అక్కరగానున్నారు. అట్టివారికి సంఘము సహాయము చేయవలెనని పౌలు కోరుచున్నాడు.

**వందనములు, ముగింపు - ఆశీర్వాదము (19-24వ.)** : అకుల, ప్రిస్కిల్లలు ఎఫేసులో ఉన్నారు. వారి ఇంట సంఘమున్నది. ప్రతి విశ్వాసి కుటుంబము వీరిని మాదిరిగా తీసుకొనాలి. సహోదరులు ఒకరి కొకరు వందనములు చెప్పాలి. ప్రభువు రాకడ నపేక్షించుచూ (మరనాతా) వందనములలో ఆశీర్వాదముతోను ముగించుచున్నాడు.

# కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక

గ్రంథకర్త : పౌలు . కాలము : క్రీ.శ. 57 స్థలము : మాసిదోనియ. పంపబడుట : తీతు (6:16)

అంశము : పరిచర్య.

## అధ్యాయాల విభజన 2+4+1+2+4 =13 అధ్యా.

**I. 1-2 అధ్యా. ప్రభువునందు జీవించు పరిచర్య :**

**1వ అధ్యాయము** : పరిచర్యలోని ఆదరణ.

**2వ అధ్యాయము** : పరిచర్యలోని క్రమశిక్షణ - ఊరేగింపు.

**II. 3-6 అధ్యా. ప్రభువునందు చేయవలసిన (సేవా సంబంధమైన) పరిచర్య :**

**3వ అధ్యాయము** : పరిచర్య యొక్క మహిమ.

**4వ అధ్యాయము** : పరిచర్యలోని ప్రకాశము - శ్రమలు.

**5వ అధ్యాయము** : పరిచర్య యొక్క విధము - నిరీక్షణ.

**6వ అధ్యాయము** : పరిచర్య యొక్క లక్షణములు.

**III. 7వ అధ్యా. ప్రభువునందు ప్రత్యేకత గల పరిచర్య**

**IV. 8-9 అధ్యా. ప్రభువుకు ఇచ్చు పరిచర్య :**

**8వ అధ్యాయము** : ప్రభువుకు ఇచ్చుట - ఇవ్వబడిన ఈవులను కాపాడు పరిచర్య.

**9వ అధ్యాయము** : ఇచ్చుటను గూర్చిన హెచ్చరిక.

**V. 10-13 అధ్యా. ప్రభువునందు (తనను) భద్రపరచుకొను పరిచర్య :**

**10వ అధ్యాయము** : పరిచర్యలోని విమర్శలకు పౌలు జవాబులు

**11వ అధ్యాయము** : పౌలు అపొస్తలత్వపు ఋజువులు.

**12వ అధ్యాయము** : పౌలు అపొస్తలత్వపు ఋజువులు.

**13వ అధ్యాయము** : చివరి హెచ్చరికలు

పరిచర్యలోని 5 ముఖ్య అంశములను గమనించండి. పరిచర్యలో మొదటి జీవితము రెండవది చేయవలసిన సేవ. (సేవకంటె జీవితము ముఖ్యము మొదటిది

అని గమనించవలెను). ప్రత్యేకత మూడవది. పరిచర్యలో ధననిధిని విప్పుట నాలుగవది. చివరిదిగా నిన్ను నీవు భద్రపరచుకొనుట.

# 1వ అధ్యాయము 3+4+4+6+5+2 = 24 వచనములు
## అంశము : పరిచర్యలోని ఆదరణ

**పీఠిక (1-3వ.)** : పౌలు కొరింథులో 18 నెలలు నిలిచి చేసిన సేవా వివరములు అ.కా. 18వ అధ్యాయములోని మొదటి 18 వచనములలో కలవు. ఆ సేవ ఫలితముగా కొరింథులో మాత్రమే కాక అకయ యందలియంతటను అనగా గ్రీసు దేశమంతటను సంఘములు ఏర్పడినవి. ఇది సేవకులు గమనించదగినది. దేవుడు కనికరము చూపువాడని, ఆదరించువాడని అనుభవ పూర్వకముగా పౌలు వ్రాయుచున్నాడు.

**శ్రమలతో కూడిన జీవితమందు దేవుడిచ్చిన ఆదరణ (4-7వ.)** : క్రీస్తును అంగీకరించుట ద్వారా కొరింథీయులకు శ్రమలు కలిగినది. పౌలు కూడా శ్రమల పాలాయెను. శ్రమలన్నిటిలో పౌలు ఆదరణ పొందెను. తద్వారా ఎట్టి శ్రమలలో జీవించువారినైనను ఆదరించుటకు శక్తిని పొందెను. భక్తులకు శ్రమలు వచ్చు కారణములలో ఇది ఒకటి అని గమనించవలెను.

**శ్రమలనుండి తప్పించిన దేవునియందే నిరీక్షణ (8-11వ.)** : పౌలు అపొస్తలుల కార్యములు 18వ అధ్యాయములో కొరింథులో 18 నెలల సేవ తరువాత 19-21 వచనములలో కొంత కాలము ఎఫెసులో సేవ చేసెను. ఆ దినములలో గొప్ప శ్రమలు, కలిగిన అత్యధిక భారమును బట్టి బ్రతుకుదుమన్న నమ్మకము పోయినదని చెప్పుచున్నాడు కాని దేవుడు మృతులను లేపు శక్తిగలవాడు కనుక మమ్మును గొప్ప మరణము నుండి తప్పించినందున ఇక ముందును తప్పించునని నిరీక్షన కలిగియున్నాడు కనుక మన జీవిత కాలములో కలుగు శ్రమలలో శక్తిగల దేవుని మీద నమ్మకముంచవలెనని చెప్పుచున్నాడు.

**దేవునితో నమ్మకముగా జీవించిన పౌలు (12-17వ.)** : పౌలు లోక రీతిని కాక దేవుడను గ్రహించు పరిశుద్ధతతోను, నిష్కపటముతోను, దేవుని కృపననుసరించి జీవించెను. ఈ విషయమై కొరింథీయులే సాక్షి అంటున్నాడు. ప్రభువైన యేసు దినమున తనకు అతిశయము లేక ఆనందము కలుగును అంటున్నాడు. ఇది ఎంతో మాదిరియైన జీవితము.

**నమ్మదగిన దేవుడు (18-22వ.)** : యేసుక్రీస్తు అవునని చెప్పి కాదను వాడు కాడు. నమ్మదగినవాడు. 2 తిమోతి 2:13వ వచనములో మనము నమ్మదగని వారమైనను ఆయన నమ్మదగిన వాడుగా నుండునని చెప్పబడినది. ఈ నమ్మదగిన దేవుడు అసంఖ్యాకములైన వాగ్దానములను తన గ్రంథమందు మనకిచ్చాడు. అవన్నియును క్రీస్తునందు మన పక్షమున అవునన్నట్లుగా నున్నవి. విశ్వాసకోటి దీని నమ్మక ఏదో ఒక వాగ్దానమును దేవుడు తనకిచ్చెనని నమ్ముచారు కలరు. అన్ని వాగ్దానములు మనవి. వాటిని స్వతంత్రించు కొనాలి. మనకు ఆయన ముద్రవేసి ఆత్మ అను సంచకరువును మనము క్రీస్తునందు విశ్వాసముంచినపుడే ఎఫెసి. 1:13-14వ. ప్రకారము దయ చేసెను. మన ద్వారా దేవునికి మహిమ కలుగుటకే ఆ వాగ్దానములన్నిటిని మన పక్షమున నెరవేర్చుచున్నాడని గమనించవలెను.

**23-24వ కొరింథీయుల ఆనందములో సహకారుడైన పౌలు** : పౌలు తన జీవితములో కలిగిన శ్రమలలో తాను నేర్చుకొనిన పాఠములను బట్టి కొరింథీయులకు శ్రమలు కలిగి నందున ఆదరణ, ఆనందము కలిగించు తన అనుభవమును వారికి వ్రాయుచున్నాడు.

## 2వ అధ్యాయము 4+7+6=17 వచనములు
## అంశము : పరిచర్యలోని క్రమశిక్షణ

**క్రమశిక్షణను గూర్చి మొదటి ఉత్తరములో వ్రాసిన విధము (1-4వ.)** : పౌలు వ్రాసిన మాటలు కొరింథీయులకు దుఃఖము కలిగించినను, వారి జీవితములు దిద్దబడుట ద్వారా తనకు ఆనందము, ఆదరణ కలుగునని నమ్ముచున్నాడు. అందుకే మొదటి పత్రికలో వారి లోపములను దిద్దుటకై వ్రాసిన మాటలను శ్రమలతోను, మనో వేదనతోను, కన్నీటితోను వ్రాసితినని చెప్పుచున్నాడు. తోటి సహోదరుల జీవితములను దిద్దుటలో మన మందరము ఈ మాదిరిని గమనించవలెను. దీని విషయము గలతీ. 6:1-5వ, మత్తయి 18:15,17వ.లో మరికొన్ని వివరములు కలవు.

**క్రమశిక్షణలో ఉన్నవారిని చేర్చుకొనుట (5-11వ.)** : మొదటి పత్రికలో పౌలు వ్రాసిన దిద్దుబాటులు కొరింథీయులందరికిని దుఃఖము కలిగించెను. కాని పాపములో ఉన్నవాడు దిద్దుకొనియున్నాడు. అటువంటి వానిని చేర్చుకొనుటకు వెనుదీయకూడదు. లేని యెడల వాడు మరి కృంగిపోవును. ఇప్పుడు అట్టివారిని క్షమించాలి, ప్రేమించవలెను. వారిని

చేర్చుకొనపలెను. ఈ విషయము సాతాను మనలనందరిని మోసపరచగలడు. అనేక సంఘములలో శిక్షించు విషయములలో చూపిన శ్రద్ధను, క్షమించి చేర్చుకొనుటలో చూపరు. దీనిని గమనించాలి.

**పరిచర్యలో విజయోత్సవముతో ఊరేగించుచున్న దేవుడు** : సువార్త ప్రకటించుచు పౌలు త్రోయకు రాగా మంచి సమయము ప్రాప్తించినను తీతు కనబడనందున మనసులో నెమ్మదిలేదంటున్నాడు. సహోదరుల ఆత్మీయ స్థితి విషయమై పౌలుకు కలిగిన భారము గమనించదగినది. ఇతరులు వాక్యమును కలిపి చెరుపుదురు. పౌలు ఆ రీతిగా కలిపి చెరుపువాడు కాడు. నిష్కపటమైనవాడు అందువలన దేవుడు ప్రతి స్థలములోను పౌలు ద్వారా క్రీస్తును గూర్చిన జ్ఞానము యొక్క సువాసనను కనుపరచుచూ క్రీస్తునందు దేవుడు పౌలును ఎల్లప్పుడు విజయోత్సవముతో ఊరేగించుచున్నాడు. పౌలు వంటి సేవకులు నశించువారికి మరణపు వాసనగాను, రక్షింపబడు వారికి జీవపు వాసనగాను ఉందురు. క్రీస్తుచేత ఎల్లప్పుడు ఊరేగించబడుచుందురు.

## 3వ అధ్యాయము 6+5+7=18 వచనములు
## అంశము : పరిచర్య యొక్క మహిమ

**పరిచర్యలోని సామర్థ్యము (1-6వ.)** : పౌలు పరిచర్య ద్వారా కొరింథీయులు ప్రభువును విశ్వసించిరి. కొరింథులోని విశ్వాసుల హృదయము మీద పౌలు పరిచర్య ద్వారా తాము మేలు పొందిరని వ్రాయబడినది. ఈ పత్రిక సిరాతో రాతి పలకల మీద వ్రాయబడిన పత్రికకంటే శ్రేష్ఠమైనది. అందువలన పౌలుకు కొరింథుకు వచ్చుటకు సిఫారసు పత్రికలు అవసరము లేదు. తన సామర్థ్యము బట్టి కాక దేవునిని బట్టియే తన పరిచర్య సామర్థ్యము గలదని గుర్తింపబడినదని చెప్పుట గమనించాలి. దేవుడు క్రొత్త నిబంధనకు, ఆత్మ సంబంధమైన సేవకు పరిచారకులుగా నియమించినందున ఇట్టి సామర్థ్యము కలిగినదని చెప్పుచున్నాడు.

**పరిచర్య యొక్క మహిమ (7-12వ.)** : పాత నిబంధన పరిచర్య చేయు మోషే కొండ మీద నుండి దిగి రాగా అతని ముఖము ప్రకాశించెను. ఆ మహిమ మరణకారణమైనది కనుక క్రమేపి తగ్గిపోయినది. నీతికి కారణమగు పరిచర్య ఆత్మ సంబంధమైనది కనుక ఎంతో మహిమ కలదిగానున్నది. ఆ మహిమ శాశ్వతముగానుండును.

**ప్రభువు పోలికగా మార్చబడు శాశ్వత మహిమ గల పరిచర్య (13-18)** : రోమా 3:23వ. పాపము చేయుట ద్వారా గతములో మానవుడు మహిమను పోగొట్టుకొనెను.

రోమా 3:24-25వ. ప్రకారము పాపము పరిహారము కాగా తిరిగి ఆ మహిమను పొందును. మనము ప్రభువు సన్నిధిలో గడిపిన కొలది దినదినము మహిమ నుండి అధిక మహిమను పొందుచూ క్రీస్తు యొక్క పోలికలోనికి మార్చబడుదుము. 1 కొరింథీ. 15:41-44వ. చెప్పబడినట్లు పునరుత్థానమందు కూడా ఈ మహిమను కలిగియుందుము. కనుక ఇది శాశ్వత మహిమ. ఈ లోకము క్రీస్తును చూడలేదు. కనుక ఆయన మహిమను అనగా క్రీస్తు మహిమను అద్దములవలె లోకమునకు చూపవలెను. ఇది మనము చేయవలసిన పరిచర్యలో ఒక భాగము.

## 4వ అధ్యాయము 6+6+6=18 వచనములు
## అంశము : పరిచర్యలోని శ్రమల ద్వారా ప్రకాశము

**పరిచర్యలోని ప్రకాశమును చూడలేని గ్రుడ్డివారుగానున్న అవిశ్వాసులు (1-6వ.) :** దేవుడు మన ద్వారా జరిగించు పరిచర్య గొప్ప మహిమ గలదని పై భాగములో చూచితిమి. కాని సాతాను అవిశ్వాసులైన వారి మనో నేత్రములకు గ్రుడ్డితనము కలుగ చేసినందున వారు ఈ ప్రకాశమును చూడలేకున్నారు. సువార్త ప్రకటన ద్వారా లోకములోని ప్రజలు క్రీస్తు మహిమను చూడగలరు. కనుక మనము మనలను గూర్చి ప్రకటన చేసికొనక, క్రీస్తు మరణ పునరుత్థానములను గూర్చి, ఆయన ప్రభువు అని లోకము గుర్తించవలసిన అవసరమును గూర్చి లోకమునకు క్రీస్తును గురించిన సువార్త ప్రకటించ వలసిన పరిచార కులమని గుర్తించవలెను. అప్పుడు లోకజనులు క్రీస్తు మహిమను చూడగలరు.

**పరిచర్యలోని శ్రమల ద్వారా క్రీస్తు ప్రకాశమును కనుపరచుట (7-12వ.) :** మన శరీరము మంటికుండయైనను ఎంతో గొప్ప మహిమ రాబోవు దినములలో దీనికున్నదని నేర్చుకొంటిమి. పరిచర్య చేయునపుడు శ్రమలపాలగుదుము. కొన్ని పర్యాయములు క్రీస్తు మరణ అనుభవమును మనమును అనుభవింతుము. మరణించి సజీవుడైన క్రీస్తువలె మనమును శ్రమల ద్వారా మరణ అనుభవమును పొందిన పిదప యేసు యొక్క జీవమును అనుభవించి ఆ మహిమను ప్రకాశమును లోకమునకు కనుపరచుదుము. సువాసన గల దేదైనను పిండబడినపుడు అ సువాన వ్యాపించును. అత్తరు బుడ్డి పగిలినపుడే దాని పరిమళము వ్యాపించినట్లు మనము శ్రమల పాలైనపుడు

మన యందున్న క్రీస్తు మహిమ ప్రకాశము లోకమునకు కనుపరచుదుము. కావున ప్రభువుకు చేయు పరిచర్యలో శ్రమలు పొందుటయు ఒక భాగమేనని గమనించవలెను.

**పరిచర్య చేయునప్పుడు కలిగి ఉండవలసిన గురి (13-18వ.)** : శ్రమల ద్వారా బాహ్య పురుషుడు కృషించినను అంతరంగ పురుషుడు దిన దినము నూతన పరచబడును. శ్రమలు క్షణకాలము కాని మహిమ నిత్యము. కనిపించు శ్రమలు అనిత్యములు, కనిపించనివి నిత్యములు. కావున శ్రమలలో అధైర్యపడక క్రీస్తు మహిమ నిమిత్తమే అవి కలిగినవని క్రీస్తు మహిమపై గురియుంచవలెనని నేర్చుకొనుచున్నాము.

## 5వ అధ్యాయము 5+5+5+6=21 వచనములు
## అంశము : పరిచర్య వివరము

**పరిచర్యలోని నిరీక్షణ (1-5వ.)** : భూమి మీద మన మొదటి గుడారము (ఇల్లు) మన శరీరమే. ఇది కృషించుట మాత్రమే కాక ఒక రోజు నశించును కాని మన చేతిపని కాక దేవునిచే కట్టబడుచున్న నివాసము పరలోకములో మనకున్నదని, ఎరుగుదుము. పరలోకము నుండి దిగివచ్చు ఆ గుడారమును అనగా మహిమ దేహమును మనము ధరించుకొందుమన్న నిరీక్షణకలవారమై ప్రస్తుతము ఈ దేహమందు మూల్గుచున్నాము. మన మంటి దేహము మహిమ దేహముగా మార్చబడుటయే మన నిరీక్షణ.

**క్రీస్తు న్యాయపీఠము దగ్గర ఫలమున్నదన్న నిరీక్షణ (6-10వ.)** : పరలోకములో మనకు నివాసము మాత్రమే కాక ఈ లోకములో జరిగించిన క్రియలకు ఫలము కూడా ఉన్నదని గుర్తించవలెను. ఆ ఫలములో వేర్వేరు కిరీటములను కూడా పొందుదుము. కిరీటముల వివరములు 1 కొరింథీ. 9వ అధ్యాయము చివర కలవు. కనుక పరిచర్య చేయునపుడు 1 కొరింథీ. 3:13-15వ. వివరించబడినట్లు ఈ పరిచర్యకు జీతమున్నదని గమనించాలి. కనుక మంటి దేహమందున్నను మంటి దేహము విడిచినను ప్రభువుకు ఇష్టులముగా ప్రీతికరమైన సేవ చేయాలి.

**పరిచర్యలోని వర్తమానము - పరిచర్య చేయవలసిన విధము (11-15వ.)** : క్రీస్తు యేసు అందరి కొరకు మృతిపొంది తిరిగి లేచినందున జీవించు మనము కూడా మన కొరకు కాక, క్రీస్తు కొరకు జీవించాలి. స్వస్థబుద్ధి గలవారుగా అవసరమును బట్టి వెఱ్ఱివారముగానున్నను క్రీస్తు పరిచర్య కొరకు జీవించుట ప్రాముఖ్యమని గుర్తించాలి. కనుక ప్రభువు విషయమైన భయము కలిగి జీవించాలి.

**పరిచర్యలోని వర్తమానము - రాయబారియైన పరిచారకుడు (16-21వ.)** : క్రీస్తు యేసు మన అపరాధములను మనపై మోపక తన మీద మోసికొన్నాడు. పాపమెరుగని ఆయన మన కొరకు పాపముగా చేయబడినాడు. మనము క్రీస్తు నంగీకరించినపుడు మన పాపములకు క్షమాపణ కలిగి నూతన సృష్టిగా చేయబడితిమి. పాతవి గతించి క్రొత్తవిగా దేవుని వలన చేయబడినవి. దేవునితో లోకమును సమాధాన పరచు ఈ పనిని దేవుడు మనకు అప్పగించి పరలోకపు పౌరులమైన మనలను ఈ లోకములో తనకు రాయబారులుగా చేశాడు.

## 6వ అధ్యాయము 5+5+3+5=18 వచనములు
## అంశము : పరిచర్య యొక్క లక్షణములు

**పరిచర్య చేయువారి లక్షణములు (1-5వ, 6-10వ.)** : పరిచర్య ద్వారా మానవులు రక్షణ పొందుటకు ఇప్పుడే అనుకూల సమయమైనందున పరిచర్య చేయువారు ఈ పరిచర్య నిందించబడకుండ జాగ్రత్తగా చూచుకొనవలెను. శ్రమలు, ఇరుకులు, ఇబ్బందులు మొదలగు వాటిలో ఓర్పు కలిగి, పవిత్రత, పరిశుద్ధత కలిగి అన్ని స్థితులలో మనలను మనమే మెప్పించుకొను వారముగానుండాలి. కనుక పరిచారకులమైన మనము 1) సత్యవంతులముగను, 2) తెలియబడిన వారముగను, 3) బ్రతుకుచున్న వారముగను, 4) సంతోషించు వారముగను, 5) ఐశ్వర్యము కలిగించు వారముగను, 6) సమస్తము కలిగిన వారముగను ఉండాలి.

**హృదయ విశాలతను కోరు పరిచర్య (11-13వ.)** : పౌలు కొరింథీయుల పట్ల తన హృదయము విశాలముగానున్నదని కొరింథీయుల హృదయము తన పట్ల సంకుచితమై యున్నదని చెప్పుచున్నాడు. ఈ పరిచర్య చేయునపుడు హృదయ విశాలత అవసరము గనుక కొరింథీయులు తన పిల్లలైనందున స్వతంత్రత కలిగి వారికి హృదయములను విశాల పరచుకొనుడని వేడుకొనుచున్నాడు. పనివాడు హృదయ విశాలతను కలిగి యుండాలి.

**పరిచర్యలో ప్రత్యేకముగా ఉండుటను గూర్చిన హెచ్చరికలు (14-18వ.)** : ప్రభువును విశ్వసించిన వారు అవిశ్వాసులతోను, సాతానుతోను, విగ్రహములతోను, చీకటితోను, దుర్నీతితోను కలిసి యుండరాదు. కనుక అవిశ్వాసుల నుండి, విగ్రహారాధికుల నుండి బయలు వెడలి ప్రత్యేకముగా ఉండాలి. దేవుడపుడు వారి మధ్య సంచరించి వారితో

నుండును. అట్టివారిని చేర్చుకొనును. వారికి తండ్రియైయుండును. "బయటికి పిలువ బడిన వారు కూడుకొనుట" సంఘము అను "ఎక్లీషియా" అను గ్రీకు పదమునకర్థము. కనుక అవిశ్వాసుల నుండి బయలు వెడలి ప్రత్యేకముగా ఉన్నవారే సంఘము అని గుర్తించాలి.

## 7వ అధ్యాయము 4+4+4+4=16 వచనములు
## అంశము : ప్రభువునందలి ప్రత్యేకత గల పరిచర్య

**ప్రత్యేకతను కోరు పరిచర్య - పౌలు జీవితములో కలుగు ప్రత్యేకత (1-4వ.) :** విశ్వాసికి ఈ జీవితయాత్రలో శరీరమునకు, ఆత్మకు కల్మషము కలుగగలదు. ఆ కల్మషము నుండి మనలను మనము పవిత్రులుగా కాపాడుకొనాలి. కనుక 1) ఎవరికిని అన్యాయము చేయకుండా(Wrong), 2) ఎవరిని చెరపకుండా (Corruption), 3) ఎవరికి మోసము(Fraud) చేయకుండా పౌలు జీవించుచున్నాడని తెలుపుచున్నాడు. కొరింథీయులును అలాగే ఉండవలెనని హెచ్చరించుచున్నాడు. ప్రత్యేకముగా ఉండుటకు పిలువబడిన వారి జీవితములును ప్రత్యేకముగా ఉండాలి.

**తీతు రాక వలన కలిగిన ఆదరణ (5-8వ.) :** 2వ అధ్యాయము 12వ వచనములో చెప్పినట్లు పౌలుకు తీతు కనబడనందున మనసులో నెమ్మది లేదు. దానికి తోడు శ్రమలు పోరాటములలో పౌలు ఉండగా తీతు కొరింథు నుండి పౌలు యొద్దకు వచ్చి కొరింథీయుల ప్రత్యేకమైన అభిలాషను గూర్చి పౌలుకు తెలిపెను. పౌలుకు సంతోషము ఆదరణ కలిగెను. కనబడవలసిన తమవంటి వారు కనబడకపోతే నెమ్మది ఉండదు. కనబడవలసిన వారు కనబడుటతో ఆనందము ఆదరణ కలుగును.

**దిద్దుబాటు గల పరిచర్య (9-12వరీ.) :** పౌలు కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక వలన వారికి దుఃఖము కలిగినను వారు మారుమనస్సు పొంది జీవితములను దిద్దుకొని ప్రత్యేకత గలవారుగానున్నారు. దైవచిత్తానుసారమైన దుఃఖము మారుమనసును కలుగ చేసినది. కొరింథీయులు నిర్దోషులుగాను, ప్రత్యేకత గలవారుగా, పవిత్రులుగా ఉన్నారని ఋజువు పరచుకొనిరి.

**దిద్దుబాటు వలన ఆదరణను కలిగించు పరిచర్య (13-16వ.) :** ముందు భాగములలో చెప్పబడినట్లు పౌలు మొదటి పత్రిక ద్వారా కొరింథీయుల జీవితములు దిద్దబడెను. పౌలు తీతుతో కొరింథీయులు తమ జీవితములను దిద్దుకొందురని నిరీక్షించి చెప్పెను.

ఆలాగు జరిగినందున అనుటలో పౌలు తన నిరీక్షణలో సిగ్గుపరచబడ లేదని తెలసికొని సంతోషించి కొరింథీయులలో జరిగిన దిద్దుబాటును బట్టి పౌలు ఆదరింపబడెను.

## 8వ అధ్యాయము 9+6+9=24 వచనములు
## అంశము : ప్రభువు పనికి ఇచ్చు పరిచర్య

**ఇచ్చుటలో మాదిరియైన మాసిదోనియ వారు (1-9వ.)** : క్రైస్తవుల మధ్య పేదలున్నారు. నిరుపేదలు బహు తక్కువ. మాసిదోనియ వారు నిరుపేదలు. కాని వారి దాతృత్వము బహుగా విస్తరించినది. పరిశుద్ధుల కొరకైన పరిచర్యలో మాసిదోనియ వారు వారి సామర్థ్యముకంటె ఎక్కువగా ఇచ్చి మాదిరియైరి. తమ్మును తాము ప్రభువుకు అప్పగించి కొనిరి. విశ్వాసమందు, ప్రేమయందు వృద్ధి పొందు కొరింథీయులు సంవత్సరము క్రింద ఇచ్చెదమని చెప్పిరి కాని ఇంకను ఇవ్వలేదు. కనుక కొరింథీయులు ప్రభువుకు ఇచ్చు పరిచర్యలో కూడా ముందుకు రావలెనని పౌలు హెచ్చరించుచున్నాడు. ఈ విషయమై ప్రభువైన యేసు మాదిరిని గూర్చి 9వ. వచనములో ధనవంతుడైన యేసు మన నిమిత్తము దరిద్రుడైన సంగతిని తెలుపుచున్నాడు.

**ప్రభువు పరిచర్యకు ఇవ్వవలసిన విధము (10-15వ.)** : కొరింథీయులు సంవత్సరము క్రితము ఇవ్వవలెనని తలంచిరి కాని ఇవ్వలేదు. తలపెట్టిన రీతిగనే వెంటనే ప్రభువుకు ఇవ్వవలెనని పౌలు హెచ్చరించుచున్నాడు. ప్రభువుకు ఇవ్వవలసిన విధమేదనగా సిద్ధమైన మనసు కలిగియుండి మనకు కలిగిన కలిమి కొలది ప్రభువుకు ఇచ్చుట ప్రీతికరము. అది ఇబ్బందులలో ఉన్న ఇతరులకు, దేవుని సేవలోనున్న సేవకులకు ప్రయోజనకర మగును. హెచ్చుగా కూర్చుకొన్న వారికి ఎక్కువ కాలేదని, తక్కువ కూర్చుకొన్నవారికి తక్కువ కాలేదని ఇశ్రాయేలీయులు అరణ్యములో మన్నాను సమకూర్చుకొనిన సందర్భ మును చెప్పుచున్నాడు. అనేకులు ప్రభువు పరిచర్యకు ఇచ్చు విషయములో వెనుకబడు చున్నారు. ఒక విశ్వాసి జీవితములో సొమ్ము సంచి చివరిదిగా మారు మనస్సు పొందును అని సర్వ సాధారణముగా చెప్పుదురు.

దశమ భాగము ప్రభువుకిచ్చువారు దానితోనే సంతోషపడుచున్నారు. లేవీ. 27:30వ. ప్రకారము దశమభాగము దేవుని సొత్తు. కనుక దేవుని సొత్తయిన దశమభాగము మనము దేవునికివ్వవలసినదే. మనము దేవుని దశమభాగము దేవుని కివ్వవలసినదే. మనము దేవునకి అచ్చి ఉన్నాము అని అర్థము. దేవునికి మన బాకీ చెల్లించి దానికంటే ఎక్కువగా

ప్రభువుకిచ్చుట మనకు ఆశీర్వాదము. పాత నిబంధనలో ద్వితీ. 14:22వ. వచనములో ప్రతి సంవత్సరము ప్రత్యేకించి మందిరమునకు తీసుకొని రావాలి. సంఖ్యా. 18:21వ. వచన ప్రకారము అది లేవీయులకు ఇవ్వబడును. రెండవ దశమ భాగమును గూర్చి ద్వితీయ 14:28 వచనములో ఉన్నది. మూడు సంవత్సరముల కొకసారి ఆ యేటి పంటను ప్రత్యేకించాలి. ఇది రెండవ దశమ భాగము. ఒక దశమభాగము సంఘమున కివ్వగా అది సేవకుల కివ్వబడినది. రెండవ దశమభాగము సంఘ పరిచర్య కొరకు వాడబడును. కనుక ఒక దశమ భాగమిచ్చి తృప్తి చెందక రెండవ దశమ భాగమును దేవునికివ్వాలి.

**ప్రభువుకు ఇవ్వబడిన దానిని కాపాడవలసిన విధము (16-24వ.)** : పరిశుద్ధుల కొరకైన పరిచర్యకు ధనమును పోగు చేయవలెనని పౌలు తలంచినట్లు తీతుకును ఆశ కలిగినది. తీతుతో పాటు సువార్త విషయము ప్రసిద్ధి చెందిన సహోదరుడైన లూకాను కూడా కలపి పౌలు కొరింథీకి పంపుచున్నాడు. విస్తారమైన ప్రభువు ధనమును 1) సమ కూర్చుట, 2) భద్రపరచుటకై ఒకరే కాక అటువంటి ఆశ కలిగిన అనేక సేవకులు చేయుట మంచిదని పౌలు చెప్పుచున్నాడు. లేనియెడల నిందల పాలు కాగలము.

## 9వ అధ్యాయము 5+5+5=15 వచనములు
## అంశము : ఇచ్చుటను గూర్చిన హెచ్చరిక

**ఇచ్చుటను గూర్చిన వివరణ (1-5వ.)** : కొరింథీయులు ప్రభువు పరిచర్యకు ఇచ్చుటకై సిద్ధమనసు కలిగియున్నారని పౌలు మాసిదోనియ వారితో చెప్పగా వారును ప్రేరేపింపబడి ఇచ్చిరి. కాని కొరింథీయులు ఇంకను ఇవ్వలేదు. పౌలు కొరింథుకు వచ్చినపుడు వారితో కూడ మాసిదోనియా వారెవరైనా వచ్చిన యెడల పౌలుకు సిగ్గు కలుగును అని చెప్పుచున్నాడు. కనుక కొరింథీయులు పిసినిగాకాక ధారాళముగా ప్రభువుకు ఇవ్వవలెనని చెప్పుచున్నాడు.

**ఇచ్చువారికి కలుగు దీవెన (6-10వ.)** : కొంచెము ఇచ్చిన యెడల కొద్ది దీవెనలు కలుగును. కనుక హృదయములో ముందుగా నిర్ణయించుకొని ఉత్సాహముగ ప్రభువుకు ఇచ్చిన దేవుడు సర్వ సమృద్ధిని ఇచ్చునని చెప్పుచున్నాడు.

**ఇచ్చుటను గూర్చిన పురికొల్పు (11-15వ.)** : పరిశుద్ధుల కొరకైన ఈ పరిచర్య పరిశుద్ధుల ప్రార్థనల మూలమున విస్తరించి వృద్ధియగుచున్నదని ఇదియు కృపావర

ములలో ఒకటి అని చెప్పుచున్నాడు. దీనిలో పరిశుద్ధుల యోగ్యతయు బయలు పరచ బడును. కనుక ప్రభువుకిచ్చుటలో 1) సామర్థ్యముకంటె ఎక్కువగా ఇచ్చుట (8:4) 2) కలిమి కొలది ఇచ్చుట (8:12), 3) ధారాళముగా ఇచ్చుట (9:5), 4) ఉత్సాహముగా ఇచ్చుట (9:7), 5) పిసినితనముగా కాక (9:5), 6) బలవంతముగా కాక, సణుగుగొనక (9:7), 7) ముందుగా హృదయములో నిశ్చయించుకొని ఇవ్వవలెనని చెప్పుచున్నాడు.

## 10వ అధ్యాయము 6+6+6=15 వచనములు
## అంశము : పరిచర్యలోని విమర్శలకు పౌలు జవాబులు

**శరీర ప్రకారము కాక శక్తిగల పనిచేయువాడైన పౌలు (1-6వ.) :** 1) పౌలు మాదిరియైన పనివాడుగా సాత్వికము, మృదుత్వము, అణకువ గలపనివాడు, 2) అయినను శరీర ప్రకారము నడుచుకొనువాడని విమర్శించబడుచున్నాను. దానికి జవాబుగా తాను శరీరము ధరించుకొనిన వాడైనను శరీర ప్రకారము యుద్ధము చేయువాడను కానని చెప్పుచున్నాడు. 3) శరీర సంబంధమైన యుద్ధోపకరణములు కలిగినవాడు కాదు, 4) దేవునియెదుట సాతాను దుర్గములను పడగొట్టగల శక్తిగల ప్రార్థనను యుద్ధోపకరణముగా గలవాడు, 6) తర్కములకు, ఆటంకములకు దూరముగా నుండును, 7) ప్రతి ఆలోచన క్రీస్తుకు లోబడునట్లు చేయువాడు, 8) కొరింథీయుల సంపూర్ణమైన విధేయతను ఆధారముగా తీసుకొని ఇతరులలోని సమస్త విధములైన అవిధేయతను ప్రతి దండన చేయుటకు సిద్ధపడియున్నానని చెప్పుచున్నాడు. పై అంశములను ప్రతి వాడు కలిగియుండుట ద్వారా తన్ను తాను భద్రపరచు కొనవలెను.

**మాటలయందును (పత్రికలయందును) క్రియలయందును ఏకరీతిగానున్న పౌలు (7-12వ.) :** ప్రతి పనివాడు తానే ప్రభువు పనివాడనని ఇతరులు కారని భావించుచున్నారు. అది తప్పని పౌలు చెప్పుచున్నాడు. పనివాడు పడగొట్టువాడు కాకూడదు. పాడు చేయువాడు కాకూడదు. కట్టువాడై ఉండాలి. 1 కొరింథీ. 3:16లో ఎవడైన పాడుచేసిన యెడల దేవుడు వానిని పాడు చేయుననియున్నది. పౌలు పత్రికలు బలమైనవి, కొన్నిసార్లు భయము కలిగించునవి అని అంగీకరించుదురు, కాని పౌలు శరీరము బలహీనమైనది ప్రసంగ ములు కొరగానివి అని విమర్శించ బడుచున్నాడు. దానికి జవాబుగా పౌలు దూరముగా ఉన్నప్పుడు వ్రాయు పత్రికలలోని మాటలయందెట్టివాడో, సమీపముగానున్నపుడు క్రియలయందట్టి వాడేనని జవాబిచ్చుచున్నాడు. మాదిరియైన పనివాడు మాటలయందు

క్రియలయందు ఏకరీతిగానుండును. కొద్దిమంది తమ్మునుతామె మెచ్చుకొనుచుందురు. మాటలున్నవి. కాని క్రియలలో తాము తమ చుట్టు ఉన్నవారితో సరిచూచుకొనుచూ ప్రభువు తనను పిలిచి పని గూర్చి సరియైన గ్రహింపులేని వారుగానున్నారు.

**దేవుడు తనకిచ్చిన పరిధిలోనే జరిగించవలసిన పరిచర్య (13-18వ.)** : ఈ భాగములో 6 పర్యాయములు మేర అనుపదము కలదు. దేవుడు తన చిత్త ప్రకారము అప్పగించిన పనిగా పౌలు కొరింథుకు వెళ్ళి పని చేశాడు. కొరింథు దేవుడు తనకిచ్చిన మేరలోనే ఉన్నది. కొరింథును ఆధారముగా చేసికొని కొరింథులోను దాని ఆవలి ప్రదేశములలోను విశేషముగా సువార్త వ్యాపింపచేయ నిరీక్షించుచున్నాడు. కాని ఇతరుల ప్రయాస ఫలమును బట్టి అతిశయింపనని చెప్పుచున్నాడు. ఇది మాదిరిగానుండగోరు పని వారందరు గమనించాలి.

## 11వ అధ్యాయము 6+6+3+6+6+6=33 వచనములు
## అంశము : పౌలు అపోస్తలత్వపు ఋజువులు

**కొరింథీయులు తప్పిపోకుండునట్లు కాపాడువాడు (1-6వ.)** : సంఘము పరిశుద్ధుడైన క్రీస్తుకు ప్రధానము చేయబడిన కన్యక సాతాను సంఘమును పరిశుద్ధత నుండి తొలగి పోవునట్లు ప్రయత్నించుచున్నాడు. పౌలు తాను కలిగిన వాక్య అనుభవమును బోధించుట ద్వారాను వారిని స్థిరపరచుచున్నాడు. యేసు ప్రభువు పునరుత్థానుడైన తరువాత యోహాను 21:15-17వ.లో పేతురుతో గొర్రెపిల్లలను మేపవలెనని, గొర్రెలను కాయవలెనని చెప్పాడు. అపొస్తలుడుగా పౌలు కొరింథీయులకు వాక్యమను మేత పెట్టుచూ వారిని సత్యము నుండి, పవిత్రత నుండి తొలగిపోకుండ కాపాడుటలో జాగ్రత్త పడుచున్నాడు. తన పరిచర్య ద్వారా తన అపొస్తలత్వమును ఋజువు పరచుకొనుచున్నాడు.

**ఉచితముగా సువార్త ప్రకటించిన పౌలు (7-12వ.)** : పౌలు కొరింథీయుల యొద్ద ఏమియు తీసుకొనక ఉచితముగా సువార్త ప్రకటించుట పాపమా అని ప్రశ్నించుచున్నాడు. ఇతర సంఘములు తనకు సహాయము చేసినందున వారి ధనమును దొంగిలితిని అంటున్నాడు. ఇతరులకు మాదిరిగానుండుటకు తనకు అతిశయ కారణము కలుగ కుండుటకు ఇక ముందును అకయ లేదా గ్రీసు దేశమంతటిలో అలాగే ఉండును అంటున్నాడు.

**దొంగ అపొస్తలులు (13-15వ.)** : నిజమైన అపోస్తలులు నమ్మకమైన పని జరిగించు చుండగా అపొస్తలుల వేషము ధరించుకొనిన మోసగాండ్రును కలరు. నాడున్నట్లే నేటి దినములలోనే ఉందురని నమ్ముచున్నాము.

**అవివేకిగా ఎంచినందున పౌలు జవాబు (16-21వ.)** : ఇతరులైన పనివారు శ్రమలను సహించి దాని విషయమై అతిశయించుచూ పౌలును అవివేకి అని తలంచుచున్నారు. ఇతర పనివారు ఏ ఏ విషయములలో అతిశయించుచున్నారో తాను శ్రమలను సహించితినని అది తనకతిశయ కారణమని ధైర్యముగా సందర్భమును బట్టి చెప్పు చున్నాడు. తాను పొందిన శ్రమలు హింసలను క్రింద 'వివరించుచున్నాడు.

**పౌలు పొందిన శ్రమలు, ఆపదలు (22-27వ.)** : తన చెరసాలలు, అపరిమితమైన దెబ్బలు. ఆపదలను వివరించుచున్నాడు, శరీర ప్రయాసల గూర్చి, ఆహార వస్త్ర, లేమిని గూర్చి చెప్పుచున్నాడు. 24 సంగతులను ప్రస్తావించి ఇంకను చెప్పవలసినవి అనేకము లున్నవి అంటున్నాడు.

**పౌలుకు సంఘములన్నిటిని గూర్చి - తన విషయమైన చింత లేదు (28-33వ.)** : తాను పొందిన శ్రమల పై చింతలేదని సంఘములన్నిటిపై చింత, భారము దినదినము కలుగుచున్నది. అనగా అధికమగుచున్నదని చెప్పుచున్నాడు. ఈ విషయమై దేవునిని సాక్షిగా నుంచి చెప్పుచున్నాడు. ఈ విషయమై దేవునిని సాక్షిగా పెట్టి చెప్పుచున్నాడు. ఇవన్నియు తన అపొస్తలత్వపు ఋజువులు, తన్ను భద్రపరచుకొనుట అని గమనించాలి.

## 12వ అధ్యాయము 3+3+3+3+3+3+3=21 వచనములు

## అంశము : పౌలు అపోస్తలత్వమునకు మరి కొన్ని ఋజువులు

**పౌలుకు కలిగిన ప్రత్యక్షతలు (1-3వ.)** : పరదైసునకు వెళ్ళిన ఒక మనుష్యుని గూర్చి మాటలాడుచున్నాడు. ఆయన పౌలేనని మనము నమ్మవచ్చును. పౌలు సేవకు ప్రత్యేకింపబడక మునుపు పరదైసుకు వెళ్ళాడని గ్రహింపవచ్చును. తన పేరుతో అతిశయించ ఇష్టపడుట లేదు. మూడవ ఆకాశము పరదైసని చెప్పుచున్నాడు.

కీర్తన 19:1వ ప్రకారము **ఆకాశములు** దేవుని మహిమను వివరించుచున్నవి. నెహెమ్యా 9:6వలో నీవే **ఆకాశమును మహాకాశములను** వాటి సైన్యములను సృజించి వాటినన్నిటిని కాపాడువాడవు అని ఉన్నది. పై వచనములను బట్టి అనేక ఆకాశములు కలవని నేర్చుకొనుచున్నాము. కొన్ని ఆకాశములను/అంతస్తులను మనము తలంచ వచ్చును.

1) భూ మండలము - మానవుల నివాసము (కీర్తనలు 115:16వ.)

2) మేఘ మండలము - మొదటి ఆకాశము (కీర్తనలు 57:9వ.)

3) నక్షత్ర మండలము - రెండవ ఆకాశము (కీర్తనలు 8:3వ.)

4) పరదైసు - మూడవ ఆకాశము (2 కొరింథీ 12:2-3వ.)

5) పరలోకము - యోహాను 14:1-3వ. ప్రకారము విశ్వాసులమైన మన నివాసము కొరకు ప్రస్తుతము నిర్మించబడుచున్నది.

6) దూతల సభా పర్వతము - దేవదూతల సభ జరుగు స్థలము (యోబు 1:6వ. కీర్తన 89:5వ. యెషయా 14:13-14వ.)

7) అత్యున్నత సింహాసనము - దేవుని ఆసనము లేక నివాసము (యెషయా 6:1వ. కీర్తనలు 113:5వ. కీర్తన 97:2వ. యెషయా 14:14వ.)

**అతిశయింప కూడదన్న తీర్మానము (4-5వ.)** : పౌలుకు దేవుడు సంఘ మర్మమును తెలుపుట మాత్రమే కాక (ఎఫెసీ 3వ అధ్యాయము) క్రీస్తు కొన్ని ప్రత్యక్షతలను అనుగ్రహించాడు. తాను వాటి విషయమై అతిశయించకూడదన్న తీర్మానము కలవాడు. పౌలునందు ఇతరులు చూచిన దానికన్న ఎక్కువ ఘనముగా తాను ఎంచబడ కూడదన్న తీర్మానము గలవాడు. అందుచేత తన ప్రత్యక్షతలయందు కాక బలహీనతలయందే అతిశయింప తీర్మానించుకొన్నాడు. ఇది సేవకులకు ఎంతో మాదిరి.

**పౌలుకు గల ముల్లు (7-9వ.)** : పౌలు హెచ్చిపోకుండు నిమిత్తము అతిశయింపకుండుటకై తన శరీరములో ముల్లును దేవుడు సాతాను దూతగా ఉంచాడని చెప్పుచున్నాడు. పౌలు ముమ్మారు వేడుకొనినను దేవుడు దానిని తీసివేయలేదు. ఏ సేవకుడైన తాను హెచ్చిపోగలడని, అతిశయింపగలడని సాతాను ఆ రీతిగా సేవకులను పాడు చేయగలడని గుర్తించాలి. అందుకే ఏదో ఒక బలహీనత లేదా కొన్ని బలహీనతలను దేవుడుతన సెలవుతో మన కనుగ్రహించునని గుర్తించాలి. కాని బలహీనతలలోనే మనము ప్రభువునందు బలవంతులముగా నుండగలము.

**అపొస్తలుని గురుతులు గల పౌలు (10-12వ.)** : పౌలు తాను బలహీనుడనని గుర్తించినపుడే దేవుడు తనను బలవంతుడుగా వాడుకొనుచున్నాడు. తన విషయమై

తాను తక్కిన అపొస్తలులకంటే తక్కువవాడను కానని అపొస్తలుల గురుతులను కనుపరచితినని చెప్పుచున్నాడు.

**పౌలు ప్రేమ (13-15వ.)** : పౌలు కొరింథీయులను ప్రేమించుచున్నందున అనేక పర్యాయములు వారిని చూచుటకై వెళ్ళుచున్నాడు. వెళ్ళిన ప్రతిసారి వారికి భారముగా ఉండకుండ జాగ్రత్త పడుచున్నాడు. తనకు కలిగినదే వారికి ఖర్చుపెట్టు తండ్రివలెనున్నాడు కాని వారికి ఏ విషయములోను భారముగానున్నవాడు కాడు. సేవా జీవితములో ఎవరికి భారముగా నుండరాదు. ఇది సేవకులకు మాదిరి.

**పౌలు సేవా జీవిత రాబడి - ఖర్చుల పట్టి (16-18వ.)** : పౌలు కొరింథీయుల మధ్య సేవలో తన ఆర్జనను గూర్చి, పెట్టిన ఖర్చుల గూర్చి బహిరంగ పరచుచున్నాడు. ఇది సేవకులకు ఎంతోమాదిరి. సేవ ద్వారా తాను సంపాదించినది ఏమి లేదని బట్టబయలు చేయుచున్నాడు. సేవ సంపాదన కొరకుకాదని గుర్తించాలి. ఆర్థిక రాబడి - ఆర్థిక వ్యయములను ప్రతి సేవకుడు అందరియెదుట ఉంచుట ఎంత మాదిరియో గమనించ గలము.

**పౌలు దుఃఖముతో మార్గము తప్పిన వారిని మారుమనస్సు పొందుడని హెచ్చరించుట (19-21వ.)** : కొరింథీయుల మొదటి పత్రికలో వ్రాసిన 1) కలహములు, 2) అసూయలు, 3) క్రోధములు, 4) కక్షలు, 5) కొండెములు, 6) గుసగుసలు 7) ఉప్పొంగుట, 8) అల్లరులు సర్వ సాధారణముగా అనేక సేవకులలోను పై బలహీనతలు ఉండును. అలాగు ఉండకుండ సేవకుడు ప్రతి విశ్వాసి జాగ్రత్తపడాలి.

## 13వ అధ్యాయము 2+4+4+4=14 వచనములు
## అంశము : చివరి హెచ్చరికలు

**పాపము విషయమైన క్రమశిక్ష (1-2వ.)** : పౌలు కొరింథుకు మొత్తము నాలుగుసార్లు వెళ్ళాడని తలంచవచ్చును. ఈ పత్రిక మాసిదోనియా నుండి వ్రాసిన తరువాత అక్కడకు వెళ్ళాడు. నాలుగవసారిగా రోములోని మొదటి చెర తరువాత విడుదల పొందిన సమయములో వెళ్ళినట్లు చూడగలము. (టైటిల్ చివరి అట్టనున్న పటము చూడండి) ఈ మూడవ సారి వెళ్ళుటలో వారిని క్రమ పరచుటే ముఖ్య ఉద్దేశ్యము.

**స్వ పరీక్ష చేసుకొనుచున్న పౌలు (3-6వ.)** : క్రీస్తు బలహీనుడు కాడు కాని మన బలహీనతలకై సిలువ వేయబడినందున బలహీనులమైన మనము దేవుని శక్తిని బట్టి

జీవము కలవారముగా నుండగలమని చెప్పుచున్నాడు. అందువలన విశ్వాస జీవితములో ఎట్లున్నానోయని తన్నుతాను నిత్యము పరీక్షించుకొనుచు తాను భ్రష్టుడుగా లేడని ఇతరులు తెలిసికొనవలెనని పౌలు కోరుచున్నాడు.

**పౌలు ప్రార్థన (7-10వ.)** : పౌలు భ్రష్టుడు కాకపోయినను తాను భ్రష్టుడైనట్టు తలంచు వారి కొరకై చెప్పు మాటలు గమనించదగినవి. "మేము భ్రష్టులమైనట్లు కనబడినను మీరు మేలైనది చేయవలెనని ప్రార్థించుచున్నాము". మనమును అట్టి ప్రార్థన చేయువారమై ఉండాలి.

10-13వ అధ్యాయములలో పౌలు విమర్శించబడిన రీతిని గమనించగలము. 1) శరీర ప్రకారము నడుచుకొనువాడు. 10:2వ, 2) శరీరమునకు బలహీనుడు 10:10వ, 3) ప్రసంగములు కొరగానివి 10:10వ, 4) దొంగయైన పౌలు 11:8వ, 5) అవివేకియైన పౌలు 11:16వ, 6) పౌలు భ్రష్టుడు అనిరి. 13:7వ.

**ముగింపు - ఆశీర్వాదము (11-14వ.)** : ముగింపులో 1) సంతోషించుడి, 2) సంపూర్ణులై ఉండుడి, 3) ఆదరణ కలిగియుండుడి, 4) ఏకమనసు కలవారై యుండుడి, 5) సమాధాన ముగానుండుడి, 6) దేవుడు మీకు తోడుగానుండుగాకని ఆరు మంచి తలంపులను తనను ఆరు రీతులుగా విమర్శించిన వారికి ఇచ్చుచు ముగించుచున్నాడు. వారిని ఆశీర్వదించుట గమనించదగినది. అలాగే మనలను విమర్శించువారు మనము భ్రష్టులమని చెప్పు వారును ఉందురు. పౌలు అటువంటి వారి క్షేమమును కోరుట వారిని హృదయ పూర్వకముగ క్షమించి ఆశీర్వదించుట నేటి సేవకులకు ఒక మాదిరి. త్రియేక దేవుని ఆశీర్వాదమును గమనించండి.

# గలతీయులకు వ్రాసిన పత్రిక

గ్రంథకర్త : పౌలు . కాలము : క్రీ.శ. 49-57(?) స్థలము : సిరియాలోని అంతియొకయ
**కొనిపోయినవారు ---**

**ముఖ్య ఉద్దేశము** : గలతీలోని కలితీ బోధ - గలతీలో గలిబిలి.

**గలతీయుల చరిత్ర** : గాలులు అని పిలువబడి మూర్ఖపు తెగకు చెందినవారు ఐరోపాలోని ఫ్రాన్సుకు పడమటి వైపు నివసించుచుండిరి. వారు ఫ్రాన్స్‌పై దండెత్తి ఫ్రాన్స్‌ను ఓడించి, క్రీ.పూ. 280 గ్రీసును దాటి, ఆసియా ఖండంలో ప్రవేశించిరి. బిత్తూనియా రాజు తన దేశంలోని తిరుగుబాటును అణచుటకై వారిని ఆహ్వానించగా ఆసియా, బిత్తూనియ సమీపమున నివసించిరి. క్రీ.పూ. 189లో రోమీయుల వశమున ఉండిరి. ఆసియా సమీపాన గాలులు నివసించిన స్థలము గలతీయ అని పిలువబడెను. ఇంగ్లీషులో "గాల్స్ ఏషియా" - గలేషియా - గలతీయగా మారినది. వీరు చంచల మనస్కులు.

**గలతీయ సంఘ స్థాపన** : క్రీ.శ. 47లో పౌలు లుస్త్రకు రాగా పౌలును హెర్మేగానూ, బర్నబాను ద్యుపతిగా (JUPITER) భావించి పూజారి ఎడ్లను బలిగా చేయతలంచిరి. బహు కష్టముగా పౌలు దానిని ఆపు చేయించెను. (అ.కా. 14:12-19వ) ప్రభువును నమ్మిన శిష్యులను తదుపరి 14:22లో పౌలు బలపరచెను. మరుసటి దినము ఈకొనియ నుండి వచ్చిన యూదులతో కలసి గలతీయులైన లుస్త్రవారు పౌలుపై రాళ్ళు రువ్విరి. పౌలును దేవుడుగా తలంచి శక్యమైతే తమ కన్నులు ఊడ బెరికి ఇత్తుమనిరి. (గలతీ. 4:14) తదుపరి పౌలు నేర్పిన బోధ నుండి తొలగిరని (గలతీ. 1:6) చూడగలము. కనుక పౌలు బర్నబాల పరిచర్య ద్వారా సంఘ మేర్పడి తదుపరి రక్షణకు సున్నతి అవసరమను దుర్బోధకు తావిచ్చినందున వారిని దిద్దుటకై పౌలు ఈ పత్రిక వ్రాసెను. ఎపుడు వ్రాసెనో ఎక్కడ నుండి వ్రాసెనో ఖచ్చితంగా చెప్ప వీలుపడదు.

ఈ పత్రికలో స్వతంత్రము అను పదము 11 పర్యాయములు కలదు. 1) 2:4, 2) 3:28, 3) 4:22, 4) 4:23. 5) 4:26, 6) 4:30. 7) 4:31. 8) 5:1, 9) 5:1, 10) 5:13, 11) 5:13. సున్నతి అక్కరలేదని ధర్మశాస్త్ర దాస్యము నుండి విడిపింపబడితిమని వివరించుచున్నాడు. ఈ పత్రికలోని అంశము క్రీ.శ. 49లో యెరూషలేములో జరిగిన

సున్నతి సభకి (అ.కా. 15వ అధ్యా.) చెందినందున ఈ పత్రిక క్రీ.శ. 49-50లో సిరియాలోని అంతియొకయ నుండి వ్రాయబడినది అని సామాన్యముగా తలంచుదురు. 6:11లో నా స్వహస్తముతో వ్రాసితిని అన్నందున ఇది పౌలు వ్రాసిన అన్ని పత్రికలలో మొదటిది కావచ్చును.

## అధ్యాయాల విభజన 2+2+2= 6 అధ్యా.

**I. 1-2వ అధ్యాయములు** : సువార్త సత్యము, తన అపొస్తలత్వమును దృఢపరచుకొనుట (వ్యక్తిగతము).

**II. 3-4వ అధ్యాయములు** : బోధ. ఎ.3వ అధ్యాయము. విశ్వాసము ద్వారానే రక్షణ - సువార్త సత్యము.

**b) 4వ అధ్యాయములు** : రక్షణ కలిగించిన విశ్వాసము నుండి వెనుకకు (ధర్మశాస్త్రమునకు) మరలరాదు.

**III. 5-6వ అధ్యాయములు** : నడక - 5వ. ఆత్మానుసారమైన నడక. రక్షింపబడి స్వతంత్రులముగా, ఆత్మానుసారముగా నడుచుకొనుట.

## 1వ అధ్యాయము 5+5+7+7 =24 వచనములు
## అంశము : పౌలు వ్యక్తిగతము

**శుభములు (1-5వ)** : గలతీయలో ఉన్న సంఘములకు అనుటలో స్థానిక సంఘములను ఉద్దేశించి వ్రాసినట్లు తలంచగలము. ఈ పత్రిక వ్రాయుటకు తన అధికారమును తెలుపుటకై తాను మనుష్యుల వలన కాక దేవుని వలన అపొస్తలుడుగా నియమించబడితినని తెలుపుచున్నాడు. దేవుడు తన చిత్త ప్రకారం మనలను విమోచించాడని క్రియల మూలముగా ఎవరును విమోచింపబడలేదని తెలుపుచున్నాడు. మన పాపము నిమిత్తము యేసుక్రీస్తు తన్నుతానే అనగా తనను, తన ఇష్టప్రకారం అప్పగించుకున్నాడని తెలుపుచున్నాడు.

**పత్రిక ఉద్దేశ్యము - సువార్త సత్యము నుండి భిన్నమైన సువార్త తట్టుకు తిరిగిన గలతీయులను క్రమపరచుట (6-10వ.)**: పౌలు ప్రకటించిన సువార్త ప్రకారం యేసుక్రీస్తునందలి విశ్వాసవలననేగాని ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల మూలముగ మనుష్యులు

నీతిమంతులుగా తీర్చబడరు. కాని క్రీస్తు సువార్తను చెరపగోరి కలవరపరచు మరొక సువార్తను ఎవరైన ప్రకటించిన యెడల వారు శాపగ్రస్తులగుదురని తెలుపుచున్నాడు. 10వ. మనుషుల దయను కాక, మనుష్యులను సంతోషపెట్టువాడుగా కాక దేవుని దయను సంపాదించుకొనుచూ దేవుని సంతోషపెట్టువాడు క్రీస్తు దాసుడని తెలుపు చున్నాడు.

**ప్రభువు వలన బయలు పరచబడిన పౌలు బోధించిన సువార్త పరిచర్య (11-17వ.) :** 11,12వ. పౌలు బోధించిన సువార్తను యేసుక్రీస్తు నుండి తాను పొందితినని మనుష్యుల వలన దానిని పొందలేదని తెలుపుచున్నాడు. 13-14వ. యూదామతములో తాను అధిక్యత నొందిన వాడినవి తన సమాన వయస్కులలో అనేకులకంటే విశేష ఆసక్తి కలిగినవాడై ఉండెను. 15-17వ. కాని తల్లిగర్భమందు పడినది మొదలుకొని దేవుడు పౌలును ప్రత్యేక పరిచాడని అన్యజనులకు సువార్త ప్రకటించటానికి పిలిచాడని పౌలు గుర్తించి మనుష్య మాత్రులతో సంప్రదించక తనకంటే ముందుగా ఉన్న అపొస్తల యొద్దకు గాని సేవా కేంద్రమైన యెరూషలేముకు కాని వెళ్ళలేదు. అరేబియాలోనికి వెళ్ళి 3సం॥ అయిన తరువాత యెరూషలేముకు వెళ్ళి కేఫాను పరిచయము చేసుకొని 15 దినములుండెను. రక్షింపబడిన తరువాత యెరూషలేముకు వెళ్ళుట ఇదే మొదటి సారి. అక్కడ దేవుడు బయలుపరచిన సువార్తనే తరువాత దమస్కుకు వచ్చి బోధింప ఆరంభించెను.

**సంఘముల ఆమోదము పొందిన పరిచర్య (18-24) :** క్రీ.శ. 32లో రక్షించబడిన పౌలు క్రీ.శ. 35లో కేపా యాకోబులను కలసి పిమ్మట తార్సుకు వెళ్ళెను. క్రీ.శ. 46లో అంతియోకయ సంఘము ద్వారా సేవ కప్పగింపబడెను. (అ.కా. 13:1-3వ) 2:9లో 14 సం॥ తరువాత అనగా క్రీ.శ. 49లో యాకోబు, కేపా, యోహానులు తమకుడి హస్త మిచ్చినందున యెరూషలేము సంఘము పౌలు పరిచర్యను ఆమోదించెను.

**21-24వ వచనము :** సిరియా కిలికియా ప్రాంతములలోనున్న సంఘములు ముఖ్యముగా యూదయ సంఘములు క్రీస్తునందలి విశ్వాసమును పౌలు ప్రకటించు చున్నాడని దేవుని మహిమ పరచుట పౌలు యొక్క పరిచర్యను ఆమోదించుటయే. సిరియా కిలికియా దేవునికి మహిమ కలిగెను. క్రీ.శ. 35 నుండి క్రీ.శ. 45 వరకు సుమారు 10సం॥రాలు పౌలు సిరియా కిలికియా ప్రాంతములలో సువార్తను ప్రకటించాడు.

## 2వ అధ్యాయము 5+5+5+6=21 వచనములు
## అంశము : తన అపోస్తలత్వమును దృఢపరచుకొనుట

**తనను పిలిచినను వార్త పరిచర్య వ్యర్థము కాకుండుటకు ప్రయాసపడిన పౌలు (1-5వ.) :** 1-2వ. 14సం॥రాలు తరువాత యెరూషలేమునకు దేవ దర్శనం ప్రకారమే

వెలితిని అన్నాడు. తాను రక్షించబడిన పిదప దమస్కులోను, అరేబియాలోను, మరలా దమస్కులోను చాలా దినములుండెను. అవి దినములే. పిమ్మట 3 ఏండ్లకు 1:18 ప్రకారం యెరూషలేముకు తార్సుకు వెళ్ళాను. 10సం॥రాలు సిరియా కిలికియా ప్రాంతంలోను 1సం॥ అంతియొకయిలోను (అ.కా. 11:26) ఉన్నాడు. క్రీ.శ. 46-49 వరకు మొదట సేవా యాత్ర చేసి క్రీ.శ. 49లో బర్నబాతోను, తీతుతోను, బర్నబాతో కలసి అంతియొకయకు వెళ్ళెను. 3,4,5వ. తన పరిచర్యలో రక్షించబడిన గ్రీసు దేశస్తుడైన తీతు (తీతు 1:2) సున్నతి పొందుట కపట సహోదరుల వలన జరిగినది రక్షణ పొందుటకు సున్నతి అవసరం లేదు కనుక సున్నతి సభ తీర్మానమును అనగా రక్షణకు సున్నతి అవసరము లేదను సత్యం స్థిరపరచుటకై పౌలు ఈ పత్రికను వ్రాసెను.

**అపొస్తలత్వము కలిగి ఇతరుల ఆమోదము పొందిన పౌలు పరిచర్య (6-10వ.)** : 6-7వ. ఎన్నికయిన వారిలో కొందరు సున్నతి పొందని వారిని గూర్చి ప్రత్యేక అభిప్రాయం కలిగి ఉన్నారు. పౌలు దేవుని యొద్ద నుండి సువార్త సత్యం పొందినందున ఎన్నికయిన వారి దగ్గర నేర్చుకొనలేదు. ఎన్నికయిన వారిలో సున్నతి పొందిన వారికి అనగా యూదులకు సువార్త బోధించు పరిచర్య దేవుడు పేతురుకు అప్పగించెను. అలాగే సున్నతి పొందని వారికి అన్యులకు సువార్త బోధించు పరిచర్య దేవుడు పౌలుకు అప్పగించెను. 8,9,10వ. సున్నతి పొందిన వారికి అపొస్తలుడవుటకు పేతురుకు సామర్థ్యం కలుగజేసిన దేవుడు అన్యజనులకు అపొస్తలు డగుటకు పౌలుకు సామర్థ్యం అను గ్రహించాడని ఎన్నికయిన వారు గ్రహించారు. యెరూషలేము సంఘములో స్తంభములైన యాకోబు, కేఫా, యోహానులు అనువారు పౌలుకు తమ కుడిహస్తం ఇచ్చిరి. అనగా పౌలు యొక్క పరిచర్యను ఆమోదించిరి.

**సువార్త సత్యము విషయమై దారితప్పిన అపొస్తలులకు క్రమమును తెలిపిన పౌలు (11-15వ.)** : కేఫా అనబడిన పేతురు అంతియొకయకు వచ్చి అన్యులతో కలసి భోజనము చేయుచుండెను. యాకోబు నుండి కొందరు వచ్చిన తరువాత సున్నతి పొందినవారికి భయపడి అన్యులతో భోజనము చేయుటకు వెనుక తీసెను. తక్కిన యూదులును బర్నబాయు మోసపరచబడి వారితో కలిసిరి. ఈ ప్రవర్తన సువార్త సత్యంనకు వ్యతిరేకమని పౌలు గుర్తించి కెఫాను ఎదిరించాడు.

**3వ అధ్యాయములోని బోధ యొక్క పీఠిక - "విశ్వాసము ద్వారా నీతిమంతులుగా తీర్చబడుట" (16-21వ)**: ఈ భాగంలో గలతీ పత్రికలో చెప్పబడిన సువార్త సత్యం

వివరించబడినది. 16,17,18వ. మనుష్యులు యేసుక్రీస్తునందలి విశ్వాసము వలననే నీతిమంతులుగా తీర్చబడుదురు. అందుకే యేసుక్రీస్తునందు విశ్వాస ముంచుచున్నారు. ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల మూలముగా శరీర క్రియల మూలముగా అనగా యూదులుగాని అన్యులుగాని నీతిమంతులుగా తీర్చబడరు కనుక అందరు క్రీస్తునందు విశ్వాసముంచుట ద్వారా నీతిమంతులుగా తీర్చబడుదురన్న తలంపు కలిగి ఉండాలి.

**19-21వ వచనము :** కనుక దేవుని విషయమై మనము జీవించాలి. క్రీస్తుతో కూడా సిలువ వేయబడిన మనము ఆ క్రీస్తు మనయందు జీవించుచున్నాడని ఎరిగి మనలను ప్రేమించి మన కొరకు అప్పగించుకొనిన క్రీస్తుయందలి విశ్వాసము వలన జీవించాలి. క్రీస్తు మన పాపం కొర్కై చనిపోయినందున నీతి ధర్మశాస్త్రము వలన కలుగదని దేవుని కృప ద్వారానే రక్షణ కలుగునని గుర్తించాలి. 2 కొరిం. 5:15లో క్రీస్తు అందరి పాపం కొరకు మృతి పొందినందున జీవించువారు ఇక మీదట తమ కొరకు కాక తమ నిమిత్తం మృతిపొంది తిరిగిలేచిన వాని కొరకే జీవించాలని పౌలు నిశ్చయించుకొన్నాడు; ఈ తీర్మానము అందరు కలిగి ఉండాలి.

## 3వ అధ్యాయము 5+9+8+7=29 వచనములు
## అంశము : సువార్త సత్యము - క్రీస్తునందలి విశ్వాసము ద్వారానే నీతిమంతులుగా తీర్చబడుట

**గలతీయుల అనుభవము (1-5వ.) :**

**1వ వచనము :** రక్షణ పొందుటకై సున్నతి అవసరమని తీతును బలవంతము పెట్టి సున్నతి చేయించినందున వారు భయపడిరని అవివేకులైరని తెలుపుచున్నాడు.

**2వ వచనము :** తమ ఎదుట ప్రదర్శించబడిన సిలువ వేయబడిన యేసునందు విశ్వాసము ద్వారా దేవుని ఆత్మను పొందిరి.

**3-4వ వచనములు :** ఆత్మను సారముగ ఆరంభించినవారు శరీర సంబంధమైన క్రియలవైపు అనగా సున్నతి వైపు మరలుట అవివేకమని తెలుపుచున్నాడు.

**5వ వచనము :** విశ్వాసము ద్వారా పరిశుద్ధాత్మను అనుగ్రహించి దేవుడు వారిలో అద్భుతములు జరిగించాడు. ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల మూలముగ కాదని తెలుపుచున్నాడు గనుక తమ కన్నులముందు ఉన్న క్రీస్తు సిలువ నుండి తమ దృష్టిని ధర్మశాస్త్ర క్రియలవైపు మరల్చుకొన కూడదని చెబుతున్నాడు.

**6-29వ. పాత నిబంధన లేఖనముల నుండి ఋజువు - పితరుడైన అబ్రాహాము నీతిమంతుడుగా తీర్చబడిన విధము :** 6-7వ. అబ్రాహాము దేవుని నమ్మెను అది అతనికి నీతిగా ఎంచబడెనని ఆది. 15:4-6 వచనాలలో ఉన్నది. అబ్రాహాము అతని కుమారుడైన ఇష్మాయేలు. ఆది. 17:26లో సున్నతి పొందిరి. పై భాగమును బట్టి సున్నతి పొందక మునుపే అబ్రాహాము నీతిమంతుడుగా తీర్చబడెనని గ్రహించుచున్నాము.

**8-9వ వచనము :** ఆది. 12:3లో నీ యందు భూమి యొక్క సమస్త వంశములు (అనగా అన్యులు కూడా) ఆశీర్వదించబడును అన్నాడు. అలాగైతే నమ్మిన యూదులైన, అన్యులైన అందరు ఆశీర్వదించబడుదురు.

**10-11వ వచనము :** ధర్మశాస్త్ర క్రియలమూలముగ ఏ మనుష్యుడు ఆయన దృష్టికి నీతిమంతుడుగా తీర్చబడడని ధర్మశాస్త్రమందు వ్రాయబడిన విధులను చేయుటయందు నిలకడగా ఉండనివాడు శాపగ్రస్తుడని ద్వితీ. 27:26లో వ్రాయబడి ఉంది.

**12-14వ వచనము :** నీతిమంతుడు విశ్వాసమూలంగా జీవించునని హబక్కూకు 2:4లో వ్రాయబడింది. (రోమా 1:17, హెబ్రీ. 10:38) మ్రానుమీద వ్రేలాడు ప్రతివాడు శాపగ్రస్తుడని ద్వితీ. 21:23లో వ్రాయబడినట్లు క్రీస్తు మనకోసం శాపగ్రాహియై ధర్మశాస్త్రం యొక్క శాపం నుండి విడిపించాడు. కనుక విశ్వాసము ద్వారానే మనుష్యులు నీతిమంతులుగా తీర్చబడుదురు. పరిశుద్ధాత్మను పొందుదురు.

**అబ్రాహాము వాగ్దానము పొందిన విధము (15-22వ.) :** 15,18వ. మనుష్యరీతిగా చూచిన యెడల చేయబడిన ఒడంబడిక లేదా వ్రాయబడి ముద్రించబడిన పత్రములో అతని సంతానం గూర్చి నిబంధన చేసెను. 17:7,8లో ఆ నిబంధనను నిత్య నిబంధనగా స్థిర పరచెను. ఇలాగు జరిగిన పిమ్మట 430 సం॥రాలకు ధర్మశాస్త్రం మోషే ద్వారా అను గ్రహించబడెను. ఈ ధర్మశాస్త్రములో దేవుడు ముందుగా నిత్యకాలమునకు స్థిరపరచిన నిబంధనను కొట్టివేయుడు కనుక అబ్రహామునకు అనుగ్రహించబడిన నిత్య నిబంధన విశ్వాసము ద్వారానే కలిగినది. అతడు యెహోవాను నమ్మెను అది అతనికి నీతిగా ఎంచబడెను. ఆది. 15:4వ.

**19-22వ వచనము :** దేవుడిచ్చిన వాగ్దానములో ఉన్న సంతానమైన క్రీస్తు వచ్చి దేవునికి మానవుల మధ్యవర్తిగా ఉండి మానవుల పాప పరిహారం జరిగించాలి. మానవులు 1) తాము పాపులమని గుర్తించాలి. 2) తమ కొరకై మరణించి తిరిగి లేచిన మధ్యవర్తియైన క్రీస్తునందు విశ్వాసముంచాలి. పైన చెప్పబడినట్లు మానవులు తాము పాపులమని

గుర్తించుట కొరకే ధర్మశాస్త్రం అనుగ్రహించబడింది. కనుక ధర్మశాస్త్ర లేఖనాలు మానవులందరిని పాపంలోనే బంధించినవి. కాని పాపంలో మరణించిన మానవునికి జీవించు శక్తిని ఇవ్వలేదు.

**విశ్వాసము వెల్లడికాక మునుపు - వెల్లడియైన తరువాత మానవులు నీతిమంతులుగా తీర్చబడిన విధము (23-29వ.)** : 23-24వ. ముందుకు బయలు పరచబడబోవు విశ్వాసమును మానవులు అవలంబించాలి. ఆ విశ్వాసము ద్వారా మానవులు నీతి మంతులుగా తీర్చబడినట్టు తాము పాపులమని ఎరుగుటకు ధర్మశాస్త్రము బాలశిక్షకుడుగా ఉండెను. కనుక విశ్వాస మార్గము వెల్లడి కాకమునుపు జీవించిన వారు ధర్మశాస్త్రము ద్వారా తాము పాపులమని గుర్తించి క్రీస్తు యేసు మరణ పునరుత్థానం ద్వారా ముందుకు బయలుపరచబోవు విశ్వాసమార్గం అవలంభించి నీతిమంతులుగా తీర్చబడిరి.

**25-27వ వచనము** : నీతిమంతుడైన క్రీస్తు యేసు మరణించి పునరుత్థానమగుట ద్వారా విశ్వాస మార్గం వెల్లడి అయెను కనుక నీతిమంతుడైన క్రీస్తు ద్వారా పరిశుద్ధాత్మని ద్వారా యోహా. 16:8వ. ప్రకారం మానవులు తాము పాపులని ఒప్పించబడుచున్నారు. కనుక మరణించి పునరుత్థానుడైన యేసుక్రీస్తునందు విశ్వాసముంచుట ద్వారా నీతిమంతులుగా తీర్చబడి దేవుని కుమారులై ఉన్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మం పొందుట ద్వారా క్రీస్తును ధరించుకొన్నారు.

**28,29వ వచనములు** : ఇందులో రక్షింపబడుటలో యూదుడని గ్రీసు దేశస్థుడని బేధములేదు. దాసుడని స్వాతంత్రుడని బేధం లేదు. పురుషుడని స్త్రీ అని బేధము లేదు. అందరు క్రీస్తును ధరించు కొనినందున క్రీస్తునందు అందరూ ఏకముగా ఉన్నారు. కనుక గ్రీసు దేశస్థులైన అన్యుల విషయమై వేరుగ తలంచకూడదు. పైన చెప్పబడిన వివరాలను బట్టి క్రీస్తు యేసునందు విశ్వాసముంచిన క్రీస్తు యేసు సంబంధులైన వారందరు అబ్రహాము యొక్క సంతానము. అబ్రహాముకిచ్చిన వాగ్దానమును బట్టి క్రియల మూలముగా కాక విశ్వాస మూలంగానే వాగ్దానమునకు వారసులగుచున్నారు.

## 4వ అధ్యాయము 7+4+8+11= 31 వచనములు

## అంశము : రక్షణ కలిగిన విశ్వాసము నుండి వెనుకకు మరలరాదు

**పరిపూర్ణకాలంలో విశ్వాసము ద్వారా విమోచించబడుట - నీతిమంతులుగా తీర్చబడుట (1-7వ.)** : కాలము పరిపూర్ణము అనగా క్రీస్తు యేసు భూలోకమునకు వచ్చుటకు

నిర్ణయించబడిన కాలం పరిపూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారుడైన క్రీస్తు యేసును ఈ లోకం లోనికి పంపెను. మానవులందరు పురుషుల ప్రమేయంతో ఈ లోకంలో పుట్టుదురు కాని ఆయన కేవలం కన్యయగు స్త్రీయైన మరియ యందు పుట్టాడు. ధర్మశాస్త్రము ద్వారా పాపంలో బంధించబడిన మానవులను విమోచించుటకు ధర్మ శాస్త్రమునకు లోబడ్డాడు. గలతీ. 3:13వ.లో ముందుగ చెప్పబడినట్టు ధర్మశాస్త్రంలో ద్వితీ. 21:23వ.లో వ్రాయబడిన ప్రకారం మనకోసం మ్రాను మీద వ్రేలాడి శాపగ్రాహి అయ్యాడు. అనగా మన పాపమును బట్టి మనకు కలిగిన శాపములను (నరకశిక్ష) గ్రహించాడు. కనుక మనం పాప శిక్షనుండి విమోచింపబడిన వారమైతిమి. దీనిని విశ్వసించినవారు నీతి మంతులుగా తీర్చబడి పరిశుద్ధాత్మను, రోమా 8:15వ. ప్రకారం దత్తపుత్రాత్మను పొందుదురు. యోహాను 1:12వ. ప్రకారం క్రీస్తునందు విశ్వాసముంచిన వారు దేవుని కుమారులైనారు. కనుక తండ్రికి కలిగిన సమస్తమునకు, అనగా పరలోకమునకు వారసులైనారు.

**మనము నీతిమంతులుగా తీర్చబడిన విశ్వాసమునుండి వెనుకకు మరలరాదు (8-11వ.)** : ఇప్పుడు విమోచించబడినవారు, దేవుని ఎరిగిన వారును దేవుని చేత ఎరుగబడిన వారునై ఉన్నారు. కనుక మునుపటివలె బలహీనమైన వాటికి దాసులు కాకూడదని విశ్వాసము నుండి వెనుదిరిగి ఎటువంటి ఆచారాల వైపుకు తిరగకూడదని సెలవిచ్చు చున్నాడు.

**పౌలుతో తమకు గతకాలంలో కలిగిన వ్యక్తిగత అనుభవము నుండి నేర్చుకోవాలని కోరుట (12-20వ.)** : 12-15వ. పౌలు గలతీయులకు సువార్త ప్రకటించిన గతకాలంలో శరీర దౌర్బల్యత కలిగెను. శరీరంలో కలిగిన శోధనను బట్టి వారు పౌలును తృణీకరించ లేదు. పౌలు బోధించిన సువార్తను నిరాకరించలేదు. శక్యమైతే మీ కన్నులు ఊడదీసి నాకిచ్చివేసియుందురు అని అనుటను మనము ఈ రీతిగ తలంచవచ్చును. కన్నుల విషయమై ప్రస్తావించబడినందున పౌలు కన్నులకు తొందర కలిగినట్లు తలంచగలము. వారు పౌలును దేవదూతవలెను, క్రీస్తువలెను అంగీకరించిరి. క్రీస్తునందలి విశ్వాసము వలన కలుగు రక్షణను అంగీకరించిరి. పౌలు కంటి జబ్బు కొరకై తమ కన్నులను ఇచ్చుటకు సిద్ధపడిరి. కనుక గతములో పౌలును పౌలు బోధను వారు అంగీకరించినట్లు ఇప్పుడును ఆ బోధయందే నిలిచి ఉండవలెనని కోరుచున్నాడు.

**16-20వ వచనము** : భిన్నమైన సువార్తను తమ యొద్దకు తెచ్చినవారు గలతీయుల మేలును కోరినవారు కారని చెప్పుచు దానియందు లక్ష్యముంచ కూడదని సెలవిచ్చుచున్నారు. క్రీస్తు యేసు యొక్క స్వరూపము వారియందు ఏర్పడవలెనని దానికొరకు తాను ప్రసవవేదన పడుతున్నానని చెప్పుచున్నాడు.

**ధర్మశాస్త్రములోని అలంకారములను కనుపరుచు సాదృశ్యము (దాస్యము - స్వాతంత్ర్యము) (21-31వ.)** : ధర్మశాస్త్రంలో అబ్రాహామునకు స్వతంత్రురాలగు శారా వలన ఇస్సాకు ఆత్మీయముగా పుట్టాడు. దానికంటె ముందుగా హాగరు వలన శరీర ప్రకారము ఇష్మాయేలు పుట్టారు. శరీరమును బట్టి పుట్టిన ఇష్మాయేలు ఆత్మను బట్టి పుట్టిన ఇస్సాకును ఆది. 21:9వ. ప్రకారము పరిహసించి హింసపెట్టాడు. అలాగే ఆత్మ సంబంధమైన విశ్వాసులను వారు నీతిమంతులుగా తీర్చబడిన కార్యమును శరీర సంబంధమైనవారు హేళన చేయుట జరుగుచున్నది. ఆది. 21:12వ.లో దేవుడు సెలవిచ్చినట్లు దాసియగు హాగరును దాని కుమారుడగు ఇష్మాయేలును వెళ్ళగొట్టాడు. దాసి కుమారుడగు ఇష్మాయేలు స్వతంత్రురాలు కుమారుడగు ఇస్సాకుతో వారసుడుగా ఉండడని దేవుడు సెలవిచ్చాడు. కాబట్టి స్వతంత్రురాలి కుమారులముగా ఉన్న మనము కూడా ఆత్మ సంబంధమైనటువంటి విశ్వాసము ద్వారానే వారసులమైనాము. దాసీ కుమారులము కాము గనుక ఏ మూల పాఠకులకు గాని ఆచారములకు కాని దాసులము కామని తెలుపుతున్నాడు. దీనిని బట్టి ధర్మశాస్త్ర సంబంధమైన ఆచారమగు సున్నతి అక్కరలేదని, దినములు, మాసములు, ఉత్సవకాలములు సం॥రములను ఆచరించ అవసరం లేదని తెలుపుతున్నాడు. కనుక విశ్వాసమార్గంలోనే మనము ఎదుగవలెను కాని వెనుకటి ఆచారములకు మరల వెళ్ళరాదని నేర్చుకొనుచున్నాము.

## 5వ అధ్యాయము 6+6+3+6+5=26 వచనములు
## అంశము : ఆత్మానుసారమైన నడక

**విశ్వాసము ద్వారా రక్షింపబడి, ధర్మ శాస్త్రనడక నడవరాదు (1-6వ.)** : పైన చెప్పబడినట్లు క్రీస్తు మనలను స్వతంత్రులుగా చేసినందున దాస్యమను కాడిక్రింద మనము లేమని సున్నతి పొందుట వలన ప్రయోజనమేమి లేదని చెప్పుచున్నాడు. ధర్మశాస్త్రం ద్వారా నీతిమంతులుగా తీర్చబడగోరువారు క్రీస్తు ద్వారా కలుగు కృప నుండి

తొలగిపోయిన వారని చెప్పుచున్నాడు. కనుక విశ్వాసము ద్వారా నీతిమంతులుగా తీర్చబడి యేసుక్రీస్తునందున్న వారికి సున్నతి పొందుటయందు కాని పొందకపోవుటయందు గాని ఏమియు లేదని చెప్పుచున్నాడు. కనుక ఆత్మ ఫలములో మొదటిదగు ప్రేమ వలన జరిగిన కార్యమునందలి విశ్వాసమే మనలను నీతిమంతులుగా తీర్చినది. దేవుని ప్రేమయే కుమారుడైన క్రీస్తును లోకమునకు పంపి సిలువకు అప్పగించినది. పాప క్షమాపణకై ఆయన చేసిన కార్యమునందు విశ్వాసముంచుట ద్వారా మనము నీతిమంతులుగా తీర్చబడితిమి.

**సత్యమునకు విధేయులై నడుచుకొనుట (7-12వ.)** : 7వ. గతకాలములో గలతీయులు సత్యమునకు విధేయులై నడుచుచుండిరి. కాని ఇప్పుడు ఆగిపోయిరి. 8వ. ధర్మశాస్త్ర సంబంధమైన ఆచారములను ఆచరించుట మనలను పిలిచిన ప్రభువు వలన కలిగినది కాదని అసత్యమని చెప్పుచున్నాడు. 9వ. అసత్యబోధ పులిసిన పిండివలె వ్యాపించి ముద్ద అంతటిని అనగా విశ్వాస కోటిని అసత్యములోనికి నడిపించునని తెలుపుచున్నాడు. 10-12వ. సున్నతిపొందవలెనని పౌలు ఎన్నడు బోధింపలేదు. ఆలాగు బోధించుట సిలువ వేయబడిన క్రీస్తు ద్వారా నీతిమంతులుగా తీర్చబడు విశ్వాస మార్గమునకు వ్యతిరేకము. కనుక ఎవరైనను అటువంటి బోధ చేయరాదు.

**స్వతంత్రులమైన మనము ఒకరికి ఒకరము దాసులుగా నుండుట (13-15వ.)** : విశ్వాస విషయములో స్వతంత్రత కలిగిన వారమేకాని ఆ స్వతంత్రతను బట్టి ధర్మశాస్త్ర క్రియలు చేయుటకు అప్పగించుకొనుట దాస్యమను కాడి క్రిందికి వెళ్ళుటయే. కనుక సున్నతి అనునటువంటి క్రియల వైపునకు మరలక ఒకనినొకరు ప్రేమించుకొనుచు ఒకరినొకరు గాయపరచుకొన కుండవలెనని చెప్పుచున్నాడు.

**ఆత్మానుసారమైన నడకలో శరీరేచ్ఛలు నెరవేర్చకుండుట (16-21వ.)** : 16-17వ శరీరము ఆత్మకు విరోధముగాను, ఆత్మ శరీరమునకు విరోధముగాను కోరును. కనుక ఆత్మ చేయ నిశ్చయించు వాటిని మనము చేయలేకపోవుచున్నాము. పౌలు రోమా 7:17-25వ. తన స్వంత అనుభవమును చెప్పుచు 19వ వచనములు "చేయగోరు మేలు చేయక చేయగోరని కీడును చేయుచున్నాను" అన్నాడు. 18వ. ఆత్మాను సారమైన నడక

నడచువారు ధర్మశాస్త్ర క్రియలకులోను కానవసరము లేదని చెప్పుచున్నాడు. 19-21వ. శరీర క్రియలను గూర్చి వివరించుచున్నాడు.

**ఆత్మాను సారమైన నడక ఫలములో కూడినది (22-26వ)** : 22-24వ. ఆత్మాను సారమైన నడకలో ఆత్మ ఫలములోనున్న 9 గుణములు కనిపించును. 1. ప్రేమ. 2. సంతోషము, 3. సమాధానము, 4. దీర్ఘశాంతము, 5. దయాళుత్వము, 6. మంచి తనము, 7. విశ్వాసము, 8. సాత్వికము. 9. ఆశా నిగ్రహము.

వీటికి విరోధమైన గుణములు మనలో నుండకూడదు. క్రీస్తు యేసు సంబంధులు అనగా ఆత్మీయ నడక నడుచువారు. శరీరమును దాని ఇచ్ఛలను సిలువ వేసియున్నారు. 25-26వ. ఆత్మననుసరించి క్రమమైన జీవితము జీవించుచు ఒకరితో నొకరు వాదించక, అసూయ కలిగియుండక, వృథాగా అతిశయపడక యుండవలెనని చెప్పుచున్నాడు.

## 6వ అధ్యాయము 5+5+6+2=18 వచనములు
## అంశము : ఆత్మానుసారమైన నడకలోని పరిచర్య

**తప్పితములో చిక్కుకొనిన వానిని ఆత్మానుసారమైన నడకలోనికి నడిపించుట (1-5వ.):** ఆత్మీయులు తప్పితములు చేయగలరు. (1 యోహాను 1:10వ.) ఆలాటి వారిని గూర్చి ప్రచారము చేయక మనమును శోధింపబడుదుమని గుర్తించుకొనాలి. జాగ్రత్తగా పరీక్షించు కొనిన పిదప శోధనలోలేమని నిశ్చయించుకొని సాత్వికమైన మంచి మనసును కలిగిన వారమై అట్టి వారిని మంచి దారికి తీసుకొని రావాలి. మత్తయి 18:15లో క్రమపరచు విధమున్నది. నీ సహోదరుడు నీ యెడల తప్పిదము చేసిన యెడల నీవు పోయి నీవును, అతడును ఒంటరిగానున్నపుడు అతనిని గద్దించాలి. అతడు నీ మాట వినిన యెడల నీవతని సంపాదించుకొంటివి. అతడు వినని యెడల ఒకరిద్దరిని వెంటబెట్టుకొని అతని యొద్దకు వెళ్ళుము. ఇద్దరు ముగ్గురు సాక్షుల నోట ప్రతి మాట స్థిరపరచబడాలి. అతడు వారి మాట వినని యెడల సంఘమునకు తెలియ చెప్పుము. అతడు సంఘపు మాట వినని యెడల అతని అన్యుడుగా ఎంచుము. గలతీ. 6:1లో అతనిని మంచి దారికి తీసుకొని రావాలి అనుటలో అన్ని విధముల ప్రయత్నములు జరుగాలి. కొరింథీయులు తప్పిదము చేసిన వానిని 1 కొరింథీ. 5:4వ ప్రకారము క్రమశిక్షణ క్రింద ఉంచిరి. ఆ తరువాత ఆ వ్యక్తిని చేర్చుకొనుటలో శ్రద్ధ చూపలేదని 2 కొరింథీ 2:11వలో చూడగలము. మనము ఆలాగుండకూడదు. ఎవడైనను పట్టివాడైయుండి ఎన్నికైనవాడుగా ఎంచుకొన

కూడదు. ప్రతివాడు తాను చేయు పనిని పరీక్షించుకొనాలి. అప్పుడు ఇతరులను బట్టి కాక తనను బట్టియే అతనికి అతిశయము కలుగును.

**ఆత్మానుసారమైన నడకలో అందరికి అలయక మేలు చేయుట (6-10వ.)** : వాక్యోపదేశము చేయువానికి వాక్యోపదేశము పొందువారు అన్ని మంచి పదార్థములలో భాగము ఇవ్వాలి. సమయము దొరికిన కొలది అందరికి మేలు చేయాలి. మరి ముఖ్యముగా విశ్వాస గృహమునకు చెందిన వారికి మేలు చేయాలి. మేలు చేయువారు ప్రభువు నుండి పంటకోయుదుము. 7వ వచనములో మనుష్యుడు ఏమివిత్తునో ఆ పంటనే కోయునని చెప్పబడినది.

**ఆత్మానుసారమైన నడక క్రీస్తు సిలువయందే గురి కలిగి అతిశయించుట (11-16వ.)**: సున్నతి సమస్య ఆ దినములలో పెద్దదిగానుండెను. సున్నతి గలవారు శరీర విషయము లందు అతిశయింతురని అయినను వారు ధర్మ శాస్త్రమును నెరవేర్చరని చెప్పుచున్నాడు. విశ్వాసి లోకమునకు లోకము తనకు సిలువ వేయబడినట్లు ఉండాలి. అందువలన సిలుయందు తప్ప, మరిదేనియందును అతిశయించరాదని చెప్పుచున్నాడు. క్రీస్తు యేసు నందుండి నూతన సృష్టిగా చేయబడుటయే తప్ప శరీర సంబంధమైన సున్నతివంటి ఏ కార్యము ద్వారా ఏమియు కలుగదు.

**ముగింపు (17-18వ.)** : క్రీస్తుతో కూడ పౌలు లోకమునకు సిలువ వేయబడినందున తన శరీరములో క్రీస్తు ముద్రలు ధరించితినని చెప్పుచున్నాడు. ఆశీర్వాదముతో పత్రిక ముగించుచున్నాడు.

# ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక

గ్రంథకర్త : పౌలు . **కాలము** : క్రీ.శ. 61 (3:1) **స్థలము** : రోములోని మొదటి చెర 3:1. **కొనిపోయినవారు** : తుకికు 6:21-22అ.

**ముఖ్య ఉద్దేశము** : క్రీస్తునందున్న విశ్వాసి.

**ఎఫెసు పట్టణము** : ఎఫెసు చిన్న ఆసియాలోనున్న పట్టణములన్నింటికి కేంద్రమైన పెద్ద పట్టణము. చిన్న ఆసియా దేశానికి ముఖ్య పట్టణము ఆసియాలోని నలుదిశల నుండి హతసాక్షులను తెచ్చుటచే, దీనిని హతసాక్షుల రహదారియనిరి. ఆసియా సముద్ర తీరమంతటిలో 220 పట్టణములు కలవు. అందులో అనేక ఓడరేవులు కలవు. ఎఫెసు నందలి ఓడరేవు అన్నిటికంటే పెద్దది. ఇది స్వపరిపాలన గల స్వతంత్ర పట్టణము. ఎఫెసు నందు అర్తెమిదేవి లేక డయానా దేవాలయముండుట చేత మిక్కిలి ప్రఖ్యాతి గాంచినది. ఈ దేవాలయము ప్రపంచములోని ఏడు వింతలలో ఒకటి. అ.కా. 19లో ఈ దేవతారాధన వర్ణింపబడినది. ఈ గుడి నిర్మించుటకు 220 సం॥ పట్టెనని చెప్పుదురు. ఈ దేవాలయము మాత్రమే కాదు, నేరములకు వ్యభిచారమునకు అవినీతికి కేంద్రము. దేవదాసిలెందరో కలరు.

ఆ దినములలో ఎఫెసునందు 2 లక్షల మంది జనులు నివసించుచుండిరి.

ఆ పట్టణములో యూదులు కొందరుండిరి. సమాజ మందిరము కూడ ఉండెను. అ.కా. 18:19, 19:8, 13-17. క్రమేణ దాని ప్రభావమంతయు తగ్గిపోయెను. ఇప్పుడు అక్కడ ఒక కుగ్రామము మహమ్మదీయుల పాలన క్రింద కలదు. దానికి అయసలక్ అని పేరు.

**ఎఫెసు సంఘస్థాపన** : పౌలు ఎఫెసు పట్టణములో సంఘం స్థాపించిన సంగతి అ.కా. 18:19లో వ్రాయబడినదది. ఆ మొదటి పని కొంచెముగానే ఉండెను. 18:24 చొప్పున పౌలు వెళ్ళిన తరువాత అపొల్లో అను విద్వాంసుడు ఎఫెసుకు వచ్చి కొంత సేవ చేసినట్లు తెలియుచున్నది. ఆయన సేవ పూర్ణమైనది కాదు. ఎందుకనగా యోహాను బాప్తిస్మము మాత్రమే ఎరిగినవాడైయుండెను. అ.కా. 18:25. అయినను కొంతపని జరిగెను. గనుక పౌలు అ.కా. 19:1-7లో వ్రాసినట్లు రెండవసారి ఎఫెసు పట్టణము దర్శించు సరికి పన్నెండుగురు యోహాను బాప్తిస్మము పొందినవారుయుండిరి. అప్పటికి క్రొత్త నిబంధన లేదు. గనుక పౌలు క్రీస్తు చనిపోయి లేచి ఆరోహణుడై పరిశుద్ధాత్మను పంపెనని

అట్టి క్రీస్తునందు విశ్వాసముంచవలెనని తేటగా బోధించినపుడు ఆ పన్నెండుగురు నమ్మి సరిగా క్రీస్తు శిష్యులై ఆత్మచేత ముద్రించబడి సంఘముగా చేర్చబడిరి. వారితో ఎఫెసు సంఘము విస్తరించ నారంభమాయెను.

ఎఫెసు వారు మునుపు చాలా విగ్రహారాధికులు. వారి దేవత పేరు ఆర్తెమిదేవి (అ.కా. 19:28) ఆమె ఆకాశమునందున్న JUPITER ద్యుపతి యొద్ద నుండి క్రిందపడి వారి దేవత అయెనని వారి నమ్మకము అ.కా.19:35. పౌలు ఎఫెసులో రెండేండ్ల వరకు తురన్ను అను ఒకని పాఠశాలలో లేఖనములను బోధించి ప్రతిరోజును నమ్మినవారిని స్థిరపరచుచు ఎఫెసు సంఘమును దివ్యముగా స్థాపించెను. 19:8-13. సాతాను రేగినను ఆ పని ముందుకు సాగి గొప్ప మర్మములలో కూడిన పత్రికను ఎఫెసీయులకు వ్రాయుట జరిగెను. ఆత్మ బలముతో పౌలు పని చేసి పాతాళ లోకమును కదిలించెను. అందును బట్టియే దయ్యము పౌలు నెరుగుదునని చెప్పగలిగెను. 19:15. ఈ దినములతో సహా ఇట్లు పూనుకొనినవారు నిలువబడి పోరాడితే మంచి గట్టియైన సంఘములు క్రీస్తు పేరట దేశమందేర్పడును సందేహము లేదు. తొలిగా నమ్మినవారిలో తప్పు చేష్టలుండినను పరిశుద్ధాత్మ బలముగా క్రియచేస్తే వారు తిప్పబడి తప్పు చేష్టలను తెలియజేసి యొప్పుకొని విడిచిపెట్టిరి. ఆ చేష్ట కాధారమైన చెడు పుస్తకములను కూడ కాల్చివేసిరి. 19:14-20. వాటివెల 50 వేల వెండి రూకలాయెను. పౌలు ఇంటింటను బహిరంగముగాను సాక్ష్యమిచ్చుచు దేవుని యెదుట మారుమనస్సు పొంది ప్రభువైన యేసుక్రీస్తునందు విశ్వాసముంచవలెనని ప్రకటించెను. 3 సం॥లు క్రీ.శ.54,55,56 ఎఫెసులో నుండి రాత్రింబగళ్ళు ప్రతి మనుష్యునికి మానక బుద్ధి చెప్పెను. అ.కా. 19:10లోనున్నట్లు ఆసియా దేశములోని వారందరు దేవుని వాక్యమును వినిరి. అ.కా. 19:26లోనున్నట్లు ఆసియా దేశవాసులు అనేకులు ప్రభువు వైపు తిరిగిరి. అ.కా. 20:17-38. ఎవరి సొమ్ము ఆశించక చేతులతో పని చేసి కష్టపడి జీవనము చేయుచు సువార్త ప్రకటించెను. ఆయన సేవా విధానము ఆశ్చర్యకరమైనది, మాదిరికరమైనది. 1 కొరి. 15:32లో నేను ఎఫెసులో మృగములతో పోరాడితిని అంటున్నాడు. ఆలాగు మృగములాంటి మనుష్యులతో ఎఫెసులో పోరాడి అనేకులను ప్రభువువైపు త్రిప్పెను. అ.కా. 19:26. పౌలు కాలములో 12 వేల మంది శిష్యులు ఎఫెసీ పరిసర ప్రాంతములోయున్నారని చరిత్ర చెప్పుచున్నది. క్రీ.శ. 63 నుండి తిమోతి ఆ సంఘమందుండి సేవ చేసెను. యోహాను చివరి దినములు ఎఫెసులో గడిపెను. అక్కడ నుండియే యోహాను సువార్తను, మూడు పత్రికలను,

ప్రకటన గ్రంథమును వ్రాసెను. కాని మొదటి శతాబ్ద ముగింపులో ప్రేమను వదిలిన సంఘమని ప్రకటనలో చూచుచున్నాము. చల్లారిన స్థితికి వచ్చినది. ఇప్పుడు అక్కడ సంఘము లేదు.

ఎఫెసీ పత్రికలోనున్న 155వ వచనములలో 80వ వచనములు అనగా సగముకంటె ఎక్కువ వచనములు కొలొస్సయి పత్రికలో కనుపించును. అందువలన ఎఫెసీ, కొలొస్సయి పత్రికలను సమాంతర పత్రికలుగా ఎంచుదురు. ఎఫెసీలో సంఘము క్రీస్తు శరీరము ముఖ్య అంశము ఫిలిప్పీలో సంఘ నడక ముఖ్య అంశము. కొలొస్సయిలో సంఘమునకు శిరసుగానున్న క్రీస్తు ముఖ్య అంశము.

## అధ్యాయాల విభజన

**1-3వ అధ్యాయములు** : విశ్వాసిని గూర్చిన బోధ - సంఘము యొక్క పోలికలు.

**1వ అధ్యాయము** : విశ్వాసిని గూర్చిన దేవుని ప్రణాళిక - సంఘము శరీరము.

**2వ అధ్యాయము** : విశ్వాసి యొక్క జీవిత పరిస్థితి - సంఘము ఆలయము.

**3వ అధ్యాయము** : విశ్వాసుల సంఘమును గూర్చిన ప్రత్యక్షత - సంఘము మర్మము.

**4-6వ అధ్యాయములు** : విశ్వాసి నడక.

**4వ అధ్యాయము** : విశ్వాసులు శరీర అవయవములుగా ఐక్యత కలిగి ఒకరితోనొకరు నడుచుకొనుట; సంఘము - మానవుడు.

**5వ అధ్యాయము** : విశ్వాసులు దేవుని పోలి నడుచుకొనుట, పెండ్లికుమార్తెవలె భర్తయైన క్రీస్తుకు లోబడి నడుచుకొనుట; సంఘము - పెండ్లి కుమార్తె.

**6వ అధ్యాయము** : విశ్వాసులు రాణువ వానివలె అపవాదితో పోరాటములో నడుచు కొనుట (విశ్వాసుల పోరాటము); సంఘము - సైనికుడు.

## 1వ అధ్యాయము 6+6+2+5+4=23 వచనములు
## అంశము : విశ్వాసిని గూర్చిన ప్రణాళిక

**తండ్రియైన దేవుని నిర్ణయము (ప్రణాళిక) (1-6వ.)** : 1-2వ. శుభములు. కృప అన్యుల యొక్క వందన వచనము సమాధానము, యూదులు వందనములు తెలుపు

విధము. 4-6 వచనాలలో నిర్ణయము, ఏర్పాటు అను పదములు కలవు. 8-9 వచనాలలో ఏర్పాటు 10వ వచనములో నిర్ణయము. 11-12 వచనాలలో నిర్ణయము, ఏర్పాటు అను పదములు మొత్తము 6 పర్యాయములు కలవు. కనుక మానవుల పట్ల దేవుని నిర్ణయము లేదా ప్రణాళిక ప్రాముఖ్యమైన అంశమని చూడగలము. 3-6వ. తండ్రియైన దేవుడు తన ఇష్టప్రకారము మనలను తనకు కుమారులనుగా చేసుకొనవలెనని జగత్తుకు పునాది వేయక మునుపే నిర్ణయించాడు. 2. మనము తన ఎదుట పరిశుద్ధులుగాను. నిర్దోషులుగాను ఉండవలెనని నిర్ణయించాడు. 3. పరలోక విషయములో ఆత్మ సంబంధ మైన ప్రతి ఆశీర్వాదము మనకు అనుగ్రహించాడు. 4. తన కృపద్వారా మనలను రక్షించాడు. మానవులకు తన మహిమను క్రీస్తు ద్వారా యిచ్చాడు. ఈ కృపా మహిమకు కీర్తి కలుగవలెనని పై ప్రణాళికను సిద్ధపరచాడు. క్రీస్తును విశ్వసించిన వారు రాబోయే దినములలో దీనిని నెరవేర్చాలి.

**కుమారుడైన దేవుని నెరవేర్పు (7-12వ.)** : దేవుని కృపా మహదైశ్వర్యమును బట్టి ప్రియుడైన క్రీస్తు యేసు 2,000 ఏండ్ల క్రితము తన పవిత్ర రక్తమును కార్చు ఏర్పాటు జరిగినది. ఆ రక్తము ద్వారా మన పాపములకు అపరాధములకు క్షమాపణ. పాప శిక్ష నుండి విడుదల లభించాయి. 8-9వ కాలము పరిపూర్ణమైనపుడు తన ఏర్పాటును అనగా విమోచన ప్రణాళికను మనకు తెలియచేశాడు. తన కృపను మనపట్ల విస్తరింప చేసాడు. 10వ. ప్రస్తుతము భూమిపై కుటుంబములో కాని సమాజములో కాని సంఘములో కాని ఏకత్వము లేదు. అంతటా భిన్నత్వమే ఉన్నది. పరలోకములోనున్న రమ్యత భూలోకములో కూడా కలిగించి పరలోకమందున్నవి భూలోకమందున్నవి సమస్తమును క్రీస్తునందు ఏకముగా సమకూర్చవలెనని తనలో తాను నిర్ణయించుకొన్నాడు. దీని నెరవేర్పునే 4,5,6 అధ్యాయములో కలుగ నేర్పరచెను. 11-12వ. క్రీస్తునందు మనకొక స్వాస్థ్యము ఏర్పరచబడినది. దేవుని చిత్త ప్రకారము చేయబడిన ప్రణాళిక ద్వారా క్రీస్తు యేసు సమస్త కార్యములు జరిగించుచున్నాడు.

**పరిశుద్ధాత్మ దేవుని నెరవేర్పు (13-14వ.)** : 13వ పరిశుద్ధాత్మ దేవుడు మనకు సువార్తను వినిపింప చేసి క్రీస్తు జరిగించిన రక్షణ కార్యమునందు విశ్వాసముంచుటకు మనలను నడిపించుటలో సహాయము చేసి ఆ రక్షణ కార్యము మనలో ముగించినందుకు గురుతుగా పరిశుద్ధాత్మ దేవుడు ఆత్మచేత ముద్రించాడు. 14వ. దేవుడు మనలను తనకు సొత్తుగా చేసికొనినందుకు సంచకరువుగా తన ఆత్మనిచ్చాడు ఎఫెసీ 4:30. ప్రకారము. ఈ ఆత్మ ముద్ర విమోచన దినము వరకు ఉండును.

**దేవుని పిలుపును పిలుపు యొక్క నిరీక్షణను తెలుసుకొను పౌలు మనసును దేవుడు అనుగ్రహించునట్లు పౌలు ప్రార్థన (15-19వ.)** : 15-16వ. ఎఫెసీయులు కలిగిన విశ్వాసము ప్రేమను బట్టి పౌలు దేవునికి స్తుతి చెల్లించుచున్నాడు. 17-19వ ఎఫెసీయులు ఈ క్రింది విషయములను తెలుసుకొనుటయందు ప్రత్యక్షత గల మనస్సును దేవుడు అనుగ్రహించునట్లు ప్రార్థన, విజ్ఞాపన చేయుచున్నాడు.

1. పిలువబడిన పిలుపు యొక్క నిరీక్షణ. (పిలుపు వివరములు అ.కార్యములు 12వ అధ్యాయము చివరలో చూడండి)

2. పరిశుద్ధులలో ఆయన యిచ్చిన స్వాస్థ్యమైన రక్షణ, పరలోకములో కలిగియుండ బోవు మహిమ ఎంత గొప్పదో ఎరుగుట.

3. క్రీస్తునందు వినియోగపరచిన బలాతిశయమును బట్టి విశ్వసించు వారియందు ఆయన చూపు శక్తియొక్క అపరిమితమైన మహత్త్యము.

4. మహిమా స్వరూపుడగు తండ్రిని ఎరుగుట.

**తండ్రియైన దేవుడు క్రీస్తును హెచ్చించిన వివరము (20-23వ.) :**

1. దేవుడు తన బలము చేత క్రీస్తును మృతులలో నుండి లేపాడు.

2. సమస్తమైన ఆధిపత్యముకంటే హెచ్చించాడు.

3. సమస్తమైన అధికారము కంటే హెచ్చించాడు.

4. సమస్తమైన శక్తికంటే అధికముగా హెచ్చించాడు.

5. సమస్తమైన ప్రభుత్వముకంటే అధికముగా హెచ్చించాడు.

6. ఈ యుగమందే కాక రాబోవు యుగమునందును పేరు పొందిన ప్రతినామము కంటే ఎంతో హెచ్చుగా హెచ్చించాడు.

7. పరలోకములో తండ్రి కుడి పార్శ్వమున కూర్చుండబెట్టాడు.

8. సమస్తమును ఆయన పాదముల క్రింద పెట్టాడు.

9. క్రీస్తును సంఘమునకు శిరస్సుగా చేశాడు.

## 2వ అధ్యాయము 3+4+3+2+6+4=22 వచనములు

### అంశము : విశ్వాసి యొక్క జీవిత ప్రవర్తన - పరిస్థితి

1-10వ. విశ్వాసి ప్రవర్తన. 11-22వ. విశ్వాసి యొక్క పరిస్థితి :

**మునుపటి ప్రవర్తన (1-3వ.)** : 1వ. రక్షింపబడక మునుపు అపరాధముల చేత, పాపములచేత చచ్చినవారు 2వ. పాపములు, అపరాధములు చేయుచు వాయు మండల సంబంధమైన అధిపతియగు సాతానును అనుసరించి మునుపు నడుచుకొనిన వారు. ఈ ప్రపంచ దర్మమును అనుసరించి మునుపు నడుచుకొనినవారు. 3వ. శరీరము యొక్కయు మనసు యొక్కయు కోరికలను నెరవేర్చుకొనిన వారు. శరీరాశలను అనుసరించి మునుపు ప్రవర్తించినవారు. దైవోగ్రతకు పాత్రులైనవారు.

**ప్రస్తుత ప్రవర్తన (4-7వ.)** : 4-5వ. కరుణా సంపన్నుడైన దేవుడు మన యెడల మహా ప్రేమను కనపరచి క్రీస్తుతో కూడా మనలను బ్రతికించాడు. జీవితములో మార్పు నిచ్చి, కృపచేత పాప శిక్షయైన నరకము నుండి రక్షించాడు. 6-7వ. తన కృపా మహదైశ్వర్యమును కనుపరచు నిమిత్తము క్రీస్తు యేసుతో మనలను లేపి మహిమగల పరలోకములో ఆయనతో కూర్చుండబెట్టాడు.

1) ఎఫెసీ. 2:8లో రక్షించబడితిమి, 2) రక్షింపబడుచున్నాము. 1 కొరిం. 1:18. రక్షణ కొనసాగించుకొనుట. ఫిలిప్పీ 2:12. 3) రక్షింపబడుదుము యూదా 3వ. రక్షణలోని మూడు కాలములను గమనించగలరు.

**ఇక మీదటి ప్రవర్తన 8-10వ.)** : రక్షణ ఉచితముగా దేవుని కృప వలన కలిగినందున, ఎవరు దాని విషయమై అతిశయింపక దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్ క్రియలు చేయవలసిన వారుగానున్నారు. 6వ వచనములో చెప్పబడినట్లు పరిశుద్ధముగా ఉండ వలసినందున పరిశుద్ధమైన క్రియలు అనగా సత్‌క్రియలు చేయవలసినవారు.

**విశ్వాసి యొక్క పరిస్థితి (11-22వ)** :

**మునుపటి పరిస్థితి (11-12వ.)** : 1) శరీర విషయము అన్యులు, 2) చేతులతో చేయబడిన సున్నతి లేనివారని అనబడినవారు, 3) ఇశ్రాయేలుతో సహపౌరులు కారు, 4) పరదేశులు, 5) వాగ్దాన నిబంధన లేని పరజనులు, 6) నిరీక్షణలేనివారు, 7) లోక మందు దేవుడు లేనివారు, 8) క్రీస్తుకు దూరస్థులు.

**ఇప్పటి పరిస్థితి (13-18వ.)** : 1) క్రీస్తు యేసునందు, క్రీస్తు రక్తమువలన సమీపస్థులు, 2) యూదులు, అన్యులు సిలువ వలన తమ మధ్యనున్న ద్వేషము తీసివేయబడి ఏకము చేయబడిరి, 3) వీరిద్దరు క్రీస్తునందునూ తన పురుషుడుగా చేయబడిరి, 4) దేవునితో సమాధాన పరచెను, 5) క్రీస్తు వచ్చి యూదులకు అన్యులకు సమాధాన సువార్త ప్రకటించెను, 6) క్రీస్తు ద్వారానే యూదులు అన్యులు అందరు దేవుని సన్నిధికి చేరగలిగిరి.

**ఇక మీదట పరిస్థితి (19-22వ.)** : 1) పరదేశులు, పరజనులు ఏ మాత్రము కారు, 2) పరిశుద్ధులతో ఏక పట్టణస్థులు, 3) దేవుని ఇంటివారుగానుందురు, 4) క్రీస్తను పునాది రాయిపై చక్కని కట్టడముగా అమర్చబడుచున్నారు. 5) ప్రభువునందు పరిశుద్ధ దేవాలయముగా వృద్ధి పొందుచున్నారు, 6) దేవుని నివాస స్థలముగా కట్టబడుచున్నారు.

## 3వ అధ్యాయము 6+7+8=21 వచనములు
## అంశము : విశ్వాసులను గూర్చిన సంఘ మర్మ ప్రత్యక్షత

**సంఘ మర్మము పౌలుకు బయలు పరచబడుట (1-6వ.)** : 1-4వ. సంఘమర్మ ప్రత్యక్షత ఎఫెసీయుల కొరకు పౌలున కనుగ్రహించబడినది. దేవదర్శనము వలన అనుగ్రహించబడినది. దీనిని గూర్చి పౌలు మునుపే వారికి వ్రాసాడు. అది చదివిన యెడల సంగతులు వారికి అర్థమగునని చెప్పుచున్నాడు. (పౌలు వ్రాసిన ఆ పత్రిక మనకు లభ్యము కాలేదు). 5-6వ అపొస్తలులకు ప్రవక్తలకు ఇప్పుడు బయలు పరచ బడినట్లు పూర్వకాలపు మనుష్యులకు బయలు పరచబడలేదు. ఆ సంఘ మర్మమునందు మూడు అంశములు కలవు.

1) సువార్తవలన అన్యజనులు క్రీస్తు యేసునందు యూదులతో సమానవారసులు.

2) ఒక శరీరమందు సాటి అవయవములు.

3) వాగ్దానములలో పాలివారు. ఏ మనుష్యుడైనను, ఏమి చేసినవాడైనను, ఎక్కడ నున్నవాడైనను యథార్థముగా దేవుని వెదకిన ఎడల సత్యమును కనుగొనినవాడై పైన చెప్పిన మూడు ఆధిక్యతలు కలవాడుగానుండును.

**సంఘమర్మ ప్రకటన (7-13వ.)** : 7వ. 1) బయలు పరచబడిన మర్మమునకు దేవుడు పౌలును పరిచారకుడుగా నియమించాడు. 8-11వ. 2) క్రీస్తు యేసునందలి నిత్య సంకల్పమును పరలోకములో ప్రధానులకు, అధికారులకు సంఘము ద్వారా తెలియబడవలెనని తలంచి ప్రకటించు పనిని పౌలుకు అప్పగించాడు. 3) మానవులు శోధింప వీలులేనంతటి క్రీస్తు ఐశ్వర్యమైన పైన చెప్పబడిన ధన్యతను అందరికి తేటపరచు బాధ్యతను అనగా గృహ నిర్వాహకత్వమును పౌలుకు అప్పగించాడు. 12-13వ. 4) ఈ పరిచర్యలో పౌలు శ్రమలను అనుభవించుచూ ఎఫెసీయులు అధైర్య పడకూడదని చెప్పుచున్నాడు.

**సంఘ సంపూర్ణత కొరకు పౌలు ప్రార్థన (14-21వ.)** : విశ్వాసులు తగిన శక్తికలవారు కావలెనని పౌలు ప్రార్థించుచున్నాడు. పౌలు చెరసాలలో సంకెళ్ళతో బంధింపబడి

యున్నాడు. (కొలొస్స. 4:4) బంధకములోనే మోకరించి ప్రార్థించుచున్నాడు. ప్రార్థనలోని అంశములు గమనించదగినవి.

1) అంతరంగ పురుషుని యందు శక్తి కలిగియుండాలి.

2) ఆత్మ వలన బలపరచబడాలి.

3) క్రీస్తు విశ్వాసుల హృదయములలో నివసించాలి.

4) ప్రేమయందు వేరుపారి స్థిరపడాలి.

5) జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమను అనగా నాలుగు కొలతలను 1) పొడవు, 2) వెడల్పు, 3) లోతు, 4) ఎత్తు తెలిసికొనుటకు శక్తిగలవారు కావాలి.

6) దేవుని సంపూర్ణతయందు పూర్ణులు కావాలి.

7) దేవుడు తన మహిమైశ్వర్యమును బట్టి పై ధన్యతలను అనుగ్రహించాలి.

**దేవుని శక్తిగల కార్యము (20-21వ.)** : దేవుడు తన శక్తిని బట్టి అడుగు వాటన్నిటి కంటెను, ఊహించు వాటన్నిటికంటెను, అత్యధికముగా చేయగలవాడని ఆయనకు మహిమ కలుగుగాకని బోధ విషయములను ముగించుచున్నాడు.

## 4వ అధ్యాయము 6+4+6+8+8=32 వచనములు
## అంశము : విశ్వాసులు శరీర అవయవములుగా ఐక్యతను కలిగి ఒకరితో ఒకరు నడుచుకోనాలి

**పిలువబడిన పిలుపునకు తగినట్లు ఐక్యతను కాపాడుకొనుచు నడుచుకొనుట (1-6వ.)**: (శరీరమొక్కటే 4వ.) 1-3వ. పిలువబడిన పిలుపుకు తగినట్లు అనగా ఐక్యత కలిగి నడుచుకొనవలెను. సమాధానమను బంధమును కలిగియుండాలి. ఐక్యతను కాపాడు కొనుట యందు శ్రద్ధ కలిగియుండాలి. దీర్ఘశాంతముతో కూడిన సంపూర్ణ వినయము, సాత్వికమును కలిగి నడుచుకోవాలి. 4-6వ. ఐక్యతను కలిగి యుండుటకు ఏడు కారణములను తెలుపుచున్నాడు. 1) శరీరము (సంఘము) ఒక్కటే, 2)మనలను నడిపించు ఆత్మ ఒక్కడే, 3) పిలుపు యొక్క నిరీక్షణ ఒక్కటే, 4) మనలను పిలిచిన ప్రభువు ఒక్కడే, 5) మన విశ్వాసమొక్కటే, 6) మనము పొందిన బాప్తిస్మ మొక్కటే, 7) తండ్రియైన దేవుడొక్కడే.

**సంఘ అభివృద్ధి కొరకు ప్రతి విశ్వాసికి ఇవ్వబడిన వరముల వివరము (7-10వ.)** : 7-8వ. ప్రతి విశ్వాసికి సంఘక్షేమాభివృద్ధి కొరకు వరములు అనుగ్రహించబడియున్నవి.

వరము యొక్క పరిమాణము ఒక్కొక్కరికి వేరువేరుగానుండును. కీర్త. 16:10లోను, 68:18లోను ప్రభువైన యేసు ఆరోహణమైనపుడు పరదైసులో చెరలోనున్న పాత నిబంధన భక్తులను సాతాను చెరనుండి విడిపించి తనతో పాటే చెరగొని పరలోకమునకు తీసుకొని పోయెను. సంఘ అభివృద్ధి నిమిత్తము భూమిపైనున్న మనుష్యులకు ఈవులను లేదా వరములు కలిగిన వ్యక్తులను అనుగ్రహించాడు. క్రీస్తు మరణించి భూమి యొక్క క్రింది భాగములకు దిగి శత్రువులను అనగా సాతానును అతని పరివారమును జయించి ఆరోహణమగుట ద్వారా వరములను (ఈవులను ఇవ్వశక్తిగల వాడైయ్యాడు. మన కొరకు చనిపోవుట ద్వారా లేని కృపను కుమ్మరించి రక్షించుటకు, తన వరములను కుమ్మరించి అభివృద్ధిని ఇచ్చుటకు శక్తిగల వాడైయ్యాడు.

**పరిచర్య జరిగించుచూ, శరీర అవయవములవలె పరిమాణము చొప్పున పనిచేయుచు క్షేమాభివృద్ధిని కలిగించుట (11-16వ.)** : 11-12వ. విశ్వాసులందరు ఏకత్వము కలిగి దేవుని కుమారుని గూర్చిన జ్ఞానములో ఎదిగి సంపూర్ణులమై క్రీస్తుకు గల సంపూర్ణత కలవారమగుటకు పై వచనములలో చెప్పబడిన వరములు అనుగ్రహించబడినవి.

13-14వ. విశ్వాసులు సంపూర్ణులు కావాలని క్రీస్తు శరీరమైన సంఘము క్షేమాభివృద్ధి చెందుటయే దేవుని ఉద్దేశ్యము. సంఘ క్షేమాభివృద్ధికై పరిచర్య జరుగు నిమిత్తము ముందుగా కొందరిని, అపొస్తలులుగాను, కొందరిని ప్రవక్తలుగాను, తదుపరి కొందరిని సువార్తికులుగాను, కొందరిని కాపరులు (పెద్దలు)గాను ఉపదేశకులుగాను నియమించాడు. కనుక విశ్వాసులు సంపూర్ణులుగా ఎదగవలెను కాని పసిపిల్లలుగాను, గాలికి కొట్టుకొనిపోవు వారుగాను, అలలచేత ఎగురగొట్టబడు వారముగాను ఉండరాదు.

**15-16వ వచనము** : 1) ప్రేమ కలిగిన వారుగానుండాలి, 2) సత్యము చెప్పువారుగా నుండాలి, 3) క్రీస్తువలెనుండాలి. ఇదియే నిజమైన ఎదుగుదల. సంఘము శరీరమై యుండగా క్రీస్తు శిరస్సయి ఉన్నాడు. ఆయన నుండి శరీర అవయవములైన విశ్వాసు లందరు చక్కగా అమర్చబడియుండాలి. శరీరములోని ప్రతి అవయవము తన తన పరిమాణము చొప్పున పని చేయుగా ప్రతి కీలు వలన కలుగు బలము చేత అతుకబడి శరీరమునకు వృద్ధి కలుగుచున్నది. ఈ పోలికవలెనే సంఘము అను శరీరమునకు అవయవములైన విశ్వాసులు ప్రతి ఒక్కరు ప్రేమచేత ఒకరితో ఒకరు అతుకబడి తమకు ఇవ్వబడిన వరము (7వ.) యొక్క పరిమాణము చొప్పున పని చేయుచుండగా సంఘమునకు క్షేమాభివృద్ధి కలుగచేయాలి.

**20-24వ వచనము** : నూతన స్వభావమును ధరించుకొనుటను గూర్చిన వివరములు. 1) యేసును గూర్చి విని ఆయన సత్యము ఉన్నది ఉన్నట్లు ఉపదేశించ బడినవారు, 2) ప్రాచీన స్వభావమును అనగా మోసకరమైన దురాశలను విడిచినవారు, 3) మనసులో నూతనత్వము పొందినవారు, 4) నీతి యథార్థమైన భక్తిగల వారు, 5) దేవుని పోలికగా సృష్టింపబడినవారు. 22వ వచనములో వదలుట 24లో ధరించుకొనుట అని వ్రాయబడినది. కొలొస్సయి 3:8-10వ వచనములలో వదలుట అనగా విసర్జించ వలసినవి ధరించుకొనవలసినవి వివరించబడినవి.

**పొరుగు వానితో నడుచుకొను విధము (25-32వ.) :**

**25వ వచనము** : అబద్ధమాడుట మానాలి - సత్యమే చెప్పాలి.

**26వ వచనము** : సూర్యుడస్తమించు వరకు కోపము నిలిచియుండకూడదు.

**27వ వచనము** : అపవాదికి చోటివ్వకూడదు.

**28వ వచనము** : దొంగిలు వాడిక మీదట దొంగిలకూడదు. కష్టించి పనిచేసి అక్కరగల వారికి పంచిపెట్టాలి.

**29వ వచనము** : దుర్భాష నోటికి రానివ్వకూడదు - క్షేమాభివృద్ధికరమైన అనుకూల వచనమే పలుకవలెను.

**30వ వచనము** : దేవుని పరిశుద్ధాత్మను దుఃఖపరచకూడదు - విమోచన దినము వరకు ముద్రించబడియున్నారు.

**31వ వచనము** : ద్వేషము, కోపము, క్రోధము, అల్లరి, దూషణ సకలమైన దుష్టత్వమును విసర్జించాలి.

## 5వ అధ్యాయము 7+7+7+6+6=33 వచనములు

## అంశము : విశ్వాసులు దేవుని పోలి నడుచుకొనుట - పెండ్లి కుమార్తెవలె భర్తయైన క్రీస్తుకు లోబడి నడుచుకొనుట

**ప్రేమ పవిత్రత కలిగి ప్రియులైన పిల్లలవలె నడుచుకొనుట (1-7వ.) :**

**1-2వ వచనము** : ప్రేమ కలిగియుండుట. క్రీస్తు మనలను ప్రేమించిన రీతిగా ఒకరినొకరు ప్రేమించుకొనుచునుండాలి. క్రీస్తు ప్రేమకు గురుతుగా తన్ను తాను దేవునికి బలిగాను అర్పణగాను అప్పగించుకొనగా ఆ బలి దేవునికి పరిమళ వాసన నిచ్చినది. అటువంటి ప్రేమనే ఒకరిపట్ల నొకరు కలిగి దేవుని పోలి నడుచుకొనాలి.

**3-4వ వచనము** : పవిత్రత కలిగియుండుట. పరిశుద్ధులైన వారికి తగినట్టు లోభత్వము కాని, జారత్వము కాని మరియే విధమైన అపవిత్రత లేకుండ ఉండాలి. బూతులు, సరసోక్తులు పోకిరి మాటలు పరిశుద్ధులకు తగవు. దేహశుద్ధి (3వ) నోటిశుద్ధి (4వ.) పరిశుద్ధుల కవసరము.

**5-7వ వచనము** : వ్యభిచారము, అపవిత్రత, విగ్రహారాధన, ధనాపేక్ష కలవారు దేవుని రాజ్యమునకు వారసులు కానేరరు. వ్యర్థమైన మాటలాడువారి మీదికి దేవుని ఉగ్రత వచ్చును. పరిశుద్ధులు అట్టి వాటికి విముఖులుగానుండాలి.

**వెలుగు సంబంధులవలె నడుచుకొనుట (8-14వ.) :**

**8-10వ వచనము** : విశ్వాసముంచక మునుపు చీకటియైన వాడు (పాపములోనున్న వాడు) విశ్వసించిన తరుపరి ప్రభువునందు వెలుగు (పరిశుద్ధత)లో నడుచు వాడుగా నుండాలి. వెలుగు ఫలములైన మంచితనము, నీతి, సత్యమును కలిగి నడుచుకొనాలి. వెలుగు సంబంధులు ప్రభువుకు ప్రీతికరమైన దానిని కలిగి నడుచుకొనాలి.

**11-14వ వచనము** : అంధకార క్రియలు నిష్ఫలమైనవి వాటిని ఖండించాలి. వాటిలో నడువకూడదు. రహస్యమందు జరుగునట్టి క్రియలను గూర్చి మాటలాడరాదు. వెలుగు సమస్తమును కనుపరచును. కావున, పరిశుద్ధులు నిద్రించిన వారివలెకాక మేల్కొనిన వారివలెనుండాలి. క్రీస్తు మన మీద ప్రకాశించుచున్నందున ఆయన వెలుగులో నడుచు కొనాలి.

**ఆత్మపూర్ణులై జ్ఞానులవలె నడుచుకొనుట (15-21వ.) :**

**15-16వ వచనము** : 1) చెడ్డ దినములలో మనమున్నాము. అజ్ఞానులవలె కాక జ్ఞానులవలె సమయమును పోనియ్యక, సద్వినియోగము చేసుకొనాలి.

**17-18వ వచనము** : ప్రభువు చిత్తమెరిగి నడుచుకొనాలి. మద్యముతో మత్తులుగా నుండకూడదు. ఆత్మపూర్ణత కలిగియుండాలి.

**19-21వ వచనము** : ఒకనినొకడు హెచ్చరించుకొనాలి. హృదయములో పాటలు, కీర్తనలు, సంగీతములతో ప్రభువును స్తుతించాలి. క్రీస్తునందలి భయముతో ఒకరికొకరు లోబడియుండాలి.

పైనున్న 1-7వ. ప్రేమ కలిగి నడుచుకొనుట 1 యోహాను 4:8లోనున్నట్లు దేవుడు ప్రేమయైయున్న సంగతిని జ్ఞాపకము చేయును. రెండవభాగము 8-14వ. వెలుగులో నడుచుకొనుట 1 యోహాను 1:5లోనున్నట్లు దేవుడు వెలుగైయున్న సంగతిని జ్ఞాపకము చేయును. మూడవభాగము 15-21వ. ఆత్మపూర్ణులైయుండుడి. యోహాను 4:24లో దేవుడు ఆత్మయైయున్నాడు అను సంగతిని జ్ఞాపకము చేయును.

**దేవుడైన క్రీస్తు సంఘమును ప్రేమించి ప్రాణమిచ్చాడు (22-27వ.) :**

| భార్య - సంఘము (భార్యా - భర్తలు) | పురుషుడు - క్రీస్తు (సంఘము - క్రీస్తు) |
|---|---|
| 1. స్త్రీలు స్వపురుషులకు ప్రతి విషయము లోను లోబడియుండాలి. పురుషుడు భార్యకు శిరస్సు. (22వ., 24వ., 23వ.) | 1. సంఘము క్రీస్తుకు లోబడి ఉండాలి. క్రీస్తు సంఘమునకు శిరస్సు. క్రీస్తు సంఘమునకు రక్షకుడు. |
| 2. పురుషులు భార్యలను ప్రేమించాలి. పురుషుడు స్వంత శరీరమువలె తన భార్యను ప్రేమించాలి. భార్యను ప్రేమించువాడు తనను ప్రేమించు కొనును. (25వ., 28వ., 26-27వ.) | 2. క్రీస్తు సంఘమును ప్రేమించాడు. సంఘము పవిత్రముగానుండుటకై క్రీస్తు తన్నుతాను అప్పగించుకొనెను. |
| 3. పురుషుడు శరీరమును ద్వేషించక ప్రేమించినట్లు తన భార్యను ద్వేషించక ప్రేమించాలి, పోషించాలి, సంరక్షించాలి. (29-30వ.) | 3. క్రీస్తు కూడా సంఘమును ద్వేషించక ప్రేమించి పోషించి సంరక్షించు చున్నాడు. |
| 4. పురుషుడు తల్లిని, తండ్రిని విడిచి భార్యను హత్తుకొనును - వారిద్దరు ఏక శరీరమగుదురు. (31వ., 32వ.) | 4. సంఘము క్రీస్తునందు ఏకమై ఉండాలి. |
| 5. ప్రతి పురుషుడు తననువలె తన భార్యను ప్రేమించాలి. భార్య తన భర్త యందు భయము కలిగియుండునట్లు చూచుకొనవలెను. (33వ.) | |

## 6వ అధ్యాయము 4+5+8+3+4=24 వచనములు
## అంశము : విశ్వాసులు కుటుంబములోను, ఉద్యోగములోను, అపవాదితో పోరాటములో రాణువవానివలెను నడుచుకొనుట

**పిల్లలు, తండ్రులు కుటుంబముగా ఒకరితో ఒకరు నడుచుకొనుట (1-4వ.)** : పై భాగములో భార్య, భర్తల విషయమై మాటలాడిన పిదప వీరికి పుట్టిన పిల్లలు తండ్రి తల్లితో వ్యవహరించవలసిన విధమును తెలుపుచున్నాడు.

**1వ వచనము** : పిల్లలు ప్రభువునందు అన్ని విషయములలో (కొలొస్స. 3:20). తమ తల్లిదండ్రులకు విధేయులై ఉండాలి.

**2-3వ వచనము** : మేలు కలుగునట్లు తల్లిని, తండ్రిని సన్మానించాలి. అట్టివారు దీర్ఘాయుష్మంతులగుదురని దేవుని ఆజ్ఞ.

**4వ వచనము** : 1) పిల్లలకు కోపము రేపకూడదు, 2) ప్రభువు యొక్క శిక్షలో అనగా క్రమములో పెంచాలి, 3) ప్రభువు యొక్క బోధలో వారిని పెంచాలి.

**ఉద్యోగములో యజమానులు, పనివారలు ఒకరితో ఒకరు నడుచుకొనుట (5-9వ.)** : ఉద్యోగములో పనివారు శరీర విషయములో యజమానులకు క్రీస్తుకువలె విధేయులై, యథార్థమైన హృదయము కలిగి భయముతోను, వణుకుతోను నడుచుకొనాలి. క్రీస్తు దాసులమని యెరిగి, ప్రభువుకు చేసినట్లే, ఇష్ట పూర్వకముగా దేవుని చిత్తమును మనః పూర్వకముగాను జరిగించాలి. చేయబడిన ప్రతి సత్కార్యమునకు ప్రతి ఫలము ప్రభువు వలన పొందుదురు. 9వ. యజమానులైనవారు పరలోకపు యజమానిని గుర్తించుకొనుచు పనివారిని 1) బెదిరింపక, 2) పక్షపాతము చూపక నడుచుకొనాలి.

**విశ్వాసి రాణువవానివలె అపవాదితోను, అంధకార శక్తులతోను పోరాడుచు నడుచుకొనుట (10-17వ.)** :

**10-11వ వచనములు** : రాణువవానిగా విశ్వాసి కివ్వబడిన ఆజ్ఞ - సైనికునివలె విశ్వాసి తన కవసరమైన శక్తిని ప్రభువు యొద్ద నుండి పొంది బలవంతుడుగా నుండాలి. ప్రభువు శక్తి నుండి అపవాదిని ఎదిరించుట కవసరమైన శక్తిమంతులముగా నుండాలి. దీని కొరకు దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించాలి.

**12-13వ వచనము** : మన పోరాటము శరీరులతో కాదు, ఎన్నడైనను శరీరులతో పోరాడరాదు. ప్రధానులతోను, అధికారులతోను, అంధకారమందలి నాధులతోను, ఆకాశ మండలమందున్న దురాత్మల సమూహముతోను మనకు పోరాటమున్నది. ఈ పోరాటములో అపవాదిని వాని సమూహములను ఎదిరించుటకు దుష్టుని అగ్ని బాణములను ఆర్పుటకు దేవుడిచ్చు సర్వాంగ కవచములను ధరించుకొని శక్తి మంతులము కావాలి.

**14-17వ వచనములు** :

| క్ర.సం | అవయవములు | కవచములు |
|---|---|---|
| 1. | శిరస్సుకు | రక్షణయను శిరస్త్రాణము |
| 2. | చేతిలో | విశ్వాసమనుడాలు ద్వారాదుష్టుని అగ్ని బాణములు ఆర్పుట. |
| 3. | మరొక చేతిలో | ఆత్మ ఖడ్గముయగు దేవుని వాక్యము. |
| 4. | నడుమునకు | సత్యము |
| 5. | శరీరమునకు | నీతియను మైమరపు. |
| 6. | పాదములకు | సమాధాన సువార్తవలనైన సిద్ధ మనసు అను జోడు. |
| 7. | ఆత్మ | ప్రతి సమయమందు ప్రతి విధమైన ప్రార్థన విజ్ఞాపన. |

**18-20వ వచనము** : సమస్త పరిశుద్ధుల కొరకు ప్రార్థించాలి. సువార్త ప్రకటించు పౌలువంటి భక్తుల కొరకును పూర్ణమైన పట్టుదలతో విజ్ఞాపన చేయాలి.

**ముగింపు - ఆశీర్వాదము (21-24వ.)** : 21-22వ. ఎఫెసీయుల యొద్దకు పంపబడిన తుకికు ప్రియమైన సహోదరుడు, ప్రభువునందు నమ్మకమైన పరిచారకుడు. హృదయము లను ఓదార్చువాడు. పౌలు సంగతులు ఎఫెసీయులకు తెలుపువాడు. ఎఫెసీయుల సమాచారమును పౌలుకు తెలుపువాడు.

**23-24వ వచనములు** : ఎఫెసీయులకు దేవుని నుండి సమాధానము, విశ్వాసము, ప్రేమ, కృప కలుగునుగాకని ఆశీర్వదించి పత్రిక ముగించాడు.

# ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక

గ్రంథకర్త : పౌలు . కాలము : క్రీ.శ. 62 (2:24) స్థలము : రోములోని మొదటి చెర (1:12), కొనిపోబడినవారు: ఎపఫ్రొదితు (2:28-30), (4:18).

**ముఖ్య ఉద్దేశ్యము** : క్రీస్తే గురి.

**ఫిలిప్పీ పట్టణ చరిత్ర** : ఈ పట్టణపు మొదటి పేరు చిన్న ఊటలు అను అర్థము గల క్రినైడిస్. సమీపమందున్న పంగియన్ కొండలో బంగారు వెండి గనులు కలవని చెప్పబడినందున ప్రపంచ చక్రవర్తి అలెగ్జాండర్ గారి తండ్రి, గ్రీకురాజగు ఫిలిఫ్ క్రీ.పూ. 358లో ఈ పట్టణము పట్టుకొని తన రాజ్యములో కలుపుకొని దానికి తన పేరును బట్టి ఫిలిప్పీ అను పేరు పెట్టెను. క్రీ.పూ. 168లో రోమీయులు దాని పట్టుకొని తమ రాజ్యములో కలుపుకొనిరి. క్రీ.పూ. 42లో "బాటిల్ ఆఫ్ ఫిలిప్పీ" యుద్ధమందు రోమీయులు మరల జయము పొంది తమ సైన్యమును కూడ అక్కడనుంచిరి. తూర్పు నుండి పడమటి దేశములకు వెళ్ళు వ్యాపారస్తులు ఈ ఓడరేవు నందు విశ్రాంతి తీసికొందురు. కనుక ఇది ఒక ముఖ్య పట్టణముగా నుండెను. తదుపరి మాసిదోనియా దేశము నాలుగు భాగములుగా నుండగా ఒక భాగమునకు ఫిలిప్పీ ముఖ్య పట్టణము, మరొక భాగమునకు థెస్సలోనీక ముఖ్య పట్టణముగా నుండెను. ఫిలిప్పీని "ఎసిటీ ఆఫ్ గోల్డ్‌మైన్స్" అనిరి. అక్కడ ఉన్న బంగారు గనుల కంటే, బంగారము వంటి సంఘమున్నదని గమనించగలము.

**సంఘస్థాపన** : అ.కా. 16:9లో మాసిదోనియా దేశస్థుని ఆహ్వానము మేరకు పౌలు సహచరులతో కలసి రెండవ యాత్రలో మొదటిదిగా ఐరోపా ఖండములో ప్రవేశించి ఫిలిప్పీలో సువార్త ప్రకటింపగా లూదియా, ఆమె ఇంటివారు, పుతోను అను దయ్యము పట్టిన బాలిక, చెరసాలలోని వారు రక్షింపబడిరి. అ.కా. 16:11-35. పౌలు ముందుకు సాగివెళ్ళగా లూకా అక్కడనే ఏడేండ్లుండి వారిని బలపరచెను. (అ.కా. 20:1-2). సంఘ మందు ఎక్కువగా అన్యులుండిరి. స్త్రీలు ఆసక్తిగా నుండి సేవలో ముందుకు సాగిరి కాని వారిలో ఏకత్వము లేకుండెను (4:2).

సంఘస్థాపన వివరములు అ.కా. 16వ అధ్యాయము కలవు. ఈ పత్రికలో సంతోషము అను పదము 8 పర్యాయములు, ఆనందము అను పదము 8 పర్యాయములు, దానికి సంబంధించిన అతిశయమను పదము 4 పర్యాయములు, మొత్తము 20 పర్యాయములు కలవు. అందువలన దీనిని ఆనంద పత్రిక అనిరి.

## అధ్యాయాల విభజన 1+1+1+1= 4 అధ్యా.

**1వ అధ్యాయము** : క్రీస్తు కొరకే బ్రతుకుట (1:21).

**2వ అధ్యాయము** : క్రీస్తు మనసును కలిగియుండుట (2:5).

**3వ అధ్యాయము** : క్రీస్తును గురిగా కలిగి మాదిరిగా యుండుట (3:14).

**4వ అధ్యాయము** : క్రీస్తును బట్టియే సమాధానము సమస్తము చేయగలుగుట (4:13).

## 1వ అధ్యాయము 11+4+11+4=30 వచనములు
## అంశము : క్రీస్తుకొరకే బ్రతుకుట (21వ.)

**పౌలు ప్రార్థించుట (1-11వ.), శుభములు (1-2వ.)** : ఫిలిప్పీ సంఘమందు 1) పరిశుద్ధులు, 2) పెద్దలు (కాపరులు లేదా అధ్యక్షులు), 3) పరిచారకులు కలరు. పౌలు తిమోతిలు తమ్మును క్రీస్తు దాసులుగా పరిచయము చేసికొన్నారు. అందరు క్రీస్తుకు బానిసలమని పౌలు వారికి జ్ఞాపకము చేయుచున్నాడు. ఇది ఒక మాదిరియైన సంఘ క్రమము.

**స్తుతి - ప్రార్థన (3-5వ.)** : క్రీ.శ. 50లో పౌలు తన రెండవ సేవాయాత్రలో ఫిలిప్పీకి వెళ్ళాడు. క్రీ.శ. 62లో ఈ పత్రిక వ్రాయుచున్నాడు. మొదటి దినము నుండి ఇది వరకు సువార్తలో ఫిలిప్పీయులు పాలివారు. అనగా 12 లేక 13 సంవత్సరములు ఫిలిప్పీయులు సువార్త ప్రకటనలో పాలివారుగానున్నారు. గతకాలములో ప్రకటించారు. ఇప్పుడును ప్రకటించుచున్నారు. సువార్త ప్రకటన ఒక మంచి క్రియ. ఈ మంచి క్రియ క్రీస్తు దినము వరకు కొనసాగునని పౌలు చెప్పుచున్నాడు. ఈ విషయము సంతోషముతో పౌలు ప్రార్థించుచూ స్తుతించుచున్నాడు. ఈ గ్రంథము చదువు నీవు సువార్త పని చేయు చున్నావా? ఎంతకాలము నుండి చేయుచున్నావు? గతకాలములో, ప్రస్తుత కాలములో, రాబోవు కాలము క్రీస్తు దినము వరకు ప్రకటింపగలవా?

**అపేక్ష (6-8వ.)** : సువార్త ప్రకటనలో మాత్రమేకాక, సువార్త పక్షమున వాదించుట యందు, దానిని స్థిరపరచుట యందు ఫిలిప్పీయులు పాలివారు. ఇటువంటి ఆత్మీయు లైన ఫిలిప్పీయుల పట్ల పౌలు ఎంతో అపేక్ష కలిగియున్నానని చెప్పుచున్నాడు.

**పౌలు ప్రార్థన (9-11వ.)** : ఫిలిప్పీయుల కొరకు పౌలు చేయు ప్రార్థనలోని ఆరు ముఖ్య అంశములు.

1) పరిశుద్ధులు శ్రేష్ఠమైన కార్యముల విషయమై వివేచించగలవారు కావాలి.

2) పరిశుద్ధులు ప్రేమ గలవారుగానుండాలి, ఆ ప్రేమ తెలివితోను సకల విధములైన అనుభవ జ్ఞానముతో కూడినదిగానుండాలి.

3) వారిని బట్టి దేవునికి స్తోత్రము, మహిమ కలగాలి.

4) పరిశుద్ధులు క్రీస్తు దినము వరకు నిష్కపటులైయుండాలి. 1 కొరింథీ. 5:8.

5) పరిశుద్ధులు క్రీస్తు దినము వరకు నీతిమంతులుగా ఉండాలి. యాకోబు 1:27.

6) పరిశుద్ధులు నీతిఫలములతో నిండుకొనినవారై యుండాలి.

**ప్రభలమైన ప్రకటన (గత కాలము) (12-15వ.)** : పౌలు ఈ పత్రిక వ్రాయునపుడు రోములోని మొదటి చెరలోనున్నాడు. క్రీ.శ. 61-62సం॥ 2:24వ.లో నేనును త్వరగా మీ యొద్దకు వత్తును అన్నందున చెరకాలము చివరలో క్రీ.శ. 62 చివర ఈ పత్రిక వ్రాసాడు. కైసరయలోని కావలిలో అ.కా. 24 అధ్యా. రెండేండ్లు (క్రీ.శ. 58-59), ఖైదీగా రోముకు ప్రయాణము క్రి.శ. 60లోను, రోములోను మొదటి చెరలో రెండేండ్లు (క్రీ.శ. 61-62) ఇప్పటికి మొత్తము ఐదు సంవత్సరములు ఖైదీగా బంధకములలోనున్నాడు. పై కాల మంతటిలో సువార్త ఎక్కువగా ప్రభలమైనదని మనకు చెప్పుట ఎంత ఆశ్చర్యముగా నున్నది. అన్ని పరిస్థితులలో సువార్త ప్రభలింప చేసిన పౌలు మనకెంతో మాదిరి.

రోమా చెరసాల రోముచక్రవర్తి గారి ప్రాంగణములోనున్నది. ఆ ప్రాంగణమును భద్రపరచు 16,000 మంది రాణువవారు ప్రేతోర్యమను సేన అని పిలువబడిరి. వారే చక్రవర్తి గారి ప్రాంగణములోనున్న చెరసాల ఖైదీలను కాయువారు. ఈ చెరసాలలో రెండు సంవత్సరములు అ.కా. 28:28 ప్రకారము పౌలు ఉండెను. (క్రీ.శ. 61-62) అనగా షుమారు 700 దినములు. క్రీస్తు నిమిత్తము పౌలు బంధకములలో నున్నాడని ప్రేతోర్యమను సేనలోని 16,000 మందికి స్పష్టమగుట ఎంత ఆశ్చర్యము. పౌలును కాయుటకు దినమునకు 12 మంది వచ్చినను మొత్తము 700 దినములలో 8,400 మంది మాత్రమే పౌలును కలిసియుందురు. కాని 1:13వ. ప్రకారము 16,000 మంది క్రీస్తు నిమిత్తము పౌలు చెరయని గుర్తించుట ఆశ్చర్యము. రెండు సంవత్సరములు బంధకములలో నుండి 16,000 మంది రాణువ వారికి క్రీస్తును పరిచయము చేయుట మనకు సవాలుగానున్నది. ఆ దినములలో 4:22వ. ప్రకారము కైసరు ఇంటిలో

పరిశుద్ధులు ఏర్పడుట ఆశ్చర్యము. (ప్రస్తుతము) ప్రకటన విధములు (15-17వ.) : ప్రకటించువారిలో 1) కొందరు అసూయతో ప్రకటించువారు కలరు.

2) కొందరు కలహబుద్ధితో ప్రకటించువారు కలరు.

3) కొందరు మంచి బుద్ధితో ప్రకటించువారు కలరు.

4) కొందరు పౌలుకు బంధకములతో కూడా శ్రమతోడు చేయవలెనని తలంచు చున్నారు.

5) కొందరు కక్షతో ప్రకటించుచున్నారు.

6) ప్రేమతో ప్రకటించు వారును కలరు.

**ప్రకటన పనివాడు అంగీకరించ వలసిన విధము (18-20వ.)** : ఏ విధముచేత ప్రకటింపబడినను క్రీస్తు ప్రకటింప బడుచున్నందున పౌలు సంతోషించుట గమనించదగిన విషయము. పౌలు తన బ్రతుకు మూలముగాను చావు మూలముగాను తన శరీరమందు క్రీస్తునే ఘనపరచవలెనన్న ఆశ కలవాడుగానున్నాడు.

**క్రీస్తు కొరకే బ్రతుకుట (21-26వ.)** : క్రీస్తును విశ్వసించిన వారు చనిపోయినపుడు ప్రభువు యొద్దకు వెళ్ళుదురు. అందువలన బ్రతుకు కాలమంత క్రీస్తు కొరకే బ్రతుకుదునని చెప్పుచున్నాడు. మరి ముఖ్యముగా ఫిలిప్పీయుల క్షేమము కొరకే అనగా క్రీస్తు కార్యముల కొరకే బ్రతుకుదునని చెప్పుచున్నాడు.

**పౌలు పోరాటము (27-30వ.)** : క్రీస్తు కొరకు ఆయన సువార్త వ్యాప్తికి పౌలు పోరాడుచున్నాడు. క్రీస్తునందు విశ్వాసముంచిన ఫిలిప్పీయులు కూడా ఆలాగే సువార్త వ్యాప్తి కొరకు పోరాడవలెనని హెచ్చరించుచున్నాడు. ప్రభువు పని జరుపుటను అపవాది ఆటంక పరచును. అపవాది మనలను శ్రమలపాలు చేయును. కనుక ప్రభువు సువార్త ప్రకటన శ్రమలు గల పోరాటముతో కూడినదైయుండును.

## 2వ అధ్యాయము 4+7+7+6+6=30 వచనములు
## అంశము : క్రీస్తు మనస్సును కలిగియుండుట

**వినయమైన మనస్సు ఏకమనసు కలిగియుండుట (1-4వ.)** : ఏకమనస్సు, ఏక ప్రేమ, ఏకభావము అను మాటలు పౌలు ప్రస్తావించుట వలన పరిశుద్ధులలో ఏకత్వము

తరచుగా లోపించగలదు. మొదటి అధ్యాయములో సువార్త ప్రకటనలో శ్రమలుండును అని 1:27-30వ. చూచితిమి. అవి సంఘమునకు వెలుపటి వారి ద్వారా కలుగునవి. ఇప్పుడు ఏకత్వము లేకపోవుట వలన సంఘము లోపలి వారి ద్వారా ఆటంకములు కలుగునని చెప్పుచున్నాడు. సువార్త ప్రకటనకు వెళ్ళవలెనని ఒకరు తలంచగా ఏకమనసు లేని ఇతరుల ద్వారా వద్దని, ఇప్పుడు అక్కరలేదని అపవాది చెప్పించగలడు. కాని సహోదరుల మధ్య వినయమైన మనసు విధేయత కలిగియుండుట ద్వారా అపవాది కలిగించు ఈ ఆటంకమును మనము జయించగలము. ఏకమనసును కలిగి ప్రభువు కార్యములలో ఏకీభవించగలము. ఏక మనసు వినయమైన మనసు (తగ్గింపు) విధేయత ఒకదానితో ఒకటి కలసి యుండును. వినయమైన మనసులో విధేయత, ఏకత్వముండును.

**క్రీస్తు యేసు యొక్క విధేయత, తగ్గింపు (5-11వ.)** : మనము విధేయతను, తగ్గింపును కలిగియుండుటకు క్రీస్తును మాదిరిగా నుంచుచున్నాడు. క్రీస్తు ఏడుమెట్లు తగ్గించు కొన్నట్లు గమనించగలము. ఏడు సంపూర్ణ సంఖ్య. క్రీస్తు సంపూర్తిగా తన్నుతాను తగ్గించు కొన్నాడు.

**ఏడు మెట్లు తగ్గించుకొనిన క్రీస్తు** :

1) దేవుని స్వరూపము కలవాడు కాని యెషయా 52:14వ. ప్రకారము నరరూపము కంటె వికార రూపము కలవాడైనాడు.

2) దేవునితో సమానముగానుండు భాగ్యమును విడిచిపెట్టెను.

3) మనుష్యుల పోలికగా పుట్టాడు. దేవుని సృష్టియైన దూతలకంటే తక్కువవాడుగా చేయబడెను. (హెబ్రీ. 2:9వ.)

4) దాసుని స్వరూపము ధరించుకొన్నాడు. ఏమి లేని నిరుపేదయైన మరియమ్మ కుటుంబములో జన్మించాడు. బానిసలాగా జీవించాడు.

5) రిక్తుడైనాడు. ఇశ్రాయేలీయుడైన బానిస జూబిలీ సంవత్సరమందు విడుదల నొందును. లేవీ. 25:41వ. కొన్ని విషయములలో బానిస స్వతంత్రత కలవాడు. కాని క్రీస్తు రిక్తుడు ఏమి లేనివాడైనాడు.

6) మరణము పొందునంతగా తగ్గించుకొన్నాడు. ఈ లోకములో అందరు బ్రతక వలెనని తలంచుదురు. ఎవరు మరణించుట కిష్టపడరు. యోహాను 10:17-18వ ప్రకారము ఈయన తనంతట తానే తన ప్రాణము పెట్టెను.

7) సిలువ మరణము పొందాడు. మరణములో సామాన్యమైన మరణము కాక మ్రాను మీద వ్రేలాడదీయ బడినవాడు శాపగ్రస్తుడు (గలతీ. 3:13వ.) కనుక సామాన్యమైన మరణము కాక సిలువ మరణము, శాపగ్రస్తమైన మరణము పొందుట ద్వారా ఏడుమెట్లు తన్నుతాను తగ్గించుకొన్నాడు.

**ఏడు మెట్లు హెచ్చించబడిన క్రీస్తు :**

1) భూమి క్రింద ఉన్న వారికంటే హెచ్చింపు.

2) భూమి పైనున్న వారి కంటె హెచ్చింపు.

3) పరలోకమందున్న వారికంటె హెచ్చింపు.

4) ప్రతివాని మోకాలు యేసు నామమున వంగాలి.

5) ప్రతివాని నాలుక యేసును ప్రభువని ఒప్పుకొనాలి.

6) అత్యున్నత సింహాసనము పై కూర్చుండ బెట్టబడెను. (యెషయా 6:1వ.)

7) ప్రతి నామమునకు పై నామము అనుగ్రహించబడెను.

**ఫిలిప్పీయుల విధేయత - పౌలు విధేయత (12-18వ)** : 12-16వ.లో ఫిలిప్పీయులు ఎల్లప్పుడు విధేయులని మెచ్చుకొనుచు 1) భయముతో, 2) వణుకుతోను, 3) సొంత రక్షణ కొనసాగించవలెనని, మూర్ఖులగు వక్రజనము మధ్య, 4) నిరపరాధులు, 5) నిష్కళంకులు, 6) అనింద్యులుగా నుండవలెనని, 7) సణుగులు, సంశయములు మాని ప్రభువు కార్యములు చేయుమని హెచ్చరించుచున్నాడు. ఫిలిప్పీయులలోని విశ్వాసులు జీవవాక్యమును చేత పట్టుకొని చీకటితో నిండిన లోకమునకు జ్యోతులుగా ఉన్నారని తన పనికి క్రీస్తు తీర్పు తీర్పు దినమందు ఫలము దొరుకుట ద్వారా ఆనందము కలుగునని చెప్పుచున్నాడు. ఫిలిప్పీలో ముందుగా క్రీస్తును నమ్మిన లూదియా పేరుకు దివిటీ అని అర్థము. లేడు పరి నమ్మినవారు దివిటీయగు దేవుని వాక్యమును చేత పట్టుకొని లోకమునందు దివిటీలవలె కనిపించుట మనందరికి ఎంతో మాదిరి.

**17-18వ వచనము** : పౌలైతే విశ్వాసయాగము, ప్రభువు సేవలో పానార్పణముగా పోయబడునంతగా తగ్గించుకొన్నాడు. పానార్పణము అనగా నేల మీద మన్నుపై పోయబడిన నీరును మరలా మనము సమకూర్చలేము. అనగా ప్రభువు సేవలో మనకు ఏమి మిగలకుండా సంపూర్ణముగా ఆయనకై అర్పించుకొనుట. నీరు తన ఆకారమును, సమస్తమును కోల్పోయినట్లు సమస్తము కోల్పోవుట. పౌలు వలె తన్నుతాను తగ్గించు కొనుట సేవకులకు ఎంతో మాదిరి.

**జత పనివాడైన తిమోతి విధేయత (19-24వ.)** : అందరు స్వంత కార్యములు చూచు కొనుచుండగ తిమోతికి స్వంత కార్యములు ప్రాముఖ్యము కావు. (తగ్గింపు) క్రీస్తు కార్యములే ముఖ్యము. వాటి కొరకే నిజమైన చింత. నిజమైన చింతలేకపోయినను, ఉన్నట్లు నటించువారు కలరు. తిమోతి నిజమైన చింత కలవాడు. సువార్త వ్యాపకములో పౌలుకు సేవ చేయునంతటి విధేయత గలవాడు. 24వ వచనములో శీఘ్రముగా వచ్చెదనన్నందున రోములోని మొదటి చెర (క్రీ.శ. 61-62) చివరలో ఈ గ్రంథము వ్రాయబడినదని క్రీ.శ. 62సం॥లో వ్రాయబడినదని తంచగలము.

**ఎపఫ్రొదితు విధేయత (25-30వ.)** : ప్రభువు సేవకు ఎపఫ్రొదితు చూపిన విధేయత తన విషయమై వ్రాయబడిన మాటల వలన తెలియును. 1) జతపనివాడు, 2) తోటి యోధుడు, 3) మీ దూత, 4) పౌలు అవసరములు తీర్చినవాడు, 5) ప్రభువు పనిలో రోగియైనంతగా తగ్గింపు, 6) ప్రభువు పనిలో ప్రాణము లెక్కపెట్టక చావునకు సిద్ధమైనంత తగ్గింపు (2:8లో ప్రభువుకు గల తగ్గింపు), 7) అట్టి స్థితిలోను సహోదరులను చూడవలెనన్న ఆశ గలవాడు. ఇటువంటి పనివారి అవసరత ఈ దినములలో ఎంతో ఉన్నది.

## 3వ అధ్యాయము 3+3+5+5+5=21 వచనములు
## అంశము : క్రీస్తును గురిగా కలిగి మాదిరిగానుండుట

**శరీరమును అస్పదము చేసికొనకూడదు (1-3వ.)** : యూదా మత క్రైస్తవులలో కొందరు శరీరమును ఆస్పదము చేసికొని సున్నతి విషయమై అతిశయింతురు. తద్వార ఛేదనలు, విభజనలు కలుగ గలవు. అటువంటి విషయాలలో జాగ్రత్తగానుండాలి. క్రొ.ని.లో 52 జాగ్రత్త అను పదములు కలవు. ఇక్కడ మూడు జాగ్రత్తలున్నవి. సంవత్సరము లోని 52 వారములలో ఒక్కొక్క వారమునకొక జాగ్రత్త అని గమనించాలి. (వివరములు 240 పేజీలో కలవు)

**పౌలు యొక్క గతకాల గురి (యూదా మతములో మాదిరి) (4-6వ.)** : పౌలు యూదా మతములో తాను కలిగిన ఏడు శరీర సంబంధమైన ఆధిక్యతలను చెప్పుచున్నాడు. చివరిది ధర్మశాస్త్ర సంబంధమైన నీతి విషయము అనింద్యుడు అనునది ఎంతో గొప్ప అధిక్యత. కాని తాను వాటిలో దేనిని ఎంచుకొనలేదు.

**పౌలు యొక్క ప్రస్తుత కాలగురి (క్రీస్తులో మాదిరి) (7-11వ.)**: క్రీస్తును సంపాదించిన పిదప పైన చెప్పిన ధర్మశాస్త్రమువలని నీతిని అస్పదము చేసికొనలేదు. తనకు లాభకరమైన శరీర ఆస్పదములను క్రీస్తు నిమిత్తము నష్టముగా ఎంచుకొనెను. క్రీస్తు అనుగ్రహించు

నీతికలవాడుగా ఆయనలో అగుపడు నిమిత్తము సమస్తము నష్ట పరచుకొందును. అంటున్నాడు. ఏ విధముగానైనను క్రీస్తు మరణములో సమాన అనుభవము కలిగి యుండాలి. (2:5-8వ క్రీస్తు మరణము) ఎంతో కష్టము కాని ఆశించుచున్నాడు. పునరుత్థాన బలము ఎంతో గొప్పది. చనిపోయినవాడు లేచుట, ఆరోహణమగుట ఎంతో శక్తితో కూడిన పని ఆ శక్తి ఏమిటో ఎరుగుట తన ఆశ. దాని కొరకు సమస్తమును నష్టపరచు కొందును అంటున్నాడు. నష్టమే కాక పెంటగా సమానముగా ఎంచుకొనుచున్నాడు. పెంట మన కడుపులో ఏర్పడును కాని బయటకు వచ్చిన పిమ్మట ఏ మాత్రము దానిని ప్రేమించము. ఈ లోకమును లోక సంబంధమైన, సమస్తమును, శరీర సంబంధమైన సమస్తమును పెంటగా ఎంచు కొందును అంటున్నాడు.

**7వ వచనము :** క్రీస్తు నిమిత్తము నష్టముగా ఎంచుకొంటిని (Counted) - గతకాలము.

**8వ వచనము :** నష్టముగా ఎంచుకొనుచున్నాను (Count) - ప్రస్తుతకాలము.

**10-11వ వచనము :** నష్టముగా ఎంచుకొనుచున్నాను లేదా ఎంచుకొందును (Do Count) - ఇంగ్లీషులో భవిష్యత్కాలము. పౌలు గురి యంతయు క్రీస్తే.

**పౌలు భవిష్యత్తు గురి (గురియైన క్రీస్తు యొద్దకు పరుగెత్తుట) (12-16వ.) :** 1) తాను చేసిన సేవ ఎంతో ఉన్నను గెలిచితిననియైనను, సంపూర్ణ సిద్ధి పొందితిని అనియైనను తలంచుట లేదు. ఇది మనకెంతో మాదిరి, 2) దేని నిమిత్తమును క్రీస్తు యేసు చేతపట్టబడెనో తానెరుగును. మనము ఎరుగాలి, 3) వెనుక ఉన్నవాటినన్నిటిని మరచాడు. మరుపు, సేవా జీవితములో ముఖ్యమైనది. యోసేపు గతమంతటిని మరచి తన జ్యేష్ఠ కుమారునికి మనష్షే అనగా మరచుట అను పేరు పెట్టాడు. (ఆది. 41:51వ.) తాను తండ్రి ఇంటిని సమస్త బాధను, అన్నలు కలిగించిన బాధ, పోతీఫరు అతని భార్య కలిగించిన బాధ, పానదాయకుడు కలిగించిన బాధను మరచిపోయిన తరువాతనే దేవుడా యనను హెచ్చించెను. కనుక మరచిపోవుట సేవా జీవితములో ఎంతో అవసరము. ముందున్న వాటికొరకు వేగిరపడుట అవసరము. క్రీస్తు యేసునందలి ఉన్నత పిలుపునకు బహుమానము ముందున్నదని పౌలు ఎరుగును. వాటి కొరకు వేగిరపడుచు గురియైన క్రీస్తు కొరకై పరుగెత్తుచు సమస్తము నష్టముగాను, పెంటగాను ఎంచుకొన్నాడు. సంపూర్ణులు కాగోరువారు అలాగుండాలి. మరిచిపోవువాడే సంపూర్ణుడు కాగలడు.

**గురియైన క్రీస్తును పోలి నడుచుకొనుట (17-18వ.) - గురి లేనివారిని, సిలువకు శత్రువులైన వారిని కనిపెట్టుట (17-21వ.) :** క్రీస్తును గురి కలిగి పౌలు జీవించుచున్నాడు.

పౌలు ప్రభువును పోలి నడుచుకొనుచున్నాడు. (1 కొరి. 11:1వ.) అటువంటి మాదిరియైన వారిని పోలి నడుచుకొనవలెనని హెచ్చరించుచున్నాడు. క్రీస్తు సిలువకు శత్రువులు కలరు. వారికి క్రీస్తు గురికాదు. వారి కడుపే గురిగా (దేవుడు). మన పౌరస్థితి (Citizen Ship) పరలోకమందున్నందున యేసు అను రక్షకుని రాకను గురి కలిగి జీవించాలి. ఇందులో మనము బలహీనమైన దీన శరీరము కలవారమైనను క్రీస్తు తన అపరిమితమైన శక్తిని బట్టి మన దీన శరీరములను తన మహిమ గల శరీరమునకు సమరూపము గలదానిగా మార్చును.

## 4వ అధ్యాయము 3+3+3+3+3+3+2+3=23 వచనములు

## అంశము : క్రీస్తును బట్టియే సమాధానము - సమస్తము చేయగలుగుట

**ప్రభువునందు అందరితో సమాధానము (1-3వ.)** : యువొదియ, సుంటుకేను అను స్త్రీలు రక్షించబడి పౌలుతోను ఇతర సహకారులతోను సువార్త పనిలో ప్రయాసపడిరి. కాని వారిలో ఏక మనసు లేదు. సమాధానము లేదు. అందరితో సమాధాన ముండవలెనని చెప్పుచున్నాడు. సువార్త పనిలో స్త్రీల పరిచర్య 1 కొరింథీ. 14:34వ భాగములో వివరించ బడినది.

**ప్రభువునందు తనలో సమాధానము (4-6వ, 7-9వ.)** : 4-7వ. ప్రభువు రాక సమీపమున ఉన్నందున 1) సహనము కలిగి ఉండాలి, 2) ఆనందముగానుండాలి, 3) ప్రభువుకు కృతజ్ఞత చెల్లించాలి, 4) విన్నపములకై ప్రభువును ప్రార్థించాలి. అప్పుడు దేవుని సమాధానము మనలో, మన హృదయములకు, తలంపులకు కావలి యుండును.

**8-9వ వచనము** : మన ధ్యానము, అనగా మన మనసు 1) సత్యమైన వాటిపై 2) మాన్యమైన వాటిమీద, 3) న్యాయమైనవాటిపై, 4) పవిత్రమైన వాటిపై, 5) రమ్యమైన వాటి మీద, 6) ఖ్యాతిగల వాటి మీద ఉండాలి. దేవుడు సమాధానకర్త కనుక మనకు తోడైయుండి మనలో సమాధానమును నివసింపనిచ్చును.

**ప్రభువు నందు అన్ని పరిస్థితులలో సమాధానము కలిగియుండుట (10-12వ.)** : కొదువలు కొన్ని పర్యాయములు, సమృద్ధి కొన్ని పర్యాయములు మనకుండును. పౌలువలె అన్ని పరిస్థితులలో సంతృప్తి కలిగి సమాధానముగా ఉండాలి.

1) దీనస్థితి - సంపన్న స్థితి (సమాజిక అవసరములు)

2) ఆకలిగొనియుండుట - కడుపునిండియుండుట (శరీర అవసరములు)

3) లేమి - సమృద్ధి (కుటుంబ అవసరములు) శరీర, కుటుంబ, సమాజక స్థితులలో సమాధానముగా నుండాలి.

**ప్రభువునందు ఫిలిప్పీయుల ప్రీతికరమైన గతకాల యాగము (13-15వ.)** : పౌలు సువార్తను బోధించుచూ మాసిదోనియా నుండి గ్రీసు దేశమునకు కొరింధుకు వెళ్ళినపుడు ఫిలిప్పీయులు తప్ప మరెవరు పౌలు అవసరములు తీర్చలేదు. 2 కొరింథీ. 11:8వ.లో ఈ సంగతి వివరించబడినది. ఫిలిప్పీయులు, మాసిదోనియా వారు నిరుపేదలైనను దాతృత్వము బహుగ విస్తరించినదని సామర్థ్యముకంటె ఎక్కువగా ఇచ్చిరని 2 కొరింథీ. 8:1-4వ. చెప్పబడినది. (ప్రభువుకు ఇవ్వవలసిన విధము 2 కొరింథీ. 9వ అధ్యాయము చివరలో వివరించబడినది)

**ప్రభువునందు, ఫిలిప్పీయుల ప్రీతికరమైన ప్రస్తుతకాలయాగము (16-18వ.)** : ఈ పత్రిక వ్రాయునపుడు పౌలు రెండేండ్ల నుండి రోమా చెరసాలలో సంకెళ్ళలోనున్నాడు. ఫిలిప్పీయులు ఎపఫ్రొదితు వలన వస్తువులు పంపిరి. అవి ప్రభువుకు మనోహరమైన సువాసనగా, దేవునికి ప్రీతికరమైన ఇష్టమైన యాగముగానున్నవి. ఎపఫ్రొదితు పౌలు యొద్దకు వెళ్ళినందున ఈ పత్రికను ఎపఫ్రొదితు ద్వారా పౌలు ఫిలిప్పీయులకు పంపెనని తలంచగలము.

**ప్రభువునందే ప్రతి అవసరము తీర్చబడుట (19-20వ.)** : దేవుడు సకల ఐశ్వర్య మంతుడు ఐశ్వర్యమంతయు ప్రభువుదే. తన ఐశ్వర్యము చొప్పున అనగా ఎంతోయో మనము తలంచ గలము. దాని చొప్పున మన ప్రతి అవసరము తీర్చబడును.

**క్రీస్తునందు వందనములు - ఆశీర్వాదము (21-23వ.)** : పౌలు ప్రతి పరిశుద్ధునికి క్రీస్తునందు వందనములు చెప్పుచున్నాడు. ఇది మనకెంతో మాదిరి. ప్రభువు కొరకు పౌలు ప్రయాసపడుట ద్వారా ప్రేతోర్యమను సేనలోని 16,000 మంది క్రీస్తును తెలుసు కొనుటయే కాక (1:13వ) కైసరు చక్రవర్తి ఇంటిలోను పరిశుద్ధులు ఏర్పడిరి. (4:12వ.) ఆశీర్వాదముతో ముగించుచున్నాడు.

చివరిదిగా మొదటి అధ్యాయములో ఎవరికొరకు బ్రతకాలి? (1:21వ.) రెండవ అధ్యాయములో ఏ మనస్సుతో బ్రతకాలి? (2:5వ), మూడవ అధ్యాయములో ఏ గురితో బ్రతకాలి? (3:14వ), నాల్గవ అధ్యాయములో ఎవరియందు గురిని చేరాలి? (4:13వ) అని వివరించాడు అని గమనించగలము.

# కొలొస్సయులకు వ్రాసిన పత్రిక

గ్రంథకర్త : పౌలు . **కాలము** : క్రీ.శ. 61 (4:3) స్థలము : మొదటి చెర (4:2), **కొనిపోబడినవారు:** ఎపఫ్రా 1:7, తుకికు (4:7-9).

**ముఖ్య ఉద్దేశ్యము** : క్రీస్తు దైవత్వము.

కొలొస్సయి పట్టణ చరిత్ర : కొలొస్సయి పట్టణము చిన్న ఆసియా దేశములోని లికస్ లోయలోనున్న నది గట్టున కలదు. ఎఫెసు పట్టనమునకు నూరు మైళ్ళ దూరమున నున్నది. కొలొస్సయికి పడమర పదిమైళ్ళలో లవొదికయ పట్టణము. దానికి సమీపముననే హియెరపొలి (4:13) పట్టణము కలవు. హియెరపొలి నుండి వేడి నీరు ప్రవహించి కొలొస్సయిలో నున్న నీళ్ళతో కలసి లవొదికయ దగ్గర నులివెచ్చగా నుండును. అందుచే నులివెచ్చని అను అర్థము గల లవొదికయ అను పేరు పెట్టబడెను. కొలొస్సయి చిన్న గ్రామమై స్థానిక ఫ్రుగియనులు, గ్రీకులు, యూదులు నివసించిన పట్టణము. క్రీ.శ. 700 సం॥ నాశనమైనది. నేడు శిథిలములు మాత్రమేనున్నవి.

**కొలొస్సయి సంఘ స్థాపన** : పౌలుచే ఈ సంఘము స్థాపించబడలేదని 2:1 వలన తెలియుచున్నది. అ.కా. 18:23లో పౌలు ఫ్రుగియలో వాక్యము ప్రకటించగా ఎపఫ్రా నమ్మెనని తలంచగలము. ఈ ఎపఫ్రా రక్షణ వార్తను కొలొస్సయిలో ప్రకటించి వారిని ప్రభువు యొద్దకు నడిపెనని 1:7 వలన గ్రహించుచున్నాము. పౌలు ఈ పత్రిక వ్రాయు వరకు అక్కడికి వెళ్ళలేదు. (2:1) కొలొస్సయిలో ఏర్పడిన సంఘమందు అన్యులు అనేకు లుండిరి (1:21,27). ఆ సంఘములో జ్ఞాస్తికులు అను తత్వవేత్తల తప్పుడు బోధలు ప్రవేశించెను. ఈ జ్ఞాస్తికులు క్రీస్తు శరీరధారిగా రాలేదని బోధించెదరు. మానవుడైన యేసు బాప్తిస్మము పొందినపుడు క్రీస్తు అనబడు దైవత్వము యేసులో ప్రవేశించెనని, ఆయన సిలువ వేయబడక మునుపు ఆ దైవత్వము ఆయన నుండి వెళ్ళిపోయెనని బోధించెదరు. వారి బోధల సారాంశము దేవుడైన క్రీస్తు చనిపోలేదు. మానవుడైన యేసు చనిపోయెను. ఇది మొదటి తప్పుడు బోధ.

2) ఈ జ్ఞాస్తికుల శరీరము సంపూర్ణముగా పాపముతో నిండినదని దానిని దేహ శిక్షల ద్వారా క్రమపరచవలెనని తలంతురు. ఇది రెండవ తప్పుడు బోధ. ఈ రెండు తప్పుడు బోధలను దిద్దుటకై 1) యేసు క్రీస్తు అదృశ్య దేవుడని, సర్వ పరిపూర్ణము గల వాడని మొదటి రెండు అధ్యాయములలో పౌలు నేర్పించెను, 2) ఆయనతో కూడా

పరిశుద్ధ నడక నడవవలెనని దేహశిక్షలు అక్కరలేదని మూడవ అధ్యాయములోను, పరిశుద్ధ నడక నడిచిన తోటి పనివారల నడకను నాలుగవ అధ్యాయములో చూపించెను.

**కొలొస్సయి పత్రికకు, ఎఫెసీ పత్రికకు గల సంబంధము :** 1) కొలొస్సయి పత్రిక చిన్నదై 95 వచనములు కలది. కాని ఎఫెసీ పత్రికలో 155 వచనాలు కలవు. అందులోని 80 వచనములు అనగా సగానికంటే ఎక్కువ వచనాలలోని విషయములు కొలస్సయి పత్రికలో కనిపించును. ఈ రెండు సమాంతర పత్రికలుగానున్నవి. పేతురు మొదటి పత్రికయు కొంత వరకు కొలొస్సయి పత్రికకు సమాంతర పత్రికగానున్నది. (2) ఎఫెసీలో విశ్వాసి పరమందలి దేవుని కుడిపార్శ్వమున నున్న క్రీస్తుకు శరీరముగా నుండి పరలోకములో క్రీస్తుతో కూర్చున్నవాడుగా కనిపించును. కొలొస్సయి పత్రికలో విశ్వాసి భూలోకమందుండి తనకు శిరస్సుగా యేసుక్రీస్తును పరమందు కలిగినవాడుగా ఉన్నాడు. 3) ఎఫెసీ పత్రిక యేసుక్రీస్తు నందున్న విశ్వాసిని, కొలొస్సయి పత్రిక విశ్వాసియందున్న యేసుక్రీస్తును యేసు దైవత్వమును చూపుచున్నవి.

## అధ్యాయాల విభజన 1+1+1+1 = 4 అధ్యా.

**1వ అధ్యాయము :** క్రీస్తు వ్యక్తిత్వము - అదృశ్యుడైన దేవుని స్వరూపము (15వ.)

**2వ అధ్యాయము :** క్రీస్తు దైవత్వము. శరీరమందున్న సర్వ పరిపూర్ణ దైవత్వము గల క్రీస్తు (9వ.)

**3వ అధ్యాయము :** క్రీస్తుతో పరిశుద్ధమైన నడక.

**4వ అధ్యాయము :** క్రీస్తునందలి తోటి పనివారి నడక.

## 1వ అధ్యాయము 4+4+4+3+4+4+4+2=29 వచనములు
## అంశము : క్రీస్తు వ్యక్తిత్వము - అదృశ్యుడైన దేవుని స్వరూపము

**వందనము - స్తుతి (1-4వ.) :** 1-2 వచనములలో పౌలు శుభములు తెలుపు చున్నాడు. 3-4వ వచనములలో విశ్వాస జీవితమునకు ఆధారమగు మూడు స్తంభముల వంటి 1) నిరీక్షణ, 2) విశ్వాసము, 3) ప్రేమ కొలొస్సయిలోనున్న పరిశుద్ధులు కలిగి యున్నందున వారి కొరకు ప్రార్థన చేయుచు దేవుని స్తుతించుచున్నాడు.

**పరిచయము (5-8వ.) :** సువార్త యొక్క శ్రేష్ఠమైన గుణము ఏ దేశములోనైన ఏ స్థలములోనైనా ఏ కాలములోనైన ఫలించుటయే. కొన్ని చెట్లు కొన్ని దేశములలోనే

ఫలించును. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌లో కాఫీచెట్లు, యాలుకలు, లవంగాలు, మిరియాలు, ఖర్జూరములు ఫలించవు. ఫలించు చెట్లు కూడా వాటి సీజనులోనే ఫలించును. రాళ్ళు కల దేశములో తడిపంటలగు వరి వంటివి పండవు. కాని సువార్త ఎక్కడైన ఫలించును. ఏ కాలములోనైన ఫలించును. మరియు విస్తారముగా వ్యాపించును. పౌలు ద్వారా మేలుపొందిన ఎపఫ్రా ఈ పట్టణవాసి ఎపఫ్రా పని ద్వారా అనేకులు నమ్మిరి. ఆ నమ్మకమైన క్రీస్తు పరిచారకుని ద్వారా కొలొస్సయిలో మంచి సంఘ మేర్పడినది. 2:1వ. ప్రకారము పౌలు కొలొస్సయి పత్రిక వ్రాయు వరకు అక్కడకు వెళ్ళలేదని తెలియుచున్నది.

**కొలస్సయి విశ్వాసుల ఎదుగుదలకై పౌలు - ప్రార్థన స్తుతి 9-12వ.** : 1) పౌలు కొలొస్సయి వారి కొరకు చేయు ప్రార్థనలోని అంశములను గమనించండి. 1) క్రీస్తును గూర్చిన సంపూర్ణ జ్ఞానము, 2) ఆత్మ సంబంధమైన వివేకము, 3) మన పట్ల దేవుని చిత్తమును పూర్ణముగా గ్రహించుట, 4) ప్రతి సత్కార్యము లోసఫలులగుట, 5) దేవుని గూర్చిన జ్ఞానమందు అభివృద్ధి పొందుట, 6) అన్ని విషయములలో ప్రభువును సంతోష పెట్టుట, 7) ఆయనకు తగినట్లు జీవించుట, 8) ఆనందముతో కూడిన దీర్ఘ శాంతమును ఓర్పును కనుపరచుట, 9) ఆయన మహిమ శక్తిని బట్టి సంపూర్ణ బలముతో బలపరచ బడుట. తేజోవాసులైన పరిశుద్ధుల స్వాస్థ్యములో మనలను పాలివారుగా చేసిన తండ్రికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించబడవలెనన్న అపేక్ష కలిగియున్నాడు. ప్రార్థనలోను స్తుతిలోను శరీర సంబంధమైన విషయములే లేవు. మన ప్రార్థనలో 70 శాతమైన శరీర విషయము లుండును. పౌలు ప్రార్థనలోని అంశములు వివరముగా ధ్యానించవచ్చును.

**రక్షకుడైన క్రీస్తు - దేవుడైన క్రీస్తు (13-15వ.)** : 13-14వ వచనములలో క్రీస్తు మనము 1) గతములో చేసిన పాపములకు క్షమాపణ 2) పాప బానిసత్వము నుండి విడుదల, 3) అంధకార సంబంధమైన అధికారము నుండి అనగా సాతాను నుండి విడుదలను దయచేసెను. 15వ వచనములో క్రీస్తు 1) అదృశ్యుడైన దేవుని స్వరూపమని చెప్పబడినది. అనగా మనకు కనుపించని ఆత్మయైన దేవుని స్వంతరూపమే క్రీస్తు. అందుకే నన్ను చూచినవాడు తండ్రిని చూచెనని యోహాను 14:9లో చెప్పుచున్నాడు.

**సృష్టికర్తయైన క్రీస్తు (16-17) - సంఘమునకు శిరస్సయిన క్రీస్తు (18-19వ)** : 16-17వ. ఆకాశమందు భూమియందున్న సర్వము క్రీస్తునందు, క్రీస్తు ద్వారా, క్రీస్తును

బట్టి సృజింపబడెను. హెబ్రీ. 1:3వ.లో కుమారుని ద్వారా ప్రపంచములు నిర్మించబడినవి అని ఉన్నది. ఆయన ఆదియని, సంఘమునకు శిరసు అని చూచుచున్నాము.

**పాపుల కొరకు పాట్లు పడిన క్రీస్తు (20-23వ.)** : క్రీస్తు సిలువలో రక్తము కార్చి, భూలోకమునందున్న వాటిని, పరలోకమందున్న వాటిని తండ్రితో సమాధాన పరచెను. గతకాలమందు దేవునికి దూరస్థులైన మానవులను తన సన్నిధిలో పరిశుద్ధులుగా నిలువ బెట్టుకొనవలెనని రక్త మాంసములు గల దేహమును హెబ్రీ. 10:4వ ప్రకారము ధరించు కొని, మరణించాడు. ఈ మంచి వార్తలో గల క్రీస్తు అను పునాదిపై కట్టబడి తొలగిపోక స్థిరముగా నుండవలెనని హెచ్చరించుచున్నాడు.

**సంఘము కొరకు పాట్లు పడిన క్రీస్తు - పాట్లు పడిన పౌలు (24-27వ.)** : సంఘము అను ఆయన శరీరము కొరకు క్రీస్తు పాట్లుపడి కొన్నింటిని మిగిల్చినాడు. వాటిలో మనందరికి వంతులున్నవి. పౌలు తన వంతును తాను సంపూర్ణము చేయుచున్నాడు. మనకును వంతులున్నవి. వాటిని మనము సంపూర్ణము చేయాలి. సంఘము యొక్క మర్మము పౌలుకు అప్పగించబడినది. ఆ మర్మమును ప్రకటించుటకై పౌలు పరిచారకుడై నాడు. పౌలు ద్వారా ఆ మర్మము పత్రికలయందు బయలు పరచబడినది. (మర్మముల వివరములు 1వ అధ్యాయము చివర గమనించగలరు)

**సంఘము యొక్క పరిపూర్ణత కొరకు ప్రయాసపడిన పౌలు (28-29వ.)** : ప్రతి మనుష్యుడు క్రీస్తునందు పరిపూర్ణుడు కావాలి. అందుకై ప్రకటించుటలోను, బోధించుట లోను బుద్ధి చెప్పుటలోను పౌలు ప్రయాసపడుచున్నాడు. మనమందరము ఈ గురిని మన సంఘములలోనుండు విశ్వాసుల పట్ల కలిగియుండాలి.

**మర్మము** : మర్మము అనుపదము క్రొత్త నిబంధనలో 34 పర్యాయములు కలదు.

**I. దైవభక్తిని గూర్చిన మర్మము** : 1) 1 తిమోతి 3:16వ. 2) 1 తిమోతి 3:9వ., 3) కొలొస్స 2:2వ, 4) 1 కొరింథీ. 2:7వ.

**II. వాక్య మర్మము - క్రీస్తు మర్మము** : 5) కొలొస్స 1:25వ. 6-7), కొలొస్స 1:27వ. 8) 1 కొరి. 2:1వ, 9) 1 కొరి. 4:1వ, 10) 1 కొరి. 13:2వ. 11) 1 కొరి. 14:2వ.

**III. అన్యజనులను గూర్చిన క్రీస్తు మర్మము** : 12) ఎఫెసీ. 3:3వ. 13)ఎఫెసీ. 3:4వ, 14) ఎఫెసీ. 3:5వ, 15) ఎఫెసీ. 3:6వ, 16) ఎఫెసీ. 3:11వ, 17) రోమా 16:25వ,

18) రోమా 16:26వ, 19) ఎఫెసీ. 6:19వ, 20) కొలొస్స 4:3వ, 21) కొలస్స 4:3వ, 22) కొలొస్స 4:3వ,

**IV.** **నక్షత్రము** : 23) ప్రకటన 1:20వ, 24) ప్రకటన.10:7వ.

**V.** పరలోక **రాజ్యము, దేవుని రాజ్యము** : 25) మత్తయి 13:11వ, 26) మార్కు 4:11వ, 27) లూకా 8:10వ.

**VI.** **మృతుల పునరుత్థానము** : 28) 1 కొరి. 15:51వ.

**VII.** **అన్యజనుల ప్రవేశము కొరకు ఇశ్రాయేలు కఠిన మనసు** : 29) రోమా 11:25వ.

**VIII.** ధర్మవిరోధ సంబంధమైన మర్మము : 30) 2 థెస్స. 2:7వ.

**IX.** **మర్మమైన బబులోను** : 31) ప్రకటన 17:5వ, 32) ప్రకటన 17:7వ.

**X.** భార్య భర్తలను గూర్చిన మర్మము : 33) ఎఫెసీ. 5:23వ.

**XI.** మర్మమైన **దేవుని చిత్తము** : 34) ఎఫెసీ. 1:9వ.

## 2వ అధ్యాయము 7+8+8=23 వచనములు
## అంశము : శరీరమందు సంపూర్ణ దైవత్వము గల క్రీస్తు (9వ.)

**దేవుని మర్మమైన క్రీస్తును ఎరుగుట (1-7వ.)** : 1-2 వ.లో పౌలు కొలస్సయి వారిని, లౌదికయ వారిని ముఖాముఖిగా చూడకపోయినను వారు ప్రేమయందు అతుకబడి దేవుని మర్మమైన క్రీస్తును సంపూర్ణముగా ఎరిగినవారుగా నుండవలెనని ప్రార్థనలో పోరాడుచున్నాడు. 3-4వ.లో క్రీస్తునందు బుద్ధి, విజ్ఞాన, సర్వ సంపదలు గుప్తమైయున్నవని ఎవరి మాటల వలనను మోసపరచ బడకూడదని చెప్పుచున్నాడు. 5-7వ క్రీస్తును అంగీకరించినవారు క్రీస్తులో వేరుపారి అనగా చక్కని పునాది కలిగి, చక్కని ఇంటివలె కట్టబడుచు, విశ్వాస మందు స్థిరపడాలి. కొలొస్సయి వారట్లున్నారు. అందుకు పౌలు సంతోషించుచున్నాడు. అనగా ఒక విశ్వాసి క్రీస్తును ఎరుగుట ద్వారా సంపూర్ణముగా స్థిరపడును.

**శరీరమందు దేవత్వము యొక్క సర్వ పరిపూర్ణతను కలిగిన క్రీస్తు (8-15వ.)** : క్రీస్తు నందు దైవత్వము సంపూర్ణముగా నున్నందున లోకమందున్న నిరర్థక తత్వజ్ఞానము ననుసరించు వారి ద్వారా మోసపరచబడ కూడదని చెప్పుచున్నాడు. నిరర్థక తత్వజ్ఞానము

ననుసరించు జ్ఞాస్తికులను గురించి గ్రంథ ప్రారంభమందలి సంఘ స్థాపనలో చెప్పబడినది. క్రీస్తునందు చేతులతో చేయబడని హృదయ సంబంధమైన సున్నతిని అనగా ఆత్మయందు జరుగు సున్నతిని (రోమా 2:29వ.) పొందితిమి కనుక శరీరేచ్ఛలతో కూడిన స్వభావమును విసర్జించితిమి. క్రీస్తు సిలువలో మన పాప పత్రమును మేకులచే సిలువకు కొట్టి దాని మీదనున్న చేవ్రాతను చెరిపివేసి అడ్డు లేకుండ ఎత్తివేసెను. బాప్తిస్మమందు మనము ఆయనతో పాతి పెట్టబడితిమి. (బాప్తిస్మమును గూర్చి ఈ గ్రంథము చివరలో గమనించండి) నూతన స్వభావముతో ఆయనతో కూడా లేచితిమి. క్రీస్తు ద్వారా దైవత్వమునకు సంబంధించిన కార్యములన్ని మన కను గ్రహించబడినందున క్రీస్తు సర్వ పరిపూర్ణుడైన దేవుడు అని గ్రహించుచున్నాము.

**ధర్మశాస్త్రము యొక్క నిజ స్వరూపమైన క్రీస్తు (16-23వ.)** : ధర్మశాస్త్రములోనున్న బలులు, పండుగలు, రాబోవు క్రీస్తును గూర్చిన ఛాయలే (హెబ్రీ. 10:1-2వ). క్రీస్తు రాక ద్వారా అవన్నియు క్రీస్తునందు నెరవేర్చబడుట చూచుచున్నాము కనుక క్రీస్తు ధర్మశాస్త్రము యొక్క నిజ స్వరూపము. జ్ఞాస్తికులు దేహశిక్ష ద్వారా శరీరేచ్ఛలను నిగ్రహించగలమని బోధించుచున్నారు. అది తప్పని క్రీస్తులోనే సమస్తము నెరవేరునని విశద పరచుచున్నాడు.

## 3వ అధ్యాయము 4+3+4+6+4+4=25 వచనములు
## అంశము : క్రీస్తుతో పరిశుద్ధ నడక

**సంఘముగా పరిశుద్ధ నడక - (1-17వ.)** :

**పరిశుద్ధమైన నడక (1-4వ.)** : మనము మృతిపొంది క్రీస్తుతో కూడ లేపబడితిమి. కనుక భూ సంబంధమైన వాటి పై మనసుండకూడదు. తిరిగి లేచి ఆరోహణమై తండ్రి కుడి పార్శ్వమున కూర్చున్న క్రీస్తు మీదనే మనసును కలిగి ఉండాలి. అనగా పరలోక సంబంధమైన వాటి మీదనే మనసుండాలి.మనకు జీవమైయున్న క్రీస్తు ప్రత్యక్షమైనపుడు ఆయనతో కూడా మహిమ కలవారముగా ప్రత్యక్షమగుదుము. కనుక పరిశుద్ధ నడక నడవవలెను.

**పూర్వపు నడక (5-7వ.)** : భూ సంబంధులముగానున్నపుడు 1) జారత్వము, 2) పవిత్రత, 3) కామాతురత, 4) దురాశ, 5) విగ్రహారాధన అగు ధనాపేక్ష అను వాటిని అనుసరించితిమి. వాటినిప్పుడు చంపివేయాలి. చంపివేయుట అనగా మరెన్నడు మనలో కనబడకూడదు.

**ప్రస్తుత నడక (8-11వ.)** : 8వ.లో 1) కోపము, 2) ఆగ్రహము, 3) దుష్టత్వము, 4) దూషణ, 5) బూతులు అను వాటిని విసర్జించాలి. చనిపోవుట ఒకేసారి కాబట్టి 5-7వ. ఉన్నవి మరెన్నడు కనబడకూడదు. విసర్జించాలి అనగా రోజు ఒకసారి మల విసర్జన చేయుదుము. విసర్జన చేసిన పిదప మన శరీరములో మలము మరలా ఏర్పడును. ఏర్పడు కొలది విసర్జించాలి. అనగా అనుదినము 8వ.లో ఉన్న ఐదు గుణములను ఏర్పడుచుండగా విసర్జించుచుండాలి. 9వ. వచనములోనున్న అబద్ధములను ప్రాచీన స్వభావమును విడిచిపెట్టి నవీన స్వభావమును ధరించుకొనాలి. ఇక్కడ ఉన్నవి. మనము బట్టలు విప్పి శుభ్రపరచుకొని మరలా ధరించునట్లు నిత్యము మనము వాటి నుండి శుభ్రపరచుకొనాలి. వీటిలో ఏ భేదములు లేదు. కనుక అందరు చంపివేయవలసిన వాటిని 1) చంపివేయాలి. విసర్జించవలసిన వాటిని, 2) విసర్జించాలి. విడవవలసిన వాటిని, 3) విడిచి వేయాలి. ధరించవలసిన వాటిని, 4) ధరించాలి.

**ఇక మీదట (రాబోవు) నడక (12-17వ.)** : 1) 12-14 వచనములలో ధరించుకొన వలసినవి వివరించబడినవి. మనలను 5) ఏలవలసినవి, 15వ. వచనములోను, మనలో 6) నివసించవలసినవి 16వ వచనములోను, మనము 7) చేయవలసిన స్తుతి 17వ వచనములో చెప్పబడినది.

**కుటుంబముగా నడక (18-21వ.)** : 18-19వ. 1) భార్యలు భర్తలకు లోబడాలి, 2) భర్తలు భార్యలను ప్రేమించాలి. (వివరములు ఎఫెసీ. 5:22-32వ. కలవు) 20-21వ.లో పిల్లలు అన్ని విషయములలో తండ్రుల మాట వినాలి అని తండ్రులు పిల్లలకు కోపము పుట్టించకూడదని చెప్పినాడు. (ఈ విషయములు ఎఫెసీ 6:1-4వ. చెప్పబడినవి)

**దాసులు యజమానుల పట్ల నడవవలసిన రీతి (22-25వ.)** : 22-25వ. దాసులు యజమానులకు సేవ చేయవలసిన విధము చెప్పబడినది. 4:1వ.లో యజమానులు దాసులపట్ల చేయవలసినవి, చెప్పబడినవి. (దీని వివరములు ఎఫెసీ. 6:5-9వ. కలవు)

## 4వ అధ్యాయము 1+3+2+6+6=18 వచనములు
## అంశము : క్రీస్తు నందలి తోటి పనివారి నడక

**మొదటి వచనమును మూడవ అధ్యాయము చివరలో చూచితిమి** :

ప్రార్థనలో నడుచుకొనవలసిన రీతి (2-4వ.) : ప్రార్థనలో 1) నిలకడగాను, 2) మెలకువగా ఉండాలి. సువార్త ప్రకటనకై అనుకూల సమయము కొరకు ప్రార్థించాలి.

**వెలుపటి వారి యెడల నడుచుకొనవలసిన విధము : (5-6వ.) :** సాక్ష్యము ప్రాముఖ్య మైనది. కనుక సంఘమునకు వెలుపటి వారి యెడల నడుచుకొను రీతి ప్రాముఖ్యమైనది. జ్ఞానము కలిగి నడుచుకొనాలి. సంభాషణ/మాటలు రుచిగానుండాలి. కృపతో నిండినవిగా నుండాలి. ఇవి మన ద్వారా జరుగు సువార్త ప్రకటనకు ఎంతో అవసరమైనవి.

**పనిలో పదిమంది తోటి పనివారల మాదిరి నడక (7-12వ. 13-18వ.) :** 1) 7వ వచనములో తుకికు నడకను, 2) 8-9వ. ఒనేసీము నడకను 3-4. 10వ. వచనములో అరిస్తార్కు, మార్కుల నడక, 5) 11వ వచనములో యూస్తు నడకను, 6) 12-13వ. ఎపఫ్రా నడకను, 7,8) 14వ. వచనములో లూకా, దేమాల నడకను చెప్పుచున్నాడు. 9) 15వ నుంఫాకు, ఇంటనున్న సంఘమునకు వందనములు చెప్పుచున్నాడు, 10) 17వ. అర్ఖిప్పును గూర్చి చెప్పుచున్నాడు. వందనములతో ముగించుచున్నాడు.

బాప్తిస్మము : గ్రీకు భాషలో అను పదమునకు ముంచడమనని అర్థము.

1) నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడును. మార్కు 16:16వ.

2) యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందవలెనని దేవుని ఆజ్ఞ. అ.కా. 10:48వ.

3) సమస్త జనులను శిష్యులుగా చేయుడి. తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మయము ఇయ్యుడి మత్తయి 28:19వ.

4) బాప్తిస్మము పొందుట దేవుని నీతి. దీనిని క్రీస్తు నెరవేర్చాడు. మత్తయి 3:1వ.

5) బాప్తిస్మయములో నీళ్ళలోనికి వెళ్ళుట మునుగుట నీళ్ళ నుండి బయటకు వచ్చుట అ.కా. 8:36-38వ.

6) బాప్తిస్మము పొందినవారు క్రీస్తు మరణములోనికి బాప్తిస్మము పొందుచున్నారు. కొలొస్స. 2:12వ. బాప్తిస్మమందు ఆయనతో కూడా పాతిపెట్టబడి ఆయనను మృతులలో నుండి లేపిన దేవుని విశ్వసించుట ద్వారా ఆయనతో కూడ లేచితిరి.

# థెస్సలొనీకయులకు వ్రాసిన మొదటి పత్రిక

గ్రంథకర్త : పౌలు . కాలము : క్రీ.శ. 52 (3:1) స్థలము : కొరింథు. (3:1) కొనిపోయినవారు ఎవరో తెలియదు.

**ముఖ్య ఉద్దేశము :** ఆకాశమండలమునకు ప్రభువు రాకడ - మాదిరి.

**ప్రభువు రాకడ నపేక్షించువారు :** 1) సువార్త ప్రకటనలో మాదిరిగానుండుచు (1:7), 2) ప్రయాసపడుచు ఫలము కలిగి (2:19), 3) పరిశుద్ధులై (3:12), 4) పరిశుద్ధతను కాపాడుకొనుచు (4:3), 5) ప్రేమగలవారై (4:9), 6) దుఃఖపడక (4:13), 7) నిందా రహితులుగా ఉండాలి (5:23).

**థెస్సలొనీక పట్టణ చరిత్ర :** ఈ పట్టణపు పాత పేరు థెర్మా (THERMA) అనగా వేడి నీటి బుగ్గలు అని అర్థము. రాజైన అలెగ్జాండర్ చక్రవర్తి గారి సైన్యాధిపతులలో ఒకడైన కసెండర్, అలెగ్జాండర్‌గారికి వరుసకు చెల్లియగు సలోనీకను వివాహమాడెను. అలెగ్జాండర్ మరణానంతరము నలుగురు సైన్యాధిపతులు రాజ్యమును పంచుకొనిరి. కసెండర్ మాసిదోనియాపై దండెత్తి క్రీ.పూ. 315 జయించి జయమునకు గురుతుగా ఒక పట్టణమును కట్టించి ఆ పట్టణమును జయించిన సలోనిక అను అర్థమిచ్చు థెస్సలొనీక అను పేరు పెట్టెను. ఇది సహజమైన ఓడరేవుగల పట్టణము. కనుక వ్యాపారములోను, వ్యభిచార పాపములోను పేరు పొందిన పట్టణము. తదుపరి క్రీ.పూ. 168లో రోమీయులు దానిని జయించి తమ వశమందుంచుకొనిరి. అది మాసిదోనియాలోని నాలుగు భాగములలో దక్షిణమున నున్న భాగమునకు ముఖ్య పట్టణముగా నుండెను. ఫిలిప్పీ ఉత్తర మాసిదోనియాకు ముఖ్య పట్టణమైయుండెను.

**సంఘ స్థాపన :** క్రీ.శ. 51లో ఫిలిప్పీ నుండి పౌలు థెస్సలొనీకకు వచ్చి అ.కా. 17:1-9వ. ప్రకారము మూడు వారములు బోధించెను. యూదులు కొందరు, గ్రీకు దేశస్థులు (విగ్రహారాధికులు) అనేకులు, ఘనత గల స్త్రీలు చాలామంది రక్షింపబడిరి. యాసోను పౌలును తన ఇంట చేర్చుకొనినందున పట్టణస్థులు యాసోనును కొట్టి హింసించిరి. పౌలు తన సహచరులతో బెరయకు, తర్వాత ఏథెన్సుకు అ.కా. 17:10-34 ప్రకారము వెళ్ళిపోయెను. థెస్సలొనీకయులు శ్రమల మధ్య నమ్మి, శ్రమల మధ్య ఆత్మీయ యాత్ర కొనసాగించుచుండగా, శ్రమల మధ్య వారిని బలపరచుటకై పౌలు ఏథెన్సులో నున్నప్పుడు 1 థెస్స. 3:1 ప్రకారము తిమోతిని థెస్సలొనీకకు పంపెను. తిమోతి వారిని స్థిరపరచి, పౌలు కొరింథులో నున్నప్పుడు అ.కా. 18:5 ప్రకారము తిరిగి వచ్చి

వారిని గూర్చి మంచి సమాచారము తేగా ప్రభువు రెండవ రాకడను జ్ఞాపకము చేయుచు అయన కొరకు ఎదురుచూచుచూ జీవించవలెనని హెచ్చరించుచూ ముఖ్యముగా పరిశుద్ధతను గూర్చి కొన్ని హెచ్చరికలిచ్చెను.

థెస్సలొనీకయుల మొదటి పత్రికను కొరింథు పట్టణములో నుండి క్రీ.శ. 52లో వ్రాసెను. 1 థెస్స. 3:9-10వ. లోనున్నట్లు వారిలో గల లోపములు దిద్దుటకై మాదిరికరమైన జీవితమునకు హెచ్చరికలు వ్రాసెను. ఈ పత్రికయందున్న ప్రభువు రాకడను గూర్చి థెస్సలొనీకయులు తప్పుగా తలంచిరి. ప్రభువు తన రెండవ రాకడలో ఆకాశమండలమందు ఏడు ఏండ్లు ఉన్నప్పుడు భూమిపై జరుగు సంగతులను వివరించుచూ ప్రభువు భూమిపై దిగి వచ్చుటను గూర్చిన వివరములు తెలుపుచూ వారు కలిగిన తప్పుడు అభిప్రాయమును దిద్దుచూ క్రీ.శ. 53లో రెండవ పత్రికను కొరింథు నుండియే వ్రాసెను. ప్రస్తుతము అక్కడ ఒక చిన్న పట్టణమున్నను, వాక్య ప్రకారము నడుచుకొను క్రమమైన సంఘము నేటికిని అక్కడ ఉన్నది. (BROTHERN CHRISTIAN ASSEMBLY)

## అధ్యాయాల విభజన

**1-3వ అధ్యాయములు** : మాదిరియైన సంఘము, పనివారు

**4-5వ అధ్యాయములు** : మాదిరికి హెచ్చరికలు.

**1వ అధ్యాయము** : ప్రవర్తనలోను, ప్రకటనలోను, మాదిరి సంఘము.

**2వ అధ్యాయము** : మాదిరి పనివాడు.

**3వ అధ్యాయము** : మాదిరి పనివారుగా పౌలు, తిమోతిలు.

**4వ అధ్యాయము** : మాదిరియైన పనికి హెచ్చరికలు.

**5వ అధ్యాయము** : మాదిరియైన పనికి మరిన్ని హెచ్చరికలు.

## 1వ అధ్యాయము 1+2+2+1+2+2=10 వచనములు
## అంశము : ప్రవర్తనలోను, ప్రకటనలోను మాదిరి సంఘము.

**1వ. శుభములు** : ముందున్న అన్ని పత్రికలలో తనను, అపోస్తలుడుగను, దాసుడుగను పరిచయము చేసికొన్నాడు కాని ఈ పత్రికలో అలాగు కాక తనను ఒక సామాన్యుని వలె పరిచయము చేసికొనుట చూచుచున్నాము. వారిలో ఒకనివలె వారి విశ్వాసమును. ప్రేమను నిరీక్షణను మెచ్చుకొనుచున్నాడు. తనతో పాటి సిల్వానును, తిమోతిని కలుపుకొని వ్రాయుచున్నాడు. కృప గ్రీసు దేశస్తులు శుభములు తెలుపుకొను

విధము, సమాధానము (షాలోమ్) యూదులు శుభములు తెలుపుకొను విధము. ఈ సంఘమందు అ.కా. 17:2-3వ. ప్రకారము క్రీస్తును నమ్మిన గ్రీసు దేశస్థులు, యూదులు ఉన్నందున కృప సమాధానమను రెండు పదములతో శుభములు తెలుపుచున్నాడు.

**ప్రార్థన స్తుతి (2-3వ.)** : విశ్వాసము, ప్రేమ, నిరీక్షణ 1 కొరింథీ. 13:13 ప్రకారము అంతము వరకు నిలుచునవి. ఇవి క్రైస్తవ జీవిత ప్రాముఖ్యతలు వీటిని కలిగి పని చేయుచు, ప్రయాసపడుచు క్రీస్తునందు నిరీక్షణ కలిగి థెస్సలొనీకయులు జీవించు చున్నారు. అందులకై వారి నిమిత్తము పౌలు తన ప్రార్థనలో దేవుని స్తుతించుచున్నాడు.

**థెస్సలొనీకలో ప్రకటింపబడిన సువార్త (4-5వ.)** : అ.కా. 17:1-4వ వచనములలో చెప్పబడినట్లు థెస్సలొనీకలో పౌలు తన వాడుక చొప్పున సమాజము వారి యొద్దకు వెళ్ళి 3 వారములు సువార్త ప్రకటించాడు. ఆ సువార్త శక్తితోను, పరిశుద్ధాత్మతోను, సంపూర్ణ నిశ్చయతతోను ప్రకటింపబడినది. యూదులు కొందరు, గ్రీసు దేశస్థులు చాలా మంది ఘనతగల స్త్రీలలో అనేకులు యేసును రక్షకుడుగా ఒప్పుకున్నారు. పౌలు నమ్ముకొనుటకు ఇష్టపడిన వారిని ఒప్పించేవాడు. ఈ అలవాటు మంచిది. మనము నమ్ముకొనుటకు ఇష్టపడిన వారిని ఒప్పించే తీర్మానము పలికించాలి. తదుపరి వారిని స్థిరపరచాలి.

**6వ వచనము : థెస్సలొనీకలో ఫలించిన సువార్త -** పరిశుద్ధాత్మ కార్యము చేశాడు. ఉపద్రవముల మధ్యనే అనేకులు క్రీస్తును నమ్మి ఆనందించిరి. ప్రభువును పోలి నడుచుకొనుచున్నారు.

**థెస్సలొనీకయులు ప్రకటించిన సువార్త (7-8వ.) - ఫలము** : ప్రభువును నమ్మిన థెస్సలొనీకయులు మాసిదోనియా అంతటను, గ్రీసు దేశమందంతటను సువార్తను ప్రకటించిరి, మ్రోగించిరి. పై రెండు దేశములలో ఉన్న విశ్వాసులకు థెస్సలొనీకయులు మాదిరిగానున్నారు. సువార్త ప్రకటనలో పడవలసిన ప్రయాసకు ఇదెంతో మాదిరి. పౌలువంటి దైవజనులు ఎక్కడికి వెళ్ళినను వారు చెప్పకముందే అక్కడి ప్రజలు ఈ సువార్త విషయమును గూర్చి చెప్పుచున్నారు.

**ప్రభువు రాకడకై ఎదురు చూచు థెస్సలొనీకయులు (9-10వ.)** : థెస్సలొనీకలో నమ్మినవారు ఎక్కువమంది విగ్రహారాధికులు. ప్రభువును అంగీకరించిన తర్వాత విగ్రహములను విడిచిపెట్టి తాము నమ్మిన దేవుడు 1) జీవముగలవాడని, 2) సత్యవంతుడని, 3) మృతులలో నుంచి లేచినవాడని, 4) పరలోకము నుండి మరల వచ్చునని, 5) లోకమునకు రాబోవు ఉగ్రత నుండి వారిని తప్పించునని గుర్తించి, 6) ఆయన వైపు

తిరిగి, 7) ఆయన రాకడకై ఎదురు చూచుచున్నారు. సిద్ధముగానున్నారు. ఇది నేటి విశ్వాస కోటికి ఎంతో మాదిరి.

## 2వ అధ్యాయము 4+4+4+4+4=20 వచనములు

## అంశము : మాదిరియైన పనివాడు

**మాదిరియైన పనివాని బోధన పద్ధతి (1-4వ.)** : శ్రమలలో, అవమానములలో, పోరాటములలో సువార్తను బోధించుటకు ధైర్యము తెచ్చుకొనాలి. అపవిత్రత ఉండ కూడదు. బోధకునికి తగనివి 1) కపటము, 2) అపవిత్రత, 3) మోసము బోధకునికి తగనివి. 1) దేవునిచే యోగ్యులని ఎంచబడుట, 2) మనుష్యులను కాక దేవునినే సంతోష పెట్టుట.

**మాదిరియైన పనివాడు - స్థన్యమిచ్చు తల్లివంటివాడు (5-8వ.)** : తల్లిబిడ్డల నుండి ఏమి అపేక్షించదు. ఆలాగే పనివాడు అపేక్షలేని వాడుగా, ముఖ్యముగా ధనాపేక్షలేని వాడుగా నుండాలి. ఇచ్చకపు మాటలు లేనివాడై ఉండాలి. పనివాడు తనకేమైన అధికారమున్నను వినియోగించ కూడదు. ఘనతను కోరకూడదు కాని తల్లివలె అందరిని గౌరవించు వాడుగానుండాలి. తల్లిగానే కాక తానొక శిశువుగా సాధుత్వము కలిగియుండాలి. ధనాపేక్ష లేకపోయినను సహోదరుల ఆత్మీయత ఎడల విశేష ఆపేక్ష కలవారుగానుండాలి. సువార్త ప్రకటించుట మాత్రమే కాక అవసరమైతే వారి కొరకు ప్రాణమిచ్చుటకును సిద్ధముగానుండాలి.

**మాదిరియైన పనివాడు - మాదిరియైన నడకగల తండ్రి వంటివాడు (9-12వ.)** : తండ్రి కుటుంబములో ఎవరికిని భారముగానుండడు. జీవనము కొరకు తానే కష్టపడును. ప్రయాసను, కష్టమును లెక్క చేయడు. ప్రవర్తనలో కుటుంబములో అందరికి మాదిరిగా నుండును. ఆలాగే మాదిరియైన పనివాడు ప్రభువు పనిలో ప్రయాసను లెక్క చేయక, ఎవరికిని భారముగా నుండక, తానే కష్టపడుచు దేవుని ఎడల భక్తిని, మానవుల ఎడల నీతిని, ప్రవర్తనలో తన విషయమై అనింద్యుడుగాను ఉండాలి.

పై విషయములలో సంఘమంతయు అనగా సాటి మానవులును దేవుడును సాక్షులుగానుండాలి. తన మాదిరియైన నడకను చూపించుచు తన రాజ్యమునకు, మహిమకు పిలిచిన దేవునికి తగినట్టు జీవించాలని ధైర్యపరచి అందరిని హెచ్చరించువాడై ఉండాలి.

**మాదిరియైన పనివాడు - పనివాడు హింసను సహించిన వాడు (13-16వ.)** : యూదయలోని సంఘములు, యూదుల నుండి శ్రమలను అనుభవించారు. థెస్సలోనీకయులు కూడా తమ సొంత దేశస్థుల వలన శ్రమలను అనుభవించారు. యూదులు ప్రభువైన యేసును, ప్రవక్తలను చంపిరి. యూదులు పౌలును సహచరులను హింసించిరి. అన్యజనులతో రక్షణ విషయమై పౌలు సహచరులు మాటలాడకుండ, యూదులు ఆటంక పరచిరి. ఇటువంటి పరిస్థితిలోనే థెస్సలొనీకయులు వాక్యమును అంగీకరించిరి.

**మాదిరియైన పనివాడు - అక్షయ కిరీటమును నిరీక్షించువాడు (17-20వ.)** : మాదిరియైన పనివాడు రక్షించబడినవారి ఆత్మీయ క్షేమ విషయమై మిగుల అపేక్ష కలిగియుంటాడు. 1) ధన అపేక్షలేనివాడుగాను (5వ), 2) విశేష అపేక్ష కలవాడుగాను, (8వ), 3) మిగుల అపేక్షగలవాడు (17వ) ఉండి ప్రభువు ఆకాశమండలములో సంఘము కొరకు ప్రత్యక్షమై ఏడేండ్ల కాలము ఒక్కొక్కరిని వారి క్రియల ప్రకారము తీర్పు తీర్చినపుడు బహుమానముగా అతిశయ కిరీటము పొందును. ప్రభువు అనుగ్రహించు ఆ కిరీటములలో ఇది ప్రభువును నమ్మినవారిని మాదిరి వ్యక్తులుగా తీర్చి దిద్దిన వారికి అనుగ్రహించబడును. మిగిలిన కిరీటములను గూర్చిన వివరములు 1 కొరింథీ. 9వ అధ్యాయము చివరలో కలవు.

## 3వ అధ్యాయము 5+5+3=13 వచనములు
## అంశము : మాదిరి పనివారుగా పౌలు, తిమోతీలు

**పనివారిని పంపుట (1-5వ.)** : పౌలు థెస్సలొనీకలో పని జరిగిన పిమ్మట శ్రమలను బట్టి బెరయకు తదుపరి, ఏథెన్సుకు వచ్చాడు. థెస్సలొనీకకు సుమారు 300 మైళ్ళ దూరములోనున్నాడు. కాని థెస్సలొనీకలో నమ్మినవారు శ్రమలను బట్టి విశ్వాసములో కదిలి పోవుదురేమోనని బలపరచుటకు ఎవరినైనా పంపవలెనని తలంచాడు. తిమోతి తగినవాడని గుర్తించి తిమోతిని సీలను 300 మైళ్ళ దూరము పంపాడు. ఈ దినములలోను జరిగిన పనులు అనేక స్థలములలో శ్రమలను బట్టి దెబ్బ తింటున్నవి. పౌలువలె పని పాడు కాకుండా కాపాడుట ఎంతో అవసరము. ఈ రీతిగా కాపాడబడిన థెస్సలొనిక సంఘము నేటికి కొనసాగుచున్నదని ఎరుగవలెను. 1 కొరింథీ 15:58వ ప్రకారం ప్రభువు నందలి ప్రయాస వ్యర్థముకాదని గుర్తించాలి.

**ప్రార్థించుట (6-10వ.)** : పౌలు కొరింథులోనుండగా అ.కా. 18:5వ. తిమోతి సీలలు మాసిదోనియా నుండి (థెస్సలొనీకయు) నుండి వచ్చివారిని గురించిన మంచి సమాచారము తెచ్చిరి. ఆదరింపబడిన పౌలు తాను థెస్సలొనీకయులలోనున్న లోపములను దిద్దుటకై రాత్రింబగళ్ళు ప్రార్థించితినని చెప్పుచున్నాడు. పౌలు 1) ప్రార్థన

ద్వారాను, 2) తిమోతిని పౌలు పంపుట ద్వారాను, 3) తిమోతి ప్రయాణ ద్వారాను థెస్సలొనీకయులు శ్రమలలో కూడా విశ్వాసమందు స్థిరపడిరి అని దేవుని స్తుతించెను. తరువాత లోపములు దిద్దబడవలెనని ప్రార్థించుచున్నాడే కాని లోపములను ఇతరులకు తెలుపలేదు. పైగా 1:7లో మీరు మాదిరియైతిరి అని పత్రిక ప్రారంభించాడు. సహోదరులలోని లోపములను దిద్దుటకు స్థిరపరచుటకు ఇది మనకెంతో మాదిరి.

**ప్రభువు రాకడలో పరిశుద్ధతను, ప్రేమను కలిగియుండుట (11-13వ.)** : ప్రభువు తన రెండవ రాకడలో తన పరిశుద్ధులందరితో ఆకాశ మండలమునకు వచ్చినప్పుడు థెస్స లొనీకయులు పరిశుద్ధత విషయమై అనింద్యులుగాను, ప్రేమలో అభివృద్ధి పొంది వర్ధిల్లునట్లుగాను ప్రభువునందు అపేక్షించుచున్నాడు. మనమును సమస్త పరిశుద్ధుల ఎడల, మరి ముఖ్యముగా మన ద్వారా మేలు పొందినవారి యెడల అటువంటి అపేక్ష కలిగియుండాలి.

## 4వ అధ్యాయము 2+6+4+6=18 వచనములు
## అంశము : మాదిరియైన పనికి హెచ్చరికలు

**సామాన్యమైన హెచ్చరికలు (1-2)** : విశ్వాసులు 1) నేర్చుకొనిన వాక్య ప్రకారము నడుచుకొనుట, 2) దినదినము అంతకంతకు అభివృద్ధి చెందుట ఈ రెండు ప్రాముఖ్య మైనవి. ప్రతి విశ్వాసి ఈ రెండు పరిక్షలు తన విషయమై చేసుకొవాలి.

**శరీరమును పరిశుద్ధముగా కాపాడుకొనుటను గూర్చిన హెచ్చరిక (3-8వ.)** : పరిశుద్ధులు 1) జారత్వమునకు దూరముగానుండాలి (అవివాహితులు చేయు పాపము జారత్వము, వివాహితులు చేయు పాపము వ్యభిచారము). 2) కామాభిలాషకు దూరముగానుండాలి, 3) మనము పరిశుద్ధులగుటయే దేవుని చిత్తము గనుక అపరిశుద్ధులముగా నుండరాదు. ఆలాగు పాపమునకు తావిచ్చుట పరిశుద్ధాత్మను మనకు అనుగ్రహించిన దేవుని ఉపేక్షించుటయే. ప్రభువు ప్రత్యక్షమైనపుడు వీటన్నిటిని గూర్చి ప్రతిదండన చేయునని గుర్తించుకొనాలి.

**ప్రేమను గూర్చిన హెచ్చరిక (9-12వ.)** : మాసిదోనియలోనున్న సహోదరులందరు ఒకరినొకరు ప్రేమించుకొనుచున్నారని జ్ఞాపకము చేయుచు మరి ఎక్కువగా ప్రేమలో అభివృద్ధి చెందవలెనని చెప్పుచున్నాడు. అగాపే ప్రేమచేత మనము ఒకరినొకరు ప్రేమించు కొనాలి. (మత్తయి 22:39వ.) (1 కొరింథీ. 13వ అధ్యాయ ప్రారంబమందు ప్రేమ వివరములు చూడండి)

**ప్రభువు ఆకాశ మండలమునకు వచ్చు రాకడను గూర్చిన హెచ్చరిక (13-18వ.) :** లోకులు నిరీక్షణ లేనివారు కనుక చనిపోయిన తరువాత ఏమగునోయని చనిపోయిన వారిని గూర్చి చింతించుదురు. క్రీస్తు మృతిపొంది తిరిగిలేచినందున క్రీస్తునందు మృతులైన వారును లేపబడుదురని క్రీస్తు ప్రధాన దూత శబ్దముతోను, దేవుని బూరతోను పరలోకము నుండి ఆకాశ మండలమునకు దిగిరాగా క్రీస్తు నందుండి మృతులైన వారు మొదట బ్రతికింపబడి అక్షయ దేహమును ధరించుకొందురు. (1 కొరి. 15:51వ.) ఆ మీదట ప్రభువును నమ్మి సజీవులుగానున్నవారు కూడా మార్చబడి వారితో కూడా ఏకముగా ఆకాశమండలమందున్న ప్రభువును ఎదుర్కొనుటకు మేఘముల మీద వెళ్ళుదురు. అప్పటి నుండి సదాకాలము ప్రభువుతో నుందురు. కనుక శ్రమల కాలమందు భూలోకములో కలుగు శ్రమలలో క్రీస్తును నమ్మినవారు పాలు పొందరు.

## 5వ అధ్యాయము 11+11+3+3=28 వచనములు
## అంశము : ప్రభువు ఆకాశమండలమునకు వచ్చు రాకడను గూర్చిన హెచ్చరిక - మిగిలిన హెచ్చరికలు

**ప్రభువు ఆకాశమండలమునకు వచ్చు రాకడ (1-11వ.) :** 1-4వ. ప్రభువు దినము దొంగవచ్చినట్లు వచ్చును. లోకులు కనిపెట్టని గడియలో వచ్చును. కొందరు అదృశ్యులై నట్లు లోకము ఎరుగుదురు. కాని ఏమి జరుగునో వారికి తెలియదు. సంఘము పూర్తిగా ఎత్తబడిన పిమ్మట శ్రమలు ఆరంభమగును. లోకమునకు శ్రమలు అప్పటినుండి ఆరంభమై దానియేలు 9:27వ. చెప్పబడినట్లు మొదటి 31/2 ఏండ్లు శ్రమలు కలుగును. తరువాత 31/2 ఏండ్లు మహా శ్రమలు కలుగును. ప్రకటన 13వ అధ్యాయము ప్రకారము క్రీస్తు విరోధి పాలన భూమిపై ఏడేండ్లు జరుగును. యూదులు లోకములో ఉన్న అన్యులగు వారు వాటినుండి తప్పించుకొనలేరు. ప్రకటన 6వ అధ్యా. నుండి 18వ అధ్యాయము వరకు చెప్పబడిన శ్రమలన్నియు కలుగును. 5-8వ.లో మనము వెలుగు సంబంధులము కనుక 4:13-18వ.లో చెప్పబడి నట్లు ఆకాశమండలమునకు వెళ్ళుదుము క్రీస్తునందు మృతులైనవారు, సజీవులు వెళ్ళుదురు కనుక సంఘమంతయు వెళ్ళును. కొద్ది మందియే వెళ్ళుదురను బోధ సరియైనది కాదు. కనుక మనకు క్రీస్తు దినము ప్రారంభమైనదని ఎరుగుదుము. 2 కొరింథీ. 5:10వ ప్రకారము 1 కొరింథీ. 3:13-15వ. ప్రకారము మనము క్రీస్తు న్యాయపీఠము దగ్గర తీర్పు తీర్చబడి ఫలము కిరీటములు బహుమానములు పొందుదుము. పని అగ్నిచే పరీక్షించబడునని 1 కొరింథీ. 3:13లో

ఉన్నది. అలాగే హెబ్రీ. 10:27లో కూడా న్యాయపు తీర్పు క్రీస్తు న్యాయపీఠము దగ్గర జరుగు తీర్పు తీక్షణమైన అగ్ని ఇక ఉండును అన్నాడు. 1 కొరి. 3:13వ. ప్రకారము ఈ అగ్ని మన క్రియలను పరీక్షించును. 1 కొరి. 3:15వ. ప్రకారము మనము రక్షింపబడుదుము రక్షణ శాశ్వతమైనదని గుర్తించుదుము గాక కాని మన క్రియలు కాలిపోయిన యెడల మనకు నష్టము కలుగును. అనగా పొందబోవు ఫలములో నష్టము కలుగును. కనుక మనము మెలుకువగానుండాలి. మత్తులముగా నుండరాదు. విశ్వాస, ప్రేమ, నిరీక్షణలు కలిగి ముందుకు సాగాలి. మానవుల పట్ల దేవుని నియమము ఇక్కడ చెప్పబడినది "రక్షణ పొందుటకే దేవుడు నియమించెను కాని ఉగ్రత పాలగుటకు కాదు".

**వేర్వేరు 16 హెచ్చరికలు (12-22వ.)** : 12-13వ వచనములో సంఘములో ప్రయాస పడువారి పట్ల ఏ రీతిగానుండాలో చెప్పుచున్నాడు. 1) బుద్ధి చెప్పువారిని మన్నన చేయాలి. 2) వారి పనిని బట్టి వారిని ఘనముగా ఎంచాలి, 3) ఒకరితో ఒకరు సమాధానముగా నుండాలి. 14-15 వచనములలో సంఘములోని సహోదరుల ప్రవర్తనను గూర్చి చెప్పుచున్నాడు, 4) అక్రమముగా నడుచుకొనువారికి బుద్ధి చెప్పాలి, 5) ధైర్యము చెడిన వారిని ధైర్యపరచాలి, 6) బలహీనులకు ఊతనివ్వాలి, 7) అందరి ఎడల దీర్ఘశాంతము కలవారై ఉండాలి, 8) కీడుకు ప్రతికీడు చేయకూడదు, 9) మనుష్యులందరి యెడల ఎల్లప్పుడు మేలైనది చేయాలి, 15-22 వచనములలో వ్యక్తిగతముగాను దేవునితో ఉండవలసిన సంబంధమును గూర్చి చెప్పుచున్నాడు. 11) ఎల్లప్పుడు సంతోషముగా నుండాలి, 12) ఎడతెగక ప్రార్థన చేయాలి, 13) ప్రతి విషయములో దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించాలి, 14) దేవుని ఆత్మను ఆర్పకూడదు, 15) ప్రవచించుటను నిర్లక్ష్యము చేయకూడదు, 16) సమస్తమును పరీక్షించి మేలైన దానిని చేపట్టాలి.

**చివరి హెచ్చరిక ఒకరి కొరకు ఒకరు ప్రార్థన (22-25వ.)** : ప్రభువు రాకడ సమయమునకు 1) ప్రాణము (మానసికముగాను, హృదయములోని తలంపులు, ఊహలలోను) 2) శరీరము, 3) ఆత్మ నిందా రహితముగా కాపాడుకొనవలెనను హెచ్చరిక చివరిదిగా చెప్పుచున్నాడు. తన కొరకు ప్రార్థించమని చెప్పుచున్నాడు.

**ముగింపు - వందనములు (26-28వ.)** : సహోదరుల మధ్య పవిత్రత ముఖ్యమని, పవిత్రతతో ముద్దు పెట్టుకొని సహోదరులకు వందనములు చెప్పమన్నాడు. ఈ పత్రిక సహోదరులందరికి చదివి వినిపించమని ఆశీర్వాదముతో పత్రిక ముగించుచున్నాడు. ఈ గ్రంథమందలి 5వ అధ్యాయములో చివరి వచనములో ప్రభువు రాకడ ప్రస్తావించబడి నందున దీనిని రాకడ పత్రిక అనిరి.

1) 1:10వ., 2)2:19., 3) 3:12-13వ., 4) 4:18-24వ., 5) 5:23వ.

# థెస్సలొనీకయులకు వ్రాసిన రెండవ పత్రిక

గ్రంథకర్త : పౌలు . కాలము : క్రీ.శ. 53 (2:1) స్థలము : కొరింథు.

**ముఖ్య ఉద్దేశము** : భూమి మీదకు ప్రభువు రాకడ.

## అధ్యాయాలు విభజన

**1-2 అ. బోధ** : 1 అధ్యా. శ్రమలలో **ఆదరణ**

**3 అ.** నడక : 2 అధ్యా. ప్రభువు దినాన్ని గూర్చిన వివరణ. 3వ అధ్యా. పని చేయకుండుటను గూర్చిన సవరణ (మాదిరికి అవసరమైన దిద్దుబాటును గూర్చిన హెచ్చరికలు)

## 1వ అధ్యాయము 5+5+2=12 వచనములు
## అంశము : శ్రమలలో ఆదరణ - (గతమును గూర్చిన మెప్పు)

**విభజన** : శ్రమలు **(1-5వ.)** : అ.కా. 17:1-9. వచనములలో థెస్సలొనీకయ వారు క్రీస్తును నమ్ముకొనగా యాసోను మిగిలిన వారు హింసించబడిరి. శ్రమల వలన కదిలించబడకూడదని మొదటి పత్రిక వ్రాయబడెను. అందులో ప్రభు దినమును గూర్చి పౌలు ప్రస్తావించినందున దాని విషయమై కొంత తప్పుడు అభిప్రాయము కలిగెను. మొదటి పత్రిక 5:1-11వ. ప్రభువు దినమందు భూలోకములో శ్రమలు కలుగునని వ్రాసెను. ప్రస్తుతము వీరికి కలుగు శ్రమలను బట్టి ప్రభువు దినము వచ్చెనని తప్పుగా తలంచిరి. ప్రభు దినము వచ్చినదని అందులకే తాము శ్రమలలో ఉన్నామని తలంచిరి. దానికి తాము అనుభవించు శ్రమలే గుర్తని థెస్సలొనీకయులు తలంచిరి ఆ తప్పుడు అభిప్రాయమును తేటపరచుటకే ఈ రెండవ పత్రికను వ్రాసెను. కాని ముందుగా వారి విశ్వాసము అభివృద్ధి పొందుచున్నదని యెదుటి వారి యెడల వారు చూపు ప్రేమలో వృద్ధి పొందుచున్నారని తెలిపెను. తరువాత వారు శ్రమలలో ఓర్పును కనపరచుచున్నారని దేవుని రాజ్యములో యోగ్యునిగ కనబడుటకు ఇది అవసరమని చెప్పుచున్నాడు.

**దేవుని న్యాయమైన తీర్పును బట్టి ఆదరణ (6-10వ.)** : ప్రభువైన యేసుక్రీస్తు భూమి మీద ప్రత్యక్షమైనపుడు దేవుని ఎరుగని వారిని దేవుడు శ్రమల ద్వారా తీర్పు తీర్చి శిక్షించును. ప్రభువును నమ్మినవారు ముందుగా ఆకాశమండలమునకు వెళ్ళిరి. అక్కడ తీర్పు తీర్చబడి ఫలము పొందినందున విశ్రాంతిగానుందురు. ప్రభువును నమ్మిన పరిశుద్ధులు దేవుని మహిమగలవారై అందరి చేత ప్రసంసించబడుదురని చెప్పుచున్నారు.

క్రీస్తును నమ్మని వారికి ఈ మహిమలో పాలు పంపులు లేవు. భూలోకములో క్రీస్తు విరోధి పాలనలో శ్రమలు మహా శ్రమలు కలుగును.

**పరిశుద్ధుల కొరకు ప్రార్థన (11-13)** : దేవుని చేత పిలువబడిన పరిశుద్ధులు విశ్వాస యుక్తమైన ప్రతి ఆలోచనను ప్రతి కార్యమును బలముతో సంపూర్ణము చేయవలెనని ప్రార్థించుచున్నాడు. విశ్వాసులయందు ప్రభువు నామము, ప్రభువునందు విశ్వాసులు మహిమ పొందునట్లు పౌలు ప్రార్థించినాడు.

## 2వ అధ్యాయము 3+5+4+5=17 వచనములు
## అంశము : ప్రభువు దినమును గూర్చిన వివరణ - (ప్రస్తుత తప్పు)

ప్రభువు దినము ఒక 24గం॥ దినము కాదు. యేసు ఆకాశమండలమునకు రాగా సంఘము ఆయన యొద్దకు వెళ్లి ఏడేండ్ల తరువాత ప్రభువు శరీర రీతిగా తన వారిని యూదులను విమోచించుటకు భూలోకమునకు వచ్చు కాలమంతయు ప్రభువు దినము.

**ప్రభువు దిన ప్రారంభము (1-3వ.)** : ప్రభువు దినము అనగా ప్రభువు రెండవ రాకడ సంభవించినదని థెస్సలొనీకయులు తలంచినట్లుంది. పౌలు అలాగు పత్రిక వ్రాసాడని, లేదా ఆత్మ వలన ప్రవచనము చెప్పబడినదని ఎవరైనా చెప్పినందున ప్రభువు దినము వచ్చినదని వీరు తలంచిరి. ప్రభువు ఆకాశమండలమునకు రాగా సంఘ మంతయు ఆకాశమండలమునకు వెళ్ళి ఆయన యొద్ద కూడు కొందరు ఏండేండ్ల భూలోకములో శ్రమలు ప్రారంభమగును.. (సంఘము థెస్సలొనీకయ ఆకాశ మండలమునకు వెళ్ళలేదు కాని సంఘమునకు శ్రమలు కలుగుచున్నవని) 1 థెస్స. 3:1 వచన ప్రకారము తెలియుచున్నది. ఈ శ్రమలను బట్టి ప్రభువు దినము వచ్చినదని థెస్సలొనీకయులు తప్పుగా తలంచు చున్నారు. లోకములో భ్రష్టత్వము సంభవించాలి. నాశన పాత్రుడు, పాప పురుషుడగు క్రీస్తు విరోధి బయలుపడాలి. క్రీస్తు విరోధి ఆ దినమునకు ముందుగానే భూలోకములో ఉండును కాని క్రీస్తు ఆకాశ మండలమునకు రాగా సంఘము ఎత్తబడిన వెంటనే బయలుపడును.

**ధర్మ విరోధి గుణములు, బయలు పడుట - నాశనమగుట (4-8వ.)** : క్రీస్తు విరోధి బయలుపడి దేవుడనబడి, దేవాలయములో కూర్చుండి పూజింపబడును. ధర్మ విరోధ సంబంధమైన మర్మము మొదటి నుండి క్రియ చేయుచున్నందున సంఘములకు శ్రమ కలుగుచున్నది. కాని ధర్మ విరోధియగు క్రీస్తు విరోధి ఏడేండ్ల శ్రమల కాల

ప్రారంభములో బయలుపడును. ఏడేండ్ల చివర క్రీస్తు ప్రభువు ప్రకటన 19:8వ. ప్రకారము గొఱ్ఱెపిల్ల వివాహ అనంతరము ఒలీవల కొండపైకి వచ్చి క్రీస్తు విరోధిని ప్రకటన 19:20-21వ. ప్రకారము అగ్ని గుండములో వేయును.

**ధర్మ విరోధి రాక - వివరములు (9-21వ.)** : రక్షణకు అవసరమైన క్రీస్తునందలి ప్రేమను అనుసరించని వారు క్రీస్తు విరోధి రాకను గుర్తించలేరు. క్రీస్తు విరోధి రాక అబద్ధ విషయమైన బలముతోను సూచక క్రియలు, మహత్కార్యములతోను సాతాను కనుపరచు బలముతో నుండును. కనుక రక్షణను నిరాకరించినవారు క్రీస్తు విరోధి రాకడను గుర్తించలేరు. పాపమును ప్రేమించి క్రీస్తును నమ్మనివారు ఆ దినములలో అబద్ధములను నమ్మునట్లు మోసము చేయు శక్తిని దేవుడు వారికి పంపును. అందువలన లోకులకు క్రీస్తు రాకడ వివరములు తెలియవు.

**ప్రార్థన - స్తుతి (13-17వ.)** : మానవుల పట్ల దేవుని ఏర్పాటు ఏమిటో వ్రాయబడినది. దేవుని ఆత్మ ద్వారా మనము పరిశుద్ధ పరచబడి రక్షణ పొందుటకే దేవుడు మనలను ఏర్పరచుకొనెను. అందులకై దేవుని స్తుతించాలి. ఇది **మన గతకాల స్థితి.**

**14వ వచనము** : మన పిలుపును తెలుపుచున్నది. మనము రక్షించబడి యేసు యొక్క మహిమను పొందుటకై దేవుడు మనలను పిలిచాడు. 2 కొరింథీ. 3:18వ ప్రకారము మహిమ నుండి అధిక మహిమ పొందుచున్నాము. ఇది **మన ప్రస్తుత కాలస్థితి.** దేవుడు ప్రతి సత్కార్యమునందు, సద్వాక్యమునందు స్థిరపరచును గాక! ఇది **మన భవిష్యత్ కాలస్థితి.** ఈలాగున పౌలు ప్రార్థనలు స్తుతులు విశ్వాసి యొక్క భూత, వర్తమాన భవిష్యత్ కాలములకు చెందినవిగానున్నవి.

## 3వ అధ్యాయము 5+5+5+2=17 వచనములు
## అంశము : పని చేయకుండుటను గూర్చిన సవరణ
## (దిద్దుబాటును గూర్చి భవిష్యత్తుకు హెచ్చరికలు)

**ఒకరికొరకు ఒకరు ప్రార్థన (1-5వ.)** : పౌలు కొరకైన ప్రార్థన. పౌలు ద్వారా ప్రభువు వాక్యము బహు త్వరగా వ్యాపించబడు నిమిత్తము, దుష్టుల చేతులలో నుండి పౌలు తప్పింపబడు నిమిత్తము ప్రార్థించవలెనని కోరుచున్నాడు. 3-5 వచనములలో థెస్స లోనికయులపట్ల, పౌలు ఆకాంక్ష చెప్పబడినది. ప్రభువు కాపాడాలని స్థిరపరచవలెనని దేవునియందలి ప్రేమను, ఓర్పును కలిగియుండవలెనని చెప్పుచున్నాడు.

**మాదిరియైన జీవితమునకు హెచ్చరికలు (6-10వ.)** : పౌలు తన జీవిత మాదిరిని గూర్చి చెప్పుచున్నాడు. తానైతే ఎవరికి భారముగా నుండకూడదని థెస్సలోనికయలో నుండగాను (1 థెస్స. 2:9), ఎఫెసులో నుండగాను (అ.కా. 20:34) కొరింథులో నుండగను (1 కొరి. 4:12) స్వహస్తములతో పని చేసి జీవించాడు. అధికారము లేకకాదని మాదిరిగా ఉండు నిమిత్తమే ఆలాగు చేసాడు. ఎవడైనా పని చేయని యెడల భోజనము చేయకూడ దన్నాడు. అక్రమముగా నడుచుకొను వారి నుండి తొలగిపోవలెనని చెప్పుచున్నాడు.

**పని చేయని వారికి హెచ్చరిక (11-15వ.)** మనము ఇతరులకు మేలు చేయాలి కాని, పని చేయక ఇతరుల జోలికి పోవుట అక్రమమని సెలవిచ్చుచున్నాడు. పని చేయని వారిని శత్రువులుగా భావించక సహోదరులుగా భావించి బుద్ధి చెప్పాలి. వినని వారితో అవసరమైతే సాంగత్యము చేయకూడదు.

**ముగింపు - వందనములు (16-17వ.)** : ప్రభువు సమాధానము అనుగ్రహించాలని క్రీస్తు కృప తోడై ఉండాలని ముగించుచున్నాడు.

*గమనిక* : 1) 1 థెస్సలోనికయ పత్రిక ప్రభువు రాకడలోని ఆకాశమండలమునకు వచ్చుటను గూర్చి వివరించుచుండగా 2 థెస్సలోనికయ ప్రభువు రాకడలో భూమి పై జరుగు సంగతులు ప్రభువు భూమి మీదకు వచ్చు సంగతిని వివరించుచున్నది, 2) ప్రభువు రాకడను గూర్చి క్రొత్త నిబంధనలోని 27 పుస్తకములలో 315 పర్యాయములో ప్రస్తావించబడినది. మత్తయి మొదలు, ప్రకటన వరకు ఫిలెమోను పత్రిక, రెండవ మూడవ యోహాను పత్రికలలో తప్ప మిగిలిన అన్ని గ్రంథములలో ప్రభువు రాకడ ప్రస్తావించబడినది.

# తిమోతికి వ్రాసిన రెండు పత్రికలు

**తిమోతికి పత్రికలు :** తిమోతి లుస్త్ర పట్టణ నివాసి (అ.కా. 16:1-2వ.) అవ్వలోయి తల్లి యూదురాలైన యునీకె, తండ్రి గ్రీసు దేశస్థుడు. బాల్యము నుండి పరిశుద్ధ లేఖనములను ఎరిగినవాడు. అవ్వ, తల్లి విశ్వసించినవారు.

పౌలు మొదటి యాత్రలో లుస్త్ర పట్టణములో (అ.కా. 14:9) రాళ్ళతో కొట్టబడిన సందర్భమున తిమోతి క్రీ.శ. 47లో రక్షింపబడి 2 తిమోతి 3:10 ప్రకారము పౌలును వెంబడించెను. క్రీ.శ. 47-50 మధ్య తర్వాత లుస్త్ర, ఈకొనియ సహోదరుల వలన మంచి పేరు పొందినవాడు.

అ.కా. 16:3-5 వచనాల ప్రకారము పౌలుతో కలసి సంఘములను స్థిరపరచి, క్రొత్త సంఘము స్థాపనలో పాత్రకలవాడు. 1 థెస్స. 3:1, ఫిలిప్పీ. 2:20 ప్రకారము సహోదరుల క్షేమము విషయమై నిజమైన చింతగలవాడు. 1 తిమోతి 5:22 ప్రకారము కడుపు జబ్బు, తరచుగా వచ్చు ఇతర శరీర బలహీనతలు కలవాడు. 2 తిమోతి 1:7ను బట్టి పిరికితనము గలవాడని తలంచగలము. నమ్మకమైన వాడని పౌలు యొక్క జతపనివాడని పిలువ బడెను.

క్రీ.శ. 61-62లో పౌలు రోములోని చెరలోనుండెను. విడుదల పొందిన పిమ్మట తిమోతితో కలసి పౌలు ఎఫెసునకు వెళ్ళెను. సత్యమునకు భిన్నమైన బోధలు అక్కడ ఉన్నందున వాటిని సవరించుటకై తిమోతిని ఎఫెసులో విడిచి మాసిదోనియాకు వెళ్ళెను. (1 తిమోతి 1:3-4వ.) తదుపరి జీవముగల దేవుని సంఘములో జనులు ఏలాగు ప్రవర్తింప వలెనో తెలుపు నిమిత్తము ఈ మొదటిపత్రిక క్రీ.శ. 63లో వ్రాసెనని 3:14-15 వచనములలో చూచుచున్నాము. సంఘములో ప్రకటన, ప్రార్థన, పాలన, పరిచర్య, పవిత్రత ప్రయాస వరుసగా 1-6 అధ్యాయముల సారాంశము. పౌలు మరలా రెండవసారి రోములోని చెరలో క్రీ.శ. 65-66లో నుండి తన నిర్యాణ కాలము సమీపించినపుడు తిమోతికి రెండవ పత్రిక వ్రాసెను. కావున రెండవ పత్రిక క్రీ.శ. 66లో వ్రాసెనని తలంచగలము. ఈ పత్రికయందు క్రీస్తు యొక్క పనివాడు కలిగియుండవలసిన గుణములను, పోలికలను, మెలుకువలను. పోరాటమును గూర్చి 1,2,3,4 అధ్యాయములలో వ్రాసెను. ఇది పౌలు వ్రాసిన చివరి పత్రిక. క్రీ.శ. 67లో నీరో చక్రవర్తిచే పౌలు శిరచ్ఛేదమును చేయబడెను. తిమోతి చివరి దినముల వరకు ఎఫెసులో సంఘ పెద్దగానుండెను.

ఎఫెసులో అర్తెమిదేవి గుడి సమీపమున జరుగు తిరునాళ్ళలలో విగ్రహారాధనకు వ్యతిరేకముగా బోధించుచుండగా దుడ్డుకర్రలతో కొట్టబడి క్రీ.శ. 67లో చంపబడ్డాడు. కాన్‌స్టాంటినోపిల్ పట్టణమందు అతని ఎముకలు పాతి పెట్టబడినవి. తిమోతి అను పేరుకు దేవుని ఘనపరచువాడు అని అర్థము. తిమోతి జీవితమందు సహోదరుల వల్ల సేవకు పంపబడుట, మంచి పేరు పొందినవాడు కనుక సంఘములోని జనుల ప్రవర్తనను గూర్చి పనివారి ప్రవర్తన గురించి తిమోతి మొదటి పత్రికలోను రెండవ పత్రికలోను వరుసగా పౌలు వ్రాసెను. తిమోతి ప్రియమైన కుమారుడని 2 తిమోతి 1:1లో నేర్చుకొనుచున్నాము.

# తిమోతికి వ్రాసిన మొదటి పత్రిక

గ్రంథకర్త : పౌలు . **కాలము** : క్రీ.శ. 63 స్థలము : మాసిదోనియా.

**ముఖ్య ఉద్దేశము** : సంఘంలో జనుల ప్రవర్తన (3:14)

**అధ్యాయాల విభజన** : ఎ. 1-3 అధ్యా. బోధ. 1 అ. ప్రకటన, 2 అ. ప్రార్థన, 3. అ. పాలన, బి. 4-6 అధ్యా. నడక. 4 అ. పరిచర్య 5 అ. పవిత్రత - పై విచారణ, 6 అ. ప్రవర్తన ప్రయాసను గూర్చిన హెచ్చరికలు.

## 1వ అధ్యాయము 2+2+3+4+6+3=20 వచనములు
## అంశము : సంఘములో ప్రకటన

**శుభములు (1-2వ.)** : సంఘములోని ప్రవర్తన గూర్చి వ్రాయుచున్నందున పౌలుతన అధికారమునకు గుర్తుగా తనను అపొస్తలుడుగా పరిచయం చేసుకొన్నాడు. దేవుడు మనకు రక్షణ ఇవ్వగా క్రీస్తు యేసు సంఘమునకు రక్షణ అని తెలుపుచున్నాడు.

**ప్రకటనలో చేయకూడనివి (3-4వ.)** : మాసిదోనియా వెళ్ళుచుండగా అని ఉన్నందున పౌలు మాసిదోనియాకు వెళ్ళిన పిదప మాసిదోనియా నుండి రోములోని రెండు చెరల మధ్య కాలమున బహుశ క్రీ.శ. 63లో ఈ పత్రిక వ్రాసెను అ.కా. 20:28-31 వరకు వంకర మాటలు పలుకు మనుష్యులు మీలోనే బయలుదేరుదురని ఎఫెసీ. సంఘ పెద్దలకు చెప్పెను. ఆ ప్రకారమే సంఘములో సత్యమునకు భిన్నమైన బోధలు, కల్పనా కథలు, మితములేని వంశావళులు ఉన్నందున అవి ఉండకూడదని హెచ్చరించెను. 5-7వ.

**ప్రకటనలోని సారాంశము** : 1. పవిత్ర హృదయము మంచి మనస్సాక్షి. కపటములేని విశ్వాసము నుండి కలుగు ప్రేమను కలిగి ప్రకటించాలి. కాని కొందరు వీటిని మానుకొని నిష్ప్రయోజనమైన ఉపదేశకులై ఉన్నారని తెలుపుచున్నాడు. 8-11వ. ప్రకటనలో

ధర్మశాస్త్రం **ఉపయోగించు విధము** : ధర్మశాస్త్రము పాపమును చూపించుచున్నది కనుక పాపములో ఉన్నవారికి నియమించ బడింది. నీతిమంతులు దానిని ధర్మానుకూలముగా ఉపయోగించుట మేలుకరము అని చెప్పాడు.

**ప్రకటించిన పరిచర్యకు నియమించబడిన పౌలు (12-17వ.)** : పౌలు పూర్వము దూషకుడు హానికరుడు హింసకుడై పాపులలో ప్రధాన పాపియైనను దేవుడు రక్షించి తల్లి గర్భములో పడినపుడే తన సేవకు ప్రత్యేకపరచి నియమించాడు. (గలతీ. 1-15) (పౌలు జీవితచరిత్ర ప్రారంభములో చూడండి)

**తిమోతికి హెచ్చరికలు (18-20వ.)** : హుమెనైయును, అలెక్సంద్రును మంచి మనస్సాక్షిని త్రోసివేసి విశ్వాస విషయములో ఓడ బద్దలైపోవు వానివలె అపాయకరమైన పరిస్థితిలో ఉన్నారు. తిమోతి అలా ఉండక మంచి మనస్సాక్షి విశ్వాసము కలవాడై మంచి పోరాటము పోరాడవలెనని చెప్పుచున్నాడు.

## 2వ అధ్యాయము 7+1+7=15 వచనములు
## అంశము : సంఘములో ప్రార్థన

**విభజన - ప్రార్థన (1-7వ.)** : ఎవరికొరకు ప్రార్థన చేయవలెనో 2వ.లో చెప్పుచున్నాడు. ఏ రీతిన ప్రార్థించాలో 2వ.లో చెప్పుచున్నాడు. ప్రార్థించుట ద్వారా మనకు ఏమి కలుగునో 1వ.లో చెప్పుచున్నాడు. ప్రార్థనా ఉద్దేశమును దేవుని ఇష్టమును 3-4వ.లో తెలుపుచున్నాడు. మనుష్యులందరి రక్షణ కొరకు యేసుక్రీస్తు నరుడై మధ్యవర్తియై తన్నుతాను విమోచన క్రయ ధనముగా సమర్పించుకొనినందున అట్టి కార్యము నిమిత్తమై మనుష్యులందరి కొరకు ప్రార్థనలు విజ్ఞాపనలు (పట్టుదలతో కూడిన ప్రార్థన) యాచనలు, (బిచ్చగాడివలె బ్రతిమిలాడుట), కృతజ్ఞతాస్తుతులు. (దేవుడు జవాబు ఇచ్చునని నిరీక్షణ కలిగి స్తుతించడం)

**సంఘములో పురుషుల - స్త్రీల ప్రార్థనా పద్ధతి (8-9వ.)** : పురుషులు స్త్రీలు వ్యక్తి గతముగా ఇంటిలోను ప్రార్థించినను సంఘము కూడు ప్రతి స్థలములోను పురుషులు పవిత్రమైన చేతులెత్తి ప్రార్థించాలి. స్త్రీలు అణకువగా ఉండాలి. అనగా స్త్రీలు సంఘములో గట్టిగా ప్రార్థించరాదు. పురుషులు పవిత్రత కలిగి కోపము సంశయములు లేనివారై ప్రార్థించాలి.

**సంఘములలో స్త్రీలు అనుసరించవలసిన పద్ధతి (9:5వ.)** : స్త్రీలకు సత్క్రియలే నిజమైన అలంకరణ బాహ్యమైన అలంకరణను అలంకరించుకొన కూడదు, సంఘము

లలో స్త్రీలకు ఉపదేశించడం కాని పురుషునిపై అధికారం చేయుటకు కాని సెలవు లేదని చెప్పుచున్నాడు. స్త్రీలు స్వస్థబుద్ధి కలిగి విశ్వాసము ప్రేమ పరిశుద్ధతల యందు నిలకడగ ఉండవలెనని చెప్పుచున్నాడు. దీని వివరణగా సృష్టి క్రమములో మొదట ఆదాము తరువాత హవ్వ నిర్మించబడిరని స్త్రీ మోసపరచబడి అపరాధములో పడెను. ఆదాము మోసపరచబడలేదు. అపరాధ పరిహారార్థ బలిలో నష్టమును భరించినట్లు (లేవి. 6:4-5) స్త్రీలు ఆ క్రమమును పాటించవలెను. (స్త్రీల పరిచర్యను గూర్చి 1 కొరింథీ. 14:34వ.లో చెప్పబడినది)

## 3వ అధ్యాయము 7+6+3=16 వచనములు
## అంశము : సంఘములో పాలన

**విభజన - పెద్దలను గూర్చి విధి (1-7వ.)** : అ.కా. 20:28-31వ.లలో పెద్దలు తాము ప్రవర్తన విషయములోను మంద యొక్క ప్రవర్తన విషయములోను జాగ్రత్తగా ఉండాలి. అధ్యక్షులు, పెద్దలు, కాపరులు పై విచారణ కర్తలు అను పదములన్నియు పెద్దలను సూచించును. పెద్దయగువాడు 1) వ్యక్తిగతంగా నిందా రహితుడుగాను, 2) కుటుంబముగా ఏకపత్నీ పురుషుడు, తమ పిల్లలను స్వాధీన పరచుకొనువాడు, తన ఇంటివారిని బాగుగా ఏలువాడుగా ఉండాలి, 3) సమాజములో మితానుభవము గలవాడుగాను, స్వస్థబుద్ధి గలవాడుగాను, మర్యాదస్థుడుగాను ఉండి మద్య పానీయు, కొట్టువాడు జగడమాడువాడు కాక ధనాపేక్ష లేనివాడై సాత్వికుడుగాను ఉండాలి, 4) సంఘములో బోధింప తగినవాడుగాను, అతిథి ప్రియుడుగాను ఉండాలి సంఘములో క్రొత్తగా చేరినవాడై యుండకూడదు, 5) సంఘమునకు వెలుపటి వారి ద్వారా మంచి సాక్ష్యము పొందినవాడుగాను ఉండాలి.

**పరిచారకులను గూర్చిన విధి (8-13వ.)** : పరిచర్య చేయువారు ఇంచుమించుగా పైన చెప్పబడిన గుణములనే కలిగియుండాలి. పరిచారకుల గుణములు అ.కా. 6:1-6వ.లలో చెప్పబడినవి. పరిచర్య చేయుటలో స్త్రీలు కూడ ఉండుట గమనించగలము. కెంక్రేయలో ఫీబే సంఘ పరిచారకురాలుగా ఉన్నదని రోమా. 16:1 నుంచి నేర్చుకొను చున్నాము.

**పత్రిక సారాంశము (14-16వ.)** : నిరాక్షేపమైన దేవుడు ఆయన యందుంచవలసిన భక్తి 1:3వ.లో తిమోతిని ఎఫెసులో విడిచిన పోలే శీఘ్రముగా ఎఫెసుకు వెళ్ళవలెనని

తలంచెను కాని ఆలస్యమైన యెడల సంఘములలో జనుల ప్రవర్తన అను అంశమును ఈ గ్రంథముగా వ్రాసిపంపెను. యేసుక్రీస్తు క్రింద చెప్పబడిన విషయములను బట్టి ఎవరును ఆక్షేపింపని దేవుడు. జనులందరు ఆయనయందు భక్తిని ఉంచాలి.

1. ఆయన సశరీరుడుగా ప్రత్యక్షమైయెను. హెబ్రీ. 2:14, హెబ్రీ. 10:5, 10వ. యోహాను 1:1-14వ. హెబ్రీ. 9:26వ.

2. ఆత్మ విషయమున నీతిపరుడు దేవుడు అని తీర్పు పొందెను. రోమా 3:11వ. యెషయా 53:11వ, యోహాను 8:46వ, హెబ్రీ. 7:26వ.

3. దేవదూతలకు కనబడెను. లూకా 2:9వ, మత్తయి 1:13వ, అ.కా. 9:1వ.

4. రక్షకుడని జనములలో ప్రకటింపబడెను. మత్తయి 1:21వ, లూకా 2:9వ. 1 తిమోతి 4:10వ, మత్తయి 28:19వ.

5. లోకమందు నమ్మబడెను. యోహాను 12:19, ఫిలిప్పీ, 3:10.

6. ఆరోహణుడు. అ.కా. 1:9, కొలస్స. 3:1.

7. తేజోమయుడైను. ప్రకటన 1:16, 21:23.

## 4వ అధ్యాయము 6+4+6=16 వచనములు
## అంశము : సంఘములో పరిచర్య

**విభజన - మంచి పరిచారకుడుగా దైవభక్తిని అనుసరించుట - ప్రకటించుట (1-6వ.):** కడవరి దినములలో దయ్యముల బోధయందు లక్ష్యముంచువారు అబద్ధికుల వేషధారణ వలన మోసపోవువారు విశ్వాస భ్రష్టులగుదురు. కనుక మంచి పరిచారకుడు దయ్యముల బోధయందు కాక విశ్వాస సుబోధ సంబంధమైన వాక్యము చేత ఎదగాలి. ఈ మంచి బోధను సహోదరులకు వివరించాలి. ఇది మంచి పరిచారకుల లక్షణము.

**ప్రయోజనకరమైన పరిచారకుడుగా దైవభక్తిని సాధకము చేయుట (7-10వ.) :** లోకమందున్న శరీర సంబంధమైన సాధకముగుట కొంచెము మట్టుకే ప్రయోజనము కాని దైవభక్తి ఇప్పటి జీవము విషయములోను రాబోవు జీవము విషయములలోను ప్రయోజనకరమైనది. కనుక దైవభక్తిని ప్రయాసముతో సాధకము చేసుకొనుటయందు పాటుపడాలి.

**అభివృద్ధినొందు పరిచారకుడుగా బోధయందు జాగ్రత్తగానుండుట (11-16వ.)** : పరిచారకుడు ఎవరిచేత తృణీకరింపబడకూడదు, 1. మాటయందు, 2. ప్రవర్తనయందు, 3. ప్రేమయందు, 4. విశ్వాసమందు, 5. పవిత్రతలో మాదిరిగా ఉండాలి.

1. లేఖనము చదువుటయందు, 2. హెచ్చరిక చేయుటయందు, 3. బోధించుట యందు జాగ్రత్తగా ఉండాలి, 4. అభివృద్ధి అందరికి తేటగా కనిపించాలి. 5. నిలకడగా ఉండాలి ఇవియే అభివృద్ధికి గల పరిచారకుని లక్షణాలు.

## 5వ అధ్యాయము 3+5+5+3+4+5=25 వచనములు
## అంశము : పవిత్రత పై విచారణ ప్రయాసను గూర్చిన హెచ్చరికలు

**విభజన - అందరిని హెచ్చరించుట (1-3వ.)** : సంఘములలో పొరబాటులు జరిగినపుడు అన్నదమ్ములని యౌవనస్థులను, అక్కచెల్లెండ్రని పూర్ణ పవిత్రతో యౌవన స్త్రీలను, తల్లులని వృద్ధ స్త్రీలను హెచ్చరించాలి. వృద్ధులయితే తండ్రులుగా భావించి గద్దింపక హెచ్చరించాలి.

**విధవరాండ్రుల పోషణ, పవిత్రతను, గూర్చిన హెచ్చరిక (4-8వ.)** : విధవరాలికి పిల్లలుగాని మనుమలుగాని యుండిన యెడల వీరు తమ తల్లిదండ్రులకు ప్రత్యుప కారము చేయాలి. స్వకీయులను పోషింపలేనివాడు అవిశ్వాసికంటే చెడ్డవాడు. అనాథులైన విధవరాలు దేవునియందు నిరీక్షణ కలిగి ప్రార్థనలో నిత్యము నిలకడగా ఉండాలి. సుఖభోగములయందు ప్రవర్తింపకూడదు.

**విధవరాండ్రుగా లెక్కించువారు (9-13వ.)** : అరవైయేండ్ల కంటే తక్కువ వయస్సు లేక (పని చేయుటకు తగిన శక్తిలేనివారు) ఒకే పురుషునికి భార్య అయి ఉండి మంచి క్రియల యందు పేరుపొంది తన జీవిత కాలములో పిల్లలను పెంచి పరదేశులకు ఆతిథ్యమిచ్చి పరిశుద్ధుల పాదములు కడిగి శ్రమపడువారికి సహాయము చేసే వ్యక్తి అయి ఉండాలి. ఇటువంటి విధవరాలికి సంఘము సహాయము చేయవలెను. యౌవనస్థులైన విధవ రాండ్రను ఈ లెక్కలో చేర్చకూడదు.

**యౌవ్వన స్త్రీలకు హెచ్చరికలు (14-16వ.)** : యౌవన స్త్రీలు వివాహము చేసుకొని విరోధికి అవకాశము ఇవ్వకుండా ఇంటిలోను బయటను జాగ్రత్తగా ఉండాలి. ఇంతకు ముందే కొంతమంది తప్పిపోయి ఉండిరి. విశ్వాసరాండ్రయిన స్త్రీలు తమ ఇంటికి చెందిన విధవరాండ్రకు సహాయము చేయవలెను కాని వారిని సంఘమునకు భారముగా ఉంచకూడదు.

**పెద్దలను గూర్చిన హెచ్చరికలు (17-20వ)** : బాగుగా పాలన చేయు పెద్దలను వాక్యమందును ఉపదేశమందును ప్రయాసపడు వారిని సంఘము రెట్టింపు సన్మానమునకు పాత్రులుగా ఎంచాలి. పని చేయు పెద్దల అవసరములను సంఘములోని సహోదరులు తీర్చాలి. సర్వ సాధారణంగా పెద్దలు తమ అవసరముల కొరకై కష్టపడి పని చేయుదురు. 18వ.లో పనివాడు తన జీతమునకు పాత్రుడు అని ఉన్నందున పని కొరకై అ.కా. 13:2 ప్రకారము ప్రత్యేకించబడిన పనివాని గూర్చి 18వ. వచనములో చెప్పబడినది అని గుర్తించవలెను. ప్రత్యేకించబడిన పనివాడు పెద్దగా నుండిన యెడల వాని అక్కరలు సంఘము తీర్చాలి. పాపము చేయువారిని గద్దించాలి కాని పెద్ద మీద సాక్షులు ఉంటే తప్ప ఏ దోషము ఆరోపించకూడదు.

**తిమోతికి హెచ్చరికలు (21-25వ.)** : సంఘములోని ఏ పరిచర్య అయినను పక్షపాతముగానైన విరోధ భావముతో చేయక పవిత్రుడుగా ఉండవలెనని హెచ్చరించెను. తిమోతి ఇప్పుడు ఎఫెసులో ఉన్నను తరుచుగా కడుపునొప్పి శరీర బలహీనతలు కలిగి యున్నాడు. పౌలు ఎఫెసులో ముందుగా మూడేండ్లు పని చేసినపుడు అనగా క్రీ.శ. 56లో అతని చేతిగుడ్డలు కాని నడికట్టులు కాని ఎవరికైన తగిలిన యెడల వారి జబ్బులు బాగయ్యెను. తిమోతి ఇప్పుడు ఎఫెసులోనున్నను పౌలు ఆలాగు చేయక ద్రాక్షరసమును పుచ్చుకొనుమనుటలో స్వస్థత వరములు శాశ్వతము కాదని తెలుసుకొనవలెను. దేవుడు తన శక్తిని బట్టి ఎట్టివారినైనను ఏ సమయములోనైనను స్వస్థపరచగలడు అని గుర్తించుకొనవలెను, కాని ఆ వరములు శాశ్వతము కావు.

## 6వ అధ్యాయము 2+4+4+4+2+3+2=21 వచనములు
## అంశము : ప్రయాసను గూర్చి హెచ్చరిక

**దాసులకు హెచ్చరిక (1-2వ.)** : సమాజములో దాసులుగా ఉన్నవారు తమ యజమానులు పూర్ణమైన ఘనతకు పాత్రులని ఎంచవలెను. ఒకవేళ యజమానులు విశ్వాసులైతే సహోదరులని తృణీకరించక, సేవాఫలము పొందువారు ప్రియులు కనుక మరి ఎక్కువగా సేవ చేయాలి లేనియెడల దేవుని నామము ఆయన బోధ దూషించ బడును.

**వ్యర్థముగా ప్రయాసపడు వారికి హెచ్చరికలు (3-6వ.)** : దైవభక్తికి అనుగుణమైన బోధను అంగీకరింపక దైవభక్తిని లాభ సాధనము అనుకొని భిన్నమైన బోధలు ఉపదేశించు

వారు కలరు. అట్టి వారి ప్రయాసము వ్యర్థము దాని వలన అసూయలు, కలహములు, దూషణలు, దుర్మణములు చెడిన మనస్సు కలుగును, కాని సంతుష్టి సహితమైన దైవభక్తి గొప్ప లాభసాధనమే!

**ధనవంతులగుటకు అపేక్షించు వారికి హెచ్చరిక (7-10వ.)** : మనము ఈ లోకము లోనికి ఏమియు తీసుకొనిరాలేదు. కనుక లోకములో నివసించునంత కాలము దేవుడిచ్చిన అన్న వస్త్రములు కలవారమై సంతృప్తి కలిగియుండుట నేర్చుకోవాలి కాని ఈ లోకములో ధనవంతులగుటకు అపేక్షించువారు శోధనలలో పడి దురాశలకులోనై నష్టమును నాశనమును తెచ్చుకొందురు. కొందరు ధనమును అపేక్షించి విశ్వాసము నుండి తొలగిపోయిన వారు కలరు. కనుక ధనాపేక్ష సమస్త కీడులకు మూలము.

**దైవజనుడైన తిమోతికి హెచ్చరిక (11-14వ.)** : దైవజనుడు పైన చెప్పబడిన వాటిని విసర్జించి నీతిని భక్తిని విశ్వాసమును ప్రేమను ఓర్పును సాత్వికమును సంపాదించు కొనుటకు ప్రయాసపడుచు క్రీస్తు ప్రత్యక్షమగు వరకు నిష్కల్మషముగాను నిందా రహితముగాను జీవించాలి. 2 తిమోతి 3:16లో దైవజనుడు ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడియుండాలని ప్రతి లేఖనము ఉపదేశించుట ఖండించుట తప్పు దిద్దుట నీతియందు శిక్ష చేయవలెనని చెప్పచుండవలెను.

**ప్రభువు ఔన్నత్యమును గూర్చి హెచ్చరిక (15-16వ.)** : యేసు ప్రభువు 1) శ్రీమంతుడు, 2) అద్వితీయుడు, 3) సర్వాధిపతి, 4) రాజులకు రాజు, 5) ప్రభువులకు ప్రభువు, 6) సమీపింపరాని తేజస్సులో నివసించువాడు, 7) అమరత్వము కలవాడు. 8) ఘనత కలవాడు, 9) ప్రభావము కలవాడు అని ప్రభువును గురించి చెప్పుచున్నాడు.

**ధనవంతులైన వారికి హెచ్చరిక (17-19వ.)** : ఈ లోకమందు ధనవంతులగు వారు ధనమునందు నమ్మికయుంచక దేవునియందే నమ్మికయుంచాలి. ఆయనే మనకు సుఖమును అనుభవించుటకు, సమస్తమును మనకు ధారాళముగా దయచేయువాడు. కనుక తమ ధనములో ఇతరులకు పాలిచ్చుచూ సత్క్రియ అను ధనము కలిగి రాబోవు కాలమునకు మంచి పునాది వేసుకొనవలెను.

**ముగింపులో తిమోతికి హెచ్చరికలు (20-21వ.)** : 1) దేవుడు అప్పగించిన దానిని కాపాడాలి, 2) అపవిత్రమైన మాటలకు అబద్ధముగా చెప్పబడిన విపరీత వాదములకు దూరముగా ఉండాలి. ఆ విషయములో కొందరు ప్రవీణులమనుకొని విశ్వాస విషయములో తప్పిపోయిరని హెచ్చరించెను.

# తిమోతికి వ్రాసిన రెండవ పత్రిక

గ్రంథకర్త : పౌలు . కాలము : క్రీ.శ. 66 స్థలము : రెండవరోములోని చెర.

**ముఖ్య ఉద్దేశము** : క్రీస్తు యొక్క పనివాడు.

పౌలు రోముకు చెరకు వెళ్ళినపుడు అ.కా. 28:21వ వచనములో "నిన్ను గూర్చి చెడుతనము తెలియపరచలేదు" అని ఉన్నది. కాని 2 తిమోతి 2:9లో "నేను నేరస్థుడనై యున్నట్లు సువార్త విషయమై సంకెళ్ళతో బంధింపబడి, శ్రమ పడుచున్నాను" అన్నాడు. అందువలన రోములో రెండు పర్యాయములు చెరలోనున్నట్లు తలంచగలము. ఫిలేమోను 24వ. దేమా జతపనివాడని ఉన్నది. కాని 2 తిమోతి 4:10లో దేమా ఇహ లోకములోనికి వెళ్ళెనని ఉన్నది. ఈ మాటలను బట్టియు ఫిలేమోను పత్రిక రోములోని మొదటి చెరలో వ్రాయబడెనని, 2 తిమోతి రెండవ చెరలో క్రీ.శ. 66లో వ్రాయబడెనని గమనించగలము. ఈ రెండు చెరల మధ్యనున్న వ్యవధికాలములో 1 తిమోతి పత్రిక, తీతు పత్రికలందు పౌలు ప్రయాణ వివరములు కలవు. కనుక 1 తిమోతి పత్రిక, క్రీ.శ. 63లోను, తీతు పత్రిక, క్రీ.శ. 64లోను విడుదల కాలమందు వ్రాయబడెనని గ్రహించు చున్నాము.

గ్రంథ విభజన : 1 అ. పనివాని గుణములు, 2 అ. పనివాని పోలికలు, 3 అ. పనివాని మెలుకువలు, 4 అ. పనివాని పోరాటం.

## 1వ అధ్యాయము 2+6+6+4=18 వచనములు

## అంశము : పనివాని గుణములు

**శుభములు (1-2వ.)** : ఈ పత్రికలో సంఘములలో విశ్వాస విషయమైన భ్రష్టత్వము ప్రవేశించినదని చెప్పుచున్నందున పనివాడు చేయవలసిన కార్యములను చెప్పుచున్నాడు కనుక తన అపొస్తలత్వమును అనగా తన అధికారమును జ్ఞాపకము చేయుచున్నాడు.

**పనివాని యొక్క 7 గుణములు (3-8వ.)** : 1) 4వ. నిష్కపటమైన విశ్వాసము కలవాడు, 2) 3వ. కన్నీటి ప్రార్థన చేయువాడు, 3) 6వ. కృపావరము ప్రజ్వలింప చేయువాడు, 4) 7వ. పిరికితనము లేనివాడు, 5) 8వ. సువార్త నిమిత్తము శ్రమపడువాడు, 6) 8వ. సిగ్గుపడని వాడు, 7) 8వ. శ్రమానుభవములో పాలివాడు.

**పనివాని యొక్క మరో "7" గుణములు (9-14వ.)** : 1) 10వ. పరిశుద్ధమైన పిలుపుతో పిలువబడినవాడు, 2) 11వ. సువార్త ప్రకటించువాడు, 3) 11వ బోధకుడుగా నియమింపబడినవాడు, 12వ విశ్వాస ప్రేమలు కలవాడు, 4) 12వ. ప్రభువు కాపుదలను యాథిగా నమ్మువాడు, 5) 13వ. విశ్వాస ప్రేమలు కలవాడు, 6) 13వ. హితవాక్య ప్రమాణం గైకొనువాడు. 7) 14వ. అప్పగింపబడిన దానిని కాపాడువాడు. తన తరువాత తరముల వారికి తాను నేర్చుకొనిన సంగతులు అప్పగించువాడు.

**మాదిరిలేని పనివాడు - మాదిరియైన పనివాడు (15-18వ.)** : 1) 15వ. మాదిరి లేని పనివారైన పుగెల్లు హెర్మొగెనే పౌలును విడిచిపోయిన ఆసియాలోని వారిని గూర్చి చెప్పబడినది. 16-18వ.లలో మాదిరియైన పనివాడగు ఒనేసి ఫోరు యొక్క "6" గుణములు కలవు. 1) రోమా చెరలో నున్న పౌలు యొద్దకు వచ్చెను. 2) పౌలు సంకెళ్ళను గురించి సిగ్గుపడలేదు, 3) పౌలు కొరకు శ్రద్ధగా వెదికెను, 4) పౌలును కనుగొనెను, 5) అనేక పర్యాయములు ఆదరించెను, 6) ఎఫెసులో కూడా పౌలుకు ఉపచారము చేసెను. ఇట్టివారు ప్రభువు వలన కనికరము పొందుదురు. ఈ అధ్యాయములో పనివారికి ఉండవలసిన "20" గుణములు కలవు.

## 2వ అధ్యాయము 6+7+6+7=26 వచనములు
## అంశము : పనివాని పోలికలు

**విభజన - పనివాని సామర్థ్యము నమ్మకత్వమును గూర్చిన '6' పోలికలు (1-6వ.)** : 1) 1వ. బలవంతుడు, 2) 2వ. తాను వినిన సంగతులు తన తరువాత రానున్న మూడు తరములకు అప్పగించబడు ఏర్పాటు చేసినవాడు, 3) 3వ సైనికుడు, 4) 4వ జీవన వ్యాపారములలో చిక్కుకొననివాడు, 5) 5వ నియమము ప్రకారము పోరాడి కిరీటము సంపాదించుకొను జెట్టియైనవాడు, 6) 6వ పాటుపడు వ్యవసాయకుడు.

**పనిని గూర్చిన ఆలోచన (7-13వ.)** : 1) 8వ. మన కొరకు మృతిపొంది తిరిగి లేచిన క్రీస్తును జ్ఞాపకము చేసికొనవలెను, 2) 9వ. మనము బంధించబడినను సువార్త బంధించబడకూడదు, 3) 10వ. ఇతరులు రక్షించబడు నిమిత్తము శ్రమలనన్నిటిని ఓర్చుకొనాలి. 4) 11వ మనమాయనతో చనిపోయిన వారమైతే అయనతో బ్రతుకుదుము, 5) 12వ మనమాయనతో సహించినవారమైతే ఆయనతో కూడా ఏలుదుము, 6) 12వ మన మాయనను ఎరుగమంటే ఆయన మనలను ఎరుగనను, 7) 13వ. మనము నమ్మలేని వారమైనను ఆయన నమ్మతగినవాడుగా నుండును.

**ఉపదేశించువాడు (14-19వ.)** : 1) 15వ. యోగ్యుడుగానుండాలి, 2) 15వ. సిగ్గుపడ నక్కరలేని పనివాడుగానుండాలి, 3) 16వ. అపవిత్రమైన వట్టి మాటలకు విముఖుడై ఉండాలి, 4) 18వ. ఇతరుల విశ్వాసమును చెరుపువారముగా నుండరాదు, 5) వాక్య సత్యము విషయమై తప్పిపోకూడదు.

**యజమానుడు వాడుకొనుపాత్ర (20-26వ.)** : 1) 21వ. పవిత్రమైన పాత్ర, 2) 21వ ఘనత నిమిత్తమైన పాత్ర, 3) 24వ సాత్వికుడు, 4) 25వ జగడమాడని వాడు, 5) 26వ సాధువు, 6) 26వ సమర్థుడు, 7) 26వ. కీడును సహించువాడు.

## 3వ అధ్యాయము 5+4+4+4=17 వచనములు
## అంశము : పనివాని మెలుకువలు

**పనివాడు విముఖుడుగా నుండవలసినవారు (1-5వ.)** : 1) 2వ. స్వార్థ ప్రియులు, 2) 2వ. ధనాపేక్షులు, 3) 2వ. బింకములాడువారు, 4) 2వ. అహంకారులు, 5) 2వ. దూషకులు, 6) 2వ తల్లిదండ్రులకు అవిధేయులు, 7)2వ. కృతజ్ఞతలేనివారు, 8) 2వ. అపవిత్రులు, 9) 3వ అనురాగ రహితులు, 10) 3వ. అతి ద్వేషులు, 11) 3వ. అపవాదకులు, 12) 3వ. అజితేంద్రియులు, 13) 3వ. క్రూరులు, 14) 3వ. సజ్జన ద్వేషులు, 15) 3వ ద్రోహులు, 16) 3వ మూర్ఖులు, 17) 3వ. గర్వాంధులు, 18) 3వ. దేవుని కంటే సుఖానుభవమును ఎక్కువగా ప్రేమించువారు, 19. 5వ. పైకి భక్తిగలవారువలె నుండి దాని శక్తిని ఆశ్రయించనివారు.

**వారి చర్యలు (6-9వ.)** : 1) 6వ. పాప భరితులుగానుందురు, 2) 6వ. దురాశల వలన నడిపింప బడుదురు, 3) 7వ. ఎల్లప్పుడు నేర్చుకొనుచున్నను, సత్య విషయమైన అనుభవ జ్ఞానము పొందలేనివారు. 4) 7వ. అవివేక స్త్రీల ఇండ్లలో చొచ్చినవారిని చెరపట్టు కొనిపోదురు, 5) 8వ. ఎదిరించుదురు, 6) 8వ. చెడిన మనసు కలిగియుందురు. 7) 8వ. విశ్వాస విషయమై భ్రష్టులుగా నుందురు. 8) 8వ. సత్యమును ఎదిరింతురు, 9) 9వ. అవివేకము తేటపడును, 10) 9వ. ముందుకు సాగలేరు.

**సద్భక్తితో బ్రతుకుట (10-13వ.)** : పౌలు, లుస్త్ర పట్టణములో మొదటి సేవా యాత్రలో కనుపరచిన సద్భక్తి చెప్పబడినది. 1) పౌలు బోధ, 2) ప్రవర్తన, 3) ఉద్దేశము, 4) విశ్వాసము, 5) దీర్ఘశాంతము, 6) ప్రేమ, 7) ఓర్పు, 8) హింసలు సహించుట, సద్భక్తితో బ్రతుకువారు పై గుణములను కలిగియుండాలి.

**సద్భక్తిని బోధించుట(14-17వ.) :** పనివాడు సద్భక్తిని బోధించవలెను. కనుక సద్భక్తిని వివరముగా తెలుపు పరిశుద్ధ లేఖనములను తిమోతివలె 1) ఎరుగుచుండాలి, 2) దినదినము నేర్చుకొను చుండాలి, 3) రూఢి అని తెలుసుకోవాలి, 4) వాటియందు తాను నిలకడగా ఉండాలి, 5) లేఖనములను ఉపదేశించుచూ, ఖండించుచూ, తప్పు దిద్దుచూ, నీతియందు శిక్ష చేయుచు సద్భక్తిని బోధించాలి.

## 4వ అధ్యాయము 8+10+4=22 వచనములు
## అంశము : పని వాని పోరాటము

**విభజన - పోరాటపు గురియైన కిరీటము (1-8వ.) :** 1,2 వచనములలో పోరాడు వాడు చేయవలసిన పనులను చెప్పుచున్నాడు.

1. వాక్యమును ప్రకటించాలి, 2) అనుకూల సమయమందు ప్రయాసపడాలి, 3) ప్రతికూల సమయమందును ప్రయాసపడాలి, 4) సంపూర్ణ దీర్ఘశాంతముతో ఉపదేశము చేయాలి. ఖండించాలి, గద్దించాలి. బుద్ధి చెప్పాలి. 3-4వ.లలో పనివాని మెలుకువలు చెప్పుచున్నాడు. ఎందుకనగా జనులు హితబోధను సహింపరని తమ దురాశకు అనుకూలమైన బోధకులను ప్రోగుచేసుకొని సత్యమునకు చెవి నివ్వరని కల్పనా కథలకు తిరుగుదురని హెచ్చరించుచున్నాడు. 5-6వ.లలో చివరిగా మరికొన్ని హెచ్చరికలు ఇచ్చుచున్నాడు. మంచి పందెమందు పోరాడువాడు అన్ని విషయములలో 1) మితముగా ఉండాలి, 2) శ్రమపడాలి, 3) సువార్తికుని పని చేయాలి, 4) పరిచర్యను సంపూర్తిగా చేయాలి, 5) అవసరమైతే ప్రాణములను పానార్పణముగా పౌలువలె అర్పించుటకు సిద్ధముగా ఉండాలి. 7-8వ.లలో పౌలు తన ఆత్మీయ పోరాటమును గూర్చి ప్రభువు మంచి పోరాటము పోరాడితివి అని ప్రభువు తీర్పు తీర్చాడని చెప్పుచున్నాడు. అంతము వరకు విశ్వాసము కాపాడుకొన్నాడు. ప్రభువు ద్వారా నీతి కిరీటము పొంద బోవుచున్నాడు. అందరు తనవలె క్రీస్తు దినమందు కిరీటమును పొందవలెననే అపేక్ష కలిగి ఉండవలెనని చెప్పుచున్నాడు.

**పౌలును విడిచి పోయినవారు (9-18వ.) :** దేమా. ఫిలేమోను పత్రిక 24వ. జత పనివాడుగా ఉండెను. కాని ఇహ లోకమును స్నేహించి 1 యోహాను 2:15 ప్రకారము

దేవునికి దూరమై పౌలును విడిచి వెళ్ళిపోయాడు. (4:9వ.) క్రేస్కే గలతీయకు వెళ్ళిపోయెను. తీతు దల్మతియ అనగా యుగోస్లేవియాకు వెళ్ళెను. ఎరస్తు కొరింథిలో నిలిచిపోయెనని 20వ.లో చెప్పెను. అలెక్సంద్రు అను కంచరవాడు పౌలును ఎదిరించెను. కీడు చేసెను. ప్రభువు సిలువకు వెళ్ళినపుడు శిష్యులందరు ప్రభువును విడిచినట్లు ఇపుడు అందరు పౌలును విడిచిపెట్టిరని పౌలు చెప్పుచున్నాడు. 17వ అందరు విడిచినను ప్రభువు తమ ప్రక్కన నిలిచి బలపరచి సింహమగు సాతాను నోట నుండి తప్పించెనని చెప్పెను. లూకా మాత్రమే తన యొద్దనున్నాడు. మార్కు పరిచారము నిమిత్తము ప్రయోజనకరమైన వాడైనందున తమ యొద్దకు తిమోతితో కూడ రావలెనని కోరుకొన్నాడు. అ.కా. 13:13; 15:37-38 మార్కు పరిచర్యలో వెనుకబడి, పౌలు బర్నబాలు వేరగుటకు కారణమాయెను. ఇపుడు మార్కు మార్చబడి పరిచారకుడాయెను. తుకికును పరిచర్య కొరకై పౌలు ఎఫెస్సునకు పంపెను.

**ముగింపు ఆశీర్వాదము (19-22వ.)** : త్రోఫిము రోగి అయినందున మిలేతులో విడిచితిని అనుచున్నాడు. స్వస్థపరచితిని అనలేదు. ఎఫెసు పట్టణంలో తాను అనేకులను స్వస్థపరచెను. అ.కా. 19:12. కాని ఇపుడు తాను ప్రేమించు త్రోఫిముకు స్వస్థత కలుగలేదు. కనుక స్వస్థతలు అప్పుడప్పుడు జరుగుచున్నను, నిత్యము జరుగవని తెలుసుకోవాలి. ఆది సంఘమునకు దేవుడిచ్చిన స్వస్థత వరము బైబిల్ వ్రాయబడిన కాలములోనే నిలిచి పోయినదని గుర్తించ వలెను. తన వందనములు సహోదరుల వందనములు చెప్పుచు గ్రంథమును ముగించెను.

# తీతు పత్రిక

గ్రంథకర్త : పౌలు . కాలము : క్రీ.శ. 64 స్థలము : నికొపొలి మార్గము (3:12)

ముఖ్య ఉద్దేశము : సంఘములో (3:12) పాలన - ప్రవర్తన.

**తీతు పత్రిక** : క్రీ.శ. 63-64లో రోములోని చెర నుండి విడుదల పొందిన సమయములో ఈ పత్రిక క్రీ.శ. 64లో నికొపొలి మార్గమందుండి వ్రాసెను. గలతీ. 2:3లో తీతు అన్యుడుగా కనిపించును. పౌలు పరిచర్యలో రక్షింపబడెను (2 తిమోతి 1:1) కాని ఇతరులు సున్నతి అవసరమని బలవంతపెట్టి సున్నతి చేసిరి. (గలతీ. 2:2-3). క్రేతులో పౌలు సేవకు వెళ్ళుచూ తీతును వెంటబెట్టుకొని వెళ్ళెను. సంఘములో లోపములను దిద్దుటకై తీతును అక్కడే ఉంచి తాను ముందుకు వెళ్ళిపోయెను. తదుపరి తీతు 3:12 ప్రకారము పౌలు నికొపొలి మార్గమందున్నప్పుడు ఈ పత్రిక వ్రాసెను. క్రీ.శ. 64లో వ్రాసినట్లు తలంచగలము. తీతు అను పేరుకు పెంచువాడు అని అర్థము. అందుకొరకే కాబోలు పౌలు దిద్ది, పెంచి, పాలించుటను గురించిన విధులు తీతుకు తెలిపెను. తీతును పౌలు తనకు నిజమైన కుమారుడని 1:2లో చెప్పుటలో తీతు యొక్క నమ్మకత్వము కనిపించుచున్నది.

## అధ్యాయాల విభజన

**1వ అధ్యాయము** : సంఘములో పాలన, సంఘములో లోపములు దిద్దుట.

**2వ అధ్యాయము** : సంఘములో సహోదరుల ప్రవర్తన.

**3వ అధ్యాయము** : సమాజములో సహోదరుల ప్రవర్తన.

## 1వ అధ్యాయము 4+5+7=16 వచనములు
## అంశము : సంఘంలో పాలన - లోపములు దిద్దుట

**శుభములు (1-4వ.)** : శుభములు తెలుపుతూ క్రీస్తును నమ్మినవారు విశ్వాసయాత్రలో కొనసాగుటకు అవసరమైన సంగతులు తెలుపుతూ దేవుడు మనకిచ్చిన జీవము నిత్యమైనదని, నిరీక్షణ కలదని తెలుపుచున్నాడు. దేవుని యొక్క అతి ప్రాముఖ్యమైన గుణమగు అబద్ధమాడనేరని స్వభావము గలవాడని తెలుపుచున్నాడు.

**పెద్దల నియామకము - వారి గుణములు (5-9వ.)** : సంఘములలో లోపములు దిద్దబడాలి. సంఘ పరిపాలన జరిగించుటకు పెద్దలు అవసరము. అపోస్తలుడు తాను

కలిగిన అధికారమును బట్టి పెద్దలును నియమించు పనిని తీతుకు అప్పగించుచున్నాడు. అందులకై తాను అపొస్తలుడను అధికారము కలిగినవాడనేనని 1:2లో పరిచయం చేసుకొను చున్నాడు. ఈ దినములలో అపొస్తులు లేరు. కనుక పెద్దలను నియమిచు అధికారము ఎవ్వరికినీ లేదు. పరిశుద్ధాత్మ దేవుడే పెద్దలను నియమించును. పరిశుద్ధాత్మ నియమించిన పెద్దలను సంఘము గుర్తించుట జరుగును. పెద్దలకు ఉండవలసిన గుణములు.

1) నిందారహితుడు, 2) ఏకపత్నీ పురుషుడు, 3) దుర్వ్యాపార విషయములో, నేరము మోపబడనివాడు, 4) అవిధేయులు కాక విశ్వాసులైన పిల్లలు కలవాడు, 5) స్వేచ్ఛా పరుడుగా ఉండకూడదు, 6) ముక్కోపిగా ఉండకూడదు, 7) మద్యపానిగా ఉండ కూడదు, 8) కొట్టువాడుగా ఉండకూడదు, 9) అతిధి ప్రియునిగా ఉండాలి, 11) సజ్జన ప్రియుడుగా ఉండాలి, 12) స్వస్థ బుద్ధి కలిగి ఉండాలి, 13) నీతిమంతుడుగా ఉండాలి, 14) పవిత్రుడుగా ఉండాలి, 15) ఆశానిగ్రహం కలిగి ఉండాలి, 16) హితబోధ విషయమై ఇతరులకు బోధించువాడుగా ఉండాలి, 17) ఎదురాడువారి మాటలు ఖండించుటకు శక్తిగలవాడుగా ఉండాలి, 18) ఉపదేశము అనుసరించి నమ్మదగిన బోధను గట్టిగా చేపట్టువాడై ఉండాలి.

**లోపములు దిద్దుట (10-16వ.)** : క్రేతీయులు, దేవుని ఎరుగుదుమని చెప్పుకొందురు గాని వారి క్రియలు ఆలాగు లేవు. వారి క్రియలలో లోపము కలదు. 1) 10వ అవిధేయులు, 2) వదరుబోతులు, 3) మోసపుచ్చువారు, 4) 11వ. ఉపదేశింపకూడని వాటిని ఉపదేశించుచు, కుటుంబములు పాడుచేయువారు, 5) 12వ. అబద్ధికులు, 6) దుష్ట మృగము వంటివారు, 7) సోమరులు, 8) తిండిబోతులు, 9) 13,14వ. కల్పనా కథలవైపు చెవి యొగ్గుచున్నారు, 10) సత్యము నుండి తొలగిపోవు మనుష్యుల కట్టడలను లక్ష్యపెట్టుచున్నారు, 12) 15వ. వారి మనస్సులు, మనస్సాక్షి అపవిత్రత పరచబడినవి, 12) 16వ. అసహ్యులుగా ఉన్నారు, 13) అవిధేయులు, 14) ప్రతి సత్ కార్య విషయములో భ్రష్టులు, 15) తమ క్రియల వలన దేవుని ఎరుగము అనుచున్నారు. ఈ లోపములు దిద్దుటకై పౌలు తీతును క్రేతులో విడిచిపెట్టి వెళ్ళాడు. సంఘములలో సహోదరుల జీవితంలోని లోపములను ఇతరులకు చెప్పక ప్రార్థనా పూర్వకంగా చక్కదిద్దుట ఎంతో అవసరము.

# 2వ అధ్యాయము 2+3+3+2+5=15 వచనములు
## అంశము : సంఘమందు జనుల ప్రవర్తన

**వృద్ధుల ప్రవర్తన (1-2వ.)** : వృద్ధులు 1) మితానుభవముగలవారుగా ఉండాలి, 2) మాన్యులుగా ఉండాలి, 3) స్వస్థ బుద్ధిగలవారుగా ఉండాలి, 4) విశ్వాస, ప్రేమ, సహనమందు లోపములేనివారై ఉండాలి.

**వృద్ధ స్త్రీలు యౌవన స్త్రీల ప్రవర్తన (3-5వ.)** : వృద్ధ స్త్రీలు కొండెకత్తెలుగా ఉండ కూడదు, 2) మిగుల మద్య పానాసక్తులుగా ఉండకూడదు, 3) ప్రవర్తనయందు భయభక్తులు కలిగి ఉండాలి. యౌవ్వన స్త్రీలకు అవసరమైన హెచ్చరికలు చేయాలి. యౌవనస్త్రీలు ప్రవర్తన యందు భయభక్తులు కలిగి ఉండాలి, 4) తమ భర్తలను శిశువులను ప్రేమించువారై యుండాలి, 5) పవిత్రులైయుండాలి, 6) ఇంటి పనులు చేసుకొను వారుగా ఉండాలి, 6) మంచివారైయుండాలి, 7) దేవుని వాక్యము దూషింప కుండునట్లు చూసుకోవాలి. స్త్రీల పరిచర్యను గూర్చి 1 కొరింథీ. 14:34వ ధ్యానములో చూడండి)

**యౌవన పురుషుల ప్రవర్తన (6-8వ.)** : 1) స్వస్థబుద్ధి కలిగియుండాలి, 2) పరపక్ష మందుండువాడు. మనలను గూర్చి చెడుమాట చెప్పకూడదు, 3) సత్కార్య విషయములో మాదిరిగా ఉండాలి, 4) ఉపదేశము మోసము లేనిదైయుండాలి. నిరాక్షేపమైన హిత వాక్యముతో కూడినదైయుండాలి.

**దాసుల ప్రవర్తన - యజమానుల ప్రవర్తన (9-10వ.)** : దాసులైనవారు 1) యజమా నులకు ఎదురు చెప్పకూడదు, 2) ఏమియు అపహరింపకూడదు, 3) సంపూర్ణమైన మంచి నమ్మకము కనుపర్చాలి, 4) అన్ని కార్యములయందు యజమానులను సంతోష పెట్టాలి, 5) యజమానులకు లోబడియుండాలి.

**ప్రవర్తన యొక్క ప్రాముఖ్యత (11-15వ.)** : ప్రవర్తన ఎందుకు ప్రాముఖ్యమైనదో, మన రక్షకుడైన క్రీస్తు ప్రత్యక్షమయిన కారణములను బట్టి తెలియును. 1) మనము భక్తిహీనతను విడిచిపెట్టాలి, 2) ఇహలోక సంబంధమైన దురాశలను విడిచిపెట్టాలి, 3) స్వస్థ బుద్ధితో బ్రతకాలి, 4) నీతితో బ్రతకాలి, 5) సత్ కార్యముల యందు ఆసక్తిగల ప్రజలుగా ఉండాలి. అందులకై ఆయన మనలను సమస్తమైన దుర్నీతినుండి విడిపించాడు. తన కోసము పవిత్రపరచుకున్నాడు. తన సొత్తుగా చేసుకొన్నాడు. అందువలన విశ్వాసులకు ప్రవర్తన ప్రాముఖ్యమైనది. 15వ.లో వీటిని గూర్చి భోధించాలని హెచ్చరించాలని, దుర్భోధను ఖండించాలని, తీతును ఎవ్వరూ తృణీకరించకుండా చూచుకోవాలని హెచ్చరించుచున్నాడు.

# 3వ అధ్యాయము 3+4+4+4=15 వచనములు

## అంశము : సమాజంలో జనుల ప్రవర్తన.

**విభజన - అధికారులకు విధేయత (1-3వ.)** : యజమానులకు లోబడియుండవలెనని దాసులకు 2. అధ్యా. 9-10వ.లో హెచ్చరించాడు. వాటితోపాటు మరికొన్ని హెచ్చరికలు చెప్పుచున్నాడు. అధికారులకు 1) లోబడి విధేయులుగా ఉండాలని మరొకసారి చెప్పుచున్నాడు. 2) ప్రతి సత్కార్యము చేయుటకు సిద్ధపడియుండాలి, 3) మనుష్యులందరి యెడల సంపూర్ణ సాత్వికము కనపరచాలి, 4) ఎవనిని దూషింపకూడదు, 5)జగడ మాడకూడదు, 6) శాంతులుగా ఉండాలి, 7) మునుపటి ప్రవర్తను విడిచిపెట్టాలి.

**దేవుని దయ ప్రత్యక్షమగుట (4-7వ.)** : రక్షించుట, పరిశుద్ధాత్మనుకుమ్మరించుట. 2:11లో సమస్త మనుష్యులకు రక్షణకరమైన దేవుని కృప ప్రత్యక్షమై అని ఉన్నది. 3:4లో రక్షకుడైన దేవుని యొక్క దయయు, ప్రేమయు ప్రత్యక్షమైనవి అని ఉన్నవి. అందువలన రక్షకుడైన యేసుక్రీస్తు ఈ లోకములో ప్రత్యక్షమైనప్పుడు కృపను, ప్రేమను, దయను ప్రత్యక్షపరచెనని గుర్తించాలి. ఆయన కృపామయుడుగాను, దయామయుడుగాను, ప్రేమామయుడుగాను లోకములో చెప్పబడుచున్నాడు. 1) మానవులు పాపులైయుండగా ఎఫెసీ. 1:6. ప్రకారము దేవుడు తన దయను బట్టి మనలను పరిశుద్ధ పరచి కుమారులుగా స్వీకరించవలెనని మనలను ముందుగా తనకోసం నిర్ణయించుకొన్నాడు. 2) మానవుని పాపమును క్షమించుటకు హెబ్రీ. 9:22. ప్రకారము రక్తము చిందించబడాలి. రక్తము చిందించుటకై మొదటి యోహాను 3:16 ప్రకారం క్రీస్తు తన ప్రేమను బట్టి మన కొరకు ప్రాణము పెట్టి తన రక్తమంతటిని చిందించాడు. 1 యోహాను 4:10 ప్రకారము దేవుడు తన ప్రేమను బట్టి మన పాపములకు ప్రాయశ్చిత్తం చేశాడు అనగా కప్పి వేశాడు. కొలస్స 3:15 ప్రకారం సిలువ రక్తంద్వారా పాప పత్రముపై ఉన్న వ్రాతలను తుడిచివేసి అపరాధములన్నిటిని క్షమించాడు. రోమా 5:8,9. ప్రకారము ప్రేమను బట్టియే ఆయన రక్తము వలన మనలను నీతిమంతులుగా తీర్చాడు. దేవుని ఉగ్రతైన నరకశిక్ష నుండి తప్పించాడు. 3) ఎఫెసీ. 2:6-8వ ప్రకారము చనిపోయిన మనలను కృపచేత లేపి పరలోకములో కూర్చుండబెట్టాడు.

ఇది మన వలన కలిగినది కాదు గాని దేవుని వరమే. తీతు 3:5-7 కూడా కృప ద్వారా నరకశిక్ష నుండి రక్షించి నీతిమంతులుగా తీర్చి నిత్య జీవమునకు వారసులుగా చేసి నిరీక్షణను మనకు ఇచ్చాడు. సర్వసత్యములోనికి నడిపించు పరిశుద్ధాత్మను కుమ్మరించాడని చూచుచున్నాము.

**సత్క్రియలు శ్రద్ధగా చేయుట - మత భేదము కలిగిన వారిని విసర్జించుట** : పై భాగములో దేవుడు మనపట్ల చేసిన కార్యములను వివరముగా చూచితిమి. అందువలన విశ్వాసం ఉంచిన వారు ఆయనకొరకై మంచి క్రియలు శ్రద్ధగా చేయుట ప్రయోజనకరమైనది. తరబాయులకు, విభాగములకు, కలహములకు, మతభేదములకు దూరముగా ఉండాలి.

**ముగింపు (12-15వ.)** : నెకపొలిలో శీతాకాలం గడపాలని చెప్పినందున ఈ పత్రిక నెకపొలికి వెళ్ళు మార్గములో క్రీ.శ. 64లో వ్రాసెనని తలంచుచున్నాము. తీతు దగ్గర ఉన్న సహోదరులైన జెనానుకు, అపొల్లోనుకు తక్కువ కాకుండా చూచుకొనవలెనని చెప్పుచున్నాడు. అందువలన సహోదరుల క్షేమ విషయమై నిజమైన చింత కలవాడని తన మాదిరిని మనము అనుసరించాలని నేర్చుకొనుచున్నాము. వందనములతో ముగించుచున్నాడు.

# ఫిలేమోను పత్రిక 3+4+5+6+7=25వ.

గ్రంథకర్త : పౌలు . కాలము : క్రీ.శ. 61 (1:1) స్థలము : రోమాలోని మొదటి చెర. కొనిపోయినవారు : ఒనేసీము - తుకికు (కొలస్స. 4:7-9)

**అంశము** : ఒనేసీమును చేర్చుకొనుట.

ఫిలేమోను కొలస్సయి పట్టణవాసి (కొలస్స. 4:12,17). పౌలు పరిచర్య ద్వారా రక్షింపబడెను (19వ.). ఫిలేమోను ఇంటిలో సంఘము కూడుచుండెను. అప్ఫియా ఫిలెమోను భార్య, అర్ఖిప్పు వారి కుమారుడు (23వ) ఈ ఇంటిలో ప్రయోజనమైన వాడని అర్థము, గల పేరు కలిగిన ఒనేసీమను బానిసయుండెను. ఒనేసీము నిష్ప్రయోజకుడై యజమానికి ఋణముండి, తదుపరి నష్టము కలిగించి (18వ.), పారిపోయి రోము చెరలో ఉన్న పౌలును కలిసెను. పౌలు ద్వారా రక్షింపబడి, మార్చబడిన ప్రయోజనకారియై (10వ.) పౌలుకు ప్రాణమువంటివాడు పరిచర్య చేయుచుండెను కాని ఫిలేమోనుతో సమాధానపడు నిమిత్తమై పౌలు జాబు వ్రాసి ఒనేసీము తుకికులతో పంపెను.

రోమా చట్ట ప్రకారము ఆ దినాలలో బానిసలను వస్తువులను కొన్నట్టుకొనుట, వాడుకొనుట, అమ్ముకొనుట వాడుకయందుండెను. లోకములో బానిసలను వేడుక కొరకై చంపినను నేరము కాదు. కాని ధర్మశాస్త్ర ప్రకారము లేవి 25:53లో వారు కుటుంబీకులవలె నుండిరి. ఆది. 17:27. ప్రకారము నిబంధనతో పాలు కలవారు. సునాద సంవత్సరము నిర్గమ. 21:2 ప్రకారము విడుదల పొందిరి. బానిసకు హాని కలిగించుట నేరము. నిర్గమ. 21:26-27. బానిసను చంపువాడు శిక్షకు పాత్రుడు నిర్గమ. 21:20. పారిపోయిన బానిసను యజమాని కప్పగింపకూడదు. (ద్వితీ. 23:15-16). కాని విమోచించబడిన బానిస యజమానితో సమాధాన పడుట సమంజసము. అందులకై పౌలు ఈ పత్రిక వ్రాసి ఒనేసీమును ఫిలేమోను యొద్దకు పంపెను.

**సంఘ చరిత్రలో ఈ రీతిగా వ్రాయబడినది** : ఒనేసీము మారుమనస్సు పొంది ఫిలేమోను దగ్గరకు వచ్చిన తర్వాత 50 ఏండ్లకు ఇగ్నేషియస్ అనునతడు అంతయోకయ సంఘమునకు పెద్దగా ఉండెను. రోముకు కొనిపోబడి చెరలో నుండి హతసాక్షి అయెను.

చెరలోఉన్న కాలములో అనేక సంఘములకు పత్రికలు వ్రాశాడు. అందులో ఎఫెసీ సంఘమునకు వ్రాసిన పత్రికలో ఒనేసీమును ప్రయోజనకరమైన సంఘ పెద్దగా ప్రస్తావించాడు. కనుక మారుమనస్సు పొందినవారు. తమ జీవితములను దిద్దుకొనుట ద్వారా ఎంత గొప్పగా హెచ్చింపబడెదరో నేర్చుకొనవచ్చును. ఫిలేమోను అను పేరుకు ప్రేమ కలవాడని అర్థము. అప్పియ అను పేరుకు - ప్రియురాలు అని అర్థము, అర్ఖిప్పు అను పేరుకు - గుఱ్ఱమునకు అధిపతి లేదా గుఱ్ఱమువంటి బలము కలవాడు అని అర్థము.

**పీఠిక, ఫిలేమోను కుటుంబము (1-3వ.)** : ఫిలేమోను అతని భార్య అప్పియా వారి కుమారుడు - అర్ఖిప్పు ముగ్గురును క్రీస్తును తమ రక్షకునిగా అంగీకరించారు. ఫిలేమోను ఇంటిలో సంఘము అప్పియ, అర్ఖిప్పు సహకరించువారు కొలస్సీ. 4:17 ప్రకారము ప్రభువు యొక్క పరిచర్యలో ఒక భాగము యౌవనస్తుడైన అర్ఖిప్పుకు అప్పగింపబడవలెనని వ్రాయబడినది. ప్రభువు చేత పరిచర్య అప్పగింపబడుట ఎంత భాగ్యము ఇటువంటి కుటుంబము మనకు ఎంత మాదిరిగా ఉన్నది. సంఘము ఇంటియందు కూడుకొనుటకు తమ గృహమును ఇచ్చుట గమనించతగినది. ఈ దినములలో ఇటువంటివారు అక్కరగా ఉన్నారు.

**ఫిలేమోను గుణములు (4-7వ.)** : సహోదరుల యెడల ఫిలేమోను కలిగిన ప్రేమ ఎంతో ప్రశంసనీయము. మత్తయి 22:39,40. ప్రకారము 1 పేతురు 1:22 ప్రకారము పరిశుద్ధ గ్రంథమంతటి సారాంశము ప్రేమ కలిగియుండుటలో ఇమిడి ఉన్నది. ఫిలేమోను శ్రేష్ఠమైన వరములు కలిగినవాడు. ఆ వరములను సాధకం చేయుట ద్వారా ఇతరులను క్రీస్తు కొరకై సంపాదించుచున్నాడు. 7వ వచనములో పరిశుద్ధుల హృదయములకు విశ్రాంతిని కలిగించుచున్నాడని వ్రాయబడియున్నది. పౌలుకు విశేషమైన ఆనందమును, ఆదరణను కలిగించాడు. పై వచనములలో ఫిలేమోను యొక్క సమర్పణ తన ఇంటివారితో కలసి కనపరచిన త్యాగము, 1,2,3 వచనములలో చూస్తున్నాము. 4,5 వచనములలో అయన సాక్ష్యమును 6వ వచనములో ఆయన ప్రార్థనను 7వ వచనములో ఆయన ప్రేమను గమనించదగినది.

**ఒనేసిమును గూర్చిన పరిచయము (8-12వ.)** : ఈ పత్రిక ప్రారంభము నందలి అంశములలో ఈ భాగము యొక్క వివరములు చూచితిమి. ఎంతటి నిష్ప్రయోజనమైనవానినైనను క్రీస్తు మార్చగలడని చూచుచున్నాము. పాపములో ఎంత లోతుగా కూరుకొని పోయిన వాడైనను క్రీస్తు ద్వారా మార్చబడగలరు. పౌలుకు ఒనేసీము పరిచర్య అవసరమే కాని దానికంటే అవసరమైనది యుక్తమైనది సమాధానము. దానిని జరిగించుటకై సుమారు 1000 మైళ్ళు దూరము ఒనేసీమును పంపుచున్నాడు.

**ఒనేసీము కొరకు వేడుకొనుట (13-18వ.)** : పరిచర్య కంటే ఒనేసీము, ఫిలేమోనుతో సంగతులు సరిచేసికొనుట ముఖ్యమని, యుక్తమైనదని మనము నేర్చుకొనవలెను. ఈ విషయము ఆజ్ఞాపించు అధికారము అపొస్తలత్వము పౌలుకున్నను, అపొస్తలుడుగా కాక ఒనేసీము సహఖైదీగా వేడుకొనుచున్నాడు. ఒనేసీము ఇక మీదట, బానిసగా కాక సహోదరుడుగా ఉండునని చెప్పుచున్నాడు.

## ఒనేసీముకు క్రీస్తునందు కలిగిన ఆధిక్యతలు

| మునుపు | | ఇపుడు |
|---|---|---|
| నరక శిక్షకు పాత్రుడు | - | శిక్ష నుండి తప్పించబడెను |
| నిష్ప్రయోజకుడు | - | పౌలుకు ప్రయోజకుడు |
| ఫిలేమోనుకు నష్టము కలిగించినవాడు | - | ఫిలేమోనుకు ప్రయోజకుడు |
| బానిస | - | సహోదరుడు |
| శత్రువు | - | ప్రాణము వంటివాడు |
| ద్వేషించబడిన వాడు | - | ప్రేమకు పాత్రుడు |
| ఋణమున్న వాడు | - | ఋణము తీర్చబడినవాడు |
| ఎడబాసిన వాడు | - | ఎల్లప్పుడు ఉండువాడు |
| దిద్దుబాటును ఇష్టపడని వాడు | - | దిద్దుకొనుటకు ఇష్టపడినవాడు |

ఒనేసిము తన జీవితములో పాత సంగతులను సరిచేసుకొనుటకు ఇష్టపడుట ఎంత మంచిది.

**ఫిలేమోనుపై పౌలుకు కలిగిన విశ్వాసము - పౌలు జతపనివారు (19-25వ.)** : నీ 19-22 వచనాలోనే ఆత్మ విషయమై నాకు రుణపడియున్నావని చెప్పటలో 1) పౌలు పరిచర్యలో ఫిలేమోను రక్షించబడియున్నాడని నేర్చుకొనుచున్నాము, 2) ఫిలేమోను పౌలునకు అనందము కలిగించువాడు. మరియు 3) పరిచర్యలో సహాయము చేయువాడు. పౌలు హృదయము నకు 4) విశ్రాంతి కలిగించువాడు, 5) పౌలు చెప్పిన దానికంటే ఎక్కువగా చేయువాడు, 6) పౌలు మాటకు విధేయత చూపువాడు, 7) ప్రార్థనాపరుడు, 8) పౌలు నిమిత్తము బస సిద్ధము చేయువాడు 23-24వ.లలో ఎఫఫ్రా తనతో కూడా ఖైదీలో ఉన్నాడని చెప్పుచున్నాడు. ఒకప్పుడు సేవలో వెనుకబడిన మార్కును ఇప్పుడు జతపనివాడని అంగీకరించుచున్నాడు. అరిస్తార్కు. దేమా లూకాను కూడా జతపని వాడుగా ప్రస్తావించుచున్నాడు. 25 వచనములో ఆశీర్వాదముతో పత్రికను ముగించుచున్నాడు.

# హెబ్రీయులకు వ్రాసిన పత్రిక

గ్రంథకర్త : పౌలు . కాలము : క్రీ.శ. 61 -66(?) స్థలము : ఇటలీ (13:24)

**అంశము** : క్రీస్తు శ్రేష్ఠుడు - యేసు మీద లక్ష్యముంచుడి (12:1) - ఏడు జాగ్రత్తలు.

**గ్రంథ ఉద్దేశ్యము** : హెబ్రీయులు అనగా నదిని దాటినవారని అర్ధము. సంఘ ప్రారంభ దినములలో అనేక వేలమంది యూదులు సువార్త విని క్రీస్తును నమ్మిరి. (అ.కా. 21:20వ) వీరిలో కొందరు నిజముగా నమ్మి బాప్తీస్మము పొందినవారు. మరి కొందరు నిజమైన రక్షణ అనుభవము లేకయే సంఘమందు చేర్చబడిరి. సంఘము క్రీ.శ.30లో పుట్టినది. ఈ పత్రిక క్రీ.శ. 66లో వ్రాయబడినందున ప్రారంభములో నమ్మినవారు 30 ఏండ్ల ప్రాయములో నమ్మిరని తలంచిన యెడల వారిప్పుడు 66 ఏండ్ల పైబడియుండాలి. వారు చనిపోయి ఉండాలి లేదా వృద్ధులుగానుండాలి. తరువాత నమ్మితిమన్న వారు రెండవ తరమువారై నిజమైన లోతైన అనుభవము గల విశ్వాసులుగా నుండకపోవచ్చును. వీరే క్రీస్తు నుండి త్వరగా వేరై పోగలరు.

యూదా మతము అనేక ఆచారములు గలది. క్రీస్తునందు జీవించుట ఆత్మాను సారమైనది, కాని అక్షర సంబంధమైనది కాదు. క్రైస్తవులకు హింసలు ఎక్కువకాగా హెబ్రీయులు క్రైస్తవ్యము నుండి యూదా మతమునకు తిరిగి వెళ్ళుచుండిరి. హెబ్రీ. 13:2లో చెరను గూర్చిన ప్రస్తావనయున్నందున పౌలు, పేతురులు చెరలో నుంచబడిన కాలమును జ్ఞాపకము చేసికొనదగును. అందుచే ఈ పత్రిక క్రీ.శ. 61-66 మధ్య వ్రాయబడినదని తలంచుచున్నాము. వ్రాసిన వారిని గూర్చి భిన్నమైన అభిప్రాయములు గలవు. లూకా, సీల, ఫిలిప్పు, అపొల్లోయని తలంచువారు కలరు. కాని పత్రిక శైలిని బట్టి పౌలు వ్రాసెనని సర్వ సాధారణముగా అంగీకరింతురు.

పౌలు పేతురులు నీరో చక్రవర్తి కాలమందు చెరలోనుండగా పేతురు పౌలుకంటే ముందుగా చంపబడెను. శ్రమలను బట్టి యూదులు శ్రేష్ఠమైన అధికారి, నాయకుడు, యాజకుడు, సేవకుడు, కర్త, క్రీస్తు మీద లక్ష్యముంచక పాత ఆచారముల వైపు తిరుగుచున్నట్లు కన్పించును. కనుక పౌలు ఈ పత్రికలో క్రీస్తు, వారి ప్రవక్తలు, పితరులు, దూతలకంటే, నాయకుల యాజకత్వము కంటె, గుడారము దాని సేవకత్వముకంటే శ్రేష్ఠుడని క్రీస్తును గూర్చి బోధించెను. క్రీస్తు విశ్వాస, నిరీక్షణ ప్రేమలకు కర్తయని క్రీస్తు

మీద లక్ష్యముంచుడని హెచ్చరించుచూ వ్రాసెను. యూదులు పౌలు పై అసూయ కలిగినందున తన పేరును వ్రాయలేదు. గలతీ. 2:9లో పౌలు అన్యులకును, పేతురు యూదులకును అపోస్తలుడుగా నుండవలెనని వారు చెప్పుకొనినందున పౌలు తన పేరును ప్రస్తావించక ఈ పత్రిక వ్రాసెనని తలంచగలము. ఈ పత్రికలో ఏడు ప్రాముఖ్య మైన జాగ్రత్తలు కలవు. 1) 2:1-4వ., 2) 3:7-19వ. 3) 4:11-14వ. 4) 5:11-14వ. 5) 10:19-39, 6) 12:15-24వ, 7) 12:25-29వ.

## అధ్యాయాల విభజన 2+2+3+3+3= 13 అధ్యా.

**I. 1-2వ అధ్యాయములు** : శ్రేష్టమైన ఆధిపత్యము.

**II. 3-4వ అధ్యాయములు** : శ్రేష్ఠమైన నాయకత్వము.

**III. 5-7వ అధ్యాయములు** : శ్రేష్ఠమైన యాజకత్వము.

**IV. 8-10వ అధ్యాయములు** : శ్రేష్ఠమైన సేవకత్వము.

**V. 11-13వ అధ్యాయములు** : శ్రేష్ఠమైన కర్తవ్యము (క్రైస్తవ ప్రాముఖ్యతలగు విశ్వాస, నిరీక్షణ, ప్రేమలకు క్రీస్తు శ్రేష్ఠమైన కర్త.

**I. 1-2వ అధ్యాయములు : శ్రేష్టమైన ఆధిపత్యము.**

1వ అధ్యాయము : ప్రవక్తలకంటె, దూతలకంటె, తోటి వారందరి కంటె శ్రేష్ఠుడు.

2వ అధ్యాయము : దూతలకంటె శ్రేష్ఠుడు,

**II. 3-4వ అధ్యాయములు : శ్రేష్టమైన అధిపత్యము.**

3వ అధ్యాయము : మోషే కంటే శ్రేష్ఠుడు.

4వ అధ్యాయము : యెహోషువకంటే శ్రేష్ఠుడు.

**III. 5-7వ అధ్యాయములు : శ్రేష్ఠమైన యాజకత్వము.**

5వ అధ్యాయము : అహరోనుకంటే శ్రేష్ఠుడు.

6వ అధ్యాయము : అబ్రాహాము కంటే శ్రేష్ఠుడు.

7వ అధ్యాయము : లేవీకంటే శ్రేష్ఠుడు.

**IV. 8-10వ అధ్యాయములు : శ్రేష్ఠమైన సేవకత్వము.**

8వ అధ్యాయము : శ్రేష్ఠమైన గుడారమునకు నిబంధనకు సేవకుడు.

9వ అధ్యాయము : శ్రేష్ఠమైన నిబంధన ద్వారా కలిగిన బల్యర్పణ.

10వ అధ్యాయము : శ్రేష్ఠమైన బలినర్పించిన వాడు.

V. 11-13వ అధ్యాయములు : **శ్రేష్ఠమైన కర్తవ్యము.**

11వ అధ్యాయము : శ్రేష్ఠమైన విశ్వాసమునకు కర్త.

12వ అధ్యాయము : శ్రేష్ఠమైన నిరీక్షణకు కర్త.

13వ అధ్యాయము : శ్రేష్ఠమైన ప్రేమకు కర్త.

**I.** సంపూర్ణత - **14 పర్యాయములు** : 1) సంపూర్ణుడు 2:10, 2) సంపూర్తి 4:3, 3) సంపూర్ణ సిద్ధి 5:9, 4) సంపూర్ణులు 6:2, 5) సంపూర్ణ సిద్ధి 7:11, 6) సంపూర్ణ సిద్ధి 7:18, 7) సంపూర్ణము 7:25, 8) సంపూర్ణ సిద్ధి 7:28, 9) సంపూర్ణ సిద్ధి 9:9, 10) సంపూర్ణ సిద్ధి 10:1, 11) సంపూర్ణులు 10:14, 12) సంపూర్ణ 10:22, 13) సంపూర్ణులు 11:40, 14) సంపూర్ణ సిద్ధి 12:23.

**II.** శ్రేష్ఠము - **13 పర్యాయములు** : 1),2) శ్రేష్ఠము, శ్రేష్ఠుడు 1:4, 3) శ్రేష్ఠమైన వస్తువులు 7:4, 4) శ్రేష్ఠమైన నిరీక్షణ 7:10, 5) శ్రేష్ఠమైన నిబంధన 7:20, 6) శ్రేష్ఠమైన సేవకత్వము 8:6, 7) శ్రేష్ఠమైన బలులు 9:23, 8) శ్రేష్ఠమైన స్వాస్థ్యము 10:34, 9) శ్రేష్ఠమైన బలి 11:4, 10) శ్రేష్ఠమైన దేశము 11:16, 11) శ్రేష్ఠమైన పునరుత్థానము 11:35, 12) శ్రేష్ఠమైనది 11:40, 13) శ్రేష్ఠమైన రక్తము 12:4.

**III.** పరలోకము - **11 పర్యాయములు** : 1) పరలోక సంబంధమైన పిలుపు 3:1, 2) పరలోక సంబంధమైన వరము 6:4, 3) పరలోకమందు...... ఆసీనుడు 8:2, 4) పరలోక సంబంధమగు వస్తువులు 8:5, 5) పరలోకమందున్న వాటిని పోలిన వస్తువులు 9:23, 6) పరలోక సంబంధమైనవి 9:23, 7) పరలోకమందు ప్రవేశము 9:24, 8) పరలోక సంబంధమైన దేశము 11:16, 9) పరలోకపు యెరూషలేము 12:22, 10) పరలోకమందు వ్రాయబడిన జేష్ఠుల సంఘం 12:2, 11) పరలోకము నుండి బుద్ధి చెప్పువారు 12:25.

**IV.** గొప్ప - **10 పర్యాయములు** : 1) గొప్ప రక్షణ 2:3, 2) గొప్ప ప్రధాన యాజకుడు 4:14, 3), 4) గొప్పవాడు 6:13, 6:16, 5) గొప్ప యాజకుడు 10:21, 6) గొప్ప పోరాటము

10:32, 7) గొప్ప బహుమానము 10:35, 8) గొప్ప భాగ్యమైన నింద 11:24, 9) గొప్ప సాక్షి సమూహము 12:1, 10) గొప్ప కాపరి 13:20.

**V. నిరంతరము - 9పర్యాయములు** : 1) నిరంతర సింహాసనము 1:8, 2),3),4),5),6) నిరంతర యాజకుడు 5:6, 6:20, 7:3, 7:17, 7:22, 7) నిరంతరము ఉన్నవాడు 7:24, 8) నిరంతరము జీవించువాడు 7:25, 9) నిరంతరమును సంపూర్ణ సిద్ధి పొందిన కుమారుడు 7:28.

**VI. రక్షణ - 11 పర్యాయములు** : 1) రక్షణయను స్వాస్థ్యము 1:14, 2) గొప్ప రక్షణ 2:3, 3) రక్షణ 2:4, 4) రక్షణ కర్త 2:10, 5) రక్షింపగలవాడు 5:7, 6) నిత్యరక్షణ 5:10, 7) రక్షణ కర్త 6:9, 8) రక్షించుటకు శక్తిమంతుడు 7:25, 9) రక్షణ 9:28, 10) ఆత్మరక్షణ 10:39, 11) ఇంటి వారి రక్షణ 11:7.

**VII. ఒక్కసారే - 8పర్యాయములు** : ఒక్కసారే పని చేసి ముగించెను 7:28, 2),3) ఒక్కసారే ప్రవేశము 9:7, 9:12, 4) ఒక్కసారే ప్రత్యక్షత 9:26, 5) ఒక్కసారే మృతి 9:27, 6) ఒక్కసారే అప్పగింపబడి 9:28, 7) ఒక్కసారే శుద్ధి 10:2, 8) ఒక్కసారియే అర్పణ 10:10.

**VIII. నిత్యములు - 7 పర్యాయములు** : 1) నిత్యరక్షణ 5:10, 2) నిత్య తీర్పు 6:2, 3) నిత్య విమోచన 9:11, 4) నిత్యమువెళ్ళుట 9:6, 5) నిత్య స్వాస్థ్యము 9:15, 6) నిత్య ఆత్మ 9:14, 7) నిత్య నిబంధన 13:21.

## 1వ అధ్యాయము 4+4+4+2=14 వచనములు
## అంశము : ప్రవక్తల కంటె దూతలకంటె తోటివారందరికంటె శ్రేష్ఠుడు

ప్రవక్తలకంటే శ్రేష్ఠుడైన క్రీస్తు (1-4వ.) : దేవుడు పూర్వకాలమందు నానా సమయములలో అనగా సీనాయి కొండ మీద నుండి, యొర్దాను అద్దరిని..... నానా విధములుగా, అనగా వాక్కు ప్రత్యేక్షమగుట ద్వారా, స్వప్నముల ద్వారా ప్రవక్తల ద్వారా యాజకుల ద్వారా, దేవదూతల ద్వారా మాట్లాడాడు. ఈ దినముల అంతమందు కుమారుడైన యేసుక్రీస్తు ఈ లోకమునకు వచ్చి పరిశుద్ధ గ్రంథమును మనకు అనుగ్రహించి ముగించినందున ప్రస్తుతము పరిశుద్ధ గ్రంథము ద్వారానే మనతో మాట్లాడుచున్నాడు కనుక దర్శనములు ప్రత్యక్షతలు ఈ దినములలో అవసరము లేదు. ప్రవక్తల

కంటే క్రీస్తు శ్రేష్ఠుడని క్రీస్తునకు గల ఏడు ఆధిక్యతలను 2-4 వచనములలో చెప్పుచున్నాడు. 1) సమస్తమునకు వారసుడు, 2) ప్రపంచములను నిర్మించినవాడు చెప్పుచున్నాడు, 3) దేవుని మహిమయొక్క తేజస్సు, 4) తత్వము యొక్క మూర్తిమంతము, 5) మహత్తుగల మాటచేత సమస్తమును నిర్వహించగలవాడు, 6) పాపముల విషయమై శుద్ధీకరణ చేసినవాడు, 7) దేవుని కుడి పార్శ్వమున కూర్చున్నవాడు.

**దూతలకంటే క్రీస్తునకు కలిగిన శ్రేష్ఠత్వము (5-8వ.)** : 1) 5వ.లో క్రీస్తు కుమారుడని పిలువబడుచున్నాడు. 2) 5వ.లో నేను ఆయనకు తండ్రినైయుందునని చెప్పుచున్నాడు. భూలోకమునకు ఆది సంభూతుడుగా వచ్చినవాడు 3) 6వ.లో దేవదూతలందరు ఆయనకు నమస్కారము చేయవలెనని చెప్పుచున్నాడు. 4) 7వ.లో దూతలు అయనకు సేవకులు అని చెప్పుచున్నారు, 5) 8వ.లో క్రీస్తు సింహాసనము నిరంతరము నిలుచునని చెప్పుచున్నాడు, 6) ఆయన రాజదండము న్యాయార్థమైనది అనగా క్రీస్తు రారాజు అని అర్థము.

**తోటివారందరికంటే శ్రేష్ఠుడు (9-12వ.)** : 1) ఆనందతైలముతో అభిషేకించబడిన వాడు, 2) ఆదియందు భూమికి పునాది వేసినవాడు, 3) ఆకాశములను సృజించినవాడు, 4) భూమ్యాకాశములను ఉత్తరీయము వలె మడిచినవాడు, 5) వస్త్రమువలె వాటిని మార్చినవాడు, 6) ఏకరీతిగా ఉన్నవాడు సంవత్సరములు తరగవు, 7) శత్రువులను పాదపీఠముగా కలిగినవాడు.

**దూతల పరిచర్య (13-14వ.)** : పాపము చేసిన దూతలకు రక్షణ లేదు. తీర్పుకొరకై బంధించబడియున్నారు కాని పాపము చేసిన మానవులకు దేవుడు రక్షణను యేసు రక్తము వలన ఏర్పరచి, రక్షణ పొందబోవు మానవులకు పరిచారము చేయుటకై దేవదూతలను సేవకులుగా నియమించాడు.

## 2వ అధ్యాయము 4+5+5+4=18 వచనములు
## అంశము : దూతలకంటే శ్రేష్ఠుడు, ఆదాముకంటే శ్రేష్ఠుడు

**మొదటి జాగ్రత్త (1-4వ.)** : రక్షణను నిర్లక్ష్యం చేయకూడదు - వినిన సంగతులను విడిచిపెట్టు వారిని గూర్చి మాట్లాడుచున్నాడు. యూదులు తాము వినిన క్రీస్తు

బల్యర్పణను గూర్చిన సంగతులు విడిచిపెట్టి దర్మ శాస్త్రములోని అర్చనలు ఆచారములు బల్యర్పణలు అను వాటివైపు తిరుగుచున్నందున ధర్మశాస్త్ర ఆచారములవైపు తిరగ కూడదని యేసు ద్వారా కలుగు రక్షణయందు నిలిచియుండుటకు విశేషముగా జాగ్రత్త పడవలెనని చెప్పుచున్నాడు. 2-4వ.లలో క్రీస్తు ద్వారా కలగబోవు రక్షణను గూర్చి పాత నిబంధన గ్రంథములు దేవదూతల ద్వారా పలకబడిన మాటలు స్థిరపరచ బడెను అని చెప్పుచున్నాడు. ఈ రక్షణవార్త యేసు ప్రభువు బోధించుట ద్వారా ఆరంభమై దేవుడు తన చిత్తానుసారముగ సూచక క్రియల చేతను, అద్భుతముల చేతను వివిధములైన పరిశుద్ధాత్మ వరములు అనుగ్రహించుట చేతను స్థిరపరచెను. అందువలన ఈ సంగతులను విడిచిపెట్టి కొట్టుకొని పోకూడదని చెప్పుచున్నాడు. మార్కు. 4:15వ.లో విత్తువాని ఉపమానంలో త్రోవ ప్రక్కన విడిచిపెట్టిన విత్తనములను దుష్టుడు కొనిపోగా అక్కడ ఫలము రాలేదు. 2:1-4. వచనముల భాగము త్రోవ ప్రక్కన పడిన విత్తనముతో పోలినది.

**దూతలకంటె, ఆదాముకంటె క్రీస్తు శ్రేష్ఠుడు (5-9వ.)** : రాబోవు లోకమును దేవుడు దూతలకు లోపరచలేదు మనుష్యుడైన ఆదామును మానవుడుగా జన్మించిన క్రీస్తును దేవుడు దర్శించాడు ఆదాము పాపము చేసి దేవుడు తనకిచ్చిన స్థానము పోగొట్టుకొన్నాడు. కాని క్రీస్తు తన స్థానము నిలుపుకున్నాడు. దేవదూతలకంటె, ఆదాము మరియు క్రీస్తు తక్కువగా చేయబడిరి. ఆదాము పాపము చేసి దేవుడిచ్చు మహిమను పోగొట్టుకున్నాడు గాని క్రీస్తు మహిమా ప్రభావముతో కిరీటము ధరించినవాడై హెచ్చించబడెను దేవుడు తాను చేసిన సృష్టి మీద ఆదామునకు, క్రీస్తుకు అధికారమిచ్చెను ఆదాము ఆ అధికారమును కోల్పోయెను. కాని క్రీస్తు నేటికిని అధికారిగా ఉన్నాడు. ఆదాము మొదలు ప్రతి మానవుడు చేసిన పాపము కొరకై క్రీస్తు మరణమును అనుభవించాడు. మహిమా ప్రభావములో కిరీటము ధరించినవాడైనందున ఆదాముకంటే, దేవదూతలకంటే క్రీస్తు శ్రేష్ఠుడుగా ఉన్నాడు.

**శ్రమల ద్వారా సంపూర్ణ శ్రేష్ఠుడైన రక్షణకర్తయైన క్రీస్తు (10-14వ. 15-18వ.)** : దేవుడు తాను పవిత్రుడైనందున తన పిల్లలమైన మనమును పవిత్రులముగా నుండవలెనని కోరుచున్నాడు. మానవులు రక్తమాంసము గలవారై, పాపము చేసినవారు. దేవుడు ఆత్మయైనను మన నిమిత్తము రక్త మాంసములలో పాలివాడైనాడు. పాపమును బట్టి

మానవుడు అపవాదికి దాసుడై మరణమునకు పాత్రుడు కాగా పరిశుద్ధుడైన దేవుడు తన రక్తమును చిందించుట ద్వారా పాపమును పరిహరింప తలపెట్టాడు. అందులకు రక్తమాంసము గల దేహమును, అనగా మానవ శరీరమును ధరించుకొన్నాడు. (1 తిమోతి 3:15వ. హెబ్రీ 10:4వ) క్రీస్తు తాను సృజించిన దేవదూతల స్వభావమును ధరించుకొనక, దూతలకంటె తక్కువైన **మానవుల స్వభావమును అన్ని విషయములలో ధరించుకొన్నాడు** అన్ని విషయములలో ఏమి లేని రిక్తుడుగానుండెను. మానవులవలె అన్ని విషయములలో శోధించబడి శ్రమ పొందినను పాపము లేనివాడుగానున్నందున శోధనలో ఉన్న వారికి సహాయము చేయశక్తి గలవాడైయున్నాడు. ప్రజల పాపములకు పరిహారము చేయుటకు ప్రస్తుతము దేవుని కుడిపార్శ్వమున విజ్ఞాపన చేయు నిరంతర యాజకుడుగాను, ఉత్తరవాదిగాను ( 1 యోహాను 2:1-2వ) ఉన్నాడు.

## 3వ అధ్యాయము 6+5+8=19 వచనములు
## అంశము : క్రీస్తు మోషే కంటె శ్రేష్ఠుడు

**మోషే కంటె శ్రేష్ఠుడు (1-6వ.)** : మనము పరలోక సంబంధమైన పిలుపు కలవారము. పిలుపును గూర్చిన వివరము అ.కా. 12వ అధ్యాయము చివరలో చూడగలము. ఈ లోకములోని పనులకై పిలువబడినప్పుడు ఏ పిలుపు ఉన్నతమైనదో దానిని మనము ఎన్నుకొందుము. క్రీస్తు మనలను పర సంబంధమైన పిలుపుతో పిలిచాడు కాబట్టి ఎంతో జాగ్రత్తగా ఆ పని చేయాలి. మోషేకంటే క్రీస్తు శ్రేష్ఠతలు క్రింద చెప్పబడినవి.

1) 2వ. మోషే దేవుని ఇల్లంతటిలో నమ్మకస్థుడు కాని క్రీస్తు ఇంటికి పైగానున్న వాడుకనుక శ్రేష్ఠుడు 3వ. మోషే కంటె ఎక్కువ మహిమకు అర్హుడు. మోషే ఇంటిలో సేవకుడు, క్రీస్తు ఇంటికి అధిపతి కట్టినవాడు.

**రెండవ జాగ్రత్త - జీవముగల దేవుని విడిచిపెట్టకూడదు (7-19వ.)** : 7-11వ.లలో ఇశ్రాయేలీయులు అరణ్య ప్రయాణములో శోధించబడినప్పుడు హృదయములను కఠిన పరచుకొనిరి కాని దేవునియందు నమ్మికయుంచలేదు. ఇశ్రాయేలీయులు తప్పిపోయిరి కనుక వారు విశ్రాంతిలో ప్రవేశింపలేదు. అటువలెనే జీవముగల దేవుని యొద్దకు వచ్చు వారిలో విశ్వాసము లేని దుష్ట హృదయము ఉన్న యెడల శ్రమలు కలిగినప్పుడు పాపము చేత భ్రమ కలిగి జీవము గల దేవుని విడిచిపెట్టి పోగలరు. అరణ్యములో పితరులు అవిశ్వాసము చేత ప్రవేశింపక పోయినట్లు మీరును హృదయంమందు

విశ్వాసము లేనివారు కనుక వీరు అవిశ్వాసులే. దీనిని విత్తువాని ఉపమానంలోని రెండవ విత్తనంతో పోల్చవచ్చు. హృదయమందు విశ్వాసము లేక కేవలం నోటితోనే క్రీస్తును అంగీకరించితి మన్నవారు. విశ్వాసులు కారు. శ్రమలలో ఈ విషయము బయలుపడును కనుక వారు జీవముగల దేవుని విడిచిపెట్టిరి.

## 4వ అధ్యాయము 5+5+3+3=16 వచనములు
## అంశము : యెహోషువ కంటే శ్రేష్ఠుడు

**విభజన - యెహోషువ వలన కలిగిన విశ్రాంతి అసంపూర్ణమైనది (1-5వ.)** : ఇశ్రాయేలు జనులకు వాక్యము ప్రకటింపబడినను వారు వినిన వారితో విశ్వాసము కలవారితో కలసి ఉండలేదు కనుక ఆ వాక్యము నిష్ప్రయోజనమాయెను. దేవుని కార్యములన్నియు సంపూర్ణములైనను విశ్వాస విషయములో సంపూర్ణ కార్యము వీరిలో జరగలేదు కనుక కనాను దేశములో వారికి నిజమైన విశ్రాంతి దొరకలేదు.

**క్రీస్తు ద్వారా కలిగిన విశ్రాంతి సంపూర్ణమైనది (6-10వ.)** : 8-10వ.లలో యెహోషువ వారికి విశ్రాంతి కలుగజేసిన యెడల ఆ తరువాత మరి యొక దినమును గూర్చి చెప్పక పోవును. కనుక దేవుని ప్రజలకు నిజమైన విశ్రాంతి దొరకలేదు. దీనిని బట్టి యేసుక్రీస్తు వారు నిజమైన విశ్రాంతి నివ్వడానికి ఈ లోకమునకు వచ్చెనని మత్తయి 11:28,29,30. వచనములలో చదువుచున్నాము. యేసు క్రీస్తు ద్వారా పాపముల నుండి రక్షించ బడినపుడు పాపభారము పోయి విశ్రాంతి లభించింది. ఇది ఆత్మకు విశ్రాంతి. క్రీస్తు సేవను మోయుట వలన ప్రాణములకు విశ్రాంతి కలుగును. మనసునకు, ప్రాణమునకు నెమ్మది కలుగుతుంది. క్రీస్తు వచ్చినపుడు క్షయమైన శరీరము అక్షయతను ధరించుకొనును గనుక శరీరమునకు విశ్రాంతి కలుగుతుంది యెహోషువ కలుగజేసిన విశ్రాంతిలో ఇవి లేవు కనుక క్రీస్తు యెహోషువ కంటే శ్రేష్ఠుడు.

**మూడవ జాగ్రత్త - అవిధేయత వలన పడిపోవుట (11-13వ.)** : అవిధేయత అనగా 12వ. ప్రకారము వాక్యమునకు అవిధేయత అని గమనించాలి వాక్యము సజీవమైనది బలముగలది ఖడ్గము కంటే వాడిగలది. 1) ప్రాణమును, 2) ఆత్మను, 3) శరీరములోని కీళ్ళను, మూలుగులను విభజించునంత మట్టుకు దూరును. హృదయము యొక్క ఆలోచనలు తలంపులను శోధించడము అనగా ప్రాణమును దేహమును ఆత్మను

పవిత్రంగా ఉంచును అని అర్థము. వాక్యమునకు అవిధేయులైన వారు కీర్తనలు 119:11లో చెప్పబడినట్లు (నీ ఎదుట నేను పాపము చేయకుండునట్లు నా హృదయములో నీ వాక్యముంచుకొనియున్నాను) వాక్యమునకు అవిధేయత చూపిన యెడల పాపములో పడగలరు. మనము దేవునికి లెక్క చెప్పవలెను కనుక ఈ విషయములో జాగ్రత్త కలిగి యుండాలి.

**ప్రధాన యాజకుడైన క్రీస్తు (14-16వ.) :** ఈ భాగము అయిదవ అధ్యాయమునకు పీఠికగా తలంచగలము. యేసుక్రీస్తు గొప్ప ప్రధాన యాజకుడైన అహరోనుకంటెను మిగిలిన ప్రధాన యాజకులకంటెను శ్రేష్ఠుడైయున్నాడు. మన బలహీనతలయందు సహానుభవము కలవాడు. మనవలె శోధింపబడును కాని పాపము లేనివాడుగా ఉండెను కనుక మనకు సమయోచితమైన సహాయము చేయుటకై హెబ్రీ. 2:18 ప్రకారం శక్తి కలిగినవాడు.

## 5వ అధ్యాయము 5+5+4 =14 వచనములు

## అంశము : అహరోనుకంటే ప్రధాన యాజకులకంటె శ్రేష్ఠుడు

**అహరోను యాజకత్వము (1-5వ) :** 1) ప్రతి ప్రధాన యాజకుడు మనుష్యులో నుండి వచ్చిన వాడు కాని క్రీస్తు దేవుని యొద్ద నుండి వచ్చినవాడు, 2) ప్రధాన యాజకులు మనుష్యుల చేత నియమించబడువాడు కాని క్రీస్తు దేవుని చేత నియమించబడెను, 3) ప్రధాన యాజకుడు కొద్ది కాలమే జీవించును కనుక ఒకరి తరువాత ఒక్కరు వచ్చి అనేకులైరి మరియు వారి యాజకత్వము కాల పరిమితి కలది. క్రీస్తు ఒక్కడే, క్రీస్తు నిరంతర ప్రధాన యాజకుడు, 4) ప్రధాన యాజకుడు. బలహీనతలకు లోనైనవాడు కనుక తమ పాపముల కొరకు అర్పణ చేయువాడు. క్రీస్తు పాపము అవసరము లేనివాడు కనుక తన కోసము అర్పణ లేనివాడు. ప్రధాన యాజకుడు సంపూర్ణ సిద్ధి కలుగజేయని బలులు ఏటేటా అర్పించిరి. క్రీస్తు సదాకాలము నిలుచు ఒకే బలిని అర్పించెను, 5) క్రీస్తు బలి సంపూర్ణ సిద్ధి కలుగజేసినందున క్రీస్తును దేవుడు మహిమ పరచెను.

**మెల్కీసెదెకు క్రమము చొప్పుననున్న ప్రధాన యాజకుడైన క్రీస్తు (6-10వ.) :** కీర్తనలు 110:4వ.లో ప్రస్తావించబడిన మెల్కీసెదెకు ఆయనే అని 7:1-3వ. గ్రహించగలము. శరీర ధారియైయున్న దినములో మహారోదనముతోను కన్నీళ్ళతోను ప్రార్థించి భయభక్తులు

కలిగి దేవునికి యాచనలు సమర్పించినందున అంగీకరింపబడును. తాను పొందిన శ్రమల వలన విధేయత నేర్చుకొనెను. క్రీస్తు సంపూర్ణ సిద్ధి కలిగినవాడై నిత్య రక్షణకు కారకుడై మన పక్షముగా తండ్రి యొద్ద విజ్ఞాపన చేయు నిరంతర యాజకుడైయున్నాడు.

## 6వ అధ్యాయము 8+4+8 =20 వచనములు

## అంశము : అబ్రాహాము కంటె శ్రేష్ఠుడు

**నాలుగవ జాగ్రత్త - వాక్యము వినుటకు మందులగుట - ఫలము పొందకపోవుట (11-14వ, 6:1-8వ, 9:12వ.)** : విశ్వాసులు వాక్యమును వినుటకు మందులగుట జరుగుచున్నది. అందుకే అనేక సంఘములలో బోధకులుగా నుండవలసిన వారు శిశువులుగా నుండి పాలు త్రాగుచున్నారు. సంఘములలో బోధకులు అనేకులు లేరు. ఉన్న బోధకులు వాక్య అనుభవము లేనివారు. మూల పాఠములను నేర్చుకొనుచున్నారు (5:12). మూల ఉపదేశ ములను మానవలెనని 6:2లో చెప్పుచున్నాడు. 5వ. వెలిగించబడి, పరలోక సంబంధమైన వరమును రుచిచూచి పరిశుద్ధాత్మలో పాలివారు అనగా రక్షించబడినవారు కొంతకాలము వాక్యమును అనుభవించి, దేవునిశక్తిని ప్రభావమును అనుభవించిన తరువాత తప్పి పోయినవారు ప్రభువును సిలువ వేసినట్లే వారిని చూచిన లోకస్తుల ద్వారా క్రీస్తుకు అవమానము కలుగును. 6వ వచములో తప్పిపోయిరి అనగా పాపములో పడిరి. 7వ వచనములో భూమి తనపై పడు వర్షమును త్రాగి మంచి ఫలములు ఫలించుట. వాక్యమను నీటిని త్రాగి ప్రభువుకు ఆత్మ ఫలమును (గలతీ. 5:22) ఫలించినట్లే లేదా ముండ్ల తుప్పలు గచ్చ తీగలు మొలుచుట వాక్యమును విని మందులుగా నుండి జీవితములో పాపమును కలిగియుండుటతో సమానము. తుదకు ముండ్ల తుప్పలను రైతు కాల్చివేయును. ఆలాగే 2 కొరింథీ. 5:10వ. ప్రకారము విశ్వాసి తాను జరిగించిన క్రియలు మంచివైనను చెడ్డవైనను అని తీర్పు తీర్చబడును. 1 కొరింథీ. 3:13-15వ. ప్రకారము చెడ్డ క్రియలు అగ్ని పరీక్షలో కాలిపోవును. మంచి క్రియలు/ కార్యములు, జీతమును/ఫలమును ఇచ్చును. ఈ భాగములో 6వ వచనములో తప్పిపోయిన వారిని గురించిన ఆలోచన జరుగుచున్నది. వారి క్రియలు 1 కొరింథీ 3:13-15వ ప్రకారము ముండ్లతుప్పలు కాలిపోవునట్లు కాలిపోవును. కాని తన మట్టుకుతాను అగ్నిలోనుండి లాగినట్లు రక్షింపబడును కనుక వెలిగింపబడినవారు పరసంబంధమైన

పిలుపులో పాలు పొందినవారు, పరిశుద్ధాత్మలో పాలుపంపులు పొందినవారు అనగా రక్షింపబడిన వారు. వారికి రక్షణ శాశ్వతము కాని తప్పిపోయి పాపములో పడినందుకు ఫలము పోయినది. మనము ఇంతకంటే మంచి స్థితిలోనుండాలి. ఆసక్తిని తుదమట్టుకు కనపరచవలెను. వాక్యమును విని నెరవేర్చుటకు మందులము కారాదు.

**అబ్రహాముకంటే శ్రేష్ఠుడు (13-20వ.)** : దేవుడైన క్రీస్తు నేను తండ్రి ఏకమైయున్నాము అని నా యందు తండ్రి, తండ్రియందు నేను ఉన్నాము అని యోహాను 14:9-10వ. చెప్పాడు. దేవుడు అబ్రహాములో వాగ్ధానము చేసినపుడు ఏ గొప్పవాని తోడు అనక తన తోడు అనుటలో దేవుడు అబ్రహాముకంటే గొప్పవాడు తండ్రియైన దేవునిలో క్రీస్తు ఉన్నందున క్రీస్తు గొప్పవాడు. క్రీస్తు అబ్రహాముకు దేవుడు తండ్రి మరియు క్రీస్తు, 1) నిశ్చయముగా నిన్ను ఆశీర్వదింతును, 2) నిశ్చయముగా నిన్ను విస్తరించుదును అన్నాడు. గలతీ 3:14,29వ ప్రకారము దేవుని వాగ్ధానములన్ని సంఘమునకు నెరవేరును. వాగ్ధానము చేసిన వాడగు క్రీస్తు, ప్రధాన యాజకుడగు యేసు మనకంటె ముందుగా పరలోకములో ప్రవేశించినందున మన నిరీక్షణకు లంగరు వంటి నిశ్చయము పరలోకములో ఉన్నది. దీని భావము అబ్రాహాము కంటే శ్రేష్ఠుడైన క్రీస్తు అబ్రహామునకు చేసిన వాగ్ధానమును ఆయన శరీర సంతానముయైన ఇశ్రాయేలుకు, ఆత్మీయ సంతానయైన సంఘమునకు నెరవేర్చును.

## 7వ అధ్యాయము 3+7+6+6+6=28 వచనములు
## అంశము : లేవీకంటే శ్రేష్ఠుడు

**క్రీస్తును పోలిన రాజు, యాజకుడైన మెల్కీసెదెకు (1-3వ.)** : మెల్కీసెదెకు షాలేము (యెరూషలేము) రాజు, దేవుని నిరంతర యాజకుడు, సమాధాన రాజు, మనుష్య కుమారుడైన క్రీస్తును పోలినవాడు కనుక అబ్రహాము దగ్గర పదియవవంతు పుచ్చుకొన్నాడు.

**లేవీకంటే శ్రేష్ఠుడు (4-10వ.)** : అబ్రాహామునకు ఆది 14వ అధ్యా. సొదమ గొమఱ్ఱా రాజును శత్రువుల నుండి విడిపించినపుడు కొల్లసొమ్ము దొరికెను. అందులో అబ్రహాము మెల్కీసెదెకునకు దశమభాగమిచ్చెను. అబ్రహాము దశమభాగ మిచ్చినపుడు అందరి దగ్గర దశమ భాగము పుచ్చుకొను లేవి అబ్రహాము గర్భమందున్నందున లేవీయు మెల్కీసెదెకుకు దశమ భాగము ఇచ్చినట్లేయని చూడగలము. దశమ భాగము ఇచ్చిన

వానికంటె పుచ్చుకొనువాడు శ్రేష్ఠుడు కనుక లేవీకంటె మెల్కీసెదెకు శ్రేష్ఠుడు. మెల్కీసెదెకును పోలిన మనుష్య కుమారుడైన క్రీస్తు లేవీకంటే శ్రేష్ఠుడు.

**లేవీ యాజకత్వము క్రీస్తుకు అప్పగించబడినందున క్రీస్తు శ్రేష్ఠుడు (11-16వ.) :** ధర్మశాస్త్రమునందు యాజకత్వము లేవీయుల కివ్వబడినది. కాని లేవీ గోత్రమునకు, అహరోను క్రమమునకు చెందనివాడు, మెల్కీసెదెకు క్రమమునకు చెందిన క్రీస్తుకు యాజకత్వ మివ్వబడినది. శరీరానుసారముగా నెరవేర్చబడు ఆజ్ఞలు గల ధర్మశాస్త్రమును బట్టి లేవీయులు యాజకులైరి. నాశనములేని జీవమునకున్న శక్తిని బట్టి క్రీస్తు యాజకుడై నందున క్రీస్తు లేవికంటే శ్రేష్ఠుడు.

**క్రీస్తు మరణించి లేచినందున నిరంతరము జీవించు యాజకుడు (17-22వ.) :** ధర్మశాస్త్రము బలహీనమైనది, నిష్ప్రయోజనమైనది కనుక నివారణ చేయబడినది. దాని వెంట శ్రేష్ఠమైన నిరీక్షణ (నిబంధన) ప్రవేశపెట్టబడి నిరంతరము ఉండువాడైన క్రీస్తును, మార్పులేని యాజకత్వము జరిగించు క్రీస్తును, నిరంతర యాజకుడుగా నియమించెను.

**బలహీన యాజకులైన లేవీయులు - సంపూర్ణ యాజకుడైన క్రీస్తు (23-28వ.) :** లేవీ గోత్రమందలి యాజకులు బలహీనులు, పాపమును బట్టి మరణించుట చేత ఎల్లప్పుడు ఉండలేరు. 26వ. క్రీస్తు పవిత్రుడు, నిర్దోషి, నిష్కల్మషుడు, పాపులలో చేరక ప్రత్యేకముగా నున్నవాడు కనుక సంపూర్ణుడు, తన యొద్దకు వచ్చు వారిని సంపూర్ణముగా రక్షించువాడు. పాపముల విషయమై సదాకాలము నిలుచు ఒకే బలిని ఒక్కసారే అర్పించి ముగించెను.

## 8వ అధ్యాయము 6+7=13 వచనములు
## అంశము : శ్రేష్ఠమైన గుడారమునకు, నిబంధనకు సేవకుడైన క్రీస్తు

**శ్రేష్ఠమైన గుడారమునకు సేవకుడు (1-6వ.) :** ధర్మశాస్త్ర ప్రకారం నియమించబడిన యాజకులు పరలోక సంబంధమగు వస్తువుల ఛాయా రూపకమైన గుడారమందు (ప్రత్యక్ష గుడారము అను దేవాలయము) సేవ చేయుదురు. క్రీస్తు పరలోకమందలి ఆలయము అనగా మహామహుడగు దేవుని సన్నిధిలో (దేవాలయము అనగా దేవుడు నివసించు స్థలము లేదా దేవుని సన్నిధి) కుడి పార్శ్వమున కూర్చుండియున్నాడు కనుక ప్రత్యక్ష గుడారముకంటే శ్రేష్ఠమైన గుడారమగు పరలోకములో సేవకుడుగా దేవుని సన్నిధియగు పరిశుద్ధ ఆలయములో ప్రధాన యాజకుడుగా ఉన్నాడు కనుక క్రీస్తు శ్రేష్ఠమైన

గుడారమునకు సేవకుడు. ప్రతి ప్రధాన యాజకుడు భూమి మీద అర్పణలు అర్పించుదురు. క్రీస్తు కన్నీళ్ళతోను, రోదనతోను మన కొరకు ప్రార్థనలు యాచనలు గత 2000 యేండ్లుగా దేవునికి సమర్పించుచున్నందును భూమి మీదనుండిన యాజకుల కంటె శ్రేష్ఠమైన అర్పణను క్రీస్తు అర్పించుచున్నాడు. అందువలన లేవి గోత్రమునకు చెందిన యాజకుల సేవకత్వముకంటే క్రీస్తు సేవకత్వము శ్రేష్ఠమైనది.

**శ్రేష్ఠమైన నిబంధనకు సేవకుడు (7-13వ.)** : మొదటి నిబంధన లోపము కలిగినది కనుక దేవుడు క్రొత్త నిబంధన చేసెను. రోమా 8:2వ ప్రకారము మానవులను పాపము వలన వచ్చు జీతము మరణము అను పాప మరణముల నియమము నుండి ధర్మ శాస్త్రము విడిపింపలేక పోయినది. క్రీస్తు యేసునందలి జీవమునిచ్చు ఆత్మయొక్క నియమము (క్రొత్త నిబంధన) పాప మరణముల నియమము నుండి నన్ను విడిపించెను. ఈ క్రొత్త నిబంధన క్రీస్తు యేసునందున్నదని శ్రేష్ఠమైన నిబంధనయని, క్రీస్తు శ్రేష్ఠమైన నిబంధనకు మధ్యవర్తియని నేర్చుకొనుచున్నాము.

## 9వ అధ్యాయము 5+5+6+6+6=28 వచనములు
## అంశము : శ్రేష్ఠమైన నిబంధనను బట్టి కలిగిన శ్రేష్ఠమైన బల్యర్పణ చేసిన క్రీస్తు

**పాతన నిబంధనలోని ప్రత్యక్షగుడార ఉపకరణములు (1-5వ)** : మొదట నిబంధన సేవా నియమములు లోక సంబంధమైన మందిరములోని పరిశుద్ధ స్థలములోనుండును. మొదట మందిరముగా ఒక గుడారము ఏర్పడింది. అందులో ముందుగా పరిశుద్ధ స్థలము దాని లోపల అతి పరిశుద్ధ స్థలముండెను. పరిశుద్ధ స్థలములో 1) దీప స్థంభము, 2) సన్నిధి రొట్టెల బల్ల దాని మీద రెండు వరుసలలో ఉంచబడిన ఆ 6+6 రొట్టెలు, 3) దూపవేదికనుండెను. రెండవ తెరకు లోపల అతి పరిశుద్ధ స్థలము ఉండెను. అందులో 1) మన్నాగల బంగార పాత్ర, 2) చిగిరించిన అహరోను కర్ర, 3) నిబంధన పలకలు కలిగిన ఒక్క పెట్టెవంటి బంగారు రేకుతో తాపబడిన నిబంధన మందసము ఉండెను. ఈ మందసము పైనున్న కరుణ పీఠమును కప్పుచున్న రెండు కెరూబులు రెండు ఎదురెదురు మూలలపైనుండును.

**గుడారములోని సేవ - మొదట నిబంధనలోని లోపము (6-10వ.)** : గుడారములో యాజకులు సేవ చేయుచు నిత్యము మొదట గుడారమగు పరిశుద్ధ స్థలములోనికి

మాత్రమే వెళ్ళుదురు. సంవత్సరమునకు ఒక్కసారి మాత్రమే ప్రధాన యాజకుడు ఒక్కడే రక్తము చేత పట్టుకొని రెండవ గుడారములోనికి అనగా అతి పరిశుద్ధ స్థలములోనికి ప్రవేశించును. ఆ రక్తము తన కొరకు ప్రజల పాపముల కొరకు అర్పించును. ప్రజలయితే పరిశుద్ధ స్థలములోనికి కాని, అతి పరిశుద్ధ స్థలములోనికి కాని వెళ్ళక, ఆవరణములో ఉంటారు. దీని భావము పరలోకమునకు సాదృశ్యముగానున్న అతి పరిశుద్ధ స్థలములోనికి ప్రధాన యాజకు సంవత్సరమునకు ఒక్కసారి మాత్రమే వెళ్ళును యాజకులు కాని ప్రజలు కాని వెళ్ళుటకు వీలు లేదు. పాతనిబంధన దాని సేవ లోపము కలది. కనుక ప్రతి ఏట అర్పించబడు బలులు, అర్పణల ద్వారా ఆరాధికునికి సంపూర్ణ సిద్ధి కలుగలేదు. అందుకే ప్రధాన యాజకులు సంవత్సరము తర్వాత సంవత్సరము బలులు అర్పించుచుండిరి.

**పరలోకమందున్న దేవుని యొద్దకు మార్గమును ఏర్పర్చిన క్రీస్తు బల్యర్పణ - రక్తము ద్వారా క్రొత్త నిబంధనకు మధ్యవర్తియైన క్రీస్తు (11-16వ.)** : 10:1 ప్రకారము ధర్మశాస్త్రము రాబోవుచున్న మేలుల ఛాయ కలది కాని, క్రీస్తు రాబోవుచున్న మేలుల నిజ స్వరూపమని కొలస్స. 2:17లో ఉన్నది. క్రీస్తు రాబోవుచున్న మేలుల విషయమై ప్రధాన యాజకుడుగా వచ్చి నిత్యమైన విమోచన, తన రక్తము ద్వారా సంపాదించి పరిపూర్ణమైన గుడారమగు తన శరీరము ద్వారా మేకల రక్తముతో కాక తన స్వరక్తముతో ఒక్కసారే పరిశుద్ధ స్థలమయిన పరలోకములో ప్రవేశించెను కనుక ఆయన మరణము ద్వారా మన అపరాధములకు క్షమాపణ దొరికినది. నిత్యమైన స్వాస్థ్యమగు పరలోకము మనకు లభించుటను గూర్చిన వాగ్దానమునకు అనగా క్రొత్త నిబంధనకు క్రీస్తు మధ్యవర్తియై యున్నాడు.

**ధర్మశాస్త్ర ప్రకారము రక్తము చిందించుట ద్వారా పాప క్షమాపణ (17-22వ.)** : మొదట నిబంధనలో యాజకులు ఎడ్ల యొక్కయు మేకల యొక్క రక్తమును, గ్రంథము మీదను, గుడారము మీదను సేవా పాత్రల మీదను ప్రజలందరి మీదను ప్రోక్షించెదరు. ఎందుకనగా 22వ. ప్రకారము రక్తము చిందించకుండా పాప క్షమాపణ కలుగదు.

**క్రీస్తు యొక్క శ్రేష్ఠమైన బల్యర్పణ ద్వారా కలిగిన సంపూర్ణ పాప క్షమాపణ (23-28వ.):** హెబ్రీ. 10:4 ప్రకారము ఎడ్లయొక్కయు మేకల యొక్కయు రక్తము పాపము తీసివేయుట అసాధ్యము. ధర్మశాస్త్ర ఆచరణను బట్టి పరలోకమందున్న వాటిని పోలిన వస్తువులు జంతు బలుల వలన శుద్ధి చేయబడెను కాని పరలోక సంబంధమైనవి వీటికంటె శ్రేష్ఠమైన

క్రీస్తు బల్యర్పణ ద్వారా శుద్ధి చేయబడెను కనుక క్రీస్తు దేవాలయములోని అతి పరిశుద్ధ స్థలములో ప్రవేశించ లేదు కాని అతి పరిశుద్ధ స్థలము దేనికి పోలికగానున్నదో ఆ పరలోకములో ప్రవేశించెను.

ప్రధాన యాజకునివలె అనేక పర్యాయములు కాక తన్ను తాను ఒక్కసారే బలిగా అర్పించుకొనుట ద్వారా పాప నివారణ చేయును. తన కొరకు కనిపెట్టుకొను యుండు వారి రక్షణ కొర్కై ఇంకొక్కసారి ఈ లోకములో ప్రత్యక్షమాయెను. క్రీస్తు యొక్క మూడు ప్రత్యక్షతలు రెండు భూలోకములో ఒకటి పరలోకములో ఈ భాగములో చూడగలము. 1) 26వ. ప్రకారము పాప నివారణ చేయుటకు 2 వేల యేండ్ల కాలములో ఈ లోకములో ప్రత్యక్షమాయెను. (గతకాలము) 2) 24వ. ప్రకారము మన కొర్కై విజ్ఞాపన చేయుటకు క్రీస్తు ప్రస్తుతము గత 2వేల యేండ్లుగా పరలోకములలో ప్రత్యక్షమైయున్నాడు. (వర్తమాన కాలము) 3) 28వ ప్రకారము తన కొరకు కనిపెట్టుకొని యుండు వారి రక్షణ కొర్కై పాపము లేకుండా ఈ లోకములో రెండవసారిగా లేదా చివరి సారిగా ప్రత్యక్షమగును.

## 10వ అధ్యాయము 4+5+5+4+7+6+8=39 వచనములు
## అంశము : శ్రేష్ఠమైన బలిని అర్పించిన క్రీస్తు (9:21-10:18)

**విభజన - పాత నిబంధన బలులు (1-4వ.)** : ధర్మశాస్త్రము రాబోవుచున్న మేలుల ఛాయయేగాని నిజ స్వరూపము కానేకాదు కనుక అర్పించబడు బలులు కూడా స్వరూపము కలిగినవి కావు. వాటిద్వారా పాప క్షమాపణ కలుగదు. అవి జ్ఞాపకార్థమైనవే కనుక ఏటేట పాపమును జ్ఞాపకము చేయును. పుట్టిన దినమువలే ఏటేటా చేసిన పాపము జ్ఞాపకమునకు వచ్చుచుండెను. పాపము తీసివేయబడలేదు.

**క్రొత్త నిబంధన బలికి లేఖనముల ఆధారము (5-9వ.)** : క్రీస్తు యేసు కీర్త. 40:6-9 వచనములలో తనను గూర్చి ప్రవచించబడిన రీతిగా తన్ను తాను బలిగా అర్పించుకొను నిమిత్తము శరీరము అమర్చుకొని ఈ లోకమునకు వచ్చెను.

**శ్రేష్ఠమైన బలిని అర్పించిన క్రీస్తు (10-14వ.)** : ప్రతి ప్రధాన యాజకుడు పాపమును ఎన్నటికి తీసివేయని అనేక బలులనే మాటిమాటికి అర్పించుచు గుడారములో నిలువబడి సేవ చేయుచుండెను. ఈయనైతే పాపములను క్షమించుటకు సదాకాలము నిలుచు ఒక్కబలిని ఒక్కసారే అర్పించి కార్యము ముగించినందున దేవుని కుడిపార్శ్వమున

కూర్చుండియున్నాడు. ప్రతి ప్రధాన యాజకుడు భూమి మీద దేవాళయములో నిలువబడియుండుట ద్వారా కార్యము సంపూర్తి కాలేదని క్రీస్తు పరలోకములో కూర్చుండి యుండుట ద్వారా పాప క్షమాపణ కార్యమును సంపూర్తి చేసి యున్నాడని నేర్చుకొను చున్నాము.

**క్రీస్తు బలివలన కలిగిన ఫలితము (15-18వ.)** : క్రీస్తు బలి వలన పాపములకు సంపూర్ణమైన క్షమాపణ కలిగిననందున పాప పరిహారార్థ బలి ఇక ఎన్నడును ఉండదు, 17వ.లో పాపములను, అతిక్రమములను ఇక ఎన్నడు జ్ఞాపకము చేసుకొనను అన్నాడు. కీర్త. 103:12, యెషయా 37:17లో, మీకా 7:19లో, యెషయా 43:2లో చెప్పిన మాటను యేసు ప్రభువు మరల జ్ఞాపకము చేసియున్నాడు. 1 కొరి. 6:11 వ్రాయబడిన మాట ప్రకారము దేవుని ఆత్మయందు కడుగబడినవారై పరిశుద్ధ పరచబడి, నీతిమంతులుగా తీర్చబడితిరి.

**అయిదవ జాగ్రత్త - మనస్సాక్షికి కల్మషము తగలకుండా కాపాడుకొనుట (19-39వ.)**: యేసుక్రీస్తు తన శరీరమందు మరణము ద్వారా చిందించిన రక్తమును బట్టి అతి పరిశుద్ధ స్థలమైన పరలోకమున ప్రవేశించినందున మనమును అక్కడకు వెళ్ళుదుమను నిరీక్షణ కలిగియున్నాము. పరిశుద్ధ స్థలములో ప్రవేశించవలసిన వారము కనుక పాపము చేసి మనస్సాక్షికి కల్మషము కలిగించు వారముగానుండరాదు. ప్రోక్షించబడిన హృదయము కలవారమై దేవుని సన్నిధికి అనగా పరలోకమునకు చేరువారమైయుండాలి. కొందరు సమాజముగా కూడుట మానుచున్నారు. సహవాసమునకు రాకపోవుట ద్వారా క్రీస్తుకు దూరము కాగలము. బుద్ధి పూర్వకముగా పాపము చేయుగలము. 32వ వచనంలో మీరు వెలిగింపబడినవారని, 26వ.లో సత్యము గూర్చి అనుభవ జ్ఞానము కలవారని వ్రాయబడినందున హెచ్చరిక విశ్వాసులను గూర్చినదియే అని గుర్తించుచున్నాము. 26 వచనములో బుద్ధి పూర్వకముగా పాపము చేయుచుండిన యెడల (Keep on Sinning) న్యాయపు తీర్పును ఎదుర్కొనాలి. విరోధులను దహించు తీక్షణమైన అగ్నియుండునని వ్రాయబడినది.. న్యాయపు తీర్పు జరుగుస్థలము క్రీస్తు న్యాయపీఠమే అని గమనించ వలెను. 2 కొరి. 5:10, 1 కొరి. 3:13-15లో వివరములు హెబ్రీ 6:1-8వ వచనములలో వివరించబడియున్నవి. మరొకసారి వాటిని చదవండి. హెబ్రీ. 10:29లో కృపకు మూలముగ

ఆత్మను తిరస్కరించుట అనగా పరిశుద్ధాత్ముడు పాపము చేయకూడదని మన హృదయములో మనకు చెప్పుచున్నను బుద్ధి పూర్వకముగా పాపము చేయుటయే అని గమనించాలి. అటువంటి వారికి ఎక్కువైన దండన అనగా వారి ఫలమును పోగొట్టుకొని నష్టము పొందుటయే అని గమనించగలము. 30వ.లో ప్రభువు తన ప్రజలకు అనగా రక్షింపబడిన వారికి తీర్పు తీర్చునని ప్రతిఫల మిచ్చునని ఉన్నందున దీని వివరము 2 కొరి. 5:10 యే అని నేర్చుకొనవలెను. 32-39వ.లలో క్రీస్తులో వెలిగింపబడిన వారు శ్రమలతో కూడిన గొప్ప పోరాటము సహించినవారు శ్రేష్ఠమైనదియు స్థిరమైనదియునైన స్వాస్థమున్నదని ఆస్తిని కోల్పోవుటకు సంతోషముగా ఒప్పుకొనువారు ఇపుడు వెనుక తీయకూడదని అనగా పాపమునకు తావు ఇవ్వకూడదని హెచ్చరించుచున్నారు. 9:35-37వ.లో త్వరగా రాబోవు క్రీస్తుద్వారా ప్రతి ఫలముగ కలుగు బహుమానమందు గురిపెట్టు కొనవలెననియు చెప్పుచున్నారు.

## 11వ అధ్యాయము 7+7+8+7+6+5=40 వచనములు

## అంశము : శ్రేష్ఠమైన శక్తిగల విశ్వాసమునకు కర్త (విశ్వాసము యొక్క విజయం)

విభజన - విశ్వాసపరులైన పూర్వీకుల విజయములు (1-7వ.) : 1-3వ.లలో విశ్వాసము యొక్క నిర్వచనం గురించి చెప్పుచున్నాడు. విశ్వాసమనగా అదృశ్యమైనవి ఉన్నవనుటకు రుజువు. అనేకులు క్రీస్తు మాకు కనబడితే నమ్ముతామంటారు కాని కనబడకుండ నమ్ముటయే విశ్వాసము 4వ.లో విశ్వాసమును బట్టి హెబేలు కయీనుకంటే శ్రేష్ఠమైన బలి అర్పించాడని హెబేలు నీతిమంతుడని దేవుడు సాక్ష్యమిచ్చెను. హెబేలు ఆరాధన సమర్పణ శ్రేష్ఠమైనది 5-6వ.లలో విశ్వాసమును బట్టి హనోకు యొక్క విజయము చెప్పబడింది. హనోకు దేవునికి ఇష్టుడని, ఆది. 5:22 ప్రకారము దేవునితో నడిచెనని సాక్ష్యము పొందెను. 7వ. నోవహు విజయము చెప్పబడింది. నోవహు విశ్వాసమును బట్టి తానుచూడని సంగతులను అనగా రాబోవు జల ప్రళయమును గురించి లోకమునకు 2 పేతురు 2:5 వచన ప్రకారము ప్రకటించి అందు నుండి రక్షింపబడుటకు అవసరమైన ఓడను సిద్ధము చేసుకొనెను. నీతికి వారసుడని చెప్పబడింది.

విశ్వాస పరులైన పితరుల విజయము (8-14, 15-22వ.) : 8-19వ.లలో విశ్వాస వీరుడైన అబ్రాహాము విజయము చెప్పబడింది. కల్దీయుల దేశములో ఉండగా అబ్రాహాము

మహిమగల దేవుని పిలుపుకు లోబడ్డాడని అ.కా. 7:1-4లోనున్నది. ఎక్కడికి వెళ్ళవలెనో ఎరుగక బయలు వెళ్ళెను. దేవుడు శిల్పియు నిర్మాణకుడైన పరలోక పట్టణము అనగా శ్రేష్ఠమైన దేశము కొరకు ఎదురు చూచెను. ఈ లోకములో పరదేశులమని గుర్తించి తాను బయలుదేరి వచ్చిన దేశమును, ఊరును జ్ఞాపకమందు ఉంచుకొనలేదు. తాను బయలుదేరి వచ్చిన ఊరిపేరు ఊరు అయినను జ్ఞాపకమందు ఉంచుకొనలేదని మరలా వెళ్ళుటకు వీలు లేనట్లుగా మరిచాడని చెప్పబడింది. మీ ఊరు ఏదని ఎవరైనా అడిగినను నా ఊరు జ్ఞాపకము లేదంటాడు. మాటల మధ్య ఊరు ప్రస్తావన వచ్చినను జ్ఞాపకమునకు రాకపోవుట ఆశ్చర్యము.

అందుకే అబ్రాహామును దేవుడు పరిశోధించుటకై తన కుమారుడైన ఇస్సాకును బలి చేయమన్నపుడు దేవుడు మృతులను సైతము లేపుటకు శక్తిమంతుడని ఇస్సాకును బలిగా ఇవ్వడానికి సిద్ధమయ్యాడు. అందుకు దేవుడు అబ్రాహాము దేవుడని పిలువ బడుటకు సిగ్గుపడలేదు. 20-22వ.లలో విశ్వాసపరులైన ఇస్సాకు, యాకోబు, యోసేపుల విజయము చెప్పబడింది.

**విశ్వాసపరుడైన మోషే విజయము (23-29వ.)** : మోషే పుట్టినపుడు సుందరుడైనను బానిసగా పుట్టినవాడే కాని, రాజకుమార్తె యొక్క కుమారుడుగాను రానున్న దినములలో ఐగుప్తును పాలించు రాజుగ పెరిగెను. కాని మోషే పెద్దవాడైనపుడు 1. ఐగుప్తు ధనముకంటే క్రీస్తు విషయమైన నింద అనుభవించుట గొప్ప భాగ్యమని, 2) అల్పకాల పాప భోగము కంటె దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలని, 3) ఫరో కుమార్తె కుమారుడుగా అనిపించుకొనుట కంటె క్రీస్తు కుమారుడుగా కొనసాగుట మేలని తీర్మానించుకున్నాడు. ఫరో రాజు గ్రహించగా ఐగుప్తును విడిచిపోయాడు. పస్కాలోని రక్త ప్రోక్షణ ద్వారా రక్షణను ఆచరించాడు. ఎర్ర సముద్రములో పొడి నేల మీద నడిచి వెళ్ళాడు. నలభై ఏండ్లు అరణ్యములో ఇశ్రాయేలీయులను కనాను వరకు నడిపించాడు. అందువలన మోషేను విశ్వాస పరుడైన విజయుడుగా గమనించుచున్నాము.

**విశ్వాస పరులైన విడుదల పొందిన వారి విజయము (30-35వ.)** : విశ్వాసమును బట్టి రాహబు నశింపక నాశనము నుండి తప్పించుకొనెను. గిద్యోను, బారాకు, సమ్సోను, ఎఫ్తా, దావీదు, సమూయేలు అను ప్రవక్తలు అనేక కార్యములు చేసిరి. విశ్వాసమును

బట్టి దానియేలు సింహపు నోళ్ళు మూయించెను. దావీదు సింహమును చీల్చెను. కాని ఇంగ్లాండు దేశములో గొప్ప సేవ చేసిన డేవిడ్ లివింగ్‌స్టన్‌ను సింహము పట్టుకొనెను. షద్రక్, మేషక్, అబెద్నగోలు అగ్ని గోళములను చల్లార్చెను. స్త్రీలు కొద్దిమంది మృతులైన తమ వారిని బేతనియలోని లాజరువలె బ్రతుకుట ద్వారా పొందిరి. (యోహా. 11 అధ్యా.)

**విశ్వాస వరులైనను విడుదల పొందనొల్లక యాతన పెట్టబడిన వారి విజయం (35-43వ.)** : కొందరు తిరస్కారము కొరడా దెబ్బలును బంధకముల ఖైదీను మరణము మట్టుకు అనుభవించిరి. చరిత్రలో వ్రాయబడినట్టు యిర్మీయా స్తెఫను, పౌలును చనిపోవు వరకు రాళ్ళ చేతకొట్టబడిరి. ప్రవక్తయైన యెషయా వలె రంపముల చేత కోయబడిన వారు ఖడ్గముతో చంపబడిన వారు అనేకమంది కలరు. అడవులలోను, కొండలలోను దాగియుండిరి. అట్టివారికి ఈ లోకము యోగ్యము కాదు. పొందనొల్లకపోయినను, విడుదల పొందనొల్లక యాతన పడినను వారందరు విశ్వాసము ద్వారా విజయులే అని నేర్చుకొనగలము. 39-40వ.లో పైన చెప్పబడినను మనము లేకుండ వారు సంపూర్ణులు కాకపోయిరని వ్రాయ బడెను కనుక దేవుడు మన కొరకు మరి శ్రేష్ఠమైన వాటిని సిద్ధపరచియున్నాడని గమనించ వలెను.

## 12వ అధ్యాయము 4+7+3+10+5=29 వచనములు
## అంశము : శ్రేష్ఠమైన శక్తిగల నిరీక్షణకు కర్త

**నిరీక్షణతో కూడిన ఓర్పుగలవారైయుండుట (1-4వ.)** : పై అధ్యాయములో క్రీస్తు విశ్వాసమునకు కర్తయని చూచితిమి. 11వ అధ్యాయములో చెప్పబడినవారితో పాటు పాత నిబంధన భక్తులు, క్రొత్త నిబంధన కాలములో మరణించి ప్రభువు చెంతనున్న భక్తులు గొప్ప సాక్షి సమూహముగా మేఘమువలె మనలను ఆవరించియున్నారు. మన ముందున్న ఆత్మీయ పందెపు రంగమందు ఎంత ఓపికతో నిరీక్షణ కలిగి పరుగెత్తు చున్నామో గమనించుచున్నారు. 11వ అధ్యాయములో వారి పరుగును ముందుగా ప్రభువు మనకు జ్ఞాపకము చేయుట గమనించదగినది. అదే సమయములో క్రీస్తు యేసు పరుగును కూడా మొదటి వచనములో జ్ఞాపకము చేయుచున్నాడు. మనమును విసుకక క్రీస్తును తలంచుకొని నిరీక్షన కలిగి గురియొద్దకు పరుగెత్తాలి. 1) మన మీద ఉన్న ప్రతి భారమును విడిచి పెట్టాలి, 2) పాపమును విడిచిపెట్టాలి. అనేక భారములను విశ్వాసులు తమపై మోపు కొందురు. వాటన్నిటిని విడిచిపెట్టాలి.

**ప్రభువిచ్చు శిక్షను (తర్ఫీదు) గూర్చిన నిరీక్షణ కలిగియుండుట (5-11వ.)** : ఈ ఏడు వచనములలో 9 పర్యాయములు శిక్ష అను పదము కనుపించును. తండ్రివలె ప్రభువు పందెమందు పరుగెత్తు మనలను శిక్షించును. తండ్రి క్రమశిక్ష కొరకే శిక్షించును కాని నశింపచేయుటకు కాదని గమనించాలి. అలాగే ప్రభువు మనకు క్రమశిక్షను అలవరచుటకే శిక్షించును కాని మనలను నశింపచేయుటకు కాదు. శిక్షాఫలము మనము పొందుదుమని 7వ వచనములో చెప్పుచున్నాడు. 10వ వచనములో మనము పరిశుద్ధతలో పాలు పొంద వలెనని మన మేలు కొరకే మనలను శిక్షించుచున్నాడని గమనించదగినది.

**సడలిన మోకాళ్ళను బలపరచుట (ప్రార్థన) (12-14వ.)** : ప్రభువు పరిశుద్ధుడు మనము పరిశుద్ధులముగానుండాలి కనుక బలహీనమైన మన చేతులు (సాక్ష్యము) బలపరచ బడుట, బలహీనమైన మోకాళ్ళు (ప్రార్థన) బలపరచబడుట ఎంతో అవసరము. 1 తిమోతి 2:8వలోనున్న పవిత్రమైన చేతులెత్తుట మంచి సాక్ష్యము కలిగి ప్రార్థనలో శక్తిని పొందుటకు గురుతు.

**ఆరవజాగ్రత్త. పరిశుద్ధత లేకపోవుట - దేవుని కృపను పొందకుండ తప్పిపోవుట (15-24వ.)** : క్రీస్తును నమ్మినవారు పరలోకపు యెరూషలేము అనగా ప్రకటన 21వ అధ్యాయములో చెప్పబడిన నూతన యెరూషలేములోనికి వెళ్ళువారు అక్కడ పరిశుద్ధుడైన యేసుతో నుండవలెను. కనుక పాపమును ప్రేమింపకూడదు. ఏశావు వలె శరీరమునకు గాని దాని ఆశలకు గాని తావివ్వకూడదు. శరీరమును ప్రేమించినవారు లోకమును ప్రేమించి లోతుగా వెళ్ళిన వారు మారుమనస్సు పొంది మరల విశ్వాస యాత్రలోనికి రాని ఆదికాండము లోతువంటి వారనేకులు కలరు. కనుక జాగ్రత్తగా నుండాలి.

**ఏడవ జాగ్రత్త. బుద్ధి చెప్పువారిని విసర్జించకుండుట - ప్రీతికరమైన సేవ చేయుట (25-29వ.)** : భూలోకములోను, పరలోకములోను మనకు బుద్ధి చెప్పువారున్నారు. వారి మాటలను 13:17లో చెప్పబడినట్లు మన్నన చేయుచూ జాగ్రత్త లేనియెడల దేవుని తీర్పు ఉన్నదని గమనించాలి. మన దేవుడు దహించు అగ్ని (29వ.) 1 కొరింథీ. 3:13-15వ. ప్రకారము మన క్రియలు అగ్నిచేత పరీక్షింపబడి మనము ఫలమును/జీతమును/ కిరీటములను పొందుదుము. దహించు అగ్ని ద్వారా మన పని/క్రియలు కాలిపోయి మనకు నష్టము కలుగవచ్చును కాని అగ్నిలో నుండి తప్పించుకొన్నట్టు "తన మట్టుకు

రక్షింపబడును" అన్న మాట ప్రకారము రక్షణ శాశ్వతము. హెబ్రీ 6:1-8వ వచనములలోను ఈ సంగతి వివరించబడినది.

## 13వ అధ్యాయము 6+7+6+6=25 వచనములు

## అంశము : శ్రేష్ఠమైన శక్తిగల ప్రేమకు కర్త

**వ్యక్తిగత జీవితములో శక్తిగల ప్రేమను గూర్చిన ఏడు హెచ్చరికలు (1-6వ.) :** ఈ భాగమందున్న ప్రేమ అను పదము PHICADELPHIA అని 2) అతిధ్యము అను పదము PHILOGURIOUS అని గ్రీకు భాషలో ఉన్నది. PHILO అనగా ప్రేమ అని అర్ధము. శ్రేష్ఠమైనది ప్రేమ అని 1 కొరి. 13:13లోనున్నది. ఆ శ్రేష్ఠమైన ప్రేమకు క్రీస్తు కర్త. మనమును ఆ ప్రేమ సంబంధమైన కార్యములు జరిగించు వారముగానుండాలి.

1) సహోదర ప్రేమలో నిలువరముగానుండాలి (1వ.), 2) అతిధ్యము చేయ మరవకూడదు (1వ), 3) బంధకములలో ఉన్నవారిని జ్ఞాపకము చేసుకొనాలి (2వ.) కొద్దిమంది శరీర బంధకములలోను, మరి కొద్దిమంది మానసిక బంధకములలోను, మరి కొద్దిమంది ఆత్మీయ బంధకములు బలహీనతలలో ఉన్నారు. వారిని జ్ఞాపకము చేసుకొనాలి, 4) కష్టములలో ఉన్న వారిని జ్ఞాపకము చేసుకొనాలి (3వ), 5) వివాహము (ప్రేమ) అన్ని విషయములలో ఘనమైనది. పవిత్రత ముఖ్యము (4వ), 6) ధనాపేక్ష లేనివారుగానుండాలి (5వ.), 7) ప్రభువు సహాయకుడు గనుక భయపడకుండా ఉండాలి.

**సహవాస జీవితమును గూర్చిన హెచ్చరికలు (7-13వ.) :** సహవాసములో ఉన్న మనకు వాక్యమును బోధించి, నాయకులుగానున్న వారున్నారు. 1) వారిని, 2) వారి ప్రవర్తన ఫలమును తలంచుకొనాలి, 3) వారి విశ్వాసమును అనుసరించాలి. అన్నింటి కంటే గొప్ప బోధకుడు నాయకుడైన యేసు మాదిరి మనమనుసరించాలి. మనలను ప్రేమించి మన పాప క్షమాపణ కొరకు భారమైన సిలువను యెరూషలేము పట్టణ వెలుపలికి (11వ వచన ప్రకారము శిబిరము వెలుపలికి) మోసి మన కొరకు పాప పరిహారార్ధముగా బలియై దహించ బడిన యేసును జ్ఞాపకముంచుకొనాలి. ఆయన ప్రేమతోనే మన కొరకు ప్రాణము పెట్టెనని దీని వలన క్రీస్తు ప్రేమ ఎట్టిదో మనము తెలుసుకొనగలము (1 యోహాను 3:16వ.) అందుకే క్రీస్తును శ్రేష్ఠమైన ప్రేమకుకర్తగా తలంచుచున్నాము.

**ఆత్మీయ జీవితమును గూర్చిన హెచ్చరికలు (14-19వ.)** : ఆయన శ్రేష్ఠమైన ప్రేమను తలపోసికొనుచు అశాశ్వతమైన ఈ లోకములో మన నోరు విప్పి జిహ్వా ఫలమును అనగా నాలుక ద్వారా దేవునికి స్తుతులు చెల్లించవలెనని నేర్చుకొనుచున్నాము. క్రీస్తు నివసించు ఆ రాజ్యమును మనము పొందుదుమన్న నిరీక్షణతో దాని కొరకై ఎదురు చూచుచున్నాము.

**శ్రేష్ఠమైన కాపరియైన క్రీస్తు (20:21వ.) - వందనములు (22-24వ.) (20-25వ.)** : క్రీస్తును 1) గతములో మన కొరకు ప్రాణము పెట్టిన మంచి కాపరిగా యోహాను 10:11వ. వచనములోను, ప్రస్తుతము మనలను భద్రపరచు గొప్ప కాపరిగా హెబ్రీ. 13:20వ.లోను, 3) మన కొరకు మరల ప్రత్యక్షమగు ప్రధాన కాపరిగా, 1 పేతురు 5:4వ.లోను చూతము. హెబ్రీయులు ప్రతి మంచి విషయములో దేవుని చిత్త ప్రకారము చేయుటకు దేవుడు వారిని సిద్ధపరచవలెనని ఆశించుచున్నాడు.

మన సహోదరుడైన తిమోతి అని సంబోధించినందున గ్రంథకర్త తిమోతికి సన్నిహితుడైన పౌలేనని తలంచగలము. తిమోతికి విడుదల కలిగినదన్నందున గ్రంథకర్త చెరలోనున్నాడని తలంచగలము. ఇటలీలోని సహోదరులు వందనములు చెప్పుచున్నారు అని అన్నందున ఇటలీ నుండి పౌలు తాను విడుదల పొందని రోములోని రెండవ చెర నుండి క్రీ.శ. 66లో ఈ పత్రిక వ్రాసెనని తలంచగలము.

# పాపము - పరిహారము

పాపము అను పదము ఆదికాండము 4:7వ. నుండి ప్రకటన 18:5వ. వరకు ఏడు వందలకంటే ఎక్కువ పర్యాయములు బైబిలునందు కలదు. దానికి సంబంధించిన అతిక్రమము అను పదము 100కంటే ఎక్కువ పర్యాయములు దోషము అనుపదమును వందకంటే ఎక్కువ పర్యాయములు కనిపించును.

**I. పాపము అను అర్థమిచ్చు గ్రీకు భాషా పదములు** : పాపము అను పదమునకు గ్రీకులో "హెమార్టైమా" అని "పారాబేసిస్" అను రెండు పదములు వాడబడినవి. హెమార్టైమా: ఈ పదము యొక్క అర్థము గురితప్పుట. రోమా 2:23వ. ప్రకారము దేవుడు మానవునికి తన మహిమనిచ్చాడు. కాని మానవుడు ఆ మహిమను పొందు భాగ్యమును పోగొట్టు కొన్నాడు. మహిమను పొందలేకపోవుట దేవుడు పెట్టిన గురిని తప్పుటయే. మహిమను పొందలేకపోయినందుకు కారణమైన స్వభావ సామర్థ్య హీనతయే పాపము. పాపము శరీర బలహీనత కాదు అను గమనించాలి.

**రెండవ పదము పారాబేసిస్** : దీని భావము దాటకూడని గీతను దాటుట. పరుగు పందెములో కుడి ఎడమ ప్రక్కలలో గీతలుండును. పొరపాటున కాని, తెలిసి కాని ఆ గీతలను దాటుట తప్పు. అలాగే మానవ జీవిత పరుగులో దేవుడిచ్చిన ఆజ్ఞలు దాటకూడని గీతలుగా కలవు. ఆ ఆజ్ఞలను అతిక్రమించుట పాపము. 1 యోహాను 3:4వ ప్రకారము ఆజ్ఞ అతిక్రమమే పాపము. పాపము క్రియా పూర్వకముగానైనను, తలంపులతోనైనను చేయగలము. "వ్యభిచరింపవద్దు" (ద్వితీ. 5:18వ) అను ఆజ్ఞ దేవుడిచ్చాడు. శరీరముతో వ్యభిచరించుట పాపము. అంతేకాక ఒక స్త్రీని మోహపు చూపుతో చూచు ప్రతి వాడు అప్పుడే తన హృదయమందు పాపము చేసిన వాడగును" మత్తయి 5:28. ఇది తలంపుల లోని పాపము. పాపము శరీరములోని ఏ అవయవము ద్వారానైనను క్రియా పూర్వకముగా చేయగలము. తలంపులతోనైనను చేయగలము. కనుక పరిశుద్ధుడైన దేవునికి వ్యతిరేకమైన ఏ తలంపైనను, చర్యయైనను పాపమే.

**II. పాపపు ఉనికి - ప్రారంభము** : దేవుడు మానవుని సృజించక మునుపు దేవదూతలను సృజించెను లేదా చేసెను. దూతలలో ముగ్గురు ప్రధాన దూతలు 1) అపవాది - దేవుని స్తుతించు పని కలవాడు. యెహె. 28:13వ, 2) మిఖాయేలు

యుద్ధములు చేయువాడు ప్రకటన 12:7వ, 3) గబ్రియేలు - వర్తమాన దూత. లూకా 1:19వ. యెహె. 28:11-15వ. దేవునిచే సృజించబడిన అపవాదిని దేవుడు ఏదెను తోటలోనుంచాడు. పిల్లన గ్రోవులు వాయించువారు సిద్ధమైయుండగా అపవాదిని దేవుడు నియమించాడు. దీనిని బట్టి దేవుని కీర్తించి స్తుతించుపని అప్పగించబడినది అని తలంచగలము. 15వ. నీవు నియ మించబడిన దినము మొదలు పాపము నీలో కనబడు వరకు నీవు యధార్థవంతుడవు అని ఉన్నది. అపవాది నియమించబడినపుడు పాపము కనబడలేదు. అనేక దినముల తరువాత పాపము కనిపించినది. యెషయా 14:12-15వ.లో దేవునికంటె తక్కువ స్థాన మందుండు అపవాది ఆకాశమునకు, దేవుడు నివసించు మేఘ మండలము (మన మేఘ మండలము కాదు. కీర్తన. 97:1వలో ఆయన చుట్టునున్న మేఘ అంధకార మండము) మీదికెక్కుదును. తన సింహాసనమును దేవుని సింహాసనము పైగా హెచ్చించాలని. మహోన్నతునిలో తనను సమానునిగా చేసుకొనవలెనని తలంచాడు. ఇది తలంపులలోని పాపము. ఈ పాపమును బట్టి అక్కడ నుండి త్రోసివేయబడ్డాడు. ప్రకటన 12:3-4వ. ప్రకారము తనతో పాటు తనతో ఏకీభవించిన దూతలలోని మూడవ భాగము కూడా భూమి పైకి నెట్టి వేయుబడిరి. చాలాకాలమైన తరువాత దేవుడు నరుని అనగా ఆదామును హవ్వను తన స్వరూపమందు, తన పోలిక చొప్పున చేశాడు. (ఆది. 1:27వ.) అపవాది హవ్వతో నోటి మాటల ద్వారా ఆది 3:4-5వ ఆ పండు తినిన యెడల మీరు చావనే చావరు అని ఒక అబద్ధము, దేవతల వలె నుందురని రెండవ అబద్ధము పలిగెను. అందుకే సాతాను అబద్ధములకు జనకుడని యోహాను 8:44వ.లో ఉన్నది. హవ్వయు దేవుడు దానిని ముట్టకూడదని ఆజ్ఞాపించెనని అబద్ధము చెప్పెను. ఇదినోటి మాటల ద్వారా చేయు పాపము. తదుపరి హవ్వ ఆదాములు ఆ పండు తినుట ద్వారా క్రియా పూర్వకముగా పాపులైరి. కనుక ఆదాము, హవ్వలు సృజించబడినపుడు పవిత్రులే. కొంతకాలము తరువాత అపవాది పాపమును వారి ముందుంచగా వారు పాపమును వారి 1) తలంపులు. 2) వారి నోటి మాటలులోనికి, 3) వారి క్రియలలోనికి ఆహ్వానించి పాపులైరి.

**III. వివిధ పాపములు** : దేవుని వాక్యమందు వ్రాయబడిన పాపములు. కీర్త. 90:8వ ప్రకారము రహస్య పాపములు అనగా మానవ కన్నులను కనిపించని రహస్య పాపములు కలవు అని గుర్తించాలి.

1) అజ్ఞ అతిక్రమమే పాపము. 1 యోహాను 3:4వ.

2) సకల దుర్నీతి పాపము. 1 యెహాను 5:17వ.

3) బలహీనులైన వారి మనస్సు నొప్పించుట క్రీస్తుకు విరోధమైన పాపము. 1 కొరింథీ. 8:12వ.

4) విశ్వాస మూలము కానిది పాపము - రోమా 14:23వ.

5) మేలైనది చేయనెరిగి అలాగు చేయకపోవుట పాపము - యాకోబు 4:17వ.

6) జారత్వము పాపము. 1 కొరి. 6:18వ.

7) అహంకార దృష్టి, గర్వ హృదయము పాపయుక్తములు. సామె. 21:4వ.

8) నరుల చెడుతనము పాపము. ఆది. 6:5వ.

9) పొరుగువారిని తిరస్కరించుట పాపము - సామె. 14:21వ.

10) అబద్ధ ప్రమాణము చేయుట పాపము - లేవీ. 6:3వ.

11) దేవుని అజ్ఞ విషయము చేయరాని కార్యము చేయుట పాపము. లేవీ. 4:2.

12) సోదె చెప్పుట పాపము - 1 సమూ. 15:23వ.

13) తిరుగుబాటు చేయుట పాపము - 1 సమూ. 15:23వ.

14) ప్రార్థన చేయుట మానుట పాపము - 1 సమూ. 12:23వ.

15) ఆత్మ విషయమైన దూషణ క్షమాపణ లేని పాపము - మత్తయి 12:31వ.

16) భక్తిహీనుని వచ్చుబడి పాపము - సామె. 10:16వ.

17) అయోగ్యముగా ప్రభువు యొక్క శరీరమైన రొట్టె రసమును పుచ్చుకొనుట పాపము - 1 కొరింథీ. 11:27వ.

18) సత్క్రియ చేయకపోవుట పాపము - ఆది 4:7వ.

19) దేవునికి విరోధమైనది పాపము - ఆది. 39:9వ.

20) మూర్ఖుని యోచన పాపము - సామెతలు 24:9వ.

21) మోహపు చూపుతో చూచుట హృదయములో పాపము - మత్తయి 5:28వ.

22) హృదయ చెడుతనము పాపము - మార్కు 7:21.

23) కూలివానికి ఏనాటి కూలి ఆనాడు ఇవ్వకపోవుట పాపము - ద్వితీ. 24:14వ.

24) శపితమైనది తీసుకొనుట పాపము - యెహోషువ 7:11వ.

25) యెహోవాను విసర్జించుట పాపము - 1 సమూ. 12:10వ.

26) దురభిమానమైన పాపము - కీర్తనలు 19:13వ.

ఇవి కొన్నియే. ఇవికొన్నియే. వీటికి అనుబంధమైన అనేకములు కలవు.

**IV. పాపము భద్రపరచబడిన విధము :**

1) పాపము ఎల్లప్పుడు మన ఎదుటనున్నది. కీర్త. 51:3వ.

2) పాపము మిమ్మును పట్టుకొనును - సంఖ్యా. 32:23.

3) పాపము ఇనుపగంటముతో వ్రాయబడినది - యిర్మీయా 17:2వ.

4) నా అతిక్రమము సంచిలో ముద్రింపబడినది - యోబు 14:17వ.

5) క్రియలు గ్రంథములో వ్రాయబడినవి. ఆ గ్రంథములు విప్పబడును - ప్రకటన 20:14వ.

**V. a) పాపపు పోలికలు :**

1) పాపము రక్తము వంటిది, కెంపువంటిది - యెషయా 1:18వ.

2) పాపము మరకవంటిది. యిర్మీయా 2:22వ.

3) పాపము బురదవంటిది. 2 పేతురు 2:22వ.

4) పాపము వాంతికి వంటిది. 2 పేతురు 2:22వ.

**b) పాపము చేయువారి పోలికలు :**

1) కుక్క (2 పేతురు 2:22వ).

2) పంది (2 పేతురు 2:22వ.)

3) సింహములు (కీర్తనలు 22:16వ, 22:11-21వ.)

4) గురుపోతులు (కీర్తనలు 22:11-21వ.)

5) వృషభములు (కీర్తనలు 22:11-21వ.)

**VI. పాపమునకు కారణము :** యాకోబు 1:15వ. వలన "దురాశ గర్భము ధరించి పాపమును కనును" అని నేర్చుకొనుచున్నాము. అవ్వ ఆదాముల అవివేక దురాశయే వారిని పాపమునకు నడిపించినది.

**VII. పాపపు ఫలితము :** ఆదాము అను ఒక మనుష్యుని ద్వారా పాపమును పాపము ద్వారా మరణమును లోకములో ప్రవేశించినవి (రోమా 5:12వ.) మనుష్యులందరు పాపులైరి. రోమా 3:9వ. 3:23వ. 1 యోహాను 1:8వ. 1 రాజులు 8:46వ. ప్రసంగి 7:20వ. పాపమును బట్టి రెండు మరణములకు పాత్రులైరి.

**1) ఆత్మీయ మరణము :** వెంటనే కలిగినది ప్రకటన 21:8వ. ప్రకారము ఆత్మ శరీరమును విడిచిన పిదప అగ్ని గంధకములతో మండు గుండములో నిత్యము కాలుట అని గమనించగలము.

**2) శరీర మరణము :** ఆదాము అవ్వలు సృజించబడినపుడు వారికి మరణము లేదు. పాపమును బట్టి మరణము కలిగినది. పాపమునకు దాసులయ్యారు. రోమా 6:17వ. రోమా 7:19,21,24వ.

1) పాపము వలన వచ్చు జీతము మరణము రోమా 3:23వ.

2) మరణము అదరికి సంప్రాప్తమాయెను రోమా 5:12వ. పాపము తీసివేయబడుట.

ఈ పాపమును తీసివేయుటకు క్రీస్తు ప్రత్యక్షమాయెను అని 1 యోహాను 3:5వ. చెప్పుచున్నది. మొదటి రాకడలో మానవులు చేసిన పాపమునకు ప్రాయశ్చిత్తముగా అనగా కప్పివేయుటకు (హెబ్రీలో ప్రాయశ్చిత్తము అను పదము KAPPORETHఅని ఉన్నది) రక్త మాంసములు గల దేహముతో ఈ లోకములో క్రీస్తు ప్రత్యక్షమయ్యాడు. పాప క్షమాపణకు అవసరమైన తన రక్తమును చిందించాడు. ఇది మానవులు గత కాలములో చేసిన పాపములకు తరువాత కాలములో అనగా రక్షించబడిన తరువాత మరణము వరకు చేయు పాపములను కూడా కప్పుటకు ఈ రక్తము సరిపోవునది. ఆలాగు పాపమును పరిహరించి చనిపోయిన మానవులను బ్రతికించును. పాపమునకు జీతమైన ఆత్మ మరణము నుండి ఎఫెసీ. 2:1-6. ప్రకారము రక్షించబడినపుడే బ్రతికించును. శరీర మరణము నుండి క్రీస్తు ఆకాశమండలమునకు వచ్చినప్పుడు బ్రతికించును. తదుపరి 1 కొరింథీ 15:26వ. వచన ప్రకారము మరణమును నశింపచేయును. ఆ రీతిగా పాపము కాని, పాపపు జీతమైనను మరణము కాని లేకుండ పూర్తిగా తీసివేయును.

**పాపము ద్వారా కలుగు శరీర, మానసిక సామాజిక ఫలితములు :** 1) పాపము మనసునకు గ్రుడ్డితనము కలుగచేయును (1 యోహాను 2:11వ.) 2) సంతోషము - ఆనందమును కోల్పోవుట (కీర్తనలు 51:12వ.) 3) ప్రేమను కోల్పోవుట 1 యోహాను 2:5వ.), 4) సహవాసమును కోల్పోవుట (ఆది. 3:10,23వ.) 5) శరీర బలహీనత రోగము మరణము (1 కొరి. 11:30వ.) 6) వర్షము కురియకపోవుట 2 దిన. 6:26వ. 7) పాపమునకు శిక్షగా కరువు, శత్రువు తరుముట, తెగులు 1 దిన. 21:8-12వ.

**VIII. క్షమాపణ అని పాపము :** మత్తయి 12:31వ. పరిశుద్ధాత్మకు విరోధముగా చేయు పాపమునకు క్షమాపణ లేదు అని ఉన్నది. పరిశుద్ధాత్మ లోకమును పాపమును గూర్చి, నీతిని గూర్చి, తీర్పును గూర్చి ఒప్పుకొన చేయును. పరిశుద్ధాత్మకు విరోధముగా అనగా పరిశుద్ధాత్మ దేవుడు ఒప్పించు విషయములను అంగీకరించకపోవుట అని అర్థము. పరిశుద్ధాత్మ పాపమును గూర్చి, నీతిమంతులుగా తీర్చబడు విధమును గూర్చి ఒప్పుకొన చేయుచుండగా ఒప్పుకొనని వాడు క్షమాపణ పొందలేదు.

**IX. పాపము చేయకుండుట కవసరమైన జాగ్రత్తలు :** పాపము చేయకుండ దేవుని వాక్యము కాపాడును.

1) పాపము చేయకుండునట్లు హృదయములో వాక్యము ఉంచుకొనుట. కీర్తనలు 119:11వ.

2) వాక్యమైన సత్యమందు (పాపము లేకుండ) వారిని ప్రతిష్ఠ చేయుము. యోహాను 17:17వ.

3) లేఖనములు తప్పులను దిద్దును, నీతియందు శిక్ష చేయును. 2 తిమోతి 3:16వ. పాపము చేయువాడు వాక్యమునకు దూరమగునని గుర్తించగలము.

**X. మరణకరమైన పాపము :** 1 యోహాను 5:16 వచనములో మరణకరమైన పాపము కలదు అని ఉన్నది. రక్షణ శాశ్వతమైనందున ఈ మరణము శరీర మరణమే 1 కొరింథీ. 11:30లో అయోగ్యముగా....... రోగులు, బలహీనులునైయున్నారు. నిద్రించు చున్నారనియున్నది. కనుక మరణము శరీర సంబంధమైనదేనని నేర్చుకొనుచున్నాము అపొస్తలుల కార్యములు 5:1-12వ. అననీయ సప్పీరాల మరణము. హెబ్రీ. 6:4610వ. 10:26-30వ. వివరణను గమనించగలరు. 1 కొరింథీ 5:5లో యేసు దినమందాత్మ

రక్షించబడి, శరీరము నశించునట్లు అని ఉన్నది. 1 కొరింథీ. 3ం15లో పని కాలిపోవును. తన మట్టుకు తాము రక్షించబడును అనని ఉన్నది. రక్షన శాశ్వతము శరీర మరణము కలుగవచ్చును. 1) మోషేకు శరీర మరణము కలిగెను. ద్వితీ. 32:48-52వ. 2) ఉజ్జియా 2 సమూ. 6:1-7వ.

**XI. పాపమునకు పరిహారము** : పాప పరిహారమును గూర్చి పాత నిబంధనలో వ్రాయబడినవి గమనించుదము. సామె. 28:13వ.లో అతిక్రమములు దాచిపెట్టువాడు వర్థిల్లడు. దాని ఒప్పుకొని విడిచి పెట్టువాడు కనికరము పొందును. కీర్తనలు 32:5వ దోషమును కప్పుకొనక దేవుని యెదుట ఒప్పుకొనాలి. దేవుడు కృప చూపుచూ దోషమును పాపమును పరిహరించును. 1) పాపము పరిహరించబడుటకు బలి అర్పించవలెనని నిర్గమ 29:36వ. వచనములో ఉన్నది. 2) బలి పశువు రక్తము బలిపీఠము కొమ్ములకు పూయబడాలి. (లేవి 4:25, 34వ) 3) బలి అర్పించబడు జంతువు నిర్దోషమైనదై ఉండాలి. (లేవీ. 4:3) 4) యాజకుడు ప్రాయశ్చిత్తము చేయుట ద్వారా క్షమాపణ కలుగును. ధర్మ శాస్త్రము రాబోవుచున్న మేలుల ఛాయయని, బలుల పండుగల నిజ స్వరూపము క్రీస్తు అని హెబ్రీ 10:1వ.లోను, కొలస్సయి 2:16-17వ.లోను ఉన్నది కనుక క్రొత్త నిబంధనలో, హెబ్రీ. 10:4వ. గొర్రెల యొక్కయు మేకల యొక్కయు రక్తము పాపమును తీసివేయుట అసాధ్యమని ఉన్నది.

నిజ స్వరూపమైన క్రీస్తు ఈ లోకములో ప్రత్యక్షమై (1 తిమోతి 3:15), మానవ పాపములను తన మీద మోసికొన్నాడు. (యోహాను 1:29వ.) పరిశుద్ధుడు మన కొరకు పాపముగా చేయబడెను. (2 కొరింథీ. 5:21వ.) దేవుడు తన స్వంత కుమారుని పాప శరీరాకారముతో పంపి ఆయన శరీరమందు మన పాపమునకు శిక్ష విధించెను. (రోమా 8:4వ) మనమింకను పాపులమైయుండగా క్రీస్తు మనకొరకు చనిపోయెను. (రోమా 5:8వ) నిర్దోషియగు క్రీస్తు, యాజకుడైన క్రీస్తు, బలియై తనరక్తమును బలిపీఠమైన సిలువ యందు కార్చాడు. ఆయన రక్తము ప్రతి పాపము నుండి పవిత్రులనగా చేయును. (1 యోహాను 1:7వ) కాబట్టి ఆయన రక్తము ద్వారా నీతిమంతులముగా తీర్చబడితిమి (రోమా 5:9వ.) నిశ్చయముగా ఆయన ద్వారా ఉగ్రతయైన నరకశిక్ష నుండి రక్షింప బడుదుము. (రోమా 5:9వ.) పాప పరిహారములో గతములో చేసిన పాపమునకు క్షమాపణ మాత్రమే కాక, నీతిమంతులముగా తీర్చబడుదుము. లోకములోనున్న న్యాయాధిపతులు

చేసిన కొన్ని తప్పులను క్షమించగలరు కాని నీతిమంతులని తీర్పు తీర్చలేరు. అనేక Judgement Copyలలో నేరస్తులను 1) నేరస్తులుగా ఋజువుపరచి, 2) నేరస్తులని ప్రకటించి, 3) శిక్ష నుండి కొన్ని పర్యాయములు మినహాయించుట జరుగును. నేరస్తుడని స్పష్టముగా ప్రకటింతురు. కాని 1 కొరింథీ. 6:11వ. ప్రకారము క్రీస్తు మన పాపములను క్షమించి నీతిమంతులుగా తీర్చుచున్నాడు. ఇది మానవులు చేయలేనిది. దేవుడే చేయునది. ఇదియే పాప పరిహారము.

**XII. పాపము చేసితిమని పలికినవారు :**

**ఎ) యథార్థముగా దేవుని ఎదుట ఒప్పుకొననివారు :**

| | | |
|---|---|---|
| 1) ఫరో | - | నిర్గమ. 9:27, 10:16వ. |
| 2) బిలాము | - | సంఖ్యా. 22:34వ. |
| 3) ఆకాను | - | యెహోషువ. 7:20వ. |
| 4) సౌలు | - | 1 సమూయేలు 26:21వ. |
| 5) ఇస్కరియోతు యూదా, | - | మత్తయి 27:4వ. |

**బి) యథార్థముగా దేవునితో ఒప్పుకొనినవారు :**

| | | |
|---|---|---|
| 1) దావీదు | - | 2 సమూయేలు 12:13, 24:10వ. |
| 2) యోబు | - | యోబు 7:20, 40:3,4వ. 42:6వ. |
| 3) త్రప్పిపోయినకుమారుడు | - | లూకా 15:21వ. |

రోమా 10:9వ ప్రకారము 1) యేసు ప్రభువని నోటితో ఒప్పుకొనాలి, 2) దేవుడాయనను మృతులలో నుండి లేపెనని హృదయమందు విశ్వసించాలి. దీని భావము యేసు మన పాపముల కొరకై మృతిపొంది తిరిగి లేచాడు. అనగా పాప క్షమాపణ జరిగినది. హృదయమందు నమ్మాలి. ఆ యేసును నీ జీవితమునకు ప్రభువుగా, యజమానిగా నోటితో ఒప్పుకొనాలి.

హృదయములో నమ్ముట - నోటితో ఒప్పుకొనుట రోమా 10:10వ. ప్రకారము 1) హృదయములో నమ్ముట ద్వారా నీతి కలుగును, 2) నోటితో ఒప్పుకొనుట ద్వారా రక్షణ కలుగును. విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షణ (ఎఫెసీ 2:8వ.) ఈ అనుభవము మీకున్నదా?

# కొన్ని ముఖ్య అంశముల వివరణ

| అంశము | | వివరించబడిన గ్రంథము, అధ్యాయము |
|---|---|---|
| 1. పరిశుద్ధాత్మ రాక కొరకు కనిపెట్టుట | - | అ.కా. 2 అధ్యా. చివర. |
| 2. అ.కా. భాషలు మాటలాడిన వారి వివరములు | - | అ.కా. 2:1-13వ, 19:1-20వ. |
| 3. బైబిలు గ్రంథములో చనిపోయి బ్రతికింపబడినవారు | - | అ.కా. 9వ అధ్యా. చివర. |
| 4. అ.కా. కార్యము నందలి మూడు ముఖ్య ఆజ్ఞలు | - | అ.కా. 10వ అధ్యా. చివర. |
| 5. ప్రభువు పిలుపు | - | అ.కా. 12వ అధ్యా. చివర. |
| 6) అరేయొపగు సభ | - | పౌలు చరిత్ర చివర. |
| 7) సన్హెడ్రిన్ మహాసభ | - | పౌలు చరిత్ర చివర. |
| 8) సువార్త ప్రకటింపబడిన విధము | - | అ.కా. 20వ. అధ్యా. చివర |
| 9) సున్నతిని గూర్చిన వివరణ | - | అ.కా. 15వ అధ్యా.<br>రోమా 2 అధ్యా. చివర. |
| 10) కిరీటములు | - | 1 కొరింథీ. 9 అధ్యాయము చివర. |
| 11) సువార్త ప్రకటించువారి జీవన విధానము | - | 1 కొరింథీ. 9వ అధ్యా. చివర. |
| 12) ప్రేమను గూర్చిన వివరణ | - | 1 కొరింథీ. 13వ అధ్యా. ప్రారంభము |
| 13) పరిశుద్ధాత్మ అనుగ్రహించు వరములు | - | 1 కొరిం. 12-14 అధ్యా. |
| 14) ప్రభువుకు ఇచ్చు విధము | - | 2 కొరింథీ. 9వ అధ్యా. చివర. |
| 15) వివిధ ఆకాశములను గూర్చిన వివరము | - | 2 కొరిం. 14:34-38వ. |
| 16) పరిచర్యలో స్త్రీల స్థానము | - | (1 కొరింథీ. 14:24-38వ,<br>అ.కా. 21:1-16వ.) |
| 17) క్రీస్తు తగ్గించుకొనుట - హెచ్చింపబడుట | - | ఫిలిప్పీ 2:5-11వ. |
| 18) తప్పిదములో చిక్కుకొనిన సహోదరుని దారిని తెచ్చుట | - | గలతీ 6:1-5వ, 2 కొరి. 2:6-11వ. |
| 19) ప్రభువు రెండవ రాకడ | - | 1 థెస్స. 4:13-5:1-11వ. |
| 20) ప్రభువు దినమును గూర్చిన వివరణ | - | 2 థెస్స. 2:1-3వ. |
| 21) మర్మముల వివరములు | - | కొలొస్స 1 అధ్యా. చివర |

22) బాప్తిస్మము యొక్క వివరములు - కొలొస్స. 4వ అధ్యా. చివర

23) రక్షణ శాశ్వము అను వివరణ - 1) హెబ్రీ 6వ అధ్యా. ప్రారంభము, 2) హెబ్రీ. 10:19-39వ, 3) 1 కొరింథీ. 3:10-15వ, 4) పాపము - పరిహారములోని..

24) FEAR NOTలు క్రొత్త నిబంధనలో ఇంగ్లీషులో 31 పర్యాయములు కలవు. జాగ్రత్త అను పదములు క్రొత్త నిబంధనలో తెలుగులో 52 పర్యాయములు కలవు. నెలలోని 31 రోజులకు దేవుడు అభయమిచ్చుచున్నాడు. 52 జాగ్రత్తలు అనగా సంవత్సరములోని 52 వారములలో ప్రతి వారములోను జాగ్రత్త అనగా కలిగి యుండాలి అని అర్థము.

**25) 52 జాగ్రత్తలు** : (1-7) మత్తయి 2:8, 6:1, 7:15, 10:7, 16:6, 16:11, 16:12. (14-18) లూకా 12:1, 15:8, 17:3, 20:45, 21:34, (19-21) అ.కా. 5:35, 15:29, 20:28, 22) రోమా 12:8, (23-30) 1 కొరి. 3:11, 10:12, 7:11, 8:7, 8:8, 8:20, 10:9, 10:9. (31) ఎఫెసీ. 5:15, (32-34) ఫిలిప్పీ. 3:2, 3:2, 3:2, (35-36) కొలొస్స. 2:8, 4:17, (37-38) 1 తిమోతి 4:13, 4:16, (39) 2 తిమోతి 4:15, (40-44) హెబ్రి. 2:1, 3:12, 4:11, 8:5, 12:16, 12:44, 12:48, (45-49) 2 పేతురు 1:5, 1:10, 1:5, 3:11, 3:140, (50) 1 యోహాను 5:21. (51) 2 యోహాను 1:8, (52) ప్రకటన 27.


26) ఆరాధన - ప్రభురాత్రి భోజనము యొక్క వివరము - అ.కా. 21:9, 1 కొరింథీ. 11:26-34.


27) కాపరియైన క్రీస్తును గూర్చిన వివరము - హెబ్రీ. 13:20,21.


28) విశ్వాసము వలన దొరికిన పది ఫలములు - రోమా 5:1-11.

29) ఆత్మానుసారులు - శరీరానుసారులు - రోమా 8:1-17.

30) సేవ కొరకు ప్రత్యేకించబడిన సేవకులకు ఈవులు ఇవ్వవలసిన విధము - 2 కొరింథీ. 9:11-15, 1 తిమోతి 5:17-20.


ఇటలీ
రోము
త్రిసత్రములు
అప్పియా సంతపేట
పొతియొలి
స్పెయిన్
సిసిలి
సురకూసై
మెలితే
మాసిదోనియ
ఫిలిప్పీ
త్రోయ
చిన్న ఆసియా
నికొపొలి
అకయ
కొరింథు
ఎఫెసు
కొలొస్సయి
మిలేతు
క్నీదు
మూర
రోదు
క్రేతు
సల్మోనే
లసయ
కౌద
మంచిరేవులు
గలతీయ
అంతియొకయ
కుప్ర
సీదోను
తూరు
కైసరయ
యెరూషలేము
నల్ల సముద్రము
మధ్యధరా సముద్రము
లిబియ
ఉ
పౌలు రోమా ప్రయాణము క్రీ.శ. 60
పౌలు రోమా రెండు చెరల మధ్య సంచరించిన ప్రదేశములు క్రీ.శ. 63-64 ?


పౌలు పత్రికలను వ్రాసిన ప్రదేశములను చూపు పటము
ఇటలీ
హెబ్రీయులకు క్రీ.శ. 66 ?
రోము
ఎఫెసీయులకు క్రీ.శ. 61
కొలొస్సయులకు క్రీ.శ. 61
ఫిలేమోనుకు క్రీ.శ. 61
ఫిలిప్పీయులకు క్రీ.శ. 62
II తిమోతికి క్రీ.శ. 66
మాసిదోనియ
II కొరింథీయులకు క్రీ.శ. 57
I తిమోతికి క్రీ.శ. 63
ఫిలిప్పీ
థెస్సలొనీకయ
నల్ల సముద్రము
గలతీయ
చిన్న ఆసియా
తీతు పత్రిక క్రీ.శ. 64
నికొపొలి
అకయ
గలతీయులకు క్రీ.శ. 49 ?
కొరింథీయులకు క్రీ.శ. 56
ఎఫెసు
కొలొస్సయి
అంతియొకయ
I థెస్సలొనీకయులకు క్రీ.శ. 52
II థెస్సలొనీకయులకు క్రీ.శ. 53
రోమా పత్రిక క్రీ.శ. 57
కొరింథు
సిసిలీ
రేగియ
సురకూసై
మెలితే
క్నీదు
మూర
రొదు
క్రేతు
ఫేనికు
సల్మోనే
లుసయ
కౌద
కుప్ర
సీదోను
తూరు
కైసరయ
మధ్యధరా సముద్రము
యెరూషలేము
లిబియ


మాసిదోనియ
త్రేసు
ఫిలిప్పీ
నెయపొలి
థెస్సలొనీక
బెరయ
సమొత్రాకే
బితూనియ
గలతీయ
కప్పదొకియ
త్రోయ
అస్సు
ఫ్రుగియ
ఆసియా
అకయ
(గ్రీసు)
మితులేనే
కీయొసు
ఎఫెసీ
మిలేతు
సమొసు
కొరింథు
కెంక్రేయ
ఏథెన్సు
అంతియొకయ
లుస్త్ర
దెర్బె
కిలికియ
తార్సు
అంతియొకయ
సెలూకయ
పెర్గే
అత్తాలియ
పంఫూలియ
పతర
కోసు
రొదు
సిరియ
సలమీ
కుప్ర
పాఫు
క్రేతు
ఉ
మధ్యధరా సముద్రము
తూరు
తొలెమాయి
కైసరయ
యెరూషలేము
పౌలు మొదటి సేవా యాత్ర క్రీ.శ. 46-49
పౌలు రెండవ సేవా యాత్ర క్రీ.శ. 50-53
పౌలు మూడవ సేవా యాత్ర క్రీ.శ. 54-57